

# దేశం కోసం రైతు
# రైతు కోసం ఎవరు ?



వడ్డే శోభనాద్రీశ్వర రావు

# దేశం కోసం రైతు

## రైతు కోసం ఎవరు ?



వడ్డే శోభనాద్రీశ్వర రావు

# *Desam Kosam Rytu*
# *Rytu Kosam Evaru?*



©
*Writer:*
**Vadde Sobhanadreeswara Rao,** B.Sc., B.E.
*Former Member of Parliament*
*Former Minister for Agriculture A.P.*

*First Edition:* June, 2012

*Price:* Rs.200/-

*For Copies:*
**V.V.A. Prasad**
2-48, Sivalayam Street,
VUYYURU - 521 165
Krishna Dist., A.P.

*Printed at:*
**Kala Jyothi Process Pvt. Ltd.**
1-1-60/5, R.T.C. 'X' Road,
Musheerabad, Hyderabad - 500 020.
Phone: 040-27645536

నీతీ, నిజాయితీ, నిబద్ధతతో కూడిన ప్రజాసేవ చేయుటకు

వ్యవసాయ రంగంపైన సమగ్ర అధ్యయనం చేయడానికి

స్ఫూర్తిని ప్రసాదించిన భారత రైతాంగ ముద్దుబిడ్డలు

ఆచార్య ఎన్.జి. రంగా మరియు చౌధురి చరణ్‌సింగ్ గార్లకు

# అంకితం

# వ్యక్తిగత వివరాలు

| | | |
|---|---|---|
| పుట్టిన తేది | : | ది. 21.10.1943 |
| జన్మస్థలం | : | ఉయ్యూరు గ్రామం, కృష్ణాజిల్లా |
| తల్లిదండ్రులు | : | అన్నపూర్ణమ్మ, అంకయ్య |
| వివాహం | : | 17.5.1963 |
| భార్య | : | బసవరాజ్యం |
| పిల్లలు | : | వెంకటలక్ష్మీ అన్నపూర్ణ, వెంకట అంకినీడు ప్రసాద్ |
| విద్యార్హతలు | : | బి.ఎస్‌సి, బి.ఇ. (మెకానికల్) |
| రాజకీయ ప్రవేశం | : | 1967 సంగలో స్వతంత్ర పార్టీలో చేరిక |
| అభిమాన నాయకులు | : | ఆచార్య ఎన్.జి. రంగా, చౌధురీ చరణ్ సింగ్, ఎన్.టి. రామారావు |
| నిర్వహించిన పదవులు | : | 1978-83 శాసనసభ సభ్యులు, ఉయ్యూరు<br>1984-89 పార్లమెంట్ సభ్యులు, విజయవాడ<br>1989-91 1. భాను ప్రతాప్‌సింగ్-వ్యవసాయ విధానాలు-కార్యక్రమాల ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు<br>2. శరద్‌జోషి అధ్యక్షతన వ్యవసాయ స్థాయిసంఘం సభ్యులు<br>1991-96 పార్లమెంట్ సభ్యులు, విజయవాడ<br>1997-99 న్యూ ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ, ప్రత్యేక ప్రతినిధి<br>1999 శాసనసభ సభ్యులు, మైలవరం<br>1999-2004 వ్యవసాయశాఖా మంత్రి<br>2005 క్రియాశీలక రాజకీయాల నుండి స్వచ్ఛంద విరమణ |
| పర్యటించిన దేశాలు | : | అమెరికా, ఇండోనేషియా, సింగపూర్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, జపాన్, కొరియా, చైనా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ |
| గ్రంథాలు | : | 1. ఆంధ్రరైతు ఆవేదన<br>2. ప్రజల ఎదురు తెన్నులు - పాలకుల తీరుతెన్నులు<br>3. రైతువాణి<br>4. కిసాన్ స్వరాజ్య యాత్ర ఎందుకు<br>5. దేశం కోసం రైతు - రైతు కోసం ఎవరు? |
| చేపట్టిన కార్యక్రమాలు | : | 1) సంప్రదాయ వ్యవసాయ విధానాల అమలు, 2) భూసార పెంపుదల, 3) ఉత్పత్తి ఖర్చు తగ్గించి నిఖరాదాయ పెంపుదలకు కృషి, 4) ఉత్పత్తుల నాణ్యత పెంచి అంతర్జాతీయ పోటీకి రైతాంగాన్ని సిద్ధం చేయడం, 5) సమర్ధ సాగునీటి యాజమాన్యం, 6) డెయిరీ, పౌల్ట్రీ, ఆక్వారంగ అభివృద్ధి, 7) బడుగు, బలహీన వర్గాల ప్రగతికి కృషి, 8) గ్రామీణాభి వృద్ధి, 9) పుట్టి పెరిగిన ప్రాంతములో సామాజిక-ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చేయూత. |

# సంవేదన

**దే**శానికి ఆహార భద్రత కల్పించడానికై తన కుటుంబాన్ని కష్టపెడుతూ, తాను నష్టపోతూ ఆరుగాలం శ్రమించే రైతును పట్టించుకుంటున్నదెవరు? ఈ వ్యాస సంకలనం సంధిస్తున్న ప్రశ్న ఇది.

నేను విద్యార్థిగా ఉన్నప్పుడే నాకు ఎదురైన ప్రశ్న ఇది **దేశం కోసం రైతు - రైతు కోసం ఎవరు?** ఈ ప్రశ్నకు సామాధానంగానే నేటివరకు నా జీవితాన్ని నేను మలచుకున్నాను. ఇలా మలచుకున్న వేలాది మందిలో అగ్రగణ్యులు ఎన్.జి. రంగా, చౌధురి చరణ్‌సింగ్‌లు. అందుకే వారికి ఈ గ్రంధాన్ని అంకితం చేశాను.

ఆచార్య రంగా ప్రేరణతో స్వతంత్ర పార్టీ ద్వారా నా రాజకీయ జీవితాన్ని ప్రారంభించాను. తరువాత చౌధురి చరణ్ సింగ్ రచనలు మహాత్మాగాంధి చూపిన బాట - వ్యవసాయం గ్రామీణ చిన్నపరిశ్రమల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వటం ద్వారానే ప్రపంచంలో రెండవ అత్యధిక జనభా కలిగిన భారతదేశం సర్వతోముఖాభివృద్ధి, పేదరిక నిర్మూలన సాధ్యమనే దృక్పధాన్ని రూపొందించుకోవడానికి నాకెంతో తోడ్పడ్డాయి.

సోషలిస్టు సిద్ధాంతజాలం నుండి, ప్రభుత్వ శృంఖలాల నుండి విముక్తం చేసి దేశాన్ని స్వేచ్ఛాయుత విధానాల వైపు నడిపిస్తామని రెండు దశాబ్ధాల క్రితం పాలకులు ప్రకటించినపుడు అందరితో పాటు నేను సంతోషించాను. ప్రభుత్వ బంధిఖానాల నుండి వ్యవసాయ రంగం స్వేచ్ఛ పొందగలుగుతుందని ఎదురు చూశాను. కాని రెండు దశాబ్ధాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా పట్టణాలకు, నగరాలకు ఆహార పదార్థాలను, కూలీలను సరఫరా చేసే కాలనీలుగా గ్రామీణ ప్రాంతాలు రూపొందటం బాధాకరం.

అతి తక్కువ స్థాయికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి 30 సంవత్సరాల క్రితం తన వేతనంలో 40 శాతం ఆహార అవసరాలకోసం ఖర్చు చేయాల్సి వచ్చేది.

ఇప్పుడు తన వేతనంలో కేవలం 10 శాతం ఖర్చు చేస్తే ఆహార అవసరాలు తీరుతున్నాయి. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించనీయకూడదని ప్రభుత్వం కంకణం కట్టుకొంది. ఆహార ధాన్యాలకు కనీస మద్దతు ధర ప్రకటించే ప్రక్రియ నాకెంతో బాధను, దుఃఖాన్ని కలిగిస్తుంది. సేద్యానికి అయ్యే ఖర్చుకు అనుగుణంగా ధాన్యాల ధరలను ప్రభుత్వం ప్రకటిస్తుంటుంది. అంటే ఈ పంటలు పండించే రైతులను బాండెడ్ లేబర్‌గా, అంటే కట్టు బానిసలుగా మార్చి వేస్తోంది. వారు పెట్టే ఖర్చుకు తగిన ఆదాయం వస్తేచాలు. వారి కుటుంబ అవసరాలు, పిల్లల విద్య-వైద్య ఖర్చులు ఏమీ పట్టించుకోక పోయినా ఫరవాలేదు అనే అప్రకటిత విధానాన్ని ప్రభుత్వాలన్నీ అమలు చేస్తున్నాయి. వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం వ్యవసాయ ఉత్పత్తుల సాగువ్యయం లెక్కించు విధి విధానాలలోనే రైతులకు వ్యతిరేక అంశములు వున్నాయని, వాటిని పునసమీక్షించాలని, పంట సగటు సాగు వ్యయం పైన 50 శాతాన్ని కలిపి కనీస మద్ధతు ధరగా నిర్ణయించాలని డాక్టర్ ఎమ్.ఎస్. స్వామినాధన్ జాతీయ రైతు కమీషన్ సూచించి నాలుగేండ్లు పైగా అవుతున్నప్పటికీ, ఆమోదించకపోగా, దీనిని అమలు చేయటం సాధ్యం కాదని కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శరద్‌పవార్ పార్లమెంట్‌లో ఇటీవల ప్రకటించటం రైతాంగం ఆశలపై నీళ్లు చల్లింది.

ఆహార ధాన్యాలకు సంబంధించి ప్రపంచంలో మరే ప్రభుత్వం అమలు చేయని ఆంక్షలు, నియంత్రణలు మన ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. నిల్వలపై ఆంక్షలు, రవాణాపై ఆంక్షలు, స్వేచ్ఛా వ్యాపారంపై ఆంక్షలు, విదేశాలకు ఎగుమతులపై ఆంక్షలు, జీరో డ్యూటీతో ఆయిల్‌ఫాం, బియ్యం, గోధుమలు, పంచదార దిగుమతులతో రైతాంగం నడ్డి విరిగిపోతూంది. అభివృద్ధిచెందిన దేశాలతోసహా పలు దేశాలు వ్యవసాయరంగంలో పూర్తి స్వేచ్ఛా విధానాలను పాటించడమే కాకుండా, ఈ రంగానికి అనేక ప్రోత్సాహకాలు, రాయితీలను, మద్ధతును ఇస్తూ, వాటి రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించుకుంటున్నాయి.

ప్రపంచంలో మరే దేశంలోనూ లేని విధంగా, వ్యవసాయానికి పూర్తి

అనుకూలమైన వాతావరణం, కష్టించి పనిచేసే రైతాంగం మనదేశంలో వుంది. ఒక సంవత్సర కాలంలో రెండు మూడు పంటలు పండించగల అవకాశం మనకు వుంది. ప్రభుత్వం రకరకాల నియంత్రణలతో, ఆంక్షలతో, పన్నులతో వ్యవసాయ రంగాన్ని వేధించడం మానివేస్తే కేవలం దశాబ్ద కాలంలో వ్యవసాయ ఉత్పత్తులను రెట్టింపు చేయవచ్చు. అలాగే స్వేచ్ఛా వాణిజ్యంతో రైతుకు లభించే ధరను రెట్టింపు చేయవచ్చు. వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతుల్లో అగ్రభాగానికి జేర్చవచ్చు. గ్రామీణ రంగాన్ని సుసంపన్నం చేయవచ్చు. వ్యవసాయంపై ఇప్పటికీ ఆధారపడివున్న 60 శాతం మంది ప్రజానీకం యొక్క కొనుగోలు శక్తి పెరిగితే, పారిశ్రామిక, సేవారంగాలకు కూడా మరింత ఊపు లభించి, మన దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడగలుగుతుంది.

ఎరువుల ధరలు-సబ్సిడీపై నందన్ కమిటీ ఇచ్చిన రిపోర్టును ఆఘమేఘాలమీద అమలుచేస్తూ, ఎరువుల ధరలను రెట్టింపు చేసింది. కానీ విత్తనాల ధరలను, రాయల్టీని, నాణ్యతను నియంత్రించేదానికి రాష్ట్రప్రభుత్వాలకు అధికారం వుండేలా విత్తన చట్టమును ప్రభుత్వం ఇప్పటికీ నాలుగేండ్లైనా తీసుకు రాలేదు. బహుళజాతి విత్తన సంస్థల ప్రాబల్యం బయోటెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీ బిల్లు ముసాయిదాలో స్పష్టంగా కన్పించింది. జన్యుమార్పిడి పంటల ద్వారానే మన దేశం ఆహార భద్రతను సమకూర్చుకోగలదని పాలకులు భావించడం శోచనీయం.

దేశంలో అందరికీ పౌష్టికాహారం లభించేలా చేయడం, పేదరికాన్ని నిర్మూలించడం, పట్టణ, గ్రామీణ అంతరాలను క్లుప్తీకరించడం, వ్యవసాయ రంగాన్ని అన్ని కోణాల నుండి ఆధునీకరించడం ద్వారానే సాధ్యపడుతుంది. చైనా 1970వ దశకంలోనే వ్యవసాయ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టి, గ్రామీణ ప్రాంతాలకు సమీపంలోనే పట్టణ-గ్రామీణ వాణిజ్య సముదాయాలను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తూ వచ్చింది. ఇప్పటికీ మన దేశంలో ఆ దిశగా

తగు చర్యలు చేపట్టబడకపోవటం దురదృష్టకరం. లాభసాటిగా లేదనే భావనతో వ్యవసాయం నుండి దూరముగా తొలగిపోతూవున్న యువతను ఆకర్షించేలా వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా తీర్చిదిద్దినప్పుడే దేశం సుసంపన్నం అవుతుంది. సుస్థిర వ్యవసాయ చేద్యంపై రైతులు దృష్టిసారించవలసి వుంది.

ఒక వైపున వర్షాధార ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పాదకత, ఉత్పత్తులు పెంచవలసిన అవసరం ఎంతో ఉందని చెబుతూ, ఇరిగేషన్ రంగానికి హెచ్చు మొత్తంలో నిధులు కేటాయించి, దీర్ఘకాలముగా నిర్మాణములోవున్న ఇరిగేషన్ పథకాలను పూర్తి చేయవలసిన అవసరం ఎంతో ఉంది. ప్రపంచంలోనే అత్యద్భుతమైన 'త్రిగోర్జెస్ డ్యామ్'ను చైనా నిర్మించిన తరువాత నైనా మన పాలకులు బడా పారిశ్రామిక, వాణిజ్య వర్గాలకు ఎక్సైజ్, కష్టమ్స్ డ్యూటీలు, ఇన్‌కమ్‌టాక్స్ లలో లక్షల కోట్ల రూపాయలను రాయితీల రూపంలో నష్టపోతున్న దానిలో సగమైనా ఈ రంగానికి వెచ్చించితే అచిర కాలంలో వ్యవసాయాభివృద్ధితోపాటు, జల విద్యుత్ ఉత్పత్తికూడా గణనీయంగా పెరుగుతుంది.

దేశంలోని లక్షలాది గ్రామాలలో దయనీయంగా, నిస్సహాయంగా జీవితాలనువెళ్ళబుచ్చుతున్న రైతు కూలీ కుటుంబాల్లో సౌభాగ్యాన్ని ఆవిష్కరించడానికి మనందరం అంకిత భావంతో కృషిచేద్దాం. **నా ఈ వ్యాస సంకలనం అందుకోసమే ఉద్దేశించబడింది.**

ఈ పుస్తక ఆవిష్కరణకై ప్రత్యేకంగా విచ్చేసిన **శ్రీ చౌధురి అజిత్‌సింగ్** గారికి, **శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి** గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ఈ గ్రంధాన్ని రూపొందించడంలో నా కెంతో తోడ్పడిన, నాలుగు దశాబ్దాలుగా నా మిత్రుడు **శ్రీ చల్లగుళ్ళ నరసింహా రావు** గారికి, ఈ పుస్తకాన్ని అందంగా ముద్రించిన కళాజ్యోతి ప్రాసెస్ అధినేత **శ్రీ ఆలపాటి బాపన్న** గారికి నా కృతజ్ఞతలు.

**– వడ్డే శోభనాద్రీశ్వర రావు**

# విషయ సూచిక

## 1వ అధ్యాయం


**వ్యవసాయ విధానాలు** **13-86**

సమృద్ధిగా వనరులున్నా సంకల్పబలమే సున్న ................. 15
హ్రస్వదృష్టికి నిదర్శనం పల్లెలపట్ల నిర్లక్ష్యం .................... 20
ఆకలి అవిద్య లేనిరోజు ఇంకెంతదూరం? ...................... 24
అన్నదాతకు ఆత్మవిశ్వాసం కల్పించే చర్యలు ముఖ్యం......... 31
ఉత్పత్తుల మెరుగుదలకు మేలైన విధానం! ...................... 36
వనరులెన్ని ఉన్నా సమగ్ర విధానమే కరవు .................... 41
పరిశోధనపై చిన్నచూపు ........................................ 47
రిటైల్‌పై తొందరపడితే టోకున నష్టం! ...................... 52
ఆశ నిరాశల మధ్య వ్యవసాయ రంగం ..................... 58
రైతు ఆనందం అదనపు భారమా! ........................... 63
ఓటు పథకాలతో రైతుకు చేటు.................................. 68
జన్యు మార్పిడి పంట జాతి గుండెల్లో మంట ............... 73
తొందరపడితే గందరగోళమే! ................................. 78
చిన్న కమతాలే సేద్యానికి రక్ష................................. 83


## 2వ అధ్యాయం


**డంకెల్ ప్రతిపాదనలు ఎగుమతులు, దిగుమతులు** **87-129**

వ్యవసాయ రంగంమీద 'డంకెల్' నీలినీడ ....................... 89
డంకెల్ ముసాయిదాపై విస్తృత చర్చలు అవశ్యం! .............. 94
సమగ్ర అవగాహనతో 'డంకెల్'కు సమాధానం ................. 99
వాణిజ్యం మాటున మాయవలలు ............................ 106
కార్మిక ప్రమాణాల పేరిట అర్థరహిత ఆంక్షలు? ............. 111
అండ కాదు... గుదిబండ ...................................... 117

పొగపెడుతున్న దిగుమతులు .................................. 120
ఎగుమతులు పెరిగినప్పుడే 'సమృద్ధి' సార్థకం................ 125

## 3వ అధ్యాయం

**పంటలు - వరి, చెఱకు, పత్తి** **131-187**

చెరకు రైతును గానుగాడుతున్న ప్రభుత్వాలు.................. 133
పత్తి రైతుల ఆత్మహత్యలు చెబుతున్న చేదు నిజాలు .......... 138
వరి రైతులమీద కేంద్రం సవతి ప్రేమ ......................... 143
పత్తి రైతును ముంచుతున్నదెవరు? ........................... 148
పత్తి రైతు ఆశ దూదిపింజేనా?................................ 153
వరి ధాన్యం ధర దైన్యం ..................................... 158
తీపి మనకు - చేదు తనకు.................................... 163
చెరకు రైతుకు చేదు మాత్ర.................................... 168
చెరకు రైతుకు చేదు బహుమతి ............................... 173
రైతుల్ని కొట్టి, మిల్లులకు పెట్టి... ........................... 178
వరి రైతు కష్టాలు కడదేరవా? ............................... 183

## 4వ అధ్యాయం

**రైతు బజార్, కూరగాయలు - పండ్లు, మామిడి, అక్వా** **189-229**

ఉభయతారక విధానంతో అభయహస్తం ...................... 191
రైతు మార్కెట్ల వల్ల ద్విముఖ ప్రయోజనం..................... 196
మామిడి 'ఫలా'లను చేజార్చుకుంటున్న భారత్ ............... 202
వ్యవసాయ మార్కెటింగ్‌లో నవశకానికి నాంది .............. 207
కాపాడుకోవాల్సిన కొల్లేటి సిరి ................................ 212
మామిడి రైతుకు చేదు అనుభవం............................. 216
రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారునికి సరసమైన ధర ... 219
ప్రజారోగ్యం, రైతుకు లాభం .................................. 224

## 5వ అధ్యాయం

వ్యవసాయ రుణ పరపతి, పంటల బీమా, ఎరువులు, వ్యవసాయ విస్తరణ, విత్తనాలు 231-302

రైతన్న వెన్నువిరిచే ఆలోచనలొద్దు.............................. 233
సరికొత్త పట్టాలపై సహకారోద్యమం.......................... 238
ఆపత్కాలంలో అభయహస్తముంటేనే రైతన్నకు ధీమా ........ 243
దిగుబడిని దెబ్బతీస్తున్న ఎరువుల విధానం .................... 248
ప్రకృతి వికటించినవేళ రైతుకేదీ రక్షణ?....................... 254
రైతుల్లో చైతన్యం పెరిగితేనే భవితవ్యం ........................ 260
జాగ్రత్త పడకపోతే అంతా అనర్థం............................. 266
విధి వంచించినవేళ రైతన్నకు చేయూత....................... 269
ఉత్పత్తి వ్యయం ఉరితాడు కారాదు! ........................... 274
రుణం అందిస్తే... రుణం తీర్చుకున్నట్లే ....................... 279
సమగ్ర బీమాతోనే రైతుకు భరోసా............................. 285
పంట పొలాల్లో మంటలెక్కడివి? .............................. 289
జీవనాధారమైన భూమాతను పరిరక్షించుకోవద్దా? ........... 293
ఎరువుల ధర పెంపు సమర్థనీయమా?........................ 298

## 6వ అధ్యాయం

ఇరిగేషన్ రంగం 303-343

'నీటిపారుదల'కు నిర్లక్ష్యమే అవరోధం......................... 305
అవగాహన లోపంవల్ల పెరుగుతున్న కష్టాలు ................. 312
ప్రణాళికలు గడుస్తున్నా ఫలితాలు స్వల్పం .................... 317
వనరులు పరిమితం నిర్లక్ష్యం ప్రమాదకరం .................. 323
సాగునీటి సద్వినియోగంతో రాష్ట్రం సుభిక్షం .................. 328
గందరగోళానికి ఇకనైనా తెర! ................................. 333
వరద నివారణకోసం బహుముఖయత్నం ...................... 338

## 7వ అధ్యాయం

**విద్యుత్ సంస్కరణలు** **345-371**

దేశీయ పరిష్కారం వదిలి విదేశీ ప్రయోగం? ................ 347

విద్యుత్ రంగంలో చీకటి కోణాలు ............................ 352

వ్యవసాయ విద్యుత్ టారిఫ్ పెంపు అనివార్యం? ............ 356

విద్యుత్ సంస్కరణల్లో రైతుకు 'షాక్ థెరపీ'.................... 361

సంస్కరణలు చేపట్టకుంటే మనుగడ ప్రశ్నార్థకం ............ 366


## 8వ అధ్యాయం

**ఆహారభద్రత, ఉపాధి కల్పన, వ్యవసాయ పరిశ్రమలు** **373-402**

నిరుద్యోగాన్ని నిలువరించే వ్యూహం .......................... 375

ఉపాధిని పెంచని ఉత్పత్తి ఎవరి కోసం? ...................... 379

ఉపాధితో ముడిపడితేనే పథకాలు సార్థకం.................... 384

వ్యవసాయాధార పరిశ్రమలకు ప్రాధాన్యం .................... 389

మెతుకు దూరం...బతుకు భారం ............................ 394

అరకొర 'ఆహారభద్రత' వద్దు ................................. 398


## 9వ అధ్యాయం

**ఇతర అంశాలు, జన్మభూమి, ఎన్నికల సంస్కరణలు** **403-451**

ప్రగతికి ప్రతిబంధకం పెరుగుతున్న జనాభా ................ 405

సదాశయం నీడన దురుద్దేశాలు.............................. 409

వివేకానందుని మాట నేడు దేశానికి బాట .................... 413

సమగ్రత కొరవడితే లొసుగులు సశేషమే!.................... 418

గోస్వామి సిఫార్సులతోనే సిసలైన సంస్కరణ! ................ 423

ఉట్టి కెగరలేకున్నా స్వర్గానికి నిచ్చెనలు ...................... 428


గట్టి విధానమా వట్టి నినాదమా...? .......................... 433

ప్రశ్నించే తత్వానికి, శ్రమించే సంస్కృతికి మార్గం ............ 438

అర్థరహిత డిమాండ్లతో అస్థిరత్వం............................ 444

ఇందిర చూపిన తోవ నేటికీ సహేతుకం ...................... 447

1 వ అధ్యాయం



# వ్యవసాయ విధానాలు

Blank Page

# సమృద్ధిగా వనరులున్నా సంకల్పబలమే సున్న

ప్రపంచ వ్యవసాయ రంగంలో ప్రథమస్థానం సంపాదించడానికి అవసరమైన సహజవనరులు భారతదేశానికి సమృద్ధిగా ఉన్నాయి. కాని ఈ రంగంలో దేశాన్ని అగ్రభాగాన నిలపాలన్న సంకల్పమే ఇంతవరకు పాలకులకు కలగక పోవడం శోచనీయం. కేవలం ఆహారరంగంలో స్వయం సమృద్ధిని సాధించే విధానానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. భారత వ్యవసాయ రంగం అందుబాటులో ఉన్న వనరులన్నిటినీ సక్రమంగా వినియోగించుకుని సమగ్ర అభివృద్ధి సాధించడానికి తగిన చర్యలను పాలకులు తీసుకోవడంలేదు. అందుబాటులో ఉన్న అవకాశాలు, వనరులకు అనుగుణంగా వ్యవసాయ రంగం ఎందుకు అభివృద్ధి చెందడంలేదని విధాన నిర్ణేతలు ఆలోచించడంలేదు. దేశ జనాభాకు అవసరమయిన ఆహారధాన్యాల ఉత్పత్తినే ప్రభుత్వం తన లక్ష్యంగా పెట్టుకుంటున్నది. స్వతంత్ర భారతదేశంలో ప్రణాళికాబద్ధ ప్రగతి దిశగా పయనం ప్రారంభమయి నలభయి సంవత్సరాలయింది. అయినా, గత ముప్పయి ఒక్క సంవత్సరాల కాలంలో భారత దేశం ఇతర దేశాలనుంచి ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోకతప్పలేదు. సగటున ప్రతి మనిషికీ సంవత్సరానికి 181 కిలోల ఆహారధాన్యాలు అవసరం కాగా, ఈ అవసరం తీరిన సంవత్సరాలు స్వల్పం.

## పరిమితమైన సస్యవిప్లవం

భారత వ్యవసారంగం ఏమేరకు అభివృద్ధిచెందే అవకాశం ఉందనే విషయంలో పలు అంచనాలున్నాయి. భారత వ్యవససాయ పరిశోధనా సంస్థ (ఐ.సి.ఎ.ఆర్) ఏటా నిర్వహిస్తున్న ప్రదర్శనా క్షేత్రాల ఫలితాలను బేరీజువేసి "సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయాభివృద్ధి, ప్రాంతీయ అసమానతలు" శీర్షికన ప్రచురించిన వ్యాసంలో భారత వ్యవసాయరంగం పూర్తిస్థాయి అభివృద్ధి చెందకపోవడంవల్ల ఆర్థిక వ్యవస్థ ఎంతగా నష్టపోతున్నదో అంచనా వేశారు. ఇంత వరకు ఉపయోగంలోకి రాకుండా ఉన్న

వ్యవసాయ శక్తిని వినియోగిస్తే జరిగే ఉత్పత్తి జాతీయ ఆదాయంలో సగభాగానికి సమానంగా ఉంటుందని అంచనా కట్టారు. ఇదే జరిగితే సగటు భారతీయుని జీవనస్థాయి గణనీయంగా పెరుగుతుందనీ, దేశం ప్రపంచంలో మధ్య ఆదాయ శ్రేణిలో చేరగలదని ఈ పరిశీలనలో వెల్లడయింది. పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజల మధ్య ఇప్పుడున్న ఆదాయాల వ్యత్యాసాలు బాగా తగ్గగలవని, వ్యవసాయ రంగంలోని పురోగతి ప్రభావం పరిశ్రమల మీద, సేవలు - సరఫరాల మీద గణనీయంగా ప్రసరించి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని స్పష్టమయింది. భారత వ్యవసాయరంగంలో ఇంకా ఎంతటి అభివృద్ధిని సాధించడానికి అవకాశం ఉందో తెలుసుకోవాలంటే పంజాబ్ రాష్ట్రంలో సాధించిన వ్యవసాయ ప్రగతిని పరిశీలించాలి. భారతదేశంలో ఆహారధాన్యాలు ఉత్పతి అవుతున్న మొత్తం భూమిలో 4 శాతం మాత్రమే వున్న పంజాబ్ రాష్ట్రం మొత్తం ఆహార ధాన్యాలో 33 శాతం ఉత్పతి చేస్తోంది. భూమి, శీతోష్ణ పరిస్థితులలో పంజాబ్‌కు, ఇతర రాష్ట్రాలకు మధ్య భేదం ఏమీ లేదు. కాని, వ్యవసాయానికి కావలసిన ఆర్థిక పసరులు, నీరు అధికస్థాయిలో లభించడం వల్లనే పంజాబ్ రైతులు ఇంతటి అధికోత్పత్తిని సాధించగలుగుతున్నారు. సస్యవిప్లవం పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కొన్ని జిల్లాలకు మాత్రమే పరిమితమయింది. అస్సాం, బీహార్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, తదితర రాష్ట్రాలలో వ్యవసాయాభివృద్ధి రేటు జనాభా పెరుగుదల రేటుకంటే తక్కువగా ఉంది. జనాభా పెరుగుదల రేటుతో సమానంగానయినా వ్యవసాయరంగంలో మానవవనరుల వినియోగం పెరగలేదు. ఉపాధి అవకాశాల పెరుగుదలరేటు వ్యవసాయ రంగంలో 1972-78 సంవత్సరాల కాలంలో 2.32 శాతం కాగా 1982-83లో 0.65 శాతం మాత్రమే. జీవనవ్యయం పెరగడంతో వ్యవసాయ కూలీల కూలిరేట్లు వ్యవసాయ ఉత్పత్తుల ధరలకన్నా చాలా హెచ్చుస్థాయిలో పెరిగాయి. తత్ఫలితంగా రైతులు అధిక సంఖ్యలో కూలీలను వినియోగించుకోకపోతున్నారు. నిరుటి (1991)వరకు ఎరువుల ధరలు నిలకడగా ఉన్నాయి. ఎరువుల వినియోగం పెరిగి అధిక దిగుబడికి అది ప్రధాన కారణమయింది. 1970-71 ధరల ప్రాతిపదికన పరిశీలిస్తే 1978-79లో మొత్తం వ్యవసాయోత్పత్తుల విలువ రూ. 16,469 కోట్లు. సకాలంలో రైతులకు ఎరువులు, నీటిని అందించడంతోపాటు అధిక దిగుబడి వంగడాలు వినియోగించి, సస్యరక్షణ చర్యలను తీసుకుని ఉంటే వ్యవసాయరంగం నుంచి రూ. 47,340 కోట్ల

ఆదాయం జాతీయ ఆదాయానికి జమపడేదని అంచనా. అంటే, నాటి జాతీయ ఆదాయంలో సగం మేరకు అదనంగా లభించి ఉండేది. మన వ్యవసాయ రంగం అభివృద్ధికి గల అవకాశంలో ఇప్పటి వరకు మూడోవంతును మాత్రమే ఉపయోగించుకోగలిగాం. ఇంకా రెండు రెట్లు అధికంగా ప్రగతి సాధించడానికి అవకాశం ఉంది. పాలకులు, ప్రణాళికావేత్తల అలక్ష్య ధోరణి కారణంగా వ్యవసాయరంగం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేకపోతున్నది.

మనిషికి గాలి, వ్యవసాయానికి నీరు చాలా ముఖ్యం. అదృష్టవశాన దేశ విస్తీర్ణంలో 51 శాతం బాగం, అంటే 16.5 కోట్ల హెక్టార్ల భూమి సాగుకు అనువయినదే. ఇందులో 14 కోట్ల హెక్టార్ల భూమి ఇప్పుడు సాగవుతున్నది. ఆరుకోట్ల అరవైయేడు లక్షల ముప్ఫయివేల హెక్టార్ల అటవీ విస్తీర్ణంలో మూడుకోట్ల హెక్టార్లలో మాత్రమే అడవులున్నాయి. మిగిలిన మూడుకోట్ల అరవై ఏడు లక్షలకు పైగా హెక్టార్ల భూమిలో తుప్పలు మినహా ఇంకేమీ లేవు. ఇక్కడ కూడా అడవులను పెంచడానికి ఆదరణాత్మక వ్యూహాన్ని రూపొందించి స్థానిక ప్రజలను ప్రోత్సహించాలి. అడవుల పెంపకంలో వారిని భాగస్వాముల్ని చెయ్యాలి. ఇది ప్రజా ఉద్యమం కావాలి. అడవుల అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణ జరగాలి. పర్యావరణ పరిరక్షణ ప్రభావం వర్షపాతం మీద ప్రసరిస్తుంది. వర్షపాతంలో సమతూకం సాధ్యమవుతుంది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న కోటి 55 లక్షల హెక్టార్ల భూమిని, రెండు కోట్ల 58 లక్షల హెక్టార్ల బీడుభూమిని కూడా సాగుచేసి సస్యశ్యామలం చేయాలి. ఇటీవలి అంచనాల ప్రకారం మొత్తం 17.8 కోట్ల హెక్టార్ల భూమికి మధ్య చిన్నతరహా నీటివనరుల ద్వారా నీటిపారుదల సాకర్యం కల్పించవచ్చని తేలింది. ఇంతవరకు కేవలం 48 శాతం నీటిని వినియోగించగలిగే పథకాలను మాత్రమే నిర్మించాం. నీటిపారుదల అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుంచి తగిన శ్రద్ధ చూపలేదు. సాగుభూమిలో ఇప్పటికి 70 శాతం భాగం వరుణదేవుడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నది. నీటివనరులున్నా 1.5 కోట్ల ఎకరాల భూమికి పూర్తిగా నీటి అవసరాలు తీరడంలేదు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకింద ఇప్పటికీ 88 వేల ఎకరాల భూమి సాగులోకి రాలేదు. సకాలంలో తగినంత పెట్టుబడి వ్యవసాయాభివృద్ధిలో మరో కీలక అంశం. జాతీయ స్థూల ఉత్పత్తిలో మూడోవంతు భాగాన్ని అందిస్తున్న వ్యవసాయరంగానికి బ్యాంకులు ఇస్తున్న రుణ సహాయం మొత్తం బ్యాంకులందిస్తున్న రుణాలలో 17 శాతం మాత్రమే. స్థూల

జాతీయ ఉత్పత్తిలో పారిశ్రామిక రంగం వాటా 20 శాతం కాగా దీనికి బ్యాంకు రుణాల పంపిణీలో 36 శాతం లభిస్తోంది. గ్రామీణ ప్రాంతాలలోని బ్యాంకు డిపాజిట్లలో 60 శాతం భాగాన్ని గ్రామాలకు ఇచ్చి మిగిలిన భాగాన్ని పట్టణాలకు తరలించడం అన్యాయం. వ్యవసాయ ఉత్పత్తుల ధరలతో పోల్చినప్పుడు వ్యవసాయ ముడివస్తువుల, పరికరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. మొత్తంమీద వ్యవసాయరంగానికి అవసరమయిన పెట్టుబడి రూ. 51,306 కోట్లు. వాణిజ్యబ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు అన్నీ కలిసి వ్యవసాయ రంగానికి 1987-88లో అందజేసిన స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాల మొత్తం రూ. 8,300 కోట్ల స్థాయికే పరిమితమైంది. వ్యవసాయ రంగంపట్ల చిన్న చూపునకు ఇదొక ప్రబల నిదర్శనం. దేశమంతటా రబీ పంటతో సహా సాగు భూమి విస్తీర్ణం 18 కోట్ల హెక్టార్లు. ఇందులో ఆరు కోట్ల హెక్టార్ల భూమిలో అధిక దిగుబడి వంగడాలను ఉపయోగిస్తున్నారు. ఈ శతాబ్ది చివరినాటికి దేశంలో 30 లక్షల టన్నుల అధిక దిగుబడి విత్తనాల అవసరం ఉంటుందని జాతీయ వ్యవసాయ కమిషన్ అంచనా. విత్తనాలలో నాణ్యత లేకపోవడం రైతులు ఎదుర్కొంటున్న మరోసమస్య. రైతులకు ఇటువంటి నష్టం కలుగకుండా చట్టాన్ని రూపొందించాలి. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, మరనాగళ్లు, కోత నూర్పిడి యంత్రాలు, నాట్ల యంత్రాలు వ్యవసాయ రంగం దిగుబడులు పెరగడానికి చాలా ఉపకరిస్తాయి. దేశంలోని 9 కోట్ల కమతాలలో, నూటికి 76 మంది చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పరికరాలను, యంత్రాలను చాలా తక్కువ ధరతో ఈ చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. యాంత్రీకరణ ఫలితంగా ఎకరా దిగుబడులు హెచ్చుతాయి. కోళ్ల పెంపకం, పాడిపరిశ్రమ, చేపల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాల సదుపాయాన్ని సన్నకారు రైతులకు కల్పించాలి. వ్యవసాయ యంత్ర పరికరాలను కొనడానికి చిన్నరైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి. పరిశోధనాలయాల్లో అభివృద్ధిపరచిన విజ్ఞానశాస్త్ర విషయాలను రైతులకు తెలియజేయడానికి 1985 సంవత్సరంలోగా ప్రతి జిల్లాలో కనీసం ఒక కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ వ్యవసాయ కమిషన్ ఏనాడో సూచించింది. ఇప్పటి వరకు వంద కేంద్రాలే స్థాపితమయినాయి. వ్యవసాయంలో రైతుల సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రాలు ఉపకరించాలి. ప్రతి గ్రామం నుంచి కనీసం ఒక రైతును ఎంపికచేసి ఈ కేంద్రాలలో శిక్షణ ఇవ్వాలి. శిక్షణ పొందిన రైతుల ద్వారా ఇతర రైతులు లాభపడగలుగుతారు.

## సహకార సంస్థల ఏర్పాటు ముఖ్యం

జిల్లానుంచి మరో జిల్లాకు వ్యవసాయ ఉత్పత్తులు, ముఖ్యంగా, ఆహారధాన్యాల రవాణాపై అంక్షలు ఉన్నందువల్ల రైతులకు సరైన ధర లభించడంలేదు. వర్తకులు, మిల్లర్లు లాభపడుతున్నారు. విశేషించి పండ్లు, కూరగాయలు వినియోగదారులవద్దకు వచ్చేసరికి వాటి ధర వందనుంచి మూడు వందల శాతం పెరుగుతున్నది. బెంగుళూరులోని హార్టికల్చరల్ గ్రోయర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ సరళిలో ముఖ్య నగరాలు. పెద్ద పట్టణాలలో సహకార సంస్థలను నెలకొల్పితే రైతులకు, వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధినేగాక వీటి ఎగుమతినికూడా ప్రభుత్వాలు అలక్ష్యం చేశాయి. పండ్లు, పాడి ఉత్పత్తులు, మాంసం, చేపలు, రొయ్యలు, బియ్యం మొదలయినవాటి ఎగుమతికి ఎంతో అవకాశం ఉంది. వ్యవసాయరంగంలో అపార అభివృద్ధి అవకాశాలున్నా ప్రభుత్వ విధానాలు ప్రతిబంధకంగా ఉన్నాయి. వరిపంట విస్తీర్ణంలో భారతదేశం ప్రపంచంలో ప్రథమస్థానం ఆక్రమిస్తున్నది. 1981-90 సంవత్సరాల మొత్తం ఎగుమతులలో వ్యవసాయ ఎగుమతుల భాగం 31 శాతం నుంచి 16 శాతానికి తగ్గింది. వ్యవసాయంగాన్ని సర్వతోముఖంగా అభివృద్ధిపరచి, వ్యవసాయిక ఎగుమతులను గణనీయంగా పెంచితే విదేశీ మారకద్రవ్యం సమస్య మనకు ఇంత క్లిష్టంగా ఉండేదికాదు. ఎనిమిదవ పంచవర్ష ప్రణాళికలోనయినా వ్యవసాయరంగం అభివృద్ధికి, వ్యావసాయిక ఎగుమతుల విస్తరణకు పాలకులు తగినంత ప్రాధాన్యం ఇస్తే మేలు.

*ది. 26-11-1992.* — *ఈనాడు*

●

# హ్రస్వదృష్టికి నిదర్శనం పల్లెలపట్ల నిర్లక్ష్యం

## రైతుల బాధలు పట్టించుకోని 'నమూనా వ్యవసాయ విధానం'

స్వాతంత్ర్యానంతరం కొద్ది నెలలకే, 1948లో భారత ప్రభుత్వం తన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. దరిమిలా, 1950, 1973, 1977,1980లలో దానిలో మార్పులు చేశారు. 1991-92 పి.వి. ప్రభుత్వం ప్రకటించిన నూతన పారిశ్రామిక విధానం విదితమే. ఈ మాత్రం శ్రద్ధాసక్తులు వ్యవసాయరంగం మీద కనిపించకపోవడం శోచనీయం. 1989లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం మొదటిసారి జాతీయ వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని ముఖ్యాంశాలపై దృష్టిసారించిన ఈ విధానానికి తుది రూపమిచ్చి, ఆమోదం పొందేలోగా ఫ్రంట్ ప్రభుత్వం పతనమైంది. దరిమిలా, నేటి కేంద్ర వ్యవసాయ మంత్రి బలరామ్ జక్కర్, ఆధ్వర్యంలో ఇటీవల రూపొంది పార్లమెంటులో ప్రవేశించిన 'నమూనా వ్యవసాయ విధానం' ప్రాథమిక రంగంపట్ల పాలకుల అలక్ష్యానికి తిరుగులేని సాక్ష్యం.

## నిధులే నిలువుటద్దాలు

వ్యవసాయరంగం వృద్ధిచెందకుండా ప్రజల కొనుగోలుశక్తి పెరగదు. పారిశ్రామికోత్పత్తులకు దేశీయ మార్కెట్టుండదు. కనీసం ఆ అవగాహన కూడా ఏలికల్లో లోపించడం అవిజ్ఞతకు పరాకాష్ఠ. ఈ పునాది రంగంపట్ల ప్రభుత్వ శ్రద్ధాసక్తులకు పంచవర్ష ప్రణాళికలో కేటాయింపులు నిలువుటద్దాలు. ఈ రంగానికి మొదటి ప్రణాళికలో 15 శాతం నిధులు కేటాయించగా, అవి ఏడో ప్రణాళిక నాటికి 5.9 శాతానికి, ఎనిమిదో ప్రణాళికలో 5.4 శాతానికి దిగజారాయి. పాలకులు ఎప్పటికప్పుడు అప్పటి అవసరాలమేరకే పంటల ఉత్పత్తి లక్ష్యాలు నిర్ణయిస్తున్నారు. విదేశీమారక ద్రవ్య సంపాదనకు తగినట్లు లక్ష్యాలు నిర్ణయించుకోవడంలేదు. 1996-97 నాటికి భారత జనాభా 94.5 కోట్ల ప్రజలకు 19.40 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరం. పశువుల దాణా, విత్తనాలు వృథా అయ్యే ధాన్యాన్నీ పరిగణనలోకి తీసుకుంటే 12.5

శాతం చొప్పున అదనపు ఉత్పత్తి జరగాలి. కరువు, వరదలవంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా దాదాపు 20 శాతం పంట దెబ్బతింటూ ఉంటుంది గనుక, అందరికీ సరిపోయే పోషకాహారం అందుబాటులో ఉండాలంటే 23 కోట్ల 30 లక్షల టన్నుల మేరకు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. ఎగుమతులకు తగిన మిగులు ధాన్యాలు ఉండాలంటే నిజానికి ఇంతకన్నా ఇంకా ఎక్కువ స్థాయిలోనే ఉత్పత్తి జరగాలి. ఈ లక్ష్యాలకు తగిన వ్యవసాయిక పథకాలు రూపొందించి, పటిష్ఠంగా అమలుపరచాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 1996-97 నాటికి 21 కోట్ల టన్నుల ఆహారధాన్యాలను దిగుమతి చేసుకున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 లక్షల టన్నుల దిగుమతికి ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకుంది. దేశంలో ప్రణాళికా విధానం ప్రారంభమయి నాలుగు దశాబ్దాలయినా వ్యవసాయరంగం దానికున్న అవకాశాల దృష్ట్యా 40 శాతం అభివృద్ధినయినా సాధించలేకపోయింది. సాగుకు లాయకయిన భూమిలో 22 శాతాన్ని ఇంకా వినియోగించడంలేదు. ఫలితంగా భూమి తలసరి లభ్యత 50 సెంట్లకు మించదు. 2000 సంవత్సరం నాటికి భూమి తలసరి లభ్యత 37 సెంట్లకు తగ్గిపోతుంది. చాలా దేశాలలో భూమి ఎన్నో నెలలపాటు మంచుతో నిండి ఉండటంవల్ల ఒక్క పంట మాత్రమే పండుతుంది. ఇండియాకు ఆ సమస్యలేదు. అయినా, 'అల్లుని నోట్లో శని...' తప్పడంలేదు. ఇటీవలి లెక్కల ప్రకారం దేశంలో నీటిపారుదల సదుపాయం ఉన్న భూమి ప్రస్తుతం 17 కోట్ల 80 లక్షల హెక్టార్లు. ఇది చైనాలో సాగులో ఉన్న 10 కోట్ల హెక్టార్ల భూమికంటే 1.8 రెట్లు అధికం. అయినా, ఇది మన గొప్పతనం కాదు. జలవనరులలో 48 శాతాన్ని మాత్రమే ఉపయోగించుకోగలుగుతున్నాం. సాగుభూమిలో 30 శాతానికి నీటి సదుపాయం ఉండగా మిగిలిన 70 శాతం భూమికి వానదేవుడే దిక్కు. నీటిపారుదల రంగానికి పెట్టుబడి మొదటి ప్రణాళికలో 22 శాతం కాగా, ఏడో ప్రణాళికలో 9 శాతానికి, ఎనిమిదో ప్రణాళికలో 8 శాతానికి తగ్గింది. పెట్టుబడులు తగ్గడంతో ఏడో ప్రణాళిక చివరికి 182 పెద్ద, 312 మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మాణదశలోనే కుంటినడక నడుస్తున్నాయి.

దేశంలో పంట దిగుబడి ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు. భౌగోళికంగా సగటు దిగుబడి హెక్టారుకు 2802 కిలోలు కాగా ఇండియాలో 1893 కిలోలు మాత్రమే భౌగోళిక సగటు ఉత్పత్తిని అందుకోగలిగినా, భారతదేశం అదనంగా 19 కోట్ల టన్నులు పండించి రూ.43,200 కోట్ల విలువయిన విదేశీ మారక ద్రవ్యం ఆర్జించగలిగేది. ఇప్పటికయినా అత్యవసరమయిన ఎరువులు, విత్తనాలు, రుణాలు, నీటిపారుదల,

సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగుపట్ల శ్రద్ధవహిస్తే ఈ రంగంలో ఇండియా ప్రపంచంలో ప్రథమ స్థానాన్ని సంపాదించగలుగుతుంది. ప్రస్తుతం దేశంలో సగటున హెక్టారుకు 70 కిలోల ఎన్.పి.కె. ఎరువులను ఉపయోగిస్తుండగా చైనాలో హెక్టారుకు 236 కిలోలు వినియోగిస్తున్నారు. పర్యవసానంగా చైనాలో ఇండియా కంటే 2.25 రెట్లు ఎక్కువ దిగుబడి లభిస్తున్నది. దేశంలో నీటిపారుదల వసతి ఉన్న 30 శాతం భూమిలోనే 80 శాతం ఎరువులు ఉపయోగిస్తున్నారు. ఫాస్ఫేటు, పొటాష్ ఎరువుల ధరలు ఇటీవల పెరగడంతో ఎరువుల వినియోగం 24 శాతం తగ్గింది. దీని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తులపై స్పష్టంగా కన్పిస్తున్నది. ఎరువులకన్నా ముఖ్యం అధిక దిగుబడి వంగడాలు. అరేళ్లుగా సర్టిఫయిడ్ విత్తనాల వంగడాల పంపిణీ దాదాపు 57 లక్షల క్వింటాళ్ల స్థాయిలోనే ఉంది. 1996-97 నాటికి కనీసం 70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయశాఖ అంచనా. ఈ శతాబ్ది చివరికి 3 కోట్ల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని జాతీయ వ్యవసాయ కమిషన్ పేర్కొంది. ఇప్పటికి గోధుమ పంట విస్తీర్ణంలో మాత్రం 93 శాతం అధిక దిగుబడి వంగడాల కిందికి వచ్చింది. వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, పంటల విస్తీర్ణంలో సుమారు 60 శాతమే అధిక దిగుబడి వంగడాలకింద ఉంది. బ్యాంకుల రుణాల పంపిణీలో వ్యవసాయ రంగానికి జరుగుతున్న తీవ్ర అన్యాయాన్ని ప్రత్యేకించి ప్రస్తావించాలి. రైతు అవసరాలకు తగినట్టు సకాలంలో రుణాలు లభించడం ఎంతో ముఖ్యం. మొత్తం జాతీయ ఉత్పత్తిలో మూడవవంతు వ్యవసాయరంగం నుంచి లభిస్తున్నది. అయినా, బ్యాంకుల రుణాలలో ఈ రంగానికి అందుతున్నవి 16 శాతం మాత్రమే. జాతీయాదాయంలో 20 శాతానికి మించని పారిశ్రామిక రంగానికి 34 శాతం బ్యాంకు రుణాలు అందుతున్నాయి. శాస్త్ర పరిశోధనాంశాలను రైతులకు తెలియజేయడానికి 1985 నాటికి ప్రతి జిల్లాలో కనీసం ఒక కృషి విజ్ఞాన కేంద్రం నెలకొల్పాలన్న జాతీయ వ్యవసాయ కమిషన్ సూచన ఇప్పటికి కనీసం సగం జిల్లాలకయినా వర్తించడంలేదు. క్రిమిసంహారక మందుల నాణ్యతను కాపాడే చర్యలూ గట్టిగా తీసుకోవడం లేదు. ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యే రైతులకు ప్రస్తుత పంటల బీమా పథకం ఆదరవు కావడంలేదని ప్రభుత్వమే అంగీకరించింది. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక జిల్లాలోనయినా పంటల బీమా నూతన పథకం అమలు చేస్తామని ప్రధానమంత్రి ఏడాది క్రితం చేసిన ప్రకటన ఇప్పటి వరకు ప్రకటనగానే మిగిలిపోయింది.

## పెరుగుతున్న వ్యత్యాసాలు

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అవరోధాలు తొలగిస్తామని కేంద్ర నేతలు ప్రకటించి పలుమాసాలయింది గాని, ఇంతవరకు దానికి తగిన చర్యలేవీ తీసుకోలేదు. విదేశాలకు స్వేచ్ఛగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతిచేసే అవకాశాలు చాలా తక్కువ. మన రైతులు గోధుమ, వరి, పత్తి తదితర పంటలను అంతర్జాతీయ మార్కెటు ధరలకంటే చాలా తక్కువ ధరలకు అమ్మవలసి వస్తున్నది. చిన్న రైతుల ప్రయోజనాలను కాపాడటానికి, రైతుల నుంచి ఎగుమతులను ప్రోత్సహించడానికి చిన్న రైతుల వ్యవసాయ వ్యాపార కన్సార్టియమ్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి పార్లమెంటులో చెప్పి సంవత్సరమయింది. అది ఇంకా కాగితానికే పరిమితం. రైతులు పండించిన పంటల ధరలకు, రైతులు కొంటున్న వస్తువుల ధరలకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటున్నది. వ్యవసాయరంగం ఆదాయాలు ఇతర రంగాలకు వెళ్లి రైతుల నికర ఆదాయాలు తగ్గుతున్నాయి. వ్యవసాయ రంగంలోకన్నా వ్యవసాయేతర రంగాలలో వారి తలసరి ఆదాయం 1970-71లో రెండింతలుండగా, 1991-92 నాటికి నాలుగురెట్లు అధికమయింది. వ్యక్తుల మధ్య వివిధ వర్గాల మధ్య వ్యత్యాసాలను తగ్గించాలని భారత రాజ్యాంగం ఆదేశ సూత్రాలు ఘోషిస్తున్నాయి. అయినా, వ్యవసాయ రంగానికి అన్యాయం కొనసాగుతున్నది. ఈనాటికీ దేశంలో 2 లక్షల గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. లక్ష గ్రామాలకు విద్యుచ్ఛక్తి సదుపాయం లేదు. పారిశుద్ధ్య సౌకర్యం పట్టణ ప్రాంతాలలో 45 శాతం మందికి ఉండగా, పల్లెప్రాంతాలలో 3.5 శాతం మందికి మాత్రమే ఉంది. మరణాల రేటు, శిశు మరణాల రేటు గ్రామీణ ప్రాంతాలలోనే అధికం. గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యుల సంఖ్య 36 శాతం మాత్రమే. గ్రామసీమల పట్ల ప్రభుత్వ అలక్ష్యధోరణికి ఇటువంటి నిదర్శనాలు ఎన్నయినా పేర్కొనవచ్చు. గ్రామాభ్యుదయానికి దోహదకరంగా వ్యవసాయం, నీటిపారుదల తదితర రంగాలకు ఇకముందు అత్యధిక ప్రాధాన్యం లభిస్తుందని, ప్రణాళికా వ్యయంలో కనీసం సగభాగం ఈ రంగాలకు లభ్యమవుతుందని జక్కర్ ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ విధాన పత్రంలో ఎక్కడా మాటవరసకయినా చెప్పలేదు. ఇకనైనా నాయకులు హ్రస్వదృష్టి వదిలి వ్యవసాయరంగం పురోగతికి బాటలు వేయకపోతే వినిమయ వస్తువులు చాలా ఉండి, వినిమయదారులు లేని దుస్థితి తప్పదు.

*ది. 23-11-1993.* — *ఈనాడు*

●

# ఆకలి అవిద్య లేనిరోజు ఇంకెంతదూరం?

భారతదేశం పరాయి పాలన నుంచి విముక్తమై యాభయ్యేళ్లయిన సందర్భంగా స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్న సమయమిది. ఎందరి త్యాగ ఫలితంగానో సిద్ధించిన స్వాతంత్ర్యం ఆశించిన ఫలితాలను సాధించగలిగిందా...? ఈ వైఫల్యానికి కారణాలేమిటో విశ్లేషించుకుని గతానుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం అవసరం. మన దేశాన్ని మనమే పరిపాలించుకుంటే కష్టాలు, కన్నీళ్లు ఉండవని, అందరికీ కనీసావసరాలైన కూడు, గూడు, గుడ్డ సమకూరుతాయని ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్నారు. ఆ కలలు ఏ మేరకు ఫలించాయో సమీక్షించుకోవడం, అభివృద్ధి దిశలో పయనించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం విజ్ఞత, బాధ్యత. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే "భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం - యాభై సంవత్సరాలు" అన్న పుస్తకం ప్రచురించి పార్లమెంటు సభ్యులకు అందజేసింది. వివిధ రంగాల్లో పరిస్థితి గురించి ఆ పుస్తకంలో తెలిపిన వివరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. యాభయ్యేళ్ల అనంతరం స్వతంత్ర భారత ప్రగతి గర్వించదగినట్టుగాగాక వ్యాకులపరిచేదిగానే ఉండడం విషాదకరం. దేశ జనాభాలో ఈ నాటికీ 38 శాతం దారిద్ర్య రేఖకు దిగువన దుర్భర పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో 7.60 కోట్ల ప్రజల పరిస్థితి గ్రామీణ పేదలకన్నా అధ్వాన్నంగా ఉందని పుస్తకం వివరించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య బీహారులో 55 శాతం కాగా చండీగఢ్‌లో 11 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో 22 శాతం పేదలున్నారని ప్రణాళిక సంఘం పేర్కొంటుండగా, అంతకన్నా ఎక్కువే ఉంటారని రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తోంది.

## యాభయ్యేళ్ల విషాద భారతం!

దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 1951-97 మధ్య కాలంలో అయిదుకోట్ల టన్నుల నుంచి 19.8 కోట్ల టన్నులకు పెరిగింది. ప్రస్తుతం దాదాపు 2.5 కోట్ల టన్నుల ఆహార నిల్వలున్నాయి. ఆ నిల్వలు దేశ ప్రజల అవసరాలు తీరగా మిగిలిన నిల్వలు కావు. ఈ దేశంలో దాదాపు 30 కోట్ల ప్రజలు రెండు పూటలా తమకు కావాల్సిన ఆహారాన్ని కొనుక్కోలేని దుస్థితిలో ఉన్నారు. ఇప్పటికీ 22.6 కోట్ల ప్రజలకు సరయిన తాగునీటి వసతి లేదు. భారతావనిలో అయిదేళ్లలోపు పిల్లల్లో 37.6 శాతం కొంతమేర, 43.8 శాతం. మధ్యస్థంగానూ, 8.7 శాతం తీవ్ర స్థాయిలో పోషకాహారలోపంతో సతమతమవుతున్నారని 1995లో ప్రభుత్వం పార్లమెంటులో వివరించింది. పేదరికం కారణంగా సరయిన ఆహారం తీసుకోకపోవడంవల్ల గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తొంభై శాతం మేర తక్కువ బరువుకల పిల్లలకు జన్మనిస్తున్నారు. ప్రసవ సమయంలో మహిళలు మరణిస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో నాలుగు వేల మందిలో ఒక గర్భిణి చనిపోతుండగా భారతదేశంలో ఆ సంఖ్య 14. ఆరోగ్య, వైద్య పరంగా చాలా అంశాలలో దేశం వెనుకబడిపోయింది. స్వతంత్ర్య రాజ్యాగానంతరం పదేళ్లలో అందరికీ ప్రాథమిక విద్య లక్ష్యంగా పెట్టుకోగా, యాభయ్యేళ్లయినా సగం దూరం చేరలేదు. ఈ శతాబ్ది అంతానికల్లా ప్రపంచం మొత్తం నిరక్షరాస్యుల్లో సగం భారతీయులే ఉంటారన్న అంచనా ఎంతో అవమానకరం. ఇప్పటికీ పట్టణ ప్రాంతాల్లో సుమారు 50 శాతం మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం మందికి సరయిన మరుగుదొడ్లు, పారిశుధ్య సదుపాయాల్లేవు. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో వ్యభిచార వృత్తిలో ఉన్న వారిలో 40 శాతం మైనర్ బాలికలని సర్వేలు వెల్లడిస్తున్నాయి. దేశ జనాభాలో ఇప్పటికీ 60 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. మరో 9 శాతం వ్యవసాయధార వృత్తుల్లో ఉన్నారు. ప్రణాళిక సంఘం అంచనాల ప్రకారం 1995 మార్చి నాటికి దేశంలో పనిచేయగలవారు 34 కోట్లు ఉన్నారు. వారిలో 5.20 కోట్లమంది చదువుకున్న వారు. 15.2 లక్షల మంది శిక్షణ పొందిన సాంకేతిక పరిజ్ఞానం కలవారు. దేశంలోని ఉపాధి కల్పన కేంద్రాల్లో 1995 నాటికి పేర్లు నమోదు చేసుకున్నవారి సంఖ్య 3 కోట్ల 67 లక్షలు. భారతదేశంలో ఉద్యోగ రంగంలో మహిళలు అతి తక్కువ. ప్రపంచంలో సగటు తలసరి విద్యుత్తు వినియోగం 2216 యూనిట్లు కాగా భారత్‌లో

తలసరి వినియోగం 320 యూనిట్లు మాత్రమే. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలైన చైనా (719), థాయ్‌లాండ్ (1162), బ్రెజిల్ (1783) విద్యుత్తు వినియోగంకన్నా ఇది ఎన్నోరెట్లు తక్కువ. భారతదేశంలోని ఇంధన వనరుల్లో 67 శాతం వాటా బొగ్గుదే. దేశంలో 20,200 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అంచనా. బొగ్గు తీయడంలో ఇప్పటికీ మెరుగైన ఫలితాలు సాధించకపోవడం ప్రతికూల పరిణామాలకు దారి తీస్తుంది. ఆస్ట్రేలియాతో పోల్చిచూస్తే అక్కడ ఒక్కో మనిషి భూగర్భంలోని బొగ్గును 11.9 టన్నులు, ఓపెన్ కాస్ట్ గనుల్లో 30.6 టన్నుల చొప్పున తీస్తుండగా భారత్‌లో ఒక షిఫ్ట్‌లో ఒక వ్యక్తి భూగర్భంలో 0.56 టన్నులు, ఓపెన్ కాస్ట్‌లో 4.35 టన్నుల చొప్పున మాత్రమే తీయగలుగుతున్నారు. రవాణా పరిస్థితిని పరిశీలిస్తే భారతదేశంలో ఇప్పటికే రెండు లక్షల పల్లెలకు సరయిన రహదారి సౌకర్యాల్లేవు. స్వాతంత్ర్యం లభించిన నాటి కన్నా పరిస్థితి మెరుగే గానీ యాభయ్యేళ్ల స్వపరిపాలనలో కూడా లక్షల జనావాసాలకు రహదారి సౌకర్యం కలుగజేయకపోవడం క్షంతవ్యం కాదు. మూడు లక్షల గ్రామాలకు టెలిఫోన్ వసతి లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో శాస్త్ర పరిశోధన, సహజ వనరుల అభివృద్ధి కోసం 1951లోనే ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన మొదటి దేశం భారత్ అయినప్పటికీ తగిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం వలన కృషి నత్తనడకన సాగింది. స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 0.73 శాతం మాత్రమే పరిశోధన, అభివృద్ధి రంగానికి వెచ్చిస్తున్నారు. నిరుద్యోగం, పేదరికం ఇంకా భారీ స్థాయిలో తాండవిస్తూనే ఉన్నాయి. ఇంజనీరింగ్, సైన్స్, వైద్యం, వ్యవసాయ రంగాల్లో 44 లక్షల మందికి పైగా గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లున్నారు. కోట్లాది ప్రజలకు పక్కా గృహాలు లేవు. ముంబాయి మహానగరంలో సగానికి సగం జనాభా మురికివాడల్లో దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారు. లక్షల పేద కుటుంబాలు పందుల పాకలకన్నా అధ్వాన్నంగా ఉండే గుడిసెల్లో తలదాచుకుంటున్నాయి. అసామాన్యమైన త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్వతంత్ర్య భారతదేశంలో స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా అందడం లేదన్నది నేటికీ కనిపిస్తున్న దృశ్యం. ధనిక – పేద వ్యత్యాసాలు మరింతగా పెరిగిపోతున్నాయి. ఇటువంటి భారతదేశం కోసమేనా వారు ఎనలేని త్యాగాలు చేసింది...? ఈ పరిస్థితి మారాలి. అందుకు అనుగుణమైన చర్యలు చేపట్టాలి. అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే సత్ఫలితాలు సాధ్యమవుతాయి. భారతదేశంలో ప్రకృతి ప్రసాదించిన

సహజ వనరులకు కొదవలేదు. మానవ వనరులూ పుష్కలం. భారత్‌తోపాటు స్వాతంత్ర్యం పొందిన దేశాలెన్నో అభివృద్ధి పథంలో ఎంతో ముందుకెళ్లాయి. మలేసియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, కొరియా తదితర దేశాల తీరు ఇందుకు దృష్టాంతం. రెండో ప్రపంచ యుద్ధంలో ఘోరంగా దెబ్బతిన్న జర్మనీ, జపాన్ అత్యంత సంపన్న దేశాలుగా రూపొందడం వాస్తవ చిత్రం. భారతదేశం ఒకప్పుడు పలు రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించింది. ఖగోళ, గణిత, అర్థ, వైద్య శాస్త్రాలలో తన ప్రత్యేకతను చూపించింది. చేతివృత్తుల్లో ప్రావీణ్యం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంది. సుదూర ప్రాంతాలకు నౌకా వాణిజ్యం నిర్వహించింది. బ్రిటిష్, పోర్చుగీస్ వారి పాలన కారణంగా దేశం ఎంతో నష్టపోయింది. పారిశ్రామిక యుగం ప్రారంభమైన తర్వాత ఇంగ్లాండ్‌లో తయారైన వస్త్రాలు, ఇతర వస్తువులను భారతదేశంలో అమ్మి విపరీత లాభాలనార్జించారు. భారత్ నుంచి ఎగుమతి చేసే వస్తువులపై విపరీత స్థాయిలో సుంకాలు విధించి, ఇంగ్లాండ్ నుంచి వచ్చేవాటిపై అతి కొద్దిగా పన్నులు వేసి ఇక్కడి చేతి వృత్తులను దెబ్బతీశారు. నైపుణ్యంగల పనివాళ్లందరూ వ్యవసాయ కార్మికులుగా పొట్టపోసుకోవలసిన దుస్థితి కల్పించారు. స్వతంత్ర్య భారతంలో యాభయ్యేళ్లనంతరం కూడా తిరిగి అప్పటి ఔన్నత్యాన్ని పొందలేకపోవడం బాధాకరం. హిట్లర్ దురాక్రమణ ఫలితంగా దెబ్బతిన్న యూరప్‌ను తిరిగి సాధారణ స్థితికి తెచ్చేందుకు అమెరికా 'మార్షల్ ప్లాన్'ను రూపొందించి ఆదుకుంది. యుద్ధంలో ధ్వంసమైన ఫ్యాక్టరీలను, రహదారులను, భవనాలను పునర్నిర్మించుకుని దేశాలను అభివృద్ధి చేసుకునేందుకు ఆయా దేశాల ప్రజలు దృఢ నిశ్చయంతో అంకితమయ్యారు. పునర్నిర్మాణ పనులకు ముందుగా అంచనా వేసిన మొత్తంలో సగమే సరిపోయింది. ప్రజల భాగస్వామ్యం వల్ల అది సాధ్యమయింది. జపాన్, జర్మనీ, కొరియా వంటి దేశాలు ప్రగతి పథంలో దూసుకుపోవడానికి కారణం అక్కడి ప్రజలు తమ దేశాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని భావించి ఆచరించడం. భారతదేశంలో పరిస్థితి వేరుగా ఉంది. ఈ దేశంలో కోట్లమంది వృథాగా కాలం గడిపేస్తున్నారు. పల్లెప్రాంతాల నుంచి పెద్దగ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు తరలివెళ్ళడం ఎక్కువైపోతోంది. చిన్న, పెద్ద రైతులు, వ్యవసాయ కార్మికులు ఇలా వలస పోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, వ్యవసాయాధార పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు నానాటికీ తగ్గుముఖం పడుతున్నాయి. ప్రజాధనం గ్రామీణాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలకు కాకుండా దుబారాగా ఖర్చవుతోంది. దేశంలో ఉత్పాదకత

తగినంతగా పెరగడం లేదు. వివిధ దేశాలతో పోల్చిచూస్తే భారత్ పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉంది. భారతదేశంలో ఉత్పాదకత తక్కువగా ఉండడంపై 1960లలోనే ప్రఖ్యాత ఆర్థికవేత్త గున్నార్ మిర్డాల్ హెచ్చరించారు. ఆయన సలహాను ఎవరూ పాటించలేదు. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు సంవత్సరంలో పనిచేస్తున్న గంటలతో పోల్చిచూస్తే భారతీయులు అందులో సగం గంటలే పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ ప్రజలు తక్కువ సమయమే కాకుండా, తక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. రాజకీయాల్లో ఉన్నవారితోసహా విద్యార్థులు అధ్యాపకులు, ఇంజనీర్లు, తదితర ఉద్యోగ వర్గాలవారు శక్తికొలది పనిచేయడం లేదని, తక్కువ జీవన ప్రమాణాలుకల కార్మికులు, కూలీలు పోషకాహార లోపంతో ఎక్కువ పనిచేయలేకపోతున్నారని మిర్డాల్ వివరించారు. కొద్దిమంది చేయాల్సిన పనిని ఎక్కువ మంది కలిసి చేస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే పని చేసే వారి ఉత్పాదక సామర్థ్యం పెరగాలని ఆయన సూచించారు. భారతదేశం అమలు చేస్తున్న ఆర్థిక ప్రణాళికల విజయం ప్రజలు మరింత మెరుగ్గా, ఎక్కువగా పనిచేస్తూ ఎక్కువ ఉత్పత్తి సాధించడంపై ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రచురించిన యాభయ్యేళ్ల భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పుస్తకంలో వివిధ రంగాలకు సంబంధించిన వివరాలు చూస్తే ఎంతో ఆందోళన కలుగుతోంది. వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో ఉత్పాదకత 1985 నుంచి 1994 నాటికల్లా సగానికి సగం క్షీణించింది. వివిధ దేశాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఎంతో ఆశావహంగా ఉంది. కార్మికుల ఉత్పాదక సామర్థ్యం ఎంతో ఎక్కువగా ఉంది. ఉత్పాదకత రీత్యా చూస్తే భారతదేశం వరిలో 84వ స్థానంలో, వేరుశెనగలో 72వ స్థానంలో, గోధుమలో 38వ స్థానంలో ఉంది. హెక్టారుకు వరి సగటు దిగుబడి విషయాన్ని పరిశీలిస్తే భారత్ చైనా దిగుబడిలో 40 శాతం మాత్రమే సాధించింది. భారత్‌లో 14 కోట్ల హెక్టార్లలో 19.8 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండిస్తుండగా, చైనాలో కేవలం పదికోట్ల హెక్టార్ల నుంచి దాదాపు 40 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండించగలుగుతున్నారు. ఈ విషయంలో భారత్ ఎంతో కృషి చేయాల్సి ఉంది. అందులో రైతులు, వ్యవసాయ కార్మికుల పాత్ర కీలకం. వ్యవసాయ రంగంలో ఇంకా ఎక్కువ భూమికి నీటి పారుదల సౌకర్యం విస్తరించాలి. నీటిని పొదుపుగా వాడుకుంటూ ఏడాదికి ఒక పంట కాకుండా రెండు, మూడు పంటలు పండించాలి.

రైతులు, వ్యవసాయ కార్మికులు కాలాన్ని వృథా చేయకుండా కష్టపడుతూ, ఆధునిక పరికరాలు, సాంకేతిక విజ్ఞానం సాయంతో ఉత్పాదకతను పెంచాలి. వ్యవసాయ పంటలు సీజనల్‌గా ఉంటాయి కాబట్టి పూర్తికాలం ఉపాధి, ఆదాయాల కోసం ఇతర వృత్తులు కూడా చేపట్టాలి. కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, చేపలు, రొయ్యల పెంపకం పట్ల ఆసక్తి చూపాలి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభించి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అలాగే ప్రజలకు పోషకాహారం లభించడం వల్ల ఆరోగ్యస్థితి మెరుగవుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రజల సోమరితనం విపరీత పరిమాణాలకు దారితీస్తోంది. వాస్తవ పరిస్థితులను గుర్తెరిగి ప్రజలు, ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా చైతన్యంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతగానో ఉంది. పారిశ్రామికంగా భారతదేశ పరిస్థితి బాధాకరమే. వస్తువుల ఉత్పత్తి రంగంలో అత్యంతాధునిక యంత్ర పరికరాలను వాడడమేగాకుండా, అధికస్థాయిలో ఉత్పాదకతను సాధించేందుకు అవసరమైన శిక్షణ పొందడం, పని గంటల్లో పూర్తి సామర్థ్యంతో పనిచేయడంవల్ల అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయి. ఇతర దేశాలు భారత్‌కన్నా వేగంగా ప్రగతి సాధించడానికి కారణమిదే.

## సమిష్టిగా సాధించాల్సిన లక్ష్యం

భారత్ గత శతాబ్దంలో శాస్త్ర, విజ్ఞాన సాంకేతిక రంగాల్లో గణనీయంగా ముందుకెళ్లినా, ఇతర దేశాలవలె ప్రగతి సాధించకపోవడానికి ప్రజల భాగస్వామ్య లోపమే కారణమన్నది స్పష్టం. జపాన్‌లో, కొరియాలో పని గంటల సమయంలో ఎంతో బాధ్యతతో విధులు నిర్వర్తిస్తారు. సమయాన్ని ఏ మాత్రం వృథా చేయరు. భారతదేశంలో పరిస్థితి వేరు. ప్రభుత్వ కార్యాలయాల్లో గానీ, పరిశ్రమల్లోగానీ నిర్ణీత సమయం నిజాయితీగా పనిచేసే వారు స్వల్పం. అందుకే ఇతర దేశాలకన్నా భారత్ అనేక అంశాల్లో వెనుకబడిపోతోంది. హక్కులు, బాధ్యతల విషయంలో సమదృష్టి అలవరచుకుని అందరూ సమష్టిగా అంకిత భావంతో కృషిచేస్తే అద్భుత ఫలితాలు సాధ్యమే. జపాన్‌లో కార్మికులు సాధారణంగా సమ్మెచేయరు. మేనేజిమెంటుతో అంగీకారం కుదరని పక్షంలో అనివార్యంగా నిరసన తెలపాల్సివస్తే అధికోత్పత్తితో భయపెడతారు. స్వాతంత్ర్య స్వర్ణోత్సవ వేళ అందరూ ఆత్మావలోకనం చేసుకుని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలి. ఉత్పాదకత పెంపుదల కోసం ప్రజలు, ప్రభుత్వం

సమిష్టిగా కృషి చేయాలి. ఉత్పాదకత విషయంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రచారోద్యమం చేపట్టాలి ఉత్పాదకత పెంచాల్సిన అవసరాన్ని కరపత్రాలు, ఆడియో వీడియో క్యాసెట్ల ద్వారా వివరించాలి. రైతులు, కార్మికులు, చేతి వృత్తులవారు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు యావన్మందీ ఒళ్లు దాచుకోకుండా పరిశ్రమించినప్పుడు దేశం సౌభాగ్యవంతమవుతుంది. ప్రజలందరి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.

*ది. 14-09-1997.* — *ఈనాడు*

●

# అన్నదాతకు ఆత్మవిశ్వాసం కల్పించే చర్యలు ముఖ్యం

అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ అన్నం పెట్టే రైతన్నలు నిస్సహాయ స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడడం నిజంగా శోచనీయం. కరవు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాలతో తరచు కష్టనష్టాల పాలయ్యే అన్నదాతలకు ఏ రకంగానూ సరయిన అండ లభించడం లేదు. పెట్టుబడికి, శ్రమకు తగిన ప్రతిఫలం లేక అల్లాడిపోయే రైతులను చీడపీడలు, నకిలీ మందులు, అప్పుల బాధలు మరింతగా తోడేస్తున్నాయి. స్వాతంత్ర్యం లభించి యాభయ్యేళ్లయిందని స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్న సంవత్సరంలో దాదాపు రెండొందల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడంకన్న బాధాకరమైన అంశం మరొకటి ఉండదు. ప్రభుత్వంతోపాటు యావత్తు సమాజం స్పందించి కర్షకులకు అండగా నిలబడాల్సిన సమయమిది. దేశానికి వెన్నెముక అని భావించిన రైతు ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిది. సమాజంలోని భిన్నవర్గాలు సంఘటితంగా తమ డిమాండ్లను సాధించుకుంటుంటే నిత్యకృషీవలురు మాత్రం నోట్లో నాలుక లేకుండా నీరసపడిపోయి తమ దౌర్భాగ్యాన్ని నిందించుకుంటూ నిండు ప్రాణాలు తీసుకుంటున్నారు. కుటుంబాలు అనాథలుగా మిగులుతున్నాయి. పురుగుమందులే రైతుకు పెరుగన్నమవుతున్న దుస్థితికి బాధ్యత వహించాల్సిందెవరు? పురుగులను చంపలేని మందులు మనుషులను బలిగొంటున్న విచిత్ర విషాదకర పరిస్థితిలో నిందలు, పరస్పరారోపణల కన్నా తక్షణ కర్తవ్యమేమిటో గుర్తెరిగి వ్యవహరించడం విజ్ఞత అనిపించుకుంటుంది. ఉరిపోసుకుంటున్న అన్నదాతల ఉసురు తగలకుండా ఉండాలంటే అందరూ సమస్య తీవ్రతను గుర్తెరిగి నివారణ చర్యల్లో పాలుపంచుకోవాలి. రైతు నాశనం దేశానికి శ్రేయస్కరం కాదు. వ్యవసాయం పట్ల వైముఖ్యం పెరిగితే ఫలితాలు దారుణంగా ఉంటాయన్నది వాస్తవం. కీలకమైన

వ్యవసాయరంగం దెబ్బ తినకుండా ప్రభుత్వాలు సమగ్రచర్యలు చేపట్టాలి. రైతులకు సముచిత స్థాయిలో రుణ సౌకర్యం కల్పించాలి. నాణ్యతలేని మందుల ఉత్పత్తిని అరికట్టాలి. పంటల బీమా పథకాన్ని ఆచరణాత్మకంగా సద్వినియోగమయ్యేలా సవరించాలి.

## అన్ని విధాలా వంచన

ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా రాష్ట్రంలో రైతులు భారీ స్థాయిలో నష్టపోతున్నారు. ఉదాహరణకు 1990 మే తుపాను వ్యవసాయరంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అప్పుడు రూ. 325 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం అంచనా వేసింది. 1996 అక్టోబరులో అధిక వర్షాలు, వరదల వల్ల రూ. 320 కోట్ల నష్టం సంభవించింది. 1996 నవంబరు 6, 7 తేదీలనాటి పెను తుపాను కారణంగా వ్యవసాయరంగానికి రూ. 396 కోట్ల మేర నష్టం కలిగింది. తూర్పు గోదావరి జిల్లాలో 29,100 హెక్టార్లలో, పశ్చిమ గోదావరి జిల్లాలో 900 హెక్టార్లలో కొబ్బరితోటలు ధ్వంసం కావడం వల్ల రూ. 4,136 కోట్ల ఆస్తినష్టం సంభవించినట్టు అంచనా. వ్యవసాయ భూములే కాకుండా రహదార్లు, పంటకాల్వలు, నివాస ప్రాంతాలు దెబ్బతినటంవల్ల జరిగిన నష్టం మరిన్ని వందల కోట్లలో ఉంటుందన్నది సుస్పష్టం. వర్షాలు సకాలంలో కురియకపోవడం, ఊహించని సమయంలో పడడం మూలంగా విపరిణామాలు సంభవిస్తున్నాయి. పత్తి, ఇతర పంటలకు హాని కలుగజేసే కీటకాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. తెలంగాణా జిల్లాల్లో పత్తి, కంది తదితర పంటలు లక్షల హెక్టార్లలో దెబ్బ తినడంవల్ల రైతులు వందల కోట్ల రూపాయలు నష్టపోయారు. సకాలంలో వర్షాలు కురియకపోవడం వల్ల వివిధ ప్రాంతాల్లో రైతులు అతలాకుతలమవుతున్నారు. ఆర్థిక సమస్యలతో తల్లడిల్లిపోతున్నారు. అప్పుల భారాన్ని తట్టుకోలేకపోతున్నారు. సహకార బ్యాంకులు సరిపడే విధంగా పరపతి సౌకర్యం కల్పించకపోవడం, జాతీయ బ్యాంకులు వ్యవసాయరంగానికి కనీసంగా ఇవ్వాల్సిన 18 శాతం రుణ కోటాపై కూడా శ్రద్ధ వహించకపోవడం పరిస్థితి తీవ్రతకు ప్రధాన కారణమని భావించవచ్చు. రైతులు గత్యంతరంలేని స్థితిలో ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల నుంచి ఎక్కువ వడ్డీరేట్లకు అప్పులు తీసుకొని సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు గిట్టుబాటు కాకపోవడంవల్ల నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు.

అలాంటి స్థితిలో సమస్యల తీవ్రత భరించలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాల విషయంలో ఇది వరకటి ప్రభుత్వాల కన్న ఎక్కువ బాధ్యతగానే స్పందించింది. ఆత్మహత్యల పరంపర కొనసాగడం విచారకరం. రైతులు ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధపడాలి. అవసరమైన చర్యలు, ఏర్పాట్ల విషయంలో సంఘటితంగా డిమాండ్లు సాధించుకోవాలి. ఆత్మహత్యల వల్ల సమస్యలు పరిష్కారం కావని గుర్తెరగాలి. కర్నాటక రాష్ట్రంలో కూడా రైతుల ఆత్మహత్యల సంఘటనలు జరిగాయి. రైతులు ఆత్మహత్యలకు పాల్పడడానికి దారితీసిన కారణాలను తెలుసుకునేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని నియమించింది. ఇలాంటి అవాంఛనీయ, విషాదకర పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా పురుగు మందుల నాణ్యత లోపాన్ని అరికట్టే విషయంలో సమర్థంగా వ్యవహరించాలి. నిజాయితీ పరులైన, నిబద్ధతగల అధికారులను ప్రభుత్వ యంత్రాంగంలో కీలక స్థానాలలో నియమించాలి. పురుగు మందుల నాణ్యత ప్రమాణాలను పరీక్షించే లేబరేటరీల సంఖ్యను పెంచాలి. కల్తీ పురుగు మందులను నిరోధించేందుకు కఠిన చర్యలు చేపట్టాలి. అందుకోసం అవసరమైన మేరకు చట్టాలను సవరించాలి. నాణ్యత లోపించిన పురుగు మందులవల్ల ఫలితం ఉండడం లేదు. డబ్బు వృథా అవుతంది. పురుగువల్ల పంట నష్టం తప్పదు. పురుగు నివారణకు ఉపయోగపడాల్సిన మందుల ఉత్పత్తిలో ఈ నిర్లక్ష్యం జాతిపట్ల ద్రోహం. తీవ్రమైన శిక్షలు పడితే తప్ప అలాంటి స్వార్థబుద్ధి అంతంకాదు. అప్పోసప్పో చేసి పంటలమీదే ఆశలన్నీ పెట్టుకున్న రైతున్నను ఈ విధంగా వంచించడం క్షమార్హం కాదు. ఏ కొందరినో మినహాయిస్తే చాలామంది రైతులు పంటల కోసం అప్పులు చేయాల్సిందే. ఈ విషయంలో బ్యాంకుల పాత్ర ఏ మాత్రం ప్రోత్సాహకరంగా లేదు. సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమయ్యాక వ్యవసాయం వంటి ప్రాధాన్య రంగాలకు రుణ సౌకర్యం బాగా తగ్గిపోయింది. బ్యాంకులను జాతీయం చేయడంవల్ల రైతులు, బలహీనవర్గాలకు అద్భుత ప్రయోజనాలు చేకూరుతాయనుకున్న ఆశలు అడియాసలే అయ్యాయి. 1996 నాటికి మొత్తం బ్యాంకుల రుణపరపతిలో వ్యవసాయరంగం వాటా కేవలం 12 శాతం. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో నాబార్డు ఈక్విటిని రూ. 500 కోట్ల నుంచి రూ.1500 కోట్లకు పెంచాలని, అయిదేళ్లలోనే వ్యవసాయరంగ రుణపరపతిని రెట్టింపు చేయాలని నిర్ణయించారు. సహకార బ్యాంకుల పట్ల కేంద్రప్రభుత్వ దృక్పథం మారితేనే గ్రామీణ ప్రాంతాల పరపతి అవసరాలు ఓ మేరకు నెరవేరతాయని

భావించవచ్చు వాస్తవానికి రైతుకు అవసరమైన పెట్టుబడిలో 80 శాతాన్ని పంట రుణంగా అందించాలి. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు వందలకోట్ల రూపాయలు ఎగవేస్తున్నా జాతీయబ్యాంకులు ఏమీ చేయడంలేదు. వాటిని ప్రభుత్వం ఆదుకొంటూనే ఉంది. సహకారబ్యాంకుల పట్ల మాత్రం వివక్షణ కొనసాగుతోంది. ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. రైతులలో నూటికి ఎనభైమంది సన్నకారు. చిన్నకారే. ఆర్థికస్తోమత, పలుకుబడి ఎక్కువ ఉండని వీరికి బ్యాంకుల్లో రుణాలు లభించవు. దాంతో ప్రైవేటు కంపెనీలు, వడ్డీవ్యాపారుల నుంచి ఎక్కువ రేటుకు అప్పులు తీసుకుని వాటిని సరిగ్గా తీర్చలేక ఆ ఊబిలోనే కూరుకుపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్లనో, చీడపీడల వల్లనో, రైతులకు తీవ్రనష్టం వాటిల్లినా, ప్రభుత్వం పరంగా లభించే సాయం బహుస్వల్పం. కొన్ని సందర్భాలలో రుణాల వసూళ్లు వాయిదావేసి తరువాతి పంటకు రుణం అందిస్తూంటుంది. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి హెక్టారుకు రూ. 625 చొప్పున మాత్రమే సహాయం లభిస్తుంది. లోగడ తుపానులు, వరదల వల్ల నష్టం సంభవించినప్పుడు ఇదే మాదిరిగా ఎకరాకు రూ. 250 చొప్పున సహాయం లభించింది. ఇటీవల తెలంగాణాలో పత్తి, కంది రైతుల ఆత్మహత్యల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. చీడపీడల వలన పంటలకు జరిగిన నష్టాన్ని కూడా వైపరీత్యాల కిందికే లెక్కగట్టేలా చేసి దాదాపు రూ. 42 కోట్ల సహాయాన్ని రాబట్టింది. పంట కోల్పోయిన రైతులకు హెక్టారుకు రూ. 1250 చొప్పున అందించారు. వాస్తవంగా రైతులు నష్టపోయిన మొత్తంతో పోలిస్తే వారికి అందిన సాయం స్వల్పమే. తదుపరి పంట వేసుకునేందుకు ఈ సాయం కొంతమేర ఉపయోగపడుతుంది. వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినపుడు రైతులను నిజంగా ఆదుకోగలిగింది సరయిన పంటల బీమా పథకం మాత్రమే. ఇపుడున్న సమగ్ర పంటల బీమా పథకం రైతులకు పరిపూర్ణంగా ఆదుకునేదిగా లేదు. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నవారికే వర్తించడం, మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం, కొన్ని పంటలకు మాత్రమే వర్తింపజేయడం వంటి లోపాలపై పలు విమర్శలు, సూచనలొచ్చాయి. దాంతో 1985 నాటి సమగ్రపంటల బీమాపథకాన్ని సవరించి మెరుగైన పథకాన్ని ప్రవేశపెడతామని 1991లో నాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు ప్రకటించారు. ఆ పథకం ఆచరణ రూపం ధరించలేదు. 1997 నవంబరు 6న యునైటెడ్‌ఫ్రంట్ ప్రభుత్వం "ప్రయోగాత్మక పంటల బీమా పథ"కాన్ని ఆమోదించింది. 1997-98 సీజను నుంచి ఈ పథకం అమలవుతోందని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం,

మహబూబ్‌నగర్ జిల్లాలుసహా వివిధరాష్ట్రాల్లోని 22 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రయోగాత్మక పంటలబీమా పథకం కిందకు వచ్చే సన్నకారు, చిన్నరైతుల ఇన్సూరెన్సు ప్రీమియం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు 2:1 నిష్పత్తిలో భరిస్తాయి. ఇతరులేమో ఆహారధాన్యాల పంటలకైతే బ్యాంకు లోనులో 2 శాతం, పప్పుధాన్యాలు, నూనె గింజలకైతే ఒకటి శాతం ప్రీమియం చెల్లించాలి.

## ఆశలు చిగురిస్తేనే మనుగడ

సమగ్ర పంటల బీమా పథకం (సి.సి.ఐ.ఎస్) కంటె 'ప్రయోగాత్మక పంటల బీమా పథకం' (ఇ.సి.ఐ.ఎస్) కొన్ని విషయాలలో మెరుగ్గా ఉంది. మండలానికి బదులు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడం; లోను తోసుకోని సన్నకారు, చిన్న రైతులను కూడా పథకం పరిధిలోకి చేర్చడం సముచితం. సమగ్ర పంటల బీమా పథకం కొనసాగే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పథకం కింద 1989-90 రబీనాటికి రూ. 90 కోట్ల మేర ప్రీమియం జమ కాగా నష్టపరిహారంగా చెల్లించిన మొత్తం రూ. 612 కోట్లు. అంటే దాదాపు ఏడు రెట్లు! ప్రీమియం చెల్లించకుండానే నష్టపరిహారం పొందడం అశాస్త్రీయం. సన్నకారు, చిన్నరైతుల ఆర్థిక స్తోమత తక్కువ కాబట్టి ప్రీమియంలో కొంత సబ్సిడీ ఇవ్వడం సముచితం. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలలో మూడు శాతం నుంచి తొమ్మిది శాతం మంది మాత్రమే వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండగా వారి శ్రేయం కోసం అక్కడి ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీలిస్తున్నాయి. నూటికి 66 మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న భారత్‌లో రైతాంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉంటుందన్న వాస్తవాన్ని మరచిపోరాదు. ప్రకృతి వైపరీత్యాలవల్ల, చీడపీడలవల్ల దెబ్బతిన్న రైతాంగానికి నష్టపరిహారం పేరుతో నామమాత్ర సహాయం అందించే పద్ధతి కాకుండా సరయిన పంటల బీమా పథకాన్ని సమర్థంగా అమలుచేయడం అవసరం. ఏయే ప్రాంతాలలో ఎలాంటి పంటలు వేయడం ప్రయోజనకరమో రైతులకు అర్థమయ్యేలా వివరించాలి. వ్యవసాయ విస్తరణ కృషిలో అభ్యుదయ రైతులతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తమవంతు పాత్ర నిర్వహించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుత పరిస్థితిని వెంటనే సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటేనే తప్ప నిస్పృహలో ఉన్న రైతాంగంలో విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, భవిష్యత్తుపట్ల ఆశను చిగురింపజేయడం సాధ్యంకాదు.

*ది. 20-03-1998.* — ***ఈనాడు***

●

# ఉత్పత్తుల మెరుగుదలకు మేలైన విధానం!

## సమగ్ర సస్యరక్షణ తక్షణావసరం

సస్య విప్లవం భారతదేశంలో ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని ప్రోత్సహించింది. అధిక దిగుబడి వంగడాలను సాగుచేసి రైతులు ఉత్పత్తులను గణనీయంగా పెంచారు. అభివృద్ధి చెందిన దేశాలలో వలె భారత రైతులూ ఎరువులు, పురుగు మందులను విరివిగా వాడుతున్నారు. వీటి వాడకం ఉన్నా చీడ పీడల వల్ల ఏటా దాదాపు 37 శాతం పంట నష్టం జరుగుతున్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి. సస్య విప్లవానికి ముందు కూడా దాదాపు ఇదే స్థాయిలో పంట నష్టం ఉండేది. మొదటి పంచవర్ష ప్రణాళికలో సుమారు 60 లక్షల ఎకరాలకు పరిమితమైన పురుగు మందుల వాడకం ఏడో పంచవర్ష ప్రణాళిక నాటికి 34 కోట్ల ఎకరాలకు విస్తరించింది. మొదటి పంచవర్ష ప్రణాళిక సమయంలో 2,350 మెట్రిక్ టన్నుల 'టెక్నికల్ గ్రేడ్ పెస్టిసైడ్స్' వాడితే ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక నాటికి ఆ మొత్తం లక్ష మెట్రిక్ టన్నులకు పెరిగింది. పురుగు మందులను విచక్షణ రహితంగా వాడినందువల్ల రైతులకు మేలు చేసే ప్రకృతి ప్రసాదిత కీటకాలు కూడా నాశనమవుతున్నాయి. చీడ పీడలు తరచు పంటలకు సోకడం, పంటలకు హాని చేసే కీటకాలలో నిరోధక శక్తి పెరగడం, పంటపొలాలలోను పంటల మీద పురుగు మందుల అవశేషాలు మిగలడం, భూసారం దెబ్బతినడం వంటి వ్యతిరేక ఫలితాలు వస్తున్నాయి. ఫలితంగా పర్యావరణ సమతౌల్యానికీ హాని కలుగుతోంది. భారతదేశంలో పండిస్తున్న కూరగాయలు, పండ్లలో, ఉత్పత్తి అవుతున్న పాలలో పురుగు మందుల అవశేషాల స్థాయి ప్రపంచంలో కెల్ల ఎక్కువగా ఉంది. ఈ అవశేషాలు మనుషుల అనారోగ్యానికి కారణమవుతాయి. కృష్ణా, ఉభయగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో జరిపిన ఒక పరిశోధనలో స్త్రీల స్తన్యంలోనూ వీటి అవశేషాలు ఉన్నట్లు వెల్లడయింది. వరిగడ్డి పైన, గోధుమ గడ్డి పైన అవశేషాలు పశువుల ఆరోగ్యానికి చెరుపు తెచ్చి పారుదువ్యాధికి కారణమవుతున్నాయి.

## 'మిత్రులను' దూరం చేసుకుంటున్న తీరు

పంటలకు హాని చేసే కీటకాలను తినే కీటకాలు కూడా ప్రకృతిలో ఉన్నాయి. ఇవి రైతులకు మేలు చేసే కీటకాలు. పురుగు మందులను ఒక మోతాదుకు మించి వాడితే రైతుకు మేలు చేసే కీటకాలు కూడా చనిపోతాయి. హాని చేసే కీటకాలు మాత్రం క్రక్రమంగా మందు ప్రభావాన్ని నిరోధించగల శక్తిని పెంచుకుని తామరతంపరగా వృద్ధి చెంది పంటలను విపరీతంగా దెబ్బతీస్తున్నాయి. శీతోష్ణ పరిస్థితులు, వర్షాలు చీడపీడల వృద్ధికి అనుకూలంగా ఉన్నప్పుడు వాటి విజృంభణ గురించి యిక చెప్పనవసరం లేదు. దాదాపు ఒక దశాబ్దం క్రితం తెల్ల దోమ, శనగపచ్చ పురుగు - గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పెద్ద ఎత్తున పత్తి పంటకు నష్టాన్ని కలిగించాయి. గత సంవత్సరం తెలంగాణా జిల్లాలోను పత్తిపంట చీడపీడల బారిన పడింది. ఈ సందర్భాలలో రైతుల ఆత్మహత్యలు అందరికీ విదితమే. పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల భూమి పైపొరలలో ఉండే వానపాములు; ఇతర సూక్ష్మక్రిములు మరణిస్తాయి. చాలా మంది రైతులు ఒక విషయాన్ని గమనించడం లేదు. ఇనుము, రాగి వలె భూమి జడ పదార్థం కాదు. భూమిపైన మన్నులో అనేక సూక్ష్మక్రిములు (మైక్రో ఆర్గానిజమ్స్) ఉంటాయి. ఇవి పంటకు మేలు చేస్తాయి. వానపాములు మన్ను, సన్నని రాయి ఆకులు, ఇతర వ్యర్థ పదార్థాలను తింటాయి. వాటి విసర్జితం మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. వానపాములు భూమిని గుల్లగా తయారుచేస్తాయి. అందువల్ల వాననీరు భూమిలోకి సులభంగా ఇంకి మొక్కలకు ఎక్కువ తేమ లభిస్తుంది. భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల రైతు మిత్రులైన వానపాములు నశించి కనిపించని నష్టం వాటిల్లుతుంది. నేటికీ 60 శాతం ప్రజలు (దాదాపు తొమ్మిది కోట్ల కుటుంబాలు) వ్యవసాయం పైనే ఆధారపడిన దేశంలో, ఈ జీవన విధానం కలకాలం నిలబడాలంటే ఇప్పుడు అనుసరిస్తున్న పద్ధతులు మారాలి. తప్పని సరి అయితేనే పురుగు మందులు వాడాలి. ప్రకృతిలో రైతుకు మేలు చేసే కీటకాలు మరింత వృద్ధి అయ్యేలా చూడాలి. కనీసం అవి నాశనం కాకుండా కాపాడాలి. పంటలకు మేలుచేసే కీటకా లేవో, కీడు చేసే కీటకాలేవో శాస్త్రవేత్తలకు స్పష్టమన అవగాహన ఉంది. రైతులకు మేలు చేసే కీటకాలను వృద్ధి చేసేందుకు ప్రయోగశాలలు, ఉత్పత్తి కేంద్రాలు విరివిగా నెలకొల్పడం అభిలషణీయం. వేప, మరికొన్ని చెట్ల ఆకులు, బెరడు, రసం బయోపెస్టిసైడ్స్‌గా వాడటం

ద్వారా కొంతమేరకు పంటలను కాపాడుకోవచ్చు. బయోపెస్టిసైడ్స్ చల్లడం వల్ల ఆ వాసన గిట్టని కీటకాలు పంటపై సోకవు. ఈ పద్ధతులు అనుసరిస్తూ అవసరమైనప్పుడు తక్కువ మోతాదులో రసాయనిక పురుగు మందులు వాడటం శ్రేయస్కరం. రైతులకు ఈ విషయాన్ని అర్థమయ్యేలా తెలియజెప్పి వ్యవసాయ రంగాన్ని పదికాలాల పాటు రక్షించుకోవాలి.

## ఫిలిప్పీన్స్ అనుభవాలు

మన దేశంలో వలెనే ఫిలిప్పీన్స్, మలేషియా, మరికొన్ని దేశాల రైతులు పురుగు మందులను అధికంగా వాడి నష్టపోయారు. ఈ రకమైన దుష్ఫలితాలను నివారించేందుకు ప్రపంచ ఆహార సంస్థ 1980 నుంచి సమగ్ర సస్యరక్షణ కార్యక్రమం (ఐ.పి.ఎం.) ప్రారింభించింది. తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఏడు దేశాలలో ఇండియా ఒకటి. వాతావరణ కాలుష్యాన్ని వీలైనంతవరకు తగ్గించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, అవసరానికి మించి పురుగుమందులు వాడటాన్ని నిరుత్సాహపరచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు. ఇండొనేషియా ఈ కార్యక్రమాన్ని అమలు చేసి వరి పంటలో నష్టాన్ని బాగా తగ్గించుకోగలిగింది. ఇండొనేషియా 1970 దశకంలో అధిక దిగుబడి వరివంగడాలను ప్రోత్సహించింది. ఈ క్రమంలో రైతులు పురుగు మందులను అధికంగా వినియోగించారు. ఫలితంగా 1977లో బ్రౌన్ ప్లాంట్ హాపర్ (బి.హెచ్.పి.) కీటకాలు బాగా పెరిగిపోయి దాదాపు ఏడు లక్షల హెక్టార్లలో వరిపంట నాశనమయింది. 1980లో ఈ కీటకాన్ని తట్టుకునే వరివంగడాన్ని రూపొందించినా, పురుగుమందులను ఎక్కువ మోతాదులో వాడటం వల్ల మళ్ళీ పరిస్థితి మొదటికి వచ్చింది. ఈ పరిస్థితులలో ఇండొనేషియా ప్రభుత్వం సమగ్ర సస్యరక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. 1986 తరవాత పురుగు మందులలో 57 రకాలను నిషేధించింది. పురుగుమందులపై సబ్సిడీలు ఉపసంహరించడం, వాటిని నిషేధించడం వల్ల ఒనగూడిన ప్రయోజనాల కన్నా సమగ్ర సస్యరక్షణ కార్యక్రమంలో రైతులను భాగస్వాములుగా చేయడం వల్ల మెరుగైన ఫలితాలు చేకూరాయి. వరిపంట సాగులో వివిధ దశలు, ప్రకృతిలో ఉన్న కీటకాలు వరిపంటకు– మేలు చేసేవేవి, హాని చేసేవేవి మొదలైన అంశాలను రైతులకు వివరించారు. నోటిమాటగా చెప్పడమే కాకుండా సమగ్ర సస్యరక్షణ విధానంలో సాగువుతున్న వరి పొలాలను చూపి ఎంపిక చేసిన రైతులతో ఆ విధానంలోనే సాగు చేయించారు.

లక్షలాది రైతులను ఈ విధానంలో భాగ స్వాములు చేసినందున వరిపంటపైన పురుగుమందుల వాడకం 1992 నాటికి సగానికి సగం తగ్గిపోయింది. పురుగు మందుల కొనుగోలుకు రైతులు వెచ్చిస్తున్న మొత్తంలో, తద్వారా ఉత్పత్తి వ్యయంలో తగ్గుదల సాధ్యమయింది. దిగుబడులు మాత్రం తగ్గలేదు. మలేషియా ఆయిల్‌పామ్ తోటలలో, కూరగాయల క్షేత్రాలలో అమలు చేసిన సస్యరక్షణ కార్యక్రమం కూడా సత్ఫలితాలు సాధించింది. వాస్తవానికి సమగ్ర సస్యరక్షణ అంశంలో నాలుగు దశాబ్దాలుగా కృషి జరుగుతున్నా 1980లో ప్రపంచ ఆరోగ్య సంస్థ తోడ్పాటు అందించిన తరువాతే కార్యక్రమ విశిష్టత, ప్రయోజనాలు ప్రచారంలోకి వచ్చాయి. సమగ్ర సస్యరక్షణకు ఒక ప్రత్యేక విధానమంటూ ఏదీ లేదు. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క పంటకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సస్యరక్షణ వ్యూహాన్ని రూపొందించుకోవాలి. ఇందులో రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పరిశోధకులు, ప్రభుత్వ విధానకర్తలు అందరూ సమిష్టిగా పాల్గొన్నప్పుడే అద్భుత ఫలితాలు చేకూరుతాయి. భారతదేశంలో – పురుగు మందులలో 54 శాతం పత్తిపంట మీద, 17శాతం వరిసాగులోను, 13శాతం కూరగాయల పెంపకంలోను వినియోగమవుతున్నట్లు అంచనా. ఈ పంటల సమగ్ర సస్యరక్షణపైన ప్రభుత్వం దృష్టి నిలిపింది. 1994లో రైతుల కోసం 844 'ఫీల్డ్ స్కూల్స్' నెలకొల్పారు. 3934 మంది వ్యవసాయ శాఖాధికారులు, 25 వేలమంది రైతులు వీటిలో శిక్షణ పొందారని అంచనా శిక్షణ కాలంలో 70 శాతం సమయం పొలాలలో తర్ఫీదుకు, 30 శాతం సమయం బృందాల వారీ చర్చలకు కేటాయిస్తారు. శిక్షణ పొంది నైపుణ్యం సంపాదించిన వారు– వారి వారి రాష్ట్రాలలో వ్యవసాయ విస్తరణాధికారులకు, రైతులకు శిక్షణ ఇచ్చే 'మాస్టర్ ట్రైనర్స్'గా పనిచేస్తారు. 1994–95లో 175 మంది వరిపంట విషయాల్లోను, 98 మంది పత్తిపంటకు సంబంధించి శిక్షణ ముగించుకున్నారు. రైతులు ఏ గ్రామాలలో అధిక స్థాయిలో పురుగుమందులు వాడుతున్నారో గుర్తించి నిపుణులు ఆయా గ్రామాలలో ఫీల్డ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. వరి రైతులకు శిక్షణ ఇచ్చేందుకు నెలకొల్పిన 688 ఫీల్డ్ స్కూళ్ళలో సేకరించిన సమాచారం ప్రకారం పురుగుమందుల వినియోగం 50 శాతం తగ్గిందని, దిగుబడులు 34 శాతం పెరిగాయని వెల్లడయింది. 156 పత్తిరైతుల ఫీల్డ్ స్కూళ్ల పరిధిలో సేకరించిన వివరాల ప్రకారం పురుగుమందుల వాడకం 30 నుంచి 50 శాతం తగ్గిందని, సమగ్ర సస్యరక్షణ పాటించని క్షేత్రాలతో పోలిస్తే దిగుబడులు 20 నుంచి 26 శాతం మేర పెరిగాయని రుజువయింది.

## రైతుల భాగస్వామ్యం విస్తృతం కావాలి

సమగ్ర సస్యయరక్షణ కార్యక్రమంలో రైతులు విస్తృతంగా భాగస్వాములైతే పంట విధానం, మెలకువలపై అవగాహన పెరుగుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సస్యరక్షణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి భారీగా నిధులు కేటాయించాలి. పురుగుమందుల వాడకం ఎక్కువగా ఉన్న ప్రాంత్రాలలో మండలానికి ఒకటైనా ఫీల్డ్ స్కూల్ ఏర్పాటు చేయాలి. సరైన ప్రచారం ద్వారా వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు సస్యరక్షణ కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలి. దీర్ఘకాలిక ప్రయోజనాలపై రైతులకు నమ్మకం కలిగించాలి. పంజాబ్‌లోని లూథియానా జిల్లాలో 1995 సంవత్సరాంతంలో 10 గ్రామాలు సమగ్ర సస్యరక్షణ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ కార్యక్రమం అమలులో లేని గ్రామాలలో మూడు విడతలు పురుగు మందు స్ప్రే చేస్తే, కార్యక్రమం అమలులో ఉన్న గ్రామాలలో ఒకే విడత మందు చల్లారు - కొందరు రైతులు అసలు ఏమందూ వాడలేదు. అయినా కార్యక్రమం అమలులో ఉన్న చోట్ల దిగుబడి తగ్గలేదు - పైగా పెరిగింది. సస్యరక్షణ అమలులో ఉన్న గ్రామాల్లో హెక్టారుకు 62.5 క్వింటాళ్ల దిగుబడి వస్తే, అమలులో లేని గ్రామాలలో 52.8 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. సస్యరక్షణ కార్యక్రమం అమలులో ఉన్న గ్రామాల రైతులు హెక్టారుకు రూ. 364 పురుగుమందులను వినియోగిస్తే, మిగతా రైతులు రూ. 1063 ఖర్చుచేశారు. ఈ విధంగా రైతులు రూ. 700 ఆదా చేసుకోవడమేగాక పది క్వింటాళ్ళ ధాన్యాన్ని అధికంగా పొందారు. పర్యావరణ సమతుల్యంతో బాటు రాబోయే తరాలకు సారవంతమైన నేలను అందించాలంటే సమగ్ర సస్యరక్షణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా రైతులోకంలోకి తీసుకెళ్ళడం అవసరం.

*ది. 25-08-1998.* — *- ఈనాడు*

●

# వనరులెన్ని ఉన్నా సమగ్ర విధానమే కరవు

## వ్యవసాయ విధానంపై పసలేని ముసాయిదా

"రైతే దేశానికి వెన్నెముక." ఈ దేశంలో ఇది ఇప్పటికీ నినాదప్రాయమే. ఇన్నేళ్ల భారతంలో తిండిపెట్టే రైతన్న స్థితి మెరుగయ్యిందే లేదు దిగజారడం తప్ప. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా సమగ్ర వ్యవసాయ విధానమంటూ లేకపోవడమే దుస్థితికి నిలువుటద్దం. రెండున్నరేళ్ల కిందట ప్రవేశపెట్టి, ఆ తరువాత సవరించిన వ్యవసాయ విధాన ముసాయిదాను పార్లమెంటు ఉభయసభలు ఇటీవల చర్చించాయి. స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా రూపొందించిన ఈ ముసాయిదా పత్రం అత్యంత పేలవంగా ఉంది. అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికీ భారత వ్యవసాయరంగం తగిన ప్రగతిని ఎందుకు సాధించలేకపోయిందో ఆ పత్రంలో వివరించలేదు. భవిష్యత్తులో చేపట్టాల్సిన నిర్దిష్ట కార్యక్రమాలను కూడా సూచించలేదు. పత్రాన్ని పరిశీలించిన పార్లమెంటరీ వ్యవసాయ స్థాయీ సంఘం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ తగిన శ్రద్ధ తీసుకుని పత్రాన్ని తిరిగి రూపొందించాలని సంఘం కోరింది. దీనివల్ల అర్థం చేసుకోవచ్చు ఆ విధాన పత్రం ఏ స్థాయిలో ఉందో వ్యవసాయరంగ సవాళ్లను అధిగమించడానికి అవసరమైన వ్యూహం గురించి పత్రం వివరించలేదని స్థాయీసంఘం అభిప్రాయపడింది. ప్రాముఖ్యం కల అనేక అంశాలను చర్చించలేదని, మొత్తంగా వ్యవసాయరంగ అభివృద్ధి కోసం అనుసరించాల్సిన చర్యలను సూచించలేదని పేర్కొంది. భారతదేశం స్వాతంత్ర్యం పొందేనాటికి నూటికి 75 మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయరంగంపై ఆధారపడే జీవించేవారు. వరి, గోధుమ, చెఱకు, పొగాకు, పత్తి, నూనెగింజలు మొదలైన వ్యవసాయ ఉత్పత్తులు మనుషుల ప్రాథమిక ఆహార అవసరాలను తీర్చడమే కాకుండా పరిశ్రమల ప్రగతికి దోహదపడుతున్నాయి. అమెరికా, జపాన్ వంటి దేశాలు ముందుగా వ్యవసాయ రంగంలో

గణనీయ ప్రగతిని సాధించిన తరువాతే పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. భారత తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాత్రం పారిశ్రామికంగానే దేశం త్వరితంగా అభివృద్ధి చెందాలని తాపత్రయపడ్డాడు. ఫలితంగా వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం లభించలేదు. అప్పటికి జాతీయ ఉత్పత్తిలో సగభాగం వ్యవసాయరంగం నుండే వస్తున్నా, దాని ఆధారంగా కోట్లమంది జీవిస్తున్నా సమగ్ర వ్యవసాయ విధానం గురించి పాలకులు పట్టించుకోకపోవడం విచారకరం. పారిశ్రామిక విధానాన్ని మాత్రం 1948లోనే ప్రకటించారు. ఇప్పటికి ఎన్నోసార్లు మార్పులు, చేర్పులు చేశారు. దీనినిబట్టి పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యాన్నిచ్చిందో గమనించవచ్చు. కాని ప్రభుత్వం విస్మరించిన ప్రాథమిక వాస్తవం ఏమిటంటే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల, వ్యవసాయ కార్మికుల, చేతివృత్తుల వారి జీవన ప్రమాణాలు మెరుగై వారి కొనుగోలు శక్తి పెరిగినపుడు మాత్రమే పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని అప్పటికి ఇప్పటికి పాలకుల దృక్పథంలో పెద్ద మార్పేమీ లేదని అనుభవం చెబుతోంది.

## బంగరు భూములు, జలవనరులు...

ప్రపంచంలో వ్యవసాయరంగంలో మొదటి స్థానంలో ఉండాల్సిన భారతదేశం ఎందుకు వెనుకబడిపోయిందో పాలకులు ఈనాటికీ పట్టించుకున్నట్టు కనిపించదు. ప్రపంచ దేశాల్లో సగటున 11 శాతం భూభాగం మాత్రమే పంటలకు అనుకూలంగా ఉండగా, భారతదేశంలో మాత్రం భూవిస్తీర్ణంలో 50 శాతం వ్యవసాయ యోగ్యం కావడం ప్రత్యేక విషయం. 17 కోట్ల 80 లక్షల హెక్టార్ల భూమికి నీరు అందించగల జలవనరులున్నాయి. సంవత్సరం పొడుగునా అంతులేని సూర్యరశ్మి లభిస్తుంది. రెండు, మూడు పంటలకు కూడా అవకాశాలున్నాయి. అమెరికాలో కేవలం 60 లక్షల మంది రైతులు 35 కోట్ల 50 లక్షల టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తిచేసి ఇతర దేశాలకు ఎగుమతి కూడా చేస్తుండగా భారత్‌లో దాదాపు 54 కోట్లమంది రైతులు కేవలం 18 కోట్ల 60 లక్షల టన్నుల ఆహారధాన్యాలను మాత్రమే ఉత్పత్తి చేయగలగడమేమిటి? మన రైతులు సోమరులా? కారే! ఎండనక, వాననక ఆరుగాలం కష్టించే శ్రమజీవులు. అనేక ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొంటూ తరగని ధైర్యంతో భవిష్యత్తుపై ఆశతో మట్టి నుంచి మాణిక్యాలను తీస్తున్న రైతుల లోపం కాదిది. పాలకుల నిర్లక్ష్యమే అసలైన

నిజం. భారతదేశంలో పంటల సగటు దిగుబడులు చాలా తక్కువగా ఉంటున్నాయి. గోధుమ దిగుబడిలో దేశం 38వ స్థానంలో, వరిలో 54వ స్థానంలో, వేరుసెనగలో 72వ స్థానంలో ఉంది. తొమ్మిది కోట్ల 60 లక్షల హెక్టార్ల సాగు భూమిలో 460 లక్షల హెక్టార్లకు నీటివసతి ఉన్న చైనా దాదాపు 40 కోట్ల టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేస్తుండగా, 14 కోట్ల హెక్టార్ల సాగు విస్తీర్ణంలో 490 లక్షల హెక్టార్లకు నీటివసతి ఉన్న భారత్‌లో కేవలం 18 కోట్ల 60 లక్షల టన్నుల ఆహారధాన్యాలే ఉత్పత్తి అవుతున్నాయి. ధాన్యాల దిగుబడి ప్రపంచవ్యాప్తంగా సగటున హెక్టారుకు 2700 కిలోలు కాగా భారత్‌లో మాత్రం 1900 కిలోలే. తృణధాన్యాల సగటు దిగుబడి వివిధ దేశాల్లో 2500 కిలోలు కాగా, భారత్‌లో ఆ మొత్తం 808 కిలోలు మాత్రమే. ఎందుకీ వ్యత్యాసం? వ్యవసాయరంగంపై పాలకులు చూపిన సవతితల్లి ప్రేమయే దీనంతటికీ కారణం. "ఆదాయాలలో అసమానతలను తగ్గించడమే కాకుండా సమాజంలో స్థాయి, సౌకర్యాలు, అవకాశాలు లభించడంలో కూడా వివిధ వర్గాల ప్రజల మధ్య అసమానతలు లేకుండా ప్రభుత్వం కృషి చేయా"లని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నారు. కాని వ్యవసాయ రంగంలో ఉన్నవారి సగటు ఆదాయం కన్నా వ్యవసాయేతర వ్యాపకాలలో ఉన్నవారి సగటు ఆదాయం మొదట్లో రెట్టింపు ఉంటే ఇప్పుడు నాలుగు రెట్లకు పైగా పెరిగింది. రెండు లక్షల గ్రామాలకు ఇప్పటివరకు కూడా పక్కా రహదారి సౌకర్యం లేదు. ఎనిమిదో ప్రణాళిక చివరికి గ్రామీణ ప్రజల్లో కేవలం 15 శాతం మందికి మాత్రమే సరయిన శానిటేషన్ సదుపాయం ఉంటుందని ప్లానింగ్ కమిషన్ భావిస్తోంది. దాదాపు లక్ష గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం లేదు. పదులవేల గ్రామాల్లో ప్రజలు ఫ్లోరిన్ ఎక్కువగల నీటితో బాధపడుతున్నారు. భారతదేశం మొదటినుంచి సామ్యవాద పథంవైపు పయనిస్తోందని భావిస్తున్నాం. కాని విచిత్రమైన విషయమేమిటంటే పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించే అమెరికా, జర్మనీ, తదితర దేశాల్లో పదిశాతం ధనిక కుటుంబాల భాగం వాటి జాతీయాదాయాల్లో 23 శాతం కాగా, భారత్‌లో పదిశాతం ధనిక కుటుంబాల భాగం 33.6 శాతం కావడం. వ్యవసాయ విధానం కానీ, చట్టం కానీ ప్రభుత్వపక్ష కేటాయింపులను, విధాన నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు జపాన్‌లో 1961లో "బేసిక్ ఎగ్రికల్చరల్ లా"ను ఆమోదించారు. వ్యవసాయరంగంలో ఉత్పాదకతను పెంచడం, వ్యవసాయదారుల ఆదాయాలను పెంచడం దాని ప్రధాన లక్ష్యాలు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత 1955 నాటికి

జపాన్ పారిశ్రామిక రంగంలో ఉత్పాదకత (అమెరికా, తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న టెక్నాలజీతో) విపరీతంగా పెరిగినా వ్యవసాయరంగం మాత్రం అంత వేగంగా ముందుకెళ్లలేక పోయింది. ఫలితంగా రైతుల, ఇతర వర్గాలవారి ఆదాయాల మధ్య తేడా పెరిగిపోయింది. దానితో రైతులు తీవ్రమైన ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం వ్యవసాయ చట్టాన్ని రూపొందించింది. ధాన్యం ధరను పెంచింది. రైతుల ఆదాయాలు ఇతర వర్గాల వారి ఆదాయాలకు చేరువయ్యేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకు ఇతర వర్గాల ప్రజలేమీ బాధపడలేదు. వారి నిజమైన ఆదాయం పెరుగుతూ వచ్చింది. మొత్తం ఖర్చులో ఆహార ఖర్చు తగ్గింది. జపాన్ రైతుల బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ ధరలకు నాలుగు రెట్ల ధర లభిస్తోంది. భారతదేశ రైతులకు మాత్రం అంతర్జాతీయ ధరలో 55 శాతమే లభిస్తోంది. గోధుమలైతే 65 శాతం, పత్తికి 70 శాతం లభిస్తున్నాయి. రైతుల ఆదాయాలకు, ఇతర వర్గాల వారి ఆదాయాలకు సమానంగానైనా ఉండేట్లు చేస్తామన్న హామీ కూడా భారత ప్రభుత్వ వ్యవసాయ విధాన ముసాయిదాలో కనిపించదు. అతికీలకమైన ఈ రంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేశారు.

## కేటాయింపులు తగ్గుముఖం

మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి కేటాయింపు 15 శాతం కాగా, అది ఏడో ప్రణాళికలో 5.9 శాతానికి, ఎనిమిదో ప్రణాళికలో 5.2 శాతానికి తగ్గిపోయింది. పెట్టుబడుల విషయంలోనూ అంతే. 1980-81 ధరలలో చూస్తే వ్యవసాయ రంగంలో పెట్టుబడులు 1980-81 రూ. 4636 కోట్లు కాగా, ఆ మొత్తం 1991-92 నాటికి రూ. 4580 కోట్లకు తగ్గింది. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు తగ్గగా, ప్రైవేటురంగంలో దాదాపు నిలకడగా ఉన్నాయి. ప్రభుత్వరంగ పెట్టుబడులు 1988-89లో రూ. 1680 కోట్లు కాగా, అవి 1991-92 నాటికి రూ. 1360 కోట్లకు తగ్గిపోయాయి. ప్రభుత్వరంగ పెట్టుబడులు పెరుగుతుంటేనే ప్రైవేటురంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరుగుతాయి. ఉదాహరణకు నీటి పారుదలపై ప్రభుత్వ పెట్టుబడులు పెరుగుతుంటే రైతులు సొంతంగా లేదా బ్యాంకు రుణాలతో ఆధునిక యంత్ర సామాగ్రిని కొనడం, అధిక దిగుబడి వంగడాలు విత్తడం వంటి కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. ప్రైవేటురంగ పెట్టుబడులు 1980-81లో రూ. 2840 కోట్ల నుంచి 1991-92 నాటికి రూ. 3537 కోట్లకు పెరిగినప్పటికీ మొత్తం నికర మూలధన

వాటా మాత్రం 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మొత్తం పెట్టుబడులలో వ్యవసాయరంగ భాగం మొదటి ప్రణాళికలో 26 శాతం కాగా, అది ఏడో ప్రణాళికకల్లా 12 శాతానికి తగ్గిపోయింది. పారిశ్రామిక రంగంలో కన్నా వ్యవసాయ రంగంలోనే పెట్టుబడిపై ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిసి కూడా పాలకులు పక్షపాత వైఖరిని ప్రదర్శించారు. పబ్లిక్ రంగంలో పెట్టుబడులు 1980-81లో రూ. 1800 కోట్ల నుంచి 1991-92 నాటికి రూ. 1048 కోట్లకు తగ్గిపోగా వ్యవసాయరంగం కుంటినడకతో ముందుకు సాగవలసి వస్తోంది. భారత వ్యవసాయ రంగాన్ని పట్టి పీడిస్తోన్న ప్రధానమైన ఈ అంశంపై విధాన ముసాయిదాలో స్పష్టమైన వివరణ లేదు. కాలపరిమితితో కూడిన నిర్దిష్ట లక్ష్యాలను పేర్కొనలేదు.

వ్యవసాయ రంగంలో పెట్టుబడుల తర్వాత అతిముఖ్యమైనది పరపతి సౌకర్యం. భారతదేశ రైతుల్లో నూటికి 75 మంది చిన్న, సన్నకారు రైతులే. వీరిలో ఎక్కువమంది పేదరికంతో కొట్టుమిట్టాడుతుంటారు. సరయిన సమయంలో అవసరమైన మొత్తంలో రుణం లభించినట్టయితే రైతుకు ఉపయోగం. కాని విచారకరమైన విషయమేమిటంటే ఇప్పటికి కేవలం పది శాతం మంది గ్రామీణ ప్రజలు మాత్రమే ఆర్థిక సహాయ సంస్థల నుంచి రుణం పొందగలిగారు. భారత ప్రభుత్వ 1994-95 ఆర్థిక సర్వే వెల్లడించిన వాస్తవాలే రైతాంగ దుస్థితిని స్పష్టించాయి. 1987-88లో రైతులకు సహకార, వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు మొత్తంమీద రూ. 9.268 కోట్లు ఇచ్చాయి. ఆ మొత్తం 1990-91లో రూ. 8.983 కోట్లకు తగ్గిపోయింది. జాతీయ ఉత్పత్తిలో దాదాపు మూడోవంతు వ్యవసాయ రంగానిదే అయినప్పటికీ బ్యాంకు రుణాల్లో 17 శాతం కూడా లభించడంలేదు. దీనికి విరుద్ధంగా జాతీయ ఉత్పత్తిలో అయిదో వంతు గల పరిశ్రమలకు మాత్రం బ్యాంకు రుణాల్లో 36 శాతం అందడం విచిత్రం. సగటున ఒక రైతుకు 1969లో రూ. 2500 లభిస్తే రెండు దశాబ్దాల తర్వాత 1992 నాటికి ఆ మొత్తం రూ. 4700 మాత్రమే. ఈ మధ్యకాలంలో వ్యవసాయానికి అవసరమైన వస్తువుల ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. ఈ ధరలను, ద్రవ్యోల్బణాన్ని బట్టి రైతులకు లోగడ కన్నా తక్కువ రుణమే లభించినట్టు. ఈ రుణాల్లో కూడా ఎక్కువ భాగం నీటిసౌకర్యం కల ప్రాంతాల రైతులకే అందుతోంది. వర్షాధార ప్రాంతాల రైతుల పరిస్థితి దయనీయం. ఎక్కువ వడ్డీ తీసుకుని, తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారుల, దళారుల కబంధహస్తాల్లో విలవిలలాడుతున్నారు.

## అంచనాల ఆశలే తప్ప...

ఈ శతాబ్దం ఆఖరుకల్లా వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు వాణిజ్య బ్యాంకులు రూ. 64 వేల కోట్లు, సహకార బ్యాంకులు రూ. 46 వేల కోట్లు సమకూర్చవలసి వస్తుందని రిజర్వుబ్యాంకు నిర్వహించిన గ్రామీణ రుణ సర్వే అభిప్రాయపడింది. అవిగాక వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగుకు రూ. 16 వేల కోట్లు, నిల్వ, మార్కెటింగ్ వసతుల కోసం రూ. పదివేల కోట్లు, ఎగుమతుల కోసం రూ. 7500 కోట్లు అవసరమవుతాయని పేర్కొంది. నిధులను ఏమేరకు, ఏవిధంగా చేకూర్చబోతున్నారో వ్యవసాయ విధాన పత్రంలో ప్రస్తావించనేలేదు. పార్లమెంటరీ ఆర్థిక స్థాయీసంఘం నివేదిక ప్రకారం 1985-86లో దేశం మొత్తంమీద రైతులు ఉపయోగించిన వస్తువుల విలువ సగటున హెక్టారు భూమికి లభించిన రుణం మాత్రం కేవలం రూ. 297. దీనినిబట్టి వ్యవసాయరంగంలో ఉత్పత్తి వ్యవసాయానికి లభిస్తున్న రుణానికి మధ్య ఎంతటి వ్యత్యాసముందో సుస్పష్టం. ఈ పరిస్థితిలో భారీ మార్పు రానిదే వ్యవసాయరంగ సత్వర ప్రగతి అసాధ్యం. ఈ విషయాన్ని వ్యవసాయ విధాన ముసాయిదా చర్చించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దిగుబడులు పెంచడంలో అధిక దిగుబడి వంగడాలు, ఎరువుల వాడకంతోపాటు ముఖ్యమైనది నీటివసతి. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పంటల దిగుబడులు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను, మొత్తం ఉత్పత్తిని పెంచడానికి ఎంతో తోడ్పడే ఇరిగేషన్‌కు మొదటి పంచవర్ష ప్రణాళికలో 22 శాతం నిధులు కేటాయించగా, అవి ఏడో ప్రణాళికల్లా 9.4 శాతానికి, ఎనిమిదో ప్రణాళికల్లా 8 శాతానికి తగ్గిపోయాయి. ఫలితంగా 1960 ప్రాంతంలో చేపట్టిన అనేక భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఈనాటికీ పూర్తికాలేదు. ఇప్పటికీ పంటలు పండే భూముల్లో 30 శాతానికి మాత్రమే ఇరిగేషన్ వసతి ఉంది. 70 శాతం వర్షాధారమే. వర్షాభావంతో కొన్ని ప్రాంతాలు బాధపడుతుంటే వరదలతో మరికొన్ని ప్రాంతాలు సతమతమవుతున్నాయి.

*ది. 28-08-1998.* — ***ఈనాడు***

●

# పరిశోధనపై చిన్నచూపు

## వ్యవసాయ విధానంపై పసలేని ముసాయిదా

వ్యవసాయ పరిశోధనకు ఎంతో ప్రాముఖ్యం ఇవ్వాల్సి ఉండగా భారత ప్రభుత్వం దానిని చిన్నచూపు చూస్తోంది. భారత వ్యవసాయ పరిశోధన మండలికి నాలుగో ప్రణాళికలో కేటాయింపు 0.36 శాతం. ఏడో ప్రణాళిక నాటికి అది 0.23 శాతం మాత్రమే. ఎనిమిదో ప్రణాళికలో రూ. 2008 కోట్లు కావాలని కోరితే ప్రణాళిక సంఘం రూ. 1300 కోట్లు మాత్రమే కేటాయించింది. ఫలితంగా ముందు అనుకున్న కొన్ని పథకాలను విరమించాల్సి వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలలో వ్యవసాయ జాతీయ ఉత్పత్తిలో రెండు శాతాన్ని పరిశోధనకు వెచ్చిస్తున్నారు. భారత్‌లో ఆ మొత్తం కేవలం 0.3 శాతం మాత్రమే. గాట్ ఒప్పందంపై సంతకం చేసిన దరిమిలా వృక్ష సంపదను లాభదాయకంగా ఉపయోగించుకోవాలంటే పరిశోధనకు మరింత ఎక్కువ వెచ్చించాలి. దేశంలో వ్యవసాయ కమతాల సంఖ్య 1970-71లో 7 కోట్ల పది లక్షలుండగా, 1990-91 నాటికి పదికోట్ల 53 లక్షలకు పెరిగింది. సగటు కమతం విస్తీర్ణం 1970-71లో 2.28 హెక్టార్లుండగా, 1985-86 నాటికి 1.70 హెక్టార్లకు తగ్గింది. సన్నకారు రైతులు కమతాల శాతం 51 నుంచి 1990-91 నాటికి 59 శాతానికి పెరిగింది. వీరి సగటు కమతం విస్తీర్ణం 0.40 హెక్టారు అంటే ఒక ఎకరం. చిన్న కమతాల శాతం 18.5 వద్ద నిలకడగా వుంది. వీరి సగటు కమతం విస్తీర్ణం 1.43 హెక్టారు. వ్యవసాయ పనులకు ఉపయోగపడే పశుసంపద దేశంలో 8 కోట్లకు పైగా వుంది. దేశంలోని సాగుభూమిలో సగభాగాన్ని మాత్రమే ఇవి దున్నగలుగుతాయి. అందువల్ల వ్యవసాయ పనులు సకాలంలో జరగాలంటే పాత పరికరాలను మరింత ఉపయోగకరంగా రూపొందించుకోవాలి. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, కోత, నూర్పిడి యంత్రాలను వాడాలి. వ్యవసాయ రంగంలో కార్మికులను తొలగించడానికి కాక,

వారి పని సకాలంలో సులువుగా పూర్తయ్యేందుకు యాంత్రీకరణ ఉపయోగపడాలి. ప్రస్తుతం భారత్‌లో ఏటా సుమారు లక్షన్నర ట్రాక్టర్లు, తొమ్మిది వేల పవర్‌టిల్లర్లు అమ్ముడవుతున్నాయి. చైనాలో 8 లక్షల పెద్ద, మధ్యసైజు ట్రాక్టర్లు, 70 లక్షల పవర్‌టిల్లర్లను వినియోగిస్తున్నారు. భారత్‌లో కూడా చిన్న ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్లను ఇంకా ఎక్కువగా వాడాలంటే వాటి ధరను తగ్గించడమే కాకుండా ఎక్కువ మందికి సబ్సిడీలనివ్వాలి. దేశం మొత్తంమీద ట్రాక్టర్ల సబ్సిడీకి ప్రభుత్వం ఏటా వెచ్చిస్తున్నది రూ. 8 కోట్లు మాత్రమే. కేవలం ఒక పెద్ద పరిశ్రమకే ఇంతకన్నా అనేక రెట్ల రాయితీలను ఇస్తున్న ప్రభుత్వం రైతుల విషయంలో మాత్రం ఉదారంగా వ్యవహరించడంలేదు. ప్రస్తుతం భారత్‌లో వాడుతున్న కొడవళ్లకు బదులు ప్రత్యేక ఉక్కుతో ఆధునిక డిజైన్లతో (జపాన్, ఇటలీ తరహా) రూపొందిస్తే ఆయాస పడకుండా 20 శాతం అధికంగా కోయవచ్చని తేలింది. ఎక్కువ నిధులతో అనేక ఆధునిక పరికరాలను రైతులకు ఎక్కువ సంఖ్యలో అందించేందుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి.

సమగ్ర పంటల బీమా పథకం స్వాతంత్ర్యం వచ్చాక 40 సంవత్సరాలకు రూపొందించింది. దీనిని పంటల బీమా పథకం అనే బదులు బ్యాంకులు ఇచ్చిన రుణాల బీమా పథకం అంటే బాగుంటుంది. గుజరాత్, మరికొన్ని రాష్ట్రాల్లో ఈ పథకాన్ని దుర్వినియోగపరిచారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన వారికి మాత్రమే, అందులోనూ కొన్ని పంటలకే ఇది వర్తిస్తున్నందున రైతులు అసంతృప్తి చెందారు. ఇతర అనేక పంటలకు వర్తించేలా, మరింత ప్రయోజనకరంగా సరికొత్త పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడతామని సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రి హైదరాబాద్‌లో ప్రకటించి నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ఆ పథకం జాడలేదు. ఏటా కరవుతోనో, తుఫానుతోనో సర్వం కోల్పోతున్న రైతాంగాన్ని ఇన్సూరెన్స్ పథకం ద్వారా ఆదుకోవాల్సి వుంది. దిగుమతులు పెంచడంలో ఎరువులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఇప్పటికే భారత్‌లో సగటున హెక్టారుకు 72 కిలోల న్యూట్రియంట్స్ మాత్రమే వాడుతున్నారు. ప్రపంచంలో సగటు వాడకం 87 కిలోలు, ఆసియా ఖండంలో 130 కిలోలు, పాకిస్తాన్ 102 కిలోలు, బంగ్లాదేశ్ 111 కిలోలు వాడుతున్నాయి. చైనాలో వరిపంటకు సగటున 245 కిలోల ఎరువులను వాడుతూ హెక్టారుకు 3.8 టన్నుల ఆహారధాన్యాలను పండిస్తుంటే, భారత్‌లో 104 కిలోల ఎరువును వాడుతూ కేవలం 1.7 టన్నుల ధాన్యాన్ని

మాత్రమే పండిస్తున్నారు. ఎంతో కాలంగా ఎరువుల ధరలను పెంచకుండా మూడేళ్ల కిందట ఫాస్ఫేట్, పొటాష్ ఎరువుల ధరలను ఒకేసారి చాలా ఎక్కువగా పెంచడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. దాని ఫలితంగా నత్రజని ఎరువుల వాడకం పెరిగి నత్రజని, ఫాస్ఫేట్, పొటాష్ ఎరువుల మధ్య ఉండాల్సిన 5.9:2.4:1 నిష్పత్తి 9.3:3:1కు మారడం అనర్థదాయకం. భూమిపై దాని దుష్ప్రభావం పడుతుంది. భారతదేశ పరిస్థితులలో ఎరువులపై సబ్సిడీలను కొనసాగించక తప్పదు. ఎరువుల ఫ్యాక్టరీలలో ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించి, సామర్థ్యాన్ని పెంచి, రైతులకు సబ్సిడీ ఫలితం అందేలా చర్యలు తీసుకోవాలి. సర్టిఫైడ్ సీడ్ వినియోగం గత ఆరేళ్లుగా 57 లక్షల క్వింటాళ్ల వద్ద నిలిచిపోయింది. భారత్‌లో పండించే గోధుమలో 93 శాతం వరి, జొన్న పంటలలో 60 శాతం మాత్రమే అధిక దిగుబడి వంగడాలు. ప్రస్తుతం జనాభాకు తగినట్టుగా దిగుబడులు పెరగడంలేదు. ఏటా కోటీ 70 లక్షల మంది జన్మిస్తున్నారు. ఎనిమిదో ప్రణాళిక ఆఖరుకు 91 కోట్ల మంది ప్రజలకు 21 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు కావాలని అంచనా. రెండువేల సంవత్సరం నాటికి దాదాపు 24 కోట్ల టన్నులవసరం. అంటే రాబోయే అయిదేళ్లలో దాదాపు అయిదు కోట్ల టన్నుల ఆహారధాన్యాలను అదనంగా పండించాలి. సామాన్యునికి అందుబాటులో ఉండే పోషకాహారం ముఖ్యంగా పప్పుధాన్యాలు. బాధాకరమైన విషయమేమిటంటే వీటి తలసరి లభ్యత 1956లో 70 గ్రాములుండగా, 1994 నాటికి 37.8 గ్రాములకు తగ్గిపోయింది. ప్రపంచ ఆహార సంస్థ ప్రకారం మనిషి సగటున కనీసంగా 80 గ్రాముల పప్పుధాన్యాలు వాడాలి. వంటనూనెల విషయంలో భారత్ కొంత ప్రగతిని సాధించినా ఇంకా దిగుమతులు చేసుకోక తప్పడంలేదు. అధిక దిగుబడి వంగడాల వినియోగం ఇంకా బాగా పెరగాలి. ఇప్పటికే దేశ జనాభాలో సగంమందే అక్షరాస్యులు. మారుమూల ప్రాంతాల్లోని కోట్లమంది రైతులకు పరిశోధనా ఫలితాలు, నూతన విజ్ఞానం చేరాలి. కేంద్రాన్నైనా నెలకొల్పాలని జాతీయ వ్యవసాయ కమిషన్ ఏనాడో సూచించినా, ఈనాటి వరకు వాటి సంఖ్య రెండొందలు దాటలేదు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రభుత్వ వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతుల మధ్య నిరంతర సంబంధాలు కొనసాగుతుండాలి. పంజాబ్‌లో అది ఫలప్రదమవుతోంది. ఈ కాలంలో టెలివిజన్ అత్యంత బలమైన ప్రచార సాధనం. నిరక్షరాస్యులైన వ్యవసాయదారులకు చక్కని

కార్యక్రమాల ద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని అందజేయవచ్చు. అప్రయోజకర కార్యక్రమాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించే బదులు టి.వి.ని సద్వినియోగపరచాలి. వ్యవసాయ రంగానికి ఒక ప్రత్యేక ఛానెల్ కేటాయించడం కూడా అవసరం.

వ్యవసాయరంగం పూర్తిగా అభివృద్ధి చెందాలంటే పారిశ్రామిక రంగానికి కల్పిస్తున్న వెసులుబాట్లు, రాయితీలు, సౌకర్యాలనన్నింటిని ఈ రంగానికి కూడా కల్పించాలని ప్రముఖ వ్యవసాయవేత్త భానుప్రతాప్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ప్రభుత్వం దీనిని అంగీకరించి విధానపత్రంలో పేర్కొనడం సంతోషం. భారత్‌లో ఉన్న సదవకాశాలను పూర్తిగా వినియోగించుకోగలిగితే జాతీయ ఉత్పత్తి రెట్టింపు అవుతుందని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ అభిప్రాయపడింది. వ్యవసాయ అనుబంధ వ్యాపకాలైన పశుపోషణ, పాల ఉత్పత్తి, చేపలు, రొయ్యలు, కోళ్లపరిశ్రమ అభివృద్ధిపై కూడా శ్రద్ధ చూపాలి. కనీస మద్దతు ధరలు లెక్కగట్టే విధానాన్ని మార్చాలి. ఈ కొత్త పద్ధతిలో వేల శాంపుల్స్‌ను లెక్కగడతారు. రైతుకయ్యే ఖర్చు వ్యవసాయ ధరల కమీషన్ లెక్కల కన్నా ఎక్కువుంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల వల్ల కలిగే కష్టనష్టాలను పరిగణించడంలేదు. గిట్టుబాటు ధరలు లభించకపోవడమే కాకుండా, రవాణాపై ఆంక్షలు కూడా రైతలను మరింత నష్టాల పాలు చేస్తున్నాయి. వాణిజ్య నిబంధనలు కూడా అనుకూలంగా లేకపోవడం వల్ల అనేకమంది వ్యవసాయం లాభసాటి వృత్తికాదని, ఇతర వ్యాపకాలు చూసుకుంటున్నారు. అమెరికా, జపాన్, యూరోపియన్ దేశాలు రైతులకు పెద్ద మొత్తంలో సబ్సిడీలనిస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల మొత్తం విలువలో చూస్తే జపాన్‌లో 68 శాతం, యూరోప్‌లో 48 శాతం, అమెరికాలో 30 శాతం, కెనడాలో 40 శాతం సబ్సిడీలు రైతులకు లభిస్తున్నాయి. గాట్ వలన ఆరేళ్లలో ఇప్పుడున్న వాటిలో 20 శాతం మాత్రమే తగ్గుతాయి. ఈ విషయంలో భారతప్రభుత్వం ప్రచారం వాస్తవం కాదు. చిత్తశుద్ధితో వ్యవసాయరంగం అభివృద్ధికి తోడ్పడితే మిగతా దేశాలకన్నా మెరుగైన ఫలితాలను సాధించవచ్చు. పండ్లు, కూరగాయల పెంపకంలో భారత్ ముందుకు వెళుతోంది. కూరగాయలలో చైనా తరువాత రెండో స్థానాన్ని, పండ్లలో బ్రెజిల్‌ను అధిగమించి మొదటి స్థానాన్ని ఆక్రమించింది. పండిస్తున్న వాటిలో ఒక శాతాన్ని మాత్రమే ఎగుమతి చేస్తున్న పరిస్థితిని మార్చేందుకు శ్రద్ధ తీసుకోవాలి. ఉత్పత్తుల నాణ్యత పెరగాలి. కోత, నిల్వ, రవాణాలలో లోపాలవల్ల

25 శాతం పండ్లు, కూరగాయలు వృథా అవుతున్నట్లు అంచనా దీనిని సవరించి మెరుగైన వసతులను కల్పించడం అవసరం. ప్రభుత్వ విధానంలో నిజమైన మార్పు వచ్చినప్పుడే వ్యవసాయాభివృద్ధి, దానితోపాటు దేశ సౌభాగ్యం సాధ్యమవుతాయి. వ్యవసాయమనేది గౌరవప్రదమైన, లాభదాయకమైన వృత్తి అని భావించే పరిస్థితులను పాలకులు కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ కల్పించాలి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రస్తుత వ్యవసాయ విధాన ముసాయిదా స్థానంలో చక్కని ఆదర్శవంతమైన, ఆచరణాత్మకమైన ముసాయిదాను రూపొందించాల్సిన అవసరముంది.

*ది. 29-08-1998.* **- *ఈనాడు***

●

# రిటైల్‌పై తొందరపడితే టోకున నష్టం!

దాదాపు ముప్పై అయిదు కోట్ల మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలు ఉన్న మనదేశాన్ని తమ ఉత్పత్తులతో ముంచెత్తాలని, వాణిజ్యాన్ని పెంచుకోవాలని పలు ధనిక దేశాలు ఆరాటపడుతున్నాయి. ఆ దేశాలు ఇప్పటికే అభివృద్ధి సాధించినందువల్ల ఇప్పుడు వాటి వార్షికాభివృద్ధి రేటు స్వల్పంగా ఉంటోంది. వాటి మార్కెట్లు సొంత ఉత్పత్తులతో నిండిపోయాయి. కొత్తగా వాణిజ్య విస్తరణకు ఎక్కువ అవకాశాలు కన్పించడంలేదు. ఎన్నో ప్రతికూల అంశాలమధ్య, వాతావరణ ఒడుదొడుకుల మధ్య కూడా భారత దేశం అయిదు నుండి ఆరు శాతం వార్షికాభివృద్ధిని సాధిస్తోంది. క్రమేణా ప్రజల, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. పండ్లు, కూరగాయల వినియోగం పెరుగుతోంది. మాంసం, చేప సంబంధ ఆహార వినియోగం కూడా బాగా ఎక్కువవుతోంది. మోటారు సైకిళ్లు, కార్ల కొనుగోళ్లు ఏటేటా హెచ్చుతున్నాయి. పట్టణ ప్రజల శాతం క్రమేపీ వృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో మన సువిశాల భారతదేశంలో రిటైల్ వ్యాపారంలోకి ప్రవేశించాలని బహుళజాతి సంస్థలు ఉవ్విళ్ళూరడం సహజమే. మనదేశంలోని రిటైల్ వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి సుముఖంగా ఉన్నారు. భారత వాణిజ్య మండలి, భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ.) కూడా ఈ ప్రతిపాదనకు అనుకూలమే. వామపక్షాలు, స్వదేశీ జాగరణ్ మంచ్, కొన్ని ప్రజా సంఘాలు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నాయి. రిటైల్ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోతారని ఈ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. వినియోగదారులకు మంచి నాణ్యతగల వస్తువులు చౌకగా లభిస్తాయని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సముచితమైన నిర్ణయం తీసుకోవలసి ఉంది.

## పోటీని తట్టుకోగలమా?

వాణిజ్యం సేవల రంగంలో ఒక భాగమే. 1993-94లో జాతీయ స్థూల ఉత్పత్తిలో 48 శాతంగా ఉన్న సేవల రంగం 2003-04 నాటికి 56.5 శాతానికి పెరిగింది. మనదేశ ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం అగ్రభాగాన నిలుస్తూ అత్యంత ప్రాముఖ్యం సంతరించుకొంది. ఇదే సమయంలో సేవల్లో అంతర్భాగంగా ఉన్న హెూల్ సేల్ - రిటైల్ వ్యాపారం వాటా 11 శాతం నుంచి 14.5 శాతానికి పెరిగింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం మనదేశంలో రిటైల్ వ్యాపారంలో దాదాపు కోటీ 85 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో దాదాపు కోటి మంది నగర-పట్టణ ప్రాంతాల్లో ఉండగా 80 లక్షల మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు. రిటైల్ వ్యాపారంలో ఉన్న మొత్తం కోటీ 85 లక్షల మందిలో 60 శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నవారే. అయిదుగురిలోపు పనిచేసే చిన్న షాపుల్లో 11 శాతం మంది ఉన్నారు. ఆరుగురికి పైగా పనిచేస్తోన్న మధ్యతరహా షాపుల్లో 29 మంది ఉపాధి పొందుతున్నారు. అసంఘటిత రంగంలో దాదాపు 3.95 కోట్ల మంది ఉన్నారని, సంఘటిత రంగంలో ఉన్న అయిదు లక్షల మందితో కలిపి మొత్తంగా చూస్తే రిటైల్ వ్యాపార రంగంలో నాలుగు కోట్ల మంది ఉపాధిని పొందుతున్నారని మరొక అంచనా. అంటే మనదేశంలో మొత్తం 37 కోట్ల 80 లక్షల మంది పనివాళ్లలో 10.6 శాతం మంది ఈ రిటైల్ వ్యాపార రంగంలో ఉన్నారన్న మాట. అందువల్లనే ఈ అంశానికి అంత ప్రాముఖ్యం చేకూరింది. మనదేశంలో రిటైల్ వ్యాపారం 98 శాతం అసంఘటిత రంగంలో ఉంది. కేవలం రెండు శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉంది. అమెరికాలో 90 శాతం, బ్రిటన్‌లో 80 శాతం, పశ్చిమ ఐరోపాలో 70 శాతం రిటైల్ వ్యాపారం సంఘటిత రంగంలో ఉంది. వర్ధమాన దేశాలైన బ్రెజిల్‌లో 40 శాతం, దక్షిణ కొరియాలో 35 శాతం, చైనాలో 20 శాతం రిటైల్ వ్యాపారం సంఘటిత రంగంలో ఉండగా, మనదేశంలో ఇది కేవలం రెండు శాతమే ఉన్న నేపథ్యంలో మన రిటైల్ వ్యాపార రంగంలోకి విదేశీ పెట్టుబడుల ప్రభావాన్ని సరిగా అంచనా వేయవలసిన అవసరం ఉంది. పాన్‌షాపులు, కిరణా షాపులు, సిగరెట్, బీడీ దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు లక్షల సంఖ్యలో దేశమంతటా వ్యాపించి ఉన్నాయి. లక్షల మంది సైకిళ్లపైనా, నాలుగు చక్రాల బళ్లపైన చిన్న ఆదాయ వర్గాల వారికి అవసరమైన గృహెూపకరణాలు, రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు వంటి వస్తువులను అమ్ముకొంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల

కాలంలో పట్టణాల్లో పెద్ద సంఖ్యలో సూపర్ బజార్లు వెలుస్తున్నాయి. ఇప్పుడిప్పుడే దేశీయంగా పేరున్న ప్రముఖ సంస్థలు కూడా రిటైల్ వ్యాపార రంగంలోకి ప్రవేశించేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. వాల్‌మార్ట్, టెస్కో, కారిఫోర్, ఎహోల్డ్, కెమార్ట్ వంటి సంస్థలు పలుదేశాల్లో వ్యాపారాన్ని చాలా పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నాయి. మనదేశంలో అసంఘటిత రంగంలో రిటైల్ వ్యాపార పరిమాణం దాదాపు నాలుగు లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. అందువల్లే ఇంత పెద్ద మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని వాల్‌మార్ట్ వంటి సంస్థలు ఆత్రుత పడుతున్నాయి. 1996 నుండి 2001 మధ్య రిటైల్ వ్యాపార దుకాణాల సంఖ్య 85 లక్షల నుండి కోటీ 12 లక్షలకు పెరిగాయని భారత పారిశ్రామిక వాణిజ్యమండలి అంచనా వేసింది. ప్రపంచంలో అత్యధికంగా రిటైల్ వ్యాపార దుకాణాలు ఉన్నది మనదేశంలోనే!

మికిన్సే కంపెనీ, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్త నివేదిక ప్రకారం భారత రిటైల్ వ్యాపార రంగంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతిస్తే 2010 నాటికి మనదేశంలో రిటైల్ వ్యాపారం సుమారు 330 బిలియన్ డాలర్లు (రూ. 13,50,000 కోట్ల)కు చేరుతుంది. 2003 నాటికే సంఘటిత, అసంఘటిత రంగాలు రెండింటిలో కలిపి దాదాపు పదకొండు లక్షల కోట్ల రూపాయల రిటైల్ వ్యాపారం ఉందని అంచనా. భారతదేశం రానున్న కాలంలో 7 శాతం వార్షిక ప్రగతిని సాధిస్తూ ముందుకు సాగితే విదేశీ పెట్టుబడులతో పని లేకుండానే దేశీయ పెట్టుబడులతోనే లక్ష్యాన్ని చేరుకోవచ్చు. విదేశీ పెట్టుబడులతో పాటు పెద్దయెత్తున లాభాల రూపంలో విదేశీ మారక ద్రవ్యం దేశం వెలుపలకు తరలిపోతుందనే వాస్తవాన్ని మరువరాదు. 2004లో వాల్‌మార్ట్ మొత్తం టర్నోవర్ 256 బిలియన్ డాలర్లు – అంటే భారత్‌లోని మొత్తం రిటైల్ వ్యాపారం 245 బిలియన్ డాలర్లకన్నా అధికం! ఇంత పెద్ద బహుళజాతి సంస్థలో పనిచేస్తున్నవారు 14 లక్షల మంది మాత్రమే. అమెరికాలో ఉన్న 1355 స్టోర్స్‌తో సహా వాల్‌మార్ట్‌కు ప్రపంచ వ్యాప్తంగా 4806 స్టోర్స్ ఉన్నాయి. సగటున ఒక స్టోర్సు రూ. 229 కోట్ల టర్నోవరు చేస్తుంది. మనదేశంలో సగటున ఒక రిటైల్ దుకాణం విస్తీర్ణం 500 చదరపు అడుగులు ఉంటే వాల్‌మార్ట్ స్టోర్స్ విస్తీర్ణం 85,000 చదరపు అడుగులు ఉంటుంది. భారతదేశంలో సగటు రిటైల్ దుకాణం టర్నోవర్ రూ. 11 లక్షలు. చిన్న కిళ్లీ, బీడీ షాపులు, నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్న చిన్న దుకాణాల టర్నోవర్ ఇంతకూడా

ఉండదు. అందువల్ల, వాల్‌మార్ట్ లాంటి పెద్ద సంస్థలు మన రిటైల్ వ్యాపార రంగంలోకి ప్రవేశిస్తే ఇప్పటికే అసంఘటిత రంగంలో ఉన్న మన దేశీయ సంస్థలు ఆ పోటీని తట్టుకోవడం కష్టమే.

మన రిటైల్ వ్యాపార రంగంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించాలని వాదించేవారు - అందువల్ల వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని చెబుతుంటారు. పెద్ద పరిమాణంలో వస్తువులను ఈ బహుళజాతి సంస్థలు కొనుగోలు చేస్తాయి కనుక తక్కువ ధరలకు వినియోగదారులకు అమ్మగలుగుతాయన్నది వారి వాదన. ముందు కొద్ది సంవత్సరాలు తక్కువ ధరలకు అమ్మినా, పోటీలో ఉన్న ఇతర చిన్న సంస్థలు మూతపడిన తరువాత వస్తువుల ధరలను ఈ బహుళజాతి సంస్థలు పెంచుతాయన్నది బ్రిటన్‌లో ఎదురైన అనుభవం.

ధనిక దేశాల్లో కూడా ఈ బహుళజాతి సంస్థలు రిటైల్ వ్యాపారం చేపట్టిన ఫలితంగా రిటైల్ వ్యాపార సంస్థల సంఖ్య తగ్గిపోతోంది. ఫ్రాన్స్‌లో మూడు దశాబ్దాల నాటితో పోలిస్తే రిటైల్ వ్యాపార సంస్థల సంఖ్య 17 శాతం తగ్గింది. అమెరికా బహుళజాతి సంస్థల ప్రవేశంతో డెన్మార్క్‌లో గత పదేళ్ళలో 30 శాతం రిటైల్ షాపులు మూతపడ్డాయి. ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కొత్తగా వాల్‌మార్ట్ బ్రాంచి ఏర్పాటు చేయాలంటే ముందుగా అనుమతిని తీసుకోవలసి ఉంటుంది. అమెరికాలో కూడా కాలిఫోర్నియా, షికాగో నగరాల్లో వాల్‌మార్ట్ స్టోర్స్ తెరవడంపై మున్సిపల్ కార్పొరేషన్లు నిషేధం విధించాయి. జపాన్, దక్షిణ కొరియాల్లో బియ్యం, పొగాకు, తాజా కూరగాయలు, మాంసం తదితర వస్తువుల వాణిజ్యంలో విదేశీ రిటైల్ ట్రేడర్స్‌ను నిషేధించారు. రిటైల్ వ్యాపారంలో విదేశీ పెట్టుబడులను కొన్ని పక్షాలు బలంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం వ్యూహాత్మకంగా విదేశీ పెట్టుబడులను ఆహార ఉత్పత్తుల రంగంలోనికి అనుమతించేందుకు రంగాన్ని సిద్ధం చేస్తోంది. దీనివల్ల వినియోగదారులకే కాక, రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ఊరిస్తోంది. విదేశీ బహుళజాతి సంస్థలు రంగంలో ఉంటే దేశంలో శీతలీకరణ గొలుసు (కోల్డు చైన్) అభివృద్ధి అవుతుందని, ఇప్పటి వరకు వృథాగాపోతున్న 40 శాతం పండ్లు, కూరగాయల నష్టం తగ్గుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. వ్యవసాయదారులు తమ ఉత్పత్తులను మండీలలోని వ్యాపారులు లేక దళారులకు అమ్మవలసిన అవసరం లేకుండా, మార్కెట్ యార్డుకు కాకుండా నేరుగా

బహుళజాతి సంస్థల ప్రైవేట్ మార్కెట్టుకు పంపడానికి వీలుగా ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ చట్టంలో సవరణ చేసింది. ఈ సంస్థలు రైతులతో అవగాహనకు వచ్చి కాంట్రాక్టు పద్ధతిలో వారి ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు. నిజంగా ఇలా జరిగితే మంచిదే. ఎందుకంటే భారత వ్యవసాయరంగంలో ఒక ప్రధానమైన లోపం - సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడమే. ఆరుగాలం కష్టించి, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొంటూ, తన సర్వస్వం తాకట్టు పెట్టి పండించిన పంటకు సరైన ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో రైతుకు మెరుగైన ధర ఎవరి నుంచి లభించినా హర్షించవలసిందే. అయితే బహుళజాతి సంస్థల పనితీరును గమనించినప్పుడు రైతు శ్రేయస్సుకంటే వ్యాపార స్వార్థ ప్రయోజనాలు కాపాడుకోడానికి, అక్రమలాభాలు ఆర్జించడానికి అవి పెద్దపీట వేస్తాయని అనుభవం తెలుపుతోంది. పోగాకు విషయంలో ఐ.టి.సి., కోకోవా విషయంలో కాడ్‌బరీస్, కాఫీ విషయంలో నెసిల్ అనుభవాలు మనకు తెలిసినవే.

## ఆచితూచి నిర్ణయం

ఇప్పటి వరకు మనదేశంలో ప్రముఖ పారిశ్రామిక, వాణిజ్య సంస్థలైన పిరమాల్, టాటా, రహేజా, ఐ.టి.సి., పంటలూన్, ఆర్.పీ గోయెంకా గ్రూప్ రిటైల్ వ్యాపార రంగంలోకి ప్రవేశించాయి. ఫుడ్‌వరల్డ్, నీలగిరీస్, సుభిక్ష, జెయింట్ వంటి పెద్ద సంస్థలు పలునగరాల్లో రిటైల్ రంగంలో తమ శాఖలను విస్తరించాయి. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ మనదేశంలో తగినంతగా అభివృద్ధి చెందకపోవడంవల్ల కూడా రైతాంగానికి సరైన ధరలు లభించడంలేదు. ముఖ్యంగా పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్నా కోత అనంతర నష్టాలవల్ల దాదాపు 40 శాతం వృథాగా పోతున్నాయని ఒక అంచనా. ఇటీవల ప్రజల్లో ఆరోగ్యంపట్ల అవగాహన పెరగటంతో ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసిన ఉత్పత్తులను హెచ్చు ధరలిచ్చి కొంతమంది, ముఖ్యంగా నగరాల్లోని ఎగువ మధ్యతరగతి వారు కొంటున్నారు. అందువల్ల మనదేశంలో రిటైల్ వ్యాపార రంగంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించాలనే విధాన నిర్ణయం తీసుకొనేముందు మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే విదేశీ పెట్టుబడులను అనుమతించి, రెండు లేక మూడు సంవత్సరాలపాటు వాటి పనితీరును, దేశీయ రిటైల్ వ్యాపార రంగంపై, ముఖ్యంగా ఉపాధి అవకాశాలపై వాటి ప్రభావాన్ని మదింపు చేయడం

అవసరం. సత్ఫలితాలు వస్తే అప్పుడు మిగతా నగరాల్లోకి అనుమతించవచ్చు. ఈ సందర్భంగా బ్రిటన్‌లో పెద్ద రిటైల్ టెస్కో సంస్థ డైరెక్టర్‌గా పనిచేసిన పాల్ ఎటేగార్ట్ చేసిన హెచ్చరికను మరువరాదు. "ప్రపంచంలోని అతిపెద్ద రిటైల్ వ్యాపార సంస్థలు తమతో భాగస్వాములు కావాలని భారతీయ రిటైల్ వ్యాపారులను కోరినా, వారు ఆ మాయలో పడరాదు. ఎందుకంటే ఆ విదేశీ బహుళజాతి సంస్థలు అంతిమంగా తమదే పూర్తి ఆధిపత్యం ఉండాలని కోరుకుంటాయి. భారతదేశంలో రిటైల్ రంగంలోకి విదేశీ పెట్టుబడుల విషయంలో ఇప్పుడున్న కఠిన నిబంధనలను కొనసాగించడం మంచిది" అంటూ ఆయన ఇచ్చిన సలహాను పాటించాలి.

*ది. 29-12-2003.* — *ఈనాడు*

# ఆశ నిరాశల మధ్య వ్యవసాయ రంగం

మన రాష్ట్రంలో వై.ఎస్.రాజశేఖర రెడ్డి నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం కావస్తున్నది. 1989-94 మధ్య కాలంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కన్నా 1996 నుంచి 2004 వరకూ తెలుగుదేశం ప్రభుత్వాల కాలంలో వ్యవసాయాభివృద్ధికి పలు చర్యలు తీసుకున్నా, తొమ్మిదేళ్ళలో కేవలం రెండు సంవత్సరాలు సాధారణ వర్షపాతాన్ని పొందగా, ఏడేళ్లు కరవుతోనో, తుఫానుతోనో రైతాంగాన్ని తీవ్రమైన కష్టనష్టాలకు గురిచేశాయి. పలు పథకాలకు అంతకుముందుతో పోలిస్తే గణనీయంగా అధిక మొత్తాలను కేటాయించి భూసార పరిరక్షణకు సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను పెద్ద ఎత్తున అందించి, జిప్సంను, జింకు సల్ఫేట్‌ను భారీగా సబ్సిడీతో లభింపజేసి అనేక పంటలకు కావలసిన విత్తనాలను 50 శాతం సబ్సిడీతో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు 75 శాతం సబ్సిడీతో అందించినా ప్రకృతి వైపరీత్యాలతో పాటు మరికొన్ని అంశాలు కూడా తోడై, ఆర్థికంగా నష్టపోయిన రైతాంగం గ్రామీణ ప్రజానీకం మార్పును కోరి భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో నూతనంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దోహదపడింది.

వై.ఎస్ ముఖ్యమంత్రిగా నూతన ప్రభుత్వం ఏర్పడగానే వ్యవసాయ అవసరాలకు ఉచితంగా విద్యుత్‌ని అందించాలని అప్పటి వరకూ ఉన్న విద్యుత్ బకాయిలను రద్దుచేయాలని నిర్ణయం తీసుకోవడం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతాంగానికి ఊరట కలిగించింది. కొంత కాలం తర్వాత ఉచిత విద్యుత్‌ని కొన్ని వర్గాల రైతులకు ఉపసంహరించడం వలన వారిలో నిరసన వ్యక్తమయింది.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వై.ఎస్ పదే పదే మాట్లాడుతూ వచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసినందువల్లే ఇంత పెద్ద సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల ఆత్మహత్యలు ఉండబోవని హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. కానీ గత సంవత్సర కాలంలో దాదాపు రెండు వేల మంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారు. వాస్తవానికి మన రాష్ట్రంలో 1987 ప్రాంతంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వాతావరణం అనుకూలించక తెల్లదోమ, శనగపచ్చ పురుగుల వల్ల పత్తి పంట దెబ్బతిని షుమారు 76 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తిరిగి 1997-98లో వరంగల్, కరీంనగర్, మరి కొన్ని జిల్లాల్లో వాతావరణం అనుకూలించక శనగపచ్చ పురుగు ఉత్పత్తి వల్ల పత్తి, కంది పంటలు తీవ్రంగా నష్టపోయి దాదాపు మూడు వందల మంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారు. ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం 50 వేలు, కేంద్ర ప్రభుత్వం 50 వేల ఆర్థిక సహకారాన్ని మృతుల కుటుంబాలకు అందించడమే గాక, ఆ జిల్లాల్లో పత్తి, కంది పంటలు పండించిన రైతుల రుణాలపై మారటోరియం విధించి కొంత వెసులుబాటును కల్పిస్తూ మృతుల కుటుంబాల్లోని వారికి విద్యావకాశం, ఉద్యోగావకాశం కల్పిస్తూ ప్యాకేజీని ప్రకటించింది.

వై.ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున లక్ష రూపాయలు కేంద్ర ప్రభుత్వం తరపున 50 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా సహకారాన్ని మృతుల కుటుంబాలకు అందించాలని దానితో పాటు గతంలో వలే ప్యాకేజిని ప్రకటించడం ఆ కుటుంబాలకు చాలా మేలు చేకూరింది. కాని ఆత్మహత్యల పరంపర ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది. ప్రైవేటు రుణాలపై మారటోరియం, వరుసగా రెండేళ్లలో కరవు మండలాల్లో మాత్రం బ్యాంకు రుణాల వసూళ్ళ నిలుపుదల మంచి నిర్ణయాలే. అయితే ఆత్మహత్యలకు మూలమైన కారణాలకు ఈ పరిష్కారం చాలదు.

రైతులకు భూమే ఆస్తి, కమర్షియల్ బ్యాంకులు సహకార బ్యాంకులు తాము ఇస్తూ ఉన్న రుణ పరపతిలో కనీసం 18 శాతాన్ని వ్యవసాయ రంగానికి ఇవ్వవలెననే రిజర్వు బ్యాంకు ఆదేశాలను పక్కకునెట్టి వ్యవసాయ అవసరాలకు సకాలంలో సరిపడగా వ్యవస్థీకృత రంగం ద్వారా పరపతి లభించడం లేదన్నది నగ్నసత్యం. వ్యవసాయాధార పరిశ్రమలకు ఇచ్చిన రుణాన్ని కూడా కలిపినా కూడా 11 శాతం మిగలడం లేదు. సన్నకారు చిన్నకారు రైతుల్లో ఎక్కువ మంది ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపైనే

ఆధారపపడవలసి వస్తుంది. కౌలు రైతులకు ప్రైవేటు రుణాలు తప్ప గత్యంతరం లేదు. పంటలు పండించుకోవాడనికే గాక తన కుటుంబ అవసరాలకు కూడా రైతులు తాము వ్యవసాయం గురించి తెచ్చుకున్న రుణం నుంచి ఖర్చు పెట్టుకోవలసి ఉంటుంది. ఈ అవసరాలకు బ్యాంకులు తోడ్పాటునివ్వటం లేదు.

అష్టకష్టాలకు ఓర్చి పండించిన పంటలకు సరైన ధరలు లభించక మార్కెట్ మాయాజాలంలో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. రైతుబజార్లు వలన కూరగాయలు పండించే రైతులకు కొద్ది మేర ప్రయోజనం చేకూరినా పండ్లు, మిర్చి, పత్తి వంటి అనేక పంటల మార్కెటింగ్‌లో రైతులు నలిగిపోతున్నారు. వాతావరణంలో మార్పులు చీడపీడలకు దోహదం చేసి పంట దిగుబడులను దెబ్బ తీస్తున్నాయి. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాలను ఇప్పుడు అమల్లో ఉన్న జాతీయ వ్యవసాయ భీమా పథకం పూడ్చలేకపోతున్నందున రైతాంగంలో అధిక భాగం ఆర్థికంగా దెబ్బతిని ఉన్నారు. బిడ్డలు ఉద్యోగాలు చేస్తూ ఉంటే, విదేశాల్లో ఉంటే వ్యాపారం ఉన్న కుటుంబాలు పచ్చగా ఉన్నాయి తప్ప ఎక్కువ మంది గ్రామీణ రైతాంగం రుణ భారంతో కుంగి ఉన్నారు.

జాతీయ సహకార బ్యాంకులు వరసగా రెండు సంవత్సరాల్లో కరువు వచ్చిన మండలాల్లో నిర్భంధరుణాల వసూళ్లకు పూనుకోవద్దు అనే విధానాన్ని ఇతర మండలాలకు కూడా వర్తింప చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి జిల్లాలో 'హెల్ప్‌లైన్' వ్యవస్థను ఏర్పరచారు. ఏ కారణం వల్ల కాని తనకున్న అప్పును వెంటనే తీర్చగల పరిస్థితి లేనప్పుడు హెల్ప్‌లైన్ వ్యవస్థకు తెలియపరిస్తే వారు సంబంధిత ఆర్థిక సంస్థకు ఆ రైతు బకాయి గురించి వత్తిడి చేయకుండా తదుపరి వచ్చే పంట వరకు ఆగేలా ఆదేశిక సూత్రాలను ప్రభుత్వం రిజర్వు బ్యాంకుతో మాట్లాడి ఇప్పించి అందుకు అవసరమైన చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్యల పరంపర ఆగదు.

ఈ సంవత్సరం మిర్చి, పత్తి వాణిజ్య పంటలను పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో కాటన్ కార్పోరేషన్‌ను రంగంలోకి దింపి పత్తిని కొనుగోలు చేయించగా ఈ సంవత్సరం కొనుగోళ్లు మందంగా జరగటమే గాక ధర కూడా నిరుటి

(2004)కన్నా తక్కువ లభించటంతో పత్తి రైతులు దిగాలు చెందారు. ఎంతో ఆశతో సాగుచేసిన బిటి పత్తి కూడా ఆశించిన దిగుబడినివ్వలేక పోవటంతో రైతులు నిరాశ చెందారు. అలాగే మిర్చిపంటకు నిరుడు క్వింటాలుకు రు. 2300లు నుంచి రు. 2700లు లభించగా ఈ సంవత్సరం క్వింటాలుకు రు. 1500ల నుంచి రు. 1800లు మాత్రమే లభించటం రైతాంగాన్ని నిరాశ నిస్పృహలకు గురిచేసి ఆందోళనాపథం వైపునకు దారి తీసింది.

కనీస మద్దతు ధరలు ప్రకటించని మిర్చి, పసుపు వంటి పంటలకు రుణ పరపతిని బ్యాంకులు కలుగచేయకూడదని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించటం బ్యాంకులకు తప్పుడు సంకేతాలను పంపుతుంది. వాస్తవానికి ఎగుమతి అవకాశాలు పుష్కలంగా ఉన్న ఈ రెండు పంటలకు కనీస మద్దతు ధరలను ఇప్పటి వరకు ధరల కమిషన్ పరిధిలోకి తీసుకురాకపోవటం చాలా దురదృష్టకరం. మన దేశంలో ఈ పసుపు, మిర్చి పంటలను అత్యధికంగా పండిస్తున్నది మన రాష్ట్రంలోనే. ఈ రెండు పంటలకు మద్దతు ధరలు ప్రకటించేలా లోగడ కేంద్ర ప్రభుత్వం పైన తెచ్చిన వత్తిడి ఫలించలేదు. ఇప్పుడు తిరిగి అటువంటి ప్రయత్నం చేయటమే గాక 'రైతుబంధు' పథకం ద్వారా గోడౌన్‌లో పెట్టిన సరుకు విలువలో 75 శాతం అడ్వాన్సుగా ఇచ్చి రైతు తన పంటను తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి తప్పించటం ద్వారా ఈ సమస్యను అధిగమించాలి తప్ప రుణాల మంజూరును ఆపటం సరికాదు.

ఇరిగేషన్ రంగానికి గణనీయంగా కేటాయింపులను పెంచినా వ్యవసాయం అనుబంధ వ్యాపకాలకు కేటాయింపులు పెద్దగా పెరగలేదు. గతంతో పోలిస్తే భూసార పెంపునకు జీలగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు పలు పంటలు సకాలంలో వేసుకోగలగటానికి విత్తనాల పైన సబ్సిడీలు చాలా తగ్గిపోయాయి. విస్తరణను పటిష్టంగా రైతుల ముంగిటకి తీసుకువెళ్లటానికి ఎంపిఇవోలకు తరచుగా శిక్షణ గడుపుతూ వారి సేవలను రైతులకు ఉపయోగపర్చాలి. కేంద్ర పథకాలను పూర్తిగా వినియోగించుకుంటూ గ్రామీణ రహదారులు, గోడౌన్లు, మార్కెట్ యార్డుల్లో ఆరుదల పోత యంత్రాలు, క్వాలిటీ పరీక్షకు అవసరమైన పరికరాలను సమకూర్చి కోతకు ముందు కోత తర్వాత నష్టాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో వ్యవసాయానుబంధ పరిశ్రమలు

కుటీర చిన్న స్థాయిలో స్థాపించబడి వ్యవసాయోత్పత్తుల విలువ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యే పరిస్థితులను ప్రోత్సహించాలి. సముద్రతీరం ఉండటం వల్ల తుఫాన్లు, తరచుగా కరువుకి గురవుతున్న రాయల సీమ, తెలంగాణ, కోస్తాలో కొన్ని ప్రాంతాల్లోని రైతాంగాన్ని ఆదుకోగల వ్యవసాయ బీమా పథకం రూపకల్పనకు చిన్న రైతుకి కూడా ప్రీమియం అందుబాటులో ఉండేందుకు కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావలస అవసరం మన రాష్ట్ర అనుభవాల దృష్ట్యా అత్యంత ఆవశ్యం.

*ది. 09-05-2005.* **- ఆంధ్రభూమి**

●

# రైతు ఆనందం అదనపు భారమా!

'భారత్‌లో గడచిన ఇరవై ఏళ్లుగా పలు కారణాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రైతుల స్థితిగతులు రానురాను దిగజారుతున్నాయి. వారు వ్యవసాయం కొనసాగించలేని పరిస్థితులేర్పడుతున్నాయి. ఈ సంక్షోభాన్ని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది' - అని డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ తేల్చిచెప్పింది. ఆ కమిషనే తన తుది నివేదికను కేంద్ర ప్రభుత్వానికి 2006 అక్టోబరులో సమర్పించింది. గోధుమతో సమానంగా వరికి మద్దతు ధర కల్పించాలంటూ పలు రాజకీయ పక్షాలు, రైతు సంఘాలు ఒత్తిడి తెచ్చిన దరిమిలా - కేంద్రం 'జాతీయ రైతు విధానం - 2007'ను నిరుడు (2007) నవంబరులో పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అంటే - స్వామినాథన్ సూచనలపై స్పందించడానికి కేంద్రానికి సంవత్సరం పట్టింది. పదకొండో పంచవర్ష ప్రణాళిక కాలంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) తొమ్మిది శాతం పెరగాలంటే, వ్యవసాయ రంగ వృద్ధి రేటు నాలుగు శాతం పెరగాలని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ నుంచి అందరూ వదే పదే చెబుతున్నారు. పదకొండో ప్రణాళిక కాలం నిరుటి (2007)నుంచి ప్రారంభమైంది కూడా.

## పట్టింపులేని ప్రభుత్వం

డాక్టర్ స్వామినాథన్ చేసిన కొన్ని ముఖ్యమైన సిఫారసులకు కేంద్రం 'జాతీయ రైతు విధానం - 2007' ముసాయిదాలో చోటు కల్పించలేదు. రైతులకు మిగిలే నికర ఆదాయాన్నే వ్యవసాయ అభివృద్ధికి కొలబద్దగా పరిగణించాలని రైతు కమిషన్ చేసిన సిఫార్సు కేంద్రానికి ఆమోదయోగ్యం కాలేదేమోననిపిస్తోంది. పంటల ఉత్పత్తికి అయ్యే వ్యయాన్ని లెక్కించడంలో వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం అనుసరిస్తున్న పద్ధతి లోపభూయిష్ఠంగా ఉందని, కాబట్టి క్వింటాల్ ఉత్పత్తికి అయ్యే వ్యయానికి అదనంగా యాభై శాతం కలిపి కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని ఆ కమిషన్ సూచించింది.

అయితే, వరికి కానీ, పత్తి, చెరకు తదితర పంటలకు కానీ జాతీయ రైతు కమిషన్ సూచించిన పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ఇంతవరకు సవరించలేదు. వ్యవసాయ రంగం పట్ల కేంద్రంలోని ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ.) ప్రభుత్వానికి గల ఉదాసీనతకు ఇది నిదర్శనం. పారిశ్రామిక ఉత్పత్తుల విక్రయ ధరలను - వాటి ఉత్పత్తికి అయ్యే వ్యయంపైన రెండు వందల నుంచి మూడు వందల శాతం వరకు కలుపుకొని నిర్ణయిస్తుంటే కేంద్ర ప్రభుత్వం సమ్మతిస్తోంది. కానీ, అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంటూ అధిక వ్యయ ప్రయాసలకోర్చి రైతులు పండిస్తున్న పంటలకు ధరలు నిర్ణయించడంలో మాత్రం వాటి సగటు ఉత్పత్తి వ్యయానికి యాభై శాతం కలపడానికి ఇచ్ఛగించడంలేదు. పైపెచ్చు, వాటికి బోనసుగా మరో యాభై రూపాయలిస్తే, రెండు వేల కోట్ల రూపాయల మేరకు భారం పడుతుందన్న కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం మాటలనే సమర్థించింది. దీన్నిబట్టి కేంద్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలకు బాసటగా నిలుస్తోందో ప్రజలకు అర్థమవుతూనే ఉంది. ఈ ఖరీఫ్ పంట కాలంలో వరి కోతలకు, కుప్పలు వేయడానికి రైతులకు రెండేళ్ళ క్రితం కంటే 50 నుంచి 90 శాతం వరకు అదనంగా ఖర్చయింది. తమ ఉత్పత్తులకు బోనసు రూపంలో లభించే ఆదాయానికి మించి రైతులకు ఖర్చవుతోందని ఢిల్లీలోని పాలకులకు కానీ, ప్రణాళికా సంఘానికి కానీ, వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘానికి కానీ తెలియదు, తెలిసినా పట్టించుకోరు. ఇలాగే కుప్పనూర్పిళ్ల విషయంలో కూడా చాలా అధికంగా ఖర్చయ్యే పరిస్థితి కొనసాగేట్లయితే, ఈ ఏడాది కౌలు రైతుల్లో చాలా మంది కౌళ్లనుంచి తప్పుకొనే అవకాశముంది. అప్పుడు ఉత్పాదకత, ఉత్పత్తి ఇప్పటికన్నా మరికొంత తగ్గిపోయే ప్రమాదముంది. పర్యవసానంగా మనం ఇతర దేశాల నుంచి ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు. అది మన దేశ సార్వభౌమత్వంపై ప్రభావం చూపే ప్రమాదమూ లేకపోలేదు. పంటల ధరలను స్థిరీకరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వాములుగా ఓ నిధిని ఏర్పాటు చేయాలన్నది స్వామినాథన్ కమిషన్ చేసిన మరో ముఖ్యమైన సిఫార్సు. రైతుల ఉత్పత్తులకు మార్కెట్లలో సరైన ధరలు లభించనపుడు- మార్కెట్ల నుంచి ఆ ఉత్పత్తులను ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి నుంచి నిధులు వెచ్చించి కొనుగోలు చేయాలని రైతు కమిషన్ సూచించింది. అయితే, జాతీయ రైతు విధానం-2007 ముసాయిదాలో ఈ అంశం ప్రస్తావనే లేకపోవడం రైతుల సంక్షేమం పట్ల పాలకులకుగల శ్రద్ధ 'ఏపాటిదో' తేటతెల్లం చేస్తోంది.

పంటల ఉత్పాదకతను, ఉత్పత్తిని పెంచేందుకు దోహదం చేసే అంశాలలో వాటికి లభించే గిట్టుబాటు ధర అతిముఖ్యమైనది. అందువల్ల డాక్టర్ స్వామినాథన్ చేసిన ఈ సిఫారసు సహేతుకమైనదే. పదకొండో ప్రణాళిక ఆఖరుకి మన దేశ జనాభా 120 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఆ జనాభా ఆహార అవసరాలు తీర్చడానికి 22 కోట్ల టన్నుల మేరకు ఆహారధాన్యాలను పండించవలసి ఉంటుంది. మాంసాహార వినియోగం క్రమేపీ పెరుగుతున్న దృష్ట్యా- పశువులు, కోళ్ల పరిశ్రమ, మత్స్యరంగాలకు కావలసిన ఫీడ్, పశుగ్రాసం కోసం రెండు కోట్ల అరవై లక్షల టన్నులు అవసరమవుతాయని పదకొండో పంచవర్ష ప్రణాళిక పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి 2011-12 నాటికి 22 కోట్ల 40 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి కాగలవని అంచనా వేసింది. అందువల్ల 2011-12 నాటికి కోటిటన్నుల బియ్యాన్ని, 80 లక్షల టన్నుల గోధుమలను, 20 లక్షల టన్నుల పప్పుధాన్యాలను అదనంగా పండించాలన్న లక్ష్యాన్ని అందులో నిర్దేశించారు. ఈ సందర్భంగా ఓ విషయాన్ని గమనించాలి. పదో పంచవర్ష ప్రణాళిక ప్రారంభం నాటికి దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 21 కోట్ల టన్నులుగా ఉంది. ఆ ప్రణాళికాంతానికి ఆహారధాన్యాల ఉత్పత్తి 23 కోట్ల 20 లక్షల టన్నులకు మించలేదన్న వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించరాదు. పదకొండో ప్రణాళికలో నిర్దేశించుకున్న రీతిలో 2011-12 నాటికి 22 కోట్ల 44 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తుల స్థాయిని చేరుకోలేకపోతే పరిస్థితి మరింత తీవ్రతరమవుతుంది.

మరోవైపు ఆహారధాన్యాల నుంచి ఇథనాల్‌ను తయారుచేసే ప్రక్రియ పలుదేశాల్లో ఊపందుకుంటోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు కావలసిన ఆహార ధాన్యాల లభ్యత తగ్గిపోతోంది. ప్రపంచం మొత్తంలో ఆహార ధాన్యాల నిల్వలు గత పాతికేళ్లలో కనిష్ఠస్థాయికి తగ్గిపోయాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ.) ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. మరోవైపు ప్రపంచ మార్కెట్లలో ఆహారధాన్యాల ధరలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు నిరుడు (2007) ఫిబ్రవరిలో టన్ను గోధుమల ధర 180 డాలర్లు ఉండగా, అక్టోబరు నాటికి అది 370 డాలర్లకు పెరిగింది. పర్యవసానంగా ఆహార ఉత్పత్తుల ధరలు చైనాలో 18 శాతం. ఇండోనేసియాలో 13 శాతం, లాటిన్ అమెరికాలో 10 శాతం మేరకు పెరిగాయి. గోధుమల ధరలో వంద శాతం, మొక్కజొన్న ధరలో యాభైశాతం, బియ్యం ధరలు ఇరవై శాతం పెరిగాయి. రాబోయే సంవత్సరాల్లో

కూడా ఆహార ధాన్యాల ధరలు అధికస్థాయిలో ఉండవచ్చునన్నది. ఆర్థిక నిపుణుల అంచనా. ఈ నేపథ్యంలో మన దేశ జనాభా, అవసరాలు, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా- గోధుమలు, బియ్యం, వంటనూనెలు, పప్పుధాన్యాలు వంటి వాటిని హెచ్చు పరిమాణంలో అధిక ధరలు చెల్లించి మరీ విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితిని మన ప్రభుత్వం రానీయకూడదు. వ్యవసాయ రంగంలో, దాని అనుబంధ వ్యాపకాల్లో తన పెట్టుబడులను పెంచడం ద్వారా ఉత్పాదకతను పెంపొందించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. ఇందుకోసం వ్యవసాయ పరిశోధనలు, విస్తరణకు, భూసారం పెంపుదల, యాంత్రీకరణ, మార్కెటింగ్‌లో మౌలిక వసతుల కల్పన, గ్రామీణ గిడ్డంగులు, కోల్డ్ చైన్ సదుపాయాల విస్తరణ, నీటిపారుదల సౌకర్యాల పెంపుదల వంటి వాటికి ప్రభుత్వ రంగంలో పెట్టుబడులను పెంచవలసిన అవసరమెంతైనా ఉంది. అయితే ఇందుకు భిన్నంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టు బడులు క్రమేపీ తగ్గిపోతూ వచ్చాయి. వ్యవసాయానికి అవసరమైన రుణాల లభ్యత కూడా రైతులకు గగన కుసుమంలా తయారైంది. స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్లు దాటిన తరువాత కూడా, దేశంలోని సగం మందికి పైగా రైతులు అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యాపారుల నుంచి రుణాలు తెచ్చుకోవలసిన దుస్థితిలో ఉండటం వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వాల నిరాసక్తతకు అద్దం పడుతోంది. ప్రభుత్వ ఉదాసీన ధోరణి, బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం తదితర కారణాలవల్లనే మన దేశంలోని వ్యవసాయ రంగంలో ప్రగతి మందగిస్తోంది.

## ఆదాయం తక్కువ... ఖర్చు ఎక్కువ

మార్కెట్లో దోపిడీకి గురవుతున్న రైతుల్ని ఆదుకోవడానికి మన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. పత్తి, వరి, చెరకు, జొన్న, మొక్కజొన్న మినుము, వేరుసెనగ, పొద్దుతిరుగుడు పువ్వు మొదలైన పంటల సాగుకు అన్ని రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఖర్చు ఎక్కువ అని వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం కూడా పేర్కొంది. ఓ రైతు కుటుంబానికి వ్యవసాయంతోపాటు ఇతర మార్గాల ద్వారా వచ్చే సగటు ఆదాయం రూ. 19,600 కాగా, సేద్యం, పిల్లల చదువు, వైద్యం వంటి ఖర్చులు రూ. 28,600 అని నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ ఓ అధ్యయనంలో వెల్లడించింది. ఇలా ఆదాయం తక్కువ, వ్యయం

ఎక్కువగా ఉండటం వల్ల నూటికి 82 మంది రైతులు రుణభారంతో కుంగిపోతున్నారని ఆ సర్వే పేర్కొంది. అందువల్ల మన దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం కూడా మాటల్లో కాకుండా చేతల రూపేణా వ్యవసాయ రంగ ప్రగతికి దోహదం చేసే చర్యలను తీసుకోవాలి. డాక్టర్ స్వామినాథన్ సారథ్యంలోని జాతీయ రైతు కమిషన్ చేసిన సిఫారసులను ఆమోదించి, 'జాతీయ రైతు విధానం 2007' ముసాయిదాలో తగు మార్పులు చేయాలి. అందుకు అనుగుణంగా ఆర్థికంగాను, విధానపరంగాను తగిన నిర్ణయాలు తీసుకుని కార్యాచరణకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించినప్పుడే పదకొండో పంచవర్ష ప్రణాళికలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించగలం.

*ది. 10-01-2008.* — *ఈనాడు*

●

# ఓటు పథకాలతో రైతుకు చేటు

రైతు ఆత్మహత్యల నివారణకు ఉద్దేశించిన ప్రధాన మంత్రి ప్యాకేజీ, రుణమాఫీ పథకాల గురించి నిరుడు (2008) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నాయి. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన పథకాలు ఇవి. కాబట్టే రైతు ఆత్మహత్యలు ఆగలేదు. కర్షకుల రుణ బాధలూ తీరలేదు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో నిరుడు (2008) వేలమంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చిన వారే వీరిలో ఎక్కువమంది ఉన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులను ఆదుకోలేదన్నది వాస్తవం.

ప్రభుత్వాలు రైతు సంక్షేమ పథకాలను విస్మరిస్తున్నాయి. వడ్డీ వ్యాపారులను నియంత్రించడానికి పదునైన చట్టాన్ని తెస్తామని అధికారానికి వచ్చిన తొలినాళ్లలో వై.ఎస్.సర్కారు ప్రకటనలతో హోరెత్తించింది. రిజర్వు బ్యాంకు నుంచి నమూనా చట్టం వచ్చి రెండేళ్లయింది. అయినా, వై.ఎస్. సర్కారు ఈ దిశగా తీసుకున్న చొరవ దాదాపు శూన్యం. అయిదేళ్ల పాలనలో వడ్డీవ్యాపారుల దోపిడీలు, అకృత్యాలు యథేచ్ఛగా సాగిపోయాయి. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలవల్ల పంటలు నాశనమైతే రైతులను ఆదుకొనే పంటల బీమా పథకం జాడ లేదు. అయిదు లక్షల మంది కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలను కల్పిస్తామన్న ప్రభుత్వ ప్రకటన కాగితాలకే పరిమితమైంది.

## తప్పని దిగుమతులు

ఓటు పథకాలు ఓటి మాటలు రైతుల కన్నీటిని తుడవవు. శ్రమ ఫలితానికి గిట్టుబాటు ధర లభిస్తేనే రైతుకు నిజమైన ఆనందం. సేద్యపు పనుల్లో అనునిత్యం

స్వేదం చిందించే కర్షకులను ప్రభుత్వ విధానాలు ఎప్పటికప్పుడు ఆదుకోవాలి. వారి అవసరాలకు రుణాలు, మంచి విత్తనాలు, సకాలంలో ఎరువులు అందజేయాలి. నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలి. అంతిమంగా శ్రమఫలానికి మద్దతు ధర దక్కాలి. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైె పంట నష్టపోతే పంటల బీమా పథకాలు ఆదుకోవాలి. నిరుడు (2008) రాష్ట్ర రైతులను అడుగడుగునా వేధించిన సమస్యలు ఎన్నో! వాటి పరిష్కారం కోసం రోడ్డెక్కిన రైతులు పోలీసుల చేతుల్లో లాఠీ దెబ్బలు తిని బావురుమనే పరిస్థితులు దాపురించాయి. అనంతపురం జిల్లాలో అధిక వర్షాలు వేరుశెనగ పంటను సర్వనాశనం చేస్తే, ఖైముక్ తుపాను వరిపంటను ఊడ్చేసింది. దెబ్బతిన్న పంటకు సరైన ధర చెల్లించడానికి మిల్లర్లు ముందుకురావడంలేదు. ఎఫ్.సి.ఐ., రాష్ట్ర ప్రభుత్వ సంస్థలూ వెనకడుగు వేస్తున్నాయి. రైతులను ఆదుకోవాలంటే ధాన్యం లేదా బియ్యం నాణ్యతప్రమాణాలను సడలించాలి. కానీ, ఈ దిశగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్న ఆలోచనలు సైతం రాష్ట్ర సర్కారులో మెదలకపోవడం దురదృష్టకరం. ఫలితంగా వ్యవసాయ ప్రధాన దేశం ఆహార భద్రత కోసం దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

ఏటా యాభై లక్షల టన్నులకు పైగా వంటనూనెలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మన దేశంలో నూనె గింజల పంటలకు వర్షాలే ఆధారం. ఆ భూములకు సాగునీటి సౌకర్యం కల్పిస్తే దిగుమతుల బెడద తప్పుతుంది. ఆర్థిక సంస్కరణలంటూ సుంకాలను తగ్గించడంతో – ప్రపంచంలోనే అత్యధికంగా వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్న దేశంగా భారత్ మారిపోయింది. ద్రవ్యోల్బణం 11 శాతానికి చేరి, ధరలు పెరిగినప్పుడు దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తేశారు. దానితో ఆయిల్‌పామ్ ధరలు అదుపులోకి వచ్చాయి. దేశీయంగా ఆయిల్‌పామ్ రైతులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం ఇటీవల ఆయిల్‌పామ్ గెలల టన్ను ధరను రూ. 6,210 నుంచి రూ. 4,342లకు తగ్గించి రైతు నడ్డి విరిచింది. చెరకు రైతుల పరిస్థితి మరీ దీనంగా మారింది. గిట్టుబాటుకాని ధరలు, నరకు కూలీలు దొరక్క చెరకు సాగుకే రైతులు దూరమవుతున్నారు. ఫలితంగా పంట విస్తీర్ణమూ పడిపోయింది. పంచదార దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఇంత జరుగుతున్నా సి.ఎ.పి.పి. సిఫార్సు మేరకు చెరకు రైతుకు క్వింటాలుకు రూ. 125; ముప్పై రూపాయల బోనస్‌ను ఇవ్వడానికి పాలకులకు చేతులు రావడం లేదు. రూ. 81.80లను చెల్లించి చేతులు

దులుపుకొంటోంది. కొన్ని రాష్ట్రాలు సలహాధరను ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమైతే ఇప్పటికీ ఆ పని చేయలేదు. నిరుడు (2008) 60 లక్షల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవాల్సి రావడం భారత వ్యవసాయ రంగానికే చేదు అనుభవం. పత్తి, మినప, పెసర, కంది పంటలకు కనీస మద్దతు ధరలను కేంద్రం 35 నుంచి 50 శాతం మేరకు పెంచడం ఆ పంట రైతులకు కొంతలో కొంత మేలు. పత్తి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3000లకు పెరిగింది. ఆ ధర చెల్లించి కొనుగోళ్లు జరిపేందుకు మాత్రం నూలు మిల్లులు, వ్యాపారులు ముందుకురావడం లేదు. ప్రపంచ మార్కెట్లలో పత్తి గిరాకీ పెరిగినప్పుడు లాభాలు దండుకొన్న వ్యాపారులు- మార్కెట్ పతనమైనప్పుడు కొనుగోళ్ల వైపు దృష్టి సారించలేదు. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఎగుమతులకు ఊతమివ్వాలి. మొక్కజొన్న, సోయామీల్ ప్రోత్సహించిన రీతిలో వెసులుబాట్లు కల్పించాలి. మొక్కజొన్న, సోయామీల్ ఎగుమతి విలువలో అయిదు శాతం మేర - దిగుమతి సుంకం లేని దిగుమతులకు ప్రభుత్వం అనుమతించింది. దీనివల్ల ఎగుమతుల్లో సరిపడా లాభం దక్కకపోయినా - దిగుమతుల ద్వారా ఆ లోటును పూడ్చుకొనే అవకాశం ఎగుమతి దారులకు దక్కుతోంది. ఈ రాయితీని అయిదు శాతం నుంచి పది శాతానికి పెంచి మొక్కజొన్న, సోయామీల్, పత్తి, పంచదార ఎగుమతిదారులనూ కేంద్రం ప్రోత్సహించాలి. అధిక సంఖ్యలో ఉన్న పత్తి రైతుల ఆత్మహత్యలు, తగ్గిపోతున్న చెరకు సాగు విస్తీర్ణం నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సత్వరమే చర్యలు చేపట్టాలి. పెను ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన అమెరికా, ఐరోపా దేశాలు పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు ఇప్పట్లో ఆసక్తి చూపవు. ఆహారం అవసరం కాబట్టి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను కాదనలేవు. భారత రైతాంగానికి మేలు జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎగుమతి విధానాలను రూపొందించాలి. రైతులకు గిట్టుబాటు ధరలు అందజేయాలి. రైతుల పరపతి పెరగాలి. కానీ, నేటికీ బ్యాంకులు వ్యవసాయరంగాన్ని, రైతులను చిన్న చూపు చూస్తున్నాయి. అవి గ్రామాల్లో శాఖలను తగ్గిస్తూ పట్టణాలు, నగరాలకు తమ కార్యకలాపాలను విస్తరించడమే ఇందుకు దాఖలా! ఆర్.బి.ఐ. దృష్టిసారించాల్సిన అంశమిది.

రైతు ప్రయోజనాలను దెబ్బతీయడంలో బహుళజాతి సంస్థలూ తమదైన పాత్ర పోషిస్తున్నాయి. కొత్త విత్తన బిల్లు చట్టం కాకుండా ఆ సంస్థలే అడ్డు తగులుతున్నాయని

అంటున్నారు. పేటెంట్ విత్తనాలతో పంట పండించినా తదుపరి పంటకోసం విత్తనాలు సేకరించి, వీలైతే సమీప రైతులకు విక్రయించుకొనే వెసులుబాటు ఈ బిల్లు రైతులకు కల్పిస్తోంది. బహుళజాతి సంస్థల చర్యలతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. వరి, వంగ, క్యాబేజీవంటి పలు ఆహార పంటలను జన్యుమార్పిడితో అభివృద్ధిపరుస్తున్నారు. ఇవి మనుషుల, పశువుల ఆరోగ్యానికి హానికరమని ప్రయోగ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. బహుళజాతి సంస్థలకు వత్తాసు పలుకుతున్న ఉన్నతాధికారులు, అమెరికా, అర్జెంటీనా దేశాల నుంచి జన్యుమార్పిడి ఆహార ఉత్పత్తుల దిగుమతికి అనుమతిస్తున్నారు. అవెంత ప్రమాదకరమో నిర్ధారించే ఏర్పాట్లు మన విమాన, నౌకాశ్రయాల్లో లేవు. పొంచివున్న ప్రమాదాన్ని కేంద్ర సర్కారూ గుర్తించడం లేదు. కూలీల కొరత సమస్యను అధిగమించడానికి రైతులు యాంత్రీకరణపై దృష్టి సారించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పొదుపైన వ్యవసాయ విధానాలను పాటిస్తే నికరాదాయాలు పెరుగుతాయి. పదిహేను ఎకరాల ఆసామికన్నా సగటు గుమస్తా వేతనమే ఎక్కువ. రైతు ఆదాయ మార్గాలు పెరగాలంటే వ్యవసాయ పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి. మన దేశంలో వ్యవసాయ జి.డి.పి.లో అరశాతం మాత్రమే పరిశోధనలకు కేటాయిస్తున్నారు. బ్రెజిల్ 1.8, జపాన్ 3.6, అమెరికా 2.65 శాతాలను వ్యయపరుస్తున్నాయి. ఇండియా కూడా తన కేటాయింపులను రెండు శాతానికి పెంచాలని ఎస్.కె. సిన్హా కమిటీ ఏనాడో సూచించింది. కేంద్రం వందల కోట్ల రూపాయలు సమకూరుస్తోంది కానీ, భారత్ - అమెరికా నాలెడ్జ్ ఇనీషియేటివ్ ఒప్పందం కింద మాన్‌శాంటో, ఇతర అమెరికన్ బహుళజాతి సంస్థలు జన్యుమార్పిడి విత్తనాలను రూపొందించేందుకు, వాటిని ప్రచారంలోకి తెచ్చేందుకు ఆ నిధులు ఉపయోగపడటం దేశ రైతాంగం దురదృష్టం. ఉద్యాన, మత్స్య, కోళ్ల, పశు పరిశ్రమ రంగాల్లో మరింత ప్రగతి సాధించే అవకాశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరులు నీరుకారుస్తున్నాయి. ఈ రంగాలు జి.డి.పి.లో 5.6 శాతం సమకూర్చడమే కాకుండా కోట్లమందికి ఉపాధి అవకాశాలు, ఆదాయాలు సమకూరుస్తున్నాయి. వీటికి కేటాయింపును రెట్టింపు చేయాలని పార్లమెంటు స్థాయీ సంఘం సిఫార్సు చేసినా ప్రభుత్వానికి చెవికి ఎక్కడం లేదు.

మనదేశంలో వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధి స్వల్పమే. పండ్లు కూరగాయల్లో రెండు శాతం, పౌల్ట్రీలో ఆరు శాతం, సముద్ర మత్య సంపదలో 26శాతం మేరకే ప్రాసెసింగ్ చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో 60 నుంచి 70శాతం మేరకు ప్రాసెస్ చేస్తున్నారు. మలేసియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్‌లాంటి దేశాల్లోనూ

ఆగ్రో ప్రాసెసింగ్ 60 శాతం పైనే ఉంది. మనదేశంలో రవాణా, నిల్వ సౌకర్యాలు లేక, కోత అనంతర నష్టాల కారణంగా ప్రాసెసింగ్ స్థాయి చాలా తక్కువగా ఉంటోంది. ఫలితంగా ఏటా రూ. 16,500 కోట్ల విలువైన ఆహార ధాన్యాలు, రూ. 13,600 కోట్ల విలువైన పళ్లు, కూరగాయలను నష్టపోతున్నాం. వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ రంగాల్లో మొత్తం నష్టం రూ. 55వేల కోట్ల పైమాటేనని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ పార్లమెంటుకు నివేదించింది. నిరుడు (2008) బడ్జెట్‌లో ఆగ్రో-ప్రాసెసింగ్ రంగానికి కేటాయింపులను పెంచినా, తీసుకున్న చర్యలు మాత్రం దాదాపుగా శూన్యం. మన రాష్ట్రంలో మామిడి ఎగుమతులకు ఇర్రేడియేషన్ యూనిట్‌ను నెలకొల్పకపోవడమే అందుకో ఉదాహరణ.

## రాజకీయ దారుణం

రైతులకు నాణ్యమైన సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయ విస్తరణ విధానంలోకి ఆదర్శ రైతులంటూ పార్టీ కార్యకర్తలను చొప్పించడం దురదృష్టకరం. అనుభవజ్ఞులకు కాకుండా, శాసనసభ్యులు సిఫార్సు చేసిన యాభైవేల మందికి నెలకు వెయ్యి రూపాయలు చెల్లించడం రాజకీయ దారుణం. ఇందుకోసం రాష్ట్రం మొత్తంమీద వందల కోట్ల రూపాయలను ఖర్చుచేస్తున్నామని మంత్రులో ప్రకటిస్తున్నారు. వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడి, ప్రజలకు ఆహార భద్రత చేకూరాలంటే ఇటువంటి నియామకాలు ప్రతిభ ఆధారంగా జరగాలి. తెలుగుదేశం ప్రభుత్వ హయాములో యం.పి.ఇ.ఒ.లను రాజకీయ ప్రమేయానికి తావులేకుండా నియమించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. నికరాదాయం పెరిగిన రైతు కళ్లల్లోని ఆనందమే వ్యవసాయాభివృద్ధికి అసలైన సూచిక అని డాక్టర్ స్వామినాథన్ అన్నారు. ప్రభుత్వం సమర్పించే గణాంకాలు ఎంతమాత్రం కాదన్నారు. దాన్నే ప్రాతిపదికగా భావిస్తే నిరుడు (2008) రైతులపట్ల పాలకులు ప్రదర్శించిన చిత్తశుద్ధి ప్రశ్నార్థకమే!

*ది. 03-01-2009.* **- ఈనాడు**

●

# జన్యు మార్పిడి పంట జాతి గుండెల్లో మంట

దేశంలో వ్యవసాయంపై ఆధారపడిన అరవైకోట్లమంది భవిత ప్రమాదంలో పడే పరిస్థితి కనిపిస్తోంది. పర్యావరణ సమతౌల్యం, పశుసంతతి ఇక్కట్లలో కూరుకుపోయే పరిణామాలు పొడగడుతున్నాయి. దారుణ దుష్ప్రభావాలను ప్రసరింపజేసే జన్యుమార్పిడి (జి.ఎం.) ఆహార పంటల పరిశోధనలకు కేంద్రం ఇటీవల పచ్చ జెండా ఊపడం సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తోంది. దీనిపై పలు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవ సాంకేతిక (బయోటెక్నాలజీ) విజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా మాత్రమే దేశం ఎదుర్కొంటున్న ఆహార సంక్షోభాన్ని అధిగమించడం సాధ్యమని పాలకులు ప్రచారం చేస్తున్నారు. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు, ఆహార స్వయంసమృద్ధిని సాధించేందుకు ఇంతకు మించి మరో మార్గం లేదని నమ్మబలుకుతున్నారు. ఇప్పటికే దేశంలో అతిముఖ్యమైన ఆహార పంటలు - వరి, గోధుమలు, జొన్న, మొక్కజొన్నలతోపాటు వివిధ రకాల కూరగాయలకు జన్యుమార్పిడి విత్తనాల (బి.టి.)ను తయారుచేసి జనానికి అంటగట్టేందుకు బహుళజాతి కంపెనీలు అన్ని ప్రయత్నాలూ మొదలు పెట్టాయి. పాలకులు, అధికారులు, కొందరు శాస్త్రవేత్తలనుంచి ఈ కంపెనీలకు సంపూర్ణ సహకారాలు అందుతున్నాయి.

## ప్రమాదంలో ప్రాణికోటి

ప్రభుత్వ ప్రయత్నాలకు సమాజంలోని భిన్న వర్గాలనుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. ఎలాంటి ముందు జాగ్రత్తలూ, భద్రత చర్యలూ తీసుకోకుండానే క్షేత్రస్థాయిలో బి.టి. పంటల పరిశోధనలకు జెనెటిక్ ఇంజనీరింగ్ సలహా సంఘం అనుమతులనివ్వడం భవిష్యత్తులో విపత్కర పరిణామాలకు దారితీస్తుందని జీన్‌క్యాంపైన్ అనే సంస్థ సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేసింది. జన్యుమార్పిడి ఆహార పంటలవల్ల ప్రాణుల ఆరోగ్యానికి; పర్యావరణ వైవిధ్యానికి హాని కలుగుతోందని; ప్రపంచంలోని వివిధ

దేశాల్లో నిర్వహించిన ప్రయోగాలలో ఇదే రుజువైందని; సరైన భద్రతచర్యలు తీసుకోకుండా జన్యుమార్పిడి ముఖ్యంగా ఆహారపంటల జోలికి వెళ్ళవద్దని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ సహాయ్ ఎంతోకాలంగా వాదిస్తున్నారు. విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్, డాక్టర్ వంద నాశివ సైతం ఇదే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. జన్యుమార్పిడి ఆహార ఉత్పత్తులను దిగుమతుల నియంత్రణ కమిటీ నిబంధనల నుంచి మినహాయిస్తూ, తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సిన జాబితానుంచి తొలగిస్తూ కేంద్రం 2007 సెప్టెంబరు 11న భారత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అది రక్షిత ఆహారాన్ని పొందే ప్రజల హక్కును హరించివేయడమేనని - ఆ నోటిఫికేషన్‌ను వెన్వెంటనే రద్దు చేయాలని సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యంలో వందనాశివ అభ్యర్థించారు. ప్రపంచంలో అనేకదేశాల్లో జన్యుమార్పిడి ఆహార పంటలను, ఉత్పత్తులను నిషేధిస్తున్నారు. కానీ మనదేశంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ వీటికి తలుపులు బార్లా తెరుస్తుండటం దురదృష్టకరం.

జన్యుపరివర్తిత జన్యువులు సాధారణ పంటలకు విస్తరిస్తే అనర్థాలు జరుగుతాయి. ప్రపంచంలో మొక్కజొన్న పంటకు బ్రెజిల్‌ను మాతృస్థానంగా చెబుతారు. ఆ దేశంలో జి.ఎం. పంటలను సాగు చేయడంవల్ల కొన్ని మారుమూల ప్రాంతాల్లో 35 శాతం మేర మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు బ్రెజిల్ పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. జి.ఎం. వరి పరిశోధనలవల్ల అమెరికాలో బియ్యం కలుషితమయ్యాయి. ఐరోపా సమాఖ్య, ఫిలిప్పీన్స్‌లు అమెరికా నుంచి బియ్యం దిగుమతి చేసుకోవడాన్ని నిలిపివేశాయి. ఫలితంగా అమెరికాకు 63 శాతం మేర బియ్యం ఎగుమతుల్లో కోతపడింది. ఈ వ్యవహారంలో అమెరికన్ రైతులు దాదాపు 253 మిలియన్ డాలర్లు అంటే రూ. 1200 కోట్లు నష్టపోయారు. ప్రపంచంలో బియ్యం ఉత్పత్తిలో చైనా తరవాతి స్థానం భారత్‌దే. ఏటా వేల కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని భారత్ ఎగుమతి చేస్తోంది. జన్యుపరివర్తిత పంటల కారణంగా అమెరికా ఎదుర్కొన్న పరిస్థితే భారత్‌కూ వస్తే - బియ్యం ఎగుమతులకు విఘాతం కలగడమేకాక దేశ ప్రజల ఆరోగ్యమూ హరించుకు పోయే ప్రమాదం ఉంది. బహుళజాతి సంస్థలు తాము తయారుచేస్తున్న జి.ఎం. ఆహార ఉత్పత్తులపై సంబంధిత ముద్ర వేసేందుకు నిరాకరిస్తున్నాయి. దీనివల్ల రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్క 2007లోనే 23

దేశాలలో సాధారణ పంటలు జి.ఎం. రకాల వల్ల కలుషితమైన 39 సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలో సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు జి.ఎం. పంటల పరిశోధనలవల్ల ప్రమాదంలో పడతాయి.

దేశంలో ప్రజలకు ఆహార భద్రత, రక్షిత ఆహారం సమకూరాలంటే జన్యుమార్పిడి పంటలే శరణ్యమని పాలకులు, కొందరు శాస్త్రవేత్తలు ప్రచారం చేస్తున్నదాంట్లో నిజం లేదు. జి.ఎం. జోలికి పోవాల్సిన అవసరమే లేకుండా అధిక ఉత్పత్తులను సాకారం చేయవచ్చు. దేశ ఆహార భద్రతను బహుళజాతి సంస్థల చేతుల్లో పెట్టడం వాంఛనీయం కాదు. కేవలం ఆరు బహుళ జాతి సంస్థలకే జి.ఎం. పరిజ్ఞానం పై, జి.ఎం. పంటలు-ఆహార ఉత్పత్తులపై పేటెంట్ హక్కులున్నాయి. కాబట్టి వీటివల్ల బహుళజాతి సంస్థలే సంపూర్ణ లాభాలను అందుకొంటున్నాయి. దేశంలోని పరిశోధన సంస్థలు జి.ఎం. ఆహారోత్పత్తులపై పరిశోధనలు చేయాలనుకుంటే - బహుళజాతి కంపెనీలకు భారీగా రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. జి.ఎం. ఆహార ఉత్పత్తులను అంగీకరించడానికి, తిరస్కరించడానికి వినియోగదారునికి పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆహార ఉత్పత్తులు ఉన్న సంచీలపై అందులోని పదార్థాలకు సంబంధించిన వివరాలన్నీ నమోదు చేయాలి. ఆహార ఉత్పత్తులను పండించిన చేను ప్రాసెసింగ్ యూనిట్ సహా అన్ని వివరాలనూ ముద్రించడం ఐరోపాలో అనవాయితీ. జి.ఎం. ఉత్పత్తులపై సంబంధిత వివరాలు ఉండి తీరాలి. జీవరక్షణ అంశంపై, కార్టిజీనా ప్రొటోకాల్‌పై భారత్ సంతకం చేసింది. జన్యుమార్పిడి పంటలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రయోగాలకు అనుమతి ఇచ్చే అధికారం జి.ఇ.ఎ.సి. కమిటీకి ఉందని అంగీకరిస్తూనే - జీవుల భద్రత సహా వివిధ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరవాతే అందుకు తలూపాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. జన్యు మార్పిడి ఉత్పత్తుల వాణిజ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు, ఒక దేశం నుంచి మరో దేశంలోనికి జన్యుమార్పిడి ఉత్పత్తులు ప్రవేశించే క్రమంలో జీవరక్షణకు భంగం కలగకుండా, అలాజరిగిన పక్షంలో అందుకు కారణమైన సంస్థ తగు నష్టపరిహారం చెల్లించేందుకు అనువుగా సభ్యదేశాలు విధి విధానాలను రూపొందించుకోవాలని కార్టిజీనా ప్రోటోకాల్ నిర్దేశిస్తోంది. ఏళ్లు గడిచిపోతున్నాయిగానీ - కేంద్రంలో యు.పి.ఎ. సర్కారు ఆ దిశగా అవసరమైన చర్యలను మాత్రం చేపట్టలేదు. జర్మనీలోని బాన్ నగరంలో 'జీవసంరక్షణ'పై కొంతకాలం క్రితం జరిగిన సమావేశంలో భారత బృందం నోరు మెదపకపోవడం అందరినీ దిగ్భ్రాంతి

పరచింది. జి.ఎం. ఉత్పత్తులవల్ల ప్రాణుల భద్రతకు, పర్యావరణానికి, జీవవైవిధ్యానికి హాని కలిగితే సంబంధిత సంస్థలచేత అందుకు బాధ్యత వహింపజేసి – నష్టపరిహారాన్ని ఇప్పించేందుకు తగిన చట్టబద్ధతను రూపొందించేందుకు ఈ కీలక సమావేశాన్ని ఉద్దేశించారు. ఇందులో మన ప్రతినిధి బృందం వ్యవహరించిన తీరు ప్రభుత్వ ఆలోచన ధోరణికి అద్దం పడుతోంది.

## పాలకులు కళ్లు తెరవాలి

ఏ విధమైన అనుమతులూ లేకుండానే జి.ఎం. ఆహార ఉత్పత్తులను చేసుకోవచ్చునని, విక్రయించుకోవచ్చునని, దిగుమతి చేసుకోవచ్చు లేదా వాడుకోవచ్చునంటూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఇటీవల జి.ఇ.ఎ.సి.కి పచ్చ జెండా చూపించింది. అత్యంత దుర్మార్గమైన చర్య ఇది. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఛిద్రం దిశగా – బహుళజాతి కంపెనీలకు తలుపులను బార్లా తెరచిన యు.పి.ఎ. సర్కారు చర్య దేశద్రోహమనే చెప్పాలి. బి.టి. పత్తి సాగు మొదలై అయిదు సంవత్సరాలు దాటిపోయింది. పురుగు మందులపై ఖర్చు కొద్దిగా మాత్రమే తగ్గింది. వాతావరణం ఏ మాత్రం అనుకూలించకపోయినా– బి.టి. పత్తి దిగుబడులు విపరీతంగా తగ్గిపోతాయని ఈ ఏటి అనుభవం చాటుతోంది. బి.టి. వంగ, వరి విత్తనాలను వాణిజ్య ప్రాతిపదికన విక్రయించుకోవడానికి తాజాగా అనుమతులు ఇవ్వనున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆహార పంటల్లో జన్యుమార్పిడి సాంకేతికతను ప్రవేశపెట్టిన నేపథ్యంలో కలిగే నష్టాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కానీ కేవలం అమెరికాలోని బహుళజాతి సంస్థల ప్రలోభాలకు లొంగిపోయి నిజానిజాలను గుర్తించకుండా కేంద్రంలోని పెద్దలు వ్యవహరిస్తున్న తీరు దేశ ప్రయోజనాలకు భంగం కలిగిస్తోంది. కూరగాయలు, వరి వంటి వాటికి సంబంధించి జన్యుమార్పిడి ప్రయోగాలు చేయాల్సిన అవసరమే లేదు. వరి ఉత్పత్తిలో భారత్‌ది రెండో స్థానం. కూరగాయల ఉత్పత్తిలోనూ రెండో స్థానంలోనే ఉన్నాం. దాదాపు నాలుగు కోట్ల 20 లక్షల ఎకరాల్లో 10 కోట్ల టన్నుల కూరగాయల్ని రైతులు పండిస్తున్నారు. సరైన రవాణా, నిల్వ, మార్కెటింగు సౌకర్యాలు లేకపోవడం వల్ల పండించిన పంటలో 30 శాతం వృథాగా పోతోందని అంచనా. దేశమంతటా రైతు బజార్లను ఏర్పాటు చేసి; చిన్న రైతులకు; కౌలుదారులకు రుణ సౌకర్యాన్ని కలిగిస్తే – సమగ్ర సస్యరక్షణ విధానాలను సమర్థంగా

అమలు చేస్తే కూరగాయల ఉత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుంది. పురుగు మందుల వాడకమూ తగ్గుతుంది. నాణ్యతతో కూడిన సరకు ప్రజలకు అందుతుంది. బి.టి. వరిని అనుమతిస్తే దేశం నుంచి బియ్యం ఎగుమతులకు దెబ్బతగులుతుంది. రైతుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి తలొగ్గకుండా దేశ ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అనువైన చర్యలు తీసుకోవాలి. ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించి, ఆహార ఉత్పత్తులపై కచ్చితంగా సంబంధిత వివరాలను ముద్రించాలన్న నిబంధనను అమలు చేయాలి. విమానాశ్రయాలు, నౌకాశ్రయాల వద్ద జి.ఎం. ఆహార ఉత్పత్తులకు సంబంధించిన నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు పరిశోధనశాలలను ఏర్పాటు చేయాలి. తాము తీసుకుంటున్న ఆహారం సురక్షితమైనదేనా అని తెలుసుకోగల హక్కు ఈ దేశ ప్రజలకు ఉంది. వారి హక్కును కాపాడటం ప్రభుత్వాల బాధ్యత.

*ది. 16-06-2009.* — ***ఈనాడు***

●

# తొందరపడితే గందరగోళమే!

కొంతకాలంగా రాష్ట్రంలో సహకార వ్యవసాయంపై చర్చ జోరుగా సాగుతోంది. ప్రయోగాత్మక ప్రాతిపదికన జిల్లాకు రెండు లేదా మూడు గ్రామాల్లో సహకార సేద్యాన్ని అమల్లోకి తేవాలని రాష్ట్రప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వ్యవసాయ ఉత్పాదకతలు దారుణంగా పడిపోవడం రాష్ట్రసర్కారు ఆందోళనకు కారణం. రాష్ట్రంలో భూకమతాల సంఖ్య పెరిగిపోతోంది. సగటు భూకమత విస్తీర్ణం నానాటికీ తగ్గుముఖం పడుతోంది. మొత్తంగా సన్న, చిన్నకారు రైతుల సంఖ్య 80 శాతానికి చేరింది. యంత్ర సామగ్రిని కొనుగోలు చేయగల కనీస ఆర్థిక స్థోమత కూడా రైతులకు ఉండటంలేదు. సేద్యరంగాన్ని పట్టిపీడిస్తున్న ఇలాంటి సమస్యలు వ్యవసాయ ఉత్పాదకతల్లో వృద్ధిరేటును దారుణంగా కోతకోస్తున్నాయన్నది సర్కారు స్థిరాభిప్రాయం. రైతుల ఆదాయాల్లో పెరుగుదలను సైతం ఇవే సమస్యలు దెబ్బకొడుతున్నాయి. సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెడితే ఈ తరహా సమస్యలన్నింటికీ పరిష్కారం దొరకుతుందని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది.

## విదేశీ అనుభవాలు

వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారి సంఖ్యను కుదించి, ఉత్పాదకతను పెంచి, రైతుల ఆదాయాలను మెరుగుపరచాలన్న లక్ష్యాలు మంచివే. వీటి సాధనకు కేవలంసహకార వ్యవసాయం ఒకటే మార్గమా, లేక ఇతరత్రా దారులేవైనా ఉన్నాయా అన్నది చర్చనీయాంశం. ఈ విషయంలో ప్రపంచ దేశాల అనుభవాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడమూ అవసరమే. ఒకప్పటి సోవియట్ రష్యాలో అనేక దశాబ్దాలపాటు సహకార వ్యవసాయ క్షేత్రాలు కొనసాగాయి. వాటి వల్ల సేద్యం ఆశించిన పురోగతిని సాధించలేదు. ఓ దశలో క్షుద్బాధ తాళలేక రొట్టెలకోసం ప్రజలు బారులు తీరాల్సిన పరిస్థితి తలెత్తింది. కమ్యూనిస్టు చైనాలో సైతం భూమిపై హక్కు ప్రభుత్వానిదే. ఉమ్మడి

క్షేత్రాలు, 'కమ్యూన్' వ్యవస్థల వల్ల సేద్య రంగం తగినంత వృద్ధి చెందడంలేదని గ్రహించిన చైనా అధినేత డెంగ్ అక్కడ పెద్దయెత్తున వ్యవసాయ సంస్కరణలకు ఉపక్రమించారు. అత్యధిక జనాభా ఉన్న చైనాలో వ్యవసాయ పురోగతి ద్వారానే పారిశ్రామిక, సేవా రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ఆయన బలంగా విశ్వసించారు. డెంగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు చైనాలో సేద్య గతిరీతులనే మార్చివేశాయి. వాటిప్రకారం– ప్రభుత్వమే ప్రతిరైతు కుటుంబానికీ కొంత భూమిని ఇస్తుంది. పంటలకు కావలసిన విత్తనాలు, పరికరాలు, ఎరువులు, రుణపరపతి వంటి ఉత్పాదకాలను సర్కారే సమకూరుస్తుంది. అందుకు ప్రతిగా పంట చేతికొచ్చిన తరవాత రైతులనుంచి నిర్దిష్ట పరిమాణంలో ధాన్యం స్వీకరిస్తుంది. ప్రభుత్వానికి ఇవ్వగా మిగిలిన భాగాన్ని తమకు నచ్చిన ధరకు విక్రయించుకునే వీలు రైతులకు ఉంటుంది. ఈ పద్ధతి రైతులకు స్వేచ్ఛను ప్రసాదించింది. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో తమకు నచ్చిన పంటలను, తాము కోరుకున్న రీతిలో సాగు చేసుకునే అవకాశం రైతులకు లభించింది. అధిక దిగుబడి సాధించిన రైతుల లాభాలూ అదే స్థాయిలో పెరిగేవి. ఈ మార్పుల పర్యవసానంగా 1978 నుంచీ చైనాలో వ్యవసాయరంగం బ్రహ్మాండమైన పురోగతిని సాధించింది. మరోవంక, దానితో ముడివడిన ఇతర రంగాలన్నీ అదే ఊపులో అభివృద్ధి బాటపట్టాయి.

ఈ నేపథ్యంలో – ఇజ్రాయెల్ విధానాన్ని మన రాష్ట్రసర్కారు ఓ నమూనాగా చెబుతోంది. ఆ దేశానిది ప్రత్యేకమైన పరిస్థితి. దాని చుట్టూ అరబ్ దేశాలు దడి కట్టి ఉన్నాయి. కేవలం ఎనిమిదివేల చదరపు మైళ్ల విస్తీర్ణం ఉన్న ఇజ్రాయెల్‌లో 60 శాతం ఎడారే. నీటి వనరులు బాగా పరిమితం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఆ దేశంలో రెండు రకాల సహకార వ్యవస్థలు ఉన్నాయి. మొదటిది 'కిబుట్జ్'. ఈ వ్యవస్థలో భూమి, బోర్లు, పరికరాలు వంటివన్నీ 'కిబుట్జ్' సంస్థకే చెందుతాయి. సభ్యులందరూ కష్టపడి పనిచేస్తారు. రెండోది 'మొషాయి'. ఇందులోని సభ్యులు ఎవరి భూమిలో వారు సేద్యం చేసుకుంటారు. సభ్యులుగా ఉన్నరైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పరికరాలు, కలుపు నివారణ– కీటకనాశక మందులు, రుణపరపతి వంటివాటిని 'మొషాయి' సమకూరుస్తుంది. పంటను దేశీయ, విదేశీ విపణులలో విక్రయించుకోవడానికి అనుగుణంగా రైతులకు ఎగుమతి వెదికి పెడుతుంది. అందువల్లనే ఇజ్రాయెల్ రైతులు పరిశోధనలపట్ల విశేష ఆసక్తిని కనబరుస్తున్నారు. నీటిని అత్యంత పొదుపుగా, సమర్థంగా వినియోగించుకోవడం ప్రారంభించారు. సూక్ష్మబిందు, తుంపర్ల

సేద్యంవంటి వాటిపై వారు ప్రధానంగా ఆధారపడుతున్నారు. మురుగునీరు, సముద్రపు నీటిని సైతం కొన్ని సందర్భాల్లో వారు వ్యవసాయ అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఈ విధానాలు ఇజ్రాయెల్‌లో సేద్యాన్ని లాభసాటిగా మార్చాయి.

భూమిపై యాజమాన్య హక్కులుంటే రైతులు సంపూర్ణ శ్రద్ధాసక్తులతో, మరింత నిబద్ధతతో పనిచేస్తారు. ఉమ్మడి ఆస్తిలో పనిచేయడం పూర్తిగా ఇందుకు భిన్నమైన కార్యక్రమమే. దేశంలో సహకార సేద్యాన్ని ప్రారంభించాలని జవహర్‌లాల్ నెహ్రూ 1955లో ఆవడి కాంగ్రెస్ మహాసభలో సూచించారు. ఆ ప్రతిపాదనకు ఆచార్య రంగా, చరణ్‌సింగ్ వంటి రైతునాయకులనుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఆ తరవాత దేశంలో పలుచోట్ల పరస్పరాశ్రిత (జాయింట్) సహకార సేద్య సంస్థలకు ప్రభుత్వాలు ప్రోత్సాహమందించాయి. వివిధ కారణాలవల్ల అవీ విఫలమయ్యాయి. కానీ, కొన్ని రైతు సహకార సంస్థలు దీర్ఘకాలంగా చెప్పుకోదగిన స్థాయిలో పనిచేస్తున్నాయి. 'అముల్' డెయిరీ ఈ కోవకే చెందుతుంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో రైతు సహకార సంస్థలు బ్రహ్మాండంగా పనిచేస్తున్నాయి. దేశంలో పలు సహకార చక్కెర కర్మాగారాలు, వ్యవసాయోత్పత్తుల శుద్ధి కేంద్రాలు చక్కగా పనిచేస్తున్నాయి. భారత ఎరువుల రంగంలో రైతుల భాగస్వామ్యం ఉన్న 'ఇఫ్‌కో', 'క్రిబ్ కో' వంటి సంస్థలు బ్రహ్మాండంగా ఎరువులను ఉత్పత్తి చేస్తూ, రైతులకు ఎనలేని సేవలు అందజేస్తున్నాయి. మనరాష్ట్రంలో కొన్ని సహకార సంస్థలు మూతపడ్డాయి. కానీ, ములకనూరు సహకార సంఘం, అంకాపూర్‌లోని రైతుల సహకార సంఘం వంటివి సభ్యులకు అవసరమైన ఉత్పాదకాలను సమకూర్చడమే కాక వారు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడంలోనూ ఆదర్శప్రాయమైన కృషి చేస్తున్నాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు బ్రహ్మాండంగా పనిచేస్తున్నాయి. రాజకీయ జోక్యానికి తావివ్వకుండా, అధికారుల అనవసర ప్రమేయం లేకుండా, స్వతంత్ర ప్రతిపత్తిని కొనసాగిస్తే సహకార సంస్థలు తిరుగులేని పనితీరును కనబరుస్తాయి.

చిన్న కమతాల్లో ఉత్పాదకత తక్కువగా ఉంటుందన్నది ప్రభుత్వ అభిప్రాయంగా కనిపిస్తోంది. సన్న, చిన్నకారు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా అందిపుచ్చుకోలేరు కాబట్టి తక్కువ పరిమాణంలోని భూముల్లో పండించే పంటలు పెద్దగా గిట్టుబాటు కావని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల చిన్న రైతులందరినీ ఒక

గొడుగు కిందికి తెచ్చి సహకార సంఘంగానో, సంస్థ (కంపెనీ)గానో ఏర్పరచి సేద్యం చేయిస్తే ఉత్పాదకత పెరుగుతుందని సర్కారు అభిప్రాయపడుతోంది. ఇందుకోసం రైతులు భూమిమీద తమకున్న సర్వహక్కులను ఆ సహకార సంఘానికో, సంస్థకో ధఖలు పరచాల్సి ఉంటుంది. లేనిపక్షంలో భూమిమీద తమకున్న హక్కులను ఏర్పాటు చేయబోయే సంస్థలో 'వాటాలుగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఇది 'కార్పొరేట్' వ్యవసాయాన్ని సహకార ముసుగులో ప్రవేశపెట్టడంగానే రైతులు భావిస్తున్నారు. 'కార్పొరేట్' సేద్యం వల్ల రైతులకు ఒరిగేదేమీ ఉండదు. కంపెనీ ఉద్యోగుల కనుసన్నల్లో రైతులు పనిచేయాల్సి ఉంటుంది. ఒడంబడిక సేద్యానికి సంబంధించిన విధివిధానాలకు తుది రూపాన్ని ఇవ్వడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. తగిన ముందస్తు కసరత్తు చేయకుండానే 'కార్పొరేట్' వ్యవసాయానికి పచ్చజెండా ఊపడం సరికాదు.

ములకనూరు, అంకాపూర్ సహకార సొసైటీలు ఏ కారణాలవల్ల విజయవంతమయ్యాయో అర్థం చేసుకోవాల్సి ఉంది. వాటి అనుభవాలను క్రోడీకరించి అంతంతమాత్రంగా నడుస్తున్న రైతు సహకార సంఘాలను పునరుజ్జీవింపజేసేందుకు రాష్ట్రప్రభుత్వం తగిన చొరవ తీసుకోవాలి. అప్పుడే సహకార, కార్పొరేట్ సేద్యంతో నిమిత్తం లేకుండా చిన్న రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణపరపతిని అందించవచ్చు. వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడం ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావచ్చు. ఆదర్శ రైతుల పేరిట పార్టీ కార్యకర్తలకు ఉపాధి కల్పించే పద్ధతికి స్వస్తి పలికి అన్ని అర్హతలూ ఉన్న, అసలైన రైతులకే విస్తరణలో స్థానం కల్పిస్తేనే సన్న, చిన్నకారు రైతులకు పరిశోధన ఫలితాలు అందుతాయి. రాష్ట్ర సేద్యరంగాన్ని పట్టిపీడిస్తున్న సమస్య కార్మికుల కొరత. వ్యవసాయంలో యాంత్రీకరణ తక్షణావసరం. దీర్ఘకాలంగా వ్యవసాయ యాంత్రీకరణకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఓ మేరకు సబ్సిడీలను అందిస్తున్నాయి. అవి పెరుగుతున్న వ్యవసాయ అవసరాలకు ఏమాత్రం సరిపోవు. యాంత్రీకరణను వేగవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నడుం బిగించాలి. సహకార సంఘాల ద్వారా రైతులు తమ పంటను వ్యవసాయోత్పత్తుల శుద్ధి కేంద్రాలకు విక్రయిస్తే మెరుగైన ధర పొందే అవకాశాలు ఉంటాయి. రవాణా వంటి ఇతరేతర ఖర్చులూ తగ్గుతాయి. పంటను ఇంత ధరకైతేనే ఇవ్వగలమని బేరం చేయగల శక్తి రైతు సంఘానికి పెరుగుతుంది. మన సమాజంలో రైతులు అన్ని రకాలుగా బాగా వెనుకబడి ఉన్నారు. రైతుల స్థితి

మెరుగుపడటంతోపాటు ఉత్పాదకతలు పెరగాలంటే వారు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి. అంతేతప్ప, చిన్న కమతాలన్నింటినీ కలిపి, రైతులకు ఎలాంటి హక్కూ లేకుండా చేసి, వాటిని పెద్ద కంపెనీలకు కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పినంత మాత్రాన పరిస్థితి మారుతుందనుకుంటే అంతకన్నా పొరపాటు మరొకటి ఉండదు. చైనా, జపాన్, కొరియా, వియత్నాంవంటి దేశాల్లో ఉన్నవీ చిన్న కమతాలే. అక్కడి ప్రభుత్వాలు రైతుల మౌలిక అవసరాలను నెరవేరుస్తూ, ఉత్పత్తులను అమ్ముకోవడంలో వారికి తోడ్పాటును అందిస్తున్నందువల్లే ఆ దేశాల్లో పంటల దిగుబడులు భారత్‌తో పోలిస్తే అత్యధికంగా కనిపిస్తున్నాయి.

## అధ్యయనం తరవాతే ఆచరణ

దేశ సేద్యరంగంలో నెలకొన్న సంక్లిష్టతలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పూర్తి అవగాహనతో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలి. ఎక్కడి ఇబ్బందులను అక్కడే వదిలి 'సహకార వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెడితే చాలు, సమస్యలన్నీ మాయమవుతా'యనుకోవడం సరికాదు. దానికి బదులు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రైతు సేవాసహకార సంఘాలకు ప్రోత్సాహమందించాలి. వాటి ద్వారా అవసరమైన ఉత్పాదకాలు, సేవలు రైతులకు సకాలంలో అందే ఏర్పాటు చేయాలి. ఆచరణీయమైన అవగాహనతో నిర్మాణాత్మకంగా పురోగమించినప్పుడే వ్యవసాయం సుసంపన్నం అవుతుందన్న విషయాన్ని రాష్ట్రసర్కారు గ్రహించాలి.

*ది. 09-07-2009.* — ***ఈనాడు***

●

# చిన్న కమతాలే సేద్యానికి రక్ష

సహకార సేద్యంపై రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్‌లో ఇటీవల ఓ సదస్సు నిర్వహించింది. ఆహ్వానితులకు ఓ వివరణ పత్రం (నోట్) పంపిణీ చేసింది. "చిన్న కమతాల వల్ల రైతులకు తక్కువ ఆదాయం వస్తుంది. అందువల్ల వారు సేద్యానికి అవసరమైన పెట్టుబడులను సమకూర్చుకోలేకపోతున్నారు. పర్యవసానంగా ఎకరా దిగుబడులు (ఉత్పాదకత) తక్కువగా ఉంటున్నాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఉపయోగించుకోలేకపోతున్నారు. వ్యవసాయ యాంత్రీకరణను చేపట్టలేకపోతున్నారు. పంటలకు విలువను జోడించడం, వ్యవసాయ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రారంభం వారి వల్ల కాదు. కాబట్టి ఆ చిన్నచిన్న కమతాలను కలిపి, వేల ఎకరాల విస్తీర్ణంగల పెద్ద క్షేత్రాలుగా రూపొందించి, సహకార సంఘం (సొసైటీ), లేదా సంస్థ (కంపెనీ) ఆధ్వర్యంలో సహకార వ్యవసాయ విధానాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నది ప్రభుత్వ సంకల్పం" - అని ప్రభుత్వం ఆ నోట్‌లో పేర్కొంది. ఈ అంశంపై అన్ని కోణాల్లోను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరవాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచిదని ఆ సదస్సుకు హాజరైన పలువురు వక్తలు చెప్పారు. వారి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సహకార సేద్య ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

## నిర్హేతుక వాదన

వ్యవసాయ ఉత్పాదకత తక్కువగా ఉండటానికి, సేద్యరంగం సాధించాల్సినంత ప్రగతిని సాధించలేకపోవటానికి సన్న, చిన్నకారు రైతులే కారణమనడం కంటే అసత్యం మరొకటి ఉండదు. దేశంలోనైనా, మన రాష్ట్రంలోనైనా చిన్న, సన్నకారు రైతులు 80 శాతంగా ఉన్నా వారి అధీనంలో ఉన్న భూమి 33 శాతం మాత్రమే. 10 హెక్టార్ల

కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు కేవలం 1.6 శాతం కాగా వారి అధీనంలో సుమారు 17 శాతం భూమి ఉంది. మిగతా భూమి మధ్య తరగతి రైతుల అధీనంలో ఉంది. మనరాష్ట్రంలో సగటు భూకమత విస్తీర్ణం 1956లో 2.4 హెక్టార్లు. అది 1996 నాటికి 1.4 హెక్టారుకు, ఇప్పుడు 1.2 హెక్టారుకు తగ్గిపోయింది. చిన్నరైతుల ఆదాయాలు తగ్గాయని ఓ సందర్భంలో పేర్కొన్న ప్రభుత్వం గడచిన అయిదేళ్లలో రాష్ట్రంలోని రైతుల ఆదాయాలు గణనీయంగా పెరిగాయని తన నోట్‌లో పేర్కొనడం గమనార్హం. రైతులరాబడి పెరిగిందనడం సత్యదూరం. జాతీయ నమూనా అధ్యయనం (నేషనల్ శాంపిల్ సర్వే) ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయదారునికి వ్యవసాయం ద్వారా వచ్చే సగటు ఆదాయం రూ. 9000 కాగా, సేద్యంపై వ్యయం సగటున రూ. 12000గా ఉందని గతంలో పార్లమెంటులో మంత్రే చెప్పారు. ఓ రైతు కుటుంబానికి ఆరోగ్యం, విద్య, వ్యవసాయ, గృహావసరాలకు ఏటా సగటున రూ. 28,600 వ్యయం అవుతోందని; పంటలు, కూరగాయలు, పాడి తదితరాల ద్వారా సంవత్సరానికి సగటున రూ. 19,600 ఆదాయం వస్తోందనీ ఆ సర్వేలో పేర్కొన్నారు. నూటికి 82 మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారని కూడా జాతీయ నమూనా అధ్యయనం వెల్లడించింది.

చిన్న, పెద్ద తేడాలేకుండా రైతులందరి స్థితీ దాదాపు ఒకే విధంగా ఉంది. బ్యాంకు రుణాల లభ్యతలో మాత్రం పెద్దరైతుల పరిస్థితి కాస్త మెరుగు. బ్యాంకు రుణాలు వారికి సులభంగా లభిస్తుండగా, సన్న, చిన్నకారు రైతులకు తక్కువగా, కౌలుదారులకు అసలే లభించని పరిస్థితే ఇప్పటికీ కొనసాగుతోంది. రైతులందరికీ బ్యాంకు రుణాలు అందేలా చూస్తే వారు సకాలంలో వ్యవసాయ పనులను ప్రారంభించగలుగుతారు. విత్తనాలను, ఎరువులను సమకూర్చుకోగలుగుతారు. భూమిలోని పోషకాల లభ్యత, వాతావరణం, విపణిలోని ధరవరలు, పంటల్లో నాణ్యతను మెరుగుపరచడం, ఎగుమతుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితరాలకు సంబంధించిన సమాచారాన్ని వారికి ప్రభుత్వం అందించగలిగితే - మన దేశంలోని రైతులు... ఇతర దేశాల్లోని రైతులకు తీసిపోని విధంగా ఉత్పాదకతను పెంచగలరనడంలో సందేహం లేదు. ఈ సేవలన్నీ రైతులకు సకాలంలో ప్రభుత్వం అందిస్తే చిన్న కమతాల్లోనే దిగుబడులు ఎక్కువగా ఉంటాయి. చిన్న రైతులు తమ చేనులోనే తిరుగుతూ, అవసరమైన పనుల్ని శ్రద్ధాసక్తులతో చేస్తారు. పెద్దపెద్ద భూకమతాల్లో సునిశిత పరీక్షలకు అవకాశం

ఉండదు. ప్రభుత్వం తనవంతు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండా ఆర్థికంగా గిట్టుబాటు అయ్యేది చిన్న కమతాలు కావని, వేలాది ఎకరాల విస్తీర్ణంలో పెద్దపెద్ద కమతాలేనన్న నిర్ణయానికి రావడం పొరపాటు. సేద్యం కోసం చిన్న రైతులకు అవసరమైన వనరులను సమకూర్చడంలో, రుణ సౌకర్యాన్ని కల్పించడంలో తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుని, చిన్న కమతాలు గిట్టుబాటు కావని ప్రభుత్వం చెప్పడం 'ఆడలేక మద్దెల ఓడు' అన్న చందంగా ఉంది.

ఒకప్పటి సోవియట్ రష్యాలో పెద్ద పెద్ద క్షేత్రాల్లో, చైనాలో సమిష్టి క్షేత్రాల్లో వ్యవసాయం సరిగా ప్రగతి సాధించకపోవడం వల్లనే ఆయా దేశాల్లో కుటుంబ స్థాయిలో వ్యవసాయాన్ని చేపట్టారన్న వాస్తవాన్ని విస్మరించరాదు. పెద్దపెద్ద వ్యవసాయ క్షేత్రాలు ఉన్న అమెరికా, ఐరోపా దేశాల్లో కంటే చిన్న చిన్న కమతాలు గల చైనా, వియత్నాం, దక్షిణ కొరియా, జపాన్, ఈజిప్టు వంటి దేశాల్లోనే పంటల దిగుబడులు ఎక్కువ. ఉదాహరణకు ఒక హెక్టారులో సగటున వరిపంట దిగుబడులు చైనాలో ఆరు టన్నులు, జపాన్‌లో 6.8, ఈజిప్టులో ఎనిమిది టన్నులు ఉన్నాయి. అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలు తమ రైతులకు పెద్దయెత్తున సబ్సిడీలను ఉపసహరించినా, లేదా తగ్గించినా అక్కడ పంటల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని వ్యవసాయ ఆర్థిక నిపుణులు అంటున్నారు. స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడిదారీ విధానం ఉన్న అమెరికా, ఐరోపా దేశాల్లో రైతుల సహకార సంస్థలు పటిష్టంగా పనిచేస్తున్నాయి. పాడి (డెయిరీ) ఉత్పత్తుల విపణి వాణిజ్యంలో పాడిరంగంలోని సహకార సంస్థల వాటా డెన్మార్క్‌లో 93 శాతం, ఫ్రాన్స్‌లో 43, నెదర్లాండ్స్‌లో 82, బ్రిటన్‌లో 98, అమెరికాలో 83 శాతంగా ఉంది. మాంస ఉత్పత్తుల విషయానికొస్తే – వాటిని డెన్మార్క్‌లో 66 శాతం, ఫ్రాన్స్‌లో 50, నెదర్లాండ్స్‌లో 35, బ్రిటన్‌లో 20, అమెరికాలో 13 శాతం అక్కడి వ్యవసాయదారుల సహకార సంస్థలే మార్కెటింగ్ చేస్తున్నాయి.

## సహకార సంస్థ పటిష్టానికి చర్యలు

సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలను తారకమంత్రంగా జపిస్తున్న ఈ రోజుల్లో – సంపన్న దేశాల్లోను రైతుల సహకార సంస్థలు బలోపేతమై నిలదొక్కుకోవడం గమనార్హం. కార్పొరేట్ సంస్థల కంటే ఈ రైతుల సహకార సంస్థలే

వ్యవసాయదారుల ఉత్పత్తులకు అధిక ధరలను చెల్లిస్తుండటం అందుకు కారణం. పెట్టుబడిదారుల సంస్థలకంటే, రైతుల భాగస్వామ్యంగల సంస్థలైతే సత్ఫలితాలిస్తాయనడానికి ఇది ఓ నిదర్శనం. కార్పొరేట్ సంస్థలు తమకు వచ్చిన లాభాల్లో వాటాదారుల (షేర్ హోల్డర్లు)కు డివిడెండ్లు ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి తమకు ఉత్పత్తుల్ని సరఫరా చేసే రైతులకు అవి తక్కువ ధరలు చెల్లిస్తాయి. అదే రైతు సహకార సంస్థలైనే వచ్చిన లాభాల్లో అధిక భాగాన్ని తమకు ఉత్పత్తుల్ని సరఫరా చేసే రైతులకు ఎక్కువ ధరల రూపంలో చెల్లిస్తాయి. అందుకే ఆ దేశాల్లోని రైతులు సహకార సంస్థల్లో సభ్యులుగా చేరి ప్రయోజనం పొందుతున్నారు.

మనదేశంలో కూడా పాల ఉత్పత్తిదారుల సంఘాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన 'అముల్' సంస్థ, మహారాష్ట్రలో సహకార చక్కెర కర్మాగారాలతో సహా పలు రైతు సహకార సంఘాలు చక్కగా పనిచేస్తున్నాయి. మన రాష్ట్రంలో 50 గ్రామాల్లో సహకార వ్యవసాయం కోసం అయిదువేలకోట్ల రూపాయలు వ్యయీకరిస్తామని ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఇటీవల చెప్పారు. అలా చేయడం వల్ల పేద రైతులకు ఒరిగేదేమీ ఉండదు. దాని కన్నా ఆ నిధులతో సహకార సంస్థలను పటిష్ఠపరచి, రైతులందరికీ రుణసౌకర్యాన్ని కల్పించాలి. దాంతోపాటు వారికి అవసరమైన పరికరాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని, నాణ్యమైన విత్తనాలను అందజేయాలి. మార్కెటింగ్ పరంగా వారికి సహకారాన్ని అందించాలి. ప్రభుత్వం ఈ చర్యల్ని తీసుకొంటే వ్యవసాయంలో మన సన్న, చిన్నకారు రైతులు బ్రహ్మాండమైన ఉత్పాదకతను సాధించగలరు.

*ది. 29-07-2009.* — *ఈనాడు*

## 2వ అధ్యాయం




# డంకెల్ ప్రతిపాదనలు
# ఎగుమతులు, దిగుమతులు

Blank Page

# వ్యవసాయ రంగంమీద 'డంకెల్' నీలినీడ

గాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్ – జి.ఏ.టి.టి.) సభ్యత్వ దేశాల మంత్రులు 1986 సెప్టెంబర్ 20న దక్షిన అమెరికాలోని ఉరుగ్వే వేసవి రాజధాని పెంటాడెల్ ఎస్టీలో సమావేశమయ్యారు. గాట్ సారథ్యంలో బహుముఖ వాణిజ్య చర్చల ఎనిమిదవ రౌండుకు అది ప్రారంభం. ఈ చర్చలు వర్ధమాన దేశాలకు ఇష్టమయినవి కావు. అమెరికా తదితర సంపన్నదేశాల ఒత్తిడి కారణంగా చర్చల్లో పాల్గొంటున్నాయి. అంతర్జాతీయ వర్తక, వాణిజ్యాలకు అవరోధంగా కొన్ని దేశాలలో ఉన్న కొన్ని ఆంక్షలను తొలగించడం, దిగుమతి సుంకాలను తగ్గించడం తద్వారా వాణిజ్య వర్తకాలు విస్తృత స్థాయిలో కొనసాగడానికి దోహదపడడం గాట్ ముఖ్య లక్ష్యం. ఉరుగ్వే రౌండు సమావేశాలకు ముందు గాట్ చర్చలలో వ్యవసాయరంగాన్ని పట్టించుకోలేదు. తమ వ్యవసాయ చట్టాలకు, విధానాలకు గాట్‌తో సంబంధంలేదంటూ అమెరికా, జపాన్ 1955లో మినహాయింపు పొందాయి. యూరపు దేశాల మండలికూడా తన సంయుక్త వ్యవసాయ విధానానికి మినహాయింపు కోరింది. ఇక వర్ధమాన దేశాలకు ఆ అవసరం అసలే ఉండదు. క్రమంగా సంపన్న దేశాల వ్యవసాయ సబ్సిడీల భారం పెరిగింది. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల నిలువలు పెరిగాయి. దరిమిలా ఇప్పుడు గాట్ చర్చల్లో వ్యవసాయరంగాన్నీ చేర్చాలని సంపన్నదేశాలు పట్టుబడుతున్నాయి. పలురకాల వ్యావసాయిక ఉత్పత్తుల వాణిజ్యం గాట్ చర్చల్లో చోటుచేసుకుంటున్నది. వర్ధమాన దేశాలు వ్యవసాయరంగం మీదనే అధికంగా ఆధారపడివుంటాయి. ఈ దేశాల కష్టజీవులకు 60 శాతం వ్యవసాయరంగమే ఆధారం. ఈ దేశాల జాతీయ ఉత్పత్తిలో 19 శాతం వ్యవసాయరంగానిది. కొన్ని దేశాల ఎగుమతులలో సగం మొదలుకొని మొత్తం వరకు వ్యవసాయ సంబంధమయినవే. సంపన్న దేశాలలో సగటున నూటికి ఏడుగురు మాత్రమే వ్యవసాయరంగంలో పనిచేస్తున్నారు. అమెరికాలో నేడు నూటికి

ఇద్దరే వ్యవసాయంలో ఉన్నారు. సంపన్న దేశాల జాతీయోత్పత్తిలో వ్యవసాయ భాగం 3 శాతానికి మించదు.

## ద్వంద్వ ప్రమాణాలు

వర్ధమాన దేశాలు ఇప్పటికే సగటున ఏటా సుమారు రూ. 108 వేల కోట్ల విలువయిన ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నాయి. డంకెల్ ప్రతిపాదనలను యథాతథంగా అంగీకరిస్తే వర్ధమాన దేశాలలో వ్యవసాయ రంగం తీవ్ర దుష్పరిణామాలకు గురయి, వ్యవసాయోత్పత్తులు మరింత తగ్గి పేద ప్రజలు ఆకలికోరలో చిక్కుకునే ప్రమాదముంది. వర్ధమాన దేశాలలో వ్యవసాయ ఉత్పత్తులపై వాటి ఎగుమతిపై బహుళజాతి సంస్థల పెత్తనం ప్రవేశించడానికి డంకెల్ ప్రతిపాదనలు దోహదపడతాయి. కొన్నాళ్ళ కిందట అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ వ్యవసాయ విధానాన్ని వివరిస్తూ సెనేటర్ రూడీ బాష్విట్జ్ చేసిన వ్యాఖ్య ఈ సందర్భంగా గమనార్హం. 'ఇప్పుడు మన వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గించి వర్ధమాన దేశాల పోటీని నిరోధించకపోతే భవిష్యత్తులో మనస్థానాన్ని నిలుపుకోవడం సాధ్యం కాదు. ఆ దేశాల వ్యవసాయ వాణిజ్యాన్ని నిరుత్సాహ పరచడం మన వ్యవసాయ విధానం ముఖ్య లక్ష్యంగా ఉండాలి.' ఇందుకు అనుగుణంగా అమెరికా తన 420 కోట్ల డాలర్ల విలువయిన గోధుమలు, మొక్కజొన్నలను ఎగుమతి చేయడానికి 1986లో 1000 కోట్ల డాలర్ల సబ్సిడీ ఇచ్చింది. ఇదే సమయంలో ఇండియా తదితర వర్ధమాన దేశాలు వ్యవసాయరంగానికి ఇస్తున్న సబ్సిడీలను ఉపసంహరించాలని నిత్య జీవితావసర వస్తువులను చౌకధరలకు అందించే ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను రద్దు చేయాలని ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్.) సలహాలిస్తున్నాయి.

ఈ రుణాలు మంజూరు చేస్తున్నప్పుడు అలా షరతులు విధిస్తున్నాయి. అమెరికా విపరీతంగా సబ్సిడీ ఇచ్చి తన పంటలను తక్కువ ధరకు ఎగుమతి చేసి విదేశీ మార్కెట్లను ఆక్రమించ గలుగుతున్నది. పర్యవసానంగా వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు ఒడిదుడుకులకు లోనయి రైతులు ఎంతో నష్టపోతున్నారు. బియ్యం ఎగుమతి దేశాలలో ప్రముఖ స్థానం వహించే థాయ్‌లాండ్‌లో రైతులు బ్యాంకాక్‌లో అమెరికా రాయబారి కార్యాలయం ఎదుట అమెరికా వ్యవసాయ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సంపన్న దేశాలలో, ముఖ్యంగా అమెరికా వంటి దేశాలలో నేరుగా

రైతులు ఎగుమతి చేయరు. ఆ పని బహుళ జాతి భారీ సంస్థలది. ఉదాహరణకు అమెరికా గోధుమల ఎగుమతిలో 85 శాతం; మొక్కజొన్న ఎగుమతిలో 95 శాతం కార్గిల్, కాంటినెంటల్ గ్రెయిన్, లూయస్ డెఫ్రస్, బంగీ, అండ్రి అండ్ కో, మిట్సుయి-కుక్ అనే కేవలం ఆరు సంస్థల ద్వారా జరిగాయి. ఎప్పుడయినా ఈ బహుళ జాతి సంస్థల ప్రయోజనాలకు విఘాతం కలిగితే అమెరికా ప్రభుత్వం ఆదుకుంటుంది. ఇందుకు ఒక నిదర్శనం నైజీరియా పట్ల అమెరికన్ ప్రభుత్వం అనుసరించిన వైఖరిలో బహిర్గతమయింది. అమెరికా నుంచి గోధుమల దిగుమతి కారణంగా నైజీరియాలో గోధుమల ధరలు పడిపోయి గోధుమపంట బాగా తగ్గింది. దరిమిలా నైజీరియా ప్రభుత్వం 1988లో అమెరికన్ గోధుమల దిగుమతిని నిషేధించింది. దీనితో కార్గిల్ కార్పొరేషన్‌కు కొంత దెబ్బ తగిలింది. నైజీరియా ప్రభుత్వం ఈ నిషేధాన్ని తొలగించకపోతే అది ఎగుమతి చేసే వస్త్రాలపై ఆంక్షలు విధిస్తామని అమెరికన్ ప్రభుత్వం బెదిరించింది.

ఇంతకంటే ప్రమాదకరమయినది పేటెంట్ల విషయం. మొక్కలపైన, మొక్కలలోని జన్యు కణాల (జీన్‌లు) మీద పేటెంట్లు హక్కును అంగీకరించాలని సంపన్న దేశాలు పట్టుబడుతున్నాయి. ఈ మొండి వైఖరి సమాజ శ్రేయానికి విరుద్ధం. ఇప్పటి వరకు వీటిపైన ఏ ఒక్కరికీ పేటెంటు హక్కులేదు. ఇవి మానవాళి సమిష్టి సంపద. వాస్తవానికి వర్ధమాన దేశాల రైతులే వేల సంవత్సరాలుగా విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారు. బియ్యం విషయంలో మొట్టమొదటిది భారతదేశమే. తెగుళ్ళను తట్టుకోగల బంగాళాదుంపల్ని పండించినది బొలివియా రైతులు. పురుగుల వల్ల దెబ్బతినని అలసందలను ఉత్పత్తి చేసేది పశ్చిమ ఆఫ్రికా రైతులు. పూర్వం నుంచి ఈ దేశాల రైతులు తమ పరిజ్ఞానంతో, అనుభవంతో ఎప్పటికప్పుడు మరింత మేలైన వంగడాలను రూపొందిస్తూ వచ్చారు. రకరకాల మొక్కలను రూపొందించడంలో మేధాసంపద హక్కుకు ప్రస్తుతం కొంత వరకు ప్లాంట్ బ్రీడర్స్ హక్కుల కింద రక్షణ లభిస్తోంది. కొత్త రకం మొక్కల పరిరక్షణ అంతర్జాతీయ సమితి కొత్త మొక్కలను రూపొందించిన వారి హక్కులను కాపాడుతున్నది. ఒక మొక్కను రూపొందించిన వ్యక్తి అనుమతి లేకుండా ఇతరులు దానిని అమ్మరాదని నిర్దేశిస్తున్నది. ప్రజాశ్రేయం దృష్ట్యా దీనికి రెండు మినహాయింపులు కల్పించారు. ఎవరు రూపొందించిన మొక్కనయినా పరిశోధన నిమిత్తం నిరభ్యంతరంగా ఉపయోగించుకోవచ్చు. ఆ మొక్కలను గాని, వాటి విత్తనాలను గాని రైతులు ఉపయోగించవచ్చు. భవిష్యత్ అవసరాలకు రైతులు నిలువ చేసుకోవచ్చు.

ఈ మినహాయింపుల ఫలితంగా అనేక దేశాలలో హరిత విప్లవం సాధ్యమయింది. మెక్సికోలో రూపొందించిన అధిక దిగుబడి గోధుమ విత్తనాలను సంయోగపరచి మనదేశంలో భూమి, శీతోష్ణ పరిస్థితులకు ఉపయోపడే విధంగా భారత శాస్త్రజ్ఞులు రైతులు కొత్త విత్తనాలను రూపొందించారు. సంపన్నదేశాలు కోరుతున్నట్లుగా డంకెల్ ప్రతిపాదనను ఆమోదిస్తే మెక్సికో విత్తనానికి మనం భారీ ఎత్తున రాయల్టీ చెల్లించవలసి వస్తుంది. రైతులు భవిష్యత్ అవరాలకు విత్తనాలను నిలువ చేయడానికి, పొరుగున ఉన్న ఇతరులకు ఆ విత్తనాలను ఇవ్వడానికి వీలుండదు. ఏటా బహుళజాతి సంస్థల నుంచి విత్తనాలు కొనాల్సి వస్తుంది. ఇది చిన్న సన్న కారు రైతులకు మరీ నష్టకరం. డంకెల్ ప్రతిపాదనలతో మరో ప్రమాదం ఉంది. మనీలాలోని అంతర్జాతీయ వరి పరిశోధానా సంస్థ (ఇ్రి) వివిధ దేశాల నుంచి లక్షల రకాల విత్తనాలను, జన్యు కణాలను సేకరించి భద్రపరచింది. వివిధ దేశాల జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థల సమన్వయంతో ఆ దేశాల రైతులు అవసరాలను తీర్చగల విత్తనాల రకాలను ఉత్పత్తి చేసే కార్యక్రమం అమలవుతున్నది. ఈ కార్యక్రమానికి డంకెల్ ప్రతిపానలు తీవ్ర విఘాతం కల్గిస్తాయి. సంపన్న దేశాలలో విత్తనాల అభివృద్ధి అమ్మకాలు బహుళజాతి సంస్థ చేతుల్లో ఉన్నాయి. జన్యు కణాలను సైతం పేటెంట్ చేయడానికి అవకాశం కల్పించాలని అమెరికా కోరిక. జన్యు కణం అంటే ఏమిటో, వాటిని పేటెంట్ చేయడం వల్ల ఎటువంటి పరిస్థితి ఏర్పడుతుందో రైతులు అర్థం చేసుకోవాలి. ప్రతి జీవనపదార్థంలో కోట్లాది అతి సూక్ష్మ జన్యు కణాలుంటాయి. ఇవి వంశపారంపర్య లక్షణాలను కలిగి ఉంటాయి. జీవపదార్థాల వివిధ లక్షణాలను ఇవి కంట్రోలు చేస్తుంటాయి. తండ్రి ముక్కును పోలిన ముక్కు బిడ్డకు, తల్లిరంగు పిల్లకు జన్యు కణాల ద్వారానే సంక్రమిస్తాయి. మొక్కల్లో తెగులును తట్టుకోగల సామర్థ్యం, అధిక దిగుబడిని ఇచ్చే గుణం ఈ జన్యు కణాల వల్లే ఏర్పడతాయి. శాస్త్రజ్ఞులు, రైతులు కొన్ని ప్రత్యేక లక్షణాలున్న జన్యు కణాలను వేరే ప్రత్యేకతలున్న జన్యు కణాల విత్తనాలతో సంయోగపరచి కొత్త రకం విత్తనాలను రూపొందిస్తారు. డంకెల్ ప్రతిపాదనలను అంగీకరిస్తే శాస్త్రజ్ఞులు రూపొందించే కొత్త విత్తనాల పేటెంటు హక్కు పేటెంటు దారునికి లభిస్తుంది. పేటెంటు దారునికి భారీ రాయల్టీ చెల్లించిన తరువాతనే రైతులు ఆ కొత్త విత్తనాన్ని ఉపయోగించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

## ఇండియా చొరవచూపాలి

మొదట వర్ధమాన దేశాలలోని అతి పురాతనమయిన, ఎంతో విలువయిన, జన్యుకణ సంపదను ఉపయోగించుకుని సంపన్న దేశాలు వ్యావసాయికంగా అపూర్వంగా అభివృద్ధి చెందాయి. ఈ జీవ సంపద మానవాళి ఉమ్మడి వారసత్వమని అప్పుడు శ్రీ రంగనీతులు చెప్పాయి. చాలా పెద్ద మొత్తాల డబ్బును బయోటెక్నాలజీ పరిశోధనపై ఖర్చుచేసి, విజ్ఞాన సంపదను అపారంగా పెంపొందించుకున్న తరువాత గతాన్ని విస్మరించి జన్యు సంపదపై పేటెంట్ హక్కు కావాలంటున్నాయి. నిజానికి అమెరికాలో 1980 సంవత్సరానికి పూర్వం జీవ పదార్థాల పేటెంటు హక్కుకు అవకాశం లేదు. కానీ, తరువాత మొక్కలను, బాక్టీరియా వంటి వాటిని పేటెంటు చేయడమే గాక, 1988 నుంచి జంతు సంపదను కూడా పేటెంటు చేయడానికి పేటెంటు చట్టాన్ని మార్చారు. ఇప్పటివరకు ఉన్న చట్టాల ప్రకారం ఫలానా వ్యక్తి పేటెంటు హక్కుకు భంగం కల్గించాడని ఆరోపించి రుజువు చేయాలి. డంకెల్ ప్రతిపాదన ప్రకారమయితే ఆరోపణకు గుర్రైన వారు తమ నిర్దోషిత్వాని నిరూపించుకోవాలి. బహుళజాతి సంస్థలతో సామాన్య రైతులు న్యాయస్థానాలలో పోరాడడం సులభం కాదు. దీర్ఘకాలిక తీవ్ర పరిణామాలకు దారితీసే డంకెల్ ప్రతిపాదనలను భారత ప్రభుత్వం గుడ్డిగా ఆమోదిస్తే భారత రైతాంగం బహుళజాతి సంస్థల దయాదాక్షిణ్యాలపై  ఆదారపడాల్సి వస్తుంది. డంకెల్ ప్రతిపాదనల వల్ల మన దేశ ప్రయోజనాలకు, విశేషించి వ్యవసాయరంగానికి కలిగే ముప్పును ప్రభుత్వం గుర్తించి ప్రజలకు తెలియజేయాలి. భారతదేశం వర్ధమాన ప్రపంచంలో ప్రముఖస్థానం ఆక్రమిస్తున్నది. మొదట భారతదేశం మేల్కొని తరువాత ఇతర వర్ధమాన దేశాలకు డంకెల్ ప్రతిపాదనల ప్రమాదాన్ని వివరించి ప్రతిఘటించాలి.

*ది. 20-07-1992.* — ***ఈనాడు***

●

# డంకెల్ ముసాయిదాపై విస్తృత చర్చలు అవశ్యం!

వ్యవసాయ రంగంలో సబ్సిడీలకు కోత పెట్టే విషయమై అమెరికా, యూరోపియన్ కమ్యూనిటీ దేశాల మధ్య కొంత కాలంగా ఏర్పడిన ప్రతిష్టంభన 'గాట్' చర్చల ప్రగతికి ప్రతిబంధకమయింది. ఇప్పుడీ దేశాల మధ్య అభిప్రాయ భేదాలు చాలా వరకు సమసి పోవడంతో 'గాట్' చర్చల కొనసాగింపునకు రంగం సిద్ధమవుతోంది. వ్యావసాయిక సబ్సిడీల విషయమై ఫ్రాన్స్ వినా, ఐరోపా దేశాలు స్థూలంగా ఒక అభిప్రాయానికి వచ్చాయి. కనుక ఉరుగ్వే రౌండు 'గాట్' చర్చలు తిరిగి ప్రారంభమై తుది నిర్ణయాలు త్వరలోనే వెలుగుచూసే అవకాశం ఉంది. వర్ధమాన దేశాలపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గణనీయ ప్రభావం ప్రసరించగల డంకెల్ ప్రతిపాదనల గురించి భారతదేశంలోని అత్యధిక సంఖ్యాక ప్రజలకు ఇప్పటికీ తెలియదు. ప్రపంచ దేశాల వ్యవసాయ, పారిశ్రామిక రంగాల మనుగడపై, ప్రజల జీవన విధానంపై డంకెల్ ముసాయిదా విస్పష్టమైన ముద్ర వేయబోతోందన్న మాట వాస్తవం. వ్యవసాయ రంగంపై డంకెల్ ముసాయిదా ప్రభావం కీలకమైనది. ప్రధానంగా వ్యావసాయిక దేశమైన భారత్ దీన్ని విస్మరించడానికి వీలులేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రత్యేక వ్యవసాయోత్పత్తుల విషయంలోగాని, ఉత్పత్తియేతర (నాన్ ప్రొడక్ట్) విషయాల్లోగాని ప్రభుత్వ మద్దతు అయిదు శాతం మించి ఉండరాదని డంకెల్ ముసాయిదా పేర్కొంటున్నది. వర్ధమాన దేశాల్లోనయితే ఈ మద్దతు 10 శాతం మించి ఉండరాదు. డంకెల్ ప్రతిపాదనల వల్ల భారతదేశ వ్యవసాయ రంగానికి నష్టమేమీ ఉండకపోవచ్చని కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ అభిప్రాయపడుతున్నది. ఎవరి సొంత అభిప్రాయాలతో వారు పొద్దుపుచ్చాల్సిన తరుణం కాదిది. వ్యవసాయ రంగంలోని వాస్తవ పరిస్థితుల పట్ల సమగ్ర అవగాహనతో స్పందించాలి.

## చెరకు సంగతేమిటి?

భారతదేశ వ్యవసాయరంగంలోని ఏ పంటకూ పదిశాతం ప్రభుత్వ మద్దతు లభించడం లేదని వాణిజ్య మంత్రిత్వశాఖ పేర్కొంటోంది. చెరకు, వేరుసెనగ వంటి వాణిజ్య పంటల విషయంలో ఇది నిజం కాదు. కేంద్ర ప్రభుత్వం చెరకు పంటకు చట్టబద్ధమైన కనీస ధర నిర్ణయిస్తుంది. పౌరసరఫరా వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే పంచదార ధరను అధికంగా నిర్ణయిస్తే వినిమయ సూచిక పెరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల డి.ఎ. పెంచవలసి వస్తుంది. ఇందువల్ల లెవీ చక్కెర ధరను తక్కువగా ఉంచడంకోసం, ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు కాదని తెలిసినా చట్టబద్ధ కనీస ధరను తక్కువగా ప్రకటిస్తూ ఉంటుంది. అదే ధరను రైతుకు ఇస్తే అతనికి గిట్టుబాటుకాక చెరకు పంటసాగు గణనీయంగా తగ్గిపోయి దేశంలోని పలు చక్కెర కర్మాగారాలు మూతపడే పరిస్థితి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ సలహా ధర ప్రకటిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే టన్నుకు కనీసం యాభై రూపాయలు అధికంగా ఉంటుంది. డంకెల్ ముసాయిదా ప్రకారం ప్రత్యేక పంట మద్దతును లెక్కగడితే రాష్ట్ర ప్రభుత్వ సలహా ధర ద్వారా చెరకు పంటకు లభిస్తున్న మద్దతు పది శాతం పైగానే ఉంటుంది. వేరుసెనగ సాగును గమనించినా ఇదే తీరు కళ్ళకు కడుతుంది. కొద్ది సంవత్సరాల క్రితం వరకు దేశావసరాల నిమిత్తం వందల కోట్ల రూపాయలు వెచ్చించి, వంటనూనెలు దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. అటువంటిదీనాడు నూనె గింజలు రంగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించింది. ఇది కేవలం ఒక్క రోజులో సాధ్యమయిన ప్రగతి కాదు. నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించే నిమిత్తం ఏడేళ్ళ క్రితం కేంద్ర ప్రభుత్వం టెక్నాలజీ మిషన్‌ను ఏర్పాటు చేసింది. స్ప్రింక్లర్స్, స్ప్రేయర్లు వంటి పరికరాలను, విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేయడమేగాక, నూనెగింజలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర కంటే మార్కెట్‌లో మరికొంత అధికంగా లభించే విధంగా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా మద్దతు ధరల విధానాన్ని కొనసాగించారు. ఇంత పకడ్బందీగా వ్యూహాన్ని రూపొందించి రైతులకు నూనె గింజల వ్యవసాయం లాభసాటిగా ఉండేలా తీర్చిదిద్దినందువల్లనే నేడు దేశావసరాల మేరకు నూనెగింజల ఉత్పత్తి పెరిగింది. డంకెల్ ముసాయిదా ప్రకారం అన్నిరకాల మద్దతు లెక్కగడితే వేరుసెనగకు ప్రభుత్వ సబ్సిడీలు కూడా పదిశాతంపైగానే ఉంటాయి.

## అధికారుల భరోసా

విద్యుచ్ఛక్తి చార్జీలు, నీటి తీరువా, ఎరువులు తదితరాలపై సబ్సిడీ వంటివి 'నాన్ ప్రొడక్ట్ స్పెసిఫిక్' మద్దతు పరిధిలోకి వస్తాయి. వీటి విషయంలో ప్రభుత్వ మద్దతు ఆరు శాతానికి మించదు కనుక ఇబ్బంది ఉండకపోవచ్చునని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. అయితే విద్యుచ్ఛక్తి ఉత్పాదన యంత్ర సామగ్రిపై పెట్టుబడిని కూడా పరిగణనలోకి తీసుకుంటే, 1986-88 కాలంలో వ్యయమైనట్లుగా ప్రభుత్వం పేర్కొంటున్న రూ. 2,260 కోట్ల కంటే ఇంకా ఎక్కువ మొత్తమే లెక్క తేలుతుంది. ఈ విధంగా డంకెల్ ముసాయిదా పుణ్యమా అని దేశావసరాల దృష్ట్యా ఇక్కడి రైతాంగానికి ప్రభుత్వాలు ప్రోత్సాహక ధర చెల్లించడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. అయితే ప్రొడక్ట్, నాన్ ప్రొడక్ట్ స్పెసిఫిక్ మద్దతులను కలిపి, వాటికి సగటున పది శాతం వరకు మినహాయింపు ఉండాలని గాట్ చర్చల సందర్భంగా గట్టిగా కోరగలమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల అమెరికా, యూరోపు దేశాల కూటమి సుదీర్ఘ చర్చలు జరిపి, వేర్వేరు పంటలకిస్తున్న ప్రొడక్టు, స్పెసిఫిక్ మద్దతు కలిపి సగటున అయిదు శాతానికి మించకుండా ఉండేట్లు అంగీకారానికి వచ్చాయి. అంటే ఒక పంట మద్దతు అయిదు శాతం కంటే తక్కువ ఉన్నప్పుడు మరో పంటకు ప్రభుత్వ మద్దతు అయిదు శాతం కంటే ఎక్కువ ఉండటానికి గాట్ చర్చల్లో యూరోపు, అమెరికా ఒక అంగీకారానికి వచ్చిన ఏ విషయాన్ని ప్రస్తావిస్తూ - భారతదేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రొడక్టు, నాన్ ప్రొడక్టు మద్దతులను కలిపి సగటున పదిశాతం ఉండేట్లు డంకెల్ డ్రాఫ్టులో మార్పుల కోసం పట్టుబడతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ సౌలభ్యాన్ని సాధిస్తే ఫరవాలేదు, లేని పక్షంలో దేశంలోని అశేష రైతాంగ ప్రయోజనాలకు పెద్ద దెబ్బ తగులుతుంది.

## ప్రజారోగ్యానికి 'సుస్తీ'

డంకెల్ ముసాయిదాలోని వాణిజ్య సంబంధ మేధోసంపత్తి హక్కు - వర్ధమాన దేశాలపై పిడుగుపాటు వంటిది. దీన్ని ఆమోదిస్తే మందుల ధరలు విపరీతంగా పెరిగి 'అందరికీ ఆరోగ్యం' అన్న లక్ష్యం అందని మావిడిపండు అవుతుంది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం 1970లో పేటెంట్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. రసాయనాలు, ఔషధాలు, జంతువుల ఆరోగ్య రక్షణకు అవసరమైన

మందులు, పురుగు మందులు, ఆహార పదార్థాలు, ఆప్టికల్ గ్లాస్, సెమికండక్టర్స్ మొదలైన వాటిల్లో వస్తు తయారీ విధానాన్ని మాత్రమే పేటెంట్ చేయడానికి అవకాశం కల్పించారు. అంతేగాని వస్తువును పేటెంట్ చేయడానికి అవకాశం ఇవ్వలేదు. కనుకనే ఆయా వస్తువులను ఇతరులు వేరే పద్ధతి అనుసరించి తయారు చేయగల వెసులుబాటు సమకూడింది. ఒకే వస్తువును వేర్వేరు పద్ధతుల ద్వారా రూపొందించి మార్కెట్లోకి విడుదల చేసే వీలుండటంతో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇండియాలో మందుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. అయినప్పటికీ దేశ జనాభాలో మూడోవంతు ప్రజలు ఇప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువన ఉండటం, ప్రస్తుత ధరలనుబట్టి చూస్తే వారి తలసరి ఆదాయం రూ. 2,174లకు మించి లేకపోవడంతో అవసరమైన మందులు కొనుక్కోలేక పేదలు అవస్థలు పాలవుతూనే ఉన్నారు. వివిధ రకాల వ్యాధులూ దేశ ప్రజలపై ప్రతాపం చూపిస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ దేశ జనాభాలో 1.5 శాతం మంది క్షయ వ్యాధి బాధితులు. కాలాంజరి, జాపసీస్ ఎన్ సెఫాలిటీస్ వ్యాధులు బీహార్‌లోని 30 జిల్లాల్లో, పశ్చిమబెంగాల్‌లోని తొమ్మిది జిల్లాల్లో విజృంభించి వేలాది ప్రజల్ని పొట్టనబెట్టుకుంటున్నాయి. ఇవి చాలవన్నట్లు దేశంలోని పలుచోట్ల ఎయిడ్స్ ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికీ 20 లక్షలమంది దురదృష్టవంతులు కుష్ఠువ్యాధితో సతమతమవుతున్నారు. 1991లో 21 లక్షల మంది మలేరియాతో బాధపడ్డారు. ప్రపంచ దేశాల్లో మనిషి సగటున రోజుకు 2,671 కేలరీల ఆహారం తీసుకొంటుంటే ఇండియాలో కేవలం 2,104 కేలరీలే లభ్యమవుతోంది. ఇటువంటి జటిల పరిస్థితులు చుట్టిముట్టి వున్న నేపథ్యంలో - డంకెల్ ముసాయిదావల్ల దేశ ప్రజలు ఆరోగ్య సంరక్షణ విషయంలో చాలా గడ్డుపరిస్థితి ఎదుర్కోవాల్సివస్తుంది. 'ప్రొడక్టు' పేటెంట్‌ను డంకెల్ ముసాయిదా ప్రతిపాదిస్తోంది. దీనివల్ల ఏర్పడే పరిణామాలు ఏమిటో తెలుసుకోవడానికి ఒక ఉదాహరణ చాలు. మధుమేహ వ్యాధి గ్రస్తులు 'ఇన్సులిన్' తీసుకోవాల్సి ఉంటుంది. ఇన్సులిన్‌ను ఇప్పటి వరకు పందులనుంచి తీస్తున్నారు. ఇటీవలి కాలంలో జన్యు ఇంజనీరింగ్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందడంతో మానవుని ఇన్సులిన్ తయారీ సులభసాధ్యమయింది. ఇప్పుడీ మానవ ఇన్సులిన్ తయారు చెయ్యడానికి అమెరికాకు చెందిన 'ఎలివిల్లీ', డెన్మార్క్‌కు చెందిన 'సేవా' సంస్థలు మాత్రమే పేటెంటు హక్కులు పొంది ఉన్నాయి. డంకెల్ డ్రాఫ్టు యథాతథంగా ఆమోదిస్తే మానవ ఇన్సులిన్ తయారీకి ఇతరేతర పద్ధతులు కనుగొన్నా, ఈ ప్రొడక్టు పేటెంటు అయి ఉంది. కాబట్టి

ఇతరులు దీన్ని తయారు చేసి మార్కెటు చేయడానికి అనుమతించరు. కొద్ది సంస్థలకే పేటెంటు హక్కులు ఉండటంవల్ల - అవి మార్కెటును శాసిస్తాయి. లాభార్జనే ధ్యేయంగాగల సంస్థలు ధరలను ఇష్టమొచ్చినట్లు పెంచి కోట్లు గడిస్తాయి. పర్యవసానంగా పరిశోధనకు అవకాశాలు సన్నగిల్లడమే కాదు, ప్రాణాధార మందులను అత్యధిక ధరలు పెట్టి కొనలేక సామాన్యులు సతమతమైపోతారు. ప్రస్తుతం దేశంలో తయారయ్యే మందులు, ఔషధాల ధరలు తక్కువగా ఉండటంతో, విదేశాలకు వీటిని కొంతవరకు ఎగుమతి చేయగలుగుతున్నాం. భవిష్యత్తులో ఈ అవకాశమూ సన్నగిల్లుతుంది. పేటెంట్ హక్కుగల మందులను దేశంలో ఉత్పత్తి చేసే అవకాశమూ ఉండదు. వాటిని నేరుగా దిగుమతి చేసుకోవాల్సిందే. డంకెల్ డ్రాఫ్టును యథాతథంగా ఆమోదిస్తే - దేశంలో మందుల ధరలు అయిదు నుంచి పదిరెట్లు పెరిగే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్యశాఖ మాజీమంత్రి చిదంబరం పేర్కొన్నారు. అదే జరిగితే ఎనభై అయిదు శాతం ప్రజలకు సరైన ఆరోగ్య రక్షణ సదుపాయాలు అందుబాటులో లేకుండా పోతాయి.

## సంయుక్త పార్లమెంటరీ కమిటీ

భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థపై అంతకు మించి ప్రజల జీవన ప్రమాణాలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపగల డంకెల్ ముసాయిదాపై తొందరపాటు నిర్ణయం తీసుకోవడం తగనివని గతంలో టోక్యో రౌండ్ గాట్ సమావేశాల వరకు ఒక వెసులుబాటు ఉండేది. ఆయా సమావేశాల్లోని నిర్ణయాలను సభ్యదేశాలు తమకు నచ్చిన వాటిని స్వీకరించి, నచ్చని వాటిని తిరస్కరించగలిగేవి. కానీ ఉరుగ్వే రౌండ్ ప్రస్తుత సమావేశాల్లో డంకెల్ ముసాయిదాను యథాతథంగా ఆమోదించడమో, లేక ఏకమొత్తంగా తిరస్కరించడమో రెండే మార్గాలున్నట్లు చెబుతున్నారు. అలాంటప్పుడు ఈ కీలక అంశంపై ఉభయ సభల్లోని అన్ని పక్షాల సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయలు సేకరించి, నిపుణుల సలహాలు, సదుపాయాలు క్రోడీకరించి తుది నిర్ణయానికి రావడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత.

*ది. 08-03-1993.* — *ఈనాడు*

# సమగ్ర అవగాహనతో 'డంకెల్'కు సమాధానం

విత్తనాలను పేటెంట్ చెయ్యాలన్న డంకెల్ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించిందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఇటీవల ప్రకటించారు. రైతులు, పరిశోధకుల ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ప్రణబ్ ముఖర్జీ ప్రకటన రైతాంగానికి కొద్దిగా ఉపశమనం కల్గించిందనే చెప్పాలి. డంకెల్ ముసాయిదాలోని వాణిజ్య సంబంధ మేధా సంపత్తి హక్కుల ప్రకరణం ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు తమ ప్రయోజనాలను విస్తృత పర్చుకోజూస్తున్నాయి. ఈ ప్రయత్నాల్లో భాగమే విత్తనాలను పేటెంట్ చెయ్యాలన్న ప్రతిపాదన. మొక్కల రకాలకు పేటెంట్ ద్వారాకానీ, 'సూయిజ నెరిస్' విధానం ద్వారా కానీ, వీటిని కలిపే ఇతర పద్ధతుల ద్వారా కానీ రక్షణ కల్పించవలసి ఉంటుందని వాణిజ్య సంబంధ మేధా సంపత్తి హక్కుల (ట్రిప్స్) విభాగంలోని ఆర్టికల్ 27లో 3(బి) అంశంలో స్పష్టం చేశారు. ఇది 1970 నాటి భారత పేటెంట్ చట్టానికి విరుద్ధం.

## స్వేచ్ఛ హరించే ట్రిప్స్

మన పేటెంట్ చట్టంలో వ్యవసాయం, వ్యవసాయ విధానాలు, వృక్షాలకు మినహాయింపు ఇచ్చారు. డంకెల్ ప్రతిపాదనను అంగీకరిస్తే రైతులు ఏటేటా తమకు అవసరమైన విత్తనాలను బహుళజాతి సంస్థల ప్రాబల్యంలో ఉండే పెద్ద కంపెనీల నుంచి కొనుగోలు చెయ్యాల్సి ఉంటుంది. దేశ రైతాంగంలో 80 శాతంగా గల చిన్న, సన్నకారు రైతులు దాదాపు 5 లక్షల 40 వేల గ్రామాల్లో విస్తరించి ఉన్నారు. రైతులు ఒకరి నుంచి మరొకరు విత్తనాలు తీసుకొని పంటలు పండించుకోవడం సర్వసాధారణం. మొత్తంగా రైతాంగానికి కావాల్సిన విత్తనాలలో రమారమి 40 శాతం మేరకు మాత్రమే

జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలు, ఇతర ప్రైవేటు విత్తన సంస్థలు సరఫరా చేస్తున్నాయి. రైతుల మధ్య విత్తనాల మార్పిడి ఆనవాయితీ ఉన్నందువల్లనే హరిత విప్లవం దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కొన్ని పంటల విషయంలో సఫలమయింది. రైతులంతా విత్తన సంస్థల నుంచే విత్తనాలు కొనుగోలు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో ఆచరణరీత్యా, సులభ సాధ్యం కాదు. ఇప్పటి వరకు వ్యవసాయం, మొక్కలు, విత్తనాలు పేటెంటు చట్టం పరిధిలో లేనందున రైతులు విత్తనాలు ఉత్పత్తి చేసుకోవడానికి, నిల్వ ఉంచుకోవడానికి, పొరుగు రైతులకు, వాణిజ్య సంస్థలకు అమ్ముకోవడానికి స్వేచ్ఛ ఉంది. అంతేకాదు ప్లాంటు, బ్రీడర్ల హక్కుల్లో రెండింటికి 1991 వరకు మినహాయింపుంది. మొక్కలు, విత్తనాలను రూపొందించాలనుకొనే శాస్త్రజ్ఞులు, పరిశోధకులు, మొక్కల పెంపకందార్లు తమకు అవసరమైన విత్తనాలను ఉచితంగా పొందే అవకాశం ఉండేది. అదే విధంగా రైతులు తాము పండించిన పంట నుండి భవిష్యత్ అవసరాలకు కావాల్సిన విత్తనాలను నిల్వచేసుకోవడానికి ఇతరులకు అమ్ముకొనేందుకు అవకాశం ఉండేది. కానీ 1991 'ఉపోవ్' సదస్సు నిర్ణయాలు ఈ రెండు మినహాయింపులకు విఘాతం కల్గించాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని - విత్తనాల పేటెంటునేగాక, 'నూయిజనెరస్' పద్ధతిని కూడా తిరస్కరించి ఇప్పటి వరకు దేశంలోని రైతులు, శాస్త్రజ్ఞులకున్న రక్షణ భవిష్యత్తులో కూడా కొనసాగే విధంగా డంకెల్ ప్రతిపాదనల్లో మార్పు చేయించడానికి ప్రభుత్వం కృషి చేయాలి. ప్రజారోగ్యానికి సంబంధించిన విషయంలోనూ డంకెల్ ప్రతిపాదనలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ సంగతి మన ఏలికలకు పెద్దగా పట్టినట్లు లేదు. దేశంలో లభించే మందులు, ఔషధాల్లో 10-15 శాతం మాత్రమే పేటెంట్ హక్కులున్నాయని, డంకెల్‌లోని 'ప్రొడక్ట్' 'ప్రాసెస్' పేటెంట్లను అంగీకరించినా - కొద్ది కాలం, అదీ కొద్దిమందికి మాత్రమే ఇబ్బంది కరంగా ఉంటుందని ప్రణబ్ ముఖర్జీ సెలవిచ్చారు. పారిస్ సదస్సు ఆర్టికల్స్ 1-12, 19లను ఆమోదించాల్సి ఉంటుందని డంకెల్ ముసాయిదా విస్పష్టంగా పేర్కొంది. పారిస్ సదస్సులో ఇండియా పాల్గొనలేదు. 'ట్రిప్స్' ప్రకరణంలో రెండో ఆర్టికల్ ఆమోదించామంటే 1970 నాటి భారత పేటెంట్ చట్టాన్ని చెత్తబుట్టపాలు చెయ్యడమే అవుతుంది. ఈ సందర్భంగా - 1970 నాటి పేటెంట్ చట్టం గురించి తెలుసుకోవాలి.

## మన్ననలందుకొన్న చట్టం

దేశంలో మొదటిసారిగా 1859లో బ్రిటీష్‌వారు పేటెంట్ చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1872, 73, 82లలో దీనికి కొన్ని సవరణలు చేశారు. 1911లో 'భారత పేటెంట్, డిజైన్స్ యాక్ట్' తెచ్చారు. దీంతో విదేశీ పారిశ్రామికవేత్తలు, పేటెంటుదార్లు వారి ఉత్పత్తులను ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తూ అత్యధిక లాభాలార్జిస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేశారు. ఈ చట్టం పుణ్యమా అని దేశీయంగా పరిశ్రమలు పెద్దగా అభివృద్ధి చెందలేకపోయాయి. ప్రతిదానికీ ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి దాపురించింది. స్వాతంత్ర్యానంతరం కూడా దాదాపు 1970 వరకు ఈ దుస్థితి కొనసాగింది. 1911 పేటెంటు చట్టాన్ని మార్చవలసిన ఆవశ్యకతపై జస్టిస్ బక్షి టేక్‌చంద్ కమిటీ (1948–50), జస్టిస్ ఎన్.ఆర్. అయ్యంగార్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ (1957–59) నివేదికలు సమర్పించాయి. పార్లమెంటులో మూడు బిల్లులు ప్రవేశపెట్టారు. పేటెంట్ చట్టం మార్పు కొత్త చట్టం స్వరూప స్వభావాల గురించి రెండు 'జాయింట్ సెలెక్ట్ కమిటీ'లు సుదీర్ఘంగా చర్చించాయి. ఈ ప్రయత్నాలన్నింటి పర్యవసానంగా రూపుదాల్చిన భారత పేటెంటు చట్టం – 1970 ఆదర్శ ప్రాయమైనదిగా అనేక వర్ధమాన దేశాల మన్ననలందుకొంది. ఈ చట్టం–కొత్త విషయాన్ని ఆవిష్కరించింది. పరిశోధకునికి తగిన గుర్తింపు ఇస్తూనే, అదే సమయంలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చింది. పరిశోధనలను ప్రోత్సహించడానికి దేశంలో పేటెంటు హక్కులు కలుగజేస్తామని, ఆ పరిశోధనా ఫలితాలు వాణిజ్య స్థాయిలో అనవసర కాలాయాపన లేకుండా వీలైనంత స్వల్ప వ్యవధిలో అమలు చేయడానికి అవకాశం కల్పిస్తామని – చట్టంలోని 83 అధికరణం స్పష్టం చేస్తోంది. కేవలం పేటెంటుదారు ఒక్కనికే గుత్తాధిపత్యం కాని, పేటెంటు చేసిన వస్తువును దిగుమతి చేసే అధికారం కాని పేటెంటు దారుకు ఉండవని స్పష్టం చేసింది. ఈ చట్టంలో – ఆహారం, మందులు, ఔషధాలు, రసాయనిక ప్రక్రియల ద్వారా లభించే పదార్థాలకు 'ప్రాసెస్ పేటెంట్' అవకాశం మాత్రమే ఉంది. అంటే వస్తూత్పత్తి విధానాన్ని మాత్రమే పేటెంట్ చేయవచ్చు. కానీ ఆ వస్తువుపైన ప్రొడక్టు పేటెంట్ చేసే వీలులేదు. అణుశక్తి, వ్యవసాయం, తోటల పెంపకం పేటెంటు పరిధిలోకి రావు. భారతీయుడైనా, విదేశీయుడైనా తనకు లభించిన పేటెంట్ హక్కు అమల్లోకి రావాలీ అంటే – పేటెంట్ చేసిన వస్తువు లేదా పద్ధతిని ఇక్కడే ఆచరణలోకి తెచ్చి ఉత్పత్తి సాగించవలసి ఉంటుంది. అంతేకాదు, పేటెంటు దారుడు విధిగా లైసెన్సు

పొందాలి. ఒకవేళ పేటెంటుదారుడు ఏ కారణం చేతనైనా లైసెన్సు పొందక, వస్తువు ఉత్పత్తి చేయలేకపోతే – ఆ వస్తువు తయారు చేసేందుకు వేరే వారికి లైసెన్సు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఆహారం, మందులు, ఔషధాల విషయంలో పేటెంటు దారుడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించినా, తగినంతగా ఉత్పత్తులు చేసి, సరసమైన ధరలకు అందించలేకపోయినా, వస్తువును అసలు ఉత్పత్తే చేయకపోయినా – మూడేళ్ళ తర్వాత అదే వస్తువును ఉత్పత్తి చేసేందుకు వేరే వారికి లైసెన్సు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఆహారం, మందులు, ఔషధాలకు పేటెంటు ఏడేళ్ళ వరకు వర్తిస్తుంది. మిగతా వాటికి 14 సంవత్సరాల వరకు పేటెంటు ఉంటుంది.

## ప్రజా సంక్షేమానికి 'సుస్తీ'

1970 నాటి పేటెంటు చట్టం రాకముందు దేశంలో మందుల ధరలు భగ్గున మండిపోతూ వుండేవి. 1970కి పూర్వం ఇండియాలో మందుల ధరలు ప్రపంచంలోనే మరెక్కడా లేనంత అధికంగా ఉండేవని, పేటెంటు చట్టం రూపొందిన దరిమిలా అతి తక్కువ స్థాయికి ధరలు దిగివచ్చాయని కెఫావర్ సారథ్యంలోని అమెరికన్ సెనేట్ కమిటీ వ్యాఖ్యానించింది. ఒకే వస్తువును వేర్వేరు విధానాల ద్వారా తయారు చేయడానికి మన చట్టం అవకాశం కల్పించింది. ఈ రంగంలో పోటీ అధికంగా ఉండటంతో మందులు తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. ఉదాహరణకు 'జన్‌టాక్' బ్రాండు 'రానిటైడిన్' 10 బిళ్లల ప్యాకెట్‌ను గ్లాస్కో కంపెనీ ఇండియాలో అమ్మే ధర రూ.29 కాగా దాన్నే పాకిస్తాన్‌లో రూ. 260, బ్రిటన్‌లో రూ. 481, అమెరికాలో రూ. 744కు అమ్ముతోంది. అదే విధంగా ఓవెరాన్ లేదా ఓల్టారె బ్రాండ్ పేర్లతో మార్కెట్లో లభ్యమయ్యే 'సిబా' కంపెనీ వారి 'డైక్లోఫినాక్' పది బిళ్లల ప్యాకెట్ ఒక్కొక్కటి ఇక్కడ రూ. 5.67 పైసలు కాగా, అదే పాకిస్తాన్లో రూ. 55.80, బ్రిటన్‌లో రూ. 95.84, అమెరికాలో రూ. 239.47 పైసలకు విక్రయిస్తున్నారు. అలాగే హృద్రోగానికి వాడే మందు 'ఎటినోలాల్' ఖరీదు ఇండియాలో ఉన్న దాని కన్నా పాక్, బ్రిటన్, అమెరికాల్లో వరుసగా 11.5, 13.8, 30 రెట్లు ఎక్కువ. ఇలా చెప్పుకుంటూ పోతే ఉదాహరణలు కోకొల్లలు. ఇండియాలో మందులు తక్కువ ధరలో లభ్యమవడానికి ప్రధాన కారణం ఇక్కడ 'ప్రాసెస్ పేటెంట్' ఉండటం కాగా, ఇతర దేశాల్లో అధికంగా ఉండటానికి ఆయా చోట్ల 'ప్రొడక్ట్ పేటెంట్ ఉండటమే కారణం. ఇప్పుడు కేంద్ర

ప్రభుత్వ వైఖరి చూస్తుంటే డంకెల్ చేసిన ఈ పేటెంట్ ప్రతిపాదనలను అంగీకరించేట్లే కన్పిస్తోంది. ఒకవేళ అదే జరిగితే 1970 నాటి మన పేటెంట్ చట్టానికి తిలోదకాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఫలితంగా భారతదేశంలో కూడా మందుల ధరలు పగ్గాలు తెంచుకొని పరుగులు పెడతాయి. అంత ఖరీదు వెచ్చించి, మందుల్ని కొనలేక సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం అవస్థల పాలుకావడం ఖాయం. ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం చెబుతున్నట్లు మందుల ధరల పెరుగుదల సగటున 40 శాతం దగ్గర ఆగదు. పైపెచ్చు 10-15 శాతం మందులు మాత్రమే పేటెంటు అయివున్నాయన్న ప్రభుత్వ వాదనలో నిజంలేదు. ఆపరేషన్ రీసెర్చ్ గ్రూప్ సమాచారాన్ని అధ్యయనం చేసిన ఇండియన్ డ్రగ్స్, మెడికల్స్ అసోసియేషన్ పేటెంట్ అయిన మందుల శాతాన్ని గ్రూపుల వారీగా ప్రభుత్వానికి తెలియజేసింది. దీని ప్రకారం యాంటి బయోటిక్స్ మందుల టర్నోవర్‌లో పేటెంట్ అయినవి 40 శాతమనీ, యాంటీ బాక్టీరియల్ మందుల్లో 98 శాతం, యాంటి లెప్రొటిక్స్ 70, కార్డియో వాస్కులర్ మందుల్లో 40, ట్రాంక్విలైజర్స్‌లో 74, యాంటి సెప్టిక్ అల్సర్ మందుల్లో 66, కాంట్రా సెప్టివ్ హార్మోనుల్లో 88, యాంటీ అస్మాటిక్స్‌లలలో 47 శాతం పేటెంట్ మందుల టర్నోవర్ ఉందని అసోసియేషన్ పేర్కొంది. దేశ జనాభాలో 30 శాతం దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారని ప్రభుత్వమే అంగీకరిస్తోంది. ఇప్పటికే కోట్లాది సామాన్య ప్రజానీకానికి సరైన వైద్య సేవలు అందుబాటులో లేవు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం వున్న పేటెంట్ చట్టాన్ని అటకెక్కించాల్సిన దుస్థితి తెచ్చిపెట్టే డంకెల్ ప్రతిపాదనలను అంగీకరిస్తే సామాన్యుల ఆరోగ్య సంరక్షణ విషయంలో మనం దెబ్బతిని పోవడం ఖాయం. వర్ధమాన దేశాల్లో తక్షణావశ్యకమైన సామాజిక మార్పును పారిస్ సదస్సు గమనించలేదని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోలేదని, ఈ సదస్సు నిర్ణయాలు స్వదేశీ పరిశ్రమల అభివృద్ధికి పెద్దగా దోహదం చెయ్యవనీ మాజీ ఉపరాష్ట్రపతి జస్టిస్ హిదయుతుల్లా చేసిన వ్యాఖ్య గమనార్హం. పారిస్ సదస్సు నిర్ణయాలు భారత రాజ్యాంగానికి అనుగుణంగా లేవని జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జె.సి.షా. అభిప్రాయపడ్డారు. ఇప్పుడు డంకెల్ ప్రతిపాదనలో పెటేంట్‌కు సంబంధించిన అంశాలు అంతకన్నా దారుణంగా ఉన్నాయి. డంకెల్ ప్రతిపాదనల ప్రకారం - పేటెంటుదారుడు వస్తువును మనదేశంలో తయారు చెయ్యకుండా విదేశాల నుంచి దిగుమతి చేసినా పేటెంట్ హక్కు కలుగచేయాల్సి ఉంటుంది. ఎప్పుడైతే వస్తువును మనదేశంలో విధిగా తయారు చేయాల్సిన బాధ్యత తప్పుతుందో అప్పుడు దానిధర, సరఫరాలను నియంత్రించే

అధికారం ప్రభుత్వానికి ఉండదు. ఆరోగ్యకరమైన పోటీ కొరవడి గుత్తాధిపత్య ధోరణులు పెరుగుతాయి. ప్రజా సంక్షేమం కుంటుపడుతుంది. ప్రాణావసర మందులను అత్యధిక ధరలు వెచ్చించి దిగుమతి చేసుకోవలసి వస్తుంది. నేడు ఇండియాలో సిప్లా కంపెనీ 'సైటో బ్లాస్టిన్' బ్రాండ్ పేరిట కాన్సర్ నిరోధక మందు 10 మిల్లీ గ్రాముల ఇంజక్షన్‌ను రూ. 108కి అమ్ముతోంది. ఇదే గుణముగల మందును బహుళజాతి సంస్థ లిల్లీ 'వెల్బాన్' బ్రాండ్ పేరుతో రూ. 928లకు విక్రయిస్తోంది. అమెరికాలో లాసెక్స్ బ్రాండ్ పేరుతో లభ్యమయ్యే ఫ్యురోజిమైడ్ 10 బిళ్లలు రూ. 50 కాగా ఇండియాలో అవి కేవలం రూ. 1.68 పైసలకే లభ్యమవుతున్నాయి. ఎయిడ్స్ మహమ్మారి ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించడానికి దోహదపడే మందును 4000 డాలర్లకు విక్రయిస్తోంది. అమెరికాలోని అనేకమంది ఇంత ఖరీదైన మందును వినియోగించలేకపోవచ్చు. ఇండియాలో కూడా చాలా మందికి ఎయిడ్స్ వ్యాధికారక వైరస్ సోకినట్లు ప్రభుత్వ గణాంకాలు తెల్పుతున్నాయి. వీరంతా అంతంత ధరలు పెట్టి మందు కొని ఉపశమనం పొందగల స్థితిలో లేరనడం నిర్వివాదాంశం. అయితే భవిష్యత్తులో ఇదే మందును మరొక పద్ధతి ద్వారా తయారు చేసుకోగలిగితేనే ఇండియాలోని ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు కొంతైనా మేలు జరుగుతుంది. డంకెల్ పేర్కొన్నట్లు ప్రొడక్ట్ పేటెంట్‌ను ఇండియా అంగీకరిస్తే – ఆ మందును వేరే పద్ధతుల ద్వారా ఇక్కడి శాస్త్రజ్ఞులు, ఔషధ సంస్థలు తయారు చెయ్యడానికి వీలుండదు. నేడు ప్రపంచంలో ఎయిడ్స్‌కు గురైన వారిలో మూడో వంతు వర్ధమాన దేశాల్లోనే ఉన్నారన్న వాస్తవం దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం పేటెంట్ల విషయంలో దృఢంగా వ్యవహరించాల్సి వుంటుంది. తమకు అంగీకార యోగ్యమైన నిర్ణయాలకు ఆమోదం తెలిపి, అభ్యంతరకర అంశాలను తిరస్కరించే వెసులుబాటు టోక్యో రౌండ్ గాట్ చర్చల వరకు సభ్య దేశాలకు ఉంది. ఉరుగ్వే రౌండ్ చర్చలలో కూడా ఈ విధానం కొనసాగించి తీరాలని పట్టుబట్టి – భారతదేశ ప్రయోజనాలకు భిన్నంగా ఉన్న విషయాలను నిష్కర్షగా తోసిపుచ్చడానికి కేంద్రప్రభుత్వం నిర్ణయించాలి.

## దిగుమతులు - అనివార్యం

మార్కెట్ ప్రవేశానికి సంబంధించినది మరో కీలకాంశం. ప్రస్తుతం ఇండియాలో తలసరి ఆదాయం వెయ్యి డాలర్ల కన్నా చాలా తక్కువే కనుక మనం విదేశీ వస్తువులను

దేశీయ మార్కెట్లలోకి అనుమతించాల్సిన అవరం లేదని ప్రణబ్ ముఖర్జీ సెలవిస్తున్నారు. ఇక్కడో తిరకాసు రావచ్చు! సాధారణంగా ఇప్పటి వరకు అనుసరిస్తున్న పద్ధతుల ప్రకారం లెక్కిస్తే దేశంలో తలసరి జాతీయోత్పత్తి 330 డాలర్ల మాత్రమే! కానీ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇండియా తలసరి జాతీయోత్పత్తిని లెక్కగట్టి 1150 డాలర్లుగా "నిగ్గుదేల్చింది"! డంకెల్ ముసాయిదాకు భారత ప్రభుత్వం ఆమోదం తెలిపాక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ చెప్పిన దాన్నే గాట్ సెక్రటేరియట్ ఖరారు చేసినప్పుడు - ఏటా భారతీయులు వినియోగిస్తున్న వస్తువుల్లో కనీసం రెండు శాతాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. 2003 నాటికి 3.3 శాతానికి తగ్గకుండా దిగుమతుల్ని అనుమతించాల్సి వస్తుంది. అవసరం లేకపోయినా విధిగా దిగుమతులు చేసుకోవాలన్న ఈ నియమంవల్లగాని, 1986-88 వరకు ఇండియా దిగుమతుల స్థాయికి తగ్గకుండా భవిష్యత్తులోనూ దిగుమతులను అనుమతించడం వల్లగాని దేశ వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతుంది. కొన్ని పంటల ధరలు పడిపోతాయి. ఈ సంవత్సరం అవసరం లేకపోయినా వేలాది టన్నుల వంటనూనెలను ప్రభుత్వం అమెరికా నుంచి దిగుమతి చేసుకొన్నది. పర్యవసానంగా వేరుసెనగ, పొద్దు తిరుగుడు పువ్వు వంటి పంటల ధరలు పడిపోయాయి. 'ఆయిల్ సీడ్ టెక్నాలజీ మిషన్' పెట్టి గత కొన్ని సంవత్సరాలుగా నూనెగింజల ఉత్పత్తి ప్రోత్సహించటంతో దేశం దాదాపు స్వయం సమృద్ధి స్థాయికి చేరువయింది. ఈ సమయంలో అనవసర దిగుమతులను అనుమతించడంతో నూనె గింజల రైతుకు నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితులతో వేగలేక రైతులు వేరే పంటలకు మళ్లితే మళ్లీ 'కొరత' అనివార్యమవుతుంది. కనుక దేశ రైతాంగ ప్రయోజనాలకు విరుద్ధమైన అంశాలన్నింటినీ ప్రభుత్వం తిరస్కరించడం నేటి అవసరం.

*ది. 12-06-1993.* — ***- ఈనాడు***

●

# వాణిజ్యం మాటున మాయవలలు

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) నిబంధనల కారణంగా పలు వర్ధమాన దేశాలు వ్యవసాయ రంగంలో సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. ఈ సంక్షోభాల వల్ల వర్ధమాన దేశాలకు తాత్కాలికంగా నష్టాలు ఎదురైనా భవిష్యత్తులో మేలు జరుగుతుందని కొందరు వాదిస్తున్నారు. వర్ధమానదేశాల్లో వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తున్న నిబంధనల్లో మార్పులు చేసేందుకు ప్రయత్నాలు జరగడం లేదు. ఆసియా, ఆఫ్రికా, పలు లాటిన్ దేశాల్లో సరళీకృత ఆర్థిక విధానాల అమలు, ముఖ్యంగా 1995 నుంచి డబ్ల్యు.టి.ఒ. వ్యవసాయ ఒప్పందం పర్యవసానంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావానికి ముందు... అభివృద్ధి చెందిన దేశాలు వర్ధమాన దేశాలకు మేలు చేకూరేలా తమ విధానాల్లో మార్పులు చేస్తామని చెప్పినా ఆ మాట నిలబెట్టుకోలేదు. అంతేకాక ఆ దేశాలు తమ రైతులకు ఇస్తున్న సబ్సిడీలను ఇప్పటికీ తగ్గించకపోగా మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ధనిక దేశాల్లో కేవలం నాలుగు శాతం మంది ప్రజలే వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. మధ్య ఆదాయ దేశాల్లో 30 శాతం, వర్ధమాన దేశాల్లో 70 శాతం ప్రజల జీవనాధారం వ్యవసాయమే. వర్ధమాన దేశాల్లోని దాదాపు 300 కోట్లమంది ప్రజలకు వ్యవసాయమే ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారం. అనేక వర్ధమాన దేశాలకు రుణాలిచ్చిన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు అదే సమయంలో షరతులతో కూడిన సలహాలు ఇచ్చాయి. ద్రవ్యలోటు తగ్గించడం, సబ్సిడీలను తగ్గించడం వీటిల్లో ముఖ్యమైనవి. ఈ సూచనల మేరకే 1990లలో కేంద్రంలోని నాటి పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ తగ్గించింది. వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు కూడా తగ్గాయి. నీటితీరువా, వ్యవసాయ విద్యుత్ ఛార్జీల పెంపు, అధిక వడ్డీలకు రుణం, విత్తనాలు, పురుగు మందుల ధరల పెరుగుదల కారణంగా

పంటల ఉత్పత్తి వ్యయం పెరిగింది. దీనికి తోడు ప్రభుత్వ సహకారం కొరవడటం, ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం తదితర కారణాల వల్ల వ్యవసాయం రంగంలో సంక్షోభం ఏర్పడింది. విత్తనాల ఉత్పత్తి మార్కెటింగ్‌లలో బహుళజాతి సంస్థల భాగస్వామ్యం రానురాను పెరిగిపోతోంది. ప్రపంచంలో తెగుళ్లను నిరోధించే మందుల అమ్మకాల్లో 75 శాతం వాటా బేయర్, డూపాంట్, డౌ, బాసఫ్, మోన్‌సాంటో, సిన్‌జెంటా వంటి బహుళజాతి కంపెనీల చేతుల్లో ఉంది. ప్రపంచంలో 65 శాతం మొక్కజొన్న విత్తనాలను, 44 శాతం సోయాబీన్స్ విత్తనాలను మోన్‌శాంటో, డూపాంట్ కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. జన్యుమార్పిడి విత్తనాల్లో 91 శాతం మార్కెట్ మోన్‌శాంటోదే. 1997-99 మధ్య కేవలం రెండేళ్ల కాలంలో బ్రెజిల్ మొక్కజొన్న విత్తనాల్లో 60 శాతం మార్కెట్‌ను మోన్‌శాంటో కైవసం చేసుకుంది. మనదేశంలోని పురుగుమందుల మార్కెట్‌లో21 శాతం వాటా ఒక్క బేయర్ కంపెనీదే. భవిష్యత్తులో మనదేశం ఆహార స్వయం సమృద్ధి సాధించడానికి, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల సాగు, సాగు పద్ధతులు, సస్య రక్షణ చర్యల్లోనూ బహుళజాతి సంస్థల ప్రమేయం గణనీయంగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అంటే మన ఆహార రంగం బహుళజాతి సంస్థలపై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

## ధనికదేశాల అవకాశవాదం

దోహాలో 2001 నవంబరులో డబ్ల్యు.టి.ఒ. సమావేశం అనంతరం అమెరికా, యూరోపియన్ దేశాలు స్వేచ్ఛా వాణిజ్యం, దానివల్ల కలిగే ప్రయోజనాలను వర్ధమాన దేశాలకు బోధిస్తూ, అదే సమయంలో తమ దేశాల్లోని వ్యవసాయాన్ని పరిరక్షించుకునేందుకు రక్షణ కవచాలను మరింత పటిష్ట పరిచాయి. భారత్‌లాంటి వర్ధమాన దేశాల్లో ఆంక్షలను ఎత్తివేయించి తమ ఉత్పత్తులను ఇతోధికంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లలోకి పంపుతున్నాయి. 1980-81 నాటికి ఐరోపా సమాఖ్య వాటా ప్రపంచ దిగుమతుల్లో 32 శాతం. 2000-01 నాటికి ఈ దిగుమతులు 23 శాతానికి తగ్గటమే కాక ఐరోపా సమాఖ్య నుంచి వ్యవసాయ ఎగుమతులు 1999 నుంచి 2005 నాటికి 26 శాతం పెరిగాయి. గత పదిహేనేళ్లలో అమెరికా నుంచి ఎగుమతులు రెట్టింపై 2002 నాటికి 53 బిలియన్ డాలర్లకు చేరాయి. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులు 19 శాతం నుంచి 14 శాతానికి తగ్గాయి. భారత్

నుంచి కూడా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల వాటా మొత్తం ఎగుమతుల్లో 1996-97లో 20.4 శాతం ఉండగా 1999-2000 నాటికి 14.6 శాతానికి తగ్గిపోయింది. వర్ధమాన దేశాల్లో వ్యవసాయ రంగానికి ఇస్తున్న సబ్సిడీ డబ్ల్యు.టి.ఒ. విధించిన పదిశాతం పరిమితి కన్నా తక్కువగానే ఉంది. వర్ధమాన దేశాలు పరిమాణాత్మక ఆంక్షలను ఎత్తివేసి, సుంకాలను తగ్గించి మార్కెట్ ప్రవేశానికి మార్గాలను సుగమం చేసినా అభివృద్ధి చెందిన దేశాలు తాము పాటించాల్సిన నియమాలను, అమలు చేయాల్సిన హామీలను గాలికి వదిలి వేస్తున్నాయి. ఫలితంగా వర్ధమాన దేశాల నుంచి అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతులు పెద్దగా పెరగటల్లేదు. కానీ అభివృద్ధి చెందిన దేశాల నుంచి వర్ధమాన దేశాల్లోకి వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు ప్రవాహంలా వచ్చి పడుతున్నాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావానికి పునాది డంకెల్ ప్రతిపాదనలు. వీటిలోని పలు అంశాలు ధనికదేశాలకు లాభం చేకూర్చేవిధంగా ఉన్నా వాటిని సరిగా అంచనా వేయడంలో భారత్ సహా పలు వర్ధమాన దేశాలు విఫలమయ్యాయి. ధనిక దేశాల ఒత్తిళ్లకు తలొగ్గి అవి సంతకాలు చేశాయి. విచారకరమైన విషయమేమంటే 2004 జులైలో జెనీవాలో ఒప్పంద పత్రంపై సంతకాలు చేసేటప్పుడు కూడా గత చేదు అనుభవాలు ఆయా దేశాలకు గుర్తు రాలేదు. ఇప్పటికే ధనిక దేశాలు తమ వ్యవసాయ రంగానికి రోజుకు బిలియన్ డాలర్లు (రూ.4500 కోట్లు) సబ్సిడీ ఇస్తుండగా వీటిని ఇంకా పెంచుకునేందుకు, కొనసాగించేందుకు వీలుగా ఈ 'ఫ్రేమ్‌వర్క్'లో పొందుపరచుకోగల్గాయి. అమెరికా గతంలో ఇచ్చిన 1900 కోట్ల డాలర్ల సబ్సిడీని 'ఫ్రేమ్‌వర్క్' తరువాత 3,900 కోట్ల డాలర్లకు పెంచుకునేందుకు అవకాశం కలిగింది. ఇదికాక 2002లో జార్జిబుష్ ప్రభుత్వం 'ఫార్మ్ బిల్లు' ద్వారా పదేళ్లలో 18,000 కోట్ల డాలర్లు అంటే దాదాపు 8 లక్షల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగానికి అందించాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని మొదటి మూడు సంవత్సరాల్లోనే వ్యయం చేయాలని నిర్ణయించింది.

అభివృద్ధి చెందిన దేశాలు భారీగా సబ్సిడీలు ఇస్తున్నందున అంతర్జాతీయ మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గుతున్నాయి. ఉదాహరణకు అమెరికాలో మూడు బిలియన్ డాలర్ల విలువైన పత్తి పండించే 20వేల మంది రైతులకు ఇస్తున్న

సబ్సిడీ 390 కోట్ల డాలర్లు. అంటే పంట విలువకు మించి సబ్సిడీ అక్కడి రైతులకు లభిస్తుంది. మాలి దేశంలో పత్తి పండించే పాతిక వేల మంది రైతుల వార్షికాదాయం కన్నా అమెరికాలోని అర్కన్సాస్ రాష్ట్రంలో ఒక పత్తి రైతుకు అందే 60 లక్షల డాలర్ల సబ్సిడీయే అధికం. టన్ను తెల్ల బియ్యాన్ని అమెరికా వర్ధమాన దేశాల్లో 274 డాలర్లకు అమ్ముతుంది. వాస్తవానికి అమెరికాలో ధాన్యం పండించి మిల్లు పడితే ఒక టన్ను బియ్యం ఉత్పత్తి వ్యయం 415 డాలర్లు అవుతుంది. అంటే ఉత్పత్తి వ్యయం కన్నా 34 శాతం తక్కువకు అమ్మటం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో బియ్యం ధరలు తక్కువగా ఉ ండి వర్ధమాన దేశాల నుంచి ఎగుమతి అయ్యే బియ్యానికి తక్కువ ధర లభించి రైతులకు గిట్టుబాటుకాని పరిస్థితి ఏర్పడుతోంది.

డబ్ల్యు.టి.ఒ. సమావేశాల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రతినిధుల అలసత్వం, అవగాహన లోపంవల్ల మరో నష్టం కూడా వాటిల్లింది. డబ్ల్యు.టి.ఒ. వ్యవసాయ ఒప్పందంలో 'పీస్‌క్లాజ్' వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ధనిక దేశాలు పరిమితికి మించి సబ్సిడీలు ఇస్తున్నా, నిబంధనల ప్రకారం సబ్సిడీలు తగ్గించకపోయినా వర్ధమాన దేశాలు దీనిపై ప్రశ్నించేందుకు గానీ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసేందుకు గానీ ఈ క్లాజు అంగీకరించదు.

## భారత్ చొరవ అవసరం

చైనాలో డిమాండ్ పెరిగినందున గత రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులు ధరలు గతంలో కంటే కొద్దిగా పెరిగాయి. ధనిక దేశాల్లో అధిక సబ్సిడీల కారణంగా మార్కెట్లలో ధరలు తక్కువగా ఉండటం వలన ఏటా వర్ధమాన దేశాలు తమ ఎగుమతులపైన సుమారు 6,000 కోట్ల డాలర్లు నష్టపోతున్నాయని అంచనా. అభివృద్ధి చెందిన దేశాల్లోకి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులపైన, విలువను జోడించి ప్రాసెస్ చేసిన ఉత్పత్తులపైన అధికస్థాయిలో సుంకాలు విధిస్తున్నారు. ఉదాహరణకు ఐరోపా సమాఖ్యలో ప్రవేశించే టమాటాలపై విధించే సుంకానికి అయిదురెట్ల సుంకాన్ని టమాటా సాజ్‌పైన విధిస్తున్నారు. దీనివల్ల వర్ధమాన దేశాల్లో ఆగ్రో ప్రాసెసింగ్ రంగ అభివృద్ధికి ఊతం లభించదు. అమెరికా ట్రేడ్ యాక్టు - 1974లోని సెక్షన్ 301 అమెరికా వాణిజ్య ప్రతినిధికి ఇతర దేశాల నుంచి వచ్చే సరకులపై అవలంబిస్తున్న ఇటువంటి అన్యాయమైన విధానాలను దీటుగా ఎదుర్కొంటేనే

వ్యవసాయ వాణిజ్య సరళీకరణ వల్ల వర్ధమాన దేశాలకు మేలు జరుగుతుంది. డబ్ల్యు.టి..ఒ. సభ్యత్వ దేశాల్లో నాలుగింట మూడు వంతులు వర్ధమాన దేశాలే. ఏ దేశానికైనా ఉండేది ఒక్క ఓటే. అంతేకాక ఏ నిర్ణయమైన ఏకగ్రీవంగా తీసుకోవాలి. అందువల్ల ధనికదేశాల ఒత్తిడికి... ముఖ్యంగా అమెరికా ఒత్తిడికి తలొగ్గకుండా ఇతర వర్ధమాన దేశాల మధ్య అవగాహనకు, వాటిని కూడగట్టేందుకు భారత్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది జరగనంత కాలం ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులు ఆకర్షణీయమైన ప్యాకెట్లలో వాల్ మార్ట్ వంటి సూపర్‌మార్కెట్ల ద్వారా మనదేశంలోకి, ఇతర వర్ధమాన దేశాల్లోకి వచ్చి పడతాయి. దీనివల్ల ఆయా దేశాల్లో పంట ఉత్పత్తులు ధరలు తగ్గి సన్నకారు రైతుల జీవన స్థితిగతులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు స్పష్టంగా ఉన్నట్లు వివిధ దేశాల అనుభవాలు తెలియజేస్తున్నాయి.

*ది. 09-04-2006.* — *ఈనాడు*

●

# కార్మిక ప్రమాణాల పేరిట అర్థరహిత ఆంక్షలు?

## అమెరికా వైఖరి ప్రగతి నిరోధకం

జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్ (గాట్) తుది విడత చర్చలు పూర్తయిన తరువాత సామాజిక అంశాన్ని కూడా చర్చించాలని అమెరికా, ఫ్రాన్స్‌లు పట్టుబట్టాయి. కార్మిక ప్రమాణాలు పాటించని దేశాల్లో ఉత్పత్తయి ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే వస్తువులపై కొన్ని ఆంక్షలు విధించాలనే అంశాన్నిఈ రెండు దేశాలు లేవనెత్తాయి. చర్చలు పూర్తయిన తరువాత అమెరికా ఈ మెలిక పెట్టడంతో అగ్రిమెంటుపై సంతకాలు చేసే కార్యక్రమంలో కొద్దికాలం ప్రతిష్ఠంభన ఏర్పడింది. వాణిజ్యానికి సంబంధంలేని అవినీతి, సామాజిక అంశం వంటి విషయాలను గాట్ చర్చలలోకి తీసుకు రాకూడదని అనేక వర్ధమాన దేశాలు, జపాన్, ఆస్ట్రేలియా, ఆసియా దేశాలు అభిప్రాయపడ్డాయి. 124 దేశాల ప్రభుత్వాల తరఫున, యూరోపియన్ యూనియన్ తరఫున 1995 ఏప్రిల్ 15న మంత్రులు సంతకాలు చేయడంతో మొరాకోలోని మరకేష్‌లో జరిగిన ఎనిమిదో ఉరుగ్వే రౌండ్ చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ సన్నాహక సంఘం ఈ కార్మిక ప్రమాణాల అంశాన్ని చర్చించవచ్చునని అవగాహన కుదరడంతో సభ్యత్వ దేశాలు సంతకాలు చేశాయి. స్వేచ్ఛ, సమష్టి సంప్రదింపులు, కార్మిక శక్తి నిర్బంధ వినియోగంపై నిషేధం, బాల కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టడం విచక్షణకు చోటివ్వక పోవడం వంటి అంశాలను ఈ సంఘం ఏర్పాటుకు కనీస ప్రమాణాలుగా నిర్ణయించారు. అంతకుముందు గాట్ ఆధ్వర్యంలో జరిగిన ఏడు రౌండ్ల చర్చలలో రాని పలు అంశాలు ఎనిమిదో రౌండ్ చర్చల్లో చోటు చేసుకున్నాయి. వాణిజ్యం, వాణిజ్య పరమైన మేథా సంపత్తి హక్కులు, వాణిజ్య సంబంధ పెట్టుబడులు వంటి పలు అంశాలపై చర్చలు జరిగాయి. వ్యవసాయ వాణిజ్యం, వస్త్రాల్ని

తిరిగి గాట్ పరిధిలో చేర్చారు. ఉరుగ్వే రౌండ్ చర్చల ఆధారంగా రూపొందించిన అగ్రిమెంట్లు, నిర్ణయాలను అమలు చేయడానికి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) ఏర్పాటయింది. 1995 జనవరి 1న డబ్ల్యు.టి.ఒ. అమలులోకి వచ్చింది. 1996 జులై 28 నాటికి ఈ సంస్థలో 123 దేశాలు సభ్యత్వం పొందాయి. మరో 29 దేశాలు సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్నాయి.

## వర్ధమాన దేశాలపైనే చిన్న చూపు

వాస్తవానికి 1948లో హవానాలో జరిగిన అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (ఐ.టి.ఒ.) సమావేశంలో పాల్గొన్న దేశాలు కార్మిక ప్రమాణాల గురించి చర్చించాయి. ఎగుమతి చేయడానికి ఉద్దేశించిన వస్తువుల ఉత్పత్తిలో సరైన కార్మిక ప్రమాణాలు పాటించకపోతే అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కొన్ని చిక్కులు ఎదురుకావచ్చని, అటువంటి పరిస్థితులను తొలగించడానికి సభ్యత్వదేశాలు తగు చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి. కానీ, అంతర్జాతీయ వాణిజ్య సంస్థయే అస్తిత్వంలోకి రాలేదు. మొదటి ప్రపంచ యుద్ధం మిగిసిన తరువాత ప్రపంచంలోని కోట్లమంది కార్మికుల హక్కులను ప్రయోజనాలను పరిరక్షించేందుకు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ.) ఏర్పడింది. ఈ సంస్థ అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పలు అంశాలను కూలంకషంగా పరిశీలించి, సుదీర్ఘంగా చర్చలు జరిపి తీర్మానాలు చేసింది. కార్మికులకు సంఘటితపడే హక్కు ఉండాలని, సమష్టి ప్రయోజనాలను కాపాడుకొనేందుకు వారికి బేరసారాలు సాగించే అవకాశం ఉండాలని, నిర్బంధంగా పని చేయాల్సిన పరిస్థితి ఉండరాదని, ఉపాధి అవకాశాలలో ఒక వ్యక్తికి మరో వ్యక్తికి మధ్య ఏ విధమైన విచక్షణ ఉండరాదని, అవసరమైనపుడు కార్మికులు, యాజమాన్యం, ప్రభుత్వాల మధ్య త్రైపాక్షిక చర్చలు జరగాలనేటటువంటి ముఖ్యమైన నిర్ణయాలను ఐ.ఎల్.ఒ. చేసింది. ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందనే అంశంతో నిమిత్తం లేకుండా అన్ని దేశాలూ కార్మిక ప్రమాణాలు పాటించాలని ఐ.ఎల్.ఒ. పేర్కొంది. కార్మికుల ప్రాథమిక, ప్రజాస్వామిక, మానవ హక్కులంటూ గొంతు చించుకునే అమెరికా ఇంతవరకు ఈ ఐ.ఎల్.ఒ. తీర్మానాల్లో రెండింటిని మాత్రమే ఆమోదించింది. కార్మికులతో నిర్బంధంగా పని చేయించకూడదనే తీర్మానాన్ని త్రైపాక్షిక చర్చలకు అవకాశం ఉండాలనే తీర్మానాన్ని మాత్రమే అమెరికా ఆమోదించింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ ఆమోదించిన తీర్మానాల్లో అతితక్కువ తీర్మానాలకు ఆమోదం తెలిపిన దేశం ఒక్క అమెరికాయే. జైళ్లలో ఖైదీలు తయారు చేసిన వస్తువులను చైనా ఎగుమతి చేస్తోందని, అందువల్ల వాటిని అనుమతించరాదన్నది

అమెరికా వాదన. గురివింద గింజ తన నలుపు ఎరగదని సామెత స్వయంగా అమెరికా ఫెడరల్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని 'యూనికార్' సంస్థ దాదాపు వంద ఫ్యాక్టరీల్లో ఖైదీలతో పనిచేయిస్తోంది. ఆ ఖైదీలు కళ్ళజోళ్ల అద్దాలు, కొన్ని రకాల తువ్వాళ్లు, ఫర్నిచర్, గ్లౌవ్స్ వంటి 150 రకాల వస్తువులను తయారు చేస్తున్నారు. అంతేగాక సైన్యం ఉపయోగించే ట్యాంకులు, జెట్, యుద్ధ విమానాలు, పేట్రియాట్ క్షిపణులు వంటి వాటిల్లో వాడే కొన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా ఖైదీలు తయారు చేస్తుంటారు. జైళ్లలో పనిచేసే ఈ ఖైదీ కార్మికులకు 1995లో చెల్లించిన వేతనాలు మొత్తం 35 మిలియన్ డాలర్లు కాగా అమ్మకాల ద్వారా యూనికార్‌కు 500 మిలియన్ డాలర్లు అందాయి. ఈ ఖైదీ కార్మికులకు కనీస వేతన చట్టాలు కాని, కనీస కార్మిక ప్రమాణాల సూత్రాలు గాని వర్తించవని 'యూనికార్' అంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు సరైన కార్మిక ప్రమాణాలు పాటించడం లేదని, ఆయా దేశాల్లో తయారయిన వస్తువుల దిగుమతులపై ఆంక్షలు విధించాలని వాదించే అమెరికా, తదితర దేశాలు యూనికార్ సంస్థ కనీస కార్మిక ప్రమాణాలను పాటించని విషయాన్ని మాత్రం గుర్తించడం లేదు. తృతీయ ప్రపంచ దేశాల నుంచి వస్తువుల దిగుమతులపై ఆంక్షలు విధించడం ద్వారా తమ దేశాలలో నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించాలని, వర్ధమాన దేశాలకు తరలిపోతున్న పెట్టుబడుల కొంతమేరకు నిరోధించాలనే ఉద్దేశంతోనే అభివృద్ధి చెందిన దేశాలు సామాజిక అంశాల్ని కార్మిక ప్రమాణాల అంశాన్ని లేవనెత్తుతున్నాయి. వెనుకబడిన దేశాలలో స్థానిక పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, సామాజిక స్థాయి, ప్రజల జీవన ప్రమాణాలకూ అభివృద్ధి చెందిన దేశాల్లోని ఇవే పరిస్థితులకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. అక్కడా ఇక్కడా ఒకే విధమైన కార్మిక ప్రమాణాలను పాటించడం వెంటనే సాధ్యపడే విషయం కాదు. ఈ కారణంగానే భారతదేశం వంటి వర్ధమాన దేశాలు ఈ అంశంపై అమెరికాతో విభేదించాయి. అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ అంశాన్ని వదిలిపెట్టకుండా ఇంకా సాగదీస్తూనే ఉన్నాయి. అంతర్జాతీ కార్మిక సంస్థ దీనిపై సరైన నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగితే ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవడంలో వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాలు ఒత్తిడికి తలొగ్గక  తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. 'నాఫ్టా' ఒప్పందం సందర్భంగా మెక్సికో కార్మిక, వాతావరణ ప్రమాణాలకు సంబంధించిన ఒప్పందంపై సంతకం చేయాల్సి వచ్చింది. అలాగే దుస్తుల ఎగుమతి విషయంలో అమెరికా ఒత్తిడికి బంగ్లాదేశ్ తలొగ్గాల్సి వచ్చింది. గతంలో వెనుకబడిన దేశాల్లో కార్మికుల వేతనాలు, వారి ఉత్పాదకత తక్కువగా ఉండేవి. అభివృద్ధి చెందిన దేశాలలో కార్మికుల వేతనాలు ఎక్కువగా

ఉన్నా మెరుగైన సాంకేతిక సామర్థ్యం, అధిక ఉత్పాదకతల కారణంగా ఆ దేశాలు లాభపడుతుండేవి. అనేక దేశాలు ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తరువాత వర్ధమాన దేశాలకు నూతన సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి రావడమేగాక, పెట్టుబడులు అందుతున్నాయి. తక్కువ వేతనాలు ఉన్నందున ఇపుడీ దేశాలకు ఆర్థికంగా లాభం చేకూరే అవకాశాలు మెరుగుపడ్డాయి. వర్ధమాన దేశాల ఎగుమతులకు గండి కొట్టాలన్నది అభివృద్ధి చెందిన దేశాల వ్యూహం. భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్న కాలంలో వందేళ్ల కిందట ఇక్కడి వస్త్రాలు తక్కువ ధరలకే ఇంగ్లండ్, తదితర దేశాలకు ఎగుమతి అయ్యేవి. ఆయా దేశాల్లో భారత దేశ దుస్తులకు బాగా గిరాకీ ఉండేది. వీటితో పోటీ పడలేక లాంక్‌షైర్, మాంచెస్టర్‌లలోని బట్టల మిల్లు యజమానులు బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి భారత ఫ్యాక్టరీల చట్టం 1881ని ప్రవేశపెట్టించారు. ఫ్యాక్టరీల్లో 12 ఏళ్ల లోపు వయసుగల పిల్లలతో పని చేయించరాదని, కార్మికులతో 9 గంలకు మించి పని చేయించరాదనే అంశాలను ఆ చట్టంలో పొందుపరిచారు. బ్రిటన్‌లో తమ పరిశ్రమలను రక్షించుకోవాలన్నదే ఆ చట్టం ప్రధాన లక్ష్యం. అంతటి సరిపెట్టక మాంచెస్టర్ నుంచి భారత దేశానికి దిగుమతి అయ్యే వస్త్రాలపై డ్యూటీని రద్దుచేసిన ఇంగ్లాండ్, తమ అధీనంలోని ఇతర దేశాలకు భారత్ ఎగుమతి చేసే వస్త్రాలపై భారీగా డ్యూటీలు విధించింది. ఫలితంగా లక్షలమంది చేనేత కార్మికులు జీవనోపాధి కోల్పోయారు.

## మళ్లీ అదే ప్రయత్నం

అభివృద్ధి చెందిన దేశాలు తిరిగి ఇప్పుడు అదే ప్రయత్నం చేస్తున్నాయి. దీన్ని భారత్‌తో సహా వర్ధమాన దేశాలు సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే కార్మిక ప్రమాణాల అంశాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థతో చర్చించి ఆయా దేశాల పరిస్థితులకు అనుగుణంగా కార్మిక ప్రమాణాలను మెరుగు పరచుకోవాలి. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. కార్మికులకు పూర్తిస్థాయి శిక్షణనిచ్చి ఉత్పాదకత పెరిగేలా చేయాలి. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగు పరచేందుకు సకల చర్యలు తీసుకోవాలి. అంతేగాకుండా ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో వాణిజ్య ఒప్పందాలకు, కార్మిక ప్రమాణాలకు సంబంధం లేకుండా చూడాలి. కాలయాపన చేయకుండా ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

*ది. 18-06-1998.* — *ఈనాడు*

# అండ కాదు... గుదిబండ

## ఆసియాన్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం

ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్)తో ఇటీవల కుదుర్చుకొన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతకు ఏ మేరకు ప్రయోజనదాయకమన్నది ప్రస్తుతం పెద్ద చర్చనీయాంశంగా మారింది. లాభనష్టాలను బేరీజు వేసినప్పుడు పరిస్థితి మనకు నిరాశాజనకంగా ఉండటం గమనార్హం. ఇండోనేసియా, థాయ్‌లాండ్, మలేసియా, ఫిలిప్పీన్స్, కాంబోడియా, మయన్మార్, లావోస్, బ్రూనై, వియత్నాం, సింగపూర్ దేశాలు 'ఆసియాన్'లో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఆర్థికంగా ఇది బలమైన కూటమే. కానీ, మన అవసరాలు, అవకాశాలు భిన్నమైనవి. ఈ దృష్ట్యా ఆసియాన్‌తో స్వేచ్ఛా వాణిజ్యం వల్ల మనకు తరుగే తప్ప మిగులేం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తరచి చూసినప్పుడు అందులో చాలావరకు వాస్తవం ఉందని స్పష్టమవుతోంది.

## కొరగాని ఒప్పందం

ఆసియాన్ దేశాల మొత్తం జనాభా సుమారు అరవైకోట్లు. భారత జనాభా రమారమి 110 కోట్లు. మొత్తంగా ఆసియాన్ దేశాల స్థూల దేశీయోత్పత్తి భారత్‌కు దగ్గరగా లక్షాపదివేల కోట్ల డాలర్లుగా ఉంది. దాదాపు ఆరు సంవత్సరాలుగా వ్యవసాయ, వ్యవసాయేతర వస్తువుల వాణిజ్యానికి సంబంధించి ఆసియాన్, భారత్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ ఒప్పందం 2010 జనవరి ఒకటి నుంచి అమలులోకి రానుంది. చర్చలు కొనసాగుతూ ఉండగానే కేరళలోని వామపక్ష కూటమి ప్రభుత్వం – ఆసియాన్‌తో బంధం పట్ల అభ్యంతరం వ్యక్తపరచింది. తమ రాష్ట్రంలోని కాఫీ, టీ, మిరియాలు, ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుల ప్రయోజనాలకు ఒప్పందం భంగకరమని స్పష్టం చేసింది. కేరళ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ ఈ విషయమై ప్రధాని వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయిల్‌పామ్, వేరుశనగ, కొబ్బరి సాగుచేసే రైతులు

ఉన్నారు. ఇక్కడి లక్షలాది మత్స్యకారులకు సముద్రతీరమే జీవనాధారం. ఒప్పందం వల్ల మన రాష్ట్రానికి వాటిల్లే నష్ట తీవ్రతపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం జరపాలి. రైతాంగానికి ఎదురయ్యే ప్రమాదాన్ని కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లాలి.

ఈ ఒప్పందం వల్ల విదేశీ వాణిజ్యం పెరుగుతుందని, దేశంలో ఏ వర్గానికీ నష్టం కలగదని కేంద్రప్రభుత్వం నమ్మబలుకుతోంది. అది నిజంకాదు. భారత్‌తో వాణిజ్యం విషయంలో ఐరోపా సమాఖ్య, అమెరికా, చైనా తరువాత నాలుగోస్థానం ఆసియాన్‌దే. దేశం తరపున సేద్యరంగానికి సంబంధించిన మొత్తం 489 ఉత్పత్తులను కీలకమైనవిగా ఒప్పందంలో పొందుపరిచారు. దానివల్ల మనకు నష్టం ఉండదంటూ వాణిజ్య శాఖ చేస్తున్న వాదన పసలేనిది. మనదేశం ఈ జాబితాలో లేని వస్తువులపై సుంకాన్ని 2019 నాటికి సున్నా స్థాయికి తగ్గించవలసి ఉంటుంది. కాఫీ, టీ, మిరియాలు, ముడి పామాయిల్, శుద్ధ పామాయిల్‌ల మీదా సుంకాలనూ తగ్గించుకోవలసి ఉంటుంది. 2005 నాటి సుంకాల స్థాయికి ఈ తగ్గింపు ఉండాలి. ఇప్పుడున్న సుంకాల స్థాయిని కొద్దిమేర మాత్రమే తగ్గించడానికి అంగీరించామని వాణిజ్యమంత్రి ఆనందశర్మ చెబుతున్నారు. వాస్తవానికి ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో లేక ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) చర్చల్లో సాధారణ సుంకాల తగ్గింపునకు ప్రాతిపదికగా గరిష్ట సుంకం ఉంటుంది. ఆ విధంగా చూస్తే బౌండ్ టారిఫ్ పామాయిల్‌కు 300 శాతం, కాఫీకి 100 నుంచి 150 శాతం, మిరియాల గుండ్లపై 100 శాతం, మిరియాల పొడిపైన 150 శాతం, టీపై 150 శాతంగా ఉన్నాయి. డబ్ల్యు.టి.ఒ. చర్చల్లో ధనిక దేశాలు వర్ధమాన దేశాల సుంకాల స్థాయిని ఇప్పుడు విధిస్తున్న స్థాయినుంచి తగ్గించాలని ఒత్తిడి చేస్తున్నాయి. బౌండ్ టారిఫ్‌లనే పరిగణనలో తీసుకోవాలని వర్ధమాన దేశాలు పట్టుబడుతున్నాయి. కొద్దినెలల్లో దోహా రౌండు చర్చలు పునఃప్రారంభమయ్యే తరుణంలో భారత ప్రభుత్వం ఆసియాన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం సమంజసంకాదు. డబ్ల్యు.టి.ఒ. చర్చల్లో మన వాదాన్ని ఇది బలహీనపరుస్తుంది.

తాజా ఒప్పందంవల్ల ఈ పంటలు పండిస్తున్న మన రైతులు నష్టపోయే అవకాశాలు స్పష్టం. ఈ పంటల దిగుబడులు మనదేశంలోకన్నా ఆసియాన్ దేశాల్లో అధికం. ఉదాహరణకు కేరళలో హెక్టారుకు మిరియాల దిగుబడి 320 కిలోలు. వియత్నాంలో 1.2 టన్నులు; ఇండొనేసియాలో 2.3 టన్నులు. కాఫీ విషయానికొస్తే – మన దేశంలో

సగటు ఉత్పత్తి హెక్టారుకు 365 కిలోలు. వియత్నాంలో 1.2 టన్నులు. మనదేశంలోకన్నా ఆ దేశాల్లో ఉత్పత్తి వ్యయం తక్కువ. మనదేశం అంగీకరించిన సుంకాల కారణంగా ఆ దేశాల నుంచి పెద్ద స్థాయిలో ఉత్పత్తులు దిగుమతై, దేశీయంగా వీటిధరలు పడిపోతాయి. రైతులు తీవ్ర కష్టనష్టాల పాలవుతారు. గతంలో శ్రీలంకతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల టీ, మిరియాల పంటల ధరలపై దుష్ప్రభావం పడింది. కేరళలోని వైనాడ్ జిల్లాలో పెద్ద సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారు. తాజా ఒప్పందం పర్యవసానంగా ముఖ్యంగా కర్ణాటకలోని కాఫీ రైతులు, ఆయిల్‌పామ్ తోటలున్న ఆంధ్ర రైతులూ భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

లక్షలాది రైతులు, మత్స్యకారులు, వస్త్ర, వస్తూత్పత్తి రంగంలో పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలను ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ.) పణంగా పెడుతోందని, ఆసియాన్ దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు మనదేశంలోని బడా పారిశ్రామిక వేత్తలకు వీలు కలిగించడానికే ఈ ఒప్పందంపై సంతకం చేసిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ ఒప్పందంవల్ల మనదేశానికి కొత్తగా, పెద్దగా చేకూరే ప్రయోజనం లేదు. ఆసియాన్ దేశాల మొత్తం వాణిజ్యంలో భారత్ వాటా ఒక్క శాతం మాత్రమే. వస్తూత్పత్తి బదులు సేవల రంగంలో సరైన ఒప్పందం కుదిరితేనే మనదేశానికి లాభదాయకం. ఆసియాన్‌కు ఏటా 15,000 కోట్ల డాలర్ల విలువైన సేవలను భారత్ సమకూరుస్తోంది. ప్రపంచంలో పెద్ద యెత్తున సాంకేతిక నిపుణులు శాస్త్రజ్ఞులను కలిగి ఉండటంతోపాటు, ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం సమృద్ధిగా ఉన్న భారత్ సేవలరంగంలో మరింతగా దూసుకెళ్లే అవకాశాలు పుష్కలం.

ఈ ఒప్పందం ఫలితంగా గోధుమలు, నూనెగింజలు, ఉక్కు, రసాయన, సింథటిక్ వస్త్రాలు తదితరాలను అధిక పరిమాణంలో ఆసియాన్‌కు ఎగుమతి చేయవచ్చున్న కేంద్రప్రభుత్వ వాదన వాస్తవ విరుద్ధం. ఇప్పటివరకు థాయ్‌లాండ్ ఏటా తొమ్మిది లక్షల టన్నుల గోధుమలను అమెరికానుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇటీవల ఆస్ట్రేలియాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొని, అక్కడి నుంచీ కొంతమేరకు గోధుమలు తెచ్చుకుంటోంది. భారీ సబ్సిడీతో కూడిన ఆ దేశాల గోధుమలతో మనదేశ గోధుమలు ధరలో పోటీపడే పరిస్థితిలేదు. మలేసియా కూడా అమెరికా గోధుమలను దిగుమతి చేసుకుంటోంది. మలేసియా, ఇండోనేసియాలనుంచి భారీగా పామాయిల్

దిగుమతి కావటంవల్ల దేశీయంగా నూనెగింజల ధరలు తగ్గి రైతులు నిరుత్సాహంతో ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తారు. దరిమిలా మనదేశంలో నూనె గింజల ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. నూనెగింజలను ఆసియాన్‌కు అధికంగా ఎగుమతి చేయవచ్చునన్న కేంద్రప్రభుత్వ వాదన వట్టి డొల్లేనని దీన్నిబట్టి నిర్ద్వంద్వంగా స్పష్టమవుతోంది. నూనెగింజల పిట్టు, ఆముదంగింజల ఎగుమతిలో మనదేశానిది ఇప్పటికే ప్రముఖ స్థానం. వీటి విషయంలో కొత్తగా చేకూరే లాభం ఏమీ ఉండదు.

మనదేశానికి సంబంధించి 489 ఉత్పత్తులను కీలకమైనవిగా వర్గీకరించామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం, ఆసియాన్ పక్షాన ఎన్ని ఉత్పత్తులను కీలకమైన లేదా అత్యంత కీలకమైన జాబితాలో చేర్చారన్నది మాత్రం బహిర్గతం చేయడంలేదు. ఆసియాన్ గతంలో చైనాతో కుదుర్చుకొన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో 2,200 వస్తువులను ఆ జాబితాలో పెట్టారు. దీన్నిబట్టి, మన దేశం ఆసియాన్‌తో కుదుర్చుకొన్న ఒప్పందం ఎవరికి  ఎక్కువ ప్రయోజనం చేకూర్చుతుందో స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

ఆసియాన్‌తో ఒప్పందం కారణంగా మన రాష్ట్రానికి సంబంధించి నూనెగింజల పంటలకు నష్టం కలుగుతుంది. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యక్ష దుష్ప్రభావం పడుతుంది. సాగునీటి వసతి బాగా ఉండి, ఈ పంటకు అనువుగా ఉన్న ఏడు లక్షల హెక్టార్ల భూమిని దక్షిణ భారతదేశంలో గుర్తించారు. ఇప్పటికే దేశం మొత్తంమీద సుమారు రెండు లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటలను వేస్తే, అందులో లక్షా అయిదువేల హెక్టార్లకు పైగా మన రాష్ట్రంలోనే ఉంది. ప్రపంచంలో సోయాబీన్ తరువాత అత్యధికంగా ఉత్పత్తి అయ్యే పంట - పామాయిల్. ఇతర నూనెగింజల పంటల సగటు దిగుబడి హెక్టారుకు 350 నుంచి 500 కిలోలు ఉంటే, పామాయిల్ దిగుబడి 3200 కిలోలు. ప్రపంచ జనాభాకు అవసరమైన వంటనూనెల్లో 25 శాతం ఎనిమిది కోట్ల హెక్టార్లలో సాగవుతున్న ఇతర నూనెగింజల పంటలద్వారా లభిస్తోంది. కేవలం 70 లక్షల హెక్టార్లలోని ఆయిల్ పామ్ పంట 20 శాతం అవసరాన్ని తీరుస్తోంది. ఇండొనేసియా, మలేసియాల్లో లక్షలాది హెక్టార్లలో పామాయిల్ తోటలు ఉన్నాయి. అక్కడ సంవత్సరంలో దాదాపు 300 రోజులు వర్షం పడుతుంది. ఉత్పత్తి ఖర్చు చాలా తక్కువ. అందువల్ల ఆ దేశాలనుంచి పామాయిల్ తక్కువ ధరకు భారీగా ఎగుమతి అవుతోంది.

## దిద్దుబాటు చర్యలు అవసరం

మనదేశం ఒక సమయంలో నూనె గింజల ఉత్పత్తిలో దాదాపుగా స్వయం సమృద్ధి సాధించింది. కానీ, విదేశాలనుంచి చౌకగా వంటనూనె వచ్చి పడుతుండటంతో దేశీయంగా ధరలు పతనమై, రైతులు ఇతర పంటలవైపునకు మళ్లారు. బంగారు బాతులాంటి ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరుటి నుంచి పామాయిల్ దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తి వేయడంతో ఆయిల్ పామ్ గెలల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కష్టనష్టాలు ఖాయం. పామాయిల్ తోటల విస్తీర్ణం తగ్గేకొద్దీ చేతి చమురు మరింతగా వదలడం తథ్యం. ఈ దృష్ట్యా ప్రభుత్వం పామాయిల్ దిగుమతులపై 80 శాతం సుంకం విధించాలి. దీంతోపాటు, ఆసియాన్ ఒప్పందం వల్ల మనదేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా తగిన చర్యలన్నీ తక్షణం చేపట్టాలి.

*ది. 18-09-2009.* — *ఈనాడు*

●

# పొగపెడుతున్న దిగుమతులు

దిగుమతి సుంకమేమీ విధించకుండా యాభై అయిదు లక్షల టన్నుల పంచదారను, కొన్ని లక్షల టన్నుల పామాయిల్‌ను దిగుమతి చేసుకోవడానికి కేంద్రప్రభుత్వం అనుమతించింది. దిగుమతి సుంకాన్ని పూర్తిగా మినహాయిస్తూ, ఇతర దేశాలనుంచి బియ్యాన్ని కూడా దిగుమతి చేసుకోడానికి అనుమతించాలన్నది కేంద్రం తాజాగా తీసుకున్న విధాన నిర్ణయం. ఇటువంటి అనాలోచిత నిర్ణయాలవల్ల వినియోగదారులకు కొంతమేర లబ్ధి చేకూరవచ్చుకానీ, దీర్ఘకాలంలో దేశంలోని రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుంది.

## చెరకు రైతుల ప్రయోజనాలకు గండి

మనదేశంలో 2006–07లో సాగయిన చెరకు 3480 లక్షల టన్నులు, ఉత్పత్తి అయిన చక్కెర 248 లక్షల టన్నులు. పంటకు కేంద్ర సర్కారు ప్రకటించిన చట్టబద్ధ కనీస ధర గిట్టుబాటుగా లేకపోవడం, కూలీల కొరత తదితర కారణాలవల్ల – పలు రాష్ట్రాల్లో చెరకు విస్తీర్ణం తగ్గింది. 2007–08 నాటికి 2900 లక్షల టన్నుల చెరకు పంటలో గణనీయమైన భాగాన్ని బెల్లం ఉత్పత్తి కోసం మళ్లించడంతో– 228 లక్షల టన్నుల మేరకు మాత్రమే చక్కెర ఉత్పత్తయింది. డాక్టర్ స్వామినాథన్ అధ్యక్షతనగల రైతు కమిషన్ చేసిన సిఫారసులను దృష్టిలో పెట్టుకుని డాక్టర్ ఎస్. మహేంద్రదేవ్ నేతృత్వంలోని 'వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణాయక సంఘం' చేసిన సూచనలనూ కేంద్రం పట్టించుకోలేదు. టన్ను చెరకుకు కనీసం రూ. 1250 ధర ఇవ్వాలని, ఇదికాక టన్నుకు రూ. 300 చొప్పున బోనసును ప్రకటించాలని ఆ సంఘం చేసిన సిఫారసులను కేంద్రం పెడచెవిన పెట్టింది. 2008–09 సీజన్‌కుగాను టన్ను చెరకు ధరను అంతకు క్రితం ఏడాది మాదిరే రూ. 811.80గా ప్రకటించింది. పర్యవసానంగా చెరకు విస్తీర్ణం 52 లక్షల హెక్టార్ల నుంచి 42 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. బెల్లం ధర బాగా

ఉండటంతో ఉత్తరప్రదేశ్‌లో చెరకును బెల్లం ఉత్పత్తి వైపు మళ్లించారు. ఫలితంగా ఈ ఏడాది కేవలం 145 లక్షల టన్నులు మాత్రమే చక్కెర ఉత్పత్తయింది.

ఈ ఏడాది క్రషింగ్ కావలసిన చెరకుకు తొమ్మిది శాతం రికవరీ వద్ద క్వింటాల్‌కు రూ. 125 కనీస ధర ఉండాలని వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణాయక సంఘం సిఫారసు చేసింది. కేంద్రం 9.5 శాతం రికవరీ వద్ద క్వింటాల్‌కు రూ. 103.76గా నిర్ణయించింది. దీనివల్ల చెరకు రైతులు పెద్ద యెత్తున నష్టపోతారు. ముప్ఫైఏళ్లు కేంద్రం చెరకు మద్దతు ధరను 8.5 శాతం రికవరీ ప్రాతిపదికనే నిర్ణయించింది. అయితే, 2005-06 నుంచి 9.0 శాతం. ఇప్పుడు 9.5 శాతం రికవరీ ప్రాతిపదికను చెరకుకు కనీస మద్దతు ధరను నిర్ణయించింది. యు.పి.ఎ సర్కారులో వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న శరద్‌పవార్ నిర్వాకమే ఇది. దీనివల్ల ఫ్యాక్టరీలకు తాము సరఫరా చేసే చెరకుపై టన్నుకు రూ. 126 వంతున రైతు కోల్పోతున్నాడు. చక్కెర ఫ్యాక్టరీలకు మాత్రం వాటికి చేకూరే సాధారణ లాభాలతోపాటు, ప్రతి టన్ను చెరకుపై రూ. 126 చొప్పున అదనపు లాభం లభిస్తుంది. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం 'కాకుల్ని కొట్టి గద్దలకు వేసిన' చందంగా ఉంది.

మార్కెట్లో పంచదార ధరలు ఎగబాకుతూ ఉండటంతో ఎటువంటి దిగుమతి సుంకాన్ని విధించకుండా లక్షల టన్నుల చక్కెరను దిగుమతి చేసుకోవాలని కేంద్రం నిర్ణయించడం- చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుందన్న సామెతను తలపిస్తోంది. యాభై అయిదు లక్షల టన్నుల ముడి పంచదార దిగుమతులకోసం ఒప్పందాలు కుదరగా ఇప్పటికే మనదేశంలోకి 23 లక్షల టన్నులు దిగుమతి అయ్యాయి. శుద్ధి చేసిన పంచదారకు సంబంధించి అయిదు లక్షల టన్నుల మేరకు దిగుమతి చేసుకోవడానికి ఒప్పందాలు కుదిరాయి, రెండులక్షల టన్నులు దిగుమతి అయ్యాయి. ఈ సందర్భంగా 2007-08లో విదేశాలకు భారత్ 49 లక్షల టన్నుల పంచదారను ఎగుమతి చేసిందన్నది గమనించాల్సిన విషయం! మనదేశంలో సూర్యరశ్మి పుష్కలంగా ఉంటుంది. నీటి వనరులూ సమృద్ధిగా ఉన్నాయి. కష్టించే రైతులూ ఉన్నారు. అందువల్ల దేశీయ అవసరాలను తీర్చడంతోపాటు, ఇథనాల్ తయారీకే కాక విదేశాలకూ చక్కెరను ఎగుమతి చేయగల అవకాశాలు ఇండియాకు దండిగా ఉన్నాయి. అయితే- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా, వేలకోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యాన్ని వెచ్చించి

పంచదారను భారత్ దిగుమతి చేసుకోవలసి వస్తోంది.

చెరకుకు సరైన ధర లభించకపోవడంతో పాటు చెరకు నరకడానికి అవసరమైన కూలీలు దొరక్కపోవడం - ప్రస్తుతం ఆ పంట విస్తీర్ణం తగ్గడానికి ఓ కారణం. కేంద్రప్రభుత్వం బడ్జెట్ సమర్పించడానికి ముందు - కేంద్ర ఆర్థికమంత్రిని, వ్యవసాయశాఖ మంత్రిని చక్కెర ఫ్యాక్టరీల సంఘం ప్రతినిధులు కలిశారు. కూలీల కొరత సమస్యను అధిగమించడానికి చెరకు నరికే యంత్రాలు అవసరమని, ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకునే సందర్భంలో వాటిపై దిగుమతి సుంకాన్ని ఎత్తి వేయాలని వారు మంత్రుల్ని కోరారు. పంచదార దిగుమతులకు సుంకాన్ని పూర్తిగా మినహాయించిన కేంద్రం-చెరకు నరికే యంత్రాలపై దిగుమతి సుంకాన్ని ఎత్తివేయాలన్న సూచనను పెడచెవిన పెట్టింది. ఉప ఉత్పత్తులపై నుంచి చక్కెర కర్మాగారాల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై సుంకాన్ని మినహాయించాలని- చక్కెర ఫ్యాక్టరీల సంఘం చేసిన విజ్ఞప్తిపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదు. చక్కెర కర్మాగారాలకు వచ్చే లాభాల్లో కొంత భాగం చెరకు రైతులకు అందేలా చూడటానికి భార్గవ కమిషన్ రూపొందించిన సూత్రం నాలుగేళ్లుగా అమలుకు నోచుకోవడమేలేదు. చెరకు పంటపట్ల కేంద్ర ప్రభుత్వ నిరాసక్తికి, రైతు వ్యతిరేక ధోరణలకు ఇవన్నీ నిదర్శనాలే.

మనం వ్యవసాయరంగంలో బ్రహ్మాండమైన పురోగతిని సాధించినట్లు ఢిల్లీలోను, మన రాష్ట్రంలోను పాలకులు మొన్నమొన్నటిదాకా పదేపదే సెలవిచ్చారు. వరసగా దాదాపు అయిదేళ్ళపాటు వానలు సమృద్ధిగాపడి, పంటలు చక్కగా పండాయి. ఈ ఒక్క ఏడాదే కరవు పరిస్థితులు నెలకొన్నాయి. అంత మాత్రానికే- ఏ మాత్రం దిగుమతి సుంకం విధించకుండా బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సమర్థనీయం కాదు. ప్రస్తుత కరువు కారణంగా - దేశంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణంకన్నా 60 లక్షల హెక్టార్ల వరకు వరి పంట విస్తీర్ణం తగ్గింది. దాదాపు కోటి 20 లక్షల నుంచి కోటి 50 లక్షల టన్నుల మేరకు బియ్యం ఉత్పత్తి తగ్గవచ్చునని అంచనా. నిరుడు (2008) రికార్డు స్థాయిలో తొమ్మిది కోట్ల 91 లక్షల 50 వేల టన్నుల బియ్యం ఉత్పత్తి అయ్యింది. మూడుకోట్ల 16 లక్షల టన్నుల బియ్యాన్ని, రెండు కోట్ల 51 లక్షల టన్నుల గోధుమలను ప్రభుత్వం సేకరించింది. కేంద్ర ప్రభుత్వంవద్ద ఈ ఏడాది జులై ఒకటో తేదీనాటికి కోటీ 96 లక్షల టన్నుల బియ్యం,

మూడు కోట్ల 29 లక్షల టన్నుల గోధుమలు నిల్వ ఉన్నాయి. అంటే - ప్రజా పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్.) కు మొత్తం 5.25 కోట్ల టన్నుల మేరకు ఆహారధాన్యాలు అందుబాటులో ఉన్నాయి. డిసెంబరు నుంచి ధాన్యం కొత్త పంటను సేకరించవచ్చు. ఏప్రిల్ నాటికి గోధుమ పంట చేతికొస్తుంది. అందువల్ల బియ్యాన్ని కానీ, గోధమలను కానీ ఇండియా ఇప్పుడు దిగుమతి చేసుకోవలసిన అవసరంలేదు. ఈ నేపథ్యంలో. దిగుమతి సుంకాలు వేయకుండా, బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించటం తొందరపాటు చర్యే.

ఈ ఖరీఫ్‌లో కేంద్రం ధాన్యం ధరను 'ఎ' గ్రేడ్‌కు క్వింటాల్‌కు రూ. 989, సాధారణ రకానికి రూ. 950గా నిర్ణయించింది. ఇవి ఎంత మాత్రం గిట్టుబాటు కాని ధరలు. ధాన్యానికి కనీస ధరను క్వింటాల్‌కు వెయ్యి రూపాయలు ఉండాలని నిరుడే వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణాయక సంఘం సిఫారసు చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ప్రస్తుత కరవు పరిస్థితుల కారణంగా - ఖరీఫ్‌లో పంటలకు వాటిల్లిన నష్టాన్ని పూడ్చటానికి ప్రభుత్వం తగు చర్యలను తీసుకోవాలి. వాటిలో భాగంగా వరికి క్వింటాల్‌కు రూ. 1,200 ధరను ప్రకటించి, బోనసును ప్రకటిస్తే - రైతులు సమధికోత్సాహంతో పనిచేస్తారు. ఈ ఖరీఫ్‌లో ఆలస్యంగానైనా వేసిన పంటనుంచి, రానున్న రబీలో సాగుచేసే పంటనుంచి; అత్యధిక స్థాయిలో దిగుబడులను సాధించగలుగుతారు. తద్వారా- ఇతర దేశాలనుంచి ఇండియా బియ్యాన్ని దిగుమతి చేసుకోవలసిన దుస్థితి నుంచి తప్పించగలుగుతారు.

## యాంత్రీకరణ తక్షణావసరం

వ్యవసాయరంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య- శ్రామిక శక్తి (లేబర్) అందుబాటులో లేకపోవడమే. ఈ సమస్యను అధిగమించాలంటే, ప్రభుత్వం యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం తక్షణావసరం. వరినాట్లకు, చెరకు నరకడానికి, పత్తిని తీయడానికి వినియోగపడే యంత్రాలపై నాలుగైదేళ్ళపాటు దిగుమతి సుంకాన్ని పూర్తిగా మినహాయించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వాతావరణంలో క్రమేణా వస్తున్న మార్పులు, గ్లోబల్ వార్మింగ్ ఎల్‌నినో వంటి పరిణామాల కారణంగా దేశంలో పలు పంటల దిగుబడులు గణనీయంగా తగ్గిపోవచ్చునని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో- రైతుల సంక్షేమం పట్ల పాలకులు తమ చిత్తశుద్ధిని మాటల్లోకాక

చేతల్లో నిరూపించుకోవాలి. వ్యవసాయరంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. రానున్న కాలంలో పంటలపై విస్తృతంగా పరిశోధనలు జరిపి, అనువైన వంగడాలు, సేంద్రీయ పద్ధతుల రూపకల్పనకు వీలుగా స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేయవలసి ఉంది. కౌలు రైతులతో సహా చిన్న, సన్నకారు రైతులందరికీ రుణసౌకర్యం కల్పించాలి. తమ ఉత్పత్తుల్ని అధీకృత గోదాముల్లో నిల్వచేసి, బ్యాంకుల నుంచి రైతులు రుణం పొందడానికి సంబంధించిన చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి. ఇటువంటి నిర్దుష్ట చర్యలు తీసుకుని, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషిచేస్తేనే, వ్యవసాయరంగం ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నుంచి గట్టెక్కగలుగుతుంది.

*దీ. 01-10-2009.* — *ఈనాడు*

●

# ఎగుమతులు పెరిగినప్పడే 'సమృద్ధి' సార్థకం

ఈ సంవత్సరం మనదేశంలో ఆహారధాన్యాల రంగం ఆశాజనకంగా కన్పిస్తున్నది. జాతీయ స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఈ సంవత్సరం 17 కోట్ల 80 లక్షల టన్నుల నుంచి 18 కోట్ల 50 లక్షల టన్నుల స్థాయికి పెరగవచ్చని అంచనా. పలు కారాణాలవల్ల ఇది సాధ్యమవుతున్నది. రుతుపవనాలు అనుకూలించి సకాలంలో, సంతృప్తికరంగా వర్షాలు కురిశాయి. ఆహారధాన్యాల దిగుబడిని పెంచడానికి ప్రత్యేక పథకాలు అమలు జరిగాయి. కిందటి రబీ పంటలకు, ఇప్పటి ఖరీఫ్ పంటలకు నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం గతంలోకన్నా హెచ్చు ధరలను నిర్ణయించడంతో రైతులకు, వ్యవసాయదారులకు ప్రోత్సాహం లభించింది. అదృష్టవశాన, ఆహార ధాన్యాల ఉత్పత్తికి అన్నీ కలసివచ్చిన సంవత్సరం ఇది. 1987 దుర్భిక్షం అనంతరం వరుసగా మూడేళ్ల నుంచి పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. తత్ఫలితంగా, ప్రభుత్వం వద్ద ఆహారధాన్యాల నిలువలు పెరుగుతున్నాయి. బియ్యం, గోధుమలు 1989 జూన్ మాసంలో కోటీ ముప్పై లక్షలు నిలువ ఉండగా 1990 జూన్‌లో 2 కోట్ల 3 లక్షల టన్నులు నిలువ ఉన్నాయి. సంవత్సరకాలంలో బియ్యం, గోధమల నిలువలు గణనీయంగా పెరిగాయన్నమాట. ప్రభుత్వం ధాన్యం సేకరణ ధరలు పెంచడంవల్లనయితేనేమి, ద్రవ్యోల్బణం, గల్ఫ్ చమురు సంక్షోభం తదితర పరిణామాల వల్లనయితేనేమి మనదేశంలో ఇటీవలికాలంలో ఆహారాధాన్యాల ధరలు కొంత పెరిగాయనడంలో సందేహం లేదు. ఎటువంటి కొరత లేకుండా మార్కెట్లో ఆహారధాన్యాలు పుష్కలంగా లభిస్తున్నాయి గనుక, బియ్యం, గోధుమలు, తృణ ధాన్యాల ఎగుమతులను బాగా పెంచడానికి పరిస్థితి అనుకూలంగా ఉందని ప్రభుత్వం భావించింది. ఈ సంవత్సరం పది లక్షల టన్నుల బియ్యాన్ని, పది లక్షల టన్నుల గోధుమలను విదేశాలకు ఎగుమతిచేసి విదేశీ మారక ద్రవ్యం నిలువలను పెంచాలని

సంకల్పించారు. మన బియ్యం ఎగుమతులలో బాసుమతి రకం ప్రథమస్థానం ఆక్రమిస్తున్నది. భారతదేశంలో సామాన్య ప్రజలు, పేదలు సాధారణంగా బాసుమతి బియ్యాన్ని వినియోగించరు. కాబట్టి బాసుమతి బియ్యాన్ని ఎంత ఎక్కువగా ఎగుమతిచేసినా పేద ప్రజలకు ఇబ్బందిలేదు. సంపన్నులు, హెచ్చు ఆదాయాలవారు మాత్రమే బాసుమతి బియ్యాన్ని వాడుతుంటారు. సోవియట్ యూనియన్ ఏటా సుమారు 1.5 లక్షల టన్నుల బాసుమతి బియ్యాన్ని మనదేశం నుంచి ఎగుమతి చేసుకుంటున్నది. అంతేకాదు. కువైట్, ఓమన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి గల్ఫ్ దేశాలకు, బ్రిటన్, అమెరికా దేశాలకు దాదాపు 1.2 లక్షల టన్నుల బాసుమతి బియ్యాన్ని భారతదేశం ఎగుమతి చేస్తున్నది.

## ప్రమాణాలలో రాజీ హానికరం

బాసుమతి బియ్యం ఎగుమతిలో భారతదేశపు అగ్రగణ్య స్థానానికి భంగం కలుగకుండా ఉండాలంటే ప్రమాణాలు, నాణ్యత విషయంలో మరింత శ్రద్ధ వహించాలి. ఎగుమతి చేసే బియ్యం నాణ్యతలో ఎంతమాత్రం లోపం ఉండరాదు. ఇప్పటివరకు బాసుమతి బియ్యంలో పరేమాల్ బియ్యాన్ని కలిపి ఎగుమతి చేయడం వల్ల భారతదేశ ప్రతిష్ట దెబ్బతింటున్నది. వరిపంట కింద భారతదేశంలో ఉన్నంత భూమి ప్రపంచంలో ఇంకే దేశంలోను లేదు. అయినా, బియ్యం ఎగుమతులలో భారతదేశం వెనుకబడి ఉంది. పొరుగున ఉన్న పాకిస్తాన్‌కంటే దాదాపు ఇరవయిరెట్లు ఎక్కువ బియ్యాన్ని భారతదేశం పండిస్తున్నది. కాని, గత నాలుగు సంవత్సరాలకాలంలో భారతదేశం 2.25 లక్షల టన్నుల బాసుమతి బియ్యాన్ని ఎగుమతి చేయగా పాకిస్తాన్ 3.28 లక్షల టన్నుల బాసుమతిని ఎగుమతి చేసింది. మన బహిరంగ మార్కెట్లో బాసుమతి ధర టన్నుకు రూ. 15 వేలు. ఇదే బియ్యాన్ని ఇంతకన్న తక్కువ ధరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని వివరాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో రహస్యం ఏమిటని సహజంగానే అనుమానం కలుగుతుంది. పరిశీలిస్తే అసలు సంగతి బయటపడుతుంది. బాసుమతి బియ్యంలో తక్కువ రకం బియ్యాన్ని కలిపేసి ఎగుమతి చేస్తున్నామని స్పష్టమవుతుంది. బియ్యం తదితర సరుకుల నాణ్యతను కచ్చితంగా పరిశీలించి, నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పుడే ఎగుమతికి అనుమతిస్తే మన ఎగుమతులను ఇంకా ఎన్నో రెట్లు పెంచగలుగుతాం. ప్రపంచ మార్కెట్లో బాసుమతి బియ్యం ధర క్వింటాలుకు

రూ. 4 వేలు. ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే బాసుమతిని పండించే రైతుకు ముట్టేది క్వింటాలు ధాన్యానికి (1989-90 ధరల్లో) రూ. 205. అంటే, క్వింటాలు బియ్యం ధర రూ. 325 మాత్రమే. బియ్యంపై; ఇతర ధాన్యాలపై ఉన్న రవాణా ఆంక్షలు, నిబంధనల ఫలితంగా నగరాల బహిరంగ మార్కెట్లో బాసుమతి బియ్యం క్వింటాలుకు రూ. 1,000 నుండి 18 వందల వరకు పలుకుతోంది. ఇదే బియ్యం ధర ప్రపంచ మార్కెట్లో క్వింటాలుకు రూ. 4 వేలు. ఈ సంవత్సరం ధాన్యం సేకరణ ధరను క్వింటాలుకు ముప్పై రూపాయలు పెంచారు. సామాన్యులు ముట్టని బాసుమతి బియ్యాన్ని నిత్యావసర వస్తువుల జాబితానుంచి తొలగించి రైతుకు హెచ్చు ధర లభించేలా చేయగలిగితే ఉత్పత్తి గణనీయంగా పెరగడానికి, ఎగుమతి హెచ్చడానికి అవకాశం ఉంటుంది. నాణ్యత, ప్రమాణాల విషయంలో రాజీలేని దృఢవైఖరిని అనుసరించి సక్రమపద్ధతిలో ఎగుమతులను ప్రోత్సహించాలి. స్వదేశ, విదేశ మార్కెట్లలో బాసుమతి బియ్యానికి లభించే ధరలో గణనీయభాగాన్ని ఆ పంట పండించే రైతులకు లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇది జరిగితే దేశం ప్రతి సంవత్సరం బాసుమతి బియ్యం ఎగుమతుల ద్వారానే సుమారు రూ. 12 వందల కోట్ల విలువయిన విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించగలుగుతుంది. ఎగుమతి కనీస ధర వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉంది. ఈ ధరను వాస్తవిక దృష్టితో క్వింటాలు ఒక్కంటికి రూ. 950 నుంచి కనీసం రూ. 12 వందల వరకు పెంచడం ఎంతయినా అవసరం. బాసుమతి కాకుండా ఇతర ఉత్తమ రకాల (సూపర్‌ఫైన్) బియ్యాన్ని కూడా కొంతమేరకు ఎగుమతి చేయవచ్చు. కాని, ఈ విషయంలో మనకు ఇతర దేశాల నుంచి తీవ్రమయిన పోటీ ఎదురవుతుంది. ప్రపంచ బియ్యం ఎగుమతులలో 40 శాతం భాగం థాయ్‌లాండ్ నుంచి, 20 శాతం భాగం అమెరికా నుంచి జరుతున్నాయి. బాసుమతి గాక, ఇతర రకాల చెందిన ఒక లక్ష టన్నుల బియ్యాన్ని 1989 జూన్‌లో ఎగుమతి చేయడానికి అనుమతి లభించింది. ఇందులో 40 శాతం భాగాన్ని మాత్రమే ఎగుమతి చేయగలిగాం. పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు ఇస్తున్నట్లుగా ఇతర రకాల సూపర్‌ఫైన్ బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇవ్వాలి. బాసుమతిగాక ఇతర రకాల బియ్యం కూడా భారీ ఎత్తున ఎగుమతి కావడానికి ఈ సబ్సిడీ దోహదపడుతుంది.

## గోధుమలూ ముతక ధాన్యాలు

అంతర్జాతీయ విపణిలో గోధుమల ధరలు తక్కువస్థాయిలో ఉన్నాయి. వాటికన్న మనదేశంలో సేకరణ ధరలే హెచ్చుగా ఉన్నాయి. అందుచేత, మనం గోధుమలను ఎగుమతి చేయాలంటే ప్రభుత్వం భారీ సబ్సిడీలు ఇవ్వక తప్పదు. భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ) ద్వారా సేకరించి నిలువ చేయడానికి టన్నుకు రూ. 8 వందల నిల్వ ఖర్చును భరించవలసి వస్తున్నది. ఈ ఖర్చును నివారించడానికి సబ్సిడీతో గోధుమలను ఇతర దేశాలకు ఎగుమతి చేయాలి; గోధుమలకు బదులు ఆ ఆదేశాల నుంచి మనకు అవసరమయిన వస్తువులను దిగుమతి చేసుకోవాలి. ఉదాహరణకు, జోర్డాన్‌కు గోధుమలకు పంపి, అక్కడి నుంచి మనకు అవసరమయిన రాక్ ఫాస్ఫేటునుగాని, ఫాస్ఫాటిక్ ఎరువులను గాని దిగుమతి చేసుకోవచ్చు. ఇక, జొన్న, సజ్జ, మొక్క జొన్న వంటి తృణధాన్యాల ఉత్పత్తిని ఇన్నాళ్లుగా అలక్ష్యం చేశాం. వీటి ఎగుమతిపట్ల భారతదేశం ఇప్పటి వరకు తగిన శ్రద్ధ చూపక పోవడం శోచనీయం. తృణ ధాన్యాలను పేద ప్రజల ఆహారంగా పరిగణిస్తున్నారు. ఇవి ముఖ్యంగా మెట్టభూములలో, వర్షాలపై ఆధారపడుతూ పండుతున్నాయి. ఈ తృణ ధాన్యాల సగటు ఎకరాదిగుబడి స్వల్పంగా ఉంది. మొదట వీటి ధరా మిగిలిన తృణధాన్యాల ధరా దాదాపు ఒకేరకంగా ఉండేది. తరువాత, 1982-83 నుంచి ఈ తృణ ధాన్యాల సేకరణ ధరను మిగిలిన ధాన్యం ధరకన్న తక్కువ స్థాయిలో నిర్ణయిస్తున్నారు. దానితోడు ఈ ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరగడం లేదు. ఈ ధాన్యాలు 1970-71లో 3 కోట్ల టన్నులు ఉత్పత్తికాగా 1988-89లో 3 కోట్ల 10 లక్షల చిల్లర టన్నులు మాత్రమే ఉత్పత్తి అయినాయి. గత పది సంవత్సరాలలో వీటి సగటు ఎకరాదిగుబడి పెద్దగా పెరగలేదు. సంపన్న దేశాలలో ఇలాంటి ధాన్యాల్ని పశువుల మేతగా ఉపయోగిస్తున్నారు. ఆ విధంగా మాంసం ఉత్పత్తిని బాగా పెంచి పౌష్టికాహార అవసరాలు తీర్చుకుంటున్నారు.

## ఎగుమతులదిశగా రైతుకు ప్రోత్సాహం

ప్రపంచంలో తృణధాన్యాల ఎగుమతుల్లో 60 శాతం భాగం అమెరికాది. తృణ ధాన్యాల ఎగుమతులకున్న అవకాశాలను చైనా గుర్తించింది. వీటి ఎగుమతిలో ఈ రోజు చైనా ప్రముఖ స్థానం ఆక్రమిస్తున్నది. 1988-89లో చైనా 52 లక్షల టన్నుల తృణ ధాన్యాలను ఎగుమతి చేసి రూ. 1000 కోట్లు సంపాదించింది. భారత

ప్రభుత్వం, తృణధాన్యాలకు మద్దతు ధర ప్రకటిస్తున్నది గాని, ధరలు అంతకన్న తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు సేకరణ కూడా చేయడం లేదు. ఇప్పటికయినా ప్రభుత్వం మెట్ట ప్రాంతాలలో అధికదిగుబడి వంగడాలను ప్రోత్సహించాలి. సకాలంలో పరపతి సౌకర్యం కల్పించడం, ఎరువులను సరఫరా చేయడం చాలా ముఖ్యం. ప్రభుత్వం ప్రోత్సాహకరమయిన ధరలను ప్రకటించి మెట్ట పంటల అధికోత్పత్తికి ఇకనయినా నడుంకట్టాలి. ఈనాడు భారతదేశ విదేశ మారకద్రవ్యం నిలువలు ఆందోళనకర స్థాయికి తగ్గిపోయాయి. వ్యావసాయిక ఉత్పత్తులు ఎగుమతి విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానం లోపభూయిష్టంగా ఉంది. అవసరాలు తీరిన తరువాత మిగిలిన పంటనే ఎగుమతి చేద్దాం అన్న విధానం సరైనది కాదు. ప్రతి సంవత్సరం బియ్యం, గోధుమలు, ముతక ధాన్యాలు, పత్తి, నూనె గింజల పిప్పి, పండ్లు మొదలయినవి నిర్దిష్ట పరిమాణానికి తగ్గకుండా ఎగుమతి జరిగే విధానాన్ని అనుసరించాలి. అప్పుడే మన వ్యావసాయిక ఉత్పత్తుల ఎగుమతి గణనీయంగా హెచ్చి విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించగలుగుతాం. నాణ్యతను, ప్రమాణాలను పాటించి భారతదేశం తన ఉత్పత్తులను దిగుమతి చేసుకునే దేశాల్లో గౌరవ ప్రతిష్ఠలను సంపాదించాలి.

*- ఈనాడు*

Blank Page

3 వ అధ్యాయం



# పంటలు
# వరి, చెఱకు, పత్తి

Blank Page

# చెరకు రైతును గానుగాడుతున్న ప్రభుత్వాలు

## ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర లభించేనా?

ఆరుగాలం శ్రమించి అష్టకష్టాలకోర్చి చెరకు పండించే రైతులకు అనేక సందర్భాల్లో చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. మొన్నటికి మొన్న – ఉత్తరప్రదేశ్‌లోని థియోరియా జిల్లా రామ్‌కోలా దుర్ఘటన – దేశంలోని చెరకు రైతుల దురవస్థకు దర్పణం. గత సీజన్‌లో సరఫరా చేసిన చెరకుకు చెల్లించాల్సిన బకాయిల కోసం ఆందోళన చేస్తున్న రామ్‌కోలా రైతాంగాంపై పోలీసులు జరిపిన కాల్పుల్లో – అయిదుగురు రైతులు మరణించారు; అనేక మంది తీవ్రంగా గాయాలకు గురై ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు. ఫ్యాక్టరీకి చెరకు తోలడం పూర్తికాగానే రైతు తాను అంత క్రితం తీసుకున్న అప్పులను చెల్లించాల్సి ఉంటుంది. చెరకు నరికిన కూలీలకు లెక్క ప్రకారం చెల్లించడంతోపాటు పొలంలోని పిలక పైరుకు కావాల్సిన ఎరువులు కొని వాడాలి. పంటను ఫ్యాక్టరీలకు తొలి నెలలు గడుస్తున్నా, రావాల్సిన మొత్తం చేతికందకపోతే రైతు పరిస్థితి 'కుడితిలో పడ్డ ఎలుక' చందమవుతుంది. ఫ్యాక్టరీ యాజమాన్యాలు గత సీజను తాలూకూ బకాయిలు సుమారు 582 కోట్ల రూపాయల మేరకు రైతులకు ఇంకా చెల్లించలేదని కేంద్ర ఆహారశాఖ మంత్రి తరుణ్‌గగోయ్ ఇటీవల పేర్కొన్నారు. ఈ మొత్తంలో దాదాపు 280 కోట్లు ఉత్తరప్రదేశ్‌కు సంబంధించిన బకాయిలే. మిగిలినదాంట్లో సింహభాగం బీహార్ రైతులకు దక్కాల్సినదే. ఇలా అప్పుడప్పుడూ చక్కెర ఫ్యాక్టరీలు భారీ మొత్తాల్లో రైతులకు బకాయిలు పడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అధిగమించి రైతులను ఆదుకొనేందుకు పంచదార క్వింటాలుకు 14 రూపాయల చొప్పున వసూలు చేస్తూ 'షుగర్ డెవలప్‌మెంట్ ఫండ్'ను ఏర్పాటు చేశారు. రైతు ప్రయోజనాల దృష్ట్యా పంచదారను అధిక మొత్తంలో కొనుగోలు చేసేందుకు, చెరకు పంటకు ప్రోత్సాహకాలందించేందుకు, ఫ్యాక్టరీల ఆధునీకరణ, సామర్థ్యం పెంపొందించడానికీ–ఈ ఫండ్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుతం నిధి కింద 600 కోట్లు

ఉన్నాయి. 1982-83ల్లో లాగానే-10 లక్షల టన్నుల చక్కెరను రెండు దఫాలుగా ప్రభుత్వం కొని నిల్వచేస్తే ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడటానికి, రైతుల బకాయిలు చెల్లించడానికి మార్గం సుగమమవుతుంది. ఆహార మంత్రిత్వశాఖ చేసిన ఈ ప్రతిపాదన ప్రస్తుతం ఆర్థిక మంత్రిత్వశాఖ పరిశీలనలో ఉంది.

## ధరల నిర్ణయంలో నిర్దయ

1975-76 నాటికి దేశవ్యాప్తంగా 253 చక్కెర ఫ్యాక్టరీలు ఉండగా గత సంవత్సరం చివరినాటికి 503 ఫ్యాక్టరీలు లైసెన్సులు పొందాయి. అదే కాలంలో చెరకు ఉత్పత్తి 14 కోట్ల టన్నుల నుంచి 25 కోట్ల 60 లక్షల టన్నులకు పెరిగింది. కానీ ఇందులో సగమే పంచదార ఫ్యాక్టరీల పంచకు చేరుతుండగా, మిగిలింది ఖండసారీలకు, బెల్లం తయారీకి మళ్లుతోంది. దేశంలో పంచదార, చెరకు ఉత్పత్తి ఒక క్రమంలో పెరగకపోగా, ఆటుపోట్లకు గురవుతున్నాయి. గత సీజన్‌లో మున్నెన్నడూ లేనంతగా 134 లక్షల టన్నుల పంచదార ఉత్పత్తి అయింది. దేశావసరాలకు పోను ఇంకా 19 లక్షల టన్నులు మిగులు దేలుతున్నది. పోయినేడు (1991) 5.2 లక్షల టన్నుల చక్కెరను విదేశాలకు ఎగమతిచేసి 220 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని అర్జించగలిగాము. ఈ ఏడు కూడా అయిదు లక్షల టన్నుల ఎగుమతికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ ఏడు కనీసం పది లక్షల టన్నులు ఎగుమతి చేయవచ్చని పారిశ్రామిక వర్గాలు భావిస్తుండగా, అనుమతించిన దానికంటే ఎక్కువ ఎగుమతి చేయడానికి 'గ్రీన్ సిగ్నల్' ఇవ్వాలంటూ పంచదార పరిశ్రమ మొరపెట్టుకుంటోంది. ఈ అభ్యర్థనలను ప్రభుత్వం ఏ మేరకు ఆలకిస్తుందో చూడాలి. చెరకు రైతుల పట్లకూడా ప్రభుత్వం ఉపేక్ష ధోరణి కనబరుస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం- ఫ్యాక్టరీల్లో పంచదార ఉత్పత్తి వ్యయం, చెరకుపంట ఉత్పత్తి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ ధరల సంఘం చెరకుకు చట్టబద్ధమైన కనీస ధర సూచిస్తుంది. వ్యవసాయ ధరల కమిషన్ వివిధ పంటలకు మద్దతు ధరలను సిఫార్సు చేసేటప్పుడు ఆ పంట ఉత్పత్తి వ్యయం, వ్యవసాయానికి అవసరమైన వస్తు - సేవల ధరలు, రైతు కొనే లేదా అమ్మే వస్తువుల ధరల నిష్పత్తి మార్కెటు పోకడలు, పంట డిమాండు-సప్లై, పారిశ్రామిక వస్తూత్పత్తిపై పంట ప్రభావం, అంతర్జాతీయ విపణి పరిస్థితులు, ప్రజల జీవన వ్యయ సూచికపై దీని ప్రభావం

తదితర అంశాలన్నింటినీ పరిశీలిస్తుందని అంటారు. ఈ తతంగమంతా కాగితాలకే పరిమితమైపోగా, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే చట్టబద్ధ కనీస ధర ఎంత మాత్రం రైతుకు గిట్టుబాటు కావడంలేదు. ఫ్యాక్టరీలనుంచి కేంద్రం సేకరించే లెవీ పంచదార ధర ముఖ్యంగా ఈ చట్టబద్ధ కనీస ధరపైనే ఆధారపడి ఉంటుంది. లెవీ పంచదార ధర పెరుగుతుందనే భావనతో రైతుకు న్యాయమైన ధరలను చెల్లించక కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోంది. కనుకనే దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ సలహా ధర ప్రకటిస్తున్నాయి. 1991-92లో ఉత్తరప్రదేశ్ టన్నుకు 450 నుంచి 480 రూపాయలు చెల్లించింది. ఎనిమిదిన్నర శాతం రికవరీ దగ్గర క్వింటాలుకు 26 రూపాయలు చెల్లించాలంటూ కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ ధర ప్రకటించింది. పంజాబ్, హర్యానా రైతులకు టన్నుకు 450 నుంచి 490 వరకు ముట్టింది. మహారాష్ట్రలో కోత, రవాణా ఛార్జీలతో సంబంధం లేకుండా చేను దగ్గరే టన్నుకు 290 నుంచి 450 రూపాయల వరకు రైతులకు గిట్టుబాటయింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో చెరకు రైతులకు సరైన ధర లభించడంలేదు. అంతక్రితం సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన చట్టబద్ధ కనీస ధరపై 55 రూపాయలు అదనంగా రాష్ట్రం సలహా ధర ప్రకటించగా 91-92లో కేంద్ర ధరపై అదనంగా 35 రూపాయలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అంతక్రితం సంవత్సరం బాగారెడ్డి కమిటీ సిఫార్సులను ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం టన్నుకు 15 రూపాయల ప్రోత్సాహకాన్నీ ఇచ్చింది. ఈ ఏడు ఈ ప్రోత్సాహకానికి కొన్ని ఫ్యాక్టరీలవారు ఎగనామం పెట్టారు. ఈ కారణంగా 1992-93 సీజన్‌లో 60 లక్షల టన్నుల చెరకు మాత్రం సరఫరా కావచ్చని అంచనా వేస్తున్నారు. ఇది పోయినేటికంటే 28 లక్షల టన్నులు తక్కువ. అంటే దాదాపు 30 శాతం ఉత్పత్తి పడిపోతోందన్నమాట.

కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న ధర చెరకు రైతుకు గిట్టుబాటు కాక పంట విస్తీర్ణం ఏ ఏటికాయేడు తగ్గుతూ ఉంటే - రాష్ట్ర ప్రభుత్వాలు సలహాధర ప్రకటించరాదని కేంద్రం ఆదేశిస్తోంది. కేంద్ర ప్రభుత్వమే రైతు కష్ట సుఖాలను గుర్తెరిగి సరసమైన ధర ప్రకటిస్తే సలహా ధర ప్రకటించాల్సిన అవసరమేముంటుంది? 1992-93 సీజన్‌లో ఎనిమిదిన్నర శాతం రికవరీ దగ్గర క్వింటాలుకు రూ. 23 ఇవ్వాలని లోగడ వ్యవసాయ ధరల కమిషన్ కేంద్రానికి సూచించింది. ఇటీవలి ఎరువుల ధరల్లో పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని క్వింటాలుకు రూ. 29 చెల్లించాలంటూ తాజాగా సిఫార్సు చేసినట్లు

భోగట్టా. క్వింటాలుకు రూ.32 చట్టబద్ధ కనీస ధర నిర్ణయించాలని భారత పంచదార మిల్లుల సమాఖ్య కోరుతోంది. ఎరువులు, డీజిల్ ధరల్లో పెరుగుదల, వ్యవసాయ కూలీ రేట్లు, ఇతర పంటల ధరలు, భవిష్యత్తులో ప్రపంచ మార్కెట్లో పంచదార కొరత ఉండవచ్చన్న అంచనాలు – వీటన్నింటినీ సమగ్రంగా పరిశీలించి ఎనిమిదిన్నర శాతం రికవరీ దగ్గర క్వింటాలుకు రూ.39 చట్టబద్ధ ధర నిర్ణయించాలని జాతీయ సహకార చక్కెర ఫ్యాక్టరీల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ సూచన సహేతుకంగా ఉంది. చక్కెర ఫ్యాక్టరీలు స్వేచ్ఛా విపణిలో అమ్మే పంచదారపై వచ్చే అదనపు ధరలో రైతుకు కూడా భాగమివ్వాలన్న ఉద్దేశంతో భార్గవా ఫార్ములా రూపొందింది. ఇదివరలో ఫ్యాక్టరీలో తయారయ్యే చక్కెరలో 65 శాతం ప్రభుత్వానికి లెవీ చక్కెర ఇచ్చి, మిగిలిన చెక్కరను స్వేచ్ఛా మార్కెట్లో అమ్ముకొనే అవకాశం ఉండేది. లెవీ చక్కెర ధరకంటే బహిరంగ విపణిలో పంచదార ధర అధికంగా ఉంటుంది. అలా అదనంగా ఫ్యాక్టరీకి లభించే మొత్తంలో 50 శాతం రైతుకు, 50 శాతం ఫ్యాక్టరీకి దక్కాలన్న సూత్రాన్నే 'భార్గవా ఫార్ములా'గా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేసే ప్రతి వంద బస్తాల చక్కెరలో 45 బస్తాలు ప్రభుత్వానికి లెవీ చక్కెరగా ఇచ్చి, మిగిలినవి స్వేచ్ఛా విపణిలో అమ్ముకోవచ్చు. అంటే భార్గవా ఫార్ములా రూపొందిన నాటికంటే ప్రతి వంద బస్తాలకు అదనంగా ఇరవై బస్తాల చక్కెరను ఫ్యాక్టరీలు స్వేచ్ఛా మార్కెట్లో అమ్ముకొని అదనపు లాభాలు ఆర్జిస్తున్నాయి. కనుక ఈ ఫార్ములాను సవరించి, స్వేచ్ఛా మార్కెట్లో అమ్మకాల ద్వారా లభించే అదనపు మొత్తంలో 70 శాతం రైతులకు, మిగిలింది ఫ్యాక్టరీలకు దక్కేటట్లు చర్యలు తీసుకోవాలి. కొన్ని చక్కెర ప్యాక్టరీలు మొలాసిస్, అల్కహాల్, పేపర్, కార్బన్ డయాక్సైడ్, మరికొన్ని రసాయనాలు తయారుచేసి అదనపు లాభాలు గడిస్తున్నాయి. ఈ లాభాలలో ఏ మాత్రం కూడా చెరకు రైతుకు లభించడంలేదు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి ఈ తరహా ఉప ఉత్పత్తుల ద్వారా సంక్రమించే లాభాల్లో కొంత భాగం రైతుకు లభించేటట్లు చూడాలి. ఈ ఉప ఉత్పత్తుల విస్తృత ప్రయోజనాలను గుర్తించి దేశావసరాలు తీర్చుకోవడానికి వాటిని ఉపయోగించుకోవాలి. రసాయనిక పరిశ్రమకు ముఖ్యమైన ముడి పదార్థం మొలాసిస్. దీనిద్వారా తయారుచేసే రసాయినక పదార్థాలను పెట్రోలియం నాఫ్తా నుంచి కూడా తయారు చేయవచ్చు. మొలాసిస్ ఆధార పరిశ్రమలకు పెద్దగా పెట్టుబడి అవసరంలేదు. విదేశీమారక ద్రవ్యంలో సింహభాగాన్ని హరించి వేస్తున్న పెట్రోలియం దిగుమతులను

తగ్గించాలంటే – మొలాసిస్ ఆధార రసాయనికాల ఉత్పత్తిని ప్రోత్సహించడం అవసరం. మొలాసిస్ నుంచి లభ్యమయ్యే 'ఈథనాల్' మోటారు వాహనాలకు ఇంధనంగా ఉపయోగపడుతుంది. పెట్రోలుకు ప్రత్యామ్నాయంగా బ్రెజిల్ 'ఈథనాల్'నే ఉపయోగిస్తోందన్న విషయం గమనార్హం. చెరకు పిప్పి నుంచి పేపరు తయారీని ప్రోత్సహించడం ద్వారా అడవుల నరికివేతను గణనీయంగా తగ్గించవచ్చు. విద్యుచ్ఛక్తి అవసరానికి సంబంధించి చెరకు ఫ్యాక్టరీలు స్వయం పోషకం కావడమేగాక, విద్యుత్ బోర్డుకు కూడా ఎంతో కొంత సరఫరా చేసి 'వెలుగులు' పంచే అవకాశమూ ఉంది. ఇందుకు చేపట్టాల్సిన చర్యలపై సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ, రాష్ట్రాల్లోని విద్యుత్ బోర్డులు, చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యాలు కలసి కూర్చుని చర్చించి అనువైన వ్యూహాన్ని రూపొందించడం దేశ ప్రయోజనాల దృష్ట్యా శ్రేయస్కరం.

## రాపాడటం కాదు, కాపాడాలి

ఇన్ని విధాలుగా దేశావసరాలను తీర్చగల చెరకు పంటను అభివృద్ధి చెయ్యడానికి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడటం, ఫ్యాక్టరీ యాజమాన్యాలకు లభించే అదనపు ఆదాయం, లాభాలలో రైతుకు సరైన భాగం కల్పించి ప్రోత్సహించడం అవసరం. చక్కెర ఉత్పత్తినేగాక, అనుబంధంగా లభించే మొలాసిస్, చెరకు పిప్పి తదితరాలను ఉపయోగించి పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయాలి. గ్రామ సీమల సౌభాగ్యానికీ, పంచదార పరిశ్రమకూ అవినాభావ సంబంధం ఉంది. గ్రామీణుల జీవన ప్రమాణాలు పెరగడానికి ఈ పరిశ్రమ ఎంతగానో చేయూతనిస్తోంది. పల్లెపట్టుల్లో రహదారులు, నీటి వనరులు, విద్యా, వైద్య సౌకర్యాలు మెరుగుపడటానికి దోహదపడుతోంది. మహారాష్ట్రలోని అనేక సహకార చక్కెర ఫ్యాక్టరీలు ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నాయి. అనేక పడకల ఆసుపత్రుల నిర్వహణతో సహా ఈ ఫ్యాక్టరీలు రైతు సంక్షేమానికి చేస్తున్న కృషి ఆదర్శప్రాయం. చెరకు పరిశ్రమను ఎక్సైజ్ ఆదాయాన్ని సమకూర్చి పెట్టే బంగారు బాతుగానే పరిగణిస్తున్న ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలను విస్మరిస్తున్నాయి. ఇతరేతర శక్తులు రైతును పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఈ ఏడు చట్టబద్ధ కనీస ధర నిర్ణయించే సందర్భంలో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సముచిత రీతిలో స్పందించడం ప్రభుత్వాల బాధ్యత.

*ది. 10-11-1992.* – *ఈనాడు*

●

# పత్తి రైతుల ఆత్మహత్యలు చెబుతున్న చేదు నిజాలు

## సస్యరక్షణ వ్యూహాల్లో అవగాహన రాహిత్యం

ఈ మధ్య వరంగల్, మరికొన్ని జిల్లాలలో కొందరు పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పబడిన విషాదకర వార్తలు రాష్ట్రమంతట రైతులకు ఆందోళన కలిగించాయి. అంతవరకు పరిస్థితి తీవ్రతను గమనించని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొన్ని ఉపశమన చర్యలను ప్రకటించింది. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. పత్తి తోటల్లో పురుగు మందుల వినియోగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు ప్రకటించింది. ఇక ఈ సమస్య పరిష్కారమయిందని ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరించినా, రైతులు సంతృప్తి చెందినా పెద్ద పొరపాటవుతుంది. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాల పరిస్థితి దయనీయమయినది. పత్తి అధిక దిగుబడి సాధించడానికి రైతు అన్ని విధాల ప్రయత్నిస్తాడు. తనకు వీలయినంత మేరకు అప్పు తెచ్చయినా పెట్టుబడి పెడతాడు. చీడపురుగులవల్ల పత్తిపంట దెబ్బతింటుంది. ఆశించిన రీతిగా దిగుబడి ఉండదు. పెట్టుబడి తిరిగి రాదు, చేసిన అప్పులు తీరవు; వడ్డీ వ్యాపారికి, బ్యాంకుకు సమాధానం చెప్పలేక, ముఖం చూపలేక, బాధతో కుమిలిపోతూ రైతు ధైర్యం కోల్పోతాడు. ఒక బలహీన క్షణంలో ఆత్మహత్య చేసుకుంటాడు. మనదేశంలో రైతులు ఇప్పటికీ ఆత్మగౌరవానికి విలువ ఇస్తారు. అప్పులు కట్టలేనప్పుడు రైతులు కుంగిపోతారు.

## అప్పుల వసూళ్ళలో రైతులకేవి రాయితీలు?

బడా వర్తకులు, పారిశ్రామిక అధిపతులు, బ్యాంకులు, ఆర్థిక సహాయ సంస్థల నుంచి కోట్ల రూపాయల రుణాలు తీసుకుంటారు. తీసుకున్నప్పుడు చెప్పే అవసరం ఒకటయితే, సొంత ఆస్తులను పెంచుకోవడానికి ఆ రుణాలను ఉపయోగిస్తారు. నష్టాలు వచ్చాయని లెక్కలు చూపి రుణాలు తిరిగి చెల్లించడం మానేశారు. విశేషించి కార్పొరేటు హాస్పిటళ్లు కోట్ల రూపాయల లాభాలు వచ్చినా, నష్టాలు వచ్చినట్లు చూపుతాయి. పెద్ద వర్తక, పారిశ్రామిక సంస్థల వారికి బ్యాంకుల, ఆర్థిక సహాయ సంస్థల ఉన్నత అధికారులతో సన్నిహిత సంబంధాలుంటాయి. అందుకు వారు రుణాలను తిరిగి చెల్లించకపోతే వారి సంస్థలను నాన్ పెర్ ఫార్మింగ్ అస్సెట్స్ (క్రియాశూన్య ఆస్తులు) కింద వర్గీకరించి  వాటి రుణాలను రద్దు చేస్తారు. ఇంతవరకు దేశంలోని జాతీయ బ్యాంకులు కొన్ని వేల కోట్ల రూపాయల రుణాలను ఈ విధంగా మాఫీ చేశాయి. ఎప్పుడు ఎవరికి  ఎన్ని కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశాయో బ్యాంకులు బయటికి చెప్పడంలేదు. రహస్య గోపనానికి సంబంధించిన చట్టాలను అడ్డుపెట్టుకుని బ్యాంకులు ఈ వివరాలను దాచి పెడుతున్నాయి. రుణాలను తిరిగి చెల్లించవలసిన వారి జాబితాను బయట పెట్టాలని, అవి ఇప్పటికయినా వసూళ్లను మెరుగుపరచాలని పార్లమెంటులో, పార్లమెంటరీ కమిటీలలో సభ్యులు చేసిన సూచనలను బ్యాంకులు ఇప్పటికీ ఖాతరు చేయడంలేదు. బ్యాంకులు తదితర సంస్థల నుంచి కోట్ల రూపాయల రుణాలు తీసుకుని ఎగవేసిన వర్తకులు, పారిశ్రామిక అధిపతులు ఎవరూ ఇంతవరకు ఆత్మహత్య చేసుకోలేదు. వారు, ఆ రుణాలను మంజూరు చేసిన ఉన్నతాధికారులు హాయిగా ఉన్నారు. వీరు అప్పులు తీర్చలేకపోతే ఆత్మహత్య చేసుకోవాలని ఎవరూ అనరు. అలా అనడం సరైందీ కాదు. కానీ, బ్యాంకు అధికారులు చిన్న రైతులను పీడించడం, వర్తక, పారిశ్రామిక అధిపతుల ముందు తలవంచడం – అనేది మాత్రం గమనించాల్సిన విషయం. చౌధురీ దేవీలాల్ ఉప ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పదివేల రూపాయల లోపు బ్యాంకు బాకీలను రద్దు చేశారు. తత్ఫలితంగా, దేశం మొత్తంమీద సుమారు 5వేల కోట్ల రూపాయల మేరకు రైతుల రుణాలు రద్దయ్యాయి. పత్తి రైతుల ఆత్మహత్య సంఘటనలలో కొన్ని అంశాలు చాల ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిని నివారించడానికి ప్రభుత్వం, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు చర్చించాలి, ఆలోచించాలి. రైతులు చాల వ్యయ ప్రయాలసకోర్చి పత్తి పంటను పండిస్తున్నారు. పత్తి పంటను

పీడించే చీడలను నిర్మూలించడానికి రైతులు క్రిమిసంహారక మందులను ఉపయోగిస్తున్నారు. ఎంతో డబ్బు పెట్టి కొన్న మందులు నాణ్యంగా ఉండడం లేదు. అవి చీడలను నిర్మూలించడం లేదు. మోసం చేసిన మందుల వర్తకుల నుంచి నష్ట పరిహారం పొందడానికి, వినియోగదారుల చట్టం ఉందని రైతులకు తెలియదు. వర్తకులు పనిచేయని మందులను అమ్మి మోసం చేశారని రైతులు ఆలస్యంగా గుర్తిస్తున్నారు. చీడ మందులలో జరుగుతున్న కల్తీని అరికట్టడానికి, మోసం చేస్తున్న వర్తకులను చట్టం ప్రకారం దండించడానికి రైతులు సంఘటితం కావడంలేదు. అధికారులు చాలమంది క్రిమిసంహారక మందుల కంపెనీలతో, వాటి డీలర్లతో కుమ్మక్కయి రైతులను మోసగిస్తున్నారు. పర్యవసానంగా నాసిరకం క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా మార్కెట్లోకి వస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికయినా అవినీతిపరులయిన అధికారులను తొలగించి నిజాయితీపరులను నియమిస్తే పరిస్థితి మెరుగుపడుతుంది. దేశంలో ప్రతి సంవత్సరం తెగుళ్ళు, చీడలవల్ల దాదాపు 6-7 వేల కోట్ల రూపాయల విలువయిన పంటకు నష్టం వాటిల్లుతున్నదని అంచనా. 1985లో దాదాపు 90 వేల టన్నుల క్రిమిసంహారక మందులను ఉపయోగించారు. ఈ మందుల వినియోగం 2000 నాటికి దాదాపు 2 లక్షల టన్నుల మేరకు పెరగవచ్చని అంచనా. పురుగు మందుల వాడకంవల్ల కొంతవరకు ఉత్పాదకత, ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. కాని, మందులను అతిగా వాడడంవల్ల కొన్ని అనర్థాలు కూడా సంభవిస్తాయి. దేశమంతట సాగవుతున్న భూమిలో 5 శాతంలో పత్తి, 24 శాతంలో వరి, 3 శాతంలో పండ్లు, కూరగాయలు పండిస్తుండగా, మొత్తం పురుగుమందులలో 50 శాతం పత్తి పంటపై ఉపయోగిస్తున్నారు. వరిపై 18 శాతం, పండ్లు - కూరగాయలపై 18 శాతం మందులు మాత్రమే వినిమయ మవుతున్నాయి. మొత్తం పంటల విస్తీర్ణంలో 58 శాతం జొన్న, సజ్జ, తదితర తృణధాన్యాల కింద, పెసర, మినుము, కందులు మొదలయిన పుప్పు ధాన్యాల కింద, ఆముదాలు, వేరశనగ, పొద్దు తిరుగుడు వంటి నూనెగింజల కింద ఉన్నా, వాటికి కేవలం 6 నుంచి 7 శాతం మందులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. మొత్తంమీద, పత్తిపంటపై విపరీతంగా పురుగుమందులను ఉపయోగిస్తున్నారని స్పష్టమవుతున్నది. మనం తీసుకునే ఆహారంలో, పశుగ్రాసంలో ఆరోగ్యానికి భంగం కలిగించే స్థాయిలో పురుగుమందుల అవశేషాలు ఉంటున్నాయి. తల్లిపాలలో సైతం పురుగుమందుల ప్రభావం కన్పిస్తున్నదని శాస్త్రజ్ఞులు అంటున్నారు. పురుగుమందుల అవశేషాలు ఉంటాయన్న భయంతో

మనదేశంనుంచి పండ్లు, కూరగాయలను దిగుమతి చేసుకోవడానికి సంపన్న దేశాలు వెనుకాడుతున్నాయి. ఏదయినా ఒక పంటనే (ఉదాహరణకు పత్తిని) అనేక సంవత్సరాలుగా పండిస్తే పురుగుల్లో, చీడల్లో మందులను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. పత్తికి అపకారం చేసే తెల్లదోమలను శెనగపచ్చ పురుగును తినే పురుగులు ప్రకృతిలో ఉన్నాయి. రైతులు శక్తిమంతమయిన సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను వాడడంవల్ల రైతుకు మేలుచేసే ఈ మిత్ర పురుగులూ నశిస్తున్నాయి. దీనితో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింటున్నది. ఇటువంటి దుస్థితి కారణంగానే పది సంవత్సరాల కిందట గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పలువురు పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇప్పుడు వరంగల్ తదితర ప్రాంతాలలో అదే దుస్థితి పునరావృతమయింది. వర్షాలు తరచుగా కురియడంతో మందులను పలు పర్యాయాలు వేయవలసి వచ్చింది. దానితో వ్యయం పెరిగింది. హెచ్చువడ్డీతో తెచ్చిన రుణాలను రైతులు తిరిగి చెల్లించలేకపోయారు. రైతులకు అవసరమయిన రుణాలను బ్యాంకులు, సహకార బ్యాంకులు ఇవ్వడంలేదు. రైతులు వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కు కోవలసి వస్తున్నది. దేశానికి స్వాతంత్ర్యం లభించి యాభై సంవత్సరాలయినా రైతుల పరిస్థితి మెరుగుపడలేదు. ఉదాహరణకు ప్రత్తిపంటకు పంటల బీమా పథకం వర్తించడం లేదు. ఇటువంటి పరిస్థితులలో రైతులకు ఏ దిక్కూ కనిపించడం లేదు. క్రిమిసంహారక మందులను విచక్షణ రహితంగా ఉపయోగించడం మంచిది కాదని రైతులు గ్రహించాలి. ఆ మందులవల్లనే దిగుబడి పెరుగుతుందను కోవడం పొరపాటు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర సస్యరక్షణ నిర్వహణ పథకాన్ని (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ స్కీమ్) అమలు జరుపుతున్నాయి. కాని, ఈ పథకం సక్రమంగా అమలు జరగడం లేదు. పురుగుల మందులను అధికంగా ఉపయోగిస్తున్న ప్రాంతాలలో ఈ పథకం అమలు జరగడం ముఖ్యం. వరిపంట ప్రాంతాలలో 1980లో ఇది ప్రయోగాత్మకంగా మొదలయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చు నిధులతో, పటిష్టంగా ఈ పథకాన్ని అమలు జరపాలి. పురుగుమందుల దుష్ఫలితాలను, ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులను రైతులకు దూరదర్శన్‌లో, ప్రైవేట్ ఛానళ్లలో చూపించాలి. చీడపురుగులను తినే కీటకాలను పెంచడం మరో పద్ధతి. పంటలకు మేలు చేసే పురుగులు ప్రకృతిలో ఎన్నో ఉన్నాయి. వాటికి హాని కలగకుండా జాగరూకత వహించాలి. ఈ పురుగులను పెంచడానికి, వాటిని రైతులకు సరఫరా చేయడానికి దేశంలో కొన్ని సంస్థలు స్థాపితమయ్యాయి. బెంగుళూరులో, చెంగల్పట్టులో అలాంటి సంస్థలు

రెండున్నాయి. ఇటువంటి మరికొన్ని సంస్థలను నెలకొల్పడానికి కేంద్రంలోని బయోటెక్నాలజీ శాఖ ప్రయత్నిస్తున్నది. పత్తిపంటకు హానికలిగించే అమెరికన్ బోల్ వార్మ్‌లను నాశనం చేయగల బెలునస్ బ్లాక్ బర్ని పురుగులను పత్తిని అధిక సంఖ్యలో ఉత్పత్తి చేసే కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల రైతులకు సరఫరా చేశారు. వాటి వినియోగంవల్ల సత్ఫలితాలు లభించాయి.

## చీడల నిర్మూలనకు జీవశాస్త్ర పద్ధతులు

క్రైసోపాస్కెలస్టెస్, ఎన్.పి.వి. వంటి విధానాలు పత్తిని దెబ్బతీస్తున్న ఆఫిడ్స్‌ను, త్రిప్స్‌ను, హిలియోథిస్, బోల్- అనే చీడలను చక్కగా ఎదుర్కోగలుగుతాయి. ఇవి జీవశాస్త్ర (బయోలాజికల్) పద్ధతులతో పత్తి పంటను సంరక్షించే విధానాలు వీటిని ఎక్కువగా ఉపయోగించడానికి మన రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే తగు నిధులను కేటాయించాలి. అవసరమయిన ఇతర చర్యలూ తీసుకోవాలి. ఢిల్లీలోని బయోటెక్నాలజీ శాఖతో సంప్రదించి గుంటూరులో, వరంగల్లులో పైలట్ ప్లాంట్ల స్థాపనకు ప్రయత్నించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో రసాయనిక క్రిమిసంహారక మందుల వినియోగాన్ని తగ్గిస్తున్నారు. ఇతర దేశాలలో నిషేధించిన మందులను మనదేశంలో వాడుతున్నారు. నిజానికి ఈ మందులను మనదేశంలో కూడా నిషేధించాలి. పురుగుమందుల వినియోగాన్ని తగ్గించే వ్యూహాన్ని అమలు (ఇంటిగ్రేడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్....ఐ.పి.ఎం.) జరపాలి. రసాయనిక ఎరువులను తగ్గించి, పశువుల పేడను, కంపోస్టు ఎరువులను ఉపయోగించాలి. తద్వారా వ్యయం తగ్గుతుంది. పంట దిగుబడి హెచ్చుతుంది. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ లాభ ప్రదమయినదని పరిశోధనలలో వెల్లడయింది. ఈ విషయాలను పత్తి రైతులూ గమనించాలి. సరైన అవగాహనతో వ్యవహరించాలి.

*దిి. 02-01-1998.* **- ఈనాడు**

●

# వరి రైతులమీద కేంద్రం సవతి ప్రేమ

**భా**రత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.) ఆంధ్రప్రదేశ్‌లో సేకరిస్తున్న ధాన్యానికి, బియ్యానికి బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానమంత్రిని, కేంద్ర ఆహారశాఖ మంత్రిని కలుసుకొని ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు బోనస్ ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. రాష్ట్రంలో వరి పండించే రైతులు ప్రకృతి వైపరీత్యాలవల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలోనో, నూర్పిడుల సమయంలోనో తుపానులు, అధిక వర్షాలు ధాన్యం నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఈ ధాన్యాన్ని కొనడంలో భారత ఆహార సంస్థ కొంతమేరకు ప్రమాణాలను సడలిస్తోంది. ప్రమాణాల సడలింపువల్ల ధరలోనూ కోత పడుతోంది. ఫలితంగా రైతు నష్టపోక తప్పడం లేదు. రాష్ట్రంలో ముఖ్యంగా కోస్తా జిల్లాల రైతులు కల్లాలలోగాని, మిల్లులకు చేరవేసిగాని ధాన్యం అమ్ముతుంటారు. ఉత్తరాది రాష్ట్రాల్లోలాగా మార్కెట్ యార్డులకు తీసుకెళ్ళేందుకు ఇక్కడి రైతులు ఇంకా అలవాటు పడలేదు. ధర గిట్టుబాటు కాదనిపిస్తే – అమ్మే ఉద్దేశం లేని రైతులు ధాన్యాన్ని ఇంటికి చేర్చి నిలువ పెట్టుకుంటున్నారు. అంతకు మించి మార్గాంతరం కనపడటం లేదు.

## మద్దతు ధర నేతిబీర!

రాష్ట్రంలో రైస్ మిల్లర్ల నుంచి ఎఫ్.సి.ఐ. బియ్యాన్ని సేకరిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా రైతులు అక్కడ అమ్మడానికి పెద్దగా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ధాన్యాన్ని కల్లాలనుంచి చేరవేసేందుకు రైతుల వద్ద సంచులు లేకపోవడం, ఎఫ్.సి.ఐ. కొనుగోలు కేంద్రాల్లో కూడా కొన్ని సమయాలలో సరిపడ సంచులు లభ్యం కాకపోవడం, రైతుల అమాయకత్వం, సడలించిన ప్రమాణాల విషయంలో సరైన అవగాహన లేకపోవడం, అధికారుల అవినీతి... నేటి స్థితికి ఇలా

ఎన్నెన్నో కారణాలు. చివరకు రైతులు దళారులకు, మిల్లర్లకు తెగనమ్ముకుంటున్నారు. ఎఫ్.సి.ఐ. కొనుగోలు కేంద్రాలలోని సిబ్బందిని ఆకట్టుకుని దళారులు అదే ధాన్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముకోగలుగుతున్నారు. రైతులు సహేతుక ధర కాదు కదా కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా పొందలేకపోతున్నారు. పంట మార్కెట్‌లోకి వస్తున్న తరుణంలో రైతులు అతి తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దేశంలో ఏ ప్రాంతానికైనా బియ్యాన్ని స్వేచ్ఛగా రవాణా చేసుకోవచ్చని పాలకులు చెబుతున్నా ఆచరణలో రైతులకు అనేక అవరోధాలు, ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాల మధ్య, రాష్ట్రాల మధ్య రవాణామీద ఉన్న ఆంక్షల కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వరి ధాన్యం ఉత్పత్తి వ్యయం పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లతో పోలిస్తే ఎక్కువే. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ ప్రాంతాలలో రైతులు వరికోత, నూర్పిడి ఒకేసారి చేయగల 'హార్వెస్టర్ కంబైనర్'ను ఉపయోగిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పండించగానే అదే భూమిలో గోధుమను పండిస్తున్నారు. కంబైనర్ వంటి భారీ యంత్రాలను వాడలేని రైతులు 'త్రెషర్' అనే చిన్న యంత్రాన్ని నూర్పిడికి విరివిగా వాడుతున్నారు. బీహార్ నుంచి వచ్చే పేద వ్యవసాయ కార్మికులు తక్కువ కూలికే లభిస్తుండటం కూడా అక్కడ వ్యవసాయోత్పత్తి వ్యయం తక్కువగా ఉండటానికి కారణం. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో యంత్రాల ఉపయోగం ఇప్పటికీ చాలా తక్కువ. పశువులతో, ట్రాక్టర్లతో వ్యవసాయ పనులు జరుగుతున్నాయిక్కడ. కోతలకు మనుషులనే ఉపయోగిస్తున్నారు. కంబైనర్ల వాడకం కొన్ని ప్రాంతాలలో మొదలయింది. వరికోతకు ఉపయోగపడే చిన్న యంత్ర పరికరాన్ని ఇటీవలే రూపొందించారు. అది విస్తృతంగా వాడకంలోకి రావాల్సి ఉంది. పొరుగు రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కూలి రేట్లు ఎక్కువే. ఈ కారణాలన్నిటి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి వ్యయం ఎక్కువ. భారతదేశంలో పంటల కనీస మద్దతు ధరలను వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం (సి.ఎ.సి.పి.) ఏటా సూచిస్తుంది. ఆ సూచనలు పరిశీలించి కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను ప్రకటిస్తుంది. రైతులు వివిధ దశలలో చేసిన ఖర్చులన్నిటినీ లెక్కించి, రైతు కుటుంబం శ్రమ విలువను, నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుని, ఆ మొత్తానికి పది శాతం జోడించి మద్దతు ధరలు నిర్ణయిస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా – వాస్తవానికి ఇవి సరైన మద్దతు ధరలు కావు. వ్యవసాయ ధరల సంఘం నిర్ణయిస్తున్న దానికన్నా రైతులు ఉత్పత్తి కోసం చేసే

ఖర్చు ఎక్కువగా ఉంటోంది. వ్యవసాయోత్పత్తుల ధరలకన్నా, వ్యవసాయదారులు కొనుగోలు చేసే ఇతర వస్తువుల ధరలు వేగంగా పెరుగుతుండటంతో వారి జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయి. కేంద్రంలోని పాలక పక్షాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి పారిశ్రామిక అభివృద్ధికి పెద్ద పీట వేశాయి. వ్యాపార నిబంధనలు (టర్మ్స్ ఆఫ్ ట్రేడ్) రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ పరిస్థితి వల్లనే భారత రైతులు ఏటా కొన్ని వేల కోట్ల రూపాయలు కోల్పోతారన్నది యథార్థం. సగటు మనిషి కొనుగోలు శక్తిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయోత్పత్తుల ధరలు నిర్ణయమవుతున్నాయి. ఆహారం మనిషి ప్రాథమిక అవసరం. తక్కువ ధరల్లో ఆహార ధాన్యాలు లభ్యం కాకపోతే పేదల బతుకులు దుర్భరమవుతాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొంత సబ్సిడీ భారాన్ని మోయాల్సి ఉంటుంది. అదే సమయంలో రైతుకు గిట్టుబాటు ధరను అందించాలి. అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న బియ్యం ధరలో సగానికన్నా తక్కువ భారతదేశంలో రైతుకు లభిస్తోంది. గోధుమ విషయంలో అంతర్జాతీయ మార్కెట్ ధరతో పోలిస్తే సగానికన్నా కొద్దిగా ఎక్కువ లభిస్తోంది. ఈ పరిస్థితుల్లో 1991-93 మధ్య పంజాబ్ రైతులు సంఘటితంగా నిలబడి క్వింటాలుకు రూ. 25 బోనస్ సంపాదించారు. గోధుమ పంట చేతికి వచ్చే సమయంలో - బోనస్ ఇస్తే తప్ప గోధుమలను ఎఫ్.సి.ఐ.కి అమ్మబోమని పంజాబ్ రైతులు తెగేసి చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో అంత ఎక్కువ ధర ఉన్నప్పుడు తాము ఇంత తక్కువ ధరకు ఎందుకు అమ్మకోవాలని నిలదీశారు. చివరికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి 1991-92 సీజనులో క్వింటాలు గోధుమ ధర రూ. 250కి అదనంగా 25 రూపాయల బోనస్ ప్రకటించింది. 1992-93లో కూడా రైతుల ఒత్తిడికి తలొగ్గి ఈ మేరకు బోనస్‌ను ఇచ్చింది. 1996-97లో 60 రూపాయలను, 1997-98లో 55 రూపాయలను కేంద్ర ప్రభుత్వం బోనస్‌గా ప్రకటించింది. గోధుమకు ఇచ్చిన బోనస్‌ను వరికి ఇవ్వకపోవడానికి ఎఫ్.సి.ఐ. కుంటి సాకులు చూపుతోంది. 1997 జూన్ నాటికి ఎఫ్.సి.ఐ. 114 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించగా, 1998 జూన్ నాటికి అది 138 లక్షల టన్నులకు చేరింది. రైతులు సంతృప్తితోనే బియ్యాన్ని ఎఫ్.సి.ఐ.కి అమ్ముతున్నారు గనుకనే లక్ష్యాలు సాధించడం సాధ్యమైందని, కనుక ధాన్యానికి, బియ్యానికి బోనస్ ఇవ్వనక్కరలేదని వాదిస్తున్నారు. గోధుమతో పోలిస్తే వరి ఉత్పాదక వ్యయం అధికం. అంతర్జాతీయ మార్కెట్లలో గోధుమకు లభిస్తున్న దానికన్నా వరికి లభిస్తున్న ధర తక్కువ. వరి పండించే రైతులు సంఘటితం కాకపోవడమే

ప్రభుత్వం బోనస్ ప్రకటించకపోవడానికి కారణమని గ్రహించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో ఏనాడూ బియ్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేసింది లేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే ఈ విషయంలో కేంద్రం మీద ఒత్తిడి తెస్తోంది. దానికితోడు రైతులు కూడా సంఘటితమై బోనస్ ఇస్తే తప్ప ఎఫ్.సి.ఐ.కి ధాన్యాన్ని అమ్మబోమని నిష్కర్షగా చెప్పగలిగితే కేంద్ర ప్రభుత్వం దిగివస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో సేకరించే బియ్యానికి బోనస్ ఇవ్వడం ఎంతైనా అవసరం. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తికి అయ్యే వ్యయాన్ని ఆచార్య ఎన్.జి.రంగా విశ్వ విద్యాలయం వారు ఎటా లెక్కగడుతుంటారు. గత సంవత్సరం- విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు; నాట్లు, కలుపుతీత, కోత, కట్టివేత, నూర్పిడులకు - అన్నిటికీ రైతు పెట్టిన ఖర్చు హెక్టారుకు: చిన్న రైతుకు రూ. 17,520, మధ్య రైతుకు రూ. 24,898, పెద్ద రైతుకు రూ. 20,085. కుటుంబ సభ్యుల వేతనానంతరం, నిర్వహణ, భూమికి కౌలును కూడా కలిపి లెక్కిస్తే ఈ మొత్తాలు వరుసగా - 21,744; 26,919; 24,666 అవుతాయి. హెక్టారుకు మిగిలేది చిన్న రైతుకు రూ. 372, పెద్ద రైతుకు రూ. 144 కాగా మధ్య రైతు నష్టపోతున్నది రూ. 1,726 అని అంచనా. వర్షా ధార వ్యవసాయంలో రైతుకు లాభమనే ప్రసక్తి లేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంగా చూసినప్పుడు రాష్ట్రంలో వరి రైతులకు మిగిలేది హెక్టారుకు రూ. 183. అదీ సగటున హెక్టారుకు 52 క్వింటాళ్లపైన దిగుబడి ఉంటుందని భావిస్తే. ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే - ప్రభుత్వ అంచనాల ప్రకారం రాష్ట్రంలో వరి దిగుబడి సగటున హెక్టారుకు 30 క్వింటాళ్లు మాత్రమే. ఆందోళన కలిగించే మరో అంశం ఏమిటంటే 1950-51లో ఆంధ్రప్రదేశ్ మొత్తం ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా 60 శాతం ఉంటే - అది 1995-96 నాటికి 34.4 శాతానికి తగ్గిపోయింది. వ్యవసాయ రంగంమీద ఆధారపడిన వారు మాత్రం నాడు, నేడు 68.5 శాతం ఉన్నారు. పంటల విస్తీర్ణం గత యాభయ్యేళ్లలో 25 శాతం పెరగగా, వ్యవసాయరంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య మూడురెట్లు పెరిగింది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలోని వారి సగటు ఆదాయం నిష్పత్తి 1950-51లో 1:1.45 ఉండగా, అది 1:4కు చేరింది. దీన్నిబట్టి వ్యవసాయరంగంలోని వారికి ఎంత తక్కువ ఆదాయం వస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఇది అవాంఛనీయమైన పరిణామం. వ్యవసాయేతర రంగాలలో పనిచేస్తున్న వారితో సమానంగా కాకపోయినా,

కాస్త దగ్గరగానైనా వ్యవసాయంపైన ఆధారపడిన వారి ఆదాయాలు ఉండాలి. అప్పుడే రైతులకు సరైన ప్రోత్సాహం లభిస్తుంది.

## సమైక్యతే విజయానికి హామీ

మార్కెట్ యార్డులలో అధికారులు రైతులను మోసం చేయడానికి, వేధింపులకు ప్రయత్నిస్తే పంజాబ్, హర్యానాలలో రైతులు సహించరు. అక్రమాలకు పాల్పడే అధికారులకు దేహశుద్ధి జరిగిన సంఘటనలూ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రైతుల్లో ఆ విధమైన చైతన్యం, పట్టుదల కలసి పోరాడాలనే దృక్పథం తగినంతగా లేవు. 'అడగందే అమ్మయినా అన్నం పెట్టదనే' సామెత రైతన్నలకు తెలియనిది కాదు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించే శక్తిని సమకూర్చుకుంటేనే రైతులకు న్యాయం చేకూరుతుంది. రైతులు ప్రబలమైన శక్తిగా రూపొందాలి. రాజకీయాలమీద ప్రేమాభిమానాలను ఎన్నికలప్పుడు ప్రదర్శించవచ్చు. సమష్టి ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా వ్యవహరించగలిగినపుడే రైతులు తమ ప్రయోజనాలను పరిరక్షించుకో గలుగుతారు. పంజాబ్‌లో ఏ పార్టీ ప్రభుత్వం నడుపుతున్నా రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఉంటుంది. అదే ఒరవడిని ఆంధ్రప్రదేశ్‌లోనూ తీసుకు రాగలిగితే ఏ ప్రభుత్వమైనా బోనస్ ఇచ్చి తీరుతుంది.

*ది. 08-09-1998.* — *ఈనాడు*

●

# పత్తి రైతును ముంచుతున్నదెవరు?

వ్యవసాయం ఓ జూదంగా తయారైన ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటను సాగు చేయడం మరీ దారుణంగా మారింది. దేశవ్యాప్తంగా పత్తి రైతులు వేలసంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు తెల్ల బంగారంగా, రైతులకు సిరులు కురిపించే పంటగా పేరొందిన పత్తి – నేడు వారిని నానా అగచాట్లకు గురిచేస్తోంది. పత్తిసాగు ద్వారా సిరులు పొందడం మాటెలా ఉన్నా – పీకల్లోతు అప్పుల్లోకి కూరుకుపోకుండా బయటపడితే అదే పదివేలు అని రైతులోకం భావిస్తోంది. నీటి ఎద్దడిని బాగా తట్టుకొని నిలబడగల మెట్ట వాణిజ్య పంటగా పత్తికి పేరుంది. కానీ ఇటీవలి కాలంలో పత్తిపంట గిట్టుబాటు కావడం లేదనే మాట తరచూ వినిపిస్తోంది. పత్తి విషయంలో ప్రభుత్వం వైపు నుంచి రైతులకు ఎలాంటి తోడ్పాటూ లభించకపోవడం ఇందుకు ప్రధాన కారణం. పత్తిని ఎలాంటి నేలల్లో పండించాలి. పింజె పొడవు ఎంత ఉంటే మార్కెట్ బాగుంటుంది, పింజెల రకాలేమిటి, ఎగుమతి చేయడానికి అనుసరించాల్సిన ప్రమాణాలేమిటి వంటి అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం ఆ విషయాన్ని బొత్తిగా విస్మరించింది. పత్తి రైతులను గాలి కొదిలేసిన జౌళి మంత్రిత్వశాఖ – వస్త్ర పరిశ్రమపై మాత్రం వల్లమాలిన అభిమానాన్నీ ప్రదర్శిస్తోంది. ఫలితంగా దేశ వస్త్ర రంగం కళకళలాడుతోంటే – ఆ పరిశ్రమకు మూలస్తంభాలైన పత్తి రైతులు మాత్రం కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు.

### దళారి పాత్రలో సి.సి.ఐ.

ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఆరితేరిన దళారుల్లా వ్యవహరిస్తే సగటు రైతుకు ఇక దిక్కెవరు...? ప్రస్తుతం పత్తి రైతుల్ని వేధిస్తున్న సమస్య ఇదే. మూడేళ్లుగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ.) వ్యవహరిస్తున్న తీరు పత్తి రైతుకు చేదు అనుభవాలనే మిగులుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో పత్తి సాగుదార్లకు

కొన్నేళ్లుగా ధరలు గిట్టుబాటు కావడం లేదు. మార్కెట్లో ధరలు కనిష్ఠస్థాయికి పతనమైనప్పుడు రైతుల్ని ఆదుకొనేందుకు సి.సి.ఐ. రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉంది. గడచిన పదేళ్లలో పత్తి ధర క్వింటాలుకు (ప్రస్తుతం రూ.2010) అయిదు వందలు కూడా పెరగలేదు. ఏటా పదో, పాతికో పెంచుతూ మద్దతు ధరల్ని నిర్ణయిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల దయనీయ స్థితిని గమనించలేకపోతోంది. ఒకవైపు పత్తి సాగులో పెరుగుతున్న ఖర్చులు రైతుల నికరాదాయాన్ని భారీగా తగ్గించేస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి పంట ఉత్పాదకాల ధరలు పెరిగిన స్థాయిలో రైతులకు ఇచ్చే గిట్టుబాటు ధర ఉండటం లేదు. పింజె పొడవు 30 మి.మీ. అంతకంటే ఎక్కువ ఉన్న పత్తికి మాత్రమే మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. మన రాష్ట్రంలో పండించే పత్తి పింజె పొడవు 28 మి.మీ. మించడం లేదు. ఫలితంగా క్వింటాలుకు రూ.1600 కూడా దక్కడం లేదని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రంలో సగటున ఎకరాకు 5 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి అవుతోంది. పత్తి సాగుకు ఎకరాకు కనీసం 20 వేల రూపాయలు ఖర్చవుతోంది. ఈ లెక్కన చూస్తే కనీసం పెట్టుబడులు కూడా రైతుకు దక్కడం లేదు. దేశంలో సుమారు 90 లక్షల హెక్టార్లలో పత్తిని సాగు చేస్తున్నారు. తద్వారా సుమారు 250 నుంచి 270 లక్షల బేళ్ల (ఒక బేలుకు 170 కిలోలు) వరకు పత్తి దిగుబడి వస్తోంది. వీటిలో పొడవు పింజె ఉన్న పత్తి అయిదు లక్షల బేళ్లకు మించడం లేదు. దేశీయ అవసరాలు దాదాపు 240 లక్షల బేళ్లని అంచనా. వీటిలో పొడవు పింజె పత్తి వాటా సుమారు 15 లక్షల బేళ్లు. ఫలితంగా 10 లక్షల బేళ్ల పొడవు పింజె పత్తిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మరోవైపు మన దేశం దాదాపు 40 లక్షల బేళ్ల పత్తిని ఎగుమతి చేస్తోంది. మొత్తం దేశీయ ఎగుమతుల సామర్థ్యంలో ఇది 60 శాతం మాత్రమే. మనతోపాటు పత్తిని అధికంగా పండించే చైనా, అమెరికా, ఈజిప్టుల నుంచి ఎగుమతుల విషయంలో భారత్‌కు తీవ్ర పోటీ ఎదురవుతోంది. అంతర్జాతీయంగా అమెరికా, చైనా, భారత్, పాకిస్థాన్‌లు పత్తి, మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ప్రపంచ పత్తి వాణిజ్యంలో ఈ నాలుగు దేశాల వాటా 70 శాతం పైమాటే. ఈ ఏడాది చైనా తరవాత భారత్ అతి పెద్ద పత్తి ఉత్పత్తిదారుగా అవతరించింది. వచ్చే కొన్నేళ్లలో పత్తి సాగులో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచే అవకాశముంది. ఇప్పటికే అతి తక్కువ ఖర్చుతో పత్తి పండించే విషయంలో అర్జెంటీనాతోపాటు మనదేశం కూడా అగ్రస్థానంలో

కొనసాగుతోంది. మరోవంక వస్త్ర పరిశ్రమకు సంబంధించి చైనా మనకు గట్టి పోటీగా నిలుస్తోంది. నాణ్యత విషయంలో చైనాతో పోలిస్తే మన పరిస్థితి మెరుగుపడలేదు. అయితే చైనా తన వస్త్ర పరిశ్రమ అవసరాల కోసం భారత్ నుంచి కాకుండా అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటోంది. ఫలితంగా చైనాకు ఎగుమతులు క్షీణించడంతో మనదేశం ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాల్సి వచ్చింది. దీనిని కూడా దేశంలో పత్తి ధరలు తగ్గడానికి ఓ కారణంగా వ్యాపారులు చెబుతున్నారు.

ప్రమాణాలకు సంబంధించి దేశీయ పత్తి - అంతర్జాతీయ మార్కెట్ పోటీని తట్టుకోలేకపోతోందన్న వాదనలున్నాయి. పత్తిలో మలినాలు రెండు శాతానికి మించరాదని అంతర్జాతీయ ప్రమాణాలు సూచిస్తున్నాయి. అందుకు భిన్నంగా దేశీయ పత్తిలో మలినాలు పది శాతం మేర నమోదవుతుండటం గమనార్హం. రైతు స్థాయిలోనే తెలియక అధిక భాగం, తెలిసి కొంత భాగం మలినాలు చోటుచేసుకుంటున్నాయి. జిన్నింగ్ చేసేటప్పుడు వీటిని విడగొట్టడం సాధ్యపడటం లేదు. దీనిపై రైతుల్లో విస్తృత అవగాహన పెంచే దిశగా చేపడుతున్న చర్యలు నామమాత్రం. అందువల్లే మన పత్తికి ఎగుమతి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇదే కారణంతో దేశీయ వస్త్ర పరిశ్రమ వర్గాలు - పొడవు పింజ పత్తికోసం దిగుమతుల్ని ఆశ్రయిస్తున్నాయి. దేశంలో పారిశ్రామిక ఉపయోగానికి నెలకు సుమారు 20 లక్షల బేళ్ల పత్తి అవసరమవుతోంది. ఈ దిగుమతులు పెరిగిన ప్రతి ఏడాదీ దేశంలో పత్తిధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దిగుమతుల్ని నిరుత్సాహ పరిచేందుకు 30 శాతం మేర సుంకం విధిస్తున్నప్పటికీ ఫలితం లేకపోయింది. వీటికి తోడు విదేశాల్లో పత్తి రైతులకు ప్రభుత్వం తరపునుంచి అందుతున్న సబ్సిడీలు అంతర్జాతీయ ధరల్ని ప్రభావితం చేస్తున్నాయి. అమెరికాలో ముప్పై మిలియన్ డాలర్ల విలువైన పత్తిని పండించే రైతులకు - దాదాపు నలభై మిలియన్ డాలర్ల ప్రోత్సాహకాలు అందుతున్నాయి. దీనితోపాటు అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలూ పత్తి రైతును దెబ్బతీస్తున్నాయి. వీటివల్ల సీజన్లు ఆలస్యమై పత్తి మార్కెట్‌కు చేరడంలో తీవ్ర జాప్యం జరిగి దేశీయ పత్తి నిల్వలు తరిగిపోతున్నాయి. విపత్తుల ప్రభావం దిగుబడులపై కూడా పడుతుండటంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. దేశంలో పత్తి ఉత్పత్తి తగ్గనుందన్న సందర్భాల్లో మాత్రమే డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొస్తున్నాయి. మన రైతులు చెత్తా చెదారాన్ని కూడా కలగలిపి మార్కెట్‌కు తెస్తున్నారని, తేమ శాతం అధికంగా

ఉండి దూది నాణ్యత చెడిపోతోందని సి.సి.ఐ. చెబుతోంది. దీనికి తోడు బీటీ, నాన్ బీటీ రకాల పత్తిని కలిపేసి సరకు తెస్తుండటంవల్ల అనర్థాలు జరుగుతున్నాయి. ఆ ఆరోపణల్లో కొంతవరకు వాస్తవం లేక పోలేదు. చాలా మార్కెట్లలో అలాంటి దృష్టాంతాలెన్నో. అందువల్లే తాము రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడం లేదని సి.సి.ఐ. అధికారులంటున్నారు. ఇది సహేతుకమైన వాదనే అయినా రైతుల్నుంచి వ్యాపారులు కొన్న పత్తిని అధిక ధరలిచ్చి సి.సి.ఐ. ఎందుకు కొనుగోలు చేస్తోందన్నదే ఇక్కడ ప్రశ్న...! రైతు నిస్సహాయ స్థితి వ్యాపారికి వరంగా మారుతోంది. అదే పత్తిని వ్యాపారుల నుంచి సి.సి.ఐ.కొంటోంది. దీన్నిబట్టి - మార్కెట్లో దళారికి సి.సి.ఐ.కి పెద్దగా వ్యత్యాసమేముంది...? ఏటా మార్కెట్లో ఇదే తంతు జరుగుతోంది. పింజె పొడవు, నాణ్యత పేరుతో రైతుల్ని మోసగిస్తున్న తీరు పత్తి సాగుదార్లకు నష్టాలనే పంచుతోంది. పైగా తాము నష్టపోతామనే ఉద్దేశంతోనే రైతుల్నుంచి అధికస్థాయిలో పత్తిని కొనలేకపోతున్నామని సి.సి.ఐ. చెబుతోంది. చిత్రమేమిటంటే పత్తి తీతలు ప్రారంభమైన తొలినాళ్లలో పత్తికి పలుకుతున్న రేటు కనీస మద్దతు ధర కంటే అధికంగా ఉంటోంది. మార్కెట్‌కు పత్తి రాక పెరిగినప్పటి నుంచి రైతుకు మద్దతు ధర కూడా దక్కడం లేదు. ధరలు పతనమైన వెంటనే - స్థోమత ఉన్న కొంతమంది రైతులు పత్తిని తమ ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. రైతుల చేతి నుంచి వ్యాపారులు, మిల్లులకు చేరాక పత్తి ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో క్వింటా పత్తికి మార్కెట్లో రూ. 1600-1800 మధ్యే ధరలు దక్కుతున్నాయి. మద్దతు ధర ఇవ్వకపోవడంతో ముమ్ముందు పత్తి రేటు పెరుగుతుందన్న ఆశతో స్థోమత ఉన్న రైతులు నిల్వకే మొగ్గుచూపుతున్నారు.

## కేంద్రం పట్టించుకోదేం...?

పారిశ్రామిక వర్గాలకు కొమ్ము కాస్తోందన్న ఆరోపణలకు మరింత ఊతమిచ్చే విధంగానే కేంద్ర ప్రభుత్వ వ్యవహార సరళి ఉంటోంది. రైతు శ్రేయాన్ని పూర్తిగా గాలి కొదిలి ప్రవర్తిస్తోంది. పత్తి పంట విషయంలో ఆ వైఖరిని మరింత స్పష్టంగా చూడవచ్చు. పత్తి మార్కెట్లోలో రైతుల పుట్టి ముంచేలా ఏటా దోపిడీలు కొనసాగుతున్నా కేంద్రం చోద్యం చూస్తుండటం విచారకరం. విచ్చలవిడి దిగుమతుల కారణంగానే గడచిన 15 ఏళ్లలో దేశంలో పత్తి రైతుల ఆత్మహత్యలు సంభవించాయని అంతర్జాతీయ స్వచ్ఛంద

సంస్థ 'ఆక్స్‌ఫామ్' వెల్లడించిన నివేదిక విస్మరించరానిది. నేటికీ రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్న నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్‌ను రైతు శ్రేయం కోరే బాధ్యతాయుత సంస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరముంది. పక్కా వ్యాపారిలా మారిపోయిన సి.సి.ఐ.లో సంస్కరణలు తీసుకురాక తప్పదు. అప్పుడే పత్తి రైతుకు మేలు జరుగుతుంది. అదేవిధంగా హెక్టారుకు ప్రపంచ పత్తి సగటు (550 కిలోలు) ను అందుకునే స్థాయికి మనం (హెక్టారుకు 300 కిలోలు) ఎదగాలి. అందుకోసం మెరుగైన వంగడాలను తక్కువ ధరలకు రైతుకు అందుబాటులో ఉంచాలి. పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకుని మద్దతు ధరను కనీసం రూ.2,500గా నిర్ణయిస్తే తప్ప రైతుకు పత్తి సాగు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. విదర్భ ఆంధ్రప్రదేశ్‌లలో జరుగుతున్న ఆత్మహత్యలు పత్తిరైతుల దుర్భర స్థితికి సంకేతం. అలాంటి విషాద పరిణామాలు పునరావృతం కాకుండా ఉండాలంటే పరిశ్రమకు అందుతున్న స్థాయిలో పత్తి రైతుకూ ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరముంది.

*ది. 12-02-2007.* — *ఈనాడు*

●

# పత్తి రైతు ఆశ దూదిపింజేనా?

**భా**రత్ నుంచి దాదాపు 25వేల కోట్ల రూపాయల విలువైన వస్త్రాలు, దుస్తులు, దారం ప్రతి ఏటా విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మనదేశం చేసే మొత్తం ఎగుమతుల్లో దాదాపు మూడోవంతు జౌళి ఉత్పత్తులే ఉండటం గమనార్హం. భారత్ పారిశ్రామిక ఉత్పత్తిలో ఇప్పటికీ 14 శాతం వాటా జౌళిరంగానిదే. భావి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మన రాష్ట్రంలో ఇటీవలి కాలంలో స్పిన్నింగ్ మిల్లులను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తున్నారు. నాణేనికి మరో వైపు చూస్తే - ఉజ్జ్వల భవిష్యత్తుగల జౌళి రంగానికి అవసరమైన పత్తిని పండించే రైతుల పరిస్థితి మాత్రం నానాటికీ దిగజారుతోంది. ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల్లో ఎక్కువ మంది పత్తి పంటను సాగు చేసినవారే కావడం ఇందుకు ఓ దృష్టాంతం. పత్తికి ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు వాస్తవ వ్యయానికి తగినట్లుగా లేకపోవడం, రైతులకు పరపతి సౌకర్యాన్ని కల్పించడంలో లోపాలు, సస్యరక్షణకు అయ్యే వ్యయం, పనివారలకు చెల్లించాల్సిన వేతనాలు పెరిగిపోవడం, రైతు పండించిన పంటను సకాలంలో సరైన ధరకు కొనుగోలు చేయించేలా మార్కెటింగ్ వ్యవస్థలు పనిచేయక పోవడం, ప్రతికూల వాతావరణం, వీటన్నిటితోపాటు ఇతర దేశాల్లో పత్తి పంటకు అక్కడి ప్రభుత్వాలు పెద్ద యెత్తున సబ్సిడీలు ఇస్తుండటం ఈ దుస్థితికి ప్రధాన కారణాలు.

## దృఢవైఖరి అవసరం

పత్తిసాగులో ప్రపంచంలో మన దేశం ప్రథమ స్థానంలో ఉన్నా ఇతర దేశాలతో పోలిస్తే పంట దిగుబడులు చాలా తక్కువ. భారత్‌లో దాదాపు 90 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతోంది. అయితే, హెక్టారుకు సగటున 300 కిలోల దిగుబడితో 28 లక్షల టన్నుల పత్తి మాత్రమే ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. చైనా కేవలం 46 లక్షల హెక్టార్లలో హెక్టారుకు వెయ్యి కిలోల దిగుబడితో 46 లక్షల టన్నుల పత్తిని పండిస్తూ ఉత్పత్తి

పరంగా అగ్రస్థానంలో ఉంది. అమెరికాలో 58 లక్షల హెక్టార్లలో సగటున హెక్టారుకు 720 కిలోల దిగుబడితో 42 లక్షల టన్నుల పత్తిని ఉత్పత్తి చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో హెక్టారుకు సగటు దిగుబడి 1520 కిలోలు, ఈజిప్టులో 864 కిలోలుగా ఉంది. వీటన్నిటిని బట్టి మనదేశంలో సగటు దిగుబడులను పెంచవలసిన అవసరమెంతైనా ఉందని స్పష్టమవుతోంది.

గడచిన దశాబ్ద కాలంలో ఇండియాలో పండించిన పత్తి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. అయితే, పత్తి సాగుకు అయ్యే వ్యయంలో 42 శాతం లేబర్ (పనివాళ్ల) కోసం, 36 శాతం ఎరువులు, పురుగు మందులు మొదలైన వాటికోసం ఖర్చు అవుతోంది. ఈ రెండింటిపై రైతులకు అయ్యే ఖర్చు - పత్తి ధరలో పెరుగుదల కంటే చాలా ఎక్కువగా ఉండటంవల్ల వారికి వచ్చే నికర ఆదాయం తగ్గింది. దీనికి తోడు 1990లలో పత్తి దిగుమతులను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ.) పరిధి నుంచి తప్పించి, ఓపెన్ జనరల్ లైసెన్స్ విధానం కిందకు తీసుకు వచ్చారు. పర్యవసానంగా మన దేశంలోకి పత్తి దిగుమతులు అధికమయ్యాయి. ఉదాహరణకు- 2001 నాటికి మన దేశంలోకి అయిదు లక్షల టన్నుల పత్తి దిగుమతి అయింది. పత్తిపంటపై కొన్ని దేశాలు భారీ మొత్తంలో సబ్సిడీ ఇస్తూ ఉండటం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు గణనీయంగా తగ్గాయి. 1996 నుంచి 2003 నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు 55 శాతం మేరకు తగ్గాయి. అమెరికా 2001-02లో పత్తి పంటకు 300 కోట్ల డాలర్లు, చైనా 120 కోట్ల డాలర్లు, ఐరోపా సమాఖ్య దేశాలు (ఇ.యు.) 98 కోట్ల డాలర్లు సబ్సిడీగా సమకూర్చాయి.

తమ దేశంలోని పత్తి రైతులకు అమెరికా, చైనా, ఇ.యు. దేశాలు భారీ యెత్తున ఇస్తున్న సబ్సిడీలను నిలిపివేసేలా చూడటానికి ఇండియాతోపాటు ఇతర వర్ధమాన దేశాలు, పేద దేశాలు అంతర్జాతీయ స్థాయిలో కలిసికట్టుగా కృషి చేయవలసిన అవసరముంది. ఎందుకంటే- మన దేశంలోని పత్తి రైతులు నష్టపోతున్నట్లే, పత్తిని పండించే కొన్ని ఇతర దేశాల రైతులకూ కష్టనష్టాలెదురవుతున్నాయి. తమ పత్తి రైతులకు అమెరికా, ఇ.యు. దేశాలు ఇస్తున్న సబ్సిడీల కారణంగా పశ్చిమ ఆఫ్రికాలోని బెనెన్, బుర్కినాఫోసో, చాద్ వంటి దేశాలకు చెందిన పత్తి రైతులకు ప్రత్యక్షంగా రూ.1,125 కోట్లు, పరోక్షంగా రూ.4,500 కోట్లు మేరకు నష్టం వాటిల్లుతున్నట్లు ఓ అధ్యయనంలో

వెల్లడైంది. పత్తి పంటకు ఇస్తున్న సబ్సిడీలను అమెరికా, ఇ.యు., చైనా ఉపసంహరిస్తే – అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు 18 శాతం పెరుగుతాయని ఈ అధ్యయనంలో తేలింది. ఈ సబ్సిడీల ఉపసంహరణవల్ల – పత్తిసాగు విస్తీర్ణం అమెరికాలో 15 శాతం, ఇ.యు. దేశాల్లో 32 శాతం మేరకు తగ్గుతుందని అంచనా. దీనివల్ల పత్తి పండించే వర్ధమాన దేశాలకు లబ్ధి కలుగుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.)లో సభ్యత్వంగల దేశాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి ఏర్పాటైన సంస్థ కూడా – పత్తికి అమెరికా భారీ మొత్తాల్లో ఇస్తున్న సబ్సీడీలను ఉపసంహరించాలని తీర్పునిచ్చింది. అమెరికా ఇస్తున్న ఈ సబ్సిడీలవల్ల పత్తి ధరలు తక్కువ స్థాయిలో ఉంటూ, తమ పత్తి రైతుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని బ్రెజిల్, మరికొన్ని దేశాలు 2003లో కాన్‌కున్‌లో డబ్ల్యు.టి.ఒ. సమావేశం జరిగిన సందర్భంగా ఈ సంస్థ ఎదుట వాదించాయి. ఈ దేశాల వాదన సహేతుకమేనంటూ...పత్తికి అమెరికా ఇస్తున్న సబ్సిడీలను ఎత్తివేయాలని డబ్ల్యు.టి.ఒ. వివాదాల పరిష్కార సంస్థ తీర్పు చెప్పింది.

వాస్తవానికి ఉత్పత్తి వ్యయంకన్నా తక్కువ ధరకు పత్తిని అమెరికా ప్రపంచ మార్కెట్‌లో విక్రయిస్తోంది. ఉదాహరణకు – అమెరికా 1990లో ఉత్పత్తి వ్యయం కంటే 32 శాతం తక్కువ ధరకు పత్తిని ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. 2003 నాటికి 47 శాతం తక్కువ ధరకు అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేసింది. వ్యవసాయ ఒప్పందం (ఎ.ఒ.ఎ.) లోని నిబంధనలను అతిక్రమించి అమెరికా పత్తిరైతులకు 320 కోట్ల డాలర్ల మేరకు సబ్సిడీని, పత్తి ఎగుమతికి పరపతి సబ్సిడీ కింద 160 కోట్ల డాలర్లను ఇవ్వడాన్ని డబ్ల్యు.టి.ఒ.లోని వివాదాల పరిష్కార సంస్థ తప్పు పట్టింది.

2004లో జులైలో జరిగిన డబ్ల్యు.టి.ఒ. చర్చల పర్యవసానంగా – ఎగుమతులపై ఇచ్చే సబ్సిడీలను ఉపసంహరించడానికి ధనిక దేశాలు అంగీకరించినా, అయితే, వాటిని అవి ఎప్పుడూ ఉపసంహరిస్తాయన్న దానిపై స్పష్టత లేదు. వర్ధమాన దేశాలు తమ మార్కెట్లో విస్తృత అవకాశాలు కల్పిస్తేనే – వ్యవసాయ రంగానికి తాము ఇస్తున్న సబ్సిడీలను కొద్దిమేరకు తగ్గించగలమని ధనిక దేశాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో – బ్రెజిల్, ఇండియా మొదలైన దేశాలతో కూడిన జి-20 కూటమి దృఢంగా వ్యవహరించినప్పుడే వర్ధమాన దేశాలకు, వాటిలోని చిన్న, సన్నకారు రైతులకు మేలు

చేకూరుతుంది. అంతర్జాతీయ విపణిలో పత్తి దూది ధరలు పెరిగి, మన రైతులకు కొంత మెరుగైన ధరలు లభిస్తాయి.

మన దేశంలో పత్తి దిగుబడిని పెంచడానికి, నాణ్యతను మెరుగు పరచడానికి, ప్రాసెసింగ్ యూనిట్లను ఆధునికీకరించడానికి, మార్కెటింగ్ సౌకర్యాలను విస్తృతంగా కల్పించడంతోపాటు రైతుల్లో అవగాహన పెంపొందించడానికి - 2000 ఫిబవరి నుంచి కేంద్ర ప్రభుత్వం 'కాటన్ టెక్నాలజీ మిషన్'ను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం కోసం కోట్ల రూపాయలను వెచ్చించి, మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచినా నాణ్యతను పరిశీలించే యంత్రాలను వాటిలో ఇప్పటికీ వినియోగించడం లేదు. రైతులు సి.సి.ఐ. అధికారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడవలసిన పరిస్థితులే ఇప్పటికీ రాజ్యమేలుతున్నాయి. వ్యాపారులు తెచ్చే పత్తికి హెచ్చు ధరలు ఇస్తూ రైతులు తెచ్చే పత్తికి మాత్రం తక్కువ ధర చెల్లించడం సి.సి.ఐ.కి పరిపాటిగా మారింది. 'రైతుబంధు' పథకం కింద పత్తి రైతులకు ప్రభుత్వం కొంత సొమ్ము అడ్వాన్సుగా ఇచ్చి, తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముకునే దుస్థితి నుంచి వారిని తప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిన్న, సన్నకారు పత్తి రైతులకు, కౌలు రైతులకు జాతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల నుంచి రుణాలు లభించడం లేదు. దీంతో వారు అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. పర్యవసానంగా రుణభారంతో కుంగిపోతున్నారు. ఇటువంటి రైతులకు 'రైతుమిత్ర' పథకం కింద అవసరమైన మేరకు పరపతి సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. పత్తి నాణ్యతను పెంచడానికి రైతుల్లో అవగాహన కల్పించాలి. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సస్యరక్షణకు సమగ్ర పద్ధతులను అనుసరించవలసిన ఆవశ్యకతపై 'పొలం బడి' కార్యక్రమం ద్వారా వారిలో అవగాహనను పెంపొందించాలి. జన్యు పరివర్తిత (బి.టి.) పత్తిసాగు ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది. అయితే, బి.టి. పత్తి సాగు అయ్యే భూమి చుట్టూ 25 శాతం నాన్-బి.టి. విత్తనం వాడాలన్న నియమాన్ని పాటించడంలేదు. బి.టి. పత్తివల్ల ప్రస్తుతానికి పెద్దగా ఇబ్బందులు ఎదురుకావడంలేదు కానీ, భవిష్యత్తులో అది దుష్ఫలితాలకు దారి తీయబోదన్న పూచీ ఏదీలేదు. బి.టి. పత్తి సాగు కారణంగా సస్యరక్షణకు అయ్యే వ్యయం కొంత తగ్గినమాట నిజమే అయినా

బి.టి. విత్తనాల ధర చైనాలోకంటే మన దేశంలోనే ఇప్పటికీ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో– 'నరసింహ'వంటి రకాలలోకి బి.టి. ప్రవేశపెట్టి, రైతులకు తక్కువ ధరలకు అందించడానికి వ్యవసాయ విశ్వ విద్యాలయాలు కృషిచేయాలి.

## మరింత రుణసాయం

'సాంకేతిక పరిజ్ఞాన ఆధునికీకరణ నిధి' (టెక్నాలజీ ఆఫ్ గ్రేడేషన్ ఫండ్ – 'టఫ్') పథకాన్ని మరో అయిదేళ్లు పొడిగించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పి.చిదంబరం బడ్జెట్‌లో పేర్కొన్నారు. మల్టీ ఫైబర్ అగ్రిమెంట్ కోటా విధానం రద్దు అవుతున్నందున మనదేశం నుంచి కాటన్ దుస్తులు, వస్త్రాల ఎగుమతులు పెరగడానికిగల అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తుంది. పాత జిన్నింగ్, స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులను ఆధునికీకరించడానికి, అధునాతన యంత్రాల సాయంతో కొత్త యూనిట్లను ప్రారంభించడానికి, డైయింగ్ ప్లాంట్లను నెలకొల్పడానికి అవసరమైన నిధులను ఈ పథకం ద్వారా సమకూర్చుకోవచ్చు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి మార్గదర్శక సూత్రాలు జారీ అయ్యేంతవరకు స్పిన్నింగ్, వీవింగ్ యూనిట్లకు బ్యాంకులు రుణాలను మంజూరు చేయరాదని ఉత్తర్వులు వెలువడినట్లు వినికిడి. ప్రభుత్వం ఇలా ఆదేశించడానికిగల కారణాలేమిటో తెలియదు. ఈ ఉత్తర్వులు కొత్త యూనిట్ల స్థాపనకు ప్రతిబంధకంగా పరిణమించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో స్పిన్నింగ్ మిల్లులు పెద్ద సంఖ్యలో ఏర్పాటు కానున్న నేపథ్యంలో – రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, వాటికి బ్యాంకులనుంచి సత్వరం రుణసాయం అందేలా ఉత్తర్వులు జారీ అయ్యేటట్లు కృషి చేయాల్సిన అవసరముంది.

*ది. 02-06-2007.* — *ఈనాడు*

●

# వరి ధాన్యం ధర దైన్యం

వరి ధాన్యానికి మద్దతు ధరను నిర్ణయించడంలో కేంద్రంలోని ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ.) ప్రభుత్వం, వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం తీవ్ర విచక్షణ ధోరణిని కనబరుస్తున్నాయి. ప్రస్తుత సంవత్సరం చివరలో వేసే గోధుమ పంటకు... అంటే 2007-08 రబీ నాటికి మార్కెట్‌లోకి వచ్చే గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.1000 ఇవ్వవచ్చునని వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం ఇటీవల సిఫారసు చేసింది. 2007-08 ఖరీఫ్‌లో అంటే కొద్ది మాసాల్లో మార్కెట్‌కు రాబోతున్న వరి ధాన్యం విషయంలో సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.645 (గ్రేడ్ 'ఎ' రకానికి క్వింటాల్‌కు రూ. 675 చొప్పున ఇవ్వాలని ఆ సంఘం సిఫారసు చేసింది. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం అవే ధరలను నిర్ణయించి ప్రకటించింది. గడచిన రెండేళ్లలో గోధుమలకు క్వింటాల్‌కు వంద రూపాయలను బోనస్‌గా ఇచ్చిన కేంద్రం- వరి ధాన్యానికి ఇంత వరకు బోనస్‌ను ప్రకటించక పోవడం... వరి పండించే రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికే అద్దం పడుతోంది.

## నష్టపోతున్న రైతులు

నిజానికి గోధుమలకంటే వరి పంటకే ఉత్పత్తి ఖర్చు ఎక్కువ అవుతుంది. వరి పంటకు సాగు నీరు కావాలి. ఎరువులకు, సస్యరక్షణకు ఎక్కువ వ్యయం అవుతుంది. గోధుమ పంట కోతకు, నూర్పిడికి యంత్రాలు వాడుతుంటారు. వరి పంటలో ఇప్పటికీ కోత పనిని అధిక భాగం మనుషులతో, నూర్పిడి పనులను ట్రాక్టర్లు, ఎడ్లతో నిర్వహిస్తూ ఉండటంవల్ల సాగు ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. వాస్తవ పరిస్థితి ఇది కాగా గోధుమ పండించే పంజాబ్ హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల ఒత్తిడుల కారణంగా వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం (సి.ఎ.సి.పి.) వరి కన్నా గోధుమ పంట ఉత్పత్తి ఖర్చునే ఎక్కువ చేసి చూపుతుంటుంది. 2005-06లో క్వింటాల్

గోధుమ పంట ఉత్పత్తి వ్యయాన్ని రూ.546గా, క్వింటాల్ వరి ఉత్పత్తి వ్యయం రూ.530గా సి.ఎ.సి.పి. పేర్కొంది. ఆ సంఘం పేర్కొన్న లెక్కల ప్రకారం చూసినా వరికన్నా గోధుమ ఉత్పత్తి వ్యయం కేవలం 16 రూపాయలే ఎక్కువ. అయితే, వరికి క్వింటాల్‌కు రూ. 570, గోధుమకు అదనంగా వంద రూపాయల బోనస్‌నూ ఇచ్చింది. అంటే, క్వింటాల్ గోధుమలకు రూ. 800 లభించగా, వరికి క్వింటాల్‌కు కేవలం రూ. 570 మాత్రమే దక్కింది. ఈ రెండు పంటల ఉత్పత్తి వ్యయంలో క్వింటాల్‌కు పదహారు రూపాయలు మాత్రమే తేడా ఉండగా వాటికి లభించిన మద్దతు ధరల నడుమ 230 రూపాయల వ్యత్యాసం ఉంది. 2006-07లో వరికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 580 కాగా, దానికి అదనంగా రూ. 40 బోనస్‌గా లభించింది. గోధుమ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 750 కాగా, దానికి అదనంగా రూ. 100 బోనస్‌గా లభించింది. అంటే గత సంవత్సరం కూడా వరి కంటే గోధుమలకు రూ. 230 అధికంగా ధర లభించింది. మన రాష్ట్రంలో ఏటా సగటున 120 లక్షల టన్నుల వరి పంట లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం గోధుమతో సమానంగా వరికి ధర ఇవ్వక పోవడంవల్ల మన రాష్ట్రంలో రైతులకు దాదాపు రూ.2760 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఒకవైపు- సాగు ఖర్చులు, ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటేటా పెరిగిపోతున్నాయి. మరోవైపు వ్యవసాయ కార్మికుల ఉత్పాదకత తగ్గుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ధరలు, రైతులకు లాభం చేకూర్చే మాట అటుంచి, కనీసం ఉత్పత్తి వ్యయాన్నైనా వారు తిరిగి రాబట్టుకునేందుకు దోహద పడేలా ఉండటం లేదు. పర్యవసానంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

వరికి ధరను నిర్ణయించడంలో కేంద్రం ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడంలేదు. ఉదాహరణకు 2002-03లో ఆంధ్రప్రదేశ్‌లో వరి ఉత్పత్తి వ్యయం క్వింటాల్‌కు రూ.543.71గా కేంద్ర ధరల నిర్ణాయక సంఘం లెక్కకట్టింది. వరికి రూ. 636 కనీస మద్దతు ధర ఇవ్వాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోరినా, కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 530నే కనీస మద్దతు ధరగా ప్రకటించింది.

2001-02లో కూడా వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.530 కావడం గమనార్హం. అంటే సంవత్సరం గడిచినా వరికి కనీస మద్దతు ధరలో ఏ మాత్రం పెరుగుదల లేదు. కేంద్ర సర్కారు ఈ ఏడాది గోధుమలకు కనీస మద్దతు ధరను

ఒక్కసారిగా పెంచి క్వింటాల్‌కు రూ. 1000 ఇవ్వాలంటోంది. రైతులకు అయ్యే ఖర్చును లెక్కించడానికి సి.ఎ.సి.పి. అనుసరిస్తున్న విధానం వల్ల వారికి సరైన న్యాయం జరగడం లేదని, అందువల్ల ఆ సంఘం లెక్కించే ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతాన్ని కలిపి మద్దతు ధరగా ప్రకటించాలని – ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ తన నివేదికలో ప్రభుత్వానికి సిఫారసు చేసి ఉంది. అందువల్ల వరి ధాన్యానికి కూడా క్వింటాల్‌కు రూ. 1000 కనీస మద్దతు ధరగా ప్రకటిస్తేనే వరిని పండించే రైతులకు న్యాయం జరుగుతుంది. ఖరీఫ్ వరి పంట మార్కెట్‌లోకి రాకమునుపే కనీస మద్దతు ధరపై ఆ మేరకు తన నిర్ణయాన్ని కేంద్రం ప్రకటించకపోతే రైతులకు బదులు మిల్లర్లే లాభపడతారు.

గడచిన కొన్నేళ్లలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ద్వారా దాదాపు ఏ పంటకూ ఉత్పత్తి ఖర్చులు కూడా రాలేదని 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్' (టి.ఐ.ఎస్.ఎస్.) పరిశీలనలో వెల్లడైంది. ఆ సంస్థ వారి లెక్కల ప్రకారం వాస్తవ ఉత్పత్తి వ్యయం కంటే కనీస మద్దతు ధరలు వరి, పత్తి విషయంలో 38 శాతం, పప్పు ధాన్యాలు, గోధుమలకు సంబంధించి 47 శాతం తక్కువగా ఉన్నాయి. అంటే రైతులు దాదాపు అన్ని పంటల విషయంలో 38 నుంచి 50 శాతం మేరకు నష్టపోయారు. చెరకు విషయంలో 12 శాతం మేరకు నష్టపోయారు. 1990-91, 1995-96 మధ్య కాలంలో సగటు టోకు ధరల సూచి ప్రకారం చేసినట్లయితే గోధుమల ధరల్లో పెరుగుదల 58 శాతం ఉండగా, ఎరువుల ధరలు 113 శాతం, పురుగు మందుల ధరలు 90 శాతం పెరిగాయి. ఇవే కాక, విత్తనాలు, డీజిల్, వ్యవసాయ పరికరాల ధరలూ విపరీతంగా పెరిగాయని టి.ఐ.ఎస్.ఎస్. అధ్యయనంలో తేలింది. సాగునీటి సౌకర్యం తగినంత లేకుండానే రైతులు ఎరువులను, పురుగుమందులను ఎక్కువ మోతాదులో వాడటం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిపోవడమే కాక, భూసారం కూడా తగ్గిపోయి, రైతులు రెండువిధాలా నష్టపోతున్నట్లు ఆ సంస్థ తన అధ్యయనంలో పేర్కొంది.

దేశంలో గోధుమలకు క్వింటాల్‌కు రూ. 800 ఇచ్చే ప్రభుత్వం నిరుడు దిగుమతులకు సంబంధించిన ప్రమాణాలను కొంత సడలించి విదేశాలనుంచి 55 లక్షల టన్నుల గోధుమలను క్వింటాల్‌కు రూ. 1,600 చొప్పున ఖర్చు చేసి దిగుమతి చేసుకొంది. ఈ ఏడాది రైతులు ఇంకా గోధుమ పంట వేయనేలేదు. తిరిగి 50 లక్షల టన్నుల

గోధుమలను దిగుమతి చేసుకోవాలని నిర్ణయించి, 10 లక్షల టన్నుల గోధుమల దిగుమతికి ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలిచింది. ఆ వ్యవహారం.... గతంలో పి.వి. నరసింహారావు హయాములో చోటుచేసుకున్న పంచదార దిగుమతి కుంభకోణాన్ని గుర్తుకు తెస్తోంది. ఎన్.డి.ఎ. హయాములో దేశంలో 2002 ఏప్రిల్ నాటికి కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్ద 260 లక్షల టన్నుల గోధుమలు, 250 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉన్నాయి. అటువంటి పరిస్థితి నుంచి మనదేశం ఇప్పుడు పెద్ద యెత్తున ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవలసి రావడంలోని లోగుట్టు పరమాత్మునికే ఎరుక!

ప్రపంచంలో వరి సాగుబడిలో ఇండియాదే ప్రథమ స్థానం. మనదేశంలో నాలుగు కోట్ల 50 లక్షల హెక్టార్లలో వరి సాగుబడి అవుతున్నా- బియ్యం ఉత్పత్తి సుమారు తొమ్మిదో కోట్ల 20 లక్షల టన్నులే. ప్రపంచంలో బియ్యం ఉత్పత్తిలో థాయ్‌లాండ్ వాటా నాలుగు శాతం కాగా, బియ్యం ఎగుమతుల్లో 29 శాతం వాటాతో ఆ దేశం ప్రథమ స్థానంలో ఉంది. చైనా, జపాన్, అమెరికా, ఈజిప్టులలో వరి పంట ఉత్పాదకత హెక్టారుకు ఆరు టన్నులు కాగా, ప్రపంచ సగటు ఉత్పాదకత నాలుగు టన్నులు. రైతులు పండించిన పంటలకు సరైన ధరలను కల్పించడంతో పాటు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరిస్తే - మనదేశం బాసుమతి బియ్యాన్నే కాక, సూపర్ ఫైన్, ఫైన్ రకాల బియ్యాన్ని కూడా ఎగుమతి చేసే అవకాశాలు ఉంటాయి. ఇందుకోసం మనదేశంలో హెక్టారుకు మూడు టన్నులుగా ఉన్న వరి పంట ఉత్పాదకత స్థాయిని అమెరికా తదితర దేశాల్లో మాదిరి ఆరు టన్నులకు కాకపోయినా - కనీసం ప్రపంచ సగటుగా ఉన్న నాలుగు టన్నుల స్థాయికైనా పెంచుకోవలసిన అవసరముంది. భారత్‌కు 2020 నాటికి 37 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరమవుతాయని అంచనా. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఆ లక్ష్యాన్ని మనం చేరుకోవలసి ఉంటుంది. మనదేశ ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలను మనం పండించుకోలేకపోతే, దేశం గడ్డు పరిస్థితుల్లో చిక్కుకుంటుంది. కొనుక్కోవాలనుకుంటే గోధుములు ప్రపంచ మార్కెట్‌లో పెద్ద మొత్తంలో దొరుకుతాయికానీ, బియ్యం లభించవు. ప్రపంచంలో బియ్యం ఉత్పత్తిలో సగం కంటే ఎక్కువ వాటా కలిగి ఉన్నది ఇండియా, చైనాలే. అంతర్జాతీయ మార్కెట్లో బియ్యం వాణిజ్యం సగటున రెండు కోట్ల యాభై లక్షల టన్నుల మేరకు మాత్రమే జరుగుతుంటుంది. చైనా, జపాన్, కొరియా తదితర దేశాల బియ్యం జిగురుగా

ఉంటాయి కాబట్టి ఇక్కడ ప్రజలకు అవి ఉపయోగపడవు. అందువల్ల మన బియ్యం ఉత్పత్తిని మనం బాగా పెంచవలసి ఉంటుంది.

## బోనస్ తప్పనిసరి

పంజాబ్, హర్యానాలలో రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ యార్డులకు తెస్తారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన మార్కెటింగ్ ఫెడరేషన్, పౌరసరఫాల సంస్థ, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌లు ఆ రైతుల నుంచి గోధుమలు లేదా వరి ధాన్యాన్ని కొని, భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.)కి బదిలీ చేస్తాయి. పంజాబ్ బియ్యం నాణ్యత మన బియ్యం నాణ్యత కంటే తక్కువ. మన రాష్ట్రంలో కూడా ఎఫ్.సి.ఐ. నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తే వారికి మేలు చేకూరుతుంది. నవంబరు నుంచి కొన్ని రకాల వరి ధాన్యాలు మార్కెట్‌లోకి రావడం మొదలవుతుంది. కాబట్టి స్వామినాథన్ సిఫారసును దృష్టిలో ఉంచుకొని ఆ లోగానే కేంద్ర ప్రభుత్వం వరికి అదనపు ధరను బోనస్‌గా ప్రకటించాలి.

వరి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని రైతు సంఘాల సమాఖ్య మన ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శరద్ పవార్‌ల దృష్టికి తెచ్చింది. అదనపు ధర రూపేణా వారికి బోనస్ ఇవ్వాల్సిన అవసరముందని కూడా వారికి రైతు సంఘాల సమాఖ్య నొక్కి చెప్పింది. వరికి బోనస్ ఇవ్వాలంటూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కూడా కేంద్రాన్ని కోరారు. బియ్యం ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని రాష్ట్రానికి ఇటీవల వచ్చిన ప్రధాని మన్మోహన్‌సింగ్ రైతులకు పిలుపు ఇచ్చారు. వరికి కూడా బోనస్ ప్రకటించి, వరి రైతులకు న్యాయం చేస్తేనే బియ్యం ఉత్పత్తి పెరుగుతుందన్న వాస్తవాన్ని ప్రధాని గ్రహిస్తారని ఆశిద్దాం.

*ది. 28-09-2007.* *- ఈనాడు*

●

# తీపి మనకు - చేదు తనకు

చెరకు సాగులో గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభం తలెత్తడంతో సాగు విస్తీర్ణం ఈసారి కనిష్ఠస్థాయికి పడిపోయింది. చేతికందని బకాయిలు చెరకు రైతుల ఆర్థిక ఇబ్బందులను మరింత పెంచాయి. మద్దతు ధరల నిర్ణాయక సంఘం (సి.ఎ.సి.పి.), స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా పక్కన పెట్టిన ప్రభుత్వాలు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం అసలు సమస్యగా మారింది. కూలీల కొరత నేపథ్యంలో యాంత్రీకరణ ఆవశ్యకతను గుర్తించడంలోనూ, అందుబాటు ధరల్లో యంత్రపరికరాలను రైతులకు అందజేయడంలోనూ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ఆరంభమైన తరుణంలో – చెరకు రైతుల కష్ట నష్టాలు, వారి ముందున్న సవాళ్లను పరిశీలిద్దాం.

## మద్దతు ధరే పెద్ద సమస్య!

తీపి పండించే రైతు చేదును దిగమింగాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొంది. చెరకు ద్వారా కోట్ల రూపాయల ఆదాయం గడిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు – ఆ రైతులపట్ల వివక్ష ప్రదర్శిస్తున్నాయి. ఫలితమే తాజా సంక్షోభం. సాగు ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయినా, దిగుబడులు పెరగలేదు. 17 జిల్లాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. నిరుడు (2008) రెండు లక్షల 47వేల హెక్టార్లలో చెరకు సాగుకాగా, ఈ ఏడాది లక్షా 45వేల హెక్టార్లకే పరిమితమైంది. దాంతో పంచదార ఉత్పత్తి 180 లక్షల టన్నుల నుంచి ఈ సీజన్‌లో 150 లక్షల టన్నుల దిగువకు పడిపోనుందని అంచనా. టన్నుకు లభించే ధరలో 16 నుంచి 18 శాతం ఉండే రవాణా, కటింగ్ ఖర్చులు ప్రస్తుతం 50 శాతం దాటిపోయాయి. అటు మద్దతు ధర విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి రైతుల్ని అసంతృప్తికి గురి చేసింది. తొమ్మిదిశాతం రికవరీపై టన్నుకు 811 రూపాయల 80 పైసలు ఏ మాత్రం

గిట్టుబాటు కాదని రైతు సంఘాలు ఉద్యమించినా - కేంద్రం వైఖరిలో మార్పు రాలేదు. టన్నుకు రూ. 1,250 గా ఈ ఏడాది ధరను సవరించి, అదనంగా రూ. 300 బోనస్‌గా ఇవ్వాలని సి.ఎ.సి.పి. సిఫార్సు చేసినా - కేంద్రం పట్టించుకోలేదు. ఈ ఏడాదీ అదే ధర కొనసాగుతుందని కేంద్రం ప్రకటించడంతో రైతులోకం నివ్వెరపోయింది. నాలుగేళ్లుగా కేంద్రం గరిష్ఠంగా టన్నుకు 10 రూపాయల చొప్పున మాత్రమే పెంచుతూ వస్తుండటం చెరకు రైతుల దీనస్థితికి నిదర్శనం. చక్కెర మిల్లులు 2006-07లో టన్ను చెరకుకు రూ. 1250 వరకూ రైతులకు ఇవ్వగా 2007-08లో టన్నుకు రూ. 1050 మాత్రమే ఇచ్చి కొనుగోలు చేశాయి. కొన్ని కర్మాగారాలు మాత్రమే టన్నుకు రూ. 1150 చెల్లించాయి. రెండేళ్లుగా మద్దతు ధరలో పెరుగుదల రెండు శాతం మాత్రమే. రైతుల పెట్టుబడులు మాత్రం కొన్ని వందల శాతం పెరిగాయి. సీజన్‌లో పండించే మొక్కజొన్నకు వస్తున్న ధర కూడా ఏడాది మొత్తం పండించిన చెరకుకు రాకపోవటం రైతుల్ని కలచివేస్తోంది. సాగు ఖర్చులు పెరగడంతో ఈ ఏడాది ఎకరానికి 41 వేల రూపాయలు వ్యయం చేయాల్సిరాగా, ఎకరాకు 30 టన్నుల సరాసరి దిగుబడి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రైతుకు కనీసం టన్నుకు రెండు వేల రూపాయల ధర దక్కాలనేది రైతు సంఘాల ప్రధాన డిమాండ్, అటు ధర చెల్లించటంలో గీచి గీచి బేరమాడుతున్న కర్మాగారాలు, న్యాయంగా రైతులకు రావాల్సిన ధరను చెల్లించటంలోనూ విఫలమవుతున్నాయి. గత సీజన్‌లో ప్రభుత్వం కలుగజేసుకొంది. అంతకు ముందు ఇచ్చిన ధరైనా చెల్లించాలని కర్మాగారాలను కోరింది. ముందు ఒప్పుకొన్న కర్మాగారాలు, తరువాత మొండివైఖరిని ప్రదర్శించాయి. దీంతో పలు కర్మాగారాలవద్ద ఆందోళనలు జరిగాయి. కర్మగారాల వైఖరితో విసుగెత్తిన ఎందరో రైతులు ఈ ఏడాది చెరకుసాగు నుంచి వైదొలగారు. పరిస్థితి తీవ్రతను ముందుగా గుర్తించిన పశ్చిమగోదావరి జిల్లా జైపూర్ షుగర్స్ యాజమాన్యం ఈ ఏడాది దిద్దుబాటు చర్యలు చేపట్టింది. టన్నుకు రూ. 1500 ఇస్తున్నట్లుగా ప్రకటించింది. ప్రభుత్వ మద్దతు ధరతో సంబంధం లేకుండా ఇంత ఎక్కువ మొత్తం ఇస్తామని దేశంలోనే తొలిసారిగా ప్రకటించి రైతులకు తీపి కబురు అందించింది. ఈ కర్మాగారం నిర్ణయంతో స్ఫూర్తి పొందిన చెల్లూరు, తాడువాయి, భీమడోలు, తణుకు తదితర మిల్లులూ ఈ ధర ఇస్తామంటూ క్రషింగ్ ప్రారంభించాయి. ఇతర మిల్లులు ముందుకు వచ్చి రూ.1350 నుంచి రూ.1400 వరకూ ప్రకటించడం గమనార్హం. ఇంతచేసినా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి చేసిందేమీ లేదు. కేంద్రం

ఇస్తున్న మద్దతు ధరకు, మన రాష్ట్రం సలహాధర ప్రకటించకపోవడాన్ని చెరకు రైతుసంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికే ఈ ధరకు అదనంగా ఉత్తరప్రదేశ్ (రూ. 588), తమిళనాడు (రూ. 288)లు సలహాధర ప్రకటించి రైతులకు తోడ్పాటు అందించినా మన ప్రభుత్వానికి ఇవేమీ పట్టకపోవడం శోచనీయం.

కూలీల కొరత సమస్యను అధిగమించడానికి యాంత్రీకరణ తప్పనిసరని తేలిపోయింది. ఉపాధి హామీ పనులతో కొరత తీవ్రమైంది. అదనులో పంటకోత పూర్తిచేయలేకపోతే చెరకులో సుక్రోజ్ శాతం, దిగుబడి తగ్గి రైతులకు నష్టం వస్తుంది. కోత సమయంలో యాజమాన్యం కటింగ్ ఆర్డర్‌లో చేస్తున్న జాప్యం, చెల్లింపుల్లో నిర్లక్ష్యం కూడా సాగుపై ప్రతికూల ప్రభావం చూపింది. టన్నుకు ఫ్యాక్టరీలు చెల్లించేది వెయ్యి నుంచి 11 వందల రూపాయలైతే ... దానిలో ఒక్క కోతకే రూ. 300 నుంచి రూ. 500 వరకు ఖర్చవుతోంది. ఎకరా పంట ఉత్పత్తి ఖర్చుల్లో సింహభాగం కోతలకే పోతోంది. దీంతో రైతుకు మిగులు లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రయోగదశలో ఉన్న యాంత్రీకరణలోని లోపాలను అధిగమించి కోత సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాల్సి అవసరముంది. సమస్యలను తట్టుకోలేక రైతులెందరో చెరకు సాగుకు స్వస్తి చెబుతున్నారు. విస్తీర్ణం 40 శాతం పడిపోవడమే ఇందుకు నిదర్శనం. మరికొందరు ప్రత్యామ్నాయ పంటల సాగే శరణ్యమంటున్నారు. రాయలసీమలో వేరుసెనగ, మామిడి, తెలంగాణాలో వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో మొక్కజొన్న, వరి, ఆయిల్ పామ్, ఉత్తరాంధ్రలో సరుగుడు పంటలు వేసుకున్నారు. చెరకు సాగుకు, పరిశ్రమకు తొలి అవాంతరాలు కేంద్రం నుంచే ఎదురవుతున్నాయి. చెరకు ఉప ఉత్పత్తుల తయారీని పెంచే విషయంలోనూ తోడ్పాటు, ప్రోత్సాహం కొరవడుతోంది. బహిరంగ మార్కెట్లో చక్కెర ధరలు పెరిగిన ప్రతిసారీ లాభాలు పోగేసుకుంటున్న పలు మిల్లులు, రైతులకు  మంచి ధరలు ఇచ్చే విషయంలో మాత్రం గింజుకుంటున్నాయి. రైతుకు లాభాల చెల్లింపుల విషయంలో భార్గవ ఫార్ములా వంటి నిర్దిష్ట విధానాలు అమలు కావటం లేదు. దీని ప్రకారం చక్కెర అమ్మకంలో ఫ్యాక్టరీలకు వచ్చే లాభంలో 50 శాతం రైతులకు చెల్లించాలి. కానీ, రాష్ట్రంలో ఒకటి రెండు మినహా ఏ కర్మాగారమూ అయిదేళ్లుగా 'ఎల్-ఫ్యాక్టర్ వ్యాల్యూ'ని రైతులకు చెల్లించలేదు. అటు చక్కెర లెవీ, ఫ్రీ సేల్ విధానంలో మార్పులు తీసుకువచ్చేలా భార్గవ

ఫార్ములాను సవరించాల్సిన అవసరముంది. కేంద్రం వద్ద భారీయెత్తున చెరకు అభివృద్ధి నిధులు ఉన్నప్పటికీ, దాన్ని వినియోగించటంలేదు. కర్మాగారాల లాబీయింగ్‌కు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రే తలొగ్గుతున్నారనే విమర్శలు వచ్చాయి. చెరకు నుంచి ఇథనాల్ తయారీని ముమ్మరం చేయాల్సి ఉండగా, కేంద్రం దీనిపై ఆలోచించటంలేదు. గతేడాది ప్రభుత్వం పంచదార ఎగుమతుల్ని నిషేధించింది. ఆ సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో టన్ను చక్కెర ధర 450 డాలర్లు పలికింది. ఆ సమయంలో ఎగుమతులకు అనుమతించి ఉంటే రైతుకు మంచి ధర లభించి ఉండేది. ఈ ఏడాది ఆరంభంలో ఎగుమతులకు అనుమతి ఇచ్చినా, అంతర్జాతీయ మార్కెట్లో చక్కెర ధర టన్నుకు 350 డాలర్లకు పడిపోయింది. దీంతో నిల్వలు పెరిగి కర్మాగారాలు చెరకు క్రషింగ్‌ను తగ్గించేశాయి. తరువాతి కాలంలో ధరలు పెరిగి కర్మాగారాలు లాభాలు దండుకున్నాయి. అటు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించక పోవడం, ఇటు కొందరు యాజమాన్యాలు నుంచీ ప్రోత్సాహం కరవు కావడంతో రైతుకు భారం పెరిగి సాగును వదిలేస్తున్నారు. ఇప్పటికే దేశంలో వినియోగానికి మించి పంచదార ఉత్పత్తి జరుగుతోంది. పరిశ్రమ మనుగడను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే తప్ప తమకు మరో దారి లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. చెరకుసాగు పడిపోతున్న నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి ముడిసరుకు లభ్యత తగ్గి, కర్మాగారాలకు కష్టాలు తప్పక పోవచ్చు. రైతులకు మంచి ధరలిచ్చి, ఆకర్షించడం వినా మిల్లుల ముందు మరో దారి లేదు.

## ప్రభుత్వ నియంత్రణేదీ?

చెరకు రైతులకు ధరలు గిట్టుబాటు కాని పరిస్థితుల్లో వారు నష్టపోకుండా ప్రభుత్వమే సలహా ధరను ప్రకటించి ఆదుకునే అవకాశం ఉన్నా - మన రాష్ట్రం ఆ పనిచేయడంలేదు. చెరకు సాగు, పంచదార ఉత్పత్తి విషయంలో రాష్ట్రప్రభుత్వానికి నియంత్రణ లోపించడం వల్లనే కర్మాగారాలు రైతుల బాగోగుల్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం క్రషింగ్ సీజన్ ముందు రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను పూర్తిస్థాయిలో నెరవేర్చితే తప్ప రైతులకు న్యాయం జరగదు. లేనిపక్షంలో చెరకు మంత్రిత్వశాఖ మరోసారి విఫలమైనట్లే. చెరకు పరిశ్రమ ఇప్పుడిప్పుడే కొంత మేర కోలుకుంటోంది. గత ఏడాది ఉన్న బఫర్ నిల్వలు తగ్గుతుండగా, ఫ్యాక్టరీలకు వస్తున్న చక్కెర ధర ఆశాజనకంగానే ఉంది. బహిరంగ మార్కెట్లో ధరల పెరుగుదల పేరుతో కేంద్రం

చక్కెరను డంప్ చేసే పద్ధతిని మార్చుకోవాలి. పరిశ్రమలు బహిరంగ మార్కెట్‌లో చక్కెర ధరలు పెంచితే ఆ మేరకు రైతులకూ చెరకు ధరలను పెంచి ఇచ్చేలా చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది. మరోవైపు పంచదార అక్రమ నిల్వలు, హోల్‌సేల్ ధరల పెంపుతో వినియోగదారులకు భారంగానే మారుతోంది. ఈ సీజన్‌లోనూ తగ్గిన సాగు విస్తీర్ణం కారణంగా చక్కెర ఉత్పత్తి తగ్గనుంది. సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చెరకు రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వడమే సరైన పరిష్కారం. మద్దతు ధర ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడకపోతే చక్కెర పరిశ్రమ భారీగా నష్టపోతుందని గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల సాగుకు మరలిపోతున్న రైతుల్ని తిరిగి చెరకు సాగు దిశగా కదిలించాలంటే ప్రభుత్వం, చక్కెర మిల్లుల వారు చర్చించుకుని భారీ ప్రోత్సాహకాలు కల్పించాల్సిన అవసరముందని రైతులంటున్నారు. ఈ విషయంలో చెరకు రైతుల కోసం ప్రభుత్వం ఎంత వరకు చిత్త శుద్ధితో కృషి చేస్తుందన్న దానిపైనే అన్నదాతల సంక్షేమం ఆధారపడి ఉంటుంది.

*ది. 01-02-2008.* — *ఈనాడు*

●

# చెరకు రైతుకు చేదు మాత్ర

చెరకు రైతును కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కొత్త చక్కెర సీజను ప్రారంభమై నెల రోజులవుతున్నా, వ్యవసాయ ధరల కమిషన్ సూచనల ప్రకారం చెరకు పంటకు చట్టబద్ధ కనీస మద్దతు ధర ప్రకటించలేదు. ఆ దిశగా కనీస చర్యలైనా తీసుకోకపోవడం కేంద్ర పాలకుల బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ. నిరుడు క్వింటాలుకు రూ. 81.18 ధరను తొమ్మిది శాతం రికవరీ వద్ద నిర్ణయించి రైతుల ప్రయోజనాలను కేంద్రం దెబ్బతీసింది. దశాబ్దాలుగా అమలు చేస్తున్న 8.5 శాతం వద్ద రికవరీ విధానాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్ పవార్ తొమ్మిది శాతానికి పెంచారు. ఫలితంగా చక్కెర కర్మాగారానికి పంపుతున్న ప్రతీ టన్ను చెరకుపై రైతులు రూ. 45 నష్టపోయారు. ఆ మేరకు కర్మాగార యజమానులు లాభాలు దండుకుంటున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా చెరకు పంట అత్యంత ప్రాధాన్యంగల ఆహార, ఇంధన వనరుగా రూపొందుతుంటే - మనదేశంలో పండించే రైతు దిగాలుపడుతున్నాడు.

## కొరవడిన ప్రభుత్వ చొరవ

మనదేశంలో నిరుడు 3405.60 లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి అయింది. ఇందులో 2811 లక్షల టన్నులను చక్కెర కర్మాగారాలకు, మిగిలినది ఖండసారి బెల్లం తయారీకి వినియోగించారు. శరద్ పవార్ నిర్ణయంతో రైతులు గత సీజనులో రూ. 1,265 కోట్లను నష్టపోగా, మూడేళ్లలో రూ. 3,500 కోట్లను కోల్పోయారు. చక్కెర కర్మాగార యజమానుల లాబీకి పవార్ చేసిన మేలు ఇది! డీజిల్, ఎరువుల ధరలు, కూలీల చెల్లింపులు బాగా పెరిగి పోవడంతో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కోత కూలీలు దొరకడం లేదు. కష్టాల పాలవుతున్న రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిరుటి (2008) క్వింటాలు ధర రూ. 81.18నే ఈ సీజనుకూ వర్తింపజేస్తానంటోంది. ఇది రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ

పరిస్థితులు రైతును చెరకు సాగుకు దూరం చేస్తున్నాయి. 17.5 శాతం మేరసాగు విస్తీర్ణం తగ్గిపోయిందని, ఇది ఉందని నిపుణులు వాపోతున్నారు. పంచదార ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని, ఇది ఇంకా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు వాపోతున్నారు. 2006-07 సీజన్‌లో పంచదార ఉత్పత్తి 283 లక్షల టన్నులు ఉండగా, అది 2007-08 సీజన్‌లో 264 లక్షల టన్నులకు దిగుజారవచ్చని అంచనా! మరోవైపు పంచదార వినియోగం పెరుగుతోంది. నిరుడు (2007) 218 లక్షల టన్నుల పంచదారను దేశీయంగా వినియోగించగా - 45 లక్షల టన్నులను విదేశాలకు ఎగుమతి చేశారు. ఈ సీజను 85 లక్షల టన్నుల ప్రారంభ నిల్వతో మొదలైంది. ఈ సరైన చట్టబద్ధ కనీసధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించి చెరకు సాగును ప్రోత్సహించని పక్షంలో - విదేశాల నుంచి పంచదార దిగుమతులు తప్పని దుస్థితి దాపురిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పంటల ఉత్పత్తి వ్యయానికి యాభై శాతాన్ని కలిపి మద్దతు ధర ప్రకటించాలని డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ కమిటీ కేంద్రానికి సూచించింది. దాని ప్రకారం డాక్టర్ మహేంద్రదేవ్ అధ్యక్షతన వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం (సి.ఎ.సి.పి.) టన్నుకు రూ. 1,250 చట్టబద్ధ కనీస ధర (ఎస్.ఎం.పి.) ప్రకటించాలని నాలుగు నెలల క్రితమే సిఫార్సు చేసింది. కేంద్రంలో ఉలుకూ పలుకూ లేదు. చెరకు రైతుకు తగిన మద్దతు ధర విషయంలో పవార్ నోరు మెదపడం లేదు. చక్కెర కర్మాగారాల యజమానుల ప్రయోజనాల కోసమే ఆయన పాటు పడుతున్నారని రైతులు గట్టిగా అనుమానిస్తున్నారు. మహారాష్ట్రలో సహకార చక్కెర కర్మాగారాల యాజమాన్యాలే పంట కోత, కర్మాగారాలకు చెరకు తరలింపు చర్యలను చేపడతాయి. మహారాష్ట్ర రైతుకు లభించే ఈ ఊరట ఇతర ప్రాంతాల రైతులకు ఉండదు. అందుకే ఇతర ప్రాంతాల రైతులు ఈ ఇబ్బందులకు తాళలేక చెరకు సాగుకే స్వస్తి చెబుతున్నారు. పెద్దగా పెట్టుబడి అవసరంలేని, రాబడి ఎక్కువగా ఉన్న సుబాబుల్ సాగువైపు దృష్టి సారిస్తున్నారు. దేశీయ విపణిలో పెరుగుతున్న పంచదార ధరలు సైతం చెరకు సాగువైపు రైతులను ఆకర్షించలేకపోతున్నాయి. పంచదార ధరలు వ్యాపారులకే లాభాలను ఆర్జించి పెడుతున్నాయి. దేశంలో వినియోగిస్తున్న పంచదారలో ప్రజలు నేరుగా కొనుగోలు చేసి వాడుతున్నది 25 శాతం మాత్రమే. తీపి తినుబండారాల వర్తకులు 55 శాతాన్ని వాడుతుండగా - పానీయాల సంస్థలు, బిస్కట్ల

కంపెనీలు 20 శాతాన్ని వినియోగిస్తున్నాయి. పంచదార ధర పెరిగిందంటూ ఈ ఉత్పత్తుల రేటును పెంచి వినియోగదారునిపై భారం మోపుతున్న సంస్థలు - ధర తగ్గినప్పుడు ఉత్పత్తుల రేట్లు తగ్గించడం లేదు.

చెరకు ఉప ఉత్పత్తుల ద్వారా కర్మాగారాల యాజమాన్యాలు అదనపు లాభాలు జుర్రుకుంటున్నాయి. ఫిల్టర్ మట్టితో, మడ్డిని ఉపయోగించి జీవ ఎరువులను, మొలాసిస్ నుంచి ఇథనాల్‌ను తయారు చేస్తున్నాయి. ఆల్కహాల్‌కు, చెరకు పిప్పికీ మంచి ధరలే లభిస్తున్నాయి. ఈ ఉప ఉత్పత్తుల లాభంలో కొంత భాగం చెరకు రైతులకు చెందేలా భార్గవ సూత్రానికి తగు సవరణలు తీసుకురావాలి. చక్కెర యాజమాన్యాల బాంధవునిగా పనిచేస్తున్న కేంద్రమంత్రి శరద్ పవార్ ఇందుకు సంకల్పిస్తారా అన్నది అనుమానమే! ఎన్.డి.ఎ. ప్రభుత్వ హయాములో అయిదు శాతం ఇథనాల్‌ను పెట్రోలులో కలపాలని నిర్ణయించారు. ప్రస్తుత యు.పి.ఎ. ప్రభుత్వం దాన్ని పది శాతానికి పెంచింది. అక్టోబరు నెలనుంచి నిర్ణయాన్ని అమలు చేస్తామని ప్రకటించి వెనకడుగు వేసింది. ఆటోమొబైల్ పరిశ్రమల ఒత్తిడే దీనికి కారణమంటున్నారు.

అంతర్జాతీయ విపణిలో చెరకు పంటకు ప్రాధాన్యం పెరుగుతోంది. చెరకు ఉత్పత్తిలో బ్రెజిల్ అగ్రగామి. అక్కడ మొలాసిస్, చెరకు రసాల నుంచి ఇథనాల్ తయారు చేస్తున్నారు. చెరకు ఉత్పత్తిలో యాభై శాతాన్ని ఇథనాల్ తయారీకి మళ్లిస్తున్నారు. పెట్రోల్లో 24 శాతం ఇంధనాన్ని కలపడానికి ప్రభుత్వం అనుమతిస్తోంది. అమెరికా, ఐరోపా ప్రభృత దేశాల్లో ఇథనాల్ తదితర జీవ ఇంధనాలు తయారు చేస్తున్నారు. మొక్కజొన్న, సోయాబీన్, పామాయిల్, ఆవనూనె, తీపిజొన్న వంటి ఆహారపంటల్ని జీవ ఇంధనాల తయారీకి వినియోగిస్తున్నారు. ఆహార పంటల్ని ఇంధన అవసరాలకోసం మళ్లించడం సమంజసం కాదు. కానీ, ఈ దేశాలతో పోలిస్తే మనదేశంలో పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవి. చెరకు సాగును గణనీయంగా పెంచుకోగల అవకాశాలు మనకు ఉన్నాయి. మోయలేని భారంగా తయారవుతున్న చమురు బిల్లు తగ్గించుకోవడానికి ఇదో ప్రత్యామ్నాయం. చెరకు నుంచి ఇథనాల్ తయారీని ప్రభుత్వం ప్రోత్సహించాలి. సరైన ధర ఇచ్చి - పన్నులు, సుంకాల్లో రాయితీలను అందజేస్తే పెట్రోలుకన్నా చౌకయిన ఇథనాల్ దేశ ఇంధన అవసరాలకు అక్కరకు వస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు తరవాతకానీ ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి, మోటారు వాహనాల్లో గ్యాస్ వాడకానికి

ప్రభుత్వం ముందుకు కదలలేదు. ముందుచూపుతో కాక, గత్యంతరంలేని పరిస్థితుల్లోనే ప్రభుత్వాలు స్పందిస్తుండటం జాతి దురదృష్టం.

చెరకు సాగును ఇతోధికంగా పెంచి రైతుకు లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం చొరవ చూపాలి. ఇథనాల్ తయారీపై బ్రెజిల్ దృష్టి పెంచడంతో అంతర్జాతీయంగా రెండేళ్లలో పంచదారకు మంచి గిరాకీ లభించబోతోందని నిపుణులు చెబుతున్నారు. ఇథనాల్ వనరుగా చెరకు మారిపోవడంతో పంచదార ఉత్పత్తి తగ్గుముఖం పడుతోంది. దేశీయ విపణిలో సైతం కొద్ది నెలల క్రితం కిలో పద్నాలుగు రూపాయలున్న పంచదార తాజాగా ఇరవై రూపాయలు ధర పలుకుతోంది. మనదేశంలోనూ చక్కెర కర్మాగారాలు ఇథనాల్, విద్యుదుత్పత్తి, జీవ ఎరువుల తయారీ వైపు దృష్టి సారిస్తున్నాయి. అదనపు లాభాలు సంపాదిస్తున్నాయి. ఆ ఫలాలను రైతులకు అందజేయడానికి యాజమాన్యాలు చొరవ ప్రదర్శించాలి. జీవ ఎరువులను రైతులకు అందజేస్తే వారి భూముల్లో సారం పెరిగి దిగుబడులూ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. అలాగే కర్మాగారాలకు సమీపంలోని థర్మల్ స్టేషన్ల నుంచి వచ్చే వ్యర్థపదార్థం బూడిదను భూసారాన్ని పెంచేందుకు వీలుగా పొలాలకు తరలించాలి. ఈ వ్యయాన్ని యాజమాన్యాలు, రైతులు 3:1 నిష్పత్తిలో భరించాలి.

## కనీస మద్దతు పెరగాలి

అంతర్జాతీయ పంచదార రంగంలో పెను పరిణామాలు సంభవించబోతున్నాయి. భారత్‌కు అన్ని రంగాల్లో పోటీగా వస్తున్న చైనా రోజుకు 35 వేల టన్నుల చెరకును ఆడగల 37 కర్మాగారాల్ని నెలకొల్పుతోంది. ఐరోపా దేశాల పంచదార విపణిపై కన్నేసింది. చైనాకు దీటుగా మనమూ పోటీలో నిలబడాలంటే - కేంద్ర ప్రభుత్వం చెరకు సాగుపై నిర్లిప్త ధోరణిని తక్షణం విడిచిపెట్టాలి. 8.5 శాతం రికవరీ వద్ద టన్నుకు రూ. 1250 చట్టబద్ధ కనీస ధరను తక్షణం ప్రకటించాలి. వరి తరువాత చెరకు పంటను సాగుచేయడానికి రైతులను ప్రోత్సహించాలి. బ్రెజిల్‌లో మాదిరిగానే పంటసాగు వ్యయాన్ని సగానికి కుదించడానికి మార్గాలు అన్వేషించాలి. చెరకు నాటు యంత్రాలు, కోత యంత్రాలను కర్మాగారాల యాజమాన్యాలు కొనుగోలు చేసి వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. చైనా, కొరియా, బ్రెజిల్‌ల నుంచి ఈ యంత్రాల్ని దిగుమతి చేసుకునే పరిస్థితులు పోవాలి. రైతులు, కర్మాగారాల యజమానుల

ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరేలా పరస్పర ఆమోదయోగ్యమైన విధానాల్ని రూపొందించాలి. పంచదార, ఇథనాల్, ఆల్కహాల్, విద్యుదుత్పత్తి జీవ ఎరువుల సాధనంగా చెరకుపంటకు ఉన్న బహుళ ప్రయోజనాల గురించి రైతుల్లో అవగాహన పెంచాలి. తద్వారా చెరకు సాగువైపు రైతుల దృష్టి మరల్చాలి. బహుళ ప్రయోజన కారిగా చెరకు పంట అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకుంటున్నవేళ- ప్రభుత్వమూ చురుగ్గా వ్యవహరిస్తే దేశంలో పంచదార పంట తీపి లాభాలు పంచుతుంది!

*ది. 31-10-2008.* - ***ఈనాడు***

●

# చెరకు రైతుకు చేదు బహుమతి

దేశంలో చెరకు రైతు పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతోంది. చక్కెర కర్మాగారాల యజమానుల మీద కనబరుస్తున్న ప్రేమలో ఏ కొంచెమైనా ప్రభుత్వం రైతులమీద చూపించి ఉంటే ఈ దురవస్థ తలెత్తేది కాదు. 1962 నాటి చెరకు నియంత్రణ ఉత్తర్వులకు, 1955 నాటి నిత్యావసర వస్తువుల చట్టంలోని కొన్ని అంశాలకు సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. నాలుగున్నర కోట్ల చెరకు రైతుల ఆశలపై నీళ్ళు చల్లిన ఉత్తర్వు ఇది. ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ.) సర్కారుకు చక్కెర కర్మాగారాల యాజమానులపై ఉన్న అపార అభిమానానికి నిదర్శనం ఈ నిర్ణయం.

## ధర దక్కక దైన్యం

చెరకు నియంత్రణ ఉత్తర్వుల ద్వారా పంచదార చెరకు చట్టబద్ధ కనీసధర (ఎస్.ఎం.ఐ.)ను కేంద్ర సర్కారు నిర్ణయించాలి. గడచిన రెండేళ్లుగా కేంద్రం సరైన గిట్టుబాటు ధరను నిర్ణయించనందువల్ల చెరకు సాగు విస్తీర్ణం 130 లక్షల ఎకరాల నుంచి 105 లక్షల ఎకరాలకు పడిపోయింది. రెండు సంవత్సరాల క్రితం 50 లక్షల టన్నుల చక్కెరను ఎగుమతి చేసిన మనదేశం ఈ ఏడాది 55 లక్షల టన్నుల పంచదారను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. బహిరంగ విపణిలో పంచదార ధర పెరుగుతోంది. మహారాష్ట్ర, హర్యానా, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఎన్నికల దృష్ట్యా కొన్ని నెలలుగా లెవీ పంచదారతో పాటు 'ఫ్రీ సేల్' చక్కెరను కూడా అధిక పరిమాణంలో మార్కెట్లోకి విడుదల చేశారు. ఫలితంగా ఆకాశాన్నంటడానికి సిద్ధంగా ఉన్న చక్కెర ధరలు కొంతమేర శాంతించినట్లు కనిపించాయి. అంతర్జాతీయ మార్కెట్లోనూ చక్కెర ధరలు గడచిన రెండు దశాబ్దాల్లో ఏనాడూ లేని స్థాయికి చేరాయి. తెల్లపంచదార ధర టన్ను సుమారు

రూ. 30,000 పలుకుతోంది. ప్రపంచంలో అత్యధికంగా పంచదార తయారయ్యే బ్రెజిల్‌లో అధిక వర్షాల కారణంగా ఈసారి ఉత్పత్తి తగ్గింది. అమెరికా, మెక్సికోల్లోనూ ఇదే పరిస్థితి. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల మేరకు తమ దేశాలలో ఉత్పత్తి అయ్యే 'బీట్' పంచదార చెరకు గ్యారంటీ ధరలో ఐరోపా సమాఖ్య (ఇ.యు.) 36 శాతం మేర కోత పెట్టింది. పర్యవసానంగా ఇ.యు.లో సైతం పంచదార ఉత్పత్తి తగ్గింది. ప్రపంచ వ్యాప్తంగా 2010-11 వరకూ పంచదార గిరాకీ, సరఫరాల మధ్య పెద్ద అంతరమే ఉంటుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే కేంద్రప్రభుత్వం అక్టోబరు 22నాటి ఆర్డినెన్సు ద్వారా ఇప్పటి వరకు ఉన్న చట్టబద్ధ కనీస ధర స్థానంలో క్వింటాలు చెరకునకు 9.5 శాతం రికవరీ వద్ద రూ. 129.84 సరసమైన గిట్టుబాటు ధర (ఎఫ్.ఆర్.పి.)ను ప్రకటించింది. రైతుల గిట్టుబాటునూ, మార్కెట్లో పంచదార ధరనూ దృష్టిలో ఉంచుకొని ఎఫ్.ఆర్.పి.ని. ప్రకటించినట్లు కేంద్రం సెలవిచ్చింది. నేతి బీరకాయలో నెయ్యి ఎంతో కేంద్ర ప్రకటనలోనూ అంతే నిజం ఉంది. కేంద్ర వ్యవసాయ ధరల సంఘం- 2008-09లో క్వింటాలు చెరకునకు రూ. 125 ధర చెల్లించాలని ప్రతి అదనపు టన్నుకు రూ. 300 బోనసుగా ఇవ్వాలని సిఫార్సు చేసింది. కానీ, సిఫార్సును కేంద్రం పట్టించుకోలేదు. 2007-08 నాటి కనీస ధరలనే 2008-09కీ వర్తింపజేయడం ద్వారా ధరల నిర్ణయ విధానాన్నే అపహాస్యం చేసింది. ఫలితంగా చెరకుసాగు విస్తీర్ణం తగ్గి పంచదార ఉత్పత్తి కాగా, 2008-09 నాటికి అది 145 లక్షల టన్నులకు తగ్గిపోయింది. విదేశాలనుంచి 55 లక్షల టన్నుల పంచదారను దిగుమతి చేసుకోవాల్సిన దురవస్థ తలెత్తింది. 2009-10లో సైతం దేశంలో పంచదార ఉత్పత్తి 155 లక్షల టన్నులకు కొంచెం అటు ఇటుగా ఉండవచ్చునని అంచనా. దేశ ప్రజల అవసరాలు తీరాలంటే 225 లక్షల టన్నుల పంచదార కావాలి. అంటే, ఈ ఏడాదీ 50 లక్షల టన్నులకు పైగా పంచదారను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందేనన్నమాట. ఇన్ని తెలిసీ క్వింటాలుకు రూ. 12.84ని సరసమైన గిట్టుబాటు ధరగా నిర్ణయించడం ఏ రకంగా సమంజసం? ఎట్లా ధర్మసమ్మతం? 2008-09లో టన్ను చెరకుకు రైతులకు సుమారు రూ.1500 ధర చెల్లించి చక్కెర కర్మాగారాలు కొనుగోలు చేశాయి. క్వింటాల్ చక్కెర తయారీ వ్యయం రూ. 375 నుంచి రూ. 450 మధ్య ఉంటుంది. మొలాసెస్,

బగాస్‌పిప్పి, ఫిల్టర్ మట్టి, సేంద్రీయ ఎరువులు వంటి ఉప ఉత్పత్తుల రూపంలో టన్ను చెరకునకుగాను- కర్మాగారాలకు ఇంచుమించు వెయ్యి రూపాయల ఆదాయం చేకూరుతుంది. 2008-09లో పంచదారను గరిష్ఠ ధరలకు విక్రయించి చక్కెర కర్మాగారాలు అధిక లాభాలు ఆర్జించాయి. కేంద్రం ప్రస్తుతం ప్రకటించిన ధరలను బట్టి - రైతులకు నిరుటి (2008) పరిస్థితే పునరావృతమయ్యే పరిస్థితి ఉంది.

ఆర్డినెన్సు రూపంలో చెరకు రైతులను కేంద్రం మరో రకంగానూ దెబ్బ తీసింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే సలహాధర (ఎస్.ఎ.పి.) విధానాన్ని ఈ ఆర్డినెన్సు నీరు గార్చింది. కేంద్రం ప్రకటించేది కనీస ధర కాబట్టి చెరకు సాగును ప్రోత్సహించి, రైతుల గిట్టుబాటుకోసం ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలు సలహా ధరను ప్రకటిస్తుంటాయి. చెరకు రైతు సంఘాలతో కర్మాగారాల యాజమాన్యాలు చర్చలు జరిపిన మీదట సలహా ధర నిర్ణయమవుతుంటుంది. సర్వోన్నత న్యాయస్థాన రాజ్యాంగ ధర్మాసనం మే 5, 2004న ఈ విధానం సక్రమమైనదేనని తీర్పు వెలువరించింది. కేంద్ర ఆర్డినెన్సు ఈ వ్యవహారాన్ని తల్లక్రిందులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల సలహా ధరకు, కేంద్రం ప్రకటించిన సరసమైన గిట్టుబాటు ధరకు మధ్య ఉండే వ్యత్యాసాన్ని రాష్ట్ర సర్కార్లే రైతులకు చెల్లించాలని పేర్కొంది. రాష్ట్ర సలహాధరను ఇప్పటివరకూ ప్రైవేటు కర్మాగారాల యాజమాన్యాలే చెల్లిస్తూ వచ్చాయి. ప్రభుత్వ, సహకార కర్మాగారాల్లో రాష్ట్రప్రభుత్వమే బాధ్యత తీసుకొని రైతులకు సలహాధర అందే ఏర్పాటు చేస్తుంది. రైతులకు సలహా ధరను చెల్లించాల్సిన బాధ్యతనుంచి ప్రైవేటు కర్మాగారాలను కేంద్ర ఆర్డినెన్స్ మినహాయిస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉన్న పక్షంలో రైతులకు సలహాధర లభించదు. చెరకు రకాన్ని బట్టి ఉత్తరప్రదేశ్ సర్కారు క్వింటాలుకు రూ. 162.50 నుంచి రూ. 170.00, పంజాబ్, హర్యానాలు రూ.170 నుంచి రూ. 180; తమిళనాడు రూ. 143.24 గా సలహా ధరను నిర్ణయించాయి. సలహా, కనీస ధరల మధ్య ఉన్న వ్యత్యాసాలను, రాష్ట్ర సర్కార్లే చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర నిర్ణయం రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది.

చెరకు నియంత్రణ ఉత్తర్వుల్లోని 5ఎ క్లాజును మార్చి అందులోని 'భార్గవా సూత్రాన్ని' తొలగించడం రైతుల ప్రయోజనాలను దెబ్బకొడుతున్న మరో కీలకాంశం. చక్కెర కర్మాగారాలకు ఒనగూడే అదనపు లాభాల్లో రైతులకు సగభాగం అందజేయాలన్న

నిబంధనను తీసివేయడం రైతులకు పిడుగుపాటు వంటి వార్తే. ఏడో దశకంలో చెరకు సాగుకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో సంక్షోభం తలెత్తింది. అప్పుడు దేశవ్యాప్తంగా రైతు సంఘాలు ఆందోళన ప్రదర్శనలు నిర్వహించాయి. ఆ నేపథ్యంలో కేంద్రంతో చర్చల పర్యవసానంగానే 'భార్గవా ఫార్ములా' అమల్లోకి వచ్చింది. తయారైన పంచదారలో 65 శాతాన్ని కర్మాగారాలు లెవీ కింద ఇచ్చి, మిగిలిన 35 శాతాన్ని 'ఫ్రీ సేల్' చేసుకునేందుకు అప్పట్లో వీలుండేది. కాలక్రమంలో లెవీకోటాను 10 శాతానికి తగ్గించారు. 90 శాతం 'ఫ్రీ సేల్' నిబంధనను తీసుకువచ్చారు. నిజానికి భార్గవా ఫార్ములాలో మార్పులు చేసి కర్మాగారాల అదనపు లాభంలో రైతులకు సగానికి మించి అందే ఏర్పాటు చేయాలని రైతు సంఘాలు కేంద్రాన్ని ఎప్పటినుంచో కోరుతున్నాయి. కానీ, ఆర్డినెన్స్ ద్వారా 'భార్గవా సూత్రానికి' మొత్తంగా చరమగీతం పాడటం దారుణం. ఈ నిబంధన కింద గడచిన నాలుగేళ్ళుగా రైతులకు ఇవ్వాల్సిన వందలకోట్ల రూపాయలను ఫ్యాక్టరీ యాజమాన్యాలు 'వర్కింగ్ కేపిటల్'గా ఉపయోగించుకుంటున్నాయి. జాతీయ లెవీ ధరకు సంబంధించిన వ్యవహారంలో మిల్లర్ల లాబీతో కుమ్మక్కై సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తున్నారు. తద్వారా రైతులు పెద్ద యెత్తున నష్టపోతున్నారు.

భార్గవా సూత్రీకరణ రద్దు 1974 నుంచి అమల్లోకి వచ్చినట్లు పరిగణించాలనడం మరో దుర్మార్గం. దీని పర్యవసానం ఏమిటంటే – 21 అక్టోబరు 2009 వరకు భార్గవా సూత్రీకరణ కింద కర్మగారాల నుంచి రైతులకు రావలసిన బకాయిలకు మొత్తంగా మంగళం పాడినట్లే. అంటే ఆ డబ్బంతా మిల్లు యాజమాన్యాలకు మరలినట్లే! దేశవ్యాప్తంగా నాలుగున్నర కోట్ల చెరకు రైతుల పొట్టకొట్టి చక్కెర మిల్లు యజమానులు బొజ్జలు నింపేందుకు కేంద్రసర్కారు ఒడిగట్టడం హేయం.

ఎన్నికల తరువాత రైతులకు యు.పి.ఎ. ప్రభుత్వం అందించిన 'తీపి బహుమతి' ఆ ఆర్డినెన్స్. ఎన్నికలకు ముందు చక్కెర మిల్లర్లనుంచి కేంద్రం భారీగా నిధులు సేకరించింది. ప్రతిగా వారి గొంతెమ్మ కోరికలన్నింటికీ తలూపింది. పంచదార దిగుమతులపై ఐరోపాలో 300 శాతం, మెక్సికోలో 170 శాతం, థాయ్‌లాండ్‌లో 100 శాతం, బ్రెజిల్‌లో 55 శాతం మేర దిగుమతి సుంకం విధిస్తున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థతో మన ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం – చక్కెర దిగుమతులపై

150 శాతం వరకు సుంకం విధించే వీలు ఉంది. అందుకు భిన్నంగా 55 లక్షల టన్నుల పంచదారను 'జీరో డ్యూటీ'తో దిగుమతి చేసుకొని దేశ రైతన్నల ప్రయోజనాలను సర్కారు దెబ్బతీసింది.

## ఉపసంహరణకు ఉద్యమం

ఎదురు దెబ్బలు వరుసగా తగులుతున్న ఈ నేపథ్యంలోనే - ఉత్తరప్రదేశ్ చెరకు రైతులు ప్రముఖ రైతునాయకుడు మహేందర్ సింగ్ తికాయత్ నేతృత్వంలో పోరు బాట పట్టారు. టన్నుకు రూ.2800 ధర చెల్లిస్తే తప్ప చెరకు సరఫరా చేయబోమని వారు తెగేసి చెప్పారు. ఏడో దశకంలో దేశ వ్యాప్తంగా చెరకు రైతు సంఘాలన్నీ ఏకతాటిపై నిలిచి ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడాయి. కేంద్రం తమ నెత్తిన మోపిన దుర్మార్గమైన ఆర్డినెన్సును ఉపసంహరించుకునేలా చేసేందుకు దేశంలోని చెరకు రైతులు ఇప్పుడూ అదే తరహా ఉద్యమస్ఫూర్తిని కనబరుస్తున్నారు. చెరకు కోతకు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే 'షుగర్‌కేన్ హార్వెస్టర్' యంత్రాల మీద దిగుమతి సుంకాన్ని ఎత్తి వేస్తే చెరకు సాగువిస్తీర్ణం పెరుగుతుంది. పంచదార ఉత్పత్తి ఇనుమడిస్తుంది. తద్వారా చక్కెర దిగుమతులనూ తగ్గించవచ్చు. కేంద్రం జారీచేసిన ఆర్డినెన్స్ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో చట్టం రూపు దాల్చే అవకాశాలు కొట్టిపారేయలేనివి. అదే జరిగితే చెరకు రైతుకు కోలుకోలేని దెబ్బతగులుతుంది. రైతు శ్రేయంకోరే వర్గాలన్నీ ఈ పరిణామాలను వ్యతిరేకించచక తప్పదు.

*ది. 09-11-2009.* - ***ఈనాడు***

●

# రైతుల్ని కొట్టి, మిల్లులకు పెట్టి...

లెవీ చక్కెర ధరను నిర్ణయిస్తున్న విధానం సక్రమంగా లేదంటూ నిరుడు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో నిత్యావసర వస్తువుల చట్టాన్ని, చెరకు నియంత్రణ ఉత్తర్వును సవరిస్తూ కేంద్రప్రభుత్వం ఇటీవల ఆర్డినెన్సులు జారీ చేసింది. ఆ క్రమంలో కేంద్రం ఇంతకుముందు తాను చేసిన పొరపాటును సరిదిద్దుకోవడానికి బదులు మరింత పెద్ద తప్పిదానికి పాల్పడింది. నిజానికి నిత్యావసర వస్తువుల చట్టం మూడో సెక్షన్‌లోని సబ్ సెక్షన్ (3-సి) ప్రకారం చక్కెర ఫ్యాక్టరీల నుంచి కొంతభాగం పంచదారను లెవీగా సేకరించే అధికారం కేంద్ర సర్కారుకు ఉంది. అలా సేకరించగా మిగిలిన భాగాన్ని స్వేచ్ఛా విపణిలో విక్రయించవచ్చు. లెవీగా సేకరించే పంచదారకు ధరను కేంద్రం నిర్ణయిస్తుంది. సెక్షన్ 3 (3-సి) ప్రకారం చెరకుకు కేంద్రం నిర్ణయించే కనీస ధర; చక్కెర ఉత్పత్తికి అయ్యే వ్యయం; ఎక్సైజ్ సుంకం లేదా చెల్లించిన / చెల్లించవలసిన పన్ను; పంచదార తయారీకి అయిన మొత్తం ఖర్చుపై సముచిత ఆదాయంవంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం లెవీ పంచదార ధరను నిర్ణయించవలసి ఉంటుంది. అయితే, చాలాకాలం నుంచి కేంద్ర సర్కారు కేవలం కనీస మద్దతు ధరను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ లెవీ పంచదార ధరను నిర్ణయిస్తూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే సలహా ధర, చెరకు నియంత్రణ ఉత్తర్వులోని క్లాజ్-5 ఎ (భార్గవ సూత్రం) ప్రకారం రావలసిన అదనపు ధర కూడా.. పంచదార ఉత్పత్తి వ్యయం పరిధిలోకే వస్తాయి.

## కర్షకునికే కష్టకాలం

రైతుల నుంచి చెరకును చక్కెర ఫ్యాక్టరీలు ఎంత ధరకు కొనుగోలు చేశాయన్నది ప్రధానం. దాని ఆధారంగానే లెవీ పంచదారకు ధరను లెక్కకట్టవలసి ఉంటుంది. కానీ, అలా జరగడం లేదు. లెవీ పంచదారకు ధరను నిర్ణయించేటప్పుడు చెరకు

కనీస ధరతోపాటు, రాష్ట్రప్రభుత్వ సలహా ధరను, భార్గవ సూత్రం ప్రకారం రావలసిన అదనపు ధర, చక్కెర తయారీ వ్యయంపై సహేతుక రాబడి వంటి అంశాలనూ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు నిరుడు (2008) తీర్పిచ్చింది. ఆ తీర్పు ప్రకారం కేంద్ర ప్రభుత్వం- తాను ఇప్పటిదాకా సేకరించిన లెవీ పంచదారకు దేశంలో చక్కెర కర్మాగారాలన్నిటికి కలిపి రూ. 14,000 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. బడా పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు ఏటా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేరకు రాయితీలనిచ్చే కేంద్రానికి 14వేల కోట్ల రూపాయలు ఓ లెక్క కాదు. ఆ మొత్తాన్నీ వెంటనే చెల్లించాలనీ కోర్టు పేర్కొనలేదు. చక్కెర ఫ్యాక్టరీలకు ఈ మొత్తాన్ని కేంద్రం రెండు, మూడేళ్లలో చెల్లించవచ్చు. అయినా, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శరద్ పవార్ ప్రస్తుత ఆర్డినెన్సులు తెచ్చారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలకు చెందిన చక్కెర రైతులు పెద్ద సంఖ్యలో న్యూఢిల్లీకి తరలివచ్చి నిరసన వ్యక్తం చేయడం, పార్లమెంటు ఉభయసభల్లో పార్టీలకు అతీతంగా సభ్యులు అభ్యంతరాలు వెలిబుచ్చడంతో ప్రభుత్వం వెనుకంజ వేసింది. పార్లమెంటులో వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులతో సమావేశమైంది. రాష్ట్రప్రభుత్వం సలహాధర (ఎస్.ఎ.పి.)కు, కేంద్రం ఇటీవల ప్రకటించిన సముచిత గిట్టుబాటు ధర (ఎఫ్.ఆర్.పి.)కు మధ్యగల వ్యత్యాసాన్ని రాష్ట్రప్రభుత్వాల బదులు మిల్లులే చెల్లించేలా ఆర్డినెన్సుల్లో మార్పులు చేయడానికి అంగీకరించింది.

భార్గవ కమిటీ సూచించిన విధంగా - ఉప ఉత్పత్తుల ద్వారా ఫ్యాక్టరీలు గడించిన లాభాలనూ పరిగణనలోకి తీసుకొని చెరకు ధరను గణించాలని చెరకు నియంత్రణ ఉత్తర్వు (1966)లోని క్లాజ్ 5 (ఎ) పేర్కొంటోంది. ఆ క్లాజ్‌ను తొలగించడం సరికాదని, దానిని పునరుద్ధరించాలని వివిధ రాజకీయపక్షాల నేతలు కోరినా పవార్ అంగీకరించలేదు. చెరకు ఉత్పత్తి వ్యయంలో 15 శాతాన్ని లాభంగాను, మిల్లు వద్దకు రవాణా వ్యయంకింద మరికొంత మొత్తాన్ని కలిపి, 9.5 శాతం రికవరీ వద్ద క్వింటాల్‌కు రూ.129.84ను ఎఫ్.ఆర్.పి.గా కేంద్రం ఇటీవల ప్రకటించిందని, అందువల్ల క్లాజు 5(ఎ) ఉండాల్సిన అవసరం లేదని పవార్ అన్నారు. భార్గవ సూత్రం కింద చెరకు రైతులకు పలు సంవత్సరాలుగా అదనపు ధర రాలేదని, మిల్లులో సామర్థ్యం లేనప్పుడు లాభాలు రావుగదా అంటూ ఆయన భార్గవ సూత్రాన్ని ఉపసంహరించాలని 1968లో

మహాజన్ కమిటీ కూడా సూచించిందన్నారు. అయితే రైతులకు, ఫ్యాక్టరీలకు అదనపు లాభాలు 50:50 దామాషాలో చెందేలా క్లాజు 5(ఎ) ద్వారా చేసిన ఏర్పాటు సమంజసం గానే ఉందని, దానిని అలాగే కొనసాగించాలని 2004లో ఎస్.కె. తుతౌజా కమిటీ సిఫారసు చేసిందన్న వాస్తవాన్ని ఆయన విస్మరించడం శోచనీయం.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ పవార్ - చక్కెర కర్మాగారాలకు లబ్ధి చేకూర్చే విధానాలను అనుసరిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా చెరకుకు 8.5 శాతం రికవరీ ప్రాతిపదికన ధరను నిర్ణయిస్తుండగా రికవరీ శాతాన్ని తొమ్మిదికి పెంచారు. దీనివల్ల చెరకు రైతులు టన్నుకి రూ. 40 చొప్పున నష్టపోయారు. తొమ్మిది శాతం రికవరీ ప్రాతిపదికన టన్ను చెరకు ధరను 2005-06లో రూ. 795; 2006-07లో 802.50; 2007-08, 2008-09లో రూ. 811.80గా కేంద్రం నిర్ణయించింది. వరి, గోధుమ, పత్తి, అపరాలు, నూనెగింజలు వంటి పంటలకు కనీస మద్దతు ధరను 25 నుంచి 40 శాతానికి పెంచిన ప్రభుత్వం చెరకుకు మాత్రం వరసగా రెండేళ్ళకు ఒకే ధరను నిర్ణయించడం ఏ విధంగా సబబు?

చెరకు నియంత్రణ ఉత్తర్వులోని మూడో సెక్షన్ ప్రకారం చెరకు ఉత్పత్తికి అయ్యే వ్యయం, చెరకు నుంచి చక్కెర దిగుబడి, ప్రత్యామ్నాయ ఉత్పత్తుల ద్వారా రైతులకు లభించగల ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రప్రభుత్వం చెరకుకు కనీస మద్దతు ధరను నిర్ణయించవలసి ఉంది. మొలాసిస్, చెరకు పిప్పి, ఫిల్టర్ మడ్డి వంటి ఉప ఉత్పత్తుల ద్వారా చక్కెర కర్మాగారాలకు చేకూరే ఆదాయాన్నీ లెక్క కట్టాలని నిరుడు (2008) డిసెంబరులో విడుదలైన నోటిఫికేషన్ పేర్కొంటోంది. అయినా, 9.5 శాతం రికవరీ ప్రాతిపదికన 2009-10 సీజన్‌కు క్వింటాల్ చెరకుకు ఈ ఏడాది మేలో ప్రభుత్వం ప్రకటించిన ధర రూ. 103.36 మాత్రమే! రికవరీ ప్రాతిపదికను 8.5 శాతం నుంచి 9.5 శాతానికి మార్చడంవల్ల రైతులు టన్నుకు రూ. 123 చొప్పున నష్టపోయారు. ఆ మేరకు చక్కెర ఫ్యాక్టరీలు లాభపడ్డాయి.

సాగుకోసం రైతులకు అయ్యే ఖర్చుపై యాభై శాతాన్ని అదనంగా కలిపి, ధరను నిర్ణయించాలని సాక్షాత్తు యు.పి.ఎ. ప్రభుత్వం నియమించిన స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసినా- ఆ సర్కారులో మంత్రిగా ఉన్న పవార్ కేవలం 15 శాతాన్ని మాత్రమే కలిపి చెరకు ధర నిర్ణయించడం ఏం న్యాయం? పైపెచ్చు - భార్గవ సూత్రం ప్రకారం

రైతులకు దక్కాల్సిన అదనపు ధర చాలా ఏళ్లుగా అందడంలేదు. కాబట్టి క్లాజు 5 (ఎ)ని ఎత్తివేశామని ఆయన సమర్థించుకోవడం – మోకాలికి, బోడిగుండుకీ ముడిపెట్టిన చందంగా ఉంది. చెరకు క్రషింగ్ సీజన్ పూర్తయి, చక్కెర కర్మాగారాలు తమ ఆర్థిక ఫలితాలు ప్రకటించిన తరువాత భార్గవ సూత్రంలోని 'ఎల్' అంశం విలువను కేంద్రప్రభుత్వం రాష్ట్ర సర్కార్లకు తెలియజేస్తుంది. ఆ తరువాత తమ పరిధిలోని రైతులకు ఏ మేరకు అదనపు లాభాలు చెల్లించాలో ఆయా చక్కెర కర్మాగారాల యాజమాన్యాలకు చక్కెర విభాగ కమిషనర్ తెలియజేస్తారు. రైతులకు ఆ ఫ్యాక్టరీలు పైకాన్ని చెల్లిస్తాయి. శరద్ పవార్ వ్యవసాయ మంత్రిగా నియమితులైన తరువాత గడచిన అయిదేళ్లలో ఒక్క సీజన్‌కు కూడా కేంద్రం 'ఎల్' అంశం గురించి రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియపరచకపోవడం గమనార్హం. పర్యవసానంగా అదనపు ధర రూపేణా రైతులకు రావలసిన వేలకోట్ల రూపాయలు ఇప్పటి దాకా అందలేదు. కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్సువల్ల ఇక ముందూ ఆ డబ్బు రైతులకు వచ్చే మార్గం లేకుండా పోయింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానాల్లో రాష్ట్రప్రభుత్వాలు సలహాధర ప్రకటించే విధానం ఉంది. మన రాష్ట్రంలో దాదాపు పదేళ్ళుగా ఆ పద్ధతిని పాటించడంలేదు. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వు కారణంగా 2004కి ముందు సలహా ధర విధానం లేదు. సలహా ధరను ప్రకటించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు ఉందని, అది చట్టబద్ధమేనని సర్వోన్నత న్యాయస్థానం 2004లో తీర్పు ఇచ్చింది. దాన్ని పురస్కరించుకుని చెరకు పంటకు సలహా ధరను నిర్ణయించవలసిందిగా మన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇక్కడి రైతు సంఘాలు కోరినా పాలకులు ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరం.

## ఉమ్మడి పోరుతో ముకుతాడు

చెరకుసాగు సమృద్ధంగా ఉన్నట్లయితే అది – దేశంలోని ప్రజలకు కావలసిన చక్కెర అవసరాలను తీర్చగలుగుతుంది. అంతేకాదు, పంచదార ఎగుమతుల ద్వారా విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడానికీ దోహదపడుతుంది. బ్రెజిల్‌లో మాదిరి పెద్ద యెత్తున ఇథనాల్‌ను తయారు చేయడానికీ ఉపకరిస్తుంది. తద్వారా పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులను కొంతమేరకు తగ్గించుకోవచ్చు. చెరకు రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి, చక్కెర కర్మాగారాల యాజమాన్యాలకు వేలకొట్ల రూపాయల లాభాలను కట్టబెట్టే రీతిలో వ్యవహరిస్తున్న పవార్ ప్రయత్నాలను పార్లమెంటు సభ్యులు

సాగనీయరాదు. నిత్యావసర వస్తువుల చట్టాన్ని, చెరకు నియంత్రణ ఉత్తర్వును సవరించడానికి జారీ చేసిన ఆర్డినెన్సులను ప్రభుత్వం ఉపసంహరించుకునేలా పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులందరూ కృషి చేయాలి. చెరకు పండించే రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, చక్కెర కర్మాగారాలకు న్యాయసమ్మతమైన లాభం చేకూరేలా, వినియోగదారులకు సరసమైన ధరకు పంచదార అందుబాటులో ఉండేలా చూడటానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. తద్వారా– చెరకు సాగులో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలి. లేకుంటే– ఈ ఏడాదికూడా మనం యాభైలక్షల టన్నులకుపైగా పంచదారను విదేశాలనుంచి దిగుమతి చేసుకోవలసి వస్తుంది. దానివల్ల వినియోగదారులపై పెనుభారం పడటం తథ్యం.

*దీ. 05-12-2009.* **– *ఈనాడు***

●

# వరి రైతు కష్టాలు కడదేరవా?

**ఖ**రీఫ్ 2010-11 సీజన్‌కు గ్రేడ్ 'ఎ' రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 1,030, 'కామన్' రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ. 1,000 కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం జూలైలో ప్రకటించడం దురదృష్టకరం. గత ఏడాది 50 రూపాయల బోనస్‌తో కలిపి వరి ధాన్యానికి ఎంత ధరను కేంద్రం నిర్ణయించిందో అంతే ధరను ఒక సంవత్సరం తర్వాత చేతికి వచ్చే పంటకు నిర్ణయించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. ఈ ఏడాది కాలంలో పలుసార్లు డీజిల్ ధరను కేంద్రం పెంచింది. ఎరువులపై సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవడం కోసం ఎరువుల ధరలను అధికారికంగానే బస్తాకు రూ. 25 నుంచి రూ. 32 మేరకు కేంద్రం పెంచింది. ఇదికాక ఎరువుల లభ్యత తగినంతగా లేని సమయాలలో వ్యాపారులు రైతుల నుండి అదనంగా బస్తాకు రూ. 25 నుంచి రూ. 30 వరకు గుంజుతున్నారు. కొందరు ట్రేడర్లు సేంద్రీయ ఎరువులను అధిక ధరలతో రైతులకు అంటగడుతున్నారు. ట్రాక్టర్‌తో దుక్కి, దమ్ము, కోత, నూర్పిడి ఖర్చులు బాగా పెరిగి పోయాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వలన వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడి, వేతనాలు పెరిగాయి. పర్యవసానంగా వరి ధాన్యం ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగింది. దేశం మొత్తంమీద మన రాష్ట్రంలో పంటల సాగు వ్యయం అత్యధికం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 1,650 కనీస మద్దతు ధరను ప్రకటించమని మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖలు సేకరించిన సాగు ఖర్చు అంచనాల ఆధారంగా ఈ సిఫార్సు చేయడం జరిగింది.

మన రాష్ట్రం కన్నా అధికంగా దిగుబడులు వచ్చే పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో వరిసాగు ఖర్చు తక్కువ. స్వామినాథన్ నేతృత్వంలో జాతీయ రైతు కమిషన్ సగటు

సాగు ఖర్చును అనుసరించి ఉత్పత్తి వ్యయానికి యాభై శాతానికి కలిపి మద్దతు ధరను ప్రకటించాలని సిఫార్సు చేసింది. అప్పుడే రైతుకు గిట్టుబాటుధర లభించి, రైతు కుటుంబ అవసరాలకు కొంతమేర ఉపయోగం చేకూరుతుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రైతులకు ఆశాభంగం కలిగించింది. 2011-12 నాటికి ప్రస్తుత ఉత్పత్తి 98 మిలియన్ టన్నులకు అదనంగా పది మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి సాధించాలనే లక్ష్యం ఉన్నా వరి రైతులపట్ల ఈ విధమైన నిర్లక్ష్య ధోరణి లక్ష్యసాధనకు దోహదం చేయదు. ఇప్పటికే వరి ధాన్యం పండించిన రైతులు మన రాష్ట్రంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సరైన మద్దతు ధరను ఇవ్వకపోగా విదేశాలకు మన రాష్ట్రంలో పండే బీపీటీ 5204 (సోనా - సాంబా, మసూరి), నెల్లూరు సన్నాలు, కర్నూలు సన్నాలు, ఎంటీయూ 1061 మున్నగు రకాల బియ్యం ఎగుమతులపైన రెండు సంవత్సరాలుగా నిషేధాన్ని కొనసాగిస్తోంది.

మన రాష్ట్రం బియ్యానికి సంబంధించి మిగులు రాష్ట్రం. కాబట్టి కేంద్ర ప్రభుత్వం దృష్టికి మన రాష్ట్రంలో ఇప్పటికే రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్న పరిస్థితిని తీసుకువచ్చి ఎగుమతికి  అనుమతి పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయకపోవడం బాధాకరం. మన రాష్ట్ర గోదాముల్లో ఉన్న పంజాబ్ గోధుమలను బయటకు పంపించి, ఖాళీ సమకూర్చి ధాన్యం కొనుగోళ్లు సరిగా నిర్వహింపచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

రాష్ట్రంలో వినియోగదారుల అవసరాలను తీర్చడంతోపాటు ఎగుమతి కూడా చేస్తే, రైతులకు మరికొంత అదనపు ధర లభిస్తుంది. సాధారణ రకాలకన్నా సన్నరకం ధాన్యం దిగుబడి తక్కువగా ఉంటుంది. చీడపీడల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కోత సమయంలో అధికంగా వర్షాలు ఉంటే పంట నష్టం ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి అంశాలన్నింటినీ పరిగణనలో ఉంచుకుని సరైన ధరను రైతులకు అందేలా చూడాలి. అలాగే, ఏయే జిల్లాల్లో  ఏ రకాల ధాన్యాన్ని పండించడానికి అనువుగా ఉంటుందో అక్కడ నాణ్యమైన సన్నరకం వరి విత్తనాలు సరైన సమయంలో సబ్సిడీ ధరతో రైతులకు అందించేందుకు కృషి జరగాలి. ఆ పని చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం బియ్యాన్ని మన రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లనీయకుండా ఆంక్షలను విధిస్తోంది. అలా అనుమతిస్తే సన్న బియ్యం ధరలు పెరగవచ్చనే భయంతో మన రాష్ట్రంలోపల కూడా స్వేచ్ఛగా

బియ్యాన్ని తీసుకెళ్లడానికి  ఐదు నెలల క్రితం వరకూ అనుమతించకపోవడం స్పష్టంగా రైతు వ్యతిరేక చర్య. అనేక రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలను అమలు చేస్తున్నాయి. అనేక కమిటీల సిఫార్సులను దృష్టిలో ఉంచుకుని ఆహార ధాన్యాల రవాణాపై ఆంక్షలను విధించవద్దని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శక సూత్రాలను చాలాకాలం క్రిందటే జారీచేసినా మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. ఫలితంగా అనేక వ్యయ ప్రయాసలకోర్చి వరి ధాన్యాన్ని రైతులు పండిస్తే ఇప్పటికీ సుమారు పది లక్షల టన్నులు రైతుల వద్దే నిలువ ఉండిపోయింది. దీనివలన ఇప్పుడు సాగు చేస్తున్న ఖరీఫ్ పంటలకు పెట్టుబడి పెట్టడానికి స్థోమతలేక, బ్యాంకులు సహకరించక, ఎరువులు సకాలంలో దొరకక అన్నదాతలు అష్టకష్టాలు పడుతూంటే రోశయ్య సర్కార్ చోద్యం చూస్తున్నదే తప్ప పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన చర్యలను తీసుకోవడం లేదు.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో బీహార్, తూర్పు యూపీ మినహా దేశమంతటా వర్షపాతం బాగా ఉండటం వలన ప్రాజెక్టుల కింద ఆయకట్టులోనే కాక, చెరువులు నిండి, బోరుబావులు రీచార్జి అవటంవలన వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది. జలాశయాలు నిండటం వలన రబీ పంట కాలంలో కూడా వరి ధాన్యం పంట అంచనాలను మించే పరిస్థితి ఉంది. ఇప్పటికే గోదాములు ఖాళీలేక లక్షలాది టన్నుల బియ్యం టార్పాలిన్‌ల కింద  దెబ్బతినే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. మన రైతులు పండించిన బీపీటీ, నెల్లూరు సన్నాలు, కర్నూలు సన్నాలు, ఎంటీయూ బియ్యాన్ని కేంద్ర ఏజెన్సీ ద్వారా ఎగుమతి చేస్తే, ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల విలువైన విదేశీ మారక ద్రవ్యం లభించడంతోపాటు గోదాములు కొంత మేరకు ఖాళీ అవుతాయి. రైతుల వద్ద నిల్వ వున్న ధాన్యం కొనుగోలు అవుతుంది. రానున్న పంట కొనుగోలుకు మార్గం సుగమమవుతుంది.

ప్రజల అవసరాలు పోను, మన దేశం నుంచి లక్షలాది టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేయగల అవకాశాలు ఉండి కూడా మన పాలకులు, ప్రణాళికావేత్తల హ్రస్వదృష్టి వలన ఆ అవకాశాన్ని అందుకోలేకపోతున్నాం. ప్రపంచంలో మూడు వందల కోట్ల మంది ప్రజలకు బియ్యం ప్రధాన ఆహారం. ప్రపంచం మొత్తమీద 48 కోట్ల టన్నుల వరి ధాన్యం పండుతోంది. మన దేశంలో దాదాపు 11 కోట్ల ఎకరాల్లో 140 మిలియన్

టన్నుల వరి ధాన్యం పండిస్తుంటే, చైనాలో 7 కోట్ల ఎకరాల్లో 190 మిలియన్ టన్నుల ధాన్యం పండిస్తున్నారు. ప్రపంచంలో వరి ధాన్యం సగటు దిగుబడి హెక్టారుకు 3.8 మెట్రిక్ టన్నులు కాగా, భారతదేశంలో 3.7 టన్నులు, చైనాలో 6.0 టన్నులు, ఈజిప్టులో 8.0 టన్నులుగా ఉంది. మన దేశంలో సాగునీటి వసతి ఉన్న వరి విస్తీర్ణం 45 శాతం మాత్రమే. వర్షాధార పల్లపు భూములు 33 శాతం, వరదలు, ముంపునకు గురయ్యే ప్రాంతాలలో 7 శాతం, మెట్టభూముల్లో 15 శాతంగా వరిసాగు నిర్వహిస్తున్నందువలన మన దేశ సగటు దిగుబడి తక్కువగా ఉంది. ఎక్కువ విస్తీర్ణానికి సాగు నీటి సౌకర్యం విస్తరింపచేయటం, చెరువుల్లో పూడికను తొలగించి గరిష్ట స్థాయిలో నీరు నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవడం, 'శ్రీ' వరిసాగు పద్ధతిని ప్రోత్సహించడం, నిస్సారంగా తయారైన పంట పొలాల్లో సేంద్రీయ కర్బన స్థాయిని పెంచడానికి, తేమ (హ్యూమస్) ను పెంచడానికి పచ్చిరొట్ట విత్తనాలను విరివిగా రైతులకు అందిస్తే మనదేశంలో కూడా వరి దిగుబడులు బాగా పెరుగుతాయి.

మన దేశంలో వరి ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్లోకన్నా తక్కువ ధరలను నిర్ణయిస్తూ వచ్చింది. ఇప్పుడూ అదే ధోరణిని కొనసాగిస్తూ ఉంది. ప్రస్తుతం అమెరికాలో, గల్ఫ్ దేశాలలో లక్షలాది భారతీయులు నివసిస్తున్నారు. మన బీపీటీ 5204, సోనామసూరి రకానికి, అమెరికాలో, బీపీటీ 5204, ఎంటీయూ 1063, 2032 రకాలకు గల్ఫ్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. అమెరికాలో ఇప్పుడు బీపీటీ బియ్యం ధర క్వింటాలుకు రూ. 10 వేలుగా ఉంది. మన ఎఫ్‌సీఐ క్వింటాలు బియ్యాన్ని 1,780 రూపాయలకు మిల్లర్ల నుండి సేకరిస్తోంది. దీన్నిబట్టి రెంటిమధ్య ఎంత వ్యత్యాసమో తెలుసుకోవచ్చు. ఇప్పటికే మన రాష్ట్రంలో బీపీటి ధాన్యం మిల్లర్ల వద్ద 4 లక్షల టన్నులు, రైతుల వద్ద 3 లక్షల టన్నులు ఉన్నాయని అంచనా. వీటిని ఎగుమతి చేస్తే గణనీయంగా మన రాష్ట్రానికి లాభం చేకూరుతుంది. అట్లాగే నెల్లూరు 34449 ధాన్యం కూడా దాదాపు 4.5 లక్షల టన్నులు. ఇప్పటికీ మిల్లర్లు, రైతుల వద్ద, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వద్ద నిలువ ఉన్నాయి. ఇవి విడుదల కాకపోతే డిసెంబర్ తర్వాత వచ్చే వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది.

జనాభా పెరుగుదలను, గ్లోబల్ వార్మింగ్ వలన మన దేశ వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తగ్గవచ్చన్న హెచ్చరికలను ఇతర దేశాలతో వరి పంటకు ఇస్తున్న


ప్రోత్సాహకాలను, అక్కడ రైతులకు కల్పిస్తున్న రక్షణ మున్నగు అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2002-03లో మన దేశం బియ్యం ఎగుమతి చేసి రూ. 6వేల కోట్ల విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిన సంగతిని మనం ఇక్కడ గమనంలో ఉంచుకోవాలి. కాబట్టి వెంటనే నాన్-బాస్మతి బియ్యం ఎగుమతిపైన నిషేధాన్ని ఉపసంహరించి, 2010-11 ఖరీఫ్ వరి ధాన్యానికి కామన్ రకానికి క్వింటాలుకు రూ. 1,330లు మద్దతు ధరను ప్రకటించాలి. తద్వారా వరి పంటకు మద్దతును ఇచ్చి వరి పంట ఉత్పాదకత, ఉత్పత్తి పెరగడానికి, దేశ ప్రజల అవసరం తీర్చడమేకాక, విదేశాలకు పెద్ద పరిమాణంలో బియ్యంను ఎగుమతి చేయడానికి దోహదం చేయాలి. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే చర్యలను చేపట్టాలి.

- సాక్షి

●

Blank Page

# 4 వ అధ్యాయం



# రైతు బజార్, కూరగాయలు - పండ్లు, మామిడి, అక్వా

Blank Page

# ఉభయతారక విధానంతో అభయహస్తం

సముద్ర తీరాన విస్తరించిన రొయ్యల పెంపకం పరిశ్రమపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిస్సందేహంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. బహుళ జాతుల కంపెనీలు, భారత కంపెనీలు 1997 మార్చి 31 లోపున కోస్తా తీరంలోని రొయ్యల చెరువులను నిర్మూలించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిర్మూలన బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్వర్తించాలని న్యాయమూర్తులు కులదీప్‌సింగ్, సాహిర్ అహ్మద్‌ల డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. దేశ ప్రయోజనాలను, ఆర్థిక లాభాలను, లక్షలాది తీర ప్రాంత ప్రజల సామాజిక ఆర్థిక పురోభివృద్ధిని గమనించి, డివిజన్ బెంచ్ తీర్పుపై పునరాలోచన జరపడం ఎంతో ముఖ్యం. సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ కొన్ని వాస్తవాలను పరిశీలించకపోవడంవల్ల ఇటువంటి తీర్పు వచ్చిందన్న అభిప్రాయం ఏర్పడింది. ప్రసిద్ధ గాంధేయ వాది జగన్నాథన్ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా దాఖలు చేసిన వ్యాజ్యాన్ని అనుమతించి, ఇరుపక్షాల వాదనలను విన్న తరువాత డివిజన్ బెంచ్ తన ఈ తీర్పు ప్రకటించింది. అయితే, ఆక్వా పరిశ్రమ, ఎంపెడా సంస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని డివిజన్ బెంచ్‌కు తెలియజేయకపోవడం శోచనీయం. తెలియజేసినట్లయితే బహుశ తీర్పు భిన్నంగా ఉండేది.

## బృహత్తర ప్రణాళికతో మేలయిన ఫలితాలు

దేశానికి ఏటా కొన్ని వేల కోట్లరూపాయల విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని (ఎగుమతుల ద్వారా) సంపాదించి పెట్టగలిగిన ఆక్వా పరిశ్రమను ప్రాధాన్యత గల రంగంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కాని, సరయిన రీతిలో అభివృద్ధి చెందడానికి తగిన చర్యలు తీసుకోవడంలో శ్రద్ధాసక్తులు ప్రదర్శించలేదు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఆక్వా పరిశ్రమ అభివృద్ధి పట్ల శ్రద్ధ వహించలేదు. అవి అలక్ష్య ధోరణి

ప్రదర్శించాయి. తైవాన్, చైనా, తదితర దేశాలలో రొయ్యల పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెంది యజమానుల పేరాశ కారణంగా పతనమయింది. ఆ అనుభవాలతో తగిన మార్గదర్శక సూత్రాలను, నియమ నిబంధనలను రూపొందించు కోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు ఆ పని చేయకపోవడం గర్హనీయం. వాతావరణ కాలుష్యానికి దారితీయని విధంగా రొయ్యల పరిశ్రమ సర్వతోముఖ ప్రగతికి దోహదపడగల సమగ్ర బృహత్తర ప్రణాళిక రూపొందలేదు. ఈ పరిశ్రమ ఇంతవరకు సాధించిన అభివృద్ధికి ప్రధాన కారకులు రైతులనే చెప్పాలి. వారి చొరవ, స్ఫూర్తి, ఉత్సాహం గణనీయ పాత్ర నిర్వహించాయి. రొయ్యల పెంపకం పరిశ్రమలో ఇప్పుడున్న లోపాలను తొలగించి, ఒక బృహత్తర ప్రణాళికను, మార్గదర్శక సూత్రాలను రూపొందించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక సహాయ సంస్థలు సహాయపడినట్లయితే ఏటా దాదాపు పదివేల కోట్ల రూపాయల విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని రొయ్యల ఎగుమతి ద్వారా సంపాదించవచ్చని అంచనా. మామూలు గొర్రె, కోడి, పశు మాంసంకంటే చేపలు, రొయ్యల ఆహారం శ్రేష్ఠమన్న అభిప్రాయంతో అనేక దేశాలలో వాటి వినియోగం బాగా పెరుగుతున్నది. అభివృద్ధి చెందిన సంపన్న దేశాలవారు ఆరోగ్యం కోసం చేపలను, రొయ్యలను అధికంగా తింటున్నారు. చేపలు, రొయ్యలు సముద్రంలో, ఇతర జలవనరులలో సహజంగా లభిస్తున్నాయి. చెరువులు, తదితర జలాశయాల్లో వాటిని కృత్రిమంగా పెంచవచ్చు. సముద్రంలో అవి ఒక పరిమితి మించి లభించవు. అందువల్ల నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి చేపలను, రొయ్యలను పెంచక తప్పదు. అమెరికాలో, జపాన్‌లో, పశ్చిమ ఐరోపా దేశాలలో రొయ్యల వాడకం చాలా ఎక్కువ. ప్రపంచమంతటా సుమారు పది లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతి సంవత్సరం ఆరున్నర లక్షల టన్నులకు మించిన స్థాయిలో రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయని అంచనా వేశారు. ఇందులో దాదాపు 85 శాతం ఆసియా దేశాల్లో ఉత్పత్తి అవుతున్నది. రొయ్యల ఉత్పత్తిలో 1980 దశాబ్దిలో చైనా అగ్రస్థానం ఆక్రమించింది. కొన్ని సంవత్సరాల నుంచి థాయ్‌లాండ్ దాదాపు 60 వేల హెక్టార్లలో 1,55,000 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేస్తూ ప్రథమస్థానం ఆక్రమించింది. ప్రపంచ స్థాయిలో సగటు దిగుబడి హెక్టారు ఒక్కింటికి 633 కిలోలు. రొయ్యల ఉత్పత్తిలో ప్రముఖ దేశాలు ఇండోనేషియా, భారతదేశం, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, తైవాన్, ఈక్వెడార్. ఆరువేల కిలోమీటర్ల పొడవునగల భారత సముద్రతీరంలో ఉప్పుకయ్యలతో కూడిన దాదాపు 11.90 లక్షల హెక్టార్ల బ్రాకిష్ భూమి రొయ్యల

పెంపకానికి అనువయినదని భావిస్తున్నారు. ఇందులో నాలుగు లక్షల హెక్టార్లు పశ్చిమబెంగాల్‌లో, 3.76 లక్షల హెక్టార్లు గుజరాత్‌లో, 1.50 లక్షల హెక్టార్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లో వెనుకటి నుంచి రొయ్యల పెంపకం కొనసాగుతున్నది. పల్లపు భూములలో వర్షాకాలంలో వరి పండిన తరువాత డిసెంబరు–జనవరి నుంచి మే–జూన్ వరకు సముద్రం పోటుతో వచ్చి నిలిచిన నీటిలో రొయ్యలను, చేపలను పోషిస్తారు. ఈ పద్ధతి పెంపకంలో పెట్టుబడి స్వల్పం. రాబడి తక్కువ. ఆరునెలల సీజనులో హెక్టారుకు 200 నుంచి 500 కిలోల రొయ్యలు లభించవచ్చు. ఈ పద్ధతిలో కేరళ, కర్ణాటక, గోవాలలో కొన్ని పల్లపు ప్రాంతాల్లో రొయ్యల పెంపకం జరుగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగాగల డిమాండును గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రొయ్యల పెంపకానికి, భారీ ఎత్తున ఉత్పత్తికి బృహత్తర ప్రణాళికను అమలు చేయాలి. వాతవారణ కాలుష్యాన్ని నివారించడానికి, భూముల సారాన్ని కాపాడడానికి, రొయ్యల ఉత్పత్తి ఇటు రైతులకు, అటు దేశానికి లాభ ప్రదంగా ఉండడానికి గట్టి చర్యలు తీసుకోవాలి. ఆక్వా కల్చరుకు వచ్చిపోయే నీటి వనరులకు విడివిడి మార్గాలుండాలి. రొయ్యల చెరువుల నుంచి బయటికి వచ్చే వృథా పదార్థాలు వాతావరణాన్ని కలుషితం చేయకుండా, పర్యావరణానికి, భూములకు నష్టం చేయకుండా జాగరూకత వహించాలి. ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు రొయ్యల పెంపకం ఆంధ్రప్రదేశ్‌లో ఆలస్యంగా ప్రారంభమయింది. అయినా, రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా వేగంగా విస్తరించి అభివృద్ధి చెందింది. సముద్ర తీరంలోని ఉప్పు కయ్యలలో, బ్రాకిష్ భూములలో స్థానికులు విశేషించి మత్స్యకారులు, బలహీన వర్గాల వారు రొయ్యలను పెంచుతున్నారు రైతులు. ఇతర వాణిజ్య వర్గాలవారు శాస్త్రీయ పద్ధతిలో చెరువులను తవ్వి రొయ్యలను పెంచుతున్నారు. ఎగుమతి అవకాశాలను గమనించి పలు ప్రైవేట్, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు కూడ వేలాది హెక్టార్లలో చేపలను, రొయ్యలను పెంచుతున్నాయి. వీటిలో కొన్ని సెమీ ఇంటెన్సివ్ (కొంత వరకు సాంద్ర పద్ధతిలో జరిగేవి). కొన్ని ఇంటెన్సివ్ (సాంద్ర పద్ధతులను అనుసరించేవి). రైతులు మాత్రం అధిక సంఖ్యలో విస్తార విధానాన్ని అనుసరిస్తున్నారు. రాష్ట్రంలో లక్ష హెక్టార్లకు మించిన భూముల్లో రొయ్యల పెంపకం కొనసాగుతున్నది. 1982–83లో కేవలం 65 హెక్టార్లతో మొదలైన బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్ ఈ రోజు ఈ రాష్ట్రంలో 50 వేల హెక్టార్లకు విస్తరించడం అసాధారణ విషయమే. ఆంధ్రప్రదేశ్‌లో ఏటా దాదాపు రూ. ఆరొందల కోట్ల విలువైన రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. భూముల విలువను కూడా కలిపితే

ఇంతవరకు రాష్ట్రంలో రైతులు, కంపెనీల వారు ఈ పరిశ్రమలో కనీసం వెయ్యికోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారని అంచనా. రొయ్యపిల్లల సరఫరాకు భారీ పెట్టుబడులతో హేచరీలు స్థాపితమయ్యాయి. వందల యూనిట్లు ఫీడ్‌ను (రొయ్యలకు మేత) ఉత్పత్తి చేస్తున్నాయి. వేల దుకాణాలు ఈ మేతను విక్రయిస్తున్నాయి. రొయ్యల చెరువుల్లో వేసే చీడ నివారణ మందులు భారీగా అమ్ముడవుతున్నాయి. వేలమంది మత్స్యకారులు సముద్రంలో రొయ్యపిల్లలను పట్టి తమ చెరువుల్లో పెంచుతున్నారు. రొయ్యల పరిశ్రమ విస్తరణతో, బహుముఖ అభివృద్ధి కోస్తా ప్రాంతాలలో త్వరితగతిన ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. ఉపాధి అవకాశాలు, కూలిరేట్లు పెరిగాయి. పనిదినాలు పెరిగాయి. రొయ్యల పెంపకం పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. రొయ్యల పరిశ్రమ కారణంగా స్థానిక, పేదల జీవనోపాధి దెబ్బతిన్నదన్న వాదనలో పస లేదు. వెనుకబడిన ప్రాంత పేదల జీవన ప్రమాణాలు పెరగడానికి రొయ్యల పరిశ్రమ దోహదపడుతోందన్నది యధార్థం. రొయ్యల పరిశ్రమ విస్తరణలో రహదార్లు, కమ్యూనికేషన్లు వంటి ప్రాతిపదిక సదుపాయాలు కూడ విస్తరిస్తున్నాయి. రొయ్యలను పెంచే చెరువులపై కొద్దిపాటి అభివృద్ధి సుంకం విధించి, ఆ మొత్తాన్ని అక్కడి రహదార్లు, తాగునీరు, ఇతర సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. రొయ్యలు బహు సున్నిత జీవులు. వాతావరణం మార్పులు, ఉష్ణోగ్రత తేడాలు, నీటి స్వచ్ఛత తదితర అంశాలు వాటి పెరుగుదలపైన, ఆరోగ్యం మీద ప్రభావాన్ని ప్రసరిస్తాయి. చెరువుల్లోకి ఉప్పు నీటిని వదిలే వనరులు సరైన రీతిలో లేకపోతే రొయ్యల పెంపకం దెబ్బతింటుంది. రొయ్యల చెరువుల్లోకి నీరు వచ్చే మార్గం, నీరు పోయే మార్గం వేరువేరుగా ఉండాలి. రైతులు వాటిని సమిష్టిగా ఏర్పరచుకోవాలి. ఇటువంటి విషయాల్లో ప్రభుత్వ జోక్యం, నియంత్రణ అవసరమవుతాయి. రొయ్యల పెంపకం కోసం ప్రభుత్వం తన భూములను పేదలకు, బలహీన వర్గాల వారికి ఇవ్వాలి. చెరువుల ఏర్పాటు, రొయ్యల పెంపకం నిమిత్తం అవసరమైన రుణాలను, గ్రాంట్లను సులభంగా ఇవ్వాలి.

## పరిమితులు విధించినా ప్రోత్సహించడం అవసరం

వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన మార్గదర్శక సూత్రాలను రైతులకు వివరించాలి. ఈ సూత్రాలను, ఇతర నియమ నిబంధనలను అమలు చేయడానికి ప్రత్యేక యంత్రాంగం, సిబ్బంది ఉండాలి. ఇంటెన్సివ్, సెమీ ఇంటెన్సివ్ పద్ధతుల్లో రొయ్యలను పెంచినప్పుడు కాలుష్యం

అధికంగా ఏర్పడుతుంది. ఈ పద్ధతులు తైవాన్‌లో నష్టం కలిగించాయి. ఈ పద్ధతులపై భారత దేశంలో ఆంక్షలు విధించవచ్చు. రొయ్యల పెంపకం పరిశ్రమపై భారీ పెట్టుబడులు పెట్టిన కంపెనీలు నష్టపడడం సమంజసం కాదు. వైరస్ వ్యాధుల కారణంగా కొన్ని సంవత్సరాలు ఆక్వా కల్చర్ దెబ్బతిన్నది. ఇటువంటి విపత్తులను తట్టుకోవడానికి రొయ్యల పెంపకం పరిశ్రమకు బీమా పథకాన్ని వర్తింపజేయాలి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సహాయపడాలి. సముద్ర తీరం నుంచి అయిదు వందల మీటర్ల లోపల ఉన్న చెరువుల సంఖ్య చాలా స్వల్పం. వాటిని తొలగించవచ్చు. అంతకు ఆవలగల రొయ్యల పెంపకం కంపెనీలను కూడా మూసివేయాలనడం న్యాయం కాదు. అటువంటి చర్యవల్ల రైతుల అభివృద్ధి, విదేశీ మారకద్రవ్య ఆర్జన దెబ్బతింటాయి. పెద్ద కంపెనీల వల్ల వాతావరణ కాలుష్యం జరిగితే దానిని నివారించే చర్యలు తీసుకోవచ్చు. సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు బ్రాకిష్ వాటర్ ఆక్వా కల్చర్ అభివృద్ధికి విఘాతం కల్గిస్తుంది. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతు సంఘాలు రివిజన్ పిటిషన్ వేసి సుప్రీంకోర్టు తీర్పును తగిన రీతిలో మార్చడానికి ప్రయత్నించాలి. జాప్యం చేయరాదు. వాతావరణ కాలుష్యాన్ని నిరోధించడం, భూముల సారాన్ని కాపాడడం, పర్యావరణాన్ని పరిరక్షించడం అతి ముఖ్యమే. అయితే రొయ్యల పెంపకం పరిశ్రమ ఫలితంగా లక్షలాది పేదలకు, రైతులకు కలుగుతున్న విదేశీ మారక ద్రవ్యాన్ని విస్మరించడానికి వీలులేదు. సముద్ర తీరం వెంట అయిదు వందల మీటర్లలో ఆక్వాకల్చర్‌ను అనుమతించకుండా అక్కడ అడవులను పెంచాలి. రొయ్యల చెరువుల నుంచి బయటికి వచ్చే జలాలు కాలుష్యం కలిగించకుండా నిరోధించాలి. రొయ్యల పెంపకం పరిశ్రమలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడం, లోపాలను దూరం చేయడం, సమస్యలను పరిష్కరించడం నిపుణుల సలహాలు పాటిస్తే కష్టమేమీ కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో కీలక పాత్ర నిర్వహించాలి.

*ది. 24-12-1996.* *– ఈనాడు*

●

# రైతు మార్కెట్ల వల్ల ద్విముఖ ప్రయోజనం

వ్యావసాయిక దేశంగా పేరొందిన భారత్ కూరగాయల ఉత్పత్తిలో చైనా తరవాత రెండో స్థానాన్ని ఆక్రమించింది. దేశంలో కోటీ 20 లక్షల ఎకరాలలో ఏడుకోట్ల టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయి. ఆరోగ్య ప్రమాణాల రీత్యా ప్రతి మనిషి సగటున రోజుకు కనీసం 280 గ్రాముల కూరగాయలను తినాలని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. భారత్‌లో సగటు వినియోగం 140 గ్రాములు మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు 3.75 లక్షల ఎకరాలలో 22 లక్షల టన్నుల కూరగాయలు పండిస్తున్నారు. మాంసం, చేపలు, రొయ్యలు మొదలైన బలవర్ధక పోషకాహారాన్ని తీసుకోవడం చాలామంది పేదలకు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సాధ్యంకాని పని. అంతో ఇంతో కూరగాయలను కొనుక్కోవాలని ఆశించేవారికి అవికూడా అధిక ధరలతో అందుబాటులో లేకుండా పోతున్నాయి. నిజానికి పోషక విలువలు సమృద్ధిగా ఉండే కూరగాయలు ప్రజలందరికీ అందుబాటు ధరల్లో లభించాల్సింది. ఆరుగాలం కష్టించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పండించిన రైతులకూ తగిన ప్రతిఫలం దొరకడంలేదు. వినియోగదారులకూ కూరగాయలు అందుబాటులో ఉండడంలేదు. వీటికి ప్రధాన కారణం సరయిన మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం. రైతులకు-వినియోగదారులకు మధ్య దళారులు, వ్యాపారులు అధికమై అక్రమార్జన చేస్తున్నారు. దానితో రైతులకు తక్కువ ధర లభిస్తోంది. వినియోగదారులు ఎక్కువ ధర చెల్లించాల్సివస్తోంది. రైతులే నేరుగా వినియోగదారులకు తమ ఉత్పత్తులను అమ్మగలిగేలా ప్రభుత్వం చొరవచూపితే ఈ దుష్ఫలితాలను నివారించవచ్చు. రైతు మార్కెట్లను ప్రోత్సహించడం ఇందుకు ప్రత్యామ్నాయం.

## కర్ణాటక, చండీగఢ్ దృష్టాంతాలు

బారతదేశం పండ్ల ఉత్పత్తిలో బ్రెజిల్‌ను అధిగమించి మొదటిస్థానానికి చేరుకుంది. దేశంలో సుమారు 80 లక్షల ఎకరాలలో 3.95 కోట్ల టన్నుల పండ్లు ఉత్పత్తి

అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 13.5 లక్షల ఎకరాలలో 50 లక్షల టన్నుల పండ్లు ఉత్పత్తి చేస్తున్నారు. దేశంలోని మొత్తం ఉత్పత్తిలో 16 శాతంతో రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. ఆరున్నర లక్షల ఎకరాల్లో 29.5 లక్షల టన్నుల మామిడికాయలు, రెండున్నర లక్షల ఎకరాల్లో 6.36 లక్షల టన్నుల జీడిమామిడి, రెండున్నర లక్షల ఎకరాల్లో 57 కోట్ల కొబ్బరికాయలు, 80 వేల ఎకరాల్లో 8.5 లక్షల టన్నుల అరటి, 20 వేల ఎకరాల్లో లక్ష టన్నుల జామ, పదివేల ఎకరాల్లో 50 వేల టన్నుల సపోటా, 70 వేల ఎకరాల్లో నాలుగు లక్షల టన్నుల బత్తాయి, నిమ్మ, నారింజ పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఏటా పెనుగాలులు, తుఫానులవల్ల పండ్లతోటలకు విపరీత నష్టం వాటిల్లుతోంది. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ఉత్పత్తిచేసిన రైతులకు మార్కెట్‌లో కొనుగోలుధర మరీ నిరాశకు గురిచేస్తోంది. మనసు అంగీకరించకపోయినా గత్యంతరంలేక చాలా తక్కువ ధరకు ఉత్పత్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. అవే ఉత్పత్తులు వినియోగదారులకు అందేసరికి ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. వాటిని కొనడం వినియోగదారులకూ విపరీతభారంగా పరిణమించింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులే నేరుగా వినియోగదారులకు అమ్మేట్టయితే దళారుల బెడద తప్పుతుంది. అటు రైతులకు ఇటు వినియోగదారులకు మేలు చేకూరుతుంది. రెండువిధాలా ఎంతో శ్రేయస్కరమైన ఈ విధానం అమలయ్యేందుకు ప్రభుత్వం దోహదపడాలి. రైతు మార్కెట్ పద్ధతిని ప్రోత్సహించేందుకు ప్రయత్నించాలి. భారతదేశంలో ప్రజల కనీసావసరాలు తీరేందుకు పండ్లు కూరగాయలను మరింతగా ఉత్పత్తి చేయాల్సి ఉంది. దేశంలోని భూమి, నీరు, వాతావరణం, శీతోష్ణ పరిస్థితులు పండ్లు, కూరగాయలు పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉన్నాయి. లక్షలాదిమంది చిన్న, సన్నకారు రైతులు, ఇతరుల భూమిలో వ్యవసాయ కార్మికులు కౌలుకు కూరగాయలు పండిస్తున్నారు. పండ్లు, కూరగాయల ఎగుమతులకు ఎంతో మంచి అవకాశాలున్నాయి. 1992-93లో భారత్ నుంచి సుమారు రూ. 206 కోట్ల విలువైన ప్రాసెస్ చేసిన పండ్లు, కూరగాయలు ఎగుమతయ్యాయి. 1995-96 నాటికి ఆ మొత్తం రూ. 347 కోట్లకు పెరిగిపోయింది. దానితో కేంద్రప్రభుత్వం పండ్లు, కూరగాయల ఎగుమతి అవకాశాలను గమనించి, వాటిని మరింత ఎక్కువగా ఉత్పత్తి చేయాలని భావించింది. అత్యంత ప్రాధాన్యం కల అంశంగా గుర్తించింది. ఏదో పంచవర్ష ప్రణాళికలో హార్టీ కల్చర్‌కు కేవలం రూ. 24 కోట్లు మాత్రమే కేటాయించగా, ఎనిమిదో ప్రణాళికలో రూ. వెయ్యికోట్లకు పెంచారు.

రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాల కిట్‌లను సరఫరా చేయడానికి, అధికంగా ఫౌండేషన్ సీడ్ తయారుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారాన్నందిస్తోంది. పండ్లు, కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రాసెసింగ్ యూనిట్లు, శీతలీకరణ ప్లాంట్లు, రవాణా, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణ కోసం నేషనల్ హార్టీకల్చర్ బోర్డుకు ఎనిమిదో ప్రణాళికలో రూ. రెండొందల కోట్లు కేటాయించారు. స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల వాడకం వలన మేలయిన ఫలితాలు సాధ్యమవుతాయి. ఈ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం 70 శాతం నుంచి 90 శాతం సబ్సిడీలను ప్రకటించింది. దీనితో గణనీయ అభివృద్ధి సాధ్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతియేటా ఉత్పత్తి అయిన పండ్లు, కూరగాయల్లో దాదాపు రూ. 2500 కోట్ల మేరకు వృథాగా పోతున్నట్టు ఒక అంచనా. సరయిన నిల్వ సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, ప్రాసెసింగ్ సామర్థ్యం ఇప్పటికీ ఒనగూడకపోవడం వల్ల ఇంతటి భారీ నష్టం వాటిల్లుతోంది. భారతదేశ జనాభాలో దాదాపు 40 శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ఇటీవల ప్రణాళికా సంఘం అభిప్రాయపడింది. ఒకవైపు అర్ధాకలితో కోట్లమంది ప్రజలు అలమటిస్తుంటే మరోవైపు ఏటా వేల కోట్ల రూపాయల విలువైన పండ్లు, కూరగాయలు వృథా పోతుండడం బాధాకరం. ఈ వృథాను అరికట్టడానికి పకడ్బందీ చర్యలు చేపట్టడం అత్యవసరం. అంతేగాక అష్టకష్టాలు పడి ఉత్పత్తి చేస్తున్న రైతులకు గిట్టుబాటుధర లభించేలా చూడాలి. అలాగే వినియోగదారునికి సరసమైన ధరలకు అందజేయగలగాలి. రైతులలో అనైక్యతవల్ల, సమిష్టిగా తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవాలన్న అవగాహన లేకపోవడంవల్ల దళారుల చేతుల్లో దగా పడుతున్నారు. సగటున చూస్తే వినియోగదారుడు కొంటున్న ధరలో మూడోవంతు మాత్రమే రైతుకు లభిస్తోంది. అంటే రైతునుంచి కొనుగోలు చేసిన సరుకులను అంతకు మూడురెట్ల ధరకు వినియోగదారులకు అమ్ముతున్నారన్నమాట. మార్కెట్లో వ్యాపారులకు ఇచ్చే కమీషన్, ఇతర ఖర్చులు, తూకాలలో మోసాలతో రైతులకు చాలా అన్యాయం జరుగుతోంది. రైతులకు గిట్టుబాటుధర, వినియోగదారులకు సరసమైన ధరకు సరుకులు లభించాలంటే సరయిన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడాలి. ప్రస్తుతం ఉన్న కమీషన్‌దార్ల వ్యవస్థను ఒక్కసారిగా తోసివేసి ప్రత్యామ్నాయ వ్యవస్థను నెలకొల్పడం అంత సులభంకాదు. ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగాలి. రైతాంగం చైతన్యవంతమై ముందుకువస్తే ప్రభుత్వం, స్థానిక సంస్థలు చొరవచూపి తోడ్పాటునందిస్తే ప్రత్యామ్నాయ వ్యవస్థను తొందరగానే ఏర్పాటు

చేయవచ్చు. పండ్లు, కూరగాయలను పండించే రైతులతో సహకార సంఘాలను, వాటికి అనుబంధంగా రిటైల్ దుకాణాలను ఏర్పాటుచేసి పట్టణాలలో, నగరాలలో ప్రజలకు సరసమైన ధరలకు అందించవచ్చు. బెంగుళూరులోని హార్టీకల్చరల్ ప్రొడ్యూసర్స్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ అండ్ ప్రాసెసింగ్ సొసైటీ కృషి ఇందుకు ఎంతో స్ఫూర్తినిస్తుంది. 1959లో అప్పటి హార్టీకల్చర్ డైరక్టర్ డాక్టర్ మారెగౌడ తోడ్పాటుతో ఏర్పాటైన ఈ సంస్థ సుమారు 6200 మంది సభ్యులతో చక్కగా సాగుతోంది. 1993 నాటికే బెంగుళూరులో 180, మైసూరులో 45 రిటైల్ షాపులను మంగుళూరు, కోలారు, మాండ్య తదితర ప్రాంతాల్లో అనేక షాపులను నెలకొల్పారు. రైతులు తెచ్చిన సరుకులను కాటావేసి వెంటనే మొత్తాలను చెల్లిస్తారు. సాధారణంగా హెూల్‌సేల్ మార్కెట్లో లేక మండీలో లభించే ధరకన్నా ఇక్కడ రైతులకు ఎక్కువ గిట్టుబాటవుతుంది. రిటైల్ దుకాణాలలో సరుకులను అమ్మే ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలు, రవాణా ఛార్జీలు తదితరాలవల్ల సుమారు 20 శాతం మార్జిన్ కలిపి వినియోగదారులకు అమ్మే ధరను నిర్ణయిస్తారు. వినియోగదారునికి అమ్మే ధరలో 80 శాతం రైతుకు లభిస్తుందన్నమాట. రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా బెంగుళూర్, మైసూర్ నగరాలలోని ఆసుపత్రులకు, ఫ్యాక్టరీలలోని క్యాంటీన్లకు, హాస్టళ్లకు కూడా సంస్థ సరుకుల సరఫరా చేస్తుంది. ఢిల్లీలోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు మంగోల్‌పురిలో నిర్వహిస్తున్న పండ్లు, కూరగాయల శీతలీకరణ గిడ్డంగికి ఈ సంస్థ కర్ణాటక నుంచి పండ్లు, కూరగాయలు పంపుతుంది. ఢిల్లీ నుంచి ఆపిల్స్, ఉత్తరాది రాష్ట్రాలలో లభించే పండ్లను తెప్పించి బెంగుళూర్, మైసూర్ ఇతర నగరాలలో తన రిటైల్ షాపుల ద్వారా అమ్ముతుంటుంది. ఈ సంస్థ అటు రైతులకు, ఇటు వినియోగదారులకు సేవలనందిస్తోంది. బెంగుళూర్, మైసూర్ కార్పొరేషన్లు ఈ సొసైటీ రిటైల్ దుకాణాలు నెలకొల్పడానికి కావలసిన స్థలాలను నెలకు పదిరూపాయల చొప్పున లీజుకు ఇచ్చాయి. నేషనల్ హార్టీకల్చర్ బోర్డు, నగరపాలకసంస్థ, జిల్లాపరిషత్‌లు ఇచ్చిన సబ్సిడీలతో రిటైల్ అవుట్‌లెట్లు నిర్మాణమయ్యాయి. గ్రేడింగ్, ప్యాకింగ్ సెంటర్ల ఏర్పాటుకు, ప్లాస్టిక్ క్రేట్స్, అరటిపండ్లు పండించే చాంబర్ల నిర్మాణానికి నేషనల్ హార్టీకల్చర్ బోర్డు సహాయమందించింది. కర్ణాటకలోని మిగతా జిల్లాల్లో కూడా విస్తృతంగా ఈ పథకాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో మరోరకమైన పద్ధతి -

కిసాన్ మండీల (రైతు మండీలు) పద్ధతి కొనసాగుతోంది. రైతులు హోల్‌సేల్ మార్కెట్లలో గాకుండా ఇక్కడ కూడా అమ్ముకోవచ్చు. ఈ మండీలను నిర్దేశిత ప్రాంతాల్లో నిర్ణీత దినాల్లో నిర్వహిస్తారు. అక్కడ రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముతారు. ప్రతి రైతుకు అతని పొలం వివరాలతో అధికారులు గుర్తింపుకార్డునిస్తారు. పెద్ద ఖాళీ ప్రదేశాల్లో ఈ మార్కెట్ నిర్వహిస్తారు. ఒకరోజు అక్కడ తన సరుకులు అమ్ముకున్నందుకు రైతు పదిరూపాయలు మార్కెట్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ 'శనివారం మార్కెట్లు' నిర్వహిస్తుంటారు. రైతులు నేరుగా తమ సరుకులను వినియోగదారులకు అమ్ముకునేందుకు ఆరోజు వీలు కల్పిస్తారు. ఆ వ్యవస్థలను పరిశీలించి పంజాబ్ మార్కెట్ బోర్డు 'అప్నీమండీ'లను ఏర్పాటు చేసింది. చండీగఢ్ నగరంతోపాటు రాష్ట్రంలోని 34 ప్రాంతాల్లో ఆ విధంగా రైతు మార్కెట్లను నిర్వహిస్తోంది. ఈ విధానం వల్ల దళారుల బెడద, దోపిడీ ఉండదు. దళారులకు పోయే మార్జిన్ రైతులు, వినియోగదారులకే మిగులుతోంది. వినియోగదారులకు తక్కువ ధరలకు తాజా, నాణ్యమైన సరుకులు లభిస్తాయి. 1987లో ఈ పథకం ప్రారంభించినప్పుడు 88 మంది రైతులే పాల్గొన్నారు. ఇప్పుడు సగటున రోజూ 3876 మంది రైతులు తమ సరుకులను అమ్ముకొంటున్నారు. మొదట్లో నెలకు రూ. 3.50 లక్షల విలువైన సరుకులు అమ్మకమయ్యేవి. ఇప్పుడు నెలకు దాదాపు రూ. కోటీ 30 లక్షల విలువైన సరుకులు అమ్ముడవుతున్నాయి.

## చొరవ చూపితే సత్ఫలితాలు

రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం కలిగించే విధానాలపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి. కర్ణాటక, చండీగఢ్ విధానాలు రైతులకు ప్రత్యేకించి సన్నకారు, చిన్న రైతులకు చాలా మేలుచేస్తాయి. రైతు మార్కెట్లు అంతటా నెలకొనాలి. రైతులు స్వేచ్ఛగా తమ సరుకులను అమ్ముకుంటూ గిట్టుబాటు ధర పొందేందుకు ఇలాంటి విధానాలు దోహదపడతాయి. దళారుల ప్రమేయం తగ్గుతుండడంవల్ల వినియోగదారులకు తక్కువ ధరలకు పండ్లు, కూరగాయలు లభిస్తాయి. పోషక విలువలుకల సరుకులు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలుంటాయి. ఇలాంటి విధానాలను అమలు చేయడంలో ప్రభుత్వానికి పెద్ద సమస్యలేవీ అడ్డురావు. లోగడ నుంచీ కొనసాగుతున్న వ్యాపార వ్యవస్థకు తోడు ప్రజాస్వామ్య విధానంలో రైతులు,

వినియోగదారుల శ్రేయస్సును కోరే ప్రత్యమ్నాయ వ్యవస్థను నెలకొల్పి ప్రోత్సహించాలి. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి. వేలకోట్ల రూపాయల విలువైన సరుకులు వృధాకాకుండా తగు విధంగా కొనుగోలు, రవాణా, నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలను పెంపొందించాలి. కేంద్రంలోని ఎన్.సి.డి.సి., ఎన్.హెచ్.బి.ల తోడ్పాటుతో రాష్ట్రంలో వ్యవసాయ శాఖ, స్థానిక పాలక సంస్థలు ఇందుకు కృషి చేయాలి. రైతు సౌభాగ్యాన్ని ఆశించాలి. వినియోగదారులకూ ఊరట కలిగించాలి. రెండు విధాలా మేలయిన విధానాలను ప్రోత్సహించాలి.

*ది. 11-01-1997.* — *ఈనాడు*

●

# మామిడి 'ఫలా'లను చేజార్చుకుంటున్న భారత్

పండ్లలో రారాజుగా ప్రసిద్ధి చెందిన మామిడి పండు భారత ఉపఖండంలో దాదాపు నాలుగువేల సంవత్సరాల నుంచి వాడుకలో ఉన్నట్టు అంచనా. భారతదేశంలో మామిడి పండును జాతీయ ఫలంగా పరిగణిస్తున్నారు. ప్రస్తుతం 63 దేశాల్లో వివిధ రకాల మామిడి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రపంచం మొత్తంమీద ఏటా ఉత్పత్తి అవుతున్న 170 లక్షల టన్నుల మామిడి పండ్లలో అధిక శాతం (78 శాతం) వాటా ఆసియా ఖండానిది. అందులోనూ 61 శాతం వాటా భారతదేశానిదే. మెక్సికో 5 శాతం, పాకిస్తాన్ 4.8 శాతం, థాయ్‌లాండ్ 3.3 శాతం, చైనా 3.1 శాతం చొప్పున తదుపరి స్థానాలను ఆక్రమిస్తున్నాయి. బ్రెజిల్, ఫిలిప్పీన్స్ 2.6 శాతం చొప్పున మామిడి పండ్లను ఉత్పత్తి చేస్తున్నాయి. ఉత్తర, మధ్య అమెరికాలో 10.6 శాతం, ఆఫ్రికా ఖండంలో 7 శాతం, దక్షిణ అమెరికాలో 5 శాతం చొప్పున ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతం భారత్ పండ్ల ఉత్పత్తిలో బ్రెజిల్‌ను అధిగమించి ప్రపంచలోనే మొదటి స్థానానికి చేరుకొంది. భారతదేశంలోని మొత్తం పండ్ల తోటల విస్తీర్ణంలో మామిడి తోటల విస్తీర్ణం 42 శాతం. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న మొత్తం పండ్లలో 40 శాతం మామిడి పండ్లే. ఏటా దాదాపు 100 లక్షల టన్నుల మామిడి ఫలాలు ఉత్పత్తి అవుతున్నాయి. విదేశాలలో ఎంతో డిమాండ్ ఉన్న మామిడి పండ్లను ఎగుమతి చేయడంలో మాత్రం భారత్ వెనుకబడి పోయింది. విలువైన విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి ఎంతో అవకాశమున్నా సమర్థంగా వినియోగించుకోలేకపోయింది. భారత్ కన్నా తక్కువగా పండిస్తున్న దేశాలు ఎగుమతుల రంగంలో ఎంతో ముందున్నాయి.

## సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యం

మెక్సికోలో ఏటా దాదాపు 10 లక్షల టన్నుల మామిడి పండ్లు ఉత్పత్తి అవుతుంటాయి. 1993-94లో ఆ దేశం అమెరికాకు 4 లక్షల టన్నుల మామిడి

పండ్లను ఎగుమతి చేసింది. మరికొన్ని ఇతర దేశాలకూ ఎగుమతులు కొనసాగాయి. అంతకు పదిరెట్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతున్న భారతదేశం 1993-94లో కేవలం 23 వేల టన్నుల మామిడి పండ్లను మాత్రమే ఎగుమతి చేయగలిగింది. ఎక్కువ భాగం గల్ఫ్ దేశాలకు 1300 టన్నులు బ్రిటన్‌కు పంపించింది. ఉత్పత్తిలో 61 శాతంతో ప్రథమ స్థానంలో ఉన్న భారత్ ఎగుమతుల వాటా కేవలం మూడు శాతమే కావడం ఆశ్చర్యకరం. కేవలం ఒక్క శాతం మాత్రమే పండిస్తున్న వెనిజులా ప్రపంచ మామిడి పండ్ల వాణిజ్యంలో 21 శాతం వాటా పొందుతోంది. భారత ఉత్పత్తితో పోల్చి చూస్తే కేవలం 8 శాతం మామిడి పండ్లను మాత్రమే పండిస్తున్న పాకిస్తాన్ భారత్ కన్నా రెట్టింపు స్థాయిలో ఎగుమతులు చేస్తోంది. మంచి రంగు, రుచి, వాసన గల మామిడి పండ్లకు అన్ని దేశాల్లోను డిమాండ్ పెరుగుతోంది. భారత్ నుంచి భారీ ఎత్తున మామిడి పండ్లను, మామిడి రసం, ముక్కలు, తాండ్ర వంటి ఉత్పత్తులను ఎగుమతి చేయగలిగితే అధిక మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం ఆర్జించవచ్చు. ఉత్పత్తి, ఎగుమతుల విషయంలో పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విద్యాలయాలు క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలి. రైతులకు తోటలను సక్రమంగా పెంచడం, నీటి వినియోగం, ఎరువులు, పురుగుమందుల వాడకం, కోతకు ముందు, కోసిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తల విషయంలో సరయిన అవగాహన కల్పించాలి. ఆంధ్రప్రదేశ్‌లో 6.5 లక్షల ఎకరాలలో దాదాపు 30 లక్షల టన్నుల మామిడి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. మామిడి తోటల విస్తీర్ణంరీత్యా ఉత్తరప్రదేశ్ (12 లక్షల ఎకరాలతో) ప్రథమ స్థానంలో ఉన్నా ఎకరా దిగుబడిలో (2.5 టన్నులతో) ఏడో స్థానం ఆక్రమిస్తోంది. ఎకరాకు 5 టన్నులతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. గుజరాత్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు అనంతర స్థానాలను ఆక్రమిస్తున్నాయి. మహారాష్ట్రలో 50 వేల ఎకరాలలో మాత్రమే మామిడి తోటలున్నా అక్కడ పండే ఆల్ఫాన్సో రకం పండ్లు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి బనగానపల్లి, తోతాపురి (కలెక్టర్) రకాలు కొంతమేర విదేశాలకు వెళుతున్నాయి. దేశంలో దాదాపు వెయ్యి రకాల మామిడి ఫలాలుండగా, 25 రకాలు వాణిజ్యపరంగా ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బంగినపల్లి, తోతాపురి, నీలం, హిమాయత్ పసంద్, మల్గువా చిన్నరసం; పెద్దరసం, చెరకురసం, సువర్ణరేఖ రకాలు; గుజరాత్, మహారాష్ట్రలో ఆల్ఫాన్సో, కేసర్; ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానాలలో దషేహరి, లాంగ్రా, చౌసా; బెంగాల్‌లలో మాల్దా

రకాలు ప్రసిద్ధి చెందాయి. ప్రపంచంలోనే అతి రుచికరమైన మామిడిపండ్లను ఉత్పత్తి చేస్తున్న భారతదేశం ఎగుమతులలో వెనుకబడిపోవడానికి కారణాలను విశ్లేషించుకోవడం ఎంతో అవసరం. సాధారణంగా ఏ వస్తువు ఎగుమతయినా ఎక్కువగా వస్తువు నాణ్యత, ధర మీద ఆధారపడి ఉంటుందన్నది తెలిసిన సత్యం. మామిడి పండ్ల విషయంలోనూ అ అంశాలను దృష్టిలోకి తీసుకోవాలి. తెగుళ్లు, రోగాలు సోకని పండ్లకే ఎగుమతి అవకాశాలు లభిస్తాయి. ఆల్ఫాన్సో రకం మామిడి పండ్లు బ్రిటన్, మధ్య ప్రాచ్యదేశాలకు, యూరోపియన్ యూనియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. రంగు, రుచి, రూపం మంచిగా ఉండడమేగాక ఎక్కువ రోజులు చెడిపోకుండా నిల్వ ఉండడం ఈ రకం పండ్ల ప్రత్యేకత. వీటిల్లోనూ ఎక్కువ పండిన వాటిల్లో స్పాంజిటిష్యూ సమస్య వస్తోంది. ఈ పండ్లు ప్రతిఏటా క్రమబద్ధంగా ఆశించిన స్థాయిలో ఉత్పత్తి కావడంలేదు. స్పాంజి టిష్యూ సమస్య లేకుండా, ప్రతి ఏడూ మంచి కాపును ఇచ్చే విధంగా దౌపలిలోని కొంకణ్ కృషి విద్యాన్‌పీఠ్‌వారు 'రత్న' అనే కొత్త రకాన్ని రూపొందించారు. మామిడి పండ్ల ఎగుమతి విషయంలో మరో ముఖ్య అడ్డంకి ఫ్రూట్ ఫ్లై వ్యాధి. రసాయనిక పురుగు మందులను యంత్ర పరికరాల సహాయంతో చల్లడం ద్వారా పురుగులను ఆకర్షించే ట్రాప్‌ల ద్వారా ఈ వ్యాధిని కొంతమేరకు నియంత్రించవచ్చు. జపాన్, మరికొన్ని అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం 'వేపర్‌హీట్ ట్రీట్‌మెంట్' వల్ల మాత్రమే మామిడి పండుకు ఆ వ్యాధి లక్షణాలు ఉండవని అభిప్రాయపడుతున్నాయి. అలాంటి ప్రక్రియ పూర్తయిన పండ్లను మాత్రమే అనుమతిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల కిందటే ఈ విషయం స్పష్టమైనప్పటికీ భారత ప్రభుత్వం తాత్సారం చేసింది. కొంతకాలం కిందటే ఢిల్లీలో పైలట్ వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నెలకొల్పారు. వాణిజ్యపరంగా లాభసాటి కలిగించే యూనిట్లను పలు ప్రాంతాల్లో నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం, ఇతర ఆర్థిక సంస్థలు తోడ్పడాలి. ఫిలిప్పిన్స్‌లో ఇటువంటి యూనిట్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. జపాన్‌కు ఆ దేశం భారీస్థాయిలో మామిడి పండ్లు ఎగుమతి చేస్తోంది. మ్యాంగో హాపర్స్, మీలేబగ్ తదితర కీటకాల వల్ల నష్టం వాటిల్లకుండా నిర్దిష్ట చర్యల ద్వారా నియంత్రించవచ్చు. అధికస్థాయిలో రసాయనిక క్రిమి సంహారక మందులను వాడటం వల్ల కలిగే నష్టాల గురించి రైతులు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ప్రకృతిలో కొన్ని రకాల పురుగులు పైర్లకు, పండ్లకు చేటుచేసే మరికొన్ని రకాల పురుగులను తింటాయి. రసాయనిక క్రిమి సంహారక మందులను

మోతాదుకు మించి వాడితే రైతుకు మేలు చేసే పురుగులు చనిపోతాయి. హానిచేసే పురుగుల సంఖ్య వాటి నిరోధక శక్తి పెరగడం వల్ల పండ్లకు, పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఆ పరిస్థితిలో అదుపు చేసేందుకని రైతులు ఇంకా ఎక్కువ మోతాదులో రసాయనిక మందులు వినియోగించడం పరిపాటి. దరిమిలా పండ్లలో, ఆహార ధాన్యాలలో ఆ మందుల అవశేషాల వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతోందని అభివృద్ధి చెందిన దేశాలు భయపడుతున్నాయి. ముందు జాగ్రత్తగా అలాంటి ఉత్పత్తులను అనుమతించడం లేదు. భారతదేశ రైతులు ఈ పరిస్థితిని గ్రహించాలి. సింథటిక్ పైరిత్రాయిడ్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ వినియోగించకుండా జాగ్రత్తపడాలి. మందులను శాస్త్రజ్ఞుల సలహా మేరకు మాత్రమే వారు చెప్పిన మోతాదుల్లోనే వాడాలి. సాధ్యమైనంత వరకు ఫంగిసైడ్లతో పెస్టిసైడ్లను కలుపరాదు. రసాయనిక మందుల వాడకాన్ని తగ్గిస్తూ బయోపెస్టిసైడ్లను వినియోగించడం మేలు. వేప సంబంధమైన మందుల వినియోగం ఇప్పుడిప్పుడే ప్రచారంలోకి వస్తోంది. భారతదేశంలో చాలాకాలం కింద రకరకాల పురుగుల బారి నుంచి పంటలు రక్షించడానికి ప్రకృతి సహజ వనరులతో కొన్ని పద్ధతులు పాటించేవారు. గోమూత్రం, మజ్జిగలో కొన్ని రకాల పూలు, ఆకులు కలిపి కొన్ని రోజులపాటు నిల్వ చేసేవారు. ఆ తర్వాత వచ్చే రసాన్ని పంటలపై చల్లేవారు. ఇప్పుడు యూరప్‌లో గ్రీన్‌హౌస్‌లలో రసాయనిక మందుల వాడకాన్ని నిషేధించారు. అమెరికా తదితర దేశాలు వేప, పసుపు సంబంధ ఔషధాలపై పేటెంటుల కోసం ప్రయత్నిస్తున్న ప్రస్తుత నేపథ్యంలో పాత పద్ధతుల ప్రాముఖ్యంపై దృష్టి సారిస్తున్నారు. ఎగుమతుల విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం. ఎగమతులకు ఉద్దేశించిన మామిడి పండ్లు దాదాపు ఒకే సైజులో ఉండేలా చూడాలి. కాయలు కోసేటప్పుడు, రవాణా చేసేటప్పుడు కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. కాయలు కోసేటప్పుడు కాయకు దెబ్బతగలకూడదు. ఎత్తులో ఉన్న కాయలను కోయడానికి వినూత్న పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ, మహారాష్ట్రలో కొంకణ్ కృషి విద్యాపీఠ్ తదితర సంస్థలు కొత్తరకం పరికరాలను రూపొందించాయి. పండ్లను దెబ్బతినకుండా కోయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కోసిన వెంటనే కాయలను సూర్యరశ్మి తగలకుండా నీడలో పెట్టడం ముఖ్యం. కోసిన తర్వాత కాయలు సూర్యరశ్మి ఎంతగా తగిలితే అంత త్వరగా పక్వానికి వచ్చేస్తాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. రసాయనిక ఎరువులనే కాకుండా

వాటితో పాటు సేంద్రియ ఎరువులను కూడా వాడితే కోసిన కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. ప్రత్యేకించి విదేశాలకు ఎగుమతి చేయదలచుకున్న కాయ తోటలలో సేంద్రియ ఎరువును తప్పక వినియోగించాలి. కోసిన కాయలను గుట్టలుగా పోయడం, వాహనాల్లోనూ అలాగే తరలించడం సరయిన పద్ధతికాదు. కాయపైన నాలుగు కాయలకు మించి భారం పడితే దెబ్బతినే అవకాశముంటుంది. దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్లాస్టిక్ క్రేట్లలో రవాణా చేయడం మేలయిన పద్ధతి. గాలిసోకే అవకాశం గల ఇతర ప్యాకేజీ తరహా పద్ధతుల్లోనూ రవాణా చేయవచ్చు.

## పోటీకి తగిన జాగ్రత్తలు

ఇతర దేశాలకు పంపించే పండ్లకు మైనపు పూత పూయడం వల్ల ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. దూర దేశాలకు రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లలోఎగుమతి చేస్తున్నారు. కోతకు ముందు సున్నపు స్ప్రే, ఫంగిసైడ్ స్ప్రే వల్ల షెల్ఫ్‌లైఫ్ పెరుగుతుంది. విదేశీ మార్కెట్లలో పోటీకి అనుగుణంగా ఎగుమతుల నాణ్యత, ధర విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. మామిడి పండ్ల ధర సరసంగా ఉండాలంటే ప్రభుత్వ పక్షాన ఎగుమతులకు సబ్సిడీ తప్పనిసరి. గత రెండేళ్ళుగా మామిడి పండ్ల ఎగుమతులకు అయ్యే విమాన రవాణా ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 25 శాతాన్ని సబ్సిడీగా ఇస్తోంది. నౌకల ద్వారా ఎగుమతి చేసే ఉత్పత్తులకు కూడా ఈ విధమైన సబ్సిడీ ఇవ్వడం అవసరం. నౌకాశ్రయాల్లో, విమానాశ్రయాల్లో శీతల గిడ్డంగుల సదుపాయం కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి పండ్లకు సంబంధించిన అన్ని అంశాలపట్ల సరయిన అవగాహనతో నిర్దిష్ట చర్యలు తీసుకొంటే ఎగుమతులు పెంపొందుతాయి. ఆ లక్ష్యంతో రైతులకు అన్ని విధాల చేయూతనిస్తే ఏటా వేల కోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యం ఆర్జించే అవకాశం లభిస్తుంది.

*ది. 11-10-1997.* — *ఈనాడు*

●

# వ్యవసాయ మార్కెటింగ్‌లో నవశకానికి నాంది

పంట చేతికి రావడంతో రైతు కష్టాలు ముగిసినట్లు కాదు. హోల్‌సేల్ మార్కెట్‌లో అతితక్కువ ధర లభించినప్పుడు రైతుకు మిగిలేది తీరని వ్యధ. కోత ఖర్చులు, రవాణా ఛార్జీలు కూడా దక్కవని భావించినప్పుడు పంట కోయకుండా వదిలివేయడం మినహా చేయగలిగింది లేదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - గిట్టుబాటు ధర లభించదనే నైరాశ్యంతో రైతు కుమిలిపోతున్న సమయంలోనే అవే కూరగాయంకు మార్కెట్‌లో వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లిస్తుంటాడు. పండ్లు, కూరగాయలు ఎక్కువ రోజులు నిలవ ఉండవు. వాటిని నిలవజేసి అమ్ముకోవడానికి తగిన సదుపాయాలు ఇంకా అభివృద్ధి కాలేదు. రైతులు ఏదో ఒక ధరకు సత్వరం సరకును అమ్ముకోక తప్పడం లేదు. మధ్య దళారుల దోపిడికి అస్కారం ఇస్తున్న అంశమూ అదే. రైతుకు లభించిన ధర కన్నా వంద నుంచి నూటయాభై శాతం ఎక్కువ ధరకు వినియోగదారుడు కొనుగోలు చేయాల్సి వస్తోంది. నెలల తరబడి చెమటోడ్చిన రైతుకు దక్కే ప్రతిఫలంకన్నా, తన ఆవరణలో సరకు దిగినందున కొద్ది గంటలలోనే హోల్‌సేల్ వ్యాపారి యాభై నుంచి ఎనభై శాతం మార్జిన్ సంపాదించగలుగుతున్నాడు రిటైల్ వ్యాపారులు మరో యాభై నుంచి ఎనభై శాతం లాభాలు దండుకుంటున్నారు. ఫలితంగా– వినియోగదారుడు చెల్లిచే ధరలో 30 నుంచి 40 శాతం మాత్రమే రైతుకు లభిస్తోందని అంచనా. మధ్య దళారుల దోపిడిని అరికట్టి రైతుకు సరైన ప్రతిఫలం దక్కేలా, వినియోగదారుడికి సరసమైన ధరలో సరకులు అందేలా చూడటానికి 'అప్నా మండీ'లు ఏర్పాటయ్యాయి. కూరగాయలు, పండ్లు పండించే రైతులకు లాభం చేకూర్చడం వీటి ముఖ్య ఉద్దేశ్యం. వర్తకులకులాగా అమ్మకాలు నిర్వహించడం తమకు సాధ్యం కాదేమోనన్న సంశయాన్ని మటుమాయంచేసి రైతులలో

ఆత్మవిశ్వాసం పెంపొదిందించడానికి తద్వారా వారి ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ఈ చర్య దోహదం చేస్తుంది.

## రిటైల్ మార్కెట్ల మీదా ప్రసరిస్తున్న ప్రభావం

ఇంగ్లాండు, అమెరికాలలో 'శనివారం మార్కెట్లు' ఆయా దేశాలలో రైతులకు సత్ఫలితాలను ఇస్తున్న తీరును గమనించిన పంజాబ్ రాష్ట్రం ఆ తరహా మార్కెట్లను మొట్టమొదటగా మన దేశంలో ప్రారంభించింది. ఆ దేశాలలో మార్కెట్లను అధ్యయనం చేసిన పంజాబ్ మండీ బోర్డు 'అప్నా మండీ'లకు శ్రీకారం చుట్టింది. పండ్లు, కూరగాయల విక్రయానికి వీలు కల్పిస్తూ చండీగఢ్‌ను అనుకుని ఉన్న మొహలి పట్టణంలో తొలి పర్యాయం అప్నా మండీని ప్రయోగాత్మకంగా నిర్వహించింది. దరిమిలా పంజాబ్‌లోని 34 పట్టణాలకు ఈ పథకాన్ని విస్తరింపజేశారు. 1987 ఫిబ్రవరిలో 88 మంది రైతులతో ప్రారంభమయిన ఈ పథకంలో ఇప్పుడు నాలుగు వేల మంది సభ్యులు. కేంద్ర పాలిత ప్రాంతమయిన చండీగఢ్‌లోనూ 'పంజాబ్ మండీ బోర్డు' వివిధ సెక్టారలో అప్నా మండీలను నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా కేంద్రాలన్నిట, విజయవాడ, తిరుపతి వంటి ముఖ్య పట్టణాలలోను ఈ నెల 26న రైతుబజార్‌లు ప్రారంభమయ్యాయి. అంతకు ముందే హైదరాబాద్‌లోని మెహిదీపట్నం, కూకట్‌పల్లిలలో రైతుబజార్లు ప్రయోగాత్మకంగా ప్రారంభమయ్యాయి. తాత్కాలికంగా షెడ్లు వేసి రైతుబజార్లను ప్రారంభించారు. సమీప ప్రాంతాలలో కూరగాయలు, పండ్లు పండిస్తున్న రైతులకు అవకాశం కలిగించారు. హోల్‌సేల్ మార్కెట్లలో లభించిన ధరకన్నా ఎక్కువ గిడుతున్నందుకు రైతులు, సరైన తూకంతో తాజా సరకులు సరసమైన ధరకు లభ్యమవుతున్నందుకు వినియోగదారులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. గమనార్హమైన విషయం ఏమిటంటే– రైతు బజార్లు ప్రారంభం కావడంతోనే రిటైల్ మార్కెట్లలోనూ కూరగాయల ధరలు తగ్గటం. ఈ కొత్త ప్రయోగం జయప్రదం కావాలని, రైతుబజార్లు మిగతా ప్రాంతాలకూ విస్తరించాలని అనేక మంది కోరుతున్నారు. పండ్లు, కూరగాయలు సహేతుకమైన ధరలకు లభించినప్పుడు వాటి వినియోగం కూడా పెరుగుతుంది. కూరగాయలు పండించడంలో చైనాది అగ్రస్థానం కాగా భారత్ రెండో స్థానంలో ఉంది. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 280 గ్రాముల కూరగాయలు భుజించాల్సి ఉంటుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. భారతదేశంలో కూరగాయల తలసరి వినియోగం కేవలం 125 గ్రాములే.

పండ్లు, కూరగాయలు పేదవారికి కూడా అందుబాటులోకి వస్తే వారి ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయి. పండ్ల దిగుబడిలో బ్రెజిల్‌ను అధిగమించి భారతదేశం అగ్రస్థానానికి చేరింది. దిగుబడులు ఆశావహంగానే ఉన్నా అనేక కారణాలవల్ల వేల కోట్ల రూపాయల విలువైన కూరగాయలు, పండ్లు వృథా పోతున్నాయి. మేలైన పద్ధతులను అనుసరించి పండించటం, వాటిని కోయడంలోనూ, నిల్వజేయడంలోనూ శ్రద్ధ తీసుకోవడం, రవాణా, మార్కెటింగ్ వసతులను అభివృద్ధి పరచడం, ప్రాసెసింగ్, ఎగుమతులకు మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. అలాంటి కృషిలో 'రైతు బజార్' తొలి అడుగు. పంజాబ్‌లో అప్నా మండీ కన్నా స్వరూపం రీత్యా మన రాష్ట్రంలోని రైతుబజార్ ఆలోచన మెరుగుగా ఉంది. రైతులు పండించిన సరకులను మార్కెట్‌కు తీసుకు వచ్చేందుకు 'అప్నా మండీ'లో ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమీ లేవు. స్వంత ట్రాక్టర్లమీద లేదా బాడుగకు తీసుకున్న వాహనాలమీద పంజాబ్‌లోని రైతులు అప్నా మండీలకు పంటలను తరలిస్తున్నారు. మన రాష్ట్రంతో పోలిస్తే పంజాబ్‌లో ట్రాక్టర్ల వాడకం బాగా ఎక్కువ. అందువల్ల ఆ రాష్ట్రంలో రైతులకు ట్రాక్టర్లు సులభంగా లభ్యమవుతాయి. మన రాష్ట్రంలో పరిస్థితి వేరు. వ్యవసాయం పనులు ముమ్మరంగా జరిగే రోజులలో ట్రాక్టర్లను కూరగాయల రవాణాకు కేటాయించడం కష్టసాధ్యం. రైతు బజార్లు ఏర్పాటు చేసినచోట్ల పరిసరాలలో ఏయే గ్రామాలలో కూరగాయలు, పండ్లు పండిస్తున్నారో గుర్తించి, ఉదయానే ఆయా గ్రామాల నుంచి రైతు బజార్లకు సరకును చేరవేసే సదుపాయాన్ని ఆర్టీసీ ద్వారా కల్పిస్తే బాగుంటుంది. రైతులు తమ గ్రామాలకు తిరిగి చేరే ఏర్పాట్లు కూడా అవసరమే. రైతు పేరు, ఫోటో, గ్రామం మండలం, పంట వేస్తున్న భూమి విస్తీర్ణం, అతడి పేరున ఉన్న మొత్తం భూమి మొదలైన వివరాలున్న గుర్తింపుకార్డును అందజేసి, గుర్తింపు పొందిన రైతులను మాత్రమే అనుమతించాలి. రైతులు అనేక రకాల పంటలు పండిస్తున్నారు గానీ ప్రస్తుతానికి కూరగాయలు, పండ్లు అమ్ముకునే సదుపాయం కలిగిస్తే సరిపోతుంది. ధాన్యం, అపరాలు, పసుపు, ఎండుమిర్చి వంటివి త్వరగా చెడిపోవు. సంతృప్తికరమైన ధర లభించినప్పుడే వాటిని అమ్ముకోవచ్చు. స్వల్పకాలిక పంట రుణాలు తీర్చడానికి, చేబదుళ్లను తిరిగి చెల్లించడానికి, ఇతర తక్షణావసరాలకు పైకం కావాల్సివస్తే పండిన పంటను మార్కెట్ కమిటీ గోదాములలో ఉంచి 50 నుంచి 60 శాతం విలువ మేరకు అడ్వాన్సు పొందవచ్చు. సంతృప్తికరమైన ధర వచ్చినప్పుడే పంటను అమ్ముకోవచ్చు.

ఈ సదుపాయాన్ని రైతులు వినియోగించుకుంటున్నారు. కూరగాయలు, పండ్ల విషయంలో అలా జరగడం లేదు. వాటి పంటలో 20 నుంచి 30 శాతం వృథా పోతున్నాయని అంచనా. పండ్లు, కూరగాయలు, కొన్ని రకాల వాణిజ్యపంటలు ఎక్కువగా పండిస్తున్న ప్రాంతాలలోని మార్కెట్ యార్డులలో కోల్డ్ స్టోరేజి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం ముదావహం. ఇందువల్ల కొద్ది రోజులపాటు నిల్వ చేసుకుని సరకులు అమ్మే వీలు చిక్కుతుంది. రైతు బజార్లలో మంచినీటి సదుపాయం కల్పించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని మన రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. రైతుబజార్ల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ఒకే నమూనాతో షెడ్లు నిర్మించాలని నిర్ణయించారు. పంజాబ్‌లో అప్నా మండీలు ఏర్పాటై పదేళ్ళు దాటినా ఈ రైతుల కోసం కనీస సదుపాయాలు కల్పించలేదు. జన్మభూమికి ప్రత్యేక లోగో ఉన్నట్లే రైతుబజార్లకూ ప్రత్యేక చిహ్నం ఉండాలి. అది చూడగానే అక్కడ రైతు బజార్ ఏర్పాటయిందని ప్రజలకు తెలుస్తుంది. రైతుబజార్లలో టెలిఫోను బ్యాంకు వంటి మరికొన్ని సదుపాయాలు కూడా కల్పించే ఆలోచన ఉంది. రైతులు సరకును అమ్మగా వచ్చిన సొమ్మును వెంట తీసుకువెళ్లే అవసరం లేకుండా అక్కడే ఉన్న బ్యాంకులో జమచేసి తమ తమ గ్రామాల్లోని బ్యాంకుల నుంచి పొందేలా ఏర్పాట్లు చేయాలన్నది ఆలోచన. ఈ ఆలోచన ఆచరణకు వస్తే రైతులకు తప్పక మేలు జరుగుతుంది. రాష్ట్రంలోని రైతు హెూల్‌సేల్ మార్కెట్లలో నష్టపోవడానికి మరో కారణం కమీషన్ సమర్పించుకోవాల్సి ఉండటం. రైతులు హెూల్‌సేల్ వ్యాపారస్తులకు పది శాతం కమీషన్ సమర్పించుకుంటున్నారు. పంజాబ్‌లో రైతులు ఇలా కమీషన్ ముట్టజెప్పాల్సిన అవసరం లేదు. పంజాబ్ అగ్రికల్చరల్ మార్కెట్ చట్టం ప్రకారం అలాంటి కమీషన్లు నిషిద్ధం కూడా. మన రాష్ట్రంలో - బస్తాకు మూడు కిలోల రద్దు తీయడం, ఎత్తుడు దింపుడు కూలి కింద కొంత, మార్కెట్ ఖర్చులు, రుసుము కింద ఇంకొంత, ముట్టి అని మరి కొంత– ఇలా రకరకాలుగా రైతులు దోపిడికి గురవుతున్నారు. ఈ విధమైన దోపిడిని, తూకాలలో మోసాలను అరికట్టడం ఎంతైనా అవసరం. ప్రతిరోజూ రిటైల్ మార్కెట్‌లో ఉదయం ఉన్న ధరలను గమనించి, ఆ ధరల్లో 80 శాతం మించకుండా రైతు బజార్లలో సరకులు అమ్మే పద్ధతిని ఏర్పాటు చేస్తే వినియోగదారుడూ తనకు తక్కువ ధరకు సరకు దొరికిందని సంతోషపడతాడు. కమీషన్ వ్యాపారస్తునికి అమ్మినదాని కన్నా ఎక్కువ మొత్తం చేతికి అందినందుకు రైతు కూడా సంతోషపడతాడు. ఈ ప్రభావం

ఇతర మార్కెట్లపైన కూడా ప్రసరించి ధరలు యథేచ్ఛగా పెంచే అవకాశం కనుమరుగవుతుంది. ధరల నిర్ణయం ముఖ్యమైన అంశం అయిన దృష్ట్యా కొద్దికాలం తరువాత కొద్దిమంది అభ్యుదయ రైతులను ఎంపిక చేసి ఒక చిన్న కమిటీని ఏర్పాటు చేయాలి. వారు ప్రతినిత్యం కూరగాయలు, పండ్ల సీలింగ్ ధరలు నిర్ణయించే పద్ధతిని ప్రవేశ పెట్టాలి.

## ఆంధ్రకేసరి కలలు సాకారమవుతున్న వేళ

రైతులకు సంతృప్తికరమైన ధరలు లభించినప్పుడు పంటల విస్తీర్ణం కూడా పెరుగుతుంది. కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్నప్పుడు రసాయనిక పురుగు మందులను ఎక్కువగా వాడటం వల్ల ఖర్చు పెరగడమే కాక ప్రజల ఆరోగ్యానికీ హాని కలుగుతుందని, సహజమైన పురుగు మందులు (బయో పెస్టిసైడ్స్), సహజమైన ఎరువులు ఉపయోగించడం మేలని వ్యవసాయశాఖవారు రైతులందరికీ తెలియజేయాలి. దేశంలోని ప్రధాన పట్టణాలలో వివిధ వ్యవసాయోత్పత్తుల ధరలను, రాష్ట్రంలోని ముఖ్యమైన పట్టణాలలో అవే ఉత్పత్తుల ధరలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలి. దీనివల్ల రైతులకు సరైన అవగాహన కలిగి కష్టార్జితాన్ని సరైన ధరకు అమ్ముకోగలుగుతారు. తక్కువ ధరలోనే వినియోగదారులందరికీ పండ్లు, కూరగాయలు లభ్యమైతే తలసరి పౌష్టికాహార లభ్యత పెరిగి తద్వారా ఆరోగ్యం, సంక్షేమం సమకూరుతాయి. దాదాపు యాభై సంవత్సరాల పూర్వం టంగుటూరి ప్రకాశం ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు లాభదాయకమైన విధానాన్ని రూపొందించాలని భావించారు. రైతు బజార్లు ఆయన ఆలోచనలను సాకారం చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుదలతో, ఉత్సాహంతో ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు. 'రైతు బజార్' రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌లో నవశకానికి నాంది పలకాలన్నదే అందరి ఆశ.

*ది. 29-01-1999.* — *ఈనాడు*

●

# కాపాడుకోవాల్సిన కొల్లేటి సిరి

దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన కొల్లేరులో కొంతకాలంగా సమస్యల సుడిగుండాలు చెలరేగుతున్నాయి. ఈ మంచినీటి సరస్సుకు సంబంధించిన కొన్ని ప్రధాన సమస్యలకు ఇప్పటికీ పరిష్కార మార్గాలు కనుచూపుమేరలో అగుపడటం లేదు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పంట కాల్వలు, డ్రెయిన్ల ద్వారా; బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు వంటి ఏరుల ద్వారా కొల్లేరుకు వచ్చి చేరే వరదనీటి వల్ల సరస్సు చుట్టుపక్కలగల లక్షలాది ఎకరాల పంటపొలాలు ముంపునకు గురువుతున్నాయి. సైబీరియావంటి ప్రాంతాలనుంచి ఏటా వేలాది అరుదైన పక్షులు కొల్లేరుకు వలస వస్తుంటాయి. ఆక్రమణదారుల 'పుణ్యమా' అని, కొల్లేరు చిక్కి శల్యమవడంతో వలస పక్షుల సంఖ్య రానురాను తరిగిపోతోంది. ఎన్నోయేళ్లుగా వేలాది మత్స్యకార కుటుంబాలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ సరస్సులో ఆక్రమణలను తొలగించేందుకు ప్రభుత్వం నడుం బిగించడంతో వీరు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇవీ కొల్లేటి సమస్యల్లో ప్రధానమైనవి.

## శాశ్వత పరిష్కారంతోనే ఊరట

బుడమేరు వరదనీటిలో కొంతభాగం డైవర్షన్ కాల్వద్వారా కృష్ణానదిలోకి పోతున్నా, అధిక భాగం కొల్లేరులోకే చేరుతోంది. వర్షాకాలంలో రామిలేరు, ఎర్రకాల్వలద్వారా వరద నీరు కొల్లేరులో కలుస్తోంది. (నాగిరెడ్డిగూడెం వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేయడంతో తమ్మిలేరు ద్వారా కొల్లేరుకు వచ్చే వరదనీటి ఉద్ధృతి చాలావరకు తగ్గింది.) ఇవికాక కృష్ణా జిల్లాలోని గుండేరు, భూమికోదు పోలరాజు, చంద్రయ్య డ్రెయిన్లు, పశ్చిమ గోదావరి జిల్లాలోని పెదపాడు, వట్లూరు, తోకలపల్లి, పందికోడువంటి డ్రెయిన్లద్వారా వర్షాకాలంలో నీరు కొల్లేరులో కలుస్తుంటుంది. పంటకాల్వల విషయాని కొస్తే – ఏలూరు కాల్వకు ఉన్న ఎస్కేప్‌ల ద్వారా, కృష్ణాజిల్లాలోని అనేక పంటకాల్వల

ద్వారా వర్షపు నీరు కొల్లేరుకు వస్తుంటుంది. ఇలా వివిధ మార్గాల గుండా కొల్లేరులో చేరే లక్షలాది క్యూసెక్కుల నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. ప్రభుత్వం 1970లలో కొంతమంది మత్స్యకారులకు, బడుగువర్గాలకు చేపల పెంపకం నిమిత్తం కొద్దిపాటి భూమిని కేటాయించింది. సహకార సంఘాలను కూడా ఏర్పాటుచేసి ప్రోత్సహించింది. తదనంతర కాలంలో దేశ ఉత్తర ఈశాన్య ప్రాంతాల్లో చేపలకు గిరాకీ ఏర్పడటంతో కొల్లేరు రైతుల్లో కొందరు పట్టా భూములను చెరువులుగా మార్చివేశారు. ఇతర వ్యాపారాల్లో బాగా సంపాదించిన కోటీశ్వరులు, పలుకుబడిగల రాజకీయ నాయకులు సైతం చేపల చెరువుల వ్యాపకంలోకి దిగడంతో కొల్లేరు రూపురేఖలు మారి పోవడం మొదలైంది. స్థానికులతో లోపాయకారీ ఒప్పందాలు కుదుర్చుకుని పట్టా భూములనేకాక వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్నీ ఆక్రమించి చేపల చెరువులను తవ్వుకున్నారు. కొల్లేరు వద్ద పెద ఎడ్లగాడి, చిన ఎడ్లగాడి వంతెనలకు అత్యంత సమీపంలో సైతం చెరువులను తవ్వుకోవడం గమనా22ర్హం. అంతేకాదు, తమ చెరువులకు రక్షణగా ఎత్తయిన, పటిష్ఠమైన మట్టికట్టలు కూడా నిర్మించుకున్నారు. ఆక్రమణలకు నిరసనగా పరిసర గ్రామాల ప్రజలు ఎలుగెత్తినా, వారి ఆవేదనను, ఆక్రందనలను బయటి ప్రపంచానికి వినబడనివ్వకుండా రాజకీయ నాయకులు, కులపెద్దలు అణచివేసేవారు. ప్రభుత్వం ఎన్నో జి.ఓ.లు జారీ చేసినా, సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ఆక్రమణలు మాత్రం యధేచ్ఛగా కొనసాగాయి. దశాబ్దాల తరబడి సాగిన ఆక్రమణల కారణంగా కొల్లేరు విస్తీర్ణంలో 90 శాతం భూమి చేపల చెరువులుగా మారిపోయింది. దీంతో పైనుంచి వచ్చే వరదనీరు కొల్లేరులో ఇమిడే అవకాశంలేక పక్కనున్న పంటపొలాలను ముంచెత్తసాగింది. మరోపక్క - చేపల చెరువులు, మోటారుషెడ్ల వినియోగం, ఎరువులు, రసాయనాల వాడకం పెరిగిపోవడంతో పర్యావరణం కలుషితమై, వలసపక్షుల రాకకు విఘాతం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రంగంలోకి దిగి కొన్ని చెరువు కట్టల్ని తెగ్గొట్టించడంతో సమస్య తీవ్రత కొంతమేరకు తగ్గింది.

కొల్లేరును చుట్టుముట్టిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించినప్పుడే దానిపై ఆధారపడిన ప్రజలకైనా, పక్షులకైనా ఊరట. కొల్లేరును ఆక్రమించి ఐదవ కాంటూరు వరకు 75 వేల ఎకరాల్లో నిర్మించిన చెరువు కట్టలను పూర్తిగా తెగ్గొట్టాలి. షెడ్లను,

మోటార్లనూ తొలగించాలి. ఈ విస్తీర్ణంలో సంప్రదాయ పద్ధతుల్లో మాత్రమే చేపలు పట్టుకొనేందుకు మత్స్యకారుల్ని అనుమతించాలి. వలస పక్షుల పరిరక్షణ కోసం ఐదవ కాంటూరు వరకుగల ప్రాంతాన్ని అభయారణ్యంగా మార్చాలని జి.ఓ. నెంబరు 120 చెబుతోంది. అయితే అక్కడి వరకుగల చెరువులను మాత్రమే తొలగించడంవల్ల ఫలితం ఉండదు. ఐదునుంచి పదవ కాంటూరు వరకుగల చెరువులను కూడా పూర్తిగా నిర్మూలించాలి. లేకపోతే వరదనీటి కారణంగా చుట్టుపక్కల పొలాలను ముంపునుంచి కాపాడటం వీలుకాదు. పదవ కాంటూరు వరకు ఆక్రమణల్లో ఉన్న తొంభైవేల ఎకరాల భూమిని ప్రభుత్వం తక్షణం స్వాధీనం చేసుకోవాలి. పిమ్మట జువ్వి కనుమ, పేరంటాలు కనుమల వెడల్పును పెంచి, మరింత లోతుగా తవ్వి కొల్లేరు నుంచి వరదనీరు ఉప్పుటేరులోకి తేలిగ్గా ప్రవహించేందుకు మార్గం సుగమం చేయాలి. ఉప్పుటేరునుంచి సముద్రపునీరు కొల్లేరులోకి రాకుండా ఉండేదుకు కొట్టాడ సమీపంలో రెగ్యులేటర్‌ను నిర్మించాలి. ఛానలైజేషన్ మరో ముఖ్యమైన అంశం. దీనిని త్వరితగతిన చేపట్టకపోతే వరదనీరు ఉప్పుటేరుకు చేరే వీలు ఏర్పడదు. మిత్రాకమిటీ సిఫారసులకు అనుగుణంగా ఉప్పుటేరును ఆధునీకరించాల్సి ఉంది.

## మత్స్యకారుల ఉపాధికి పెద్దపీట

కొల్లేరుపై ఆధారపడి రెండులక్షలమంది మత్స్యకారులు జీవిస్తున్నారు. చెరువులను ధ్వంసం చేయడంవల్ల వీరంతా రోడ్డున పడుతున్నారు. వీరికి ఉపాధి చూపించడం ప్రభుత్వ బాధ్యత. కొల్లేరులో కేజ్‌కల్చర్, పెన్ కల్చర్ పద్ధతుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడం ఉభయ తారకంగా ఉంటుంది. చేపల పెంపకానికి వీలు ఏర్పడటమే కాకుండా, కొల్లేరుకు వచ్చి చేరే వరదనీరు సరస్సులోకి నేరుగా ప్రవహించేందుకూ మార్గం ఏర్పడుతుంది. పర్యావరణ కాలుష్యాన్నీ నివారించవచ్చు. ప్రస్తుతం ఎవరికివారు చెరువులకు చుట్టూ మట్టికట్టలు నిర్మించడంవల్ల వరద నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. వెదురు బొంగుల్ని చీల్చి, జల్లెడగా అల్లి వాటిని దడులుగా నిలబెట్టి చేపల పెంపకం చేపట్టడాన్ని 'కేజ్ కల్చర్' అంటారు. వెదురు బొంగులకు బదులు ప్రస్తుతం నైలాన్ వలలను వినియోగిస్తున్నారు. ఈ వలలను పట్టి ఉంచేందుకు ఇనుపగొట్టాలను 'కాలర్లు'గా వాడుతున్నారు. కేజ్ కల్చర్‌లో కిందిభాగంలో కూడా నైలాన్ వల ఉంటుంది. పెన్ కల్చర్ విషయానికొస్తే ఇరువైపులా భూమిలోకి వెదురు

గడలను కాస్త ఎడంగా దింపి, వాటికి కాలర్‌లకు బిగించిన వలలను కడతారు. ఇండోనేసియా, మలేసియా, జపాన్, ఫిలిప్పీన్స్, చైనా, కెనడా, అమెరికా తదితర 35 దేశాల్లో కేజ్, పెన్ కల్చర్ పద్ధతుల్లో చేపల పెంపకం విరివిగా సాగుతోంది. ఫిలిప్పీన్స్‌లోని లగూనా బే, గొన్ పాబ్లో సరస్సులలో వాణిజ్యస్థాయిలో మిల్క్ ఫిష్‌తోపాటు ఇతర రకాల చేపల పెంపకం నాలుగు దశాబ్దాలుగా ఈ పద్ధతుల్లో సాగుతోంది. మన దేశంలో అలహాబాద్ సమీపంలోని గంగ, యమున నదుల్లో కేజ్, పెన్ కల్చర్ పద్ధతుల్లో చేపల పెంపకం చేపడుతున్నారు. జాతీయ వ్యవసాయ టెక్నాలజీ ప్రాజెక్టు సహకారంతో కేంద్రీయ ఇన్‌లాండ్ ఫిషరీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 2002లో పెన్ కల్చర్ ప్రాజెక్టును మూడు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. తక్కువ ఖర్చుతో లాభదాయకమైన రీతిలో పెన్ కల్చర్ పద్ధతిన చేపల పెంపకం చేపట్టవచ్చునని ఈ పరిశోధనల్లో వెల్లడైంది.

## చేపల పెంపకానికి రుణ సౌకర్యం

కొల్లేరులో సాంప్రదాయకమైన రీతిలో చేపలు పట్టుకోవడానికి అనుమతించడంతోపాటు ఐదు-పది కాంటూరుల మధ్య కేజ్ కల్చర్‌ను అనుసరించి చేపల పెంపకం చేపట్టాలి. అయితే ఈ వెసులుబాటును స్థానికేతరులకు కల్పించకూడదు. భూమిలేని నిరుపేదలకు కేజ్ లేదా పెన్ కల్చర్ పద్ధతిన చేపల పెంచడానికి అనుమతినిచ్చి, అందుకు అవసరమైన సామగ్రి కొనుగోలు కోసం రుణసౌకర్యం కల్పించాలి. ఈ పద్ధతిలో చేపల పెంపకంవల్ల నీరు కలుషితం కాదు, పర్యావరణానికి ఎలాంటి హానీ కలగదు. ఈ చర్యలన్నింటినీ చేపడితే కొల్లేరు ఎదుర్కొంటున్న ప్రధానమైన కొన్ని సమస్యలకైనా శాశ్వత పరిష్కారం దొరకవచ్చు. లక్షలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కూడా లభిస్తుంది.

*ది. 11-02-2006.* **- ఈనాడు**

●

# మామిడి రైతుకు చేదు అనుభవం

అందరికీ అతి మధురాన్ని అందించే మామిడి ఈ సంవత్సరం పండించిన రైతుకు మాత్రం చేదు అనుభవాన్ని మిగిల్చింది. పంట బాగా పండిన ఏడాది తక్కువ ధర లభించినా రైతు పెద్దగా బాధపడదు. సరిపెట్టుకొంటాడు. ఈ సంవత్సరం మంచు, అకాల వర్షాల వల్ల మన రాష్ట్రంలో మామిడి పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. సాధారణ స్థాయిలో సగమే ఉత్పత్తి అయినట్టు అంచనా. అయినా బంగినపల్లి, తోతాపురి రకాలకు అతి తక్కువ ధరలు లభించి రైతుకు ఆవేదనను, నిరుత్సాహాన్ని మిగిల్చాయి.

దేశంలో సుమారు 35 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రపంచంలో సుమారు కోటి యాభై లక్షల టన్నుల మామిడి కాయలు పండుతుంటే మన దేశంలోనే దాదాపు 95 లక్షల టన్నుల మామిడి కాయలు ఉత్పత్తి అవుతున్నాయి. అంటే ప్రపంచ మామిడి పండ్ల ఉత్పత్తిలో 63 శాతం మన దేశానిదే. అయినప్పటికి వీటి ఎగుమతిలో మాత్రం మనం చాలా వెనుకబడి ఉన్నాం.

ప్రపంచ మామిడి దిగుమతుల్లో సగం వాటా అమెరికాది. నిరుటి వరకు భారత్ నుంచి అమెరికాకు మామిడి దిగుమతులపై ఆంక్షలు ఉండేవి. జపాన్ లో ఆల్ఫాంసో మామిడి పండు ఖరీదు వంద రూపాయలు. గత ఏడాది వరకు జపాన్‌కు కూడా ఎగుమతులకు వీలులేకపోయింది. ఈ సంవత్సరం నుంచి జపాన్ దేశానికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ చేసిన పండ్లను ఎగుమతి చేయడానికి అవకాశం ఏర్పడింది. ఫ్రూట్ ఫ్లై, స్టోన్ వేవెల్ (టెంకె పురుగు) సమస్యలను ఈ ట్రీట్‌మెంట్ ద్వారా అధిగమించవచ్చు. కిరణీకరణ(ఇర్రేడియేషన్) పద్ధతితో ట్రీట్‌మెంట్ చేసిన పండ్లను ఇప్పుడు అమెరికాకు ఎగుమతి చేయగలుగుతున్నారు. అమెరికా అధ్యక్షుడు బుష్ గత ఏడాది భారత్‌లో పర్యటించినప్పుడు మామిడి పండ్ల ఎగుమతుల్ని అనుమతించనున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు అమెరికాలో కిలో మామిడి పండ్ల ఖరీదు పది డాలర్లు-అంటే దాదాపు 420

రూపాయలు. మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో ఉన్న బాబా ఆటమిక్ రిసెర్చ్ సెంటర్ సహకారంతో ఇర్రేడియేషన్ యూనిట్‌లో ట్రీట్‌మెంట్ చేసిన పండ్లను అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. రానున్న కాలంలో మనదేశం నుంచి అమెరికాకు, జపాన్‌కు పెద్ద ఎత్తున మామిడి పండ్లను మంచి ధరలకు ఎగుమతి చేసే వీలుంది.

ఈ నేపథ్యంలో మామిడి రైతును మార్కెట్ శక్తులు నిలువు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వాలు గుడ్లప్పగించి చోద్యం చూస్తున్నాయి. రైతుకు బాసటగా కనీస గిట్టుబాటు ధరలను ఇప్పించేందుకు ప్రయత్నించక పోవడం దురదృష్టకరం. కొనుగోళ్ళలో పారదర్శకత లేదు. బహిరంగ వేలం పద్ధతిని అనుసరించడం లేదు. వినియోగదారుడు అధిక ధరకు కొనుక్కుంటున్నా, అందులో కొద్ది భాగం మాత్రమే రైతుకు దక్కుతోంది.

ఇప్పటివరకు మామిడి పంటకు కనీస ధరల నిర్ణయం లేదు. మనదేశం నుంచి ఎగుమతులకు చక్కని అవకాశాలు ఉన్న పసుపు, మిర్చి, మామిడి, ద్రాక్షవంటి ఉద్యానవన ఉత్పత్తులకు ఇకనైనా కనీస గిట్టుబాటు ధరలను నిర్ణయించాలి.లోగడ బెంగళూరులో ఉద్యాన పంటల ఉత్పత్తిదారుల సహకార సంస్థ తన రిటైల్ దుకాణాల్లో వినియోగదారులకు అమ్మే ధరల్లో రైతుకు 80 శాతం ముట్టజెప్పేది. ఈ పద్ధతి మంచిదే. ఇటీవల దాన్ని 75 శాతానికి తగ్గించారు. ధరలపై రైతులతో కాంట్రాక్టు కుదుర్చుకుంటే సరకులో నాణ్యత పెరుగుతుంది. సరఫరా కాలవ్యవధిలో స్పష్టత ఉంటుంది. రైతు నాణ్యమైన మామిడి పంటను పండించడంపైన దృష్టి పెడతాడు. దేశంలో మామిడికి సంబంధించి 33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. మామిడి పండ్ల గుజ్జును, రసాన్ని, ముక్కల్ని డబ్బాల్లోనూ, సీసాల్లోనూ నిల్వ చేయడానికి, జామ్, ఊరగాయ పచ్చళ్ళను తయారు చేయడానికి మన రాష్ట్రంలో సుమారు 45 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఆంధ్రుల ఆవకాయ పచ్చడి విదేశాల్లో సైతం బాగా ఖ్యాతి నార్జించింది. కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాల విజన్ డాక్యుమెంటులో పేర్కొన్న దాని ప్రకారం-ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మౌలిక సామర్థ్యం పెంపొందించాలి. మార్కెట్ అభివృద్ధి పరచాలి. ఇందుకోసం దాదాపు లక్షకోట్ల రూపాయల పెట్టుబడులను సమకూర్చడం ద్వారా ఎక్కువ కాలం నిల్వచేయడానికి అవకాశంలేని ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ స్థాయిని 6 శాతం నుంచి 2015 నాటికి 20 శాతానికి పెంచాలి. ఆహార ఉత్పత్తులకు విలువను జోడించే స్థాయిని ప్రస్తుత 7

శాతం నుంచి 30 శాతానికి పెంచాలి. ఈ లక్ష్య సాధనకు అవసరమైన చర్యలు నత్తనడకగానే సాగుతున్నాయి. తిరుపతిలో వేపర్‌హీట్ ట్రీట్‌మెంట్ సౌకర్యంపై కేంద్ర వాగ్దానం ఇంకా కార్యరూపం దాల్చలేదు. మామిడి పంట విస్తీర్ణం అత్యధికంగా ఉండి, ఆసియాలో అతి పెద్ద మ్యాంగో మార్కెట్ (నున్న ) కలిగిన కృష్ణాజిల్లాలో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ యూనిట్ ఎప్పుడు ఏర్పాటవుతుందో కచ్చితంగా తెలియరావడం లేదు. అమెరికాకు మామిడి ఎగుమతి చేయడానికి ఉపయోగపడే ఇర్రేడియేషన్ యూనిట్ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే విషయం ఇప్పటికీ పరిశీలన దశ దాటలేదు. మనకన్నా తక్కువ మామిడి పంట ఉన్నా మహారాష్ట్రలో ఏర్పాటయ్యాయి. అక్కడి నుంచి ఆల్ఫాంసో మామిడి పండ్లు జపాన్‌కు, అమెరాకాకు ఎగుమతి అవుతున్నాయి.

రైతులు తమ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయంలో వ్యక్తిగతంగానే కాక సమిష్టిగా సహకార సంస్థలనేర్పాటు చేసుకొని అధిక ఆదాయం పొందడానికి కృషిచేయాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ బలంగా ఉన్న దేశాల్లో కూడా వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల మార్కెటింగ్‌లో రైతుల సహకార సంస్థలు గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయి. దురదృష్టవశాత్తు మనదేశంలో అందునా మనరాష్ట్రంలో రైతుల సహకార సంస్థల పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి.

- *ఈనాడు*

●

# రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారునికి సరసమైన ధర

మన దేశంలో ఏటా సుమారు 7000 కోట్ల రూపాయల విలువైన పండ్లు, కూరగాయలు పండించబడుతున్నాయి. సరైన మార్కెటింగ్ సౌకర్యాలు, నిల్వచేసుకునే సదుపాయాలు లేకపోవడం వలన కనీసం 2000 కోట్ల రూపాయల విలువైన సరుకు వృథాగా పాడైపోతూ వుంటుంది. మిగిలిన భాగం ఎన్నోరెట్ల అధిక ధరలకు వినియోగదారులకు చేరుతుంది. జనాభాలో నూటికి ముప్పైఎనిమిది మంది దారిద్ర్యరేఖకు దిగువన వున్న పరిస్థితిలో చాలామంది పేద ప్రజానీకం పండ్లు, కూరగాయలను తగినంతగా కొనుక్కోలేకపోతున్నారు. మానవుడు సగటున రోజుకు 280 గ్రాముల కూరగాయలను తీసుకోవాలని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కాని మనదేశంలో సగటున 120 గ్రాముల కూరగాయలను మాత్రమే భుజిస్తున్నారని అంచనాలు తెలుపుతున్నాయి. సరసమైన ధరలకు ప్రజలకు పండ్లు, కూరగాయలు అందితే ప్రజల జీవన ఆరోగ్య పరిస్థితులు కొంత మెరగవుతాయి.

ప్రపంచంలో కూరగాయలను పండించడంలో చైనా తరువాత మనం రెండవ స్థానంలో వున్నాము. సుమారు 4.25 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో 40 మిలియన్ టన్నుల కూరగాయలను మనం పండిస్తున్నాము. పండ్ల ఉత్పత్తిలో బ్రెజిల్, అమెరికా సంయుక్త రాష్ట్రాల తరువాత భారతదేశం మూడవ స్థానంలో వుంది. 2.9 మిలియన్ హెక్టార్ల భూమిలో 27 మిలియన్ టన్నుల పండ్లను మనం ఉత్పత్తి చేసుకుంటున్నాము. అర్థాకలితో అలమటించే కోట్లాది ప్రజలు వున్న మన దేశంలో సుమారు 20 నుంచి 30 శాతం పండ్లు, కూరగాయలు వృథా కావడం రైతులకు, వినియోగదారులకు తీరని నష్టమే కాక దేశ ప్రయోజనాలకు కూడా పెద్ద దెబ్బ. ఈ నష్టాన్ని అధిగమించాలంటే

మన దేశంలో పండించే రైతులకు సరైన ధర ఇచ్చి వినియోగదారులకు సరసమైన ధరలకు వీటిని అందించగల మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పరచుకోవలసి వున్నది. అవసరమైన సమయాలలో సరకును నిల్వచేయగల శీతలీకరణ గిడ్డంగుల సదుపాయాలు కల్పించడం, వీటిని వినియోగించుకోగల ప్రాసెసింగు యూనిట్లను అధిక సంఖ్యలో నెలకొల్పుకోవడం, విదేశీ మార్కెట్‌కు ఎగుమతులను పెంచగలగడం వంటి పనులుకూడా చేయవలసి వున్నది.

మన దేశంలో ఇప్పటివరకు 4,47 లక్షల టన్నుల పండ్లు, కూరగాయలను ప్రాసెసింగ్ చేయగల 2,444 యూనిట్లు నెలకొల్పబడ్డాయి. అంటే మొత్తం ఉత్పత్తిలో కేవలం 1.5 శాతాన్ని మాత్రమే ఇవి ఉపయోగించుకోగలవు. అయితే ఈ ఉత్పాదక శక్తిలో ఇప్పుడు 40 శాతం మాత్రమే వినియోగించబడుతున్నది.

ఏటా సుమారు 25,000 నుంచి 30,000 టన్నుల కూరగాయలు విదేశాలకు ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేయబడుతున్నాయి. ఉల్లిపాయలు కూడా గణనీయమైన పరిమాణంలో మనం ఎగుమతి చేస్తున్నాము. ఏటా సుమారు పదివేల టన్నుల మామిడి పండ్లను మనం ఎగుమతి చేస్తున్నాము. మామిడిరసం, పచ్చళ్ళు, శీతలీకరణ చేయబడ్డ పండ్లు, పండ్ల ముక్కల ఎగుమతుల ద్వారా గణనీయంగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తున్నాము. మన ఎగుమతుల సరకులలో నాణ్యత సరిగా వుండేటట్లు చూసుకుంటూ అధునాతన ప్యాకేజింగ్ పద్ధతుల నవలంబించడం ద్వారా మన ఎగుమతుల నింకా అధికం చేసుకోగలుగుతాము.

ఇప్పటికీ దేశంలో సుమారు 2,680 శీతల గిడ్డంగులు ఉన్నాయి. ఇవి 174 లక్షల టన్నుల సరకులను నిల్వ చేయగలవు. పండ్లు, కూరగాయలు అధికంగా పండించబడుతూ వుండే ప్రాంతాలను, వాటికి సమీపంలో వున్న పట్టణాలను దృష్టిలో వుంచుకుని అధిక సంఖ్యలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయడం అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైనది మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటుచేయడం. అనేక వ్యయప్రయాసల కోర్చి పంట పండించిన రైతుకు సరైన ధర లభించాలి. సామాన్య మానవునకు సైతం అందుబాటులో వుండేలా సరసమైన ధరలకు ఈ పండ్లు, కూరగాయలు వినియోగదారులకు అందాలి. ప్రస్తుతం వున్న కమిషనుదార్లు, వర్తకుల వ్యవస్థను ఒక్కసారిగా త్రోసివేసి ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటుచేయడం అంత

సులభం కాదు. కాని ముందుకు వచ్చే రైతాంగం, సహకారాన్ని అందించే ప్రభుత్వం, చొరవ తీసుకునే స్థానిక పరిపాలనా సంస్థలు వుంటే శీఘ్రంగానే ప్రత్యామ్నాయ వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చు. పండ్లు, కూరగాయల రైతుల సహకార సంఘాలను ఏర్పాటు చేసి వాటి రిటైలు దుకాణాల ద్వారా నగరాలలో, పట్టణాలలో ప్రజలకు సరసమైన ధరలకు పండ్లు, కూరగాయలు వినియోగదారులకు అందేటట్టు చేయవచ్చు. బెంగుళూరులోని హార్టీ కల్చరల్ ప్రొడ్యూసర్స్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ మరియు ప్రాసెసింగు సొసైటీ వారి కృషి ఇందుకు మార్గదర్శకంగా వున్నది. ఈ సంస్థ బెంగుళూరు నగరంలో 109, మైసూరులో 33, మంగుళూరులో 15 రిటైల్ దుకాణాలను నిర్వహిస్తున్నది. ఈ సహకార సంస్థలో 5545 మంది రైతులు సభ్యులుగా వున్నారు. ప్రభుత్వం వాటా 19 లక్షల రూపాయలతో సహా మొత్తం షేర్ కేపిటల్ 25 లక్షల రూపాయలు.

లాల్‌బాగ్ సమీపంలోని కేంద్ర కార్యాలయం వద్దనే కాకుండా హోస్‌పేట, దొడ్డ బళ్ళాపుర వద్ద కూడా రైతుల నుంచి వచ్చే కూరగాయలు, పండ్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయబడ్డాయి. సాధారణంగా రైతులు వీటిని గ్రేడింగ్ చేసి తెస్తారు. అయినప్పటికీ ఒకవేళ కొంత సరకు నాణ్యత తక్కువగా వుంటే దానిని మాత్రం తొలగించి రైతు తెచ్చిన సరకును కాటావేసి, వెనువెంటనే అతనికి ఇవ్వవలసిన మొత్తాన్ని ఇచ్చివేస్తారు. సాధారణంగా కూరగాయలు రైతులనుంచి కొనుగోలు జరిగే హోల్‌సేల్ మార్కెట్ లేక మండీలో రైతుకు లభించే ధరకన్నా ఎక్కువ ధర ఈ సొసైటీ ద్వారా రైతుకు ముదుతుంది. దీనితోపాటు రిటైల్ దుకాణాలలో సరకు అమ్మే ఉద్యోగులకు ఇవ్వవలసిన వేతనాలు, రిటైల్ దుకాణాలకు సరకును అందజేయడానికి అయ్యే రవాణా ఛార్జీలు పరిగణనలోకి తీసుకుని సుమారు 20 శాతం మార్జిన్ కలిపి, సొసైటీ రిటైల్ దుకాణాలలో వివిధ రకాల కూరగాయలను, పండ్లను అమ్మవలసిన ధరలను ప్రతిదినం నిర్ణయిస్తారు. ఈ ధరలో 80 శాతం ధర రైతుకు ఇవ్వబడుతుంది.

1989-90లో ఈ సంస్థ 919 లక్షల రూపాయల విలువైన 11,297 టన్నుల పండ్లను, 16,183 టన్నుల కూరగాయలను, 28.37 లక్షల కొబ్బరి కాయలను, 17 లక్షల కోడిగ్రుడ్లను కొనుగోలుచేసి వినియోగదారులకు అందించింది. అంతేగాక నల్లద్రాక్ష, ఆరంజి పండ్ల నుంచి రసాలు తీసి కూడా ప్రజలకు అమ్ముతుంది. 200

మిల్లీలీటర్ల రసం సగటున రూపాయి ఇరవై అయిదు పైసలు చొప్పున 1989-90లో 22 లక్షల సీసాలు అమ్మబడ్డాయి.

ఒక్కొక్క రిటైలు దుకాణంలో సగటున రోజుకు 500 నుంచి 600 కిలోల కూరగాయలు అమ్మబడతాయి. సేల్స్‌మేన్‌కు రోజుకు 25 రూపాయల వేతనం లభిస్తుంది. కార్పొరేషన్‌వారు రిటైల్ దుకాణాలు నిర్మించడానికి అవసరమైన స్థలాలను ఒక్కొక్క దానిని నెలకు పది రూపాయల చొప్పున లీజుకు ఇస్తారు. బెంగుళూరు కొంతవరకు చల్లని వాతావరణం వుండే ప్రదేశం కావడంవల్ల ఈ రిటైల్ దుకాణాలను శీతలీకరణ చెయ్యలేదు. ఢిల్లీలోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డువారి బృహత్తర శీతలీకరణ కేంద్రం నుంచి యాపిల్సు, ఉత్తరాది రాష్ట్రాలలో లభించే వివిధ రకాల పండ్లు కూడా ఈ సొసైటీ తెప్పిస్తుంది. ఈ సొసైటీ ప్రభుత్వం నుంచి లేక ఆర్థిక సంస్థల నుంచి పెద్దగా ఋణం తీసుకోకుండానే ఇంతవరకు సమర్థవంతంగా తన కార్యకలాపాలను నిర్వర్తిస్తూ, క్రమేణా వాటిని పెంచుకుంటూ వస్తున్నది.

న్యూఢిల్లీలోని మంగోల్‌పురిలో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు కొంతకాలం క్రితం అయిదు ఎకరాల విస్తీర్ణంలో అత్యంతాధునికమైన కట్టడాలతో, సూపర్ మిని ఆన్ లైన్ కంప్యూటర్‌తో 50 టెర్మినల్స్ సదుపాయంతో పండ్లు, కూరగాయల పథకాన్ని చేపట్టింది.

సుమారు లక్ష టన్నుల పండ్లు, కూరగాయలను సంవత్సరం వ్యవధిలో నిల్వచేయగలిగిన విధంగా అతిపెద్ద శీతలీకరణ కాంప్లెక్సు నిర్మాణం ఇందులో భాగం. కూరగాయలను, పండ్లను గ్రేడింగ్ చేయడంగాని, నిల్వచేయడంగాని అంతా దాదాపు యంత్రాలతో జరుగుతూ వుంటుంది. ఇక్కడ నుంచి ఢిల్లీ నగరంలో వివిధ ప్రాంతాలలో ఏర్పరచబడ్డ 146 రిటైల్ దుకాణాల ద్వారా ఇవి వినియోగదారులకు అమ్మబడతాయి. ఢిల్లీలోని ఈ ఎన్.డి.డి.బి. రిటైల్ దుకాణాలు అన్నీ కోల్డ్ స్టోరేజి సదుపాయం వున్నవే. 1989-90లో ఈ సంస్థ సుమారు 50 వేల టన్నుల పండ్లు, కూరగాయలు సేకరించింది. ఈ న్యూఢిల్లీ సంస్థ కోసం వందకోట్ల రూపాయలకు పైగా వెచ్చించడం జరిగింది.

హైదరాబాదులో కూడా "ఫ్రెష్" అనే హార్టీ కల్చరల్ గ్రోయర్స్ సంస్థ కొన్ని సంవత్సరాలుగా రంగంలో వున్నది. కారణాలు ఏవోకాని ఈ "ఫ్రెష్" సంస్థ బెంగుళూరులోని సొసైటీవలె పనిచేయలేక పోతున్నది. ముఖ్యంగా హైదరాబాద్ నగర

పాలక సంస్థ వారు రిటైల్ దుకాణాలు తాము నిర్మించి "ఫ్రెష్"కు ఇవ్వవచ్చు లేక అవసరమైన ప్రదేశాలలో స్థలాలను "ఫ్రెష్"కు లీజుకు అందించవచ్చు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి అవసరమైన ఆర్థిక సహాయం తీసుకొని బెంగుళూరు సొసైటీవలెనే "ఫ్రెష్" తన కార్యక్రమాలను నిర్వహించగలిగితే పండ్లు, కూరగాయలు పండించే రైతులకు సరైన ధరలు ముట్టడమే కాక హైదరాబాదు-సికింద్రాబాదు జంట నగరాలలో వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇదే తరహాలో రానున్న కాలంలో విజయవాడ, విశాఖపట్నం, వరంగల్‌వంటి నగరాలు, పట్టణాలలోకూడా పండ్లు, కూరగాయల రైతుల సహకార సంఘాలను ఏర్పాటుచేసి, వివిధ ప్రదేశాలలో రిటైల్ దుకాణాలను ఏర్పరిచేందుకు అనువైన స్థలాలను స్థానిక సంస్థలు అందజేసి, ఈ సంస్థల ప్రారంభ దశలో సమర్థులైన, నిజాయితీపరులైన అధికారుల తోడ్పాటును లభింపచేస్తే రైతులకు, సామాన్య పౌరులకు ఎంతో మేలు చేకూరుతుంది. తద్వారా మధ్య దళారీలు, వర్తకుల దోపిడీని అరికట్టవచ్చు. సామాన్యునికి అందుబాటులో పండ్లు, కూరగాయలు దొరుకుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు కొంత మెరుగవుతాయి.

*- ఆంధ్రజ్యోతి*

●

# ప్రజారోగ్యం, రైతుకు లాభం

ప్రజలకు పోషక విలువలతో కూడిన సమతులాహారం లభించనిదే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యంకాదు. తృణధాన్యాలు పప్పు దినుసులతో పాటు పళ్ళూ కూరగాయలు వారికి సరసమైన ధరలకు లభించాలి. అదే సమయంలో వాటి ఉత్పత్తి రైతుకు లాభదాయకంగానూ వుండాలి. రైతులకూ, వినిమయదారులకు మధ్య దళారుల పరంపరను బాగా తగ్గించడం ఒక్కటే మార్గం. ఉత్పత్తిదారులతో కూడిన బహుళార్థ సాధక సహకార సంఘాలు దీనికి చక్కని సాధనం. పళ్ళూ కూరగాయల నిలువకు శీతలకేంద్రాలు, రవాణా సాకర్యాలవంటి ప్రాతిపదిక చట్రం మరో ముఖ్య విషయం. ఇప్పుడిప్పుడే ఒకదారికి వస్తున్న పళ్ళు కూరగాయల ఉత్పత్తి – పంపిణీ వ్యవస్థ సంక్షిప్త పరామర్శ ఈ వ్యాసం.

మనిషి ఆహారంలో ముఖ్యమయినవి కూరగాయలు, పండ్లు. ఇవి ప్రజల ఆరోగ్యానికి అత్యావశ్యకమయినవి. పట్టణాలు పెరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. సంపదలు హెచ్చుతున్నాయి. అందువల్ల ఎక్కువ కాలం నిలువ ఉండని సరుకులను భారీ ఎత్తున వాటి ఉత్పత్తి స్థానాలనుంచి వినియోగ కేంద్రాలకు రవాణా చేయడం, మార్కెటింగ్ చేయడం క్లిష్ట సమస్యగా పరిణమించింది. పండ్లు, కూరగాయలకు సంబంధించి ఇది మరింత పెద్ద సమస్య అని వేరే చెప్పనవసరంలేదు. ఉత్పత్తి దారులు–మధ్య దళారుల, వర్తకుల దోపిడికి గురికాకూడదు. అదే సమయంలో వినియోగదారులకు వారి డబ్బుకు తగిన మంచి కూరగాయలు, పండ్లు రుచికరమయినవి లభించాలి. పండ్లు, కూరగాయల వల్ల పౌష్టికాహారం విలువలు హెచ్చుతాయని శాస్త్రీయ పరిజ్ఞానం బాగా ప్రచారంలోనికి వస్తున్నది. దీని వల్ల ఇంటా, బయట కూరగాయల, పండ్ల మార్కెటు విస్తరిస్తున్నది. విస్తరిస్తున్న ఈ మార్కెట్లలో విజయవంతంగా ఎదుర్కోవాలంటే చాక చక్యం, సృజనాత్మకశక్తి, శక్తిసామర్థ్యాలు వుండాలి. ఇవి ఉన్నప్పుడే ఉత్పత్తిదారులకు,

వినిమయదారులకు గరిష్ఠస్థాయిలో ప్రయోజనం చేకూరుతుంది. పౌష్టిక ఫలాల, కూరగాయల సరఫరాను పెంచడానికి, తద్వారా చిన్నరైతుల, సన్నకారు రైతుల ఉపాధిని, ఆదాయాలను హెచ్చించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడానికి తోటలు ముఖ్యమయినవి. తోటల పెంపకం ప్రాధాన్యాన్ని ఇప్పుడిప్పుడే సరిగ్గా గుర్తిస్తున్నారు. తోటల పెంపకం జాతీయ బోర్డును 1984 ఏప్రిల్‌లో నెలకొల్పారు. తోటల పెంపకం సమీకృత అభివృద్ధి (ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలలో), ఉత్పత్తి ప్రాసెసింగ్, మార్కెటింగ్ జాతీయ బోర్డు లక్ష్యాల పరిధిలో వున్నాయి. ఏడవ పంచవర్ష ప్రణాళికలో కేంద్రం సెక్టారుకు, కేంద్రం ఆధ్వర్యంలోని పథకాలకు పెట్టుబడిని రూ. 58 కోట్లకు పెంచారు. మార్పులు చేర్పులు చేసిన ఇరవయి సూత్రాల కార్యక్రమంలో తోటల పెంపకం అభివృద్ధి అనేది ఒక సూత్రం. ఉత్పత్తిని పెంచడం కోసం పండ్లూ, కూరగాయల దిగుబడిని అధికం చేసే చర్యలు తీసుకోవాలన్నది. ఈ సూత్రం సారాంశం.

పండ్ల ఉత్పత్తి, నిలువ, మార్కెటింగ్ తదితర అంశాల మీద ఈ ఏడాది మే నెలలో బెంగుళూరులో ఒక జాతీయ చర్చాగోష్ఠి జరిగింది. ఇందులో అప్పటి ఉపప్రధానమంత్రి ప్రసంగించారు. గిడ్డంగులు, గ్రేడింగు, ప్యాకేజింగ్ కేంద్రాలు (నిలువవుండని ఉత్పత్తుల నిమిత్తం), శీతల కేంద్రాలు మొదలయిన సదుపాయాలను కల్పించి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ప్రాతిపదిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికను రూపొందిస్తున్నదని మాజీ ఉప ప్రధానమంత్రి వెల్లడించారు. పంట చేతికి వచ్చిన తరువాత సంభవించే నష్టాలను తగ్గించడానికి, నిలువవుండని ఉత్పత్తులను దూరప్రాంతాలలో లాభప్రదమయిన ధరలకు విక్రయించడానికి ప్రాతిపదిక సదుపాయాలను పటిష్టం చేసే నిమిత్తం, ప్యాకేజింగ్‌ను మెరుగుపరచడం కోసం తోటల పెంపకం జాతీయ బోర్డు, జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్, వ్యావసాయిక గ్రామీణ అభివృద్ధి నేషనల్ బ్యాంకు (నాబార్డ్) పరస్పర సహకారంతో సబ్సిడీ సమకూరుస్తున్నాయని ఆయన వివరించారు. కేంద్రంలోని ఫ్రంటు ప్రభుత్వం తోటల పెంపకం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. దేశంలో ప్రస్తుతం కూరగాయలు గణనీయంగా ఉత్పత్తి అవుతున్నాయి. మహానగరాల సమీపంలోని భారీ తోటలలో కూరగాయలు పెద్దఎత్తున ఉత్పత్తికావటం విశేషం. ఆరవ ప్రణాళిక చివరి రోజులకు 27 లక్షల హెక్టార్ల భూమిలో (బంగాళాదుంపలు మొదలయినవి మినహా) దాదాపు 3 కోట్ల 15 లక్షల టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయని భారత ప్రభుత్వం

అంచనా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో టొమాటో, వంకాయలు, బెండకాయలు, చిక్కుడు, ఆకుకూరలు తదితరమయినవి 1.02 లక్షల హెక్టార్లలో 9.22 లక్షల టన్నులు పండుతున్నాయని అంచనా. మామిడి, అరటి, నిమ్మ, నారింజ, బత్తాయి, జామ, సపోట, ద్రాక్ష, జీడిమామిడి మొదలయిన పండ్లు, కొబ్బరి 3.99 లక్షల టన్నులు ఉత్పత్తి అయ్యాయి.

దేశమంతటా సహకార సంస్థలు విక్రయించిన కూరగాయలు, పండ్ల విలువ రూ. 83.49 కోట్లు వుంటుందని అంచనా వేశారు. నేషనల్ అగ్రికల్చరల్ ఫెడరేషన్ (నాఫెడ్) 1988-89 సంవత్సరంలో రూ. 68.82 కోట్ల విలువయిన 2,35,214 టన్నుల ఉల్లిగడ్డలను, రూ. 0.05 కోట్ల విలువయిన 21.66 టన్నుల తాజా పండ్లను, కూరగాయలను విదేశాలకు ఎగుమతిచేసింది. అందుబాటులో వున్న ఆహారపు సరఫరాలను నిలువచేసి, ప్రయోజనకరంగా ఉపయోగించటంలో, ఆహారపు అలవాట్ల మీద ప్రభావం కల్గించడంలో ప్రాసెసింగ్ ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నది. ఇది వ్యావసాయిక ధరల, ఆదాయ స్థిరీకరణలో సహాయపడుతోంది. రూ. 2.80 కోట్ల విలువయిన ఉత్పత్తులను విక్రయించిన పండ్లు, కూరగాయల 38 ప్రాసెసింగ్ యూనిట్లకు జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ ఇప్పటి వరకు సహాయపడింది. భారతదేశంలో ప్రాసెసింగ్ అయి విదేశాలకు ఎగుమతి అవుతున్న పండ్ల పదార్థాలలో దాదాపు సగం మామిడి పండ్లకు సంబంధించినవి. 1989 జనవరి నుంచి డిసెంబరు వరకు రూ. 79.48 కోట్ల విలువయిన 63,967 టన్నుల పండ్లు, కూరగాయలు ఎగుమతి అయినాయి.

భారతదేశంలో కూరగాయలు, పండ్లు మొత్తం 7 కోట్ల మెట్రిక్‌టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది మన దేశంలోని అవసరాలకే సరిపోవటం లేదు. సగటున తలవొక్కింటికి 60 గ్రాముల పండ్లు, 280 గ్రాముల కూరగాయలు లభించాలన్నది సిఫారసు. శాస్త్రీయమైన ఈ సిఫారసును అమలు జరపాలంటే భారతదేశానికి 17.52 మిలియన్ టన్నుల పండ్లు, 81.76 మిలియన్ టన్నుల కూరగాయలు అవసరమవుతాయి. ప్రస్తుతం దేశంలో 50 మిలియన్ టన్నుల కూరగాయలు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఉత్పాదశక్తి తక్కువగా ఉండడం మరో సమస్య. విత్తనాలు, విత్తనం మొక్కలలో నాణ్యత లేకపోవటం, ఎరువులు మొదలయిన వాటిని సరిగ్గా వాడకపోవటం ఉత్పాదశక్తికి తక్కువగా ఉండడానికి ప్రధాన కారణాలు. ఉత్పాదశక్తి తక్కువగా వున్నందువల్ల

ఉత్పత్తి వ్యయం హెచ్చుతున్నది. నిలువ వుండలేని వస్తువులను వాటి ఉత్పత్తి కేంద్రాల నుంచి ఓడరేవులకు, విమానాశ్రయాలకు అతి తక్కువకాలంలో రవాణా చేయడానికి తగినన్ని రిఫ్రిజిరేటెడ్ లారీలు, వ్యాన్లు, విమానాలు, అందుబాటులోలేవు. నాణ్యత దెబ్బతినని రీతిలో ఈ రవాణా జరగాలి. ఉత్పత్తిదారులకు, సరసమైన ధరలకు ఈ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తేవాలి.

లాభార్జన పరత్వంతో ఈ మధ్యదళారులు పెంచుతున్న మార్కెటింగ్ వ్యయం ఫలితంగా ఉత్పత్తిదారుడికి లభించే ధరకు, వినిమయదారుడు చెల్లించే ధరకు మధ్య ఎంతో వ్యత్యాసం వుంటున్నది. ఈ అంశాలన్నింటిని తోటల పెంపకం జాతీయ బోర్డు పరిశీలించింది. హైదరాబాద్, విజయవాడ నగరాలతో సహా దేశంలోని వివిధ పట్టణాలలో కూరగాయల అవసరాలను, అందుబాటును పరిశీలించడానికి బోర్డు 1989లో ఒక సాంకేతిక - ఆర్థిక సర్వే నిర్వహించింది. హైదరాబాద్ విషయంలో ఈ పరిశీలన తేల్చిన అంశాలనుబట్టి ప్రస్తుతం సగటున రోజుకు తలసరి కూరగాయల వినిమయం 252.4 గ్రాములు. 1990 లో హైదరాబాద్ నగరంలో 28.69 లక్షల జనాభాకు 3.53 లక్షల టన్నుల కూరగాయలు అవసరమవుతాయి. కాని, 69 వేల టన్నులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఎందుకంటే, హైదరాబాద్ నగరానికి వచ్చిన కూరగాయలలో అధిక భాగం సమీపంలోని ఇతర స్థలాలకు సరఫరా అవుతాయి. సంవత్సరం పొడవున ఆయా రుతువులలో ధరల పెరుగుదల 200-300 శాతం వరకు వుంటుంది. సగటున టోకు ధరలకన్నా చిల్లర ధరలు రెండింతలుగా వుంటాయి. సగటున ఒక రైతు దాదాపు ఒక ఎకరం భూమిలో కూరగాయలు పండిస్తున్నారు. ఉత్పత్తులు శీతాకాలంలోకన్నా వేసవికాలంలో అధికంగా వుంటాయి. బస్సులు, టెంపోల ద్వారా మార్కెట్లకు రవాణా చేయడంలో ఎంతో సమయం వృధా అవుతున్నది. ఎంతో నష్టం జరుగుతున్నది. మార్కెటింగ్ వ్యయం సగటున క్వింటాలుకు రూ. 10-25 పైసలు. పంట చేతికి వచ్చిన తరువాత రైతు దానిని విక్రయించే లోపున 4 నుంచి 10 శాతం వరకు నష్టం సంభవిస్తున్నది.

రైతులలో అత్యధిక సంఖ్యాకులు మేలురకం విత్తనాలను సంపాదించటంలో సమస్యలను ఎదుర్కొంటున్నారు. క్రమబద్ధమయిన టోకు అమ్మకం మార్కెట్లు నాలుగు మాత్రమే వున్నాయి. లైసెన్సులు పొందిన తూకందారులు, హమాలీలు, బ్రోకర్లు, బండ్ల

వాళ్లు సరుకుల వేలంలో పాల్గొంటారు. రవాణా వాహనాలను నిలుపడానికి తగిన ఏర్పాట్లు లేవు. సరుకుల వేలం సరిగా జరగడానికి తగిన, ఎత్తయిన వేదికలు, వీటిని నిలువ చేయడానికి శీతల సదుపాయాలు కల్పించాలని, ఉత్పత్తిదారుల సమాఖ్య వివిధ స్థలాలలో రైతుల ఉమ్మడి కేంద్రాలను ఏర్పాటు చేయాలని పై పరిశీలనలో సిఫారసు చేశారు.

ఉత్పత్తిదారుల ఫెడరేషన్‌కు మార్కెట్‌లో ప్రాబల్యం కల్పించి కూరగాయల ధరలను తగ్గించవచ్చు. సరఫరాలోని వివిధ లోపాలను పరిశీలనలో ఎత్తి చూపారు. ఉత్పత్తిదారుల సమాఖ్య ఉత్పత్తిదారుల ధరకు, వినిమయదారుల ధరకు మధ్య వ్యత్యాసాన్ని తగ్గించవలసి వుంటుందని నొక్కిచెప్పారు. మధ్యదళారులు తగ్గినప్పుడే ఇది సాధ్యం. మార్కెటింగ్ వ్యయాన్ని తగ్గించడానికి చాలామంది మధ్య దళారులను తొలగించవచ్చు. ఇది జరిగితే, వినిమయదారుడు, చెల్లించే ధరలో అధికభాగం ఉత్పత్తిదారుడికి లభిస్తుంది. బహుళార్థక సాధక పరపతి సంఘం అవసరమయినప్పుడు సేద్యానికి తగినంత రుణాన్ని అందించవచ్చు. సభ్యుల ఉత్పత్తులను విక్రయించడానికి ఏజెంటుగా వ్యవహరించవచ్చు. సమీపంలోని మార్కెటింగ్ సొసైటీకి తన ఉత్పత్తిని తీసుకెళ్ళే విషయంలో సంఘం ఉత్పత్తిదారుడికి సలహా ఇవ్వవచ్చు. ప్రైమరీ మార్కెటులో వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సంఘం ఉన్నట్లయితే అదికూడా విక్రయ బాధ్యతను స్వీకరించవచ్చు. సొసైటీ నేరుగా టోకు వర్తకులతో సంబంధాలు పెట్టుకోవచ్చు లేదా రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఉత్పత్తిదారుల సమాఖ్యతో సంబంధం కల్గి వుండవచ్చు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సరళిలో కూరగాయల, పండ్ల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు రాష్ట్రస్థాయిలో జిల్లాస్థాయిలో మండీస్థాయిలో ఏర్పాటయితే మధ్యదళారీలను తొలగించడం సాధ్యమవుతుంది. అప్పుడు వినిమయదారులు చెల్లించే ధరలో అధికభాగం ఉత్పత్తిదారులు పొందడానికి వీలవుతుంది. కూరగాయల, పండ్ల ఉత్పత్తిదారుల సహకార సంఘాల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. వాటికి నిర్వహణ, సాంకేతిక సహాయాన్ని అందజేయాలి. ఉత్పత్తిదారులు... అంటే రైతులు తమ ఉత్పత్తులను పెంచి, లాభసాటి ధరలు పొందడానికి సహకార సంఘాలు దోహదపడతాయి. కెనడాలోని ధరల వ్యత్యాసంమీద రాయల్ కమీషన్ ఈ విధంగా అభిప్రాయపడింది– 'ప్రాథమిక ఉత్పత్తిదారుడి ప్రాథమిక సమస్య లాభప్రదమయిన మార్కెట్‌ను అన్వేషించటం. ఇది

సుస్పష్టం. తగినన్ని సరుకులను అతను ఉత్పత్తిచేయలేదనికాదు. డిమాండును, వినిమయాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఆయన అతిగా ఉత్పత్తి చేస్తున్నాడని కాదు. ఆయన ఉత్పత్తుల అవసరం లేదనికాదు. ఉత్పత్తిదారులు సహేతుకమయిన జీవనప్రమాణం కలిగి ఉండడానికి వీలయిన హెచ్చుధరకు వారి ఉత్పత్తులను విక్రించటం వీలుకాదు. అవసరం వున్న వారందరు వినియోగించడానికి వీలయిన తక్కువ ధరకు అవి లభించవు. ఉత్పత్తిమీదా ధరలమీదా ప్రభుత్వపు కంట్రోలుతోపాటు మరో రెండు మార్గాలున్నాయి. ఒకటి - మార్కెట్లను విస్తరించటం. రెండవది - మెరుగయిన మార్కెటింగ్ యంత్రాంగాన్ని ఉపయోగించి దోపిడిని నివారించటం. కూరగాయలు, పండ్లు సకాలంలో మార్కెటులోకి వెళితే ఎంతో లాభం వుంటుంది. ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయటంవల్ల ఇది సాధ్యమవుతుంది. దీనితోపాటు నిలువ చేయడానికి శీతల సదుపాయాలు తదితర సౌకర్యాలు కూడా కల్పించాలి. డిమాండుకు తగినట్లుగా విక్రయించడానికి ధరలు పెరుగుతున్నప్పుడు లేక తగ్గుతున్నప్పుడు వాటిని స్థిరీకరించడానికి కూరగాయల, పండ్ల నిలువకు, రవాణాకు, గ్రేడింగుకు ఇతర సదుపాయాలు ముఖ్యం. మన దేశంలో మొత్తం పంటల వైశాల్యంలో 6.7 శాతం భాగంలోనే తోటలున్నాయి. మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల విలువలో 18 శాతంకన్నా ఎక్కువ భాగం ఈ తోటల పంటలదే. వ్యవసాయ ఎగుమతుల ఆదాయంలో 52 శాతం భాగం తోటల ఉత్పత్తులది. అత్యధిక భాగం భూమిలో తృణధాన్యాలే పండిస్తున్నారు. ఇది అనివార్యమేగాని వీటికన్నా ఇరవయి నుంచి ముప్పయి రెట్లు ఎక్కువ విదేశీ మారకద్రవ్యాన్ని పండ్ల తోటలు సంపాదించగలుగుతాయి. పండ్ల, కూరగాయల ఉత్పత్తిదారులను మధ్యదళారుల దోపిడీనుంచి ఇతర సమస్యలబారి నుండి కాపాడడానికి మద్దతుధర, మార్కెట్ జోక్యం తదితర సదుపాయాలను విస్తరింపజేయడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. తద్వారా అటు దేశీయార్థిక రంగం అభివృద్ధికి, రైతుల ఆదాయం పెంపుదలకు, ప్రజారోగ్య పరిరక్షణకు దోహదకరమైన ఈ అంశములను అన్నిటిని పరిగణలో ఉంచుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగుచర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతో ఉంది.

*- ఆంధ్రజ్యోతి*

●

Blank Page

5 వ అధ్యాయం



# వ్యవసాయ రుణ పరపతి, పంటల బీమా, ఎరువులు, వ్యవసాయ విస్తరణ, విత్తనాలు

Blank Page

# రైతన్న వెన్నువిరిచే ఆలోచనలొద్దు

కేంద్ర ఆర్థిక మంత్రి డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ ఇటీవల జరిగిన జాతీయాభివృద్ధి మండలి సమావేశంలో ప్రసంగిస్తూ ఎరువులపై సబ్సిడీ తగ్గించే ఆలోచనలో ఉన్నట్లు సూచనప్రాయంగా పేర్కొన్నారు. సబ్సిడీల సమస్యకు పరిష్కారం చూపవలసిందిగా శ్రీసింగ్ జాతీయ అభివృద్ధి మండలిని కోరారు. కిందటి ఏడు బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ఎరువుల ధరలను ఒక్కసారిగా నలభైశాతానికి పెంచింది. దేశమంతటా రైతాంగం ఉవ్వెత్తున నిరసన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటలో ఇద్దరు రైతులు పోలీసుల కాల్పుల్లో మరణించారు. అటు తర్వాత పెంచిన ధరల్లో 10 శాతం తగ్గించినట్లు బడ్జెట్ చర్చల ముగింపు సందర్భంగా ఆర్థికమంత్రి చెప్పారు. 30 శాతం పెరుగుదలవల్ల చిన్న, సన్నకారు రైతులమీద అదనపు భారం పడకుండా చూస్తామని కూడా పేర్కొన్నారు. ఆచరణలో జరిగింది వేరు. చిన్న, సన్నకారు రైతులమీద కూడా ధరల పెరుగుదల భారం బాగానేపడింది. పెంచిన రేటుకు రైతు మొదట ఎరువులు కొనుగోలు చేయాలి, ఆ తర్వాత తాను చిన్న రైతునని గ్రామ అధికారి మండల రెవిన్యూ అధికారి నుండి సర్టిఫికెటుపొందాలి. ఈ రెండు సర్టిఫికెట్లను దాఖలు చేస్తే గాని వ్యత్యాసపు ధర డబ్బును వాపసు ఇవ్వరు.

ప్రస్తుత పరిస్థితుల్లో అనేక వ్యయప్రయాసలకు లోనై సర్టిఫికెట్లు తెచ్చుకున్నా వాపసు వచ్చే డబ్బుకు ఈలోగా ఖర్చయిన దానికి సరిపోతుందనే భావనతో చిన్నకారు రైతులెవరూ ముందుకురాలేదు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. దాదాపు అన్ని రాష్ట్రాలలో ఇవే పరిస్థితులు కొనసాగుతున్నాయి. పెంచిన ఎరువుల ధరల భారం చిన్న, సన్నకారు రైతులమీద పడకూడదనే ఉద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం కిందటి బడ్జెటులో 404 కోట్ల రూపాయలు కేటాయించింది. ఆ మొత్తంలో చాలాభాగం ఖర్చుకాకుండా మిగిలిపోవడం అసలు పరిస్థితికి సాక్ష్యం. ఎరువుల ధరలు ఒక్కసారిగా

30 శాతం పెరగడంతో ఎరువుల వాడకం తగ్గిపోయింది. ఎరువుల వాడకం 1989-90తో పోలిస్తే 1990-91లో 8.5 శాతం పెరిగింది. అదేమోస్తరుగా 1991-92లో కూడా ఎరువుల వినియోగం 8.1 శాతం పెరిగి ఉంటుందని ఆశించారు. కాని, పెరిగింది 3.6 శాతం మాత్రమే. ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి ఆశించిన స్థాయిలో జరగలేదు. దేశంలో కొన్ని ప్రాంతాలలో కొంతవరకు వాతావరణ పరిస్థితులు అనుకూలించని మాటకూడా నిజమే. ఫలితంగా ఆశించిన దిగుబడికన్నా ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 90 నుంచి 100 లక్షల టన్నులు తగ్గింది.

## పొరుగు దేశాలతో పోలిక

చిన్న, సన్నకారు రైతులకు ఎరువుల సబ్సిడీ విషయంలో కేంద్రం ఈ సంవత్సరం బడ్జెటులో మొండిచేయి చూపింది. ఎరువుల సబ్సిడీ విషయంలో పార్లమెంటరీ కమిటీ రిపోర్టు అందిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని బడ్జెటు ప్రసంగంలో ఆర్థికమంత్రి తెలియజేశారు. ఈ సమయంలోనే జాతీయాభివృద్ధి సమావేశంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ మాటలు రైతాంగాన్ని మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గత సంవత్సరం పెంచకముందు అమలులో ఉన్న ధరలతో పోల్చిచూసినా, మనదేశంలోకంటే పొరుగు దేశాలయిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతోపాటు, జపాన్, కొరియా వంటి దేశాలలో ఎరువులు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. ఒక కిలో నత్రజని ఎరువు కొనాలంటే మనదేశంలో 3.2 కిలోల ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంటుంది. అదే పాకిస్తాన్‌లో అయితే 2 కిలోలు, కొరియాలో 0.8 కిలోల ధాన్యాన్ని విక్రయిస్తే సరిపోతుంది. ఇక జపాన్ విషయం సరేసరి. అక్కడ కేవలం 0.3 కిలో ధాన్యాన్ని విక్రయిస్తే చాలు. ఇదే గోధుమల లెక్కల్లో చెప్పాలంటే కిలో నత్రజని ఎరువును కొనడానికి మనదేశంలో 2.9 కిలోల గోధుమలు విక్రయించాల్సి ఉంటుంది. పాకిస్తాన్‌లో అయితే 2.6 కిలోలు, కొరియాలో 1.6 కిలోలు, జపాన్‌లో 0.6 కిలోల గోధుమను విక్రయిస్తే సరిపోతుంది. ఒక కిలో ఫాస్ఫాటిక్ ఎరువు కొనాలంటే మనదేశంలో 3.7 కిలోల ధాన్యాన్ని విక్రయించాలి. పాకిస్తాన్‌లో అయితే 1.9 కిలోలు కొరియాలో 0.7 కిలోలు, జపాన్‌లో 0.4 కిలోల ధాన్యం అమ్మితేచాలు. ఒక కిలో పొటాష్ ఎరువు కొనాలంటే మనదేశంలో రైతులు 1.4 కిలోల ధాన్యాన్ని అమ్మాల్సి ఉండగా, పాకిస్తాన్‌లో 1 కిలో, కొరియా, జపాన్‌లలో 0.2 కిలోల ధాన్యం సరిపోతుంది. ఇది ధరల్ని

పెంచకముందు సంగతి. నిరుడు పెంచిన ధరల రీత్యాచూస్తే ఈ వ్యత్యాసం మరీ ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పటికీ చాలా దేశాలతో పోల్చిచూస్తే మనదేశంలో ఎరువుల వినిమయం చాలా తక్కువ. ఇండియాలో 70 శాతం భూములకు వాననీరే ఆధారం. ఈ రకం భూముల్లో (70 శాతం) పంటలకు 20 శాతం ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. నీటి వసతి ఉన్న 30 శాతం భూములకు 80 శాతం ఎరువులను ఉపయోగిస్తున్నారు. ఎరువుల ఉత్పత్తి వినియోగం విషయంలో భారత దేశానిది ప్రపంచంలో నాలుగోస్థానం, ఇది విస్తీర్ణం కారణంగా లభించిన స్థానం మాత్రమే. భారతదేశంలో సగటున హెక్టారుకు 70 కిలోల ఎరువు వాడుతున్నారు. పాకిస్తాన్‌లో 83 కిలోలు, చైనాలో 236 కిలోలు, కొరియాలో 422 కిలోలు, జపాన్‌లో 432 కిలోల ఎరువును వినియోగిస్తున్నారు. ఇక రాష్ట్రాల విషయానికొస్తే ఎరువుల వాడకంలో పంజాబు రాష్ట్రం ప్రథమస్థానంలో ఉంది. ఇక్కడ సగటున హెక్టారుకు 156 కిలోల ఎరువులు వాడుతున్నారు. 126 కిలోల వాడకంతో ఆంధ్రప్రదేశ్ ద్వితీయస్థానం, 117 కిలోల వినియోగంతో తమిళనాడు తృతీయస్థానం ఆక్రమించాయి. 6.7 కిలోల వినియోగంతో అస్సాం చివరిస్థానంలో ఉంది.

## వినిమయం తగ్గితే, దిగుబడి?

ఈ శతాబ్దం చివరికి దేశ బనాభా వంద కోట్లకు చేరుకుంటుందనీ, 24 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరమని శాస్త్రజ్ఞులు అంచనా. ప్రస్తుతం 17 కోట్ల 30 లక్షల టన్నులకు చేరుకోవాలంటే ఎరువుల వాడకం కీలకమైన పాత్ర నిర్వర్తించాల్సి ఉంటుందని వ్యవసాయ నిపుణుల అభిప్రాయం. ఇలాంటి పరిస్థితుల్లో – లోగడ ఎరువుల ధరలను ఒక్కసారిగా 30 శాతం పెంచేసి, ఇప్పుడు మరోసారి ఎరువుల ధరలను పెంచాలనుకోవడం అనాలోచితం, హానికరం. ఎరువుల ధరల పరిశీలన కోసం ప్రభుత్వం నియమించిన జి.వి.కె.రావు కమిటి ద్వంద్వ ధరల విధానం ఆచరణలో సాధ్యంకాదని సూచించింది. అంతర్జాతీయ మార్కెటులో కంటే భారతదేశంలో ఎరువుల ధరలు అధికంగా ఉండటంవల్ల సబ్సిడీని కొనసాగించక తప్పదని అభిప్రాయపడింది. వరసగా మూడేళ్ళు ఎరువుల వినియోగంలో 30 శాతం పెరుగుదల కనిపిస్తే, అప్పుడు ధరలను 5 నుంచి 7 శాతం వరకు పెంచవచ్చని ఆ సిఫార్సు చేసింది. ఎరువుల వినిమయం ధరలు పెరిగినపుడు తగ్గడం, ధరలు నిలకడగా ఉన్నపుడు పెరగడం గత అనుభవం.

ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా రైతులమీద అదనపు భారం పడకుండా ఎరువుల సబ్సిడీని తగ్గించడం ఎలా అన్న ప్రశ్న ఉదయించక మానదు. దేశంలో ఎరువుల ఉత్పత్తిదారులు భగవంతుని ముద్దుబిడ్డలు. వీరి ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశ్యంతోనే "రిటెన్షన్ ప్రయిజ్ కం సబ్సిడీ" పథకం అమలు చేస్తున్నారు. దీని ప్రకారం ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలోని ఎరువుల ఫ్యాక్టరీ యజమానులకు తమ కర్మాగారాల నిర్వహణవ్యయం, లాభాలపై పన్నులు పోనూ నికరపెట్టుబడిమీద 12 శాతం లాభం ఉండేలా చూస్తున్నారు. దీనివల్ల 1979-80లో రూ. 577 కోట్లు ఉన్న సబ్సిడీ 1989-90 నాటికి రూ. 3650 కోట్లకు పెరిగింది. నిరుటి బడ్జెటులో రూ. 4000 కోట్లు, ఈ సంవత్సరం బడ్జెటులో రూ. 5000 కోట్లు కేటాయించారు. ఈ మొత్తానికి అదనంగా కనీసం మరో వెయ్యికోట్ల రూపాయలు కేటాయించడం అవసరమని భావిస్తున్నారు. ఎరువుల కర్మాగారాలకు కావలసిన నాఫ్తావంటి ముడిపదార్థాలు, సహజవాయువు. బొగ్గు, విద్యుచ్ఛక్తి, రైల్వే చార్జీలు ఎప్పటికప్పుడు పెరగడం ఎరువుల సబ్సిడీ పెరగడానికి కారణమని చెప్పవచ్చుగాని, దీనికి మరో కారణమూ ఉంది. ఎరువుల కర్మాగారాలను తక్కువ వ్యయంతో నెలకొల్పుతామని ముందుకు వచ్చిన కొన్ని విదేశాల ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. దాదాపు రెట్టింపు వ్యయంకాగల ఇటాలియన్ టెక్నాలజీ 'శ్నాంప్రొగెట్టి' పథకాలను ప్రభుత్వం చేపట్టింది. దరిమిలా ఉత్పత్తి అయిన ఎరువుల ధరలు అధికంగా ఉండడం సహజం. ఇక్కడ ప్రజలు అర్థం చేసుకోవాల్సిన ఆసక్తికరమైన విషయం ఒకటుంది. రైతుల సంక్షేమం కోసం ఎరువుల సబ్సిడీ పేరుతో వేల కోట్లు వెచ్చిస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటోందిగాని, నిజానికి ఇందులో రైతులకు అందేది మూడింట ఒకవంతు మాత్రమే. మిగిలిన రెండు వంతులు ప్రయివేటు, ప్రభుత్వ రంగాలలోని పరిశ్రమల హక్కు భుక్తాలు. ఇందులో దాదాపు 75 శాతం నాఫ్తా, బొగ్గు, సహజవాయువు, విద్యుచ్ఛక్తి రవాణా చార్జీల రూపంలో ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుంది. అంటే ప్రభుత్వం ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో తీసుకుంటోందన్నమాట. 1980-81 నుంచి 1986-87 కాలంలో పెంచిన సబ్సిడీలలో 94 శాతం ప్రభుత్వ బొక్కసానికే చేరాయని 'ఫెర్టిలైజర్ ఆసోసియేషన్ ఆఫ్ ఇండియా' వారు చేసిన ప్రకటనను ప్రభుత్వం ఖండించకపోవడం ఇందుకు తార్కాణం. 1987లో జి.వి.కె.రావు కమిటీ నివేదిక సమర్పించింది. అమెరికాలో కంటే భారతదేశంలో నాఫ్తా ధర నాలుగురెట్లు అధికమని నివేదిక పేర్కొంది. ఎరువుల సబ్సిడీ రూపంలో 1800 కోట్ల రూపాయలు

ప్రభుత్వ ఖజానా నుండి ఖర్చుకాగా ముడి పదార్థాల ధరల రూపంలో ఒ.ఎన్.జి.సి వంటి ప్రభుత్వ సంస్థలకు రూ. 1600 కోట్లు లాభం చేకూరిందనీ సబ్సిడీ అనేది కాగితాలమీద అంకెల గారడీ మాత్రమేనని నివేదిక పేర్కొంది. ఈ విషయాలన్నిటి దృష్ట్యా ఎరువుల సబ్సిడీ గురించి ఈ ఆందోళన అనవసరం.

## భారం తగ్గించుకునే మార్గం

ఎరువుల ఫ్యాక్టరీ యాజమాన్యాల లాభాలను కొంత తగ్గించవచ్చు. కొన్ని ఫ్యాక్టరీలు, పెరిగిన విలువలను ఎక్కువగా చూపిస్తూ న్యాయంగా రావలసిన దానికంటే ఎక్కువ మొత్తాలు రాబట్టుకుంటున్నాయనే వార్తలు ఇటీవల ప్రచారంలోకి వచ్చాయి. నిరుడు కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) నిర్వహించిన దాడుల్లో, ఎరువులు ఉత్పత్తి చేయకుండానే ప్రభుత్వంనుంచి కోట్ల మొత్తంలో సబ్సిడీలు స్వాహాచేసిన సంస్థల భాగోతం బయటపడింది. సబ్సిడీ చెల్లింపుల్లో మోసాలను అరికట్టి, పకడ్బందీగా ఉత్పత్తి వివరాలను సేకరించగలిగితే భారం కొంత తగ్గుతుంది. విదేశాలనుంచి దిగుమతి చేసుకొనే ముడిపదార్థాల ధరలమీద ఇప్పటివరకు ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో ఉత్పత్తిదారులు ఆ ధరలను ఎక్కువగా చూపి ప్రభుత్వంనుంచి ఎక్కువ మొత్తాలు రాబడుతున్నారు. ఈ లోపాన్ని సరిదిద్దజం ఎంతైనా అవసరం. మరో విషయం. నాఫ్తా, బొగ్గు, సహజ వాయువు, విద్యుచ్ఛక్తి, రవాణా చార్జీలను మరీ ఎక్కువగా పెరగకుండా చర్యలు తీసుకోగలిగితే ఎరువుల సబ్సిడీ పెద్దగా పెరగదు. సబ్సిడీని శాశ్వతంగా కొనసాగించాలని రైతాంగమూ కోరడంలేదు. అదొక క్రమపద్ధతిలో జరగాలి. న్యాయబద్ధంగా ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల ధరలను నిర్ణయించాలి. దానికి సమాంతరంగా రైతుల అన్నిరకాల వ్యయాల్ని దృష్టిలో ఉంచుకొని వ్యసాయోత్పత్తుల ధరలు నిర్ణయించాలి. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించకుండా ఆహార ధాన్యాల రవాణాపై ఆంక్షలు విధించడం మంచిదికాదు. దేశీయ అవసరాల పేరుతో బియ్యం, గోధుమ, ప్రత్తి వంటి వ్యవసాయోత్పత్తులను విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేయనీయకుండా ప్రభుత్వం నిరోధించడం దేశానికి తీరని నష్టమన్న సత్యాన్ని ప్రభుత్వం గ్రహించి వ్యవహరించడం తక్షణ కర్తవ్యం.

*ది. 13-06-1992.* — *ఈనాడు*

●

# సరికొత్త పట్టాలపై సహకారోద్యమం

ఇటీవల కొన్ని మసాల నుంచి పబ్లిక్ రంగం - ప్రైవేట్‌రంగం సమస్యపై దేశంలో తీవ్రచర్చలు కొనసాగుతున్నాయి. పబ్లిక్ రంగాన్ని ప్రైవేటీకరించాలా వద్దా, ప్రైవేటీకరణ జరిగితే ఏ మేరకు అనేవి ముఖ్య ప్రశ్నలు. వీటిపై వాదోపవాదాలు, తర్జనభర్జనలు చెలరేగుతున్నాయి. ఈ రెండూ కాకుండా కీలకమయిన సహకార రంగం ఒకటుందని పాలకులు బహుశ విస్మరించారు. గత సంవత్సర కాలంగా ప్రభుత్వం ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో పలు మార్పులు ప్రకటించింది. ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్న లైసెన్సింగ్ విధానంలో, పరిశ్రమ స్థాపనకు అనుసరించవలసిన విధానంలో, పద్ధతులలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు తీసుకువచ్చింది. అయితే, ప్రపంచంలోనే అతి పెద్దదయిన భారత సహకార వ్యవస్థలోని లోపాలను తొలగించి, అవి స్వావలంబనతో ప్రజాతంత్ర రీతిలో, స్వేచ్ఛగా వాటి విధులను, బాధ్యతలను నిర్వర్తించడానికి దోహదపడగల చర్యల గురించి ప్రభుత్వం ఏమి ఆలోచిస్తున్నదో తెలియదు. ఈవిషయంలో ప్రభుత్వం తన ఉద్దేశాన్ని బయటపెట్టడం లేదు. బ్యాంకింగ్ వ్యవస్థ నిర్వహణను క్షుణంగా పరిశీలించి పలు సూచనలు చేసిన నరసింహం కమిటీ తన నివేదికలో సహకార బ్యాంకులపై కొంత మేరకు గ్రామీణ బ్యాంకులపై ఈ కమిటీ అభిప్రాయాలు వ్యక్తం చేసింది. ఇది సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పట్ల పాలకుల అలక్ష్య ధోరణికి నిదర్శనం.

## ప్రపంచంలో ప్రథమస్థానం

16 కోట్లమంది సభ్యులతో, 3 లక్షల 50 వేల సంస్థలతో దేశ సహకార వ్యవస్థ ప్రపంచంలో మొదటిస్థానం ఆక్రమిస్తున్నది. భారత సహకార వ్యవస్థకు దాదాపు తొంభైసంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది. సహకార బ్యాంకులు రైతులకు స్వల్ప, మధ్య దీర్ఘకాలిక రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. పంపిణీ అయిన స్వల్పకాలిక రుణాల

మొత్తం 1960-61లో రూ. 210 కోట్లు కాగా 1989-90లో రూ. 4812 కోట్లు. గ్రామీణ రుణ విమోచన పథకం అమలు వల్ల 1990-91లో రూ. 3188 కోట్ల స్వల్పకాలిక రుణాలు మాత్రమే లభించాయి. 1985-86 నాటికి 92 వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రూ. 572 కోట్ల డిపాజిట్లు సేకరించారు. 1991-92లో రూ. 5119 కోట్ల స్వల్పకాలిక రుణాలను రూ. 440 కోట్ల మధ్యకాలిక రుణాలను, రూ. 1097 కోట్ల దీర్ఘకాలిక రుణాలను సహకార సంస్థల ద్వారా వ్యవసాయ రంగానికి అందజేయాలని లక్ష్యం. భారతదేశంలోని దాదాపు 5 లక్షల 40 వేల గ్రామాలలో సహకార సంస్థలు గణనీయపాత్ర నిర్వహిస్తున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులు 1970-71లో 13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందజేయగా 1990-91 నాటికి సుమారు 76 వేల సహకార విక్రయ కేంద్రాల ద్వారా 40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ అయ్యాయి. రైతులకు వ్యావసాయిక ఆదాయానికి తోడుగా పాడిపరిశ్రమ నుంచి గణనీయ ఆదాయం లభిస్తుంది. వ్యవసాయ రంగం మొత్తం ఉత్పత్తులలో నాలుగవ వంతు పశుపోషణ - పాడిపరిశ్రమలకు సంబంధించినదే. 1991 ఏప్రిల్ నాటికి 63121 పాల సహకార సంఘాల ద్వారా 4.32 కోట్ల మెట్రిక్ టన్నుల పాల సేకరణ జరిగింది. పల్లెసీమల సౌభాగ్యానికి చక్కెర పరిశ్రమ ఎంతో దోహదపడుతున్నది. దేశంలోని మొత్తం పంచదార ఉత్పత్తిలో 60 శాతాన్ని 212 సహకార చక్కెర ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేస్తున్నాయి. దేశంలోని మొత్తం స్పిండిల్సు శక్తిలో 20 శాతం సహకార స్పిన్నింగ్ మిల్లుల్లో ఉంది. దాదాపు 50 వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సొంత గిడ్డంగులున్నాయి. సహకార రంగం గిడ్డంగులలో 114 లక్షల టన్నుల నిలువ సదుపాయం ఉంది. ఎరువుల ఉత్పత్తిలో ఇఫ్‌కో, క్రిబ్‌కో సంస్థలు గణనీయపాత్ర నిర్వహిస్తున్నాయి. లాభాలు ఆర్జిస్తున్నాయి. ట్రైఫెడ్, నాఫెడ్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో, ఉల్లి మొదలయిన వాటి ఎగుమతిలో ముఖ్యపాత్ర నిర్వర్తిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థలో సహకార సంస్థలు మరింత ముఖ్యపాత్ర నిర్వహించవచ్చు. విధుల నిర్వహణలో ప్రభుత్వపు మితిమీరిన జోక్యం, అధికారుల పెత్తనం కారణంగా సహకార రంగం తగినంత పెరుగుదలను సాధించలేకపోతున్నది. సహకార వ్యవస్థలో ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలని, మరింత అధిక స్థాయిలో వనరులను ఈ వ్యవస్థకు చేకూర్చాలని సరైన మార్గదర్శకత్వాన్ని అందించాలని 1954 గ్రామీణ పరపతి సర్వే నివేదిక సూచించింది. ప్రభుత్వానికి భాగస్వామ్యం కల్పించే

నియమాల వల్ల సహకార సంస్థలు అధికారుల కబంధ హస్తాలలో చిక్కుకునే అవకాశం ఏర్పడింది. సహకార సంస్థలు స్వయం ప్రతిపత్తితో, ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడానికి, అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ యంత్రాంగం దోహదపడాలి. అలా జరుగలేదన్నది అనుభవం వెల్లడిస్తున్న నగ్నసత్యం. రిజర్వుబ్యాంకు నియమించిన వ్యవసాయ పరపతి సమీక్ష కమిటీ మూడేళ్ళ అధ్యయనానంతరం 1989లో నివేదిక సమర్పించింది. ఇప్పుడున్న బంధనాల నుంచి సహకార వ్యవస్థకు విముక్తి చేయాలని ఉద్యోగ యంత్రాంగం పెత్తందారీతనాన్ని తొలగించడానికి తగు చర్యలు తీసుకోవాలని కమిటీ నివేదిక సూచించింది. సహకార సంఘాలకు ఎన్నికయిన కమిటీలను సూపర్‌సీడ్ చేసే విధానాన్ని నిలిపివేయాలని, అందుకు అనుగుణంగా నియమాలను మార్చాలని, సహకార రంగం నుంచి ప్రభుత్వం నిష్క్రమించాలని, సహకార సంస్థలను స్వావలంబన దిశగా ప్రోత్సహించాలని, డిపాజిట్ల సేకరణ మరింత అధికంగా జరగాలని, సహకార సంస్థల కార్యదర్శులకు తగిన అర్హతలు ఉండాలని, వీరు ఆయా సంఘాలకు బాధ్యత వహించాలని, హెచ్చు డిపాజిట్లు సేకరించిన వారిని ప్రోత్సహించాలని, రుణాలను సక్రమంగా పంపిణీ చేసి, తిరిగి సక్రమంగా వసూలు చేసి సంస్థ నిధులను సమర్థవంతంగా నిర్వహించి లాభాలు ఆర్జింపజేసే ఉద్యోగులకు తగు ప్రోత్సాహకాలు కల్పించాలని కమిటీ తన సూచనలలో వివరించింది.

## జాతీయస్థాయి బ్యాంకు

జాతీయస్థాయిలో సహకార బ్యాంకును ఏర్పాటు చేయాలన్నది పరపతి సమీక్షా కమిటీ చేసిన మరో ముఖ్యమయిన సిఫారసు. మొత్తం దేశంలోని సహకార వ్యవస్థకు 'అపెక్సు' సంస్థగా ఈ బ్యాంకు పనిచేయాలని కమిటీ అభిప్రాయపడింది. ప్రస్తుతం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో ప్రాథమిక స్థాయిలోని, జిల్లా స్థాయిలోని సంస్థలకు రాష్ట్ర రాజధానిలో రాష్ట్రస్థాయి సహకార బ్యాంకు అపెక్సు బాడీగా వ్యవహరిస్తున్నది. వివిధ రాష్ట్రాలలోని సహకార సంస్థలను సమన్వయ పరిచే జాతీయస్థాయి సంస్థ లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టానికి ఒక ఉదాహరణ పేర్కొనవచ్చు. జమ్మూకాశ్మీరు రాష్ట్రంలోని సహకార సంస్థ వద్ద రూ. 9 వందల కోట్ల డిపాజిట్లు పేరుకుపోయినా, వాటిని ఆ రాష్ట్రంలో ఉపయోగించలేకపోతున్నారు. ఈ డిపాజిట్లను వాణిజ్య బ్యాంకులలోనో ప్రభుత్వరంగ సంస్థలలోనో ఉపయోగిస్తున్నారు. జాతీయ స్థాయి సహకార సంస్థ ఉంటే ఈ మొత్తాన్ని తగినన్ని వనరులు లేని రాష్ట్రాల సహకార సంస్థలు

ఉపయోగించుకోగలిగేవి. ఆ విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సహకార సంస్థల ద్వారా అధిక సేవలు, సదుపాయాలు అందేవి. వివిధ రాష్ట్రాల సహకార సంస్థల మధ్య సమన్వయం సాధించడానికి, వనరులను పూర్తిగా ఉపయోగించడానికి, సహకార ఉద్యమానికి నాయకత్వం వహించడానికి సహకార రంగంలో సామర్థ్యాన్ని ఇనుమడింపచేయడానికి ప్రభుత్వంతో, రిజర్వుబ్యాంకుతో సంప్రదించి సహకార సంస్థల సమస్యలను సత్వరం పరిష్కరించడానికి జాతీయస్థాయి సహకార బ్యాంకు అత్యావశ్యకమని కమిటీ నొక్కిచెప్పింది. నిజానికి 1965 లోనే శ్రీరామ్‌నివాస్‌మిర్ధా అధ్యక్షతన ఏర్పడిన సహకార కమిటీ జాతీయ సహకారబ్యాంకును ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. అలాంటి సంస్థ అవసరమని ఎనిమిదవ జాతీయ సహకార కాంగ్రెస్ అఖిల భారత మహాసభ, రాష్ట్ర సహకార బ్యాంకులు, భూమి అభివృద్ధి బ్యాంకులు, సహకార కేంద్ర బ్యాంకుల ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు కూడా. జాతీయ వ్యవసాయాభివృద్ధి బ్యాంకు (నబార్డ్) ఉండగా జాతీయ సహకార బ్యాంకు ఎందుకని అడగొచ్చు. నబార్డ్ ప్రధానంగా రిఫైనాన్సింగ్ (నిధులను సమకూర్చే) సంస్థ. అది సహకార వ్యవస్థ స్వాలంబనకు, పటిష్టతకు చెప్పుకోదగినంతగా ఉపయోగపడలేదు. అందువల్లనే, జాతీయ సహకార బ్యాంకును ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు అన్నివైపులనుంచి బలం చేకూరింది. ఈ శతాబ్ది చివరినాటికి వ్యవసాయం తదితర అనుబంధ కార్యక్రమాల నిమిత్తం వాణిజ్యబ్యాంకులు రూ. 64,037 కోట్లు, సహకార బ్యాంకులు రూ. 46,836 కోట్లు అందించాల్సి వుంటుందని పరపతి సమీక్షా కమిటీ అంచనా. వాణిజ్య బ్యాంకులకు రూ. 57035 కోట్లు, సహకార బ్యాంకులకు రూ. 32412 కోట్ల వనరులు లభ్యమవుతాయి. గనుక వాణిజ్య బ్యాంకులకు రూ. 7002 కోట్ల మేరకు, సహకార బ్యాకులకు రూ. 14424 కోట్ల మేరకు కొరత ఏర్పడవచ్చని కమిటి అభిప్రాయపడింది. అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ రంగం అవసరాలకు తోడు ఆగ్రోప్రాసెసింగ్ పరిశ్రమల నిమిత్తం రూ. 15,966 కోట్లు, నిలువ రవాణాతో సహా మార్కెటింగ్ కోసం రూ. 9881 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల కొరకు రూ. 7680 కోట్లు లభ్యం కావాలని కమిటీ అంచనా వేసింది.

## నమూనా సహకార చట్టం

సహకారసంస్థలు సమర్థంగా విధులు నిర్వహించినప్పుడే అంతటి భారీ నిధులను సమకూర్చగలుగుతాయి. ఇందుకోసం అవసరమయిన నమూనా సహకార చట్టాన్ని

రూపొందించాలని ప్రణాళిక సంఘం ఒక కమిటీని నియమించింది. కమిటీ రూపొందించిన నమూనాపై జిల్లా, రాష్ట్ర స్థాయి సహకార సంఘాల అభిప్రాయాలు కూడా సేకరించి చట్టానికి త్వరగా రూపకల్పన చేయడం చాలా ముఖ్యం. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం పరిధిలో ఉండవు గనుక అవే డిపాజిట్లను సేకరించాల్సి ఉంటుంది. అవి వనరులను పెంచుకోవాలనుకుంటే డిపాజిటు బీమా పథకం కిందకు రావాలి, అందుకు తగిన చర్యలు తీసుకుని డిపాజిటర్లకు విశ్వాసాన్ని కల్గించాలి. డిపాజిట్లు సక్రమంగా వినియోగపడేలా జాగ్రత్తలు తీసుకోవాలి. తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించకపోవడం సంప్రదాయంగా మారడంతో ప్రాథమిక సంఘాలు తగిన సేవలను అందించలేకపోతున్నాయి. గడువు దాటిన అప్పుల మొత్తం 40 శాతానికి చేరింది. బకాయిలు పరిమిత స్థాయిని దాటడంతో ప్రాథమిక సంఘాలు వాటిపై సంస్థలనుంచి రుణాలు పొందలేక పోతున్నాయి. కొందరు బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల సహకార సంఘాల కార్యకలాపాలు దాదాపు స్తంభించి అధిక సంఖ్యాక సభ్యులు నష్టపడవలసి వస్తున్నది. ప్రాథమిక సంఘాలు ఆర్థికంగా బలపడడానికి తగినంత జాగరూకతతో వ్యాపారాభివృద్ధి పథకాలను చేపట్టాల్సి వుంటుందని ఇప్పుడు ప్రభుత్వమూ గ్రహించింది. తగినంత హామీ పొంది వ్యవసాయేతరమయిన చిన్న వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలకు కూడా రుణాలను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ జాతీయ సహకార విధానానికి తుదిరూపం కల్పిస్తున్నట్లు తెలిసింది. సహకార సంస్థలను పటిష్టపరచడానికి, అవి స్వతంత్రంగా ప్రజాతంత్రరీతిలో అభివృద్ధి పొందడానికి రాష్ట్ర ముఖ్యమంత్రులతో చర్చించి చట్టసంబంధ చర్యలు తీసుకోవాలి. నమూనా చట్టం అమలులోకి రావాలి. జాతీయ సహకారబ్యాంకు ఏర్పాటుకు పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టాలి. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు, కూలీలకు, చేతివృత్తుల వారికి, చిన్నవర్తకులకు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు అవసరమయిన సహాయాన్ని సహకార సంస్థలు సకాలంలో అందించడానికి తగినట్లుగా సహకారరంగాన్ని పెంపొందించడం తక్షణ కర్తవ్యం.

*ది. 04-07-1992.* — *ఈనాడు*

# ఆపత్కాలంలో అభయహస్తముంటేనే రైతన్నకు భీమా

ఈ సంవత్సరం రబీ పంట కాలం నుంచి జాతీయ వ్యవసాయ బీమా పథకాన్ని అమలు పరచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. తుపానులు, వరదలు, వర్షాభావం వంటి ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు, అగ్ని ప్రమాదాలు మొదలైన వాటివల్ల భారత రైతాంగం ఏటా వందలకోట్ల రూపాయల విలువైన పంటలను కోల్పోతుంది. బంగాళాఖాతానికి సమీపంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా తీర ప్రాంతం అధికంగా నష్టపోతుంటుంది. పంటలు కోల్పోయిన సందర్భాల్లో ప్రభుత్వం నుంచి రైతుకు అందే సహాయం చాలా స్వల్పం. పండిన పంటలో సగానికి పైగా నష్టానికి గురయితే వరి, వేరుశనగ, కంది వంటి పంటలకు హెక్టారుకు రూ. 1250 అంటే ఎకరాకు కేవలం రూ. 500 సహాయంగా లభిస్తుంది. ఈ మొత్తం రైతుకు నష్టపరిహారం కాబోదని, తిరిగి పంట వేసుకోవడానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తిరిగి పంట వేసుకోవడానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర సామగ్రిని కొనుక్కోడానికి ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావన. పంటలకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లినప్పుడు సరయిన పంటల బీమా పథకం ద్వారా తగిన పరిహారం లభించని పక్షంలో రైతులు ఎక్కువ పెట్టుబడికి సాహసించరు. విపత్కాలంలో పంటల బీమా పథకం ఆదుకుంటుందనే భరోసా ఉంటే ధైర్యంగా ముందుకెళతారు. అధిక పెట్టుబడికి కూడా వెనుదీయరు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించడానికి అన్నివిధాలా ప్రయత్నిస్తారు.

## ఎంతకాలమీ దుస్థితి

వరి, గోధుమ, ఇతర తృణ ధాన్యాలు; మినుములు, పెసరవంటి పప్పు ధాన్యాలు; వేరుశనగ, పొద్దుతిరుగుడు వంటి నూనె గింజల పంటలకు వర్తించేలా 1985లో సమగ్ర పంటల బీమా పథకం ప్రవేశపెట్టారు. ఆ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి 1997-98 రబీ సీజన్ నాటికి 6 కోట్ల 44 లక్షల 72 వేల మంది రైతులు తమ10 కోట్ల 85 లక్షల 19 వేల హెక్టార్లలోని 19,228 కోట్ల 64 లక్షల 11 వేల రూపాయల విలువైన పంటలను బీమా చేశారు. ప్రభుత్వానికి ప్రీమియం రూపంలో రూ. 313 కోట్ల 13 లక్షల 73 వేలు లభించగా, అంతకు అయిదు రెట్ల మొత్తం- రూ. 1623 కోట్ల 14 లక్షల 73 వేలను రైతులకు పరిహారంగా చెల్లించారు. ముఖ్యమైన వాణిజ్య పంటలను పథకం పరిధిలోకి తీసుకోకపోవడం, బ్యాంకుల్లో అప్పులు తీసుకోని రైతులకు పథకం వర్తించకపోవడం, యూనిట్ ఏరియా పెద్దదిగా ఉండటం పట్ల రైతుల్లో అసంతృప్తి వ్యక్తమయింది. పంటల బీమా పథకం కాదు- బ్యాంకు అప్పుల బీమా పథకం అన్న విమర్శలూ వచ్చాయి. 1997లో కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మక పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. సంస్థాగతమైన లోపాలు, ఆచరణ సాధ్యంకాని అంశాల కారణంగా ఆ పథకాన్ని తొందరగానే ఉపసంహరించారు. ఇదివరకటి సమగ్ర పంటల బీమా పథకంలోని లోపాలను అధిగమించడానికి ప్రయత్నిస్తూ, మరింత వాస్తవిక దృష్టితో, శాస్త్రబద్ధంగా ఉండేలా ఇప్పుడు జాతీయ వ్యవసాయ బీమా పథకాన్ని రూపొందించారు. పరిధిని విస్తరించి ప్రధాన వాణిజ్య పంటలయిన పత్తి, చెరకు, బంగాళాదుంపలను కూడా ఈ కొత్త పథకంలో చేర్చారు. మరో మూడేళ్లలోగా ఇతర వాణిజ్య పంటలను, ఉద్యాన పంటలను కూడా పథకం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పథకం వర్తిస్తుంది. బ్యాంకులలో లోను తీసుకున్న రైతులనుంచి విధిగా ప్రీమియం మినహాయిస్తారు. బ్యాంకు లోన్లు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించి పథకంలో చేరవచ్చు. అగ్నిప్రమాదం, వరదలు, పెనుగాలులు, తుపానులు, వర్షాభావం, కరవు, చీడ పీడలు వంటి కారణాలపై పరిహారం లభిస్తుంది. ఈ పథకంలో గ్రామ పంచాయతీని యూనిట్‌గా నిర్ణయించారు. ప్రస్తుతానికి ఈ స్థాయిలో పంటల దిగుబడుల వివరాలు అందుబాటులో లేకపోతే తాలూకా లేదా మండల లేదా బ్లాకులను ప్రాతిపదికగా తీసుకుంటారు. మూడేళ్లలోగా గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకోవాలని పథకంలో నిర్దేశించారు. యూనిట్

ఏరియాలో వరి, గోధుమ పంటల విషయంలో గత మూడేళ్ల సగటు దిగుబడిని లెక్కలోకి తీసుకుంటారు. ఇతర పంటలకు అయిదేళ్ల సగటు దిగుబడిని లెక్కిస్తారు. విపత్కర పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకోవడం ఈ పథకంలో మరో ముఖ్యమైన అంశం. కోస్తా ప్రాంతాల్లో తరచూ తుపానులు సంభవించే ప్రమాదం ఉంటుంది. ఖరీఫ్ కాలంలో అధిక వర్షాలు, వరదలవల్ల నష్టం వాటిల్లుతుంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ సమస్యా ఉంటుంది. రబీ కాలంలో ఇలాంటి రిస్కులు తక్కువ. కొత్త పథకం ప్రకారం అధిక రిస్క్ ప్రాంతంలో 60 శాతం మేర పరిహారం చెల్లిస్తారు. తక్కువ రిస్క్ ఉన్నచోట్ల 90 శాతం, మధ్యంతర ప్రాంతాల్లో 80 శాతం పరిహారం లభిస్తుంది. కొన్ని సందర్భాలలో గ్రామంలో అందరికీ కాకుండా కొద్దిమందికే అగ్ని ప్రమాదం లేదా సుడిగాలి, వడగళ్ల వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అలాగే నది లేదా వాగు పక్క ప్రాంతాల్లో రైతులూ నష్టపోతారు. జాతీయ వ్యవసాయ బీమా పథకం వల్ల ఇలాంటి సందర్భాల్లో వ్యక్తిగతంగా ప్రయోజనం పొందవచ్చు. ప్రీమియం విషయానికి వస్తే– ఇదివరకటి పథకంలో వరి, గోధుమ వంటి ఆహార ధాన్యాలకు రెండు శాతం, పప్పు ధాన్యాలు, నూనె గింజలకు ఒక శాతం చెల్లించేవారు. ఈ పథకంలో ఖరీఫ్ సీజన్‌లో బీమా చేసిన పంట విలువలో సజ్జలు, నూనె గింజలకైతే 3.5 శాతం, ఇతర ఆహార పంటలకు 2.5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. రబీ సీజన్‌లో గోధుమ పంటకు 1.5 శాతం, ఇతర పంటలకు 2 శాతం ప్రీమియంగా నిర్ణయించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రీమియంలో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయి. ఈ పథకంలో మరో నూతన అంశాన్ని చేర్చారు. సాధారణ దిగుబడికన్న ఎక్కువ దిగుబడి వస్తుందని భావించే రైతులు అదనంగా ప్రీమియం కట్టి అధిక పంటకు (150 శాతం వరకు) బీమా చేయవచ్చు. పథకం అమలుకోసం ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈలోగా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ (జి.ఐ.సి.)యే పథకాన్ని నిర్వహిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన స్థాయిలో నిధులతో 'కార్పస్ ఫండ్'ను ఏర్పాటు చేస్తే భారీస్థాయి నష్టాలను తట్టుకోవచ్చుననే ఆలోచనా ఉంది. ప్రస్తుత పథకానికి మొదటి మూడేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుమారు రూ. 1730 కోట్లు సబ్సిడీని భరించాల్సి వస్తుందని అంచనా. అయిదేళ్ల తరవాత సబ్సిడీతో నిమిత్తం లేకుండానే పథకాన్ని నిర్వహించవచ్చునని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా చూస్తే ఇదివరకటి పంటల బీమా పథకాలకన్నా మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ,

జాతీయ వ్యవసాయ బీమా పథకంలో కొన్ని సవరణలు తేవాల్సిన అవసరముంది. అధికంగా రిస్కు ఉన్న ప్రాంతంలో నష్టపరిహారాన్ని 60 శాతం నుంచి 70 శాతానికి పెంచాలి. ప్రకృతి వైపరీత్యాలవల్ల తరచూ నష్టపోయే రైతులకు మరీ తక్కువ పరిహారమిస్తామనడం న్యాయంకాదు. ఉద్యాన పంటలకు, వార్షిక వాణిజ్య పంటలకు వాస్తవ ప్రీమియం వసూలు చేయాలనుకోవడమూ సమంజసం కాదు. భారతదేశంలో ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగా ఉన్న నూటికి 80 శాతం చిన్న, సన్నకారు రైతులపట్ల ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరముంది. భారత రైతు అప్పుల్లోనే పుట్టి, పెరిగి, చనిపోతున్నాడని ప్రభుత్వ నివేదికలే తేటతెల్లం చేస్తున్నాయి. రానురాను కుటుంబం కింద సగటు భూవిస్తీర్ణం తగ్గిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో మిగతా పంటలకూ 2 శాతం నుంచి 2.5 శాతం మేరకే ప్రీమియం నిర్ణయించడం సబబుగా ఉంటుంది. అయిదేళ్ల తరవాత సబ్సిడీని ఎత్తివేయాలన్న ఆలోచనా సరికాదు. ఏ దేశంలోనైనా ఎండనకా, వాననకా కష్టించే రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. పరిశ్రమల్లో వస్తువుల ఉత్పత్తికి, వ్యవసాయంలో పంటలు పండించడానికి మధ్య చాలా తేడా ఉంది. రైతు ఎంతటి శ్రమకు సిద్ధపడినా చాలావరకు ప్రకృతి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడాల్సిన పరిస్థితే ఈనాటికీ కొనసాగుతోంది. తన శ్రమ, పెట్టుబడికి అనుగుణంగా ధరను నిర్ణయించుకునేది రైతు కాదు. కేంద్ర ప్రభుత్వం ఏవో కాకి లెక్కల ఆధారంగా నిర్ణయించే కనీస మద్దతు ధరలు రైతులకు గిట్టుబాటు అయ్యేవి కావని చూపేందుకు ఎన్నో ఉదాహరణలు. చెరకు పంటకు ఏటా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సలహా ధరలదీ అదే తీరు. విదేశాలకు ఎగుమతి చేయాలంటే కేంద్ర ప్రభుత్వ ఆంక్షలు. జిల్లాల మధ్య, రాష్ట్రాల మధ్య రవాణాకూ ఎన్నో అడ్డంకులు. ప్రకటనలకు, ఆచరణకు మధ్య పొంతన ఉండటం లేదు.

## సవరణలు తప్పనిసరి

దశాబ్దాలుగా కొనసాగుతున్న వాణిజ్య నిబంధనలు రైతుల ప్రగతిని నిరోధిస్తున్నాయని, భారత వ్యవసాయ రంగం ఏటా వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోవలసి వస్తోందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ వ్యవసాయ బీమా పథకం కొనసాగినంతకాలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీని, ఇతర రైతులకు 25 శాతం సబ్సిడీని సమానంగా

భరించాల్సిన అవసరం ఉంది. అమెరికా, జపాన్, రష్యావంటి దేశాల్లోని ప్రభుత్వాల్లో రైతులకు భారీస్థాయి సబ్సిడీలను అందిస్తున్నప్పుడు, ఎంతో వెనకబడి ఉన్న భారత రైతులను ఆదుకోవడం ఇక్కడి ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత కావాలి. గాట్ ఒప్పందం దృష్ట్యా చూసినా జాతీయ వ్యవసాయ ఆదాయంలో 10 శాతం వరకు రైతులకు సబ్సిడీ ఇచ్చే వీలుంది. ప్రభుత్వం ఈ ఏడాది రబీ పంట కాలం నాటికి ఇలాంటి చేర్పులు మార్పులు చేస్తే భారత రైతాంగాన్ని కష్టకాలంలో ఆదుకోగల చక్కని పథకంగా ఆదరణ పొందుతుంది. ఇందుకోసం రైతులు, ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ వంతుగా కేంద్రానికి మార్పులు సూచించాలి.

*ది. 17-07-1994.* — *ఈనాడు*

# దిగుబడిని దెబ్బతీస్తున్న ఎరువుల విధానం

ఈ సంవత్సరం ఖరీఫ్ పంటల కాలం ప్రారంభమయింది. వరుణదేవుడు కరుణించి వర్షాలు చక్కగా కురిస్తే పంటలు బాగా పండుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు మార్కెట్లో మండుతున్న ఎరువుల ధరలు అధిక ఆందోళన కల్గిస్తున్నాయి. 1992 ఆగస్టు ముందు 50 కిలోల డైఆమ్మోనియం ఫాస్ఫేటు (డి.ఏ.పి) ధర రూ. 260; కంట్రోలు ఎత్తివేసిన తరువాత ఈ ధర రూ. 370 నుంచి రూ. 390 వరకు పెరిగింది. ఒక సంవత్సరం కాలంలో ఈ ధర రూ. 490 వరకు పెరగడంతో రైతులపై మోయలేని భారం పడింది. ఫాస్ఫేటు ఎరువుల ధరలు, పొటాష్ ఎరువుల ధరలు హఠాత్తుగా 1992 ఆగస్టులో, అటుతరువాత 150 నుంచి 250 శాతం పెరిగినందువల్ల రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించారు. ఆ సమయంలో నత్రజని ఎరువుల (ముఖ్యంగా యూరియా) ధరలు అంతగా పెరగలేదు. దానితో యూరియా ఉపయోగం హెచ్చింది. ఫాస్ఫేటు, పొటాష్ ఎరువుల వాడకం బాగా తగ్గంది. 1992 రబీ కాలంలో డి.ఏ.పి. వాడకం 21 శాతం, ఎం.ఓ.పి. వాడకం 47 శాతం తగ్గగా యూరియా వాడకం 6 శాతం పెరిగింది. నత్రజని, ఫాస్ఫేటు, పొటాష్ ఎరువుల ఉపయోగంలో పాటించవలసిన నిష్పత్తి 4:2:1. ఈ నిష్పత్తిని పాటించినప్పుడే దీర్ఘకాలంపాటు భూమి నుంచి పంటల దిగుబడులు అధికంగా లభిస్తాయి. భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. ఇది ఎరువుల వాడకంలో ఉండాల్సిన సమతూకం.

## మోతాదు మించితే అసలుకు మోసం

మోతాదును మించి నత్రజనిని ఉపయోగించడంతో సమతూకం దెబ్బతింటున్నదని, భూసారం తగ్గుతున్నదని, తత్ఫలితంగా భవిష్యత్తులో పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని శాస్త్రజ్ఞులు భయందోళనలు వ్యక్త చేస్తున్నారు. 1991-92లో దేశమంతటా అన్నిరకాల పంటల కింద భూమి నుంచి 2 కోట్ల 20 లక్షల టన్నుల పోషకాలను

పంటలు గ్రహించగా, కృత్రిమ (ఆర్గానిక్) ఎరువులతో సహా రైతులు భూమికి అందించిన మొత్తం పోషకాలు 1 కోటి 50 లక్షల టన్నులు మాత్రమేనని అంచనా. భూమి క్రమంగా తనలోని పోషకాలను కోల్పోతున్నదని వెల్లడవుతున్నది. ఇదేవిధంగా భూమి మరికొన్ని సంవత్సరాలు తన పోషకాలను, సారాన్ని కోల్పోతే పంటల ఉత్పత్తికి తీవ్ర విఘాతం తప్పదు. ఏటా అదుపు లేకుండా పెరుగుతున్న జనాభా అవసరాలను భూమి తీర్చలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎరువల వాడకంలో వెంటనే సమతూకాన్ని కల్పించినప్పుడే వ్యావసాయిక ఉత్పత్తుల పెరుగుదల సాధ్యమవుతుంది. 1992 ఆగస్టులో ఫాస్ఫేటు, పొటాష్ ఎరువులపై సబ్సిడీని ఉపసంహరించి, వాటి ధరల మీద, రవాణా మీద కంట్రోలును ఎత్తివేయడంతో ఎరువుల సమతూకం దెబ్బతిన్నది. ఆర్థిక భారాన్ని తగ్గించడానికి కొన్నిరకాల ఎరువుల సబ్సిడీని ఉపసంహరించవలసివచ్చిందని ప్రభుత్వం వాదించింది. ఎరువుల సబ్సిడీ ప్రతి సంవత్సరం పెరిగిన మాట యదార్థమే. కాని, ఒక్కసారిగా ధరలు అధికంగా పెరగడంతో రైతులు ఎరువులను కొనలేకపోయారు. వాటి వినియోగం తగ్గింది. ఈ పర్యవసానాలను ప్రభుత్వం సరిగ్గా అంచనా వేయలేదు. ఎరువుల ధరలను పరిశీలించిన జి.వి.కె. రావు కమిటీ సూచనలను ప్రభుత్వం ఖాతరు చేయలేదు. వరుసగా మూడు సంవత్సరాలు ఎరువుల వినియోగం హెచ్చితే ధరలను 5 నుంచి 7 శాతం పెంచవచ్చని, అప్పుడు ఎరువుల వినియోగం తగ్గదని రావు కమిటీ అభిప్రాయపడింది. ఫాస్ఫేటు, పొటాష్ ధరల సబ్సిడీని ఎత్తివేసి, కంట్రోలును తొలగించేముందు ప్రతిపక్షాలు హెచ్చరించినా ప్రభుత్వం అలక్ష్య ధోరణి ప్రదర్శించింది. 1991 జులైలో ప్రభుత్వం నత్రజని ఎరువల ధరలను 30 శాతం పెంచి, రైతులలో వ్యతిరేకతను నిరోధించడానికి ఆ పెరుగుదలను 10 శాతం మేరకు తగ్గించింది. ఫాస్ఫేటు, పొటాష్ ఎరువల ధరలపై ఆంక్షలను (కంట్రోలును) తొలగించి రూ. 3300 కోట్లు ఆదా చేయవచ్చని పార్లమెంటు సంయుక్త కమిటీ నివేదిక సూచించింది. నత్రజని తక్కువగా ఉండే కాల్షియం అమ్మోనియా నైట్రేట్, ఆమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం క్లోరైడ్ ధరలను తిరిగి నియంత్రణలోకి తీసుకురావాలని ఈ నివేదిక సిఫారసు చేసింది. (వీటి ధరలపై 1991 జులైలో కంట్రోలును తొలగించారు). సన్నకారు, చిన్న రైతుల ప్రయోజనాలను కాపాడాలని, ఎరువులను బాగా వాడేవిధంగా వారిని ప్రోత్సహించాలని కమిటీ కోరింది. ఎరువుల ధరల నియంత్రణ పథకాన్ని తిరిగి పరిశీలించాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. ఎరువల వాడకంలో సమతూకాన్ని

పునరుద్ధరించడానికి ముఖ్యమయిన మూడు ఎరువుల ధరలలో కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని కేంద్ర వ్యవసాయశాఖను నిర్వహిస్తున్న సమయంలో సహాయమంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేసిన ప్రకటన రైతులకు కొంత ఊరట కల్గించింది. మీనమేషాలు లెక్కించకుండా ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలి. ఎరువుల సబ్సిడీ భారం పెరగడానికి ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలే. ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నప్పుడు మనం దిగుమతి చేసుకుంటున్న ఎరువుల ధరలు రైతులకు భారంగా పరిణమించకుండా నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రథమ పర్యాయం 1973-74లో ఎరువుల సబ్సిడీని ఇచ్చింది. దేశమంతటా రైతులకు ఒకే ధరకు నత్రజని ఎరువును అందించాలని మరాథే కమిటీ సూచనలకు అనుగుణంగా కేంద్రంలో అప్పటి జనతాపార్టీ ప్రభుత్వం 1977 నవంబర్ 1 నుంచి 'రిటెన్షన్ ధర-సబ్సిడీ' విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం ఈ విధానాన్ని 1979 ఫిబ్రవరి తరువాత ఫాస్ఫేటుకు, ఇతర కాంప్లెక్సు ఎరువులకు కూడా అన్వయింపజేసింది. 1982 మే నెల తరువాత సూపర్ ఫాస్ఫేటు ఎరువులను సైతం ఈ విధానం పరిధిలోకి తెచ్చారు. ఈ చర్యల ఫలితంగా ఎరువుల సబ్సిడీ 1973-74లో రూ. 33 కోట్లతో ప్రారంభమయి 1981-82 నాటికి రూ. 375 కోట్లకు పెరిగి 1990-91 నాటికి రూ. 4390 కోట్లకు చేరుకుంది. ఎరువుల వినియోగం పెరగడంతో సబ్సిడీ కూడా పెరిగింది. 1951-52లో దేశంలో సగటున హెక్టారు ఒక్కంటికి కేవలం 0.5 కిలోల ఎరువు మాత్రమే వాడారు; ఈరోజున సగటున హెక్టారుకు 76 కిలోల రసాయనిక ఎరువులను ఉపయోగిస్తున్నారు. ఇతర దేశాలతో పోల్చితే ఈ వినియోగం తక్కువే. సేద్యపు భూమి విస్తీర్ణం పెరిగే అవకాశాలు తక్కువ కనుక, పెరుగుతున్న జనాభా ఆహారం అవసరాలను తీర్చడానికి తగినన్ని పంటలు పండించాలంటే ఎరువుల వినియోగం అనివార్యం. 1960 దశబ్ది మధ్యకాలం వరకు ఎరువుల సగటు వాడకం ఏటా 50 వేల టన్నుల చొప్పున పెరిగింది. అధిక దిగుబడి వంగడాలతో కూడిన సస్యవిప్లవం ప్రారంభమయిన తరువాత గత 27 సంవత్సరాలలో సగటున సంవత్సరానికి 4 లక్షల 17 వేల టన్నుల చొప్పున ఎరువుల వినియోగం పెరిగింది. ఇండియా కంటే ఎక్కువ జనాభాగల చైనాలో సగటున హెక్టారుకు 236 కిలోల ఎరువులను ఉపయోగిస్తున్నారు. సగటున హెక్టారుకు మనదేశంలో 2818 కిలోల వడ్లు పండగా చైనాలో 5962 కిలోల వడ్లు పండుతున్నాయి. సగటున హెక్టారుకు తృణధాన్యాలు

మనదేశంలో 935 కిలోలు పండగా, చైనాలో 4300 కిలోలు పండుతున్నాయి. దిగుబడిని పెంచడానికి మనం తీవ్ర కృషి జరుపకతప్పదు. దేశానికి అవసరమయిన నత్రజని ఎరువులలో 85 శాతం, ఫాస్ఫేటు ఎరువులలో 70 శాతం దేశంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. మిగతా భాగాన్ని విదేశాల నుంచి దిగుమి చేసుకుంటున్నాం. దేశంలో ఉపయోగిస్తున్న పొటాష్ ఎరువంతా దిగుమతి అవుతున్నదే-మనదేశంలో పొటాష్ లేదు. ఫాస్ఫేటు ఎరువల వాడకం 1991-92లో 33.2 లక్షల టన్నుల నుంచి 1995-96లో 28.40 లక్షల టన్నులకు తగ్గింది; అదే కాలంలో పొటాష్ ఎరువుల వినియోగం 13.6 లక్షల టన్నుల నుంచి 11.60 లక్షల టన్నులకు తగ్గింది. నత్రజని ఎరువుల వినియోగం 80.40 లక్షల టన్నుల నుంచి 98.60 లక్షల టన్నులకు పెరిగింది. ఈ పరిస్థితిలో ముఖ్యంగా సన్నకారు రైతులు, చిన్న రైతులు నష్టపోతున్నారు. సన్నకారు రైతులు, చిన్న రైతులు తక్కువ ధరకు లభించే యూరియాను వాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కోట్లాది పేద రైతులు శాశ్వతంగా దెబ్బతిని దేశం తీవ్రంగా నష్టపడుతుంది. మనదేశంలోని పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఎరువుల ధరలను శాసించే అవకాశం పూర్తిగా మార్కెటు శక్తులకే ఇవ్వడం శ్రేయస్కరం కాదని స్పష్టమవుతుంది. ప్రభుత్వం 1992-93లో రూ. 5796 కోట్ల, 1993-94లో రూ. 4400 కోట్ల, 1994-95లో రూ. 5240 కోట్ల ఎరువుల సబ్సిడీ భారాన్ని భరించింది. 1995-96లో కేటాయించిన సబ్సిడీ రూ. 5900 కోట్లు. ఎన్నికలకు ముందు పి.వి. ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎరువులపై రూ. 6800 కోట్ల సబ్సిడీని ప్రకటించగా, ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీని భారీగా పెంచి దాన్ని రూ. 8800 కోట్ల స్థాయికి చేర్చింది. ఈ ఎరువుల సబ్సిడీలో సగంకన్నా తక్కువ మాత్రమే రైతులకు చెందుతున్నదని, సగంకంటే ఎక్కువ ఎరువుల కర్మాగారాల యజమానుల జేబుల్లోకి పోతున్నదని ప్రపంచబ్యాంకు పరిశీలనలో వెల్లడయింది. 'రిటెన్షన్ ధర-సబ్సిడీ' విధానంలోనే కొన్ని లోపాలున్నాయి. కొన్ని కర్మాగారాలు కాగితాలపై ఎక్కువ ఉత్పత్తిని చూపి ఎక్కువ సబ్సిడీని స్వాహా చేస్తున్నాయి. దీనిని అరికడితే సబ్సిడీ ఎంతో ఆదా అవుతుంది. ఎరువుల కర్మాగారాలకు అవసరమయ్యే నాఫ్తా, సమజవాయువు, ఇంధనం చమురు, బొగ్గు మొదలయిన వాటి ధరలను కేంద్ర ప్రభుత్వం ఎన్నో రెట్లు పెంచింది. ఇతర దేశాలతో పోల్చితే ఈ రేట్లు ఎక్కువే. ప్రభుత్వం ఒకవంక ఎరువుల సబ్సిడీ ఇస్తూ మరోవంక తెలివిగా తిరిగి తీసుకుంటున్నది. ఎరువుల సబ్సిడీ భారం పెరగకుండా

ఉండాలంటే నాఫ్తా, సహజవాయువు ధరలు పెరగకుండా ప్రభుత్వం చూడాల్సి ఉంటుంది. 1994-95లో మనదేశంలో ఉత్పత్తి అయిన యూరియాపై టన్నుకు రూ. 2232 సబ్సిడీ పడిందని, విదేశాల నుంచి దిగుమతి చేసిన యూరియాపై టన్నుకు రూ. 3643 సబ్సిడీ లభించిందని ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి 5 నుంచి 10 శాతం మేరకు సబ్సిడీని పెంచితే ఈరోజు భారం ఇంతగా ఉండేది కాదు. ఎరువుల వాడకంలో సమతూకం కోసం యూరియా ధరను స్వల్పంగా పెంచడం సమంజసం. ఇప్పుడు 50 కిలోల యూరియా ధర రూ. 165; దీనిని 10 శాతం, అంటే రూ. 180 వరకు పెంచడం సబబే. ఫాస్ఫేటు, పొటాష్ ఎరువుల ధరలను గణనీయంగా తగ్గించాలి. డి.ఏ.పి. బస్తా ధరను రూ. 510 నుంచి రూ. 410 వరకు తగ్గిస్తున్నట్లు ప్రధానమంత్రి గౌడ ప్రకటించారు. ఇది హర్షనీయం. తగ్గించిన తరువాత ధర కూడా 1992 ఆగస్టు ముందున్న ధరకు రెండింతలుగా ఉంది. ఎం.ఓ.పి. 50 కిలోల ధరను రూ. 220 నుంచి రూ. 195 వరకు తగ్గిస్తున్నట్లు కూడా ప్రకటించారు. దీనిని ఇంకా తగ్గించాలి. రష్యా నుంచి మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దిగుమతులను నిలిపివేయాలని కొన్ని నెలల కిందట ప్రభుత్వంలో ఒక ఆలోచన వచ్చింది. జర్మనీ, ఇజ్రాయెల్, జోర్డాన్ దేశాల నుంచి దిగుమతి అయ్యే దానితో పోల్చినప్పుడు రష్యా నుంచి జరిగే దిగుమతికి రవాణా ఛార్జీలు టన్నుకు 35 డాలర్లు (దాదాపు రూ. 1200) తక్కువ. అందువల్ల, రష్యా నుంచి దిగుమతి చేసుకుంటే మనకు సబ్సిడీ భారం తగ్గుతుంది. రష్యా నుంచి పొటాష్ దిగుమతులను నిలిపివేస్తే ఇతర దేశాల వర్తకులు ముఠాగా ఏర్పడి ధరలను పెంచే ప్రమాదం ఉంది.

## పెరగాల్సిన ఉత్పత్తి-తగ్గాల్సిన సబ్సిడీ

యూరియా దిగుమతి 1991-92లో 3.90 లక్షల టన్నులు కాగా, 1992-93లో 18 లక్షల టన్నులు, 1993-94లో, 1994-95లో 28 లక్షల టన్నులు. ప్రభుత్వపు ఆనాలోచిత నిర్ణయాల కారణంగా మనదేశంలో యూరియా ఉత్పత్తి తగ్గుతున్నది. సహజవాయువుపై ఆధారపడే యూరియా కర్మాగారాలకు సహజవాయువు సరఫరాను తగ్గించారు. ఒక్క యూరియా బస్తా అయినా దేశంలోకి చేరకుండానే 133 కోట్ల భారీ మొత్తాన్ని కొందరు పెద్దలు స్వాహా చేసిన కుంభకోణం ఘోరమయినది. దేశంలో ఎరువుల ఉత్పత్తిని గరిష్ఠస్థాయికి పెంచి భవిష్యత్తులో సబ్సిడీ భారాన్ని తగ్గించవచ్చు.

సేంద్రియ ఎరువుల వాడకాన్ని విస్తృతపరచాలి. వృథా అవుతున్న పదార్థాలను కంపోస్టు ఎరువుగా మార్చి ఉపయోగిస్తే భూమి నీటిని ఎక్కువగా తీసుకుని నిలువ చేసుకోగల శక్తిని, పోషకాలను గ్రహించగల శక్తిని పెంపొందించుకుంటుంది. పట్టణ ప్రాంతాలలో 64 లక్షల టన్నుల, గ్రామీణ ప్రాంతాలలో 26 కోట్ల టన్నుల కంపోస్టుకు అవకాశం ఉందని 1989-90లో అంచనా వేశారు. దీనినంతా ఉపయోగిస్తే 80 లక్షల టన్నుల పోషకాలు భూమికి అందుతాయి. దేశంలో పలు ప్రాంతాలలో జింకు, సల్ఫర్ లోపం ఉన్నట్లు తెలిసింది. పంటల దిగుబడి పెరిగి లాభాలు పెంచాలంటే ఈ లోపాలను తొలగించాలి. రైజోబియం, నీలిపచ్చ ఆల్గే తదితర బయోఫెర్టిలైజర్లను (జీవ ఎరువులను) అధికంగా ఉపయోగించి భూమికి నత్రజనిని హెచ్చుగా అందించవచ్చు. పప్పుల దిగుబడి పెరగడానికి రైజోబియం కల్చర్ చాలా దోహదపడుతుంది. దేశమంతటా మొత్తం 9 కోట్ల 77 లక్షల కమతాలలో ఒక హెక్టారుకంటే తక్కువగా ఉన్న 6 కోట్ల 21 లక్షల సన్నకారు రైతులను, 1 నుంచి 2 హెక్టార్లుగల చిన్నరైతు కుటుంబాలను, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఫాస్ఫేట్, పొటాష్ ఎరువుల ధరలను ఇంకా తగ్గించాలి. యూరియా ధరను స్వల్పంగా పెంచాలి. దీనితో ఎరువుల వాడకంలో సమతూకం సాధ్యమవుతుంది, పంటల దిగుబడి గణనీయంగా హెచ్చుతుంది.

*ది. 14-07-1996.* — *ఈనాడు*

●

# ప్రకృతి వికటించినవేళ రైతుకేదీ రక్షణ?

రాష్ట్రంలో అక్టోబరు తుపాను, భారీ వర్షాల కారణంగా రూ. 320 కోట్ల మేరకు పంటలకు నష్టం సంభవించినట్టు అధికార వర్గాల ప్రాథమిక అంచనాలు వెల్లడించాయి. వరి పంట 86,020 హెక్టార్లలో పూర్తిగా, 1,30,797 హెక్టార్లలో కొంతవరకు దెబ్బతిన్నదని అంచనా. వేరుశనగపంట 3,29,900 హెక్టార్లలో పూర్తిగా, 4,56,000 హెక్టార్లలో కొంతవరకు; పత్తిపంట 30,016 హెక్టార్లలో పూర్తిగా, 25,460 హెక్టార్లలో కొంతవరకు దెబ్బతిన్నాయని అంచనా వేశారు. ఇక ఇతర పంటలు 35,570 హెక్టార్లలో పూర్తిగా; 33,910 హెక్టార్లలో పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిసింది. మొత్తంమీద ఈసారి పంటలు 4,81,506 హెక్టార్లలో పూర్తిగా; 6,46,167 హెక్టార్లలో కొంతవరకు నష్టపడ్డాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ పంటల నష్టంతోపాటు 3450 హెక్టార్లలో ఇసుకమేట వేసింది. ఇటీవలి ప్రకృతి వైపరీత్యం ఫలితంగా వ్యవసాయ రంగానికి సంభవించిన మొత్తం నష్టం రూ. 320 కోట్లని అధికార వర్గాల మదింపులో తేలింది. ఇంతగా నష్టపడినా రైతుకు తగిన పరిహారం లభించదు. తరువాత వేసే పంటకు విత్తనాలను, కొద్దిగా ఎరువులను మాత్రం ప్రభుత్వం సరఫరా చేసింది. రాష్ట్రంలో రైతులు నష్టపోవడం ఇది మొదటిసారి కాదు. తుపానులు, భారీవర్షాలవల్ల ఉప్పెనలు సంభవించినప్పుడల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తొలకరి చినుకులు పడగానే రైతులు ఎంతో ఆశతో విత్తనాలు వేస్తారు; వర్షాలు సకాలంలో సరిగ్గా కురియక విత్తనాలు ఎండిపోతే నిస్సహాయంగా నిర్వేదం పాలవుతారు.

## విశ్వాసం కల్పించని పథకాలు

1996 జూన్ 12 నుంచి 17 వరకు సంభవించిన తుఫానుతో కొన్ని జిల్లాలలో పండ్లతోటలు, ధాన్యం, వరి నారుమళ్లు బాగా దెబ్బతిన్నాయి. 1990 మే నెలలో భయంకరమైన తుపాను తొమ్మిది కోస్తాజిల్లాలను ధ్వంసం చేసింది. పర్యవసానంగా

రూ. 2137 కోట్ల నష్టం వాటిల్లింది. సముద్రతీర భూములలో, వేల ఎకరాలలో కోసిపెట్టిన వరిపైరు పనలు అన్నీ సముద్ర కెరటాలలో కొట్టుకుపోయాయి. వరికుప్పలు తడిసి, ధాన్యం ముక్కిపోయి, రంగు మారి రైతులు నష్టపడ్డారు. వేల ఎకరాల్లో మామిడి, జామ, అరటి, నిమ్మ, జీడిమామిడి, కొబ్బరి తోటలు చెల్లాచెదరయ్యాయి. తమలపాకుల తోటలు, కూరగాయల మళ్లు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తోటల అభివృద్ధి (హార్టికల్చర్)శాఖ ప్రథమ పర్యాయం వివిధ జిల్లాల నుంచి సమగ్ర సమాచారం సేకరించి పండ్ల తోటలలో వృక్షాలకు, పంటలకు సంభవించిన నష్టాన్ని అంచనా వేసింది. రైతుల చేతికి అందవలసిన దాదాపు రూ. 149 కోట్ల విలువైన పంట గంగపాలయింది. చెట్లు విరిగి తోటలకు రూ. 381 కోట్ల నష్టం సంభవించింది. కోస్తా జిల్లాలలో హార్టికల్చర్ రంగంలో మొత్తం రూ. 530 కోట్ల నష్టం సంభవించినా, పండ్ల తోటలకు ఇంతవరకు బీమా పథకం వర్తించడం లేదు గనుక రైతులకు నష్టపరిహారం ఏదీ ముట్టలేదు. పది సంవత్సరాల కిందట 1986 ఆగస్టులో వరదల వల్ల రూ. 407 కోట్ల విలువైన పంటల నష్టం సంభవించింది. 1988 జులై–ఆగస్టు మాసాల్లో కూడా రాష్ట్రంలో వరదలు బీభత్సం సృష్టించాయి. ఒకవంక తుపానులు, భారీవర్షాలు, వరదలు, మరోవంక అనావృష్టి, కాటకం రైతులకు తరచు వేలకోట్ల రూపాయల నష్టాన్ని కలిగిస్తున్నాయి. 1978 నుంచి 1996 వరకు రాష్ట్రంలో తుపానులు, వరదల కారణంగా సగటున సంవత్సరానికి 4 లక్షల 80 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అంచనా. ప్రస్తుతం అమలులో వున్న 'సమగ్ర పంటల బీమా పథకం'లో పలు లోపాలున్నాయి. 1979–80లో పంటల బీమా పైలట్ పథకాన్ని అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. మొదట గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఈ పైలట్ పథకాన్ని 1979 ఏప్రిల్ 1 నుంచి అమలుచేశాయి. తరువాత ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర పన్నెండు రాష్ట్రాలు ఈ పైలట్ పథకాన్ని చేపట్టాయి. ఈ పథకంలో కొన్ని లోపాలున్నాయని గుర్తించారు. గత పది సంవత్సరాల సగటు పంట దిగుబడి ఆధారంగా గ్యారంటీ దిగుబడిని నిర్ధారించడం, ఎక్కువ నష్టాలు పొందే ప్రాంతాలను ఈ పథకంలో చేర్చకపోవడం, తక్కువ ప్రమాద ప్రాంతాల్లో 30 శాతం మేరకు పంట దిగుబడి తగ్గినా నష్టపరిహారం లభించకపోవడం, యూనిట్ విస్తీర్ణం చాలా పెద్దదిగా ఉండడం వంటివి కొన్ని ముఖ్యలోపాలు. లోపాల కారణంగా పైలట్ పథకం రైతుల ఆదరణ

పొందలేకపోయింది. దీనిని ప్రభుత్వం 1985 మార్చి 1 నుంచి ఉపసంహరించింది. విజయవంతం కాకపోయినప్పటికీ రైతులు పంటల బీమా ఆవశ్యకతను, దాని ప్రయోజనాలను గుర్తించడానికి ఆ పథకం దోహదపడింది. తరచు అనావృష్టి వల్ల దెబ్బతినే మెట్ట ప్రాంత రైతులకు పంటల బీమా పథకం అవసరమని, దేశంలోని పంటల విస్తీర్ణంలో 70 శాతం ఉన్న వర్షధార ప్రాంతాల రైతులు పెద్దయెత్తున నూతన శాస్త్రీయ పద్ధతులను అవలంబించడానికి, ఎక్కువ పెట్టుబడులు పెట్టి పంట దిగుబడులను పెంచడానికి ఈ పథకం దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ సహకారశాఖ నియమించిన కమిటీ అభిప్రాయపడింది. నూటికి ఎనభై మంది చిన్న రైతులు, సన్నకారు రైతులు; వారికి ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ లభించాలంటే పంటల బీమా పథకం అత్యవసరమని ఈ కమిటీ వివరించింది. అందువల్ల, కేంద్ర ప్రభుత్వం 1985 ఏప్రిల్ 1 నుంచి సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతులు ఈ పథకంలో స్వచ్ఛందంగా చేరవచ్చు. దీనిని రాష్ట్రాలు తప్పకుండా అమలుచేయాలన్న నిర్బంధం ఏదీ లేదు. వరి, గోధుమ, తృణధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు సమగ్ర పంటల బీమా పథకం పరిధిలోకి వస్తాయి. ఇంతవరకు ఈ పథకం పరిధిలో వరి, గోధుమ, సజ్జ, జొన్న, మొక్కజొన్న వంటి ఆహారధాన్యాలు, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, కంది, పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యాలను చేర్చారు. పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా ప్రాంతాలను అధికారికంగా ప్రకటిస్తాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవిన్యూ మండలాన్ని యూనిట్ ఏరియాగా ప్రకటించింది. ఈ యూనిట్ ఏరియాలో గత అయిదు సంవత్సరాల కాలంలో బీమా చేసిన పంట దిగుబడులను పదహారుచోట్ల పంటను కోసి దిగుబడి నిర్ధారించి దాని సగటు దిగుబడిని గ్యారంటీ దిగుబడి (త్రెషోల్డ్ యీల్డ్)గా పరిగణిస్తారు. పంట బీమా చేసిన సంవత్సరం సగటు వాస్తవ దిగుబడి గ్యారంటీ దిగుబడికంటే తగ్గినప్పుడు ఒక సూత్రం ప్రకారం నష్టపరిహారం నిర్ణయిస్తారు. ఆహార ధాన్యాలైన వరి, గోధుమ, తృణధాన్యాల విషయంలో బ్యాంకుల నుంచి పొందిన పంట రుణాలపై ఒక రైతుకు పదివేల రూపాయలకు మించని విధంగా 2 శాతం చొప్పున ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. నూనెగింజలు, పప్పుధాన్యాలకైతే ఒకటిశాతం ప్రీమియం చెల్లించాలి. సన్నకారు రైతులు, చిన్న రైతులు ఈ ప్రీమియంలో సగం చెల్లిస్తేచాలు. మిగతా సగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో సబ్సిడీగా ఇస్తాయి. కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ ప్రీమియం సగం సబ్సిడీని

కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా ఈ పథకం నిర్వహణకు పంటల బీమా నిధులను ఏర్పరచాయి. రైతులకు ఇచ్చే మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2:1 నిష్పత్తిలో భరిస్తాయి. 1985 ఏప్రిల్ 1 నుంచి, అంటే 1985 ఖరీఫ్ సీజన్ నుంచి 1995 ఖరీఫ్ సీజన్ వరకు మొత్తం 19 పంట సీజన్లలో (ఖరీఫ్, రబీ కలిపి) సమగ్ర పంటల బీమా పథకానికి రూ. 231.26 కోట్ల ప్రీమియం ఆదాయం చేకూరగా, రూ. 1200 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వాలు నష్టపరిహారంగా చెల్లించాయి. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ పథకం అమలుకు ముందుకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ప్రతి పంట సీజనులో, అంటే మొత్తం 19 సీజన్లలో ఈ పథకాన్ని అమలు జరిపాయి. కొన్ని రాష్ట్రాలు కొన్ని సీజన్లలో మాత్రమే అమలుచేశాయి. మొత్తంమీద దేశమంతటా 5 కోట్ల 12 లక్షల 40 వేల 814 మంది రైతులు ఈ పథకంలో చేరారు. 8 కోట్ల 75 లక్షల 59 వేల 775 హెక్టార్ల విస్తీర్ణం భూమిలోని పంటలు ఈ పథకం కిందికి వచ్చాయి. రూ. 13,545 కోట్ల మేరకు పంటలను బీమా చేయగా, రూ. 1206.93 కోట్లు పరిహారంగా ఇవ్వాలని నిర్ణయించారు. రూ. 1200.15 కోట్ల మొత్తం పరిహారంగా ముట్టింది. ప్రీమియం, పరిహారం మధ్య దాదాపు 1:6 నిష్పత్తి ఉంది. సమగ్ర పంటల బీమా పథకం నిర్వహణలో ప్రీమియం రూపంలో ఒక రూపాయి వస్తుండగా, నష్టపరిహారంగా ఆరురూపాయలను చెల్లించారన్నమాట. ఇటువంటి పథకం ఎంతకాలం కొనసాగుతుందన్న అనుమానం కలగడం సహజం. కొన్ని రాష్ట్రాలలో ఈ పథకాన్ని దుర్వినియోగపరిచారు. అందులో చెప్పవలసింది గుజరాత్– అక్కడ 18 సీజన్లలో రూ. 37.34 కోట్ల ప్రీమియం లభించగా రూ. 702 కోట్లను పరిహారంగా చెల్లించారు. ఆంధ్రప్రదేశ్‌లో 19 సీజన్లలో ప్రీమియం రూ. 56.73 కోట్లు కాగా రూ. 167.42 కోట్లు నష్టపరిహారంగా పంపిణీ అయింది. రాష్ట్రంలో దుర్వినియోగం కాలేదు. దేశమంతటా ప్రస్తుతం సాగవుతున్న భూమిలో మూడో వంతుకే నీటివసతి ఉంది. మిగతా భూమి వర్షాధారం. తరచు దుర్భిక్షానికి గురవుతున్న పలు జిల్లాలను డి.పి. ఎ.పి. బ్లాకులుగా వర్గీకరించారు. ఎన్నో జిల్లాలు ఏటా వరదలలో మునిగి పోతున్నాయి. అదీగాక, రెండు మూడేళ్ళకోసారి తూర్పు కోస్తా ప్రాంతానికి తుపాను, ఉప్పెనలవల్ల విపరీత నష్టం కలుగుతోంది. సగటున ఏటా నాలుగొందల కోట్ల రూపాయలకు మించిన విలువైన పంటల నష్టం సంభవిస్తోంది. ఇటువంటి పరిస్థితిలో రైతులకు లభిస్తున్న పరిహారం

పరిమితంగానే ఉంది. రైతుకు ఎంతెక్కువ నష్టం జరిగినా, బీమా పథకంతో లభించే మొత్తం రూ. 9 వేలకు మించదు. మామిడి, సపోట, జామ, తమలపాకు, కొబ్బరి, అరటి తోటలకు పండ్లతోటల బీమా పథకం లేనందువల్ల ఆంధ్రప్రదేశ్ అధికంగా నష్టపోతోంది. రాష్ట్రంలో లక్షా 67 వేల హెక్టార్లలో మామిడితోటలు, దాదాపు 25 వేల హెక్టార్లలో అరటితోటలు, 47 వేల హెక్టార్లలో నిమ్మతోటలున్నాయని అంచనా. 1990 మే నెల తుపానుతో కోస్తా జిల్లాలలోని మామిడి తోటలలో సగం, అరటి, తమలపాకు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అంచనా. దేశంలోని రైతులలో నూటికి ఎనభైమంది సన్నకారు, చిన్నరైతులు గనుక వారికి బ్యాంకుల రుణ సదుపాయం ఉండదు. వారిలో కొద్దిమంది మాత్రమే పరపతి సౌకర్యం పొందుతున్నారు. పంటలు దెబ్బతిన్నప్పుడు ఈ చిన్న, సన్నకారు రైతులు తాము తీసుకున్న పంట రుణాన్ని చెల్లించడానికి, తిరిగి పంట వేయడానికి పంటల బీమా పథకం ఉపయోగపడుతుంది. అందువల్ల ఇప్పుడున్న సమగ్ర పంటల బీమా పథకంలో అవసరమైన మార్పులు చేసి రైతులకు రక్షణ కల్పించాలి. బ్యాంకుల నుంచి అప్పులు తీసికోని రైతులకు కూడా బీమా పథకం వర్తించాలి. నేటికీ భారతదేశ రైతులలో దాదాపు పదిశాతంమంది మాత్రమే సహకార సంస్థల ద్వారా, లేదా వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల నుంచి పరపతి సౌకర్యం పొందగలుగుతున్నారు. లక్షలమంది రైతులు, విశేషించి చిన్న, సన్నకారు రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి, మార్కెట్లోని టోకు వర్తకుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకోక తప్పడంలేదు. పంటల బీమా పథకం ఆర్థిక పటిష్ఠతను పొందాలంటే రైతులందరు దాని పరిధిలోకి రావలసి ఉంటుంది. ప్రస్తుతం రైతు ఈ పథకంలో చేరాలన్న నిర్బంధం లేదు. కాని, బీమా పథకం అమలవుతున్న రాష్ట్రంలో, బీమా పరిధి పంటలు పండించే రైతులందరూ పథకంలో చేరాలన్న నిబంధన రావాలి. ఇది ముఖ్యం. ఇటువంటి నిబంధన ఉంటే రైతు దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరతాయి. పథకం ఆర్థిక సౌష్ఠవం పొందడానికి తగినట్లుగా ప్రీమియంను నిర్ధారించాలి. తక్కువ స్థాయిలోగాక ప్రీమియం వాస్తవానికి దగ్గరగా, సహేతుకంగా ఉండాలి. ఇందులో కొంతమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీగా ఇవ్వవచ్చు. ఇక యూనిటు విస్తీర్ణం రెవిన్యూ గ్రామం లేదా గ్రామ పంచాయతీ కావాలి. పంచాయతీ స్థాయిలో రైతులకు పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర వ్యవసాయమంత్రి చతురానన్‌మిశ్రా తాజాగా ప్రకటించారు. చిన్న ఏరియాను యూనిటుగా తీసుకున్నప్పుడు పంట దిగుబడుల ప్రయోగాలు పదహారు జరగడానికి

తగిన సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చాలి. గ్యారంటీ దిగుబడులను, వర్తమాన సంవత్సరం దిగుబడులను లెక్కించడానికి ఈ సిబ్బంది అవసరం. కొత్తగా నియమించ కుండా, సర్వీసులో ఉన్నవారికే తగిన శిక్షణ ఇవ్వాలి. ఇప్పుడున్న రూ. 10 వేల గరిష్ఠ పరిమితిని కనీసం రూ.25 వేల స్థాయికి పెంచాలి. ప్రీమియం రేట్లు దేశమంతట ఒకేతీరుగా కాకుండా ఆయా ప్రమాద ప్రాంతాలకు తగినట్లు వేరువేరుగా ఉండాలి.

## వాస్తవ దృష్టితో కార్యాచరణ

బీమా పథకం పరిధిలో ప్రస్తుతం ఉన్న పంటలతోపాటు పత్తి, పొగాకు, చెరకు, మిరపకాయ వంటి వాణిజ్య పంటలు, మామిడి, జామ, సపోటా, ద్రాక్ష, అరటి వంటి పండ్లను కూడా చేర్చాలి. కోస్తా తీర ప్రాంతాలలో పండ్ల తోటలకు బీమా అత్యవసరం. జపాన్ తదితర దేశాల సరళిలో భారత్‌లోను పండ్లతోటల బీమా పథకం రూపొందాలి. పంటల బీమా పథకం అమలు బాధ్యతను జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీకిగాక ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌కు అప్పగించాలి. పార్లమెంటు చట్టంద్వారా ఈ కార్పొరేషన్ ఏర్పాటు కావాలి. ప్రస్తుతం బీమా పథకం కోత కోయకముందున్న పంటలకే వర్తిస్తోంది. కోసిన తరువాత పంటలకు కూడా ఇది వర్తించాలి. 1987లో అర్ధనారీశ్వరన్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ బీమా పథకంలో కొన్ని మార్పులను సూచించింది. 8వ ప్రణాళిక కాలంలో వ్యవసాయం, పరపతి, సహకార రంగాల నిమిత్తం ప్రణాళికా సంఘం ఏర్పాటుచేసిన పరిశీలన బృందం పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని, ప్రత్యేకంగా పంటల బీమా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించింది. 1992 ఏప్రిల్ నాటికి నూతన పంటల బీమా పథకాన్ని రూపొందిస్తామని 1991 నవంబర్ 23న అప్పటి ప్రధానమంత్రి హైదరాబాద్‌లో ప్రకటించారు. అయిదు సంవత్సరాలైనా ఈ పథకం రూపొందలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో వివిధ రూపాల్లో పంటల బీమా పథకాలు రైతులకు కష్టకాలాల్లో సహాయపడుతున్నాయి. రష్యా, జపాన్, అమెరికాలలో ఈ పథకాలు చక్కగా అమలవుతున్నాయి. ఆ దేశాల అనుభవాలను, ఇక్కడి రైతుల పరిస్థితిని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సత్వరం సమగ్ర నూతన పంటల బీమా పథకాన్ని రూపొందించాలి.

*ది. 10-11-1996.* — *ఈనాడు*

●

# రైతుల్లో చైతన్యం పెరిగితేనే భవితవ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 10 నుంచి 14 వరకు, 20 నుంచి 26 వరకు రెండు విడతల్లో 22 జిల్లాల్లో కర్షక విజ్ఞాన వేదికలు నిర్వహించింది. రైతులకు సాంకేతిక విజ్ఞానాన్ని అందించడం, పంటల సాగులో కొత్త మెలకువలు వివరించి వారిలో నూతన చైతన్యాన్ని కలిగించడం సదస్సుల లక్ష్యం. సదస్సులపై కొన్ని వర్గాల నుంచి విమర్శలు రావడం విచారకరం. ఆహార కొరత ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అధిక దిగుబడులు సాధించాల్సిన సమయమిది. అందుకోసం వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా బలోపేతం చేయడం అత్యవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అలురిస్తున్న పద్ధతులు, ప్రభుత్వ విధానాలూ మారాలి. భారతదేశంలో ప్రస్తుతం ఏటా సుమారు 19 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతం 93 కోట్లు ఉన్న జనాభా ఈ శతాబ్దాంతానికి వంద కోట్లు దాటబోతోంది. దేశం స్వయం సమృద్ధి సాధించిందని గొప్పలు చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. కొన్ని సంవత్సరాలు మినహా దాదాపు ప్రతి ఏడాదీ భారతదేశం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటూనే ఉంది. అమెరికా నుంచి ఏటా కోటి టన్నుల ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సిన 1960 దశకం నాటి దుస్థితి నుంచి మాత్రం బయట పడ్డాం. గోధుమ, వరి పంటలలో అధిక దిగుబడుల వంగడాల వాడకం వల్ల సస్యవిప్లవం ప్రారంభమై ఎకరా దిగుబడులు గణనీయంగా పెరిగాయి. దేశంలో ప్రస్తుతం మూడు కోట్ల టన్నుల ఆహార ధాన్యాల నిల్వలుంటున్నాయి. వాస్తవానికి ఈ నిల్వలు మిగులు ధాన్యమేమీ కాదు. జనాభాబట్టి లెక్కగడితే 28 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం. దేశంలో ఉత్పత్తి అవుతున్నది 19 కోట్ల టన్నులు మాత్రమే. అంటే తొమ్మిది కోట్ల టన్నులు తక్కువే. మరి ఇలాంటప్పుడు మిగులు నిల్వలెలా సాధ్యం...? దేశ జనాభాలో సుమారు 37 కోట్ల మందికి ఆకలి తీర్చుకోడానికి అవసరమైన ఆహార ధాన్యాలను కొనుక్కోగలిగిన స్థితిలేదు. మనిషి

ఆరోగ్యవంతంగా జీవించడానికి ఏడాది 300 కిలోల ఆహారధాన్యాలు తీసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతుండగా, ఇక్కడి తలసరి వినియోగం 198 కిలోలు మాత్రమే. రెండువేల సంవత్సరం నాటికి 22 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరమవుతాయని జాతీయ వ్యవసాయ కమిషన్ లోగడే అంచనా కట్టింది. అంటే – మరో మూడేళ్లలో అదనంగా దాదాపు మూడు కోట్ల టన్నులను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. సాగు భూమి విస్తీర్ణం పెద్దగా పెరగడం లేదు. తలసరి సాగుభూమి లభ్యత యాభై సెంట్ల నుంచి ముప్పై సెంట్లను తగ్గిపోయే పరిస్థితి. సాగునీటి వసతి కూడా మరీ వేగంగా ఏమీ విస్తరించడంలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సాగు భూమినుంచే దిగుబడులను ఇతోధికంగా పెంచగలగాలి. అప్పుడే దేశంలో ఆహార సమస్యను నిజంగా అదిగమించడం సాధ్యమవుతుంది. ఈ సందర్భంలో భారత్‌కన్నా అధిక జనాభాగల చైనా నుంచి కొన్ని విషయాలను గ్రహించవచ్చు.

## ఆధునీకరణ అవసరం

చైనా జనాభా ప్రస్తుతం 120 కోట్లు. ప్రపంచ జనాభాలో 22 శాతం అక్కడ ఏటా 48 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. సగటున తలసరి వినియోగం 400 కిలోలు. భారత్‌కన్నా రెట్టింపు! రానున్న 40 ఏళ్లలో చైనా జనాభా 160 కోట్లకు చేరుతుందని అంచనా. ఆనాటికి 64 కోట్ల (మరో 16 కోట్ల) టన్నుల ఆహార ధాన్యాలను పండించాలంటే వరిధాన్యం హెక్టారు సగటు దిగుబడిని ప్రస్తుతం ఉన్న అయిదు టన్నుల నుంచి ఆరేడు టన్నులకు పెంచాలని యోచిస్తున్నారు. అందుకోసం రెండు కోట్ల హెక్టార్ల బంజరు భూములను సాగు చేయాలని, 50 లక్షల ఎకరాల నీటి విస్తీర్ణంలో మత్స్య సంపదను అభివృద్ధిపరచాలని సంకల్పించారు. ప్రపంచంలో నీటి కొరత తీవ్రంగా ఉన్న దేశాలలో చైనా ఒకటని ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ పేర్కొంది. అక్కడ తలసరి నీటి లభ్యత 2250 క్యూబిక్ మీటర్లు. చైనాలో సాగువుతున్న మొత్తం భూవిస్తీర్ణంలో ఉత్తర చైనా వాటా 64 శాతం. ఆ దేశంలో లభ్యమయ్యే నీటి వనరుల్లో 17 శాతం మాత్రమే ఆ ప్రాంతానికి దక్కుతాయి. అందువల్ల ముందుగా జపాన్‌వలె, తదుపరి ఇజ్రాయెల్ వలె తక్కువ సాగునీటిని అత్యంత సమర్ధంగా వినియోగిస్తూ ఎక్కువ దిగుబడులను సాధించాలని చైనా ప్రయత్నిస్తోంది. బారతదేశం వ్యావసాయిక అభివృద్ధి వేగం పుంజుకోకుంటే సమీప భవిష్యత్తులో ఏటా నాలుగు కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి రావచ్చని

'వరల్డ్‌వాచ్' సంస్థ అధ్యక్షుడు లెస్టర్ బ్రౌన్ అభిప్రాయపడ్డారు. అందుకు భారీ మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం చెల్లించడమే కాక, ఒక్కో సందర్భంలో ఎగుమతి చేసే దేశం విధించే ఆంక్షలకు కూడా అంగీకరించాల్సి వస్తుంది. అందువల్లనే జపాన్ విదేశాల నుంచి బియ్యం దిగుమతి చేసుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. జపాన్ ప్రభుత్వం అక్కడ వరిధాన్యం పండించే రైతులను ఎంతగానో ప్రోత్సాహించింది. అతర్జాతీయ మార్కెట్ల ధరలకన్నా మూడు నాలుగు రెట్లు ఎక్కువ చెల్లించింది. దిగుబడులను విపరీతంగా పెంచుకోగలిగింది. భారతదేశ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా వ్యవసాయ రంగంలో ఎన్నో మార్పులు తీసుకురావడం అవసరం. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినూత్నంగా ప్రతి జిల్లాలో కర్షక విజ్ఞాన వేదికలు నిర్వహించి ఆదర్శప్రాయమైంది. రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించడానికి ఏయే పంటలు లాభదాయకమో, నికర ఆదాయాలను ఎలా పెంచుకోవచ్చో వివరించడానికి కర్షక విజ్ఞాన వేదికలు ఏర్పాటు చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, మేలయిన ఫలితాల కోసం మరింత పకడ్బందీగా కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ. అందులో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. రైతుల అవగాహన శక్తి పెంపొందించడానికి, వారిలో కొత్త ఆలోచనలు రేకెత్తించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం పట్ల విపరీత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందనడం అతిశయోక్తి కాదు. మొదటి పంచవర్ష ప్రణాళికలో 15 శాతం కేటాయించగా, ఆ మొత్తం ఎనిమిదో ప్రణాళిక నాటికి 5.2 శాతానికి తగ్గిపోయింది. నూటికి 70 మంది ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయంపై ఇప్పటికీ సమగ్ర విధానం రూపొందలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే పారిశ్రామిక విధానం రూపొందింది. ఇప్పటికీ ఎనిమిదిసార్లు మార్పులు, చేర్పులు కూడా జరిగాయి. ఏడాది పొడుగునా పంటలు పండించడానికి అవసరమైన సారవంత భూమి, సూర్యరశ్మి, నీటి వనరులు, కష్టించి పనిచేసే కోట్లమంది కర్షకులున్న భారతదేశం దిగుబడులలో ఎంతో వెనకబడిపోయింది. గోధుమ పంటలో 32వ స్థానంలో, వరి ధాన్యంలో 54వ స్థానంలో, వేరుశనగలో 72వ స్థానంలో ఉంది. ఇతర రంగాలవారి సగటు తలసరి ఆదాయంతో పోలిస్తే 1950లో సగం ఉన్న రైతుల ఆదాయం ఇప్పుడు నాలుగోవంతుకు తగ్గిపోయింది. నూటికి 70 మంది గ్రామీణ ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెరుగనిదే వారి కొనుగోలు శక్తి పెరగదు.

అందువల్ల పారిశ్రామిక ఉత్పత్తుల, వినియోగ వస్తువుల డిమాండు కూడా పెద్దగా పెరగదు. భారత ప్రభుత్వం వ్యవసాయాన్ని మొదటి ప్రాధాన్య రంగంగా గుర్తించి ప్రోత్సహించడం అవసరం. కేంద్రంలోని ప్రస్తుత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీని కొనసాగించడమేగాక హార్టీ కల్చర్ విభాగాన్ని, ఎగుమతుల రంగాన్ని బాగా అభివృద్ధిపరచేందుకు ఉత్సాహం చూపుతోంది. స్ప్రింక్లర్, డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులకు సంబంధించిన సామగ్రిని కొన్ని వర్గాలకు 90 శాతం సబ్సిడీపై, ఇతరులకు 70 శాతం సబ్సిడీపై అందజేస్తోంది. ఈ విషయం ఇంకా చాలామంది రైతులకు తెలియదు. అందుకే ఇప్పటికి కొద్దిమంది మాత్రమే ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. ఈ పద్ధతుల ద్వారా తక్కువ నీటితో పండ్లు, కూరగాయలు, నూనెగింజలు, అపరాల దిగుబడులను గణనీయంగా పెంచుకోవచ్చు. ఇలాంటి పథకాలకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు అందించడమే కాకుండా పరికరాలను వినియోగించే పద్ధతులను తెలియజేయాలి. ముఖ్యంగా బావులు, బోర్లపై ఆధారపడి పంటలు పండించే ప్రాంతాల్లో గ్రామానికి కనీసం ఒక్కరైతయినా కొత్తపరికరాలు వినియోగించేలా అధికారులు కృషిచేయాలి. మిగతా రైతులూ క్రమంగా కొత్త విధానాలను అనుసరిస్తారు. ఇలాంటి పద్ధతులవల్ల భూగర్భ జలాలను సమర్థంగా సద్వినియోగం చేసుకోవచ్చు. ఖర్చు కూడా తగ్గించుకోవచ్చు. ఎక్కువ లాభాలు పొందవచ్చు. భారత వ్యవసాయరంగంలో యంత్రాల వినియోగం పెరగాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వం సరసమైన ధరలకు పరికరాలను అందించాలి. రైతులవద్ద పెట్టుబడులు తగిన స్థాయిలో ఉండేలా చూడాలి. యంత్ర పరికరాలు సామాన్య రైతులకు అందుబాటులో ఉంచడానికి వాటిపైన అమ్మకం పన్ను, ఎక్సైజ్ పన్నులు మినహాయించాలి. కర్షక సదస్సుల సందర్భంగా ముఖ్యమంత్రి వ్యవసాయ పరికరాలపై అమ్మకం పన్నును పూర్తిగా తొలగించడం. ట్రాక్టర్లపై అమ్మకం పన్నును 8 శాతం నుంచి 4 శాతానికి తగ్గించడం హర్షించదగిన అంశం. ఈనాడు సమాజంలో అధిక ఆదాయ వర్గాలను సంతృప్తిపరచడానికి అనేక మోడల్ కార్ల దిగుమతిపై కస్టమ్స్ డ్యూటీ ఎంతో తగ్గిస్తున్నారు. అదేవిధంగా వ్యవసాయానికి ఉపయోగపడే చెరుకు నరికే యంత్రాలు, చిన్న కమతాలలో వివిధ వ్యవసాయ పనులకు ఉపయోగపడే యంత్ర పరికరాలను జపాన్, కొరియా దేశాల నుంచి కస్టమ్స్ డ్యూటీ మినహాయింపుతో దిగుమతి చేసుకునే అవకాశం కల్పించాలి. వ్యవసాయరంగాన్ని ఆధునీకరించాలంటే యాంత్రీకరణ కొంతమేరకు తప్పనిసరి. ఈ అవగాహనను ప్రజలలో పెంపొందించడం అవసరం.

పలు సదస్సులలో యంత్ర పరికరాల ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి. ఉయ్యూరులోని చక్కెర ఫ్యాక్టరీ ఏరియాలో భూగర్భ జలాలలో పొలారిటీని మార్చే ప్రక్రియ వలన మంచి ఫలితాలు చేకూరుతున్నాయని ప్రదర్శనలో చూపించారు. రైతులు తక్కువ ఖర్చుతో పంట దిగుబడులు పెంచడానికి దోహదపడే పద్ధతులను అనుసరించాలి. నవ్యతను ఆహ్వానించాలి. తెలియని విషయాలు తెలుసుకోవాలి. పంజాబ్, హర్యానా, ఢిల్లీ ప్రాంతాలలో పశువులు గల రైతులు పచ్చగడ్డి, చొప్ప నరికేందుకు చిన్న పరికరాన్ని (గ్రాస్ కట్టర్) ఉపయోగిస్తారు. పచ్చి మేతను నరకకుండా పశువుల ముందు వేస్తే ఆకులు తిని, కాండం వదిలేస్తాయి. పశువుకు ఎక్కువ పోషకాహారం లభించే భాగం వృధాగా పోతుంది. కొన్ని జిల్లాల్లో పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్లు యీ మేత నరికే పనిముట్టుకు 50 శాతం సబ్సిడీ యిస్తున్నా ఎక్కువమంది ముందుకు రావడంలేదు. అలాగే పసువు పంట ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నా పసువు గ్రేడింగ్ యంత్రాలు ఇంకా విరివిగా వాడకంలోకి రాలేదు. ఉత్తర భారతదేశంలో గోధుమ పంట నూర్పిడి అంతా దాదాపు త్రెషర్లతోనే సాగిపోతోంది. వరికోత, నూర్పిడి హార్వెస్టర్ కంబైన్ యంత్రాలతో జరుగుతుంది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఇటువంటి యంత్రాలను వాడటం మొదలుపెట్టారు. పంటకాల్వలు, డ్రెయిన్లను బాగుచేసుకోవడానికి, గ్రామీణ లింకురోడ్ల నిర్మాణాలకు జె.సి.పి. ఎక్స్కవేటర్లను, చిన్న ప్రొక్లెయిన్లను వాడటానికి రైతులు ఇప్పుడు ఆసక్తి చూపుతున్నారు.

## మందుల వాడకంలో అవగాహన

ఎరువులు, పురుగు మందుల వాడకంలో రైతులు చాలా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. మోతాదు మించి రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక మందులను వాడడం వలన అధికంగా ఖర్చు అవ్వడమే కాక కొన్ని అనర్థాలు సంభవిస్తున్నాయి. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల వాడకంలో 4:2:1 ఉండాల్సిన నిష్పత్తి 1992లో ఎరువుల డీకంట్రోలు తర్వాత 8:35:1 అయ్యింది. దీనివలన భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంది. వెయ్యవలసిన మోతాదుకు మించకుండా రసాయనిక ఎరువులకు తోడు సేంద్రీయ ఎరువును కూడా వాడాలి. అలా చేయడం వల్ల భూమి నీటిని అధికంగా పీల్చుకొని మొక్కకు అందించగలిగేందుకు ఎక్కువ రోజులు తేమను నిల్వ ఉంచడానికి అవకాశం కలుగుతుంది. కంపోస్టు పద్ధతిని ఆచరించడం ఎంతో మేలు. పురుగు మందులను విచక్షణారహితంగా వాడటం వలన ప్రకృతిలో రైతుకు మేలు చేసే కొన్ని

కీటకాలు చనిపోయి పంటలకు హాని చేసే క్రిములు పెరిగే పరిస్థితి దాపురిస్తుంది. జీవ సంబంధ క్రిమిసంహారిణులకు కూడా తగిన ప్రాధాన్యమివ్వాలి. రైతులలో విస్తృతంగా ప్రచారం కావించవలసిన మరొక అంశం వినియోగదారుల రక్షణ. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ (వినియోగదారుల రక్షణ చట్టం) 1986 ద్వారా న్యాయం పొందగలిగే అవకాశం ఉందని తెలియజేయడం అవసరం. ఏటేటా నాణ్యత లేని పురుగు మందులు, విత్తనాలు, ఎరువుల వలన రైతులు వందల కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. నాణ్యత లేని విత్తనాలు వాడినప్పుడు ఆశించిన దిగుబడులు రావు. విత్తనాల నాణ్యతను నియంత్రించేందుకు సీడ్ యాక్ట్ ఉంది. లోగడ నాణ్యత లేని మిర్చి విత్తనాలను అమ్మిన సంస్థ నుంచి నష్టపరిహారంగా రైతుకు ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల కమిషన్ రూ. నాలుగు లక్షలు ఇప్పించింది. ఎరువుల కంట్రోల్ ఆర్డర్ 1985, ఎరువుల నాణ్యతను నియంత్రిస్తుంది. పురుగు మందుల్లో కల్తీ సర్వసాధారణమైపోయింది. భారతదేశంలోని పురుగు మందుల్లో 50 శాతం పత్తి పంటపైకి, 20 శాతం వరి పైరుకు, 13 శాతం పండ్లు, కూరగాయల పైనా ఉపయోగిస్తున్నారు. చీడ పీడల వలన ఏటా దాదాపు రూ. 8000 కోట్ల విలువైన పంటల నష్టం సంభవిస్తున్నట్టు తాజా సమాచారం. పైరును కాపాడుకోవడానికి పురుగు మందులను కొన్ని సందర్భాలలో మోతాదుకు మించి వాడటంవల్ల అధికంగా ఖర్చు అవుతోంది. ఆ పురుగుమందులు నకిలీ సరుకో, కాలం చెల్లిన సరుకో, నాణ్యత తక్కువ సరుకో అయితే అవి పనిచేయక విలువైన పంటను కోల్పోవాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాలన్నిటిలోనూ రైతులు స్వల్పమైన ఖర్చుతో జిల్లా స్థాయిలో కన్స్యూమర్ ఫోరం, రాష్ట్ర కన్స్యూమర్ కమిషన్, ఇంకా పెద్ద నష్టమైతే జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, తమ వాదనను వినిపించి తగిన న్యాయాన్ని, నష్టానికి తగు పరిహారాన్ని పొందే వీలుంది. రైతులలో నూటికి 75 మంది సన్నకారు, చిన్న రైతులవ్వడం, వీరిలో అత్యధికులు నిరక్షరాస్యులు కావడం, అసంఘటితంగా ఉన్నందున వినియోగదారుల రక్షణ చట్టం గురించి తెలియనే తెలియదు. ఆ విషయంలో రైతులను చైతన్యవంతులను చేయాలి.

*ది. 07-07-1997.* — *ఈనాడు*

●

# జాగ్రత్త పడకపోతే అంతా అనర్థం

రైతు తాను పండించిన పంటనుంచి మేలైన విత్తనాలను సేకరించి భద్రపరచుకుంటాడు. వాటిని తరువాతి పంట సీజనులో ఉపయోగించుకుంటాడు. దేశంలో వరి, గోధుమ, జొన్న, అపరాలు వంటి పలు పంటలు పండించే రైతులకు ఇది సర్వ సాధారణ విషయం. రైతాంగంలో 80 శాతం సన్న, చిన్న కారు రైతులే. వారికి దూర ప్రాంతాలకు వెళ్ళి అవసరమైన విత్తనాలు కొని తెచ్చుకొనేంత ఆర్థిక వెసులుబాటు ఉండదు. తన పంట నుంచి లేదా పొరుగు రైతునుంచి విత్తనాలు సేకరించి జాగ్రత్త పరచుకుంటాడు. ఈనాటికి కూడా దేశ రైతాంగానికి ఏటా అవసరమయ్యే విత్తనాల్లో 40 శాతం మేరకు మాత్రమే జాతీయ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు, కంపెనీలు సమకూర్చగలుగుతున్నాయి. రైతుల మధ్య విత్తన మార్పిడి సౌలభ్యం ఉండటంవల్ల సస్య విప్లవం వేగంగా మారుమూల గ్రామాలకు సైతం విస్తరించింది. వ్యవసాయరంగాన్ని, విత్తనాలను ప్రభుత్వం పేటెంట్ చట్టం నుంచి మినహాయించడంవల్ల కోట్లమంది రైతులు తక్కువ వ్యయప్రయాసలతో విత్తనాలను సమకూర్చుకో గలుగుతున్నారు. దేశ పరిస్థితులకు అనుకూలంగా ఉన్న ఈ విధానానికి 'గాట్' ఒప్పందం వల్ల కొంత ప్రతికూల పరిస్థితి ఏర్పడింది. డంకెల్ ముసాయిదాలోని కొన్ని అంశాలు దేశ వ్యవసాయాభివృద్ధిని దెబ్బతీయవచ్చని, రైతుల ప్రయోజనాలకు భంగం కలగవచ్చని ఆందోళన వ్యక్తమయింది. పార్లమెంటులో కూడా కొందరు సభ్యులు చాలా స్పష్టంగా రానున్న ప్రమాదం గురించి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశ వ్యవసాయ రంగ ప్రయోజనాలకు భంగం కలిగించే అంశాలను వ్యతిరేకించాలని ఇతర వర్ధమాన దేశాలను కూడగట్టుకుని ఆ అంశాలను తొలగింపజేయడానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సభ్యుల ఆందోళనను పట్టించుకోని ప్రభుత్వం మార్పులు లేకుండానే గాట్ ఒప్పందంపై సంతకం చేసింది. అప్పట్లో పేటెంట్ విధానాన్ని వ్యవసాయ రంగానికి వర్తింపజేయడంలో ఏ దేశానికైనా అభ్యంతరం ఉంటే ఆ దేశానికి వర్తించేలా ఒక ప్రత్యేక విధానాన్ని (సుయి జెనిరీస్) రూపొందించుకోవచ్చని గాట్ ఒప్పందంలో ఉంది. మన దేశం నుంచి

పలురకాల విత్తనాలను కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు తీసుకెళ్లాయి. అక్కడ వాటిపై పరిశోధనలు చేసి కొన్ని మార్పులు చేయగలిగాయి. అధిక దిగుబడి ఇవ్వడం. తెగుళ్లను తట్టుకోవడం వంటి ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండేలా విత్తనాలను అభివృద్ధి చేశాయి. వీటిపై సర్వహక్కులు పేటెంట్ దారుకే చెందాలని అభివృద్ధి చెందిన దేశాలు పట్టుబడుతున్నాయి. ఆయా దేశాలు పరిశోధనల ద్వారా కొన్ని ప్రత్యేక లక్షణాలను సాధించినమాట వాస్తవమేగాని, మూలాధారమైన జన్యువనరులను, వివిధ రకాల ధాన్యాలను, గడ్డి రకాలను భారతదేశం వంటి వర్ధమాన దేశాలనుంచి తీసుకుపోయిన విషయం విస్మరించరానిది. అందువల్ల ఈ నూతన విత్తనాల ఫలితాలలో, లాభాలలో కొన్నివేల సంవత్సరాలుగా వాటిని తమదైన రీతిలో సంరక్షిస్తూ అభివృద్ధి పరుస్తూ వచ్చిన దేశాల ప్రజలకు కూడా సముచిత భాగం ఉండాలని భారతదేశం కోరుతోంది. 'ప్లాంట్ వెరైటీ ప్రొటెక్షన్' చట్టం ఇప్పటికీ తయారీ దశలోనే ఉంది. అది బిల్లు రూపంలో ఇంకా పార్లమెంటుకు రాలేదు. ఈ దశలో విత్తనాలకు సంబంధించిన వార్త రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. రైతు విత్తనం తీసుకుని పంట పండించిన తరువాత, వాటినుంచి మరోపంటకు అవసరమైన విత్తనాలు సేకరించుకోవడానికి వీలుండదని, ఆ పంట విత్తనంగా పనికిరాదని వార్త సారాంశం. అమెరికా వ్యవసాయశాఖ, మిసిసిపికి చెందిన 'డెల్టా అండ్ పైనే' అనే ప్రముఖ పత్తి విత్తన సంస్థలు సంయుక్తంగా అత్యంత ఆధునిక వ్యవసాయ బయోటెక్నాలజీ ప్రక్రియను రూపొందించి, పేటెంట్ హక్కును పొందినట్లు 1998 మార్చి 3న ప్రకటించి సంచలనం సృష్టించాయి. 'ప్లాంట్ జీన్ ఎక్స్‌ప్రెషన్ కంట్రోల్' అని పిలిచే ఈ ప్రక్రియ వర్ధమాన దేశాల వ్యవసాయాభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుంది. విత్తనం మొలకెత్తడానికి దోహదం చేసే జన్యువు పనిచేయని స్థితిని కల్పించి, విత్తనంలో వంధ్యత్వం ఏర్పడేలా చేసే ఈ 'టెర్మినేటర్ టెక్నాలజీ' పేటెంట్‌దారునికి కనకవర్షం కురిపిస్తుందిగానీ తృతీయ ప్రపంచదేశాల్లోని వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. దాదాపు 140 కోట్ల మంది రైతుల జీవితాలను ప్రభావితం చేస్తుంది. టెర్మినేటర్ టెక్నాలజీతో ఇప్పటికి పత్తిలో నూతన విత్తనాలను రూపొందించినా, వరి, గోధుమ, ఇతర ఆహార పంటలకు కూడా ఈ టెక్నాలజీని వర్తింపజేసి ఉండవచ్చు. ఈ రకమైన విత్తనాలు వర్ధమాన దేశాల మార్కెట్లకు వస్తే వ్యవసాయ రంగానికి గట్టిదెబ్బ తగులుతుందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఏటా రైతులు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో విత్తనాలను ఉత్పత్తి చేసే బహుళజాతి సంస్థల వ్యాపారం మూడుపూవులు, ఆరుకాయలుగా అభివృద్ధి చెందుతుంది. ఏటా వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం బహుళజాతి సంస్థల చేతుల్లోకి

వెళ్లిపోతుంది. దేశీయ సంస్థలు వాటితో పోటీపడలేక దెబ్బతింటాయి. ఇప్పటికే దేశంలో శీతల పానీయాలు, ఐస్‌క్రీం ఉత్పత్తిదారులు బహుళజాతి సంస్థల పోటీకి తట్టుకోలేక వాటికి తమ సంస్థలను అప్పగిస్తున్నారు. ఈ పరిస్థితి విత్తన విక్రయ సంస్థలకూ దాపురిస్తుందని చెప్పడానికి సందేహించనక్కర్లేదు.

ఇతర దేశాలనుంచి దిగుమతి అయ్యే విత్తనాలు, మొక్కలు, ఇతర జీవపదార్థాలను పరీక్షించే క్వారంటైన్ సదుపాయలు మనదేశంలో ఉండవలసిన స్థాయిలో లేవు. దీనివల్ల దిగుమతి చేసుకున్న గోధుమల వల్ల కొన్ని రకాల గడ్డిమొక్కల జీవకణాలు కూడా వచ్చి పెరిగిపోయాయి. టెర్మినేటర్ టెక్నాలజీతో రూపొందించిన విత్తనాలు దేశంలోకి ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సస్యవిప్లవ విజయం కోసం విశేష కృషిచేసిన డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ప్రధాని వాజ్‌పేయిని కోరారు. బహుళజాతి సంస్థలు విక్రయించే విత్తనాల మీద ఆధారపడితే మరో ప్రమాదం కూడా ఉంది. ప్రభుత్వం అమలు చేసే విధానాలు, తీసుకునే నిర్ణయాలు తమకు రుచించకపోతే ఈ సంస్థలు విత్తనాల సరఫరాను నిలిపేసినా, సకాలంలో సరిపడా సరఫరా చేయకపోయినా తీవ్రమైన ఆహార కొరత ఏర్పడవచ్చు. ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యుని బతుకు దుర్భరమై అశాంతి, అల్లర్లకు దారితీయవచ్చు. అమెరికాలో కేవలం వందకు ఇద్దరు మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి ఉండగా, భారత్‌లో 66 శాతం ప్రజలు పొలం పనులలో ఉన్నారు. బహుళజాతి సంస్థలు పరిశోధనలపై పెద్ద మొత్తాలను ఖర్చు చేస్తాయి గనుక వారు ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటే తప్పేమిటనే వారూ కొందరు ఉంటారు. ఖర్చుచేసినంత మాత్రాన సమాజాన్ని దోచుకోవడానికిగాని, సమాజాన్ని నాశనం చేయడానికిగాని, వీలుండకూడదు. ఆహారం మానవునికి ప్రాణావసరం. వ్యవసాయం ప్రధానమైన వృత్తిగా గల భారత్, చైనా, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి వర్ధమాన దేశాలు టెర్మినేటర్ టెక్నాలజీతో రూపొందించిన విత్తనాలను తమదేశాల్లోకి ప్రవేశించకుండా కఠినమైన చర్యలు తీసుకోవలసి ఉంది. వీటివల్ల ఎదురయ్యే అనర్థాల గురించి రైతులకు అవగాహన కలిగేలా ప్రచారం చేయాలి. వ్యవసాయ రంగానికి సంబంధించి దేశ ప్రయోజనాలను కాపాడటానికి, ప్లాంట్ వెరైటీ ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

*ది. 03-09-1998.* — *ఈనాడు*

# విధి వంచించినవేళ రైతన్నకు చేయూత

ప్రకృతి మరోమారు తెలుగునాట రైతుల అదృష్టాన్ని పరిహసించింది. అతివృష్టి, కృష్ణానదికి వరదలు భారీ నష్టానికి కారణమయ్యాయి. ఈ వైపరీత్యం రాష్ట్రానికి రూ. 2525 కోట్ల మేరకు నష్టం చేసిందని ప్రాథమిక అంచనా. ఇందులో- వ్యవసాయ రంగానికి వాటిల్లిన నష్టం రూ. 821.41 కోట్లని ప్రభుత్వం లెక్కగట్టింది. 73,935 హెక్టార్లలో వరి, 1,22,818 హెక్టార్లలో పత్తి, 92,744 హెక్టార్లలో వేరుసెనగ, 14,695 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 12,301 హెక్టార్లలో మిర్చిపంటలు నాశనమయ్యాయి. 43,919 హెక్టార్లలోని ఇతర పంటలూ ధ్వంసమయ్యాయని తేలింది. మొత్తంమీద 3,60,412 హెక్టార్ల భూమిలో పంటలు దెబ్బతిన్నాయి. 42,574 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. వెరసి 4,02,986 హెక్టార్లలో పూర్తిగాను, 10,02,149 హెక్టార్లలో పాక్షికంగాను పంటలు రైతు చేజారాయి. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. పంట 50 శాతంకన్నా ఎక్కువ దెబ్బతింటే- జొన్న, సజ్జ, ఆముదాలవంటి పైర్లకు హెక్టారుకు రూ. 750, వరి, మొక్కజొన్న, వేరుసెనగ, కంది, పొద్దుతిరుగుడు వంటి పంటలకు హెక్టారుకు రూ. 1000, పత్తి, చెరకు, పసుపు, అరటి, మిర్చి, కూరగాయలు, ఉల్లి మొదలైనవాటికి హెక్టారుకు రూ. 1250 చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. మామిడి, నిమ్మ, సపోటా, జామ, దానిమ్మ మొదలైన పండ్ల తోటలు 50 శాతంపైన దెబ్బతింటే రూ. 2800 ఇస్తామని ప్రకటించారు. తమలపాకు తోటలు దెబ్బతిన్న పక్షంలో సెంటుకు రూ. 55 చొప్పున గరిష్ఠంగా 30 సెంట్లకు నష్టపరిహారం అందజేస్తామని ప్రభుత్వం చెప్పింది. నేల కోత, ఇసుక మేట వేయడం వంటి సందర్భాలలో ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రూ. 2500.

## 1985లోనే ప్రారంభం

1990 మేలో వచ్చిన తుఫాను తీవ్ర నష్టం కలిగించినప్పుడు ప్రభుత్వం నష్టపరిహారాల్ని ప్రకటించింది. నాడు- వరి పంటకు ఎకరానికి రూ. 250 విలువైన విత్తనాలు, ఎరువులు అందజేశారు. నాడు అందజేసిన సహాయంతో పోల్చిచూస్తే నేడు ప్రభుత్వం ప్రకటించింది పెద్దమొత్తమేగానీ, రైతుకు వాటిల్లిన నష్టంతో పోల్చినప్పుడు అది స్వల్పమనిపిస్తుంది. రైతులకు వాటిల్లిన నష్టం మొత్తాన్ని ఏ ప్రభుత్వమూ భర్తీ చేయజాలదు. ప్రభుత్వం అందించే సహాయం తిరిగి పైరు వేసుకోవడానికి, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు కొంతమేరకు ఉపయోగపడుతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతును ఆదుకోగలిగినది పంటల బీమా పథకమే. కొన్ని ప్రయోగాల అనంతరం 1985 ఖరీఫ్ సీజన్ నుంచి 'సమగ్ర పంటల బీమా పథకం' ప్రారంభమయింది. రాష్ట్రాలలోనైతేనేమి, కేంద్ర పాలిత ప్రాంతాలలోనైతేనేమి మొత్తం 16 చోట్ల ఈ పథకం ప్రస్తుతం అమలులో ఉంది. ఈ పథకంలోనూ పలు లోపాలు ఉన్నాయని రైతులు భావిస్తున్నారు. బ్యాంకుల నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు మాత్రమే ఈ పథకం పరిధిలో లబ్ధి పొందగలుగుతారు. రుణాలు తీసుకోనివారు, రుణాలు లభించనివారు పథకంలో చేరే అవకాశం లేదు. రైతులు దీన్ని సమగ్ర పంటల బీమా పథకం అనిగాక, పంటల రుణ బీమా పథకంగా భావిస్తున్నారు. పదివేల రూపాయల లోపు వ్యావసాయిక రుణానికి మాత్రమే బీమా వర్తిస్తుంది. రైతుకు పదివేల రూపాయలు మించి నష్టం వాటిల్లినా పరిహారం గరిష్టంగా రూ. 9000 మాత్రమే. పత్తి, మిర్చి, పసుపు, చెరకు వంటి వాణిజ్య పంటలను ఈ పథకం పరిధిలోకి తీసుకురాలేదు. వరి, గోధుమ వంటి ధాన్యాలకు బీమా చేసిన మొత్తంలో రెండు శాతం, నూనెగింజలు, పప్పుధాన్యాలకు ఒకటి శాతం ప్రీమియంగా నిర్ధారించారు. సన్నకారు, చిన్నకారు రైతులకు సంబంధించి ఈ మొత్తంలో సగభాగాన్ని సబ్సిడీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయి. కేంద్రపాలిత ప్రాంతాలలో మొత్తం సబ్సిడీని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. రైతులకు ఇచ్చే పరిహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2:1 నిష్పత్తిలో భరిస్తాయి. 1985 ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభమైననాటినుంచి 1996-97 రబీ సీజన్ వరకు 5 కోట్ల 85 లక్షల రైతులు ఈ పథకంలో చేరారు. 24.7 కోట్ల ఎకరాలలో రూ. 16,598 కోట్ల విలువైన పంటలు పథకం కింద బీమా అయ్యాయి. ప్రీమియం రూపంలో రూ. 271.65 కోట్లు సమకూరగా

1456.75 కోట్లు పరిహారంగా చెల్లించారు. అంటే- ప్రీమియంకన్నా అయిదున్నర రెట్లు ఎక్కువగా పరిహారం చెల్లించారన్నమాట. గుజరాత్‌లో రూ. 44 కోట్లు ప్రీమియంగా వసూలుకాగా, పరిహారంగా చెల్లించిన మొత్తం రూ. 790 కోట్లు. అంటే- 18 రెట్లు ఎక్కువ. గుజరాత్‌లో పథకం అమలులో లొసుగులు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వచ్చాయి. వేరుసెనగ పంట పరిహారం చెల్లింపులో అనేక అక్రమాలు జరిగాయని విమర్శలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అటువంటి విమర్శలకు తావివ్వలేదు. 1985 ఖరీఫ్ సీజన్ నుంచి 1996-97 రబీ సీజన్ వరకు 97,54,743 మంది పథకంలో చేరారు. 1,83,55,162 హెక్టార్లలోని రూ. 4122.77 కోట్ల విలువైన పంటలు బీమా పరిధిలోకి వచ్చాయి. రూ. 71 కోట్ల ప్రీమియం వసూలు కాగా రూ. 268.65 కోట్లు నష్టపరిహారంగా రైతులకు ముట్టింది. అంటే- ప్రీమియంపైన 377 శాతం నష్టపరిహారంగా చెల్లించారన్నమాట. గుజరాత్ తరువాత అత్యధికంగా నష్టపరిహారం చెల్లించిన రాష్ట్రం రాజస్థాన్. అక్కడ రైతులకు ప్రీమియంపైన 14 రెట్లు పరిహారంగా చెల్లించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పథకంలో లొసుగులను, లోపాలను పరిష్కరించి, మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాల్సిందిగా రైతు సంఘాలు పలు సందర్భాలలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ అంశంమీద పార్లమెంటులోనూ చర్చ జరిగింది. 1991లో నాటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు కొత్త పథకాన్ని ప్రవేశపెడతామని ప్రకటించారుగానీ అది ఆచరణకు రాలేదు. 'పైలట్ పంటల బీమా పథకా'న్ని ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ ప్రతిపాదనపట్ల నాడు ఆర్థిక మంత్రిత్వశాఖ పలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ముందడుగు పడలేదు. తరువాత అధికారం చేపట్టిన 'యునైటెడ్ ఫ్రంట్' 1997 నవంబరులో ప్రయోగాత్మక పంటల బీమా పథకాన్ని ఆమోదించింది. కొత్త పథకం ప్రకారం- బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలనుంచి వ్యావసాయిక రుణాలు తీసుకొనకపోయినా, పథకం వర్తించే ప్రాంతంలోని వరి, గోధుమ, తృణధాన్యాలు, నూనెగింజలు, అపరాలు పండించే చిన్నకారు, సన్నకారు రైతులంతా దాని పరిధిలోకి వస్తారు. సన్నకారు, చిన్నకారు రైతులు ప్రీమియం చెల్లించనక్కరలేదు. ప్రీమియంనుగాని, పరిహారాన్నిగాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2:1 నిష్పత్తిలో భరిస్తాయి. కొత్త పథకంలో గ్రామ పంచాయితీని యూనిట్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. ఇతర అంశాలన్నీ సమగ్ర పంటల బీమా పథకంలోని వాటివలెనే ఉంటాయి. ప్రయోగాత్మక పంటల బీమా పథకం తీరుతెన్నులను 1997-98 రబీ సీజనులో ప్రభుత్వం

సమీక్షించింది. పథకం అమలులో పాలన, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని తేలింది. రుణాలు తీసుకోని, లభించని రైతుల పంటల వివరాలు సేకరించడం, వారిచేత బ్యాంకులలో ఖాతాలు తెరిపించడం ప్రభుత్వ యంత్రాంగం శక్తికి మించిన పనిగా మారింది. తమిళనాడులోని ఒక జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేశారు. అక్కడ రూ. 40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ వచ్చింది. నష్టపరిహారం కావాలంటున్న రైతులు బ్యాంకుల్లో ఖాతాలు తెరవడానికి మాత్రం ముందుకు రాలేదు. ఈ పథకంవల్ల రాష్ట్ర ప్రభుత్వాల పైన తక్కువగా కేంద్రంమీద అంతకు నాలుగురెట్లు భారం పడుతుంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి 'ప్రయోగాత్మక' పథకాన్ని నిలిపేయాలని, ఇది అమలులో ఉన్న జిల్లాలలో ప్రస్తుతానికి సమగ్ర పంటల బీమా పథకాన్నే అమలు చేయాలని, రబీ సీజన్ నాటికి సవరించిన పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే పథకం రుణాలతో నిమిత్తం లేకుండా రైతులందరికీ వర్తిస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా వాణిజ్య పంటల దిగుబడులకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటే వాటిలో కొన్నింటిని కూడా పథకంలో చేర్చాలని ప్రతిపాదించారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వమే ప్రీమియం నిర్ణయించడం లేదా పథకాన్ని అమలుచేసే సంస్థ నిర్ణయించిన ప్రీమియంలో ప్రభుత్వం కొంతమేరకు సబ్సిడీగా భరించడం మేలనే అభిప్రాయాలు వినవచ్చాయి. జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నమూనాలో పథకం అమలుకు ఒక సంస్థను స్థాపించాలని సంకల్పించారు. భారతదేశంలోని రైతులలో నూటికి ఎనభైమంది హెక్టారుకు లోపు భూమి కమతాల యజమానులు. వీరిలో సగంమంది ప్రైవేటు వ్యాపారులవద్ద వడ్డీలకు తీసుకొనక తప్పని పరిస్థితి ఉంది. సమగ్ర పంటల బీమా పథకం ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే 'వాస్తవిక బీమా'ను వసూలు చేయాలనేది నిజమే. సన్నకారు, చిన్నకారు రైతులు ప్రీమియం కట్టే స్థితిలో లేరు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వారు కట్టాల్సిన ప్రీమియంలో కొంత భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2:1 నిష్పత్తిలో భరించాలి. రైతు చెల్లించే ప్రీమియంను పంట ఉత్పత్తి వ్యయంలో భాగంగా చేర్చి ఆ ప్రాతిపదికన కనీస మద్దతు ధరను నిర్ణయించాలి. పదివేల రూపాయల పరిమితిని తొలగించాలి. కనీసం ముప్పైవేల రూపాయల పరిమితి హేతుబద్ధం.

## 'భారం' మోయక తప్పదు

పలు దేశాలలో పంటల బీమా పథకాలు అమలువుతున్నాయి. అమెరికా, రష్యాలలో ప్రభుత్వ సంస్థలే నిర్వహిస్తాయి. ప్రభుత్వంపైన భారం పడుతున్నా రైతు శ్రేయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా దేశాలలో పంటల బీమా పథకాలను కొనసాగిస్తున్నారు. జపాన్‌లో ఆరు దశాబ్దాలుగా పంటల బీమా పథకాలు అమలు చేస్తున్నారు. వాటిలో కాలానుగుణంగా మార్పుచేర్పులూ ఉన్నాయి. జపాన్‌లో వరి పంటకేగాక పండ్ల తోటలకు, ఆ తోటల్లో కాసే పండ్ల రకాలకు కూడా విడివిడిగా బీమా పథకాలున్నాయి. ఈ పథకాల కోసం జపాన్ ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తోంది. భారతదేశంలోనూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకం భారాన్ని మోయడానికి ప్రభుత్వం సిద్ధపడాలి. నేటివరకు సరైన పంటల బీమా పథకం లేనందున రైతాంగం అపారంగా నష్టపోయింది. ఏటా రైతు వెన్ను విరుగుతోంది. కోలుకునే అవకాశమే దక్కడం లేదు. ప్రభుత్వ విధానాల్లోని లోపాలు, మార్కెట్లలో వ్యాపార వర్గాల దోపిడి, సకాలంలో తగినంత పరపతి లభ్యం కాకపోవడం, నాణ్యతలేని ఎరువులూ పురుగుమందులూ... వీటన్నిటికి తోడు ప్రకృతి బీభత్సాలు. తమను ఆదుకోగల సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం సత్వరం ప్రవేశపెడుతుందని ఆశించడంతోబాటు, తమవంతు సహకారాన్ని అందించడానికి రైతాంగం సిద్ధంకావాలి. పథకం పది కాలాలపాటు నిలబడేలా చేయూతనివ్వాలి.

*ది. 27-11-1998.* — *ఈనాడు*

●

# ఉత్పత్తి వ్యయం ఉరితాడు కారాదు!

బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో 18 శాతం వ్యవసాయరంగానికి మంజూరు చేయాలి. రైతులపై రుణదాతల ఒత్తిడిని నివారించడానికి చట్టాన్ని తేవాలి. తక్కువ ప్రీమియం భారంతో వ్యవసాయ బీమా పథకాన్ని అన్ని పంటలకు వర్తింపచేసి అన్నదాతకు భవిష్యత్‌పై భరోసా కల్పించాలి.

రైతుల ఆత్మహత్యలను ఆపాలనే లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం కొన్ని చర్యలను ప్రకటించింది. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబానికి లక్ష రూపాయలు, రుణ భారాన్ని తొలగించడానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలనే నిర్ణయాలను ముఖ్యమంత్రి ప్రకటించారు. మరుసటి రోజు నుంచే పెద్ద సంఖ్యలో ప్రతి రోజూ రాష్ట్రంలో పలు ప్రాంతాలలో రైతులు ఆత్మహత్యల పరంపర కొనసాగుతూంది. రైతులకు సహాయం చేయు నిమిత్తం ప్యాకేజీని ప్రకటించిన తర్వాత కూడా యీ విధంగా పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకొనడం పట్ల ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తూంది. సున్నితమైన యీ అంశం గురించి అధ్యయనం చేసేందుకు నలుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఈ ఆర్థిక సహాయం ద్వారా ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబ సభ్యులను ఆపత్కాలంలో ఆదుకొన్నట్లవుతుంది. కాని ఆత్మహత్య చేసుకోవడానికి దారి తీసిన కారణాలకు యీ సహాయం పరిష్కారం కాదు. సమస్య చాల జటిలమైనది. ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే యీ సమస్యను పరిష్కరించడం అసాధ్యం. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా చాలా అవసరం. మన రాష్ట్రంలోనే కాక కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 1987 ప్రాంతంలో తెల్లదోమ, శనగపచ్చ పురుగులు నష్ట కల్గించడం వలన గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 76 మంది పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. 1997, 98 సంవత్సరాలలలో తిరిగి వాతావరణ పరిస్థితులు

అనుకూలించక వరంగల్, కరీంనగర్, నల్గొండ తదితర జిల్లాల్లో 300 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఆనాడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం, ఇందిరా ఆవాస్ యోజనా పథకం ఇల్లు, చిన్న పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించడం, సంక్షేమ పథకంగా రుణ సదుపాయం కల్పించడమే కాక సుమారు 600 కోట్ల రూపాయల రుణభారాన్ని ఏడు సంవత్సరాలపైన తీర్చే విధంగా మారటోరియం చేయించిది. ఆ దరిమిలా అక్కడక్కడ రైతులు ప్రతి ఏటా ఆత్మహత్యలు చేసుకొంటూనే ఉన్నారు. కర్ణాటక ప్రభుత్వం రైతుల ఆత్మహత్యల అంశం పైన అధ్యయనం చేసేందుకు ప్రొఫెసర్ వీరేష్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. ప్రధానంగా రుణ భారం పెరిగిపోయి, పంట దెబ్బ తిని, అప్పు తీర్చే మార్గం కనిపించక, అప్పు యిచ్చిన సంస్థ/ వడ్డీ వ్యాపారి/ భూస్వామి ఒత్తిడి భరించలేక అవమాన భారంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వీరేష్ కమిటీ అభిప్రాయపడింది. చనిపోయిన వారిలో ఎక్కువమంది సన్నకారు రైతులు, కౌలు రైతులు, బడుగు వర్గాలవారని కూడా ఆ కమిటీ తెలియజేసింది. కొద్ది మంది, కుటుంబ సమస్యలు, మద్యపానం మొదలైన వ్యసనాలకు బానిసలై చనిపోయారని ఆ కమిటీ వెల్లడించింది. చనిపోయిన రైతులు రుణ భారము వలన ఆత్మహత్యకు ఒడిగట్టారని స్థానిక కమిటీ నిర్ధారణ చేస్తే, వారి కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించేట్లు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ఐనప్పటికీ ఆ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. కారణమేమిటి? సమస్య మూలములోకి వెళితే గాని అది విశదము కాదు.

1960ల చివరినాళ్ళలో వచ్చిన సస్య విప్లవానంతరం రైతులు అధిక దిగుబడి వంగడాలు, వాటితోపాటు అధిక స్థాయిలో రసాయినిక ఎరువులు వాడటం ప్రారంభించారు. చీడపీడ నివారణకు ఖరీదైన పురుగు మందులు వాడటం వలన ఉత్పత్తి వ్యయం బాగా పెరిగిపోయింది. బ్యాంకుల్లో యిచ్చే పంట రుణం చాలక మిగతాది వెలుపల తీసుకోవలసి వస్తూంది. చిన్న రైతులకు బ్యాంకుల్లో అప్పు లభించక అధిక వడ్డీలకు భూస్వాముల వద్దగాని, వడ్డీ వ్యాపారుల వద్దగాని పంట పండించడానికి కావలసిన మొత్తం తీసుకోవలసి వస్తూంది. అనేక కారణాల వలన చాలామంది తమ భూములను మూజువాణీ కౌలుకు యిస్తున్నారు. కౌలుదారుకు ఏ బ్యాంకు అప్పు యివ్వదు. కావున కౌలు రైతు విధిగా అధిక వడ్డీకి అప్పు తీసుకోవలసి వుంటుంది. ఎరువులు, పురుగు మందుల షాపుల్లో కూడా అధిక వడ్డీకి అప్పు తీసుకోవలసి

వుంటుంది. ఎరువులు, పురుగు మందుల షాపుల్లో కూడా అధిక వడ్డీకి సరుకును అప్పుగా యిస్తారు. దీంతో షాపు యజమాని యిచ్చిన సరుకు నాసిదైనా గత్యంతరంలేని పరిస్థితుల్లో తీసుకోకతప్పదు. బ్యాంకులు యిచ్చే మొత్తం రుణాల్లో 18 శాతం వ్యవసాయం, దాని అనుబంధ వ్యాపకాలకు యివ్వాలనే మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి. కాని వ్యవసాయ (వ్యవసాయాధార పరిశ్రమలకు ఇస్తున్న వాటితో సహా) రంగానికి కేవలం 10 శాతం రుణాలు మాత్రమే దక్కుతున్నాయి. స్థూల దేశీయోత్పత్తికి దాదాపు 26 శాతం సమకూరుస్తూ, నూటికి 70 మందికి పైగా ఉపాధి పొందుతున్న వ్యవసాయరంగాన్ని ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం వలనే అన్న దాతలు తీవ్ర సమస్యల నెదుర్కోవలసివస్తోంది. ఇప్పటికైనా జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులు తాము యిచ్చే మొత్తం రుణాల్లో 25 శాతం రైతులకు, వ్యవసాయాధార పరిశ్రమలకు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి. తక్షణమే బ్యాంకింగు రెగ్యులేషను చట్టములో మార్పు తెచ్చి పంట రుణాలపై వడ్డీ 6 శాతం కంటే మిగలరాని విధంగా సవరణ తేవాలి. లోగడ జస్టిస్ పి.ఏ.చౌదరి రైతుల కనుకూలముగా యిచ్చిన తీర్పును వమ్ముచేయడానికై ఆనాటి కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగు రెగ్యులేషను చట్టాన్ని సవరించింది. వడ్డీ, అపరాధపు వడ్డీ కలసి అసలు కన్నా మిగలకూడదనే నిబంధన తీసుకువస్తే తప్ప పేద రైతులకు మోక్షం లేదు. ఒక పంట పోతే తర్వాత పంట చేతికి వచ్చేవరకు రుణ దాత ఒత్తిడి తీసుకురాని విధంగా ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకురావల్సిన అవసరమెంతైనా ఉంది.

సరైన పంటల బీమా పథకం ఉన్నప్పుడే పంట కోల్పోయినరైతుకు తగిన నష్టపరిహారం అందుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 38 సంవత్సరాల తరువాత సమగ్ర పంటల బీమా పథకం వచ్చింది. 2000 సంవత్సరం నుండి జాతీయ వ్యవసాయ బీమా పథకం అమల్లో ఉంది. సమగ్ర పంటల బీమా పథకం 7.62 కోట్ల మంది రైతులకు వర్తించింది. 1985 నుండి 1999 వరకు 403 కోట్లరూపాయల ప్రీమియం లభించగా 2303 కోట్ల రూపాయలను నష్టపరిహారంగా చెల్లించడం జరిగింది. అంటే 14 సంవత్సరాలలో 22 రాష్ట్రాల్లో సమగ్ర పంటల బీమా పథకం అమల్లో రూ. 1900 కోట్ల నష్టం వాటిల్లింది. కేంద్రం 1300 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు 600 కోట్ల రూపాయల నష్టాన్ని భరించాయి. దరిమిలా జాతీయ వ్యవసాయ బీమాపథకం అమల్లోకి వచ్చినపుడు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నష్టం చెరిసగంగా పడేట్లు చేయడమే

కాక, 2004 సంవత్సరం నాటికి సబ్సిడీ భారం ప్రభుత్వాలపై తగ్గి, ప్రీమియం భారం పెరిగి, అది రైతులపైన పడేటట్లుగా రూపొందించారు. అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్స్, జపాన్, రష్యా, చైనా మొదలైన దేశాలలో వ్యవసాయ బీమాపథకం అమల్లో వేల కోట్ల రూపాయల నష్టాలను ఆయా దేశాల ఫెడరల్ ప్రభుత్వాలే భరిస్తున్నాయి. 1998లో చీడ పీడల వలన నష్టం చేకూరినప్పుడు దానిని కూడా ప్రకృతి వైపరీత్యము వలన నష్టముగా గుర్తింపజేయడము జరిగింది. పంటల బీమాపథకం వలన రైతుకు ప్రయోజనం చేకూరాలంటే రైతు కమతంనకు బీమా సౌకర్యం కల్పించాలి. కాని ఇందుకు ఎక్కువ ప్రీమియం చెల్లించవలసివుంటుంది. 1972 నుండి 1979 వరకు రైతు కమతంనకు ప్రయోగాత్మకంగా అమలు చేసిన బీమా పథకంను లోతుగా అధ్యయనం చేసి, లోపాలను అధిగమించి, ప్రీమియం చిన్న రైతులకు కూడా అందుబాటులో ఉండేలా రూపొందించాల్సిన అవసరమెంతైనా ఉంది. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఇటీవల పశ్చిమ గోదావరి, నిజామాబాద్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసిన బీమా పథకాన్ని అన్ని జిల్లాలకు వర్తింపజేయాలి. మన రాష్ట్రంలో గత ఎనిమిది సంవత్సరాలలో ఐదు సంవత్సరాలు కరువు, ఒక సంవత్సరం అధిక వర్షాలతో చాలానష్టానికి గురైంది. ఇవికాక తుపాన్లు, వడగండ్ల వానలతో రైతులు భారీగానష్టపోయారు. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తన సబ్సిడీ రైతుకు చేకూరిన నష్టాన్ని పూరించలేదు. అది తిరిగి పంట వేసుకోవడానికి కొంత మేరకు అందించే సహాయం మాత్రమే. ఆపదలో ఉన్న రైతును చాలా వరకు ఆదుకోగల్గినది సరియైన రైతు అనుకూల వ్యవసాయ బీమా పథకం మాత్రమే. కొనసాగుతున్న ఆత్మహత్యల పరంపర ఆగాలంటే రైతులకు భవిష్యత్తుపై భరోసా కల్పించాలి. మార్గదర్శక సూత్రాల ప్రకారం రుణాలు మంజూరు చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో అన్ని పంటల ఉత్పత్తి వ్యయం చాలా ఎక్కువ. ఇటీవలి కాలంలో ఖర్చు తగ్గి, దిగుబడిని పెంచేందుకు పలు చర్యలను చేపట్టడం జరిగింది. వ్యవసాయ రంగం తగినంత ప్రగతిని సాధించలేకపోయింది. రైతులు నష్టాలకు గురైనారు. అన్ని వనరులు, కష్టించేరైతులు ఉండి వ్యవసాయరంగంలో ప్రపంచ చిత్రపటంలో మనం ప్రముఖంగా కన్పించడం లేదు. ప్రపంచంలో మొత్తం వ్యవసాయఉత్పత్తిలో 11 శాతం మనదే. అయితే ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంలో మనవాటా కేవలం 1 శాతం మాత్రమే!

ప్రపంచ వాణిజ్య సంస్థ సంస్థ ఆవిర్భవించిన తరువాత మన పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లయింది. ఈ పరిస్థితుల్లో ఒక్క మన రాష్ట్రంలోనే కాకుండా యావత్ భారతదేశంలోనూ కొనసాగుతన్నరైతుల ఆత్మహత్యలను నిలవరించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా తీసుకోవాల్సిన చర్యలేమిటో మరోసారి పునరుద్ఘాటిస్తాను. వ్యవసాయరంగానికి రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకులకు తక్షణమే స్పష్టమైన ఆదేశాల జారీ; బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టానికి సవరణ; వడ్డీ అపరాధ పడ్డీ అసలుకు మిగులకుండా చర్యలు; ఒకపంట పోయినపుడు మరో పంట చేతికి వచ్చేంతవరకు రైతులపై రుణదాతలు ఎటువంటి ఒత్తిడి తీసుకురాకుండా చట్టబద్ధమైన చర్యలు. గ్రామం యూనిట్‌గా తక్కువ ప్రీమియం బారంతో వ్యవసాయ బీమా పథకాన్ని అన్ని వ్యవసాయ, ఉద్యాన పంటలకు వర్తింప జేసినప్పుడే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాలనే తలంపునకు ఒడిగట్టరు. రైతు స్వాభిమానంతో వ్యవసాయం వృత్తిగా మనుగడ సాగించగలదు.

*ది. 29-05-2004.* — *ఈనాడు*

●

# రుణం అందిస్తే... రుణం తీర్చుకున్నట్లే

వ్యవసాయ రంగానికి అత్యంత అవసరమైన రుణాలు లభించని దుస్థితి ప్రస్తుతం మన రాష్ట్రంలో నెలకొని ఉంది. పంట వేసుకునేందుకు భూమిని సకాలంలో సిద్ధపరచడం నుంచి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు సమకూర్చుకోవడం, కోతలు, పంట మార్కెటింగ్‌ల వరకు ప్రతిదశలోనూ రైతు చేతిలో ధనం ఉన్నప్పుడే వ్యవసాయం ముందుకు సాగుతుంది. అయితే– వ్యవసాయరంగం ప్రగతి పథంలో పయనించడానికి, రైతులు అవసరాలను తీర్చడానికి తగినస్థాయిలో రుణాలు అందడంలేదు. దేశానికి స్వాతంత్ర్యం లభించి అయిదున్నర దశాబ్దాలు గడిచిపోయిన తరవాత కూడా రుణాల విషయంలో ఈ రంగం ఇంతటి దుస్థితిలో కొట్టుమిట్టాడుతుండటం దురదృష్టకరం.

## అన్నదాతను పట్టించుకోని బ్యాంకులు

రైతుల అవసరాలకు తగినట్లుగా వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు రుణాలు సమకూర్చడంలేదు. కౌలు రైతులకు రుణసాయం అందించేందుకు అవి సుముఖంగా లేవు. పర్యవసానంగా దేశంలోని ఎనభై శాతం రైతులు రుణాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపైనో, భూస్వాములపైనో ఆధారపడవలసి వస్తోంది. అపరాధ వడ్డీ, చక్రవడ్డీలతో ఆ రుణాలు తడిసి మోపెడవుతుండటంతో రైతులు, ముఖ్యంగా, సన్న, చిన్నకారు రైతులు ఇక్కట్లపాలవుతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక, రుణదాతల ఒత్తిడులు తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్ హర్యానాలలో ఇటువంటి దుస్థితే నెలకొంది. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలను ఆదుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఒక ప్యాకేజీని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్షన్నర రూపాయలకు అదనంగా మరో యాభైవేల రూపాయలను బాధిత రైతు కుటుంబాలకు ఇస్తున్నట్లు– మన రాష్ట్రాన్ని ఈమధ్య సందర్శించిన

ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కూడా ప్రకటించారు. అయినా ప్రభుత్వం ఆశించిన దానికి భిన్నంగా రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల పరంపర ఇప్పటికీ కొనసాగుతుండటం అత్యంత బాధాకరం. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల సంఖ్య– గడచిన అయిదేళ్లలో కంటే ఈ మూడునెలల వ్యవధిలోనే ఎక్కువ. వీరిలో అత్యధికులు చిన్న, సన్నకారు రైతులు, కౌలుదారులే. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని ఎక్కువమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, బ్యాంకు బకాయిలు చెల్లించలేక కొంతమంది ప్రాణాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వ్యక్తుల నుంచి, వడ్డీ వ్యాపారుల నుంచి రైతులు తీసుకున్న రుణాల వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం మారటోరియం విధిస్తూ చట్టం తెచ్చింది. అప్పుల భారంతో సతమతమవుతున్న రైతులపై ఒత్తిడులను తగ్గించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యవల్ల – రుణాలను తిరిగి చెల్లించే విషయంలో రైతులకు ఆరెనెలల పాటు ఊపిరిపీల్చుకునేందుకు వెసులుబాటు కలిగిన మాట నిజమే అయినా – రుణాలు తీసుకున్న రైతులపట్ల కొంతమంది వడ్డీవ్యాపారులు అమానుషంగా ప్రవర్తిస్తున్న సంఘటనలు అక్కడక్కడా వెలుగులోకి వస్తున్నాయి. మారటోరియం విధింపు పర్యవసానంగా రైతులకు కొత్తగా రుణాలు ఇవ్వడానికి ప్రైవేటు వ్యక్తులు, వడ్డీ వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఇక కౌలుదారు రైతులకు వ్యవస్థాగతంగా రుణాలు అందడంలేదు. రాష్ట్రంలోని పలుజిల్లాల్లో సహకార బ్యాంకుల పరిస్థితి సజావుగా లేదు. మొత్తం 4664 సహకార పరపతి సంఘాలకుగాను లాభాల్లో నడుస్తున్న సంఘాలు ఆరువందల నుంచి ఎనిమిదివందల వరకే ఉన్నాయి. తొమ్మిది జిల్లాల కేంద్ర సహకార బ్యాంకులు 'నాబార్డ్' నుంచి రీఫైనాన్స్ సౌకర్యాన్ని పొందే అర్హతను కోల్పోయాయి. పర్యవసానంగా ఆ జిల్లాల్లో సహకార రుణాలు పంపిణీ అయ్యే అవకాశాలు కనిపించడంలేదు. లోగడ కరవు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను, ఇతర రైతులను ఆదుకోవడానికి గత ప్రభుత్వం పంట రుణాలు, టర్మ్‌లోన్‌లపై వడ్డీ, అపరాధవడ్డీ చెల్లింపు వంటి అంశాల్లో పలు రాయితీలు కల్పించింది. అప్పట్లో దాదాపు 500 కోట్ల రూపాయల మేరకు వెసులుబాటు కల్పించినా ఆర్థికపరమైన ఇబ్బందువల్ల దాదాపు 290 కోట్ల రూపాయల మేరకే రైతులు ఈ రాయితీలను వినియోగించుకోగలిగారు. సహకార బ్యాంకుల ద్వారా 2003–04లో రూ. 3521 కోట్లు వ్యవసాయ రంగానికి రుణాలుగా ఇవ్వాలన్న లక్ష్యాన్ని నిర్దేశించినా అవి ఆచరణలో సమకూర్చిన రుణాలు రూ. 2712 కోట్లు మాత్రమేనని, అందులోను బుక్ అడ్జస్ట్‌మెంట్లే

ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఇక జాతీయ బ్యాంకుల విషయానికోస్తే గత ఏడాది ఆ బ్యాంకులు రూ. 3275 కోట్ల మేరకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, వాస్తవంలో అవి ఇచ్చినవి రూ. 2514 కోట్లే. స్టేట్ బ్యాంక్ గ్రూపు లక్ష్యం రూ. 2511 కోట్లు కాగా ఆ గ్రూపు సమకూర్చిన రుణాలు రూ. 1934 కోట్లు. గ్రామీణ బ్యాంకుల లక్ష్యం రూ. 1623 కోట్లు కాగా అవి ఇచ్చిన రుణాలు 1331 కోట్ల రూపాయలు. బ్యాంకుల జాతీయీకరణకు ముందు వ్యవసాయ రంగానికి ప్రైవేట్ బ్యాంకులు రుణాలను సమకూర్చేవికావు. బ్యాంకుల్ని జాతీయం చేసిన దరిమిలా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకుల శాఖలను ఏర్పాటుచేయడంతోపాటు ప్రాముఖ్య రంగాలకు నిర్దేశిత శాతంమేరకు రుణసౌకర్యం కల్పించాలన్న విధానాన్ని అనుసరించడంవల్ల పరిస్థితి కొంత మెరుగుపడింది. అయినప్పటికీ రైతన్నలు హెచ్చువడ్డీలకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి రుణాలు తీసుకోవలసిన దౌర్భాగ్య పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయి.

రైతులకు అప్పులు ఇవ్వడం 'దుస్సాహసమ'ని జాతీయ బ్యాంకులు భావిస్తుంటాయి. కానీ స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికవేత్తలు, బడావ్యాపారులు చెల్లించవలసిన రూ. 40 వేల కోట్లకు పైగా రుణాలను బ్యాంకులు మాఫీ చేశాయన్నది ఈ సందర్భంగా గమనార్హం. రాని బాకీలనో, పరిశ్రమలు కుంటుపడ్డాయనో మిషచూపి ఆ రుణాలను బ్యాంకులు రద్దుచేశాయి. హర్షద్ మెహతా సూత్రధారిగా ఉన్న షేర్ల కుంభకోణం, సెక్యూరిటీల స్కాంలలో వేలకోట్ల రూపాయల ప్రజాధనం గంగ పాలయింది. ఇప్పుడు కూడా ప్రాధాన్యరంగానికి ఇచ్చిన రుణాల్లో ఆరువేల కోట్ల రూపాయలు మాత్రమే నిరర్థక ఆస్తులుగా పరిగణన పొందుతుండగా, ప్రాధాన్యేతర రంగాలకు ఇచ్చిన రుణాల్లో 60 వేల కోట్ల రూపాయలను నిరర్థక ఆస్తులుగా గుర్తించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు తాము ఇచ్చే రుణాల్లో 78 శాతాన్ని పట్టణ ప్రాంతాలకే సమకూరుస్తున్నాయి. 10 శాతం రుణాలను ఒక మోస్తరు పట్టణ ప్రాంతాల్లోని వారికి, 12 శాతం రుణాలను గ్రామీణ ప్రాంతాలకు ఇస్తున్నాయి. రైతులపట్ల జాతీయ బ్యాంకులు చిన్నచూపుతో వ్యవహరిస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం.

2004-05లో పంట రుణాలుగా రూ. 11,205 కోట్లు; మధ్య, దీర్ఘకాలిక రుణాలుగా రూ. 1814 కోట్లు, వ్యవసాయ అనుబంధ వ్యాపకాలకు రూ. 1167 కోట్లను రుణంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి సమక్షంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి

బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ, సహకార బ్యాంకులు అన్నీ కలిపి ఈ రుణాలను ఇవ్వవలసి ఉంటుంది. గత ఏడాదికంటే ఈ రుణాల లక్ష్యం 41 శాతం ఎక్కువ అని అంటున్నారు. అయితే ఈ అంకెల్ని చూసి మురిసిపోకూడదు. ఎందుకంటే 2002-03లో బ్యాంకులు రూ. 6300 కోట్లు రుణాలుగా పంపిణీ చేశాయి. ఆ రుణాలకంటే 52 శాతం ఎక్కువగా అంటే 9667 కోట్ల రూపాయలను రుణాలుగా సమకూర్చాలన్న లక్ష్యాన్ని గత ఏడాది జరిగిన బ్యాంకర్ల సమావేశం నిర్దేశించినా ఇచ్చిన రుణాలు మాత్రం 7900 కోట్ల రూపాయలు మాత్రమే. అందువల్ల ఈ ఏడాది రైతులకు రుణాలు ఆశించిన రీతిలో అందుతాయా... అన్నది సందేహమే. మరోవైపు ఈ సంవత్సరం రైతులకు రుణాలు ఇవ్వడానికి ప్రైవేట్ వ్యక్తులు, వడ్డీ వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో– ప్రభుత్వం జిల్లా కలెక్టర్లతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితిని సమీక్షించడంతోపాటు, రైతులకు వ్యవస్థాగతంగా రుణాలు పూర్తిగా అందేలా పర్యవేక్షిస్తుండాలి. రుణాలు పూర్తిగా అందకపోతే ఖరీఫ్ పంట పండించడంలో రైతులు తీవ్రమైన ఇబ్బందులకు లోనవుతారు. మన రాష్ట్రంలో రైతులకు గతంలో ప్రైవేట్ రంగంనుంచి అధిక వడ్డీకైనా దాదాపు పదివేలకోట్ల రూపాయల మేరకు రుణాలు లభిస్తుండేవి. ప్రైవేట్ రుణాలపై మారటోరియం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తేవడంతో ప్రైవేట్‌గా రైతులకు రుణాలు లభించే అవకాశాలు మృగ్యమయ్యాయి. అందువల్ల రుణ సౌకర్య కల్పనకు సంబంధించి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో నిర్దేశించిన లక్ష్యానికి అదనంగా ఒకప్పుడు ప్రైవేట్ రంగాల ద్వారా లభించే పదివేల కోట్ల రూపాయలు కూడా రైతులకు అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోకపోతే దాని ప్రభావం ప్రస్తుత ఖరీఫ్ పంటల ఉత్పాదకత, ఉత్పత్తులపై పడుతుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై ప్రధానమంత్రితో, కేంద్ర ఆర్థిక మంత్రితో సత్వరమే చర్చలు జరిపి రిజర్వ్‌బ్యాంకు, నాబార్డుల ద్వారా రైతులకు అదనంగా పదివేలకోట్ల రూపాయల మేరకు రుణ సౌకర్యం కల్పించవలసిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వ బాండ్లలో కేవలం అయిదు నుంచి ఆరు శాతం వడ్డీకే లక్ష కోట్ల రూపాయలను వాణిజ్య బ్యాంకులు మదుపు పెట్టాయి. అందువల్ల రైతులకు రుణాలను ఇవ్వడానికి నిధుల కొరత సమస్య ఉత్పన్నం కాదు. కావల్సిందల్లా దృఢ సంకల్పం మాత్రమే. ప్రకృతి వైపరీత్యాల కారణంగానో, చీడ

పీడల వల్లనో పంటలు దెబ్బతిని రైతులు బకాయిలు చెల్లించలేని స్థితిలో ఉన్నా - వారినుంచి బ్యాంకులు కాంపౌండు వడ్డీ, అపరాధ వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఇది రైతులపై మరింత భారం మోపడమే. ఈ సందర్భంగా రుణాల విషయంలో రైతులకు కర్ణాటక ప్రభుత్వం ఎటువంటి వెసులుబాటు కల్పించిందో పరిశీలించడం సముచితం. కర్ణాటకలో ఈ ఏడాది నుంచి వ్యవసాయ రుణాలపై కాంపౌండ్ వడ్డీ, అపరాధ వడ్డీ ఉండవని ఆ రాష్ట్ర ఆర్థికమంత్రి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేర్కొన్నారు. రైతులు అప్పుగా తీసుకున్న అసలు, అప్పుగా తీసుకున్న అసలు, దానిపై సాధారణ వడ్డీకి మించి ఉన్న బాకీలను మాఫీ చేస్తామని ఆయన తెలిపారు. అప్పుగా తీసుకున్న అసలు మొత్తం కంటే ఎక్కువగా వడ్డీలు, అపరాధ వడ్డీలు చెల్లించిన 20 వేల మంది రైతుల రుణ బకాయిలను మాఫీ చేస్తున్నట్లు కూడా కర్ణాటక ఆర్థికమంత్రి ప్రకటించారు. ఆ మేరకు వారు కట్టిన హెచ్చు మొత్తాలను వాపసు చేయడానికి బడ్జెట్‌లో తగు కేటాయింపులు చేయడం ప్రగతిశీల చర్య. వ్యవసాయ రుణాలపై కాంపౌండ్ వడ్డీని, అపరాధ వడ్డీని వర్తింపజేయరాదని మన రాష్ట్ర ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయాల్ని తీసుకోవాలి. రైతులు అప్పుగా తీసుకున్న అసలుకు సాధారణ వడ్డీని కలపగా వచ్చినదానికంటే హెచ్చుగా ఉన్న మొత్తాలను ప్రభుత్వం రద్దు చేయాలి. ఈ మేరకు కూడా ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాలి. స్వయం సహాయక బృందాలకు ఇస్తున్న రుణాల్లో సింహ భాగం తిరిగి వసూలు అవుతున్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు - రైతుల గ్రూపులకు రుణాలు సమకూర్చడానికి ముందుకు రావాలి. గతంలో సన్నకారు, చిన్నకారు రైతులు, కౌలుదార్లతో రెండున్నర లక్షల 'రైతుమిత్ర' గ్రూపులను ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులకు బ్యాంకులతో లింకేజీ పద్ధతి ఏర్పాటు చేస్తే రైతుల్లో అత్యధికులకు ముఖ్యంగా చిన్న రైతులకు, కౌలురైతులకు సకాలంలో రుణాలను సమకూర్చడం సాధ్యపడుతుంది.

## వ్యవస్థాగత ఏర్పాట్లు తక్షణావశ్యకత

అనేక విధాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న మన వ్యవసాయరంగ పరిస్థితి 'గొర్రె తోక బెత్తెడే' అన్నట్లుగా తయారైంది. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించడం హర్షణీయమే. అయితే ప్రైవేట్ వ్యవసాయ రుణాలపై ప్రభుత్వం మారటోరియం విధించిన దరిమిలా రుణాలు లభించక రైతులు తీవ్రమైన

ఇబ్బందుల నెదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విధాన నిర్ణయాలు తీసుకోవాలి. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, వ్యవస్థీకృత రంగం ద్వారా అంటే వాణిజ్య, గ్రామీణ, సహకార, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా రైతులకు ఈ ఏడాది అదనంగా పదివేలకోట్ల రూపాయలు రైతులకు అందేలా చూడాలి. అందుకు అవసరమైన చర్యలను యుద్ధ ప్రాతిపదికపై తీసుకున్నప్పుడే ప్రస్తుతం నెలకొన్న సంక్షోభ పరిస్థితుల్ని అధిగమించగలం.

*ది. 27-07-2004.* **- *ఈనాడు***

# సమగ్ర బీమాతోనే రైతుకు భరోసా

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పలు జిల్లాల్లో చేతికందిన పంట నీళ్లపాలైంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, వరంగల్ జిల్లాల్లో మిర్చి, నిజామాబాద్ జిల్లాలో పొద్దుతిరుగుడు, పసుపు, ఇతర జిల్లాల్లో మొక్కజొన్న పంటలు వర్షార్పణమయ్యాయి. ఈ వానల కారణంగా వాటిల్లిన పంట నష్టం రూ. 300 కోట్లు ఉంటుందని అంచనా. అంతకుముందు కొద్దిరోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పద్రోణి కారణంగా కురిసిన అకాలవర్షాల వల్ల కూడా ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కృష్ణా మొదలైన జిల్లాల్లో శెనగ, మిర్చి, మినుము, వర్జీనియా పొగాకు, నాటు పొగాకు వంటి పంటలకు పెద్దయెత్తున నష్టం వాటిల్లింది. ఆ వర్షాలకు ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోనే కనీసం రూ. 700 కోట్లమేర పంటనష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. ఒకవైపు- ఏటేటా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు- పనిగంటలు, ఉత్పాదకత తగ్గిపోతున్నాయి. ఇన్ని సమస్యలతో దిక్కుతోచక అల్లాడుతున్న రైతాంగాన్ని అకాలవర్షాలు, తుఫాన్లు వంటివి ఆర్థికంగా మరింత దుస్థితిలోకి నెడుతున్నాయి.

## సాయం నామమాత్రమే

పెద్దయెత్తున నష్టపోతున్న రైతులకు ప్రభుత్వపరంగా అందుతున్న సాయం నామమాత్రంగానే ఉండటం విచారకరం. పంట కోల్పోయిన రైతులు తదుపరి పంట వేసుకోవడానికి కావలసిన విత్తనాలకు, ఎరువులకు అవసరమైన మొత్తంలో కొంత సహాయాన్ని (రిలీఫ్) ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందజేస్తుంటుంది. ఆ రూపేణా అందించే సాయమూ పంట నష్టాన్ని పూడ్చడానికి దోహదం చేసేలా ఉండదు. అందువల్ల, ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి సమగ్ర పంటల బీమా పథకం అవసరం. ఎందుకంటే- పంట నష్టాన్ని పూడ్చలేకపోతే, తదుపరి కాలంలో

వ్యవసాయ పనులకు, ఉత్పాదకాలకు రైతులు అవసరమైన ఖర్చు పెట్టలేరు. పర్యవసానంగా పంటల దిగుబడి తగ్గిపోవచ్చు. అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కారాదన్న ఉద్దేశ్యంతోనే పంటల బీమా పథకం, రైతుల ఆదాయ బీమా పథకం వంటివాటిని పలు దేశాలు ప్రవేశపెట్టాయి. ఎంత నష్టాన్నైనా భరిస్తూ అక్కడి ఫెడరల్ ప్రభుత్వాలు ఆ వ్యవసాయ బీమా పథకాలను అమలుచేస్తున్నాయి. జపాన్‌లోను, అభివృద్ధి చెందిన ఇతర దేశాల్లోను పండ్లతోటలకు కూడా బీమా పథకాలున్నాయి. కానీ, మన దేశంలో మాత్రం రైతు ప్రయోజనాలను కాపాడగల సమగ్ర వ్యవసాయ బీమా పథకం లేకపోవడం–సేద్యరంగం పట్ల ఇక్కడి పాలకుల అలసత్వానికి, అశ్రద్ధకు దృష్టాంతం.

పంటల బీమా పథకంపై అయ్యే వ్యయాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) గ్రీన్‌బాక్స్ పరిధిలో చేర్చింది. అంటే, పంటనష్టం వాటిల్లిన రైతులకు అందించే సహాయాన్ని ప్రభుత్వాలు తగ్గించవలసిన అవసరం లేదు. వర్ధమాన దేశాలు వ్యవసాయానికి సబ్సిడీలు తగ్గించాలంటూ డబ్ల్యు.టి.ఒ. రూపొందించిన నిబంధనల పరిధినుంచి–పంటల బీమాకు, వాతావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చేసే ఖర్చును మినహాయించారు. అయినా, పంటల బీమాపై ప్రభుత్వ భారాన్ని తగ్గించాలని ఇక్కడి పాలకులు భావిస్తున్నారు. ఇది దురదృష్టకరం.

ఇండియాలో ఇప్పటివరకు అమలు చేసిన బీమా పథకాల తీరును సమీక్షిస్తే– ఆపదలో చిక్కుకున్న రైతులను ఆదుకోవడంలో కేంద్రంలోని ప్రభుత్వాల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. వ్యక్తి ఆధారంగా అంటే, రైతుకు గల భూవిస్తీర్ణం ప్రాతిపదికగా 1978–79 వరకు అమలుచేసిన పంటల బీమా పథకాన్ని 3110 మంది రైతులు ఉపయోగించుకున్నారు. వారు ప్రీమియంగా నాలుగున్నరలక్షల రూపాయలు చెల్లించగా, పంట నష్టానికి పరిహారం రూపేణా వారికి రూ.37.88లక్షలు అందాయి. ఏకీకృత భూవిస్తీర్ణం ప్రాతిపదికగా 1979లో ప్రవేశపెట్టిన 'పైలట్ క్రాప్ బీమా' పథకాన్ని పదమూడు రాష్ట్రాల్లో 1984–85 వరకు అమలు చేశారు. బ్యాంకు రుణంతో అనుసంధానించిన ఈ పథకం పరిధిలో ఆరులక్షల 23వేల మంది రైతులున్నారు. వారు దాదాపు రూ.197లక్షల రూపాయల ప్రీమియాన్ని చెల్లిస్తే– వారికి నష్టపరిహారం రూపేణా చెల్లించిన సొమ్ము రూ.157లక్షలు మాత్రమే. సమగ్ర పంటల బీమా పథకం (సి.సి.ఐ.ఎస్.) 1985 నుంచి 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో

అమలైంది. ఈ పథకం కింద 1999 వరకు ఏడుకోట్ల 62లక్షల మంది రైతులు రూ. 24,922కోట్ల విలువైన పంటలను బీమా చేశారు. రూ. 403కోట్లను ప్రీమియంగా చెల్లించారు. పంటల నష్టానికి పరిహారంగా వారికి రూ. 2365కోట్లు అందింది. అంటే, పదిహేనేళ్ల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వంపై రూ. 1535కోట్లు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై రూ. 830కోట్ల మేరకు భారం పడిందన్నమాట! ప్రభుత్వాలపైన ఈమాత్రం భారాన్ని తగ్గించాలన్నది ప్రణాళిక సంఘం యోచన. అందుకే అది వాస్తవస్థాయి ప్రీమియం సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చింది.

పంటల బీమాకు సంబంధించిన వ్యయంలో తనవంతు భారాన్ని కొంత తగ్గించుకోవడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం 1999-2000 రబీకాలం నుంచి 'జాతీయ వ్యవసాయ బీమా' పథకాన్ని ప్రవేశపెట్టింది. సమగ్ర పంటల బీమా పథకం కింద తాము మోయవలసిన వ్యయభారం కంటే ఎక్కువ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించేలా కేంద్రం జాతీయ వ్యవసాయ బీమా పథకాన్ని రూపొందించింది. సమగ్ర పంటల బీమా పథకంలో- నష్టపరిహారం చెల్లింపుల భారాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, బీమా కంపెనీలు సమానంగా భరించాల్సి ఉండగా జాతీయ వ్యవసాయ బీమా పథకం ప్రకారం కేంద్రం, రాష్ట్రం చెరిసగం భరించాలి. బ్యాంకుల సర్వీసు ఛార్జీల ఖర్చు, నిర్వహణ వ్యయం, ప్రచార ఖర్చు వంటి వాటిలో సగం రాష్ట్రం భరించాలి. కార్పస్ ఫండ్‌కు కూడా రాష్ట్ర ప్రభుత్వం కొంతమొత్తాన్ని జమచేయవలసి ఉంటుంది. ఈ పథకం ప్రకారం- రైతులు చెల్లించాల్సిన ప్రీమియంపై మొదటి ఏడాది 50 శాతం సబ్సిడీ ఉంటుంది. ఏటా అది పదిశాతం చొప్పున తగ్గుతూ వస్తుంది. తద్వారా- ఆఖరికి సన్న, చిన్నకారు రైతులు చెల్లించాల్సిన ప్రీమియంపై సబ్సిడీని పూర్తిగా ఉపసంహరించినట్లే. అంటే, ఆ రైతులూ అధికమొత్తంలో ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది.

1999 రబీ నుంచి, 2005 ఖరీఫ్ నాటికి 2,14,29,351మంది రైతులు జాతీయ వ్యవసాయ బీమా పథకం పరిధిలోకి వచ్చారు. వారు రూ. 2223కోట్ల 75లక్షల ప్రీమియం చెల్లించారు. వారి క్లెయిమ్స్ ప్రకారం రూ. 6829కోట్ల 38లక్షలను నష్టపరిహారం కింద వారికి ముట్టింది. సమగ్ర పంటల బీమా పథకంలో ప్రీమియం, నష్టపరిహారం దామాషా 1:4 ఉండగా, జాతీయ వ్యవసాయ బీమా పథకంలో అది

1:3కి తగ్గింది. అంతేకాక, ప్రధాన ఆహార పంట అయిన వరికి, జొన్న, మొక్కజొన్న, పప్పుధాన్యాలు వంటివాటికి ఖరీఫ్ సీజనల్‌లో రైతులు చెల్లించాల్సిన ప్రీమియం రెండు శాతం నుంచి రెండున్నర శాతానికి పెరిగింది. గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వాలు ఎప్పటినుంచో చెబుతూనే ఉన్నా, ఇప్పటికీ పలు రాష్ట్రాల్లో బీమా అమలుకు తాలూకాను, మండలాన్నే యూనిట్‌గా పరిగణిస్తున్నారు. మన రాష్ట్రంలో జాతీయ వ్యవసాయ బీమా పథకం కింద ఉన్న పంట విస్తీర్ణంలో వరి 50 శాతం, వేరుసెనగ 25 శాతం, చెరకు 15 శాతం, పత్తి అయిదుశాతంగా ఉన్నాయి. ప్రీమియం రేట్లు అధికంగా ఉండటంతోపాటు, బీమా కల్పనకు మండలం వంటి పెద్ద విస్తీర్ణాన్ని యూనిట్‌గా పరిగణిస్తుండటం వల్ల- ఈ బీమా పథకాన్ని వినియోగించుకోడానికి రైతులు ఎక్కువమంది ముందుకురావడం లేదు.

## పరిహారం పెంపు అవసరం

జాతీయ వ్యవసాయ బీమా పథకంలో పలు మార్పులు చేస్తే తప్ప- సమస్యల వలయంలో చిక్కుకున్న రైతులను ఆదుకోవడం సాధ్యం కాదు. అన్ని రాష్ట్రాల్లోను గ్రామం యూనిట్‌గా ఈ పథకాన్ని అమలు చేయాలి. వరి, గోధుమలు, తృణ, పప్పుధాన్యాలు, నూనెగింజలకు రెండు శాతానికి మించకుండా ప్రీమియంను నిర్ణయించాలి. పొగాకుతో సహా వాణిజ్య పంటలన్నిటికీ ఈ పథకాన్ని విస్తరింపజేయడంతోపాటు, వాటి ప్రీమియంను 3.5 శాతం మించకుండా నిర్ణయించాలి. మామిడి, అరటి, జామ తోటలకు సంబంధించి జపాన్‌లో మాదిరి ఆయా పండ్ల చెట్లకు బీమా సౌకర్యం కల్పించాలి. చిన్న, సన్నకారు రైతులు చెల్లించాల్సిన ప్రీమియంపై 50 శాతం సబ్సిడీని కొనసాగించాలి. పంట నష్టపోయిన రైతులకు ప్రస్తుతం చెల్లిస్తున్న పరిహారం స్థాయి 90, 80, 60 శాతాలుగా ఉన్నాయి. దాన్ని 95, 85, 75 శాతాలుగా సవరించాలి. తద్వారా- రైతులకు సరైన మొత్తంలో పరిహారం అందేలా చూడాలి. రైతుకుగల భూవిస్తీర్ణం ప్రాతిపదికగా పంటల బీమా పథకాన్ని అమలు చేయడానికి అన్నిచర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఈ దిశగా ముందడుగు వేస్తేనే, సరైన రీతిలో నష్టపరిహారం అంది రైతులు నిలదొక్కుకోగలుగుతారు.

*ది. 27-03-2008.* — *ఈనాడు*

●

# పంట పొలాల్లో మంటలెక్కడివి?

వాతావరణంలో పెనుమార్పుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది. ముఖ్యంగా, భూమధ్యరేఖకు దగ్గరలో ఉన్న దేశాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు అధికంగా ఉన్నాయి. వీటిలో ఆఫ్రికా, మధ్య-దక్షిణ ఆసియా దేశాల్లోని వ్యవసాయరంగం ఒడుదొడుకులకు లోనవుతుందని వారు హెచ్చరిస్తున్నారు. 2020 నాటికి ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో వర్షాధార పంటల దిగుబడులు 50 శాతం మేరకు తగ్గవచ్చని వాతావరణ మార్పులపై ఏర్పాటైన అంతర్జాతీయ బృందం (ఐపీసీసీ) అధ్యయనంలో తేలింది. ప్రపంచ ఉష్ణోగ్రత ఇప్పటి వలెనే ఇంకా పెరుగుతూపోతే మధ్య-దక్షిణ ఆసియా దేశాల్లో 2050 నాటికి పంటల దిగుబడులు 30 శాతం మేరకు తగ్గే ప్రమాదం ఉంది. ప్రంచవ్యాప్తంగా ఉన్న 47 కోట్ల కమతాల్లో రెండు హెక్టార్లకన్నా తక్కువ ఉన్న వ్యవసాయ కమతాలు 85శాతం. ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ఆహారంలో 80 శాతం వీటినుంచే వస్తోంది. మనదేశంలో సన్న, చిన్నకారు రైతులు 80 శాతం ఉన్నారు. వాతావరణంలో హెనుమార్పుల వల్ల ఎక్కువగా దెబ్బతినేది వీరే.

## నేల నిస్సారం

ప్రపంచం మొత్తం మీద ఈ శతాబ్దం ఆఖరుకు ఉష్ణోగ్రత 1.4 నుంచి 5.8 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరగవచ్చని అంచనా. నీటివనరుల వ్యవస్థ, వాతావరణం, సముద్రమట్టాలు, పంటల ఉత్పాదకత, ఉత్పత్తి, మనుషుల ఆరోగ్యం, జీవ వైవిధ్యం వంటి అనేక అంశాలపై అది ప్రభావం చూపుతోంది. గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయి పెరగడం భూతాపానికి ప్రధాన కారణం. వాతావరణ మార్పుల వల్ల నష్టపోతున్న వ్యవసాయ రంగం, స్వయంగా ఈ మార్పులకు కొంతవరకు కారణమవుతుండటం

గమనార్హం. ఈ దృష్ట్యా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

మన దేశంలో 14.2 కోట్ల హెక్టార్ల భూమిలో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఆహార పంటల్లో అతిముఖ్యమైనది వరి. కొన్ని ప్రాంతాల్లో వరిగడ్డిని పశుగ్రాసంగా వాడుతున్నారు. కానీ పంజాబ్, హర్యానా, పశ్చిమ యు.పి., కర్ణాటకలోని రాయచూర్ జిల్లా తదితర ప్రాంతాల్లో ఖరీఫ్ వరిపంట తరవాత వరిగడ్డిని రైతులు సాధారణంగా తగలబెడుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో గోధుమ పంటను వేయడానికి, కర్ణాటకలో రబీ వరి పంట వేయడానికి ఈ విధంగా వరిగడ్డిని తగలబెడతారు. పర్యవసానంగా వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. నాలుగు టన్నుల వరి పంట ద్వారా ఆరు టన్నుల వరి గడ్డి లభిస్తుంది. ఈ వరిగడ్డిలో 0.5 నుంచి మూడు శాతం నత్రజని, 0.1 నుంచి 0.25 శాతం ఫాస్పరస్, 1.0 నుంచి 1.5 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. వరిగడ్డిని చిన్నముక్కలుగా చేసే యంత్రపరికరాల్ని రూపొందించి, విరివిగా వాడుకలోకి తెచ్చి, ఈ వరిగడ్డిని తగలబెట్టకుండా భూమిలోకి కలిపితే సేంద్రీయ పదార్థం పెరిగి భూమి సారవంతమవుతుంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. బెట్టనుతట్టుకునే శక్తి అధికమవుతుంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. ఇలా చేయకుండా వరిగడ్డిని తగలబెట్టడం వల్ల టన్నుకు 34.64 కిలోల కార్బన్‌డయాక్సైడ్, 2.6 కిలోల నైట్రస్ ఆక్సైడ్, 0.4కిలోల మీథేన్ వాయువు వాతావరణంలో కలుస్తున్నాయి. వాతావరణ కాలుష్యం పెరగటానికి, భూతాపం హెచ్చుదానికి అది కారణమవుతోంది. దేశం మొత్తంమీద ఏటా సుమారు 250కోట్ల టన్నుల చెరకు పంట సాగవుతోంది. ఒకటన్ను చెరకు నుంచి ఎనిమిది నుంచి పదిశాతం చెరకు ఆకు వస్తుంది. 95 శాతం చెరకు ఆకును కాల్చివేస్తుంటారు. చెరకు ఆకులో 0.23 శాతం నత్రజని, 0.55 శాతం ఫాస్పరస్, 0.52 శాతం పొటాష్ పోషకాలు ఉన్నాయి. చెరకు ఆకును కుళ్ళబెట్టేందుకు పుణెలోని వసంత్ దాదా చెరకు పరిశోధన సంస్థ, కోయంబత్తూరులోని చెరకు పరిశోధనా సంస్థ ఒక శిలీంధ్రం (బాక్టీరియా) రూపొందించాయి. 1.25కిలో బాక్టీరియా, ఎనిమిది కిలోల యూరియా, 10కిలోల సూపర్ ఫాస్ఫేటును కలిపి చెరకు ఆకును కుళ్ళబెట్టినప్పుడు భూసారం పెరగడమే

కాకుండా మొక్క తోటలో 5.0 టన్నులు, పిలక తోటలో 3.0 టన్నుల అదనపు దిగుబడి లభించింది. చెరకు ఆకును తగలబెట్టకుండా భూమిలో కలపడం చాలా ఉపయోగకరమని వ్యవసాయ శాస్త్రవేత్తలు, చక్కెర కర్మాగారాల విస్తరణ విభాగంలో పనిచేసే సిబ్బంది సైతం చెబుతుంటారు. కానీ, చెరకు ఆకును ముక్కలుగా చేసే పరికరం ఇప్పటికీ రాకపోవడం దురదృష్టకరం.

పత్తి, గోధుమ తదితర పంటల అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలిపితే భూతాపానికి దారితీసే కాలుష్యం తగ్గుతుంది. పశువుల జీర్ణకోశ వ్యవస్థ నుంచి మీథేన్ వాయువు వెలువడుతుంటుంది. సరైన పశుగ్రాస రకాలను రూపొందించి వినియోగించడం ద్వారా దానిని అరికట్టడానికి వీలవుతుంది. మాగాణుల్లో వరి సాగు వల్ల మన దేశంలో పెద్ద మొత్తంలో మీథేన్ వాయువు వెలుపడుతోంది. ప్రపంచం మొత్తం మీద వరిసాగు వల్ల ఒక టెరాగ్రామ్ మీథేన్ వాయువు విడుదల అవుతుంటే, మన దేశంలో వరిసాగు వల్ల విడుదల అవుతున్న మీథేన్ వాయువు 2.4 నుంచి 6.9 టెరాగ్రాములుగా ఉన్నట్లు అంచనా.

వరిసాగులో సాంప్రదాయంగా నీరు నిల్వ ఉంచే పద్ధతి కాకుండా శ్రీవరి సాగు పద్ధతిని అవలంబిస్తే మీథేన్ వాయువు విడుదల తగ్గుతుంది. రానున్న కాలంలో అనేక కారణాల వల్ల సాగునీటి లభ్యత తగ్గిపోయే ప్రమాదం ఉంది. తాగే నీటికీ ఎద్దడి ఏర్పడవచ్చు. ఈ దృష్ట్యా శ్రీవరిసాగును పెద్దయెత్తున చేపట్టవలసిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందుకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాల్సి ఉంది.

సస్యవిప్లవం దరిమిలా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం బాగా పెరిగిపోయింది. 1999-2000లో రూ. 13,200 కోట్లుగా ఉన్న ఎరువుల సబ్సిడీ కిందటి సంవత్సరం లక్ష కోట్ల రూపాయలను దాటిపోయింది. రైతులు అవసరానికి మించి ఎరువులు వాడుతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి కలుపు మందులను కూడా వాడుతున్నారు. పంజాబ్‌లో నీటి వినియోగంలో సరైన జాగ్రత్తలు తీసుకొనకపోవడంతో లక్షలాది ఎకరాల పంట భూములు నిస్సారంగా మారాయి.

## తరణోపాయాలు...

థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, మోటరు వాహనాలు, ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లతో పాటు వ్యవసాయ రంగం నుంచి కూడా గ్రీన్‌హౌస్ వాయువుల

ఉద్గారాలను తగ్గిస్తే తప్ప భూతాపం తగ్గే పరిస్థితిలేదు. సుస్థిర వ్యవసాయ పద్ధతులే లక్ష్యసాధనకు దోహదపడతాయి. చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులపాలు కాకుండా ఉండేందుకు పర్యావరణ అనుకూల చర్యలు చేపట్టవలసి ఉంటుంది. వరిగడ్డి, చెరకు, గోధుమ, పత్తి తదితర పంటల అవశేషాలను తగలబెట్టడం మాని, భూమికి చేర్చాలి. రసాయనిక ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించి పశువుల ఎరువు, వర్మి కంపోస్టులను వాడాలి. పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ, జనుము, గ్లైరిసేడియా, కానుగ వంటి పైర్లను పెంచాలి. అంతర పంటల పద్ధతులను పాటించాలి. ఇలాంటి చర్యలవల్ల వాతావరణంలోని బొగ్గు పులుసు వాయువు భూమిలోనికి చేరుతుంది. భూమిలో సేంద్రియ కర్బనం స్థాయి పెరుగుతుంది. ఆకుపెంట అభివృద్ధి చెంది, భూసారం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతాయి. దాంతో దిగుబడులు హెచ్చుతాయి. అదే సమయంలో దేశీయ పశు సంపదను వృద్ధిచేసుకోవలసి ఉంటుంది. విస్తృత ప్రచారం చేపట్టి, ప్రజలకు ఈ కార్యక్రమానికి సంబంధించి అవగాహన కలిగించాలి. గ్రామపంచాయతీలతోపాటు స్వచ్ఛంద సంస్థల్ని, ప్రజల్ని, ముఖ్యంగా రైతుల్ని భాగస్వాములను చేయాలి. ఆయా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను బట్టి పంటలు-పశుగణాల మధ్య సమన్వయంతో కూడిన పద్ధతులు అనుసరించాలి. ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులు, వాతావరణాల నాణ్యతను పరిరక్షించాలి. వ్యవసాయ వృత్తి ఆర్థికంగా గిట్టుబాటు అయ్యేలా చూడాలి. సమాజం మొత్తం, ముఖ్యంగా రైతులు మెరుగైన జీవనం గడిపేందుకు తగిన చర్యలు ప్రభుత్వం తక్షణం చేపట్టాలి. అపాయం నుంచి గట్టెక్కించే ఉపాయం ఇదొక్కటే!

*ది. 11-10-2009.*

*- ఈనాడు*

●

# జీవనాధారమైన భూమాతను పరిరక్షించుకోవద్దా?

ప్రస్తుతం మనదేశంలోని 82 కోట్ల మంది ప్రజలలో 37 శాతం దారిద్ర్య రేఖకు దిగువన వున్నారు. ఏటా రెండు శాతం చొప్పున పెరుగుతూ ఈ శతాబ్ది అంతానికి అంటే క్రీస్తుశకం 2000 నాటికి 150 కోట్ల ప్రజలతో భారతదేశం జనాభా సంఖ్య విషయంలో చైనాను అధిగమించుతుంది! దాదాపు 170 కోట్లకు చేరే వరకు మన జనాభా పెరుగుదల ఆగకపోవచ్చునని నిపుణులు పేర్కొంటున్నారు. తలసరి ఆదాయం విషయంలో మనం 126 ప్రపంచ దేశాలలో 115 స్థానంలో వున్నాం!!

మన జనాభాలో చాలా మంది పేదవారు వారికి కావలసినంత ఆహార పదార్థాలు కొనుక్కోగల స్తోమతు లేనందున, ప్రస్తుతం పండించుతున్న ఆహారధాన్యాలు సరిపోతున్నాయి.

మనదేశం ఆహార ధాన్యాల ఉత్పత్తి విషయంలో స్వయం సమృద్ధి సాధించిందనే అభిప్రాయం చాలా మందిలో వుంది. అది సరికాదు. దాదాపుగా మూడు దశాబ్దాలుగా మనదేశంలో తలసరి ఆహార ధాన్యాల లభ్యత పెద్దగా పెరగలేదు. మన ప్రక్కనే చైనాలో 100 మిలియన్ హెక్టార్ల పంట విస్తీర్ణం నుంచి 360 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు పండిస్తూవుంటే మనదేశంలో 150 మిలియన్ల హెక్టార్ల భూమి నుండి కేవలం 175 మిలియన్ల టన్నుల ఆహార ధాన్యాలు పండించబడుతున్నాయి. ఫలితంగా మనదేశంలో సగటున తలకు 200 కిలోల ఆహార ధాన్యాలు లభిస్తుంటే, చైనాలో 330 కిలోలు సంవత్సరానికి లభిస్తున్నాయి.

మన జనాభాలో నాలుగింట మూడు వంతుల మందికి భూమియే జీవనాధారంగా వుంది. 1951లో తలసరిన 0.48 హెక్టారు భూమి లభ్యమవగా క్రీస్తుశకం 2000

సంవత్సరం వచ్చే సరికి తలసరిని కేవలం 0.14 హెక్టారు భూమి మాత్రమే వుంటుంది. కాబట్టి, ఇప్పటికే పలు విధాలుగా సారహీనమైన మన భూమిని ఇకనైనా మరింతగా పాడవకుండా రక్షించుకోవడం మన ముందున్న ముఖ్యమైన సమస్య.

నగరాలు, పట్టణాల క్రిందకాని, మంచుకొండల క్రింద వుండికాని వ్యవసాయానికి ఏ మాత్రం పనికిరాని విస్తీర్ణం పోగా, మన దేశంలో 264 మిలియన్ హెక్టార్లలో వ్యవసాయపు పంటలు పండించడానికి కాని, లేక మొక్కలు పెరగడానికి కాని అనుకూలంగా వుంటుందని లెక్కలు చెబుతున్నాయి. ఇందులో సుమారు 153 మిలియన్ల హెక్టార్ల భూమి నీటికోత వల్లకాని, వరదలవల్ల కాని కొద్దిగా నుంచి హెచ్చు స్థాయి వరకు దెబ్బతిన్నది. నీరు ఎక్కువై ములక ఏర్పడి, దానితో పాటు ఉప్పు వురకడంవల్ల సుమారు 13 మిలియన్ల హెక్టార్ల భూమి దెబ్బతిన్నది. నదులవల్ల, ఇతర కారణాలవల్ల ఇంకా 9 మిలియన్ల హెక్టార్ల భూమి దెబ్బతిన్నది.

ఇప్పటికి సుమారు 143 మిలియన్ల హెక్టార్లు భూమి మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించడబడుతుంది. మిగిలిన 121 మిలియన్ల హెక్టార్ల భూమిలో 40 మిలియన్ల హెక్టార్ల భూమి పంటలకు పెద్దగా ఉపయోగపడదు. మిగిలిన 81 మిలియన్ల హెక్టార్ల విస్తీర్ణంలో 67 మిలియన్ల హెక్టార్లు అటవీ భూమిగా వర్గీకరించబడి వుంది.

కాని, ఇందులో కేవలం 25 మిలియన్ల హెక్టార్ల భూమిలో మాత్రమే చెప్పుకోదగినంత వృక్ష సంపద వుంది. మిగతా 42 మిలియన్ల హెక్టార్ల అటవీ భూమిలో చెట్లు లేవు. కేవలం చిన్న చిన్న పొదలు, తుప్పలు మాత్రమే వున్నాయి. మూడు మిలియన్ల హెక్టార్లలో మామిడి, జామ, సపోటా, నిమ్మ, ద్రాక్ష, బత్తాయి, నారింజ వంటి పండ్ల తోటలు వున్నాయి. 11 మిలియన్ల హెక్టార్ల భూమి పచ్చికబీళ్ళుగా వుంది. ఇది చాలా అధికంగా పశువుల మేతకు గురైనందున, ఇందులో కొంత భూమి బీళ్ళుగా కూడా లేదు. గడ్డి పెరగడంలేదు.

కొద్దిగానో, హెచ్చుగానో దెబ్బతిన్న 175 మిలియన్ల హెక్టార్ల భూమిని మనం బాగు చేసుకోవడానికి చాలా తీవ్రంగా కృషి సల్పవలసి వుంది. అన్నిటికంటె హెచ్చు ప్రమాదం ఏమంటే ఏటా సుమారు 6000 మిలియన్ల టన్నుల భూమి పైపొర మన్నుకొట్టుకు పోతున్నది. వర్షాలవల్ల, గాలులవల్ల చెట్లు నరికివేయ బడడంవల్ల మన్ను కొట్టుకుపోయి రిజర్వాయర్లలో, డాములలో, నదీగర్భాలలో మేట వేస్తున్నదని అంచనాలు తెలుపుతున్నాయి.

దీని ఫలితంగా ఏటా సుమారు 30 నుంచి 50 మిలియన్ల టన్నుల ఆహార ధాన్యాలు పండవలసింది పండకుండా పోతున్నదని లెక్క వేయబడింది. అంటే సుమారు రూ. 6000 కోట్ల మేరకు పంట నష్టం వుంటుంది. ఇదికాక, టన్నుకు కేవలం పది రూపాయలు మాత్రమే మట్టికి విలువ కట్టినా, భూమి పైపొర మన్ను పోవడం వల్ల నష్టం మరొక రూ. 6000 కోట్లు వుంటుంది.

నీరు నిలవడం వలన, భూములు చవుడు పట్టడం వలన, భూములు దెబ్బతినడం వలన సుమారు రెండు వేల కోట్లు పంట నష్టం జరుగుతున్నది.

ప్రస్తుతం సుమారు 25 మిలియన్ హెక్టార్ల భూమికి ఇరిగేషను పథకాలు పెద్ద, మధ్య తరహా వాటి ద్వారా నీటిని సాగుకు అందించడం జరుగుతున్నది. సరైన మురుగు నీటి పారుదల సౌకర్యాలు ఏర్పరచబడకపోవడం, సాగుకు సకాలంలో నీరు అందించ లేకపోవడం వంటి కారణాలవల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి 4 నుంచి 5 టన్నులు వుండవలసింది కేవలం 1.7 టన్నులు హెక్టారు భూమిలో సగటున పండించబడుతున్నది. సుమారు ఆరు మిలియన్ హెక్టార్లకు నీరు అందించగల స్తోమత కల్పించబడి కూడా వుపయోగించుకోబడడం లేదు.

కాబట్టి, సాగు నీటి సౌకర్యమున్న ప్రాంతాలలో మురుగుపారుదల సౌకర్యాలు కల్పించాలి. సాగునీటి వినియోగంలో సామర్థ్యాన్ని పెంపొందించే కమాండ్ ఏరియా డెవలప్‌మెంటు ప్రోగ్రాంలను ఇతోధికంగా చేపట్టాలి. ఇరిగేషను సామర్థ్యం కల్పించబడిన భూమిని పూర్తిగా వినియోగించుకోవాలి. డ్రెయిన్లలో నీరు నిల్వ వుండనివ్వకుండా పంపివేయడానికి, చెరువులలో పూడికను తొలగించి కట్టలు బలపరచి ఎత్తు పెంచడానికి తగు చర్యలు తీసుకోవాలి.

మైనర్, ఇరిగేషను పథకాలను అధిక సంఖ్యలో చేపట్టాలి. భూమి లోపల నీటి స్థాయి తగ్గకుండా వుండేందుకుగాను నీటిని పొదుపు చేయడానికి, చెట్లు వాటడానికి వాటర్‌షెడ్ కార్యక్రమాలను వెంటనే అధికసంఖ్యలో చేపట్టాలి. భూగర్భజలాలు పుష్కలంగా లభించే ప్రాంతాలలో బోర్లు వేసి పంటల ఎకరా దిగుబడులను, ఉత్పత్తిని పెంచాలి. ఇప్పటికే భూగర్భ జలాలను మోతాదుకు మించి ఉపయోగిస్తూ వుంటే, అటువంటి ప్రాంతాలలో ఇక కొత్తగా బోర్లు వేయనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

వరదలవల్ల దెబ్బతినే భూములను పరిరక్షించడానికి ఇప్పటి వరకు ప్రభుత్వం చేస్తూ వచ్చిన ఆలోచనా విధానంలో మార్పు రావలసి వుంది. వరదలు వచ్చిన తదుపరి పునరావాస, సహాయ కార్యక్రమాలపై హెచ్చు విధులను ఖర్చు చేయడానికి బదులు వరదల నివారణకు హెచ్చు నిధులను కేటాయించి, తదనుగుణమైన పథకాలను చేపట్టవలసిన అవసరం వుంది. వాటర్‌షెడ్ కార్యక్రమాలను, మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధిక స్థాయిలో తీసుకోవడం ద్వారా ఇటువంటి భూములను పరిరక్షించవచ్చు.

ఇప్పటి వరకు అటవీ ప్రాంతాన్ని వర్గీకరించే విధానంలో కూడా మార్పు రావాలి. ప్రభుత్వం లెక్కల ప్రకారం అటవీ భూమిగా వున్న దానిలో బాగా చెట్లతో వున్న అటవీ ప్రాంతం, తక్కువగా చెట్లతో వున్న అటవీ ప్రాంతం, అసలు చెట్లే లేని లేక చెట్లు నరికి వేయబడ్డ అటవీ ప్రాంతంగాను స్పష్టంగా విడివిడిగా ప్రభుత్వానికి తెలియపరచే విధానం రావాలి. ఇప్పుడు చెట్లతో వున్న అటవీ విస్తీర్ణాన్ని జాగ్రత్తగా కాపాడుతూ, నరకివేయబడ్డ విస్తీర్ణంలో తిరిగి అడవులను పెంచడానికి మొక్కలు అధిక సంఖ్యలో నాటాలి. ఏటా అయిదు మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో అడవులను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కలప వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించి ప్రత్యామ్నాయ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించవచ్చు. అడవులను పెంచే కార్యక్రమంలో కేవలం ఫారెస్టు డిపార్టుమెంటు సూచించే రకాలే కాక, ప్రజలకు ఎక్కువ ఆసక్తి వుండే మామిడి వంటి ఫల వృక్షాలను కూడా నాటేందుకు వీలు కల్పించినప్పుడు ప్రజలు కూడా ఈ పథకాల అమలులో భాగస్వాములై, ఎక్కువగా ఈ ప్రయత్నాలు ఫలప్రదమౌతాయి.

నగరాలు, పట్టణాలు విస్తరిస్తున్నాయి. చాలా సందర్భాలలో సారవంతమైన భూములు పట్టణాభివృద్ధికోసం తీసుకోబడుతున్నాయి. భూమి విస్తీర్ణం పెరిగేది కాదు. కాబట్టి, సారవంతమైన భూములను కాకుండా తక్కువ సారవంతమైన భూములను మాత్రమే వ్యవసాయేతర అవసరాలకు వినియోగించబడేట్టు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

పారిశ్రామిక రంగంలో ఒక పరిశ్రమ మూతబడే పరిస్థితి వస్తే, అది ప్రభుత్వంలో అత్యున్నత స్థానాలలో వుండే వారి దృష్టిని కూడా ఆకర్షించగలుగుతుంది. పత్రికలలో సంచలనాత్మకంగా ఆందోళన పూరితంగా వార్తలు ప్రచురించబడుతాయి. పార్లమెంటు,

శాసనసభలలో తీవ్రమైన చర్చలు జరుగుతాయి. వివిధ కార్మిక సంఘాలు పోటా పోటీగా ఆ సమస్యను చేపట్టుతాయి.

కాని, దురదృష్టకరమైన విషయం ఏమంటే, ఎవరైతే భూమిపైనే జీవనాధారంగా మనుగడ సాగిస్తున్నారో వారికీ ఆ భూదేవికీ జరుగుతున్న అనర్థాలు, వాటి వలన ప్రస్తుతం, భవిష్యత్‌లో చేకూరమన్న దురవస్థల గురించే తెలియని పరిస్థితి వుంది.

ఇప్పటికైనా మనదేశంలో ప్రకృతి ప్రసాదించిన రెండు ముఖ్యమైన వనరులు "భూమి–నీరు." సక్రమంగా వినియోగించుకోగలిగినప్పుడే దేశం సస్యశ్యామలమౌతుంది. ప్రజలలో పేదరికం తొలగుతుంది.

*- ఆంధ్రజ్యోతి*

●

# ఎరువుల ధర పెంపు సమర్థనీయమా?

ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ సమర్పించిన బడ్జెట్‌లో ఎరువులపైన సబ్సిడీని ఉపసంహరించి ఎరువుల ధరలను నలభై శాతం మేరకు పెంచినందుకు రైతాంగం తీవ్ర ఆందోళనకు గురయింది. దేశంలో పలు ప్రాంతాలలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున రైతులు తమ తీవ్ర నిరసన తెలియపర్చారు. కొన్ని చోట్ల కొందరు రైతులు అసువులు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. పార్లమెంట్ లోపల, వెలువల ఈ సమస్యపై తీవ్రమైన స్థాయిలో చర్చలు జరిగాయి. తదుపరి బడ్జెట్‌పైన చర్చకు సమాధానం ఇచ్చే సందర్భంలో ఆర్థిక మంత్రి సన్నకారు, చిన్న రైతులను ఎరువుల ధరల పెంపునుంచి మినహాయించి మిగతా రైతులకు ముప్పది శాతం పెంపును ప్రకటించారు. ముందుగా ప్రకటించిన నలభై శాతం పెంపును పది శాతం మేరకు తగ్గించారు.

పంటల మద్దతు ధరలను పెంచడం ద్వారా రైతులను ఆదుకుంటామని వ్యవసాయ మంత్రి శ్రీ బలరామ్ జాకర్ పార్లమెంట్‌లో చెప్పారు. కాని, ఎరువుల ధర పెంచడం వల్ల పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని దృష్టిలో వుంచుకుని మద్దతు ధరను ప్రకటించడానికి సాహసించక పోవచ్చు. ఎందుకంటే వినియోగదారులపైన భారం పడుతుంది. కాబట్టి భారతదేశంలో ఉత్పత్తి అవుతున్న కొన్ని పంటలకు మద్దతు ధరలు లేవు. సేకరించదలచిన ఆహార ధాన్యముల మొత్తం ఉత్పత్తిలో పదవ వంతు మాత్రమే సన్నకారు, చిన్న రైతుల వద్ద తమ అవసరాలకు పోను మార్కెట్‌లో విక్రయించ కలిగినవి పెద్దగా వుండవు. కాబట్టి సేకరణ ధరలను పెంచడం ద్వారా రైతులపై ఎరువుల అధిక ధరల భారాన్ని సవరించడం సాధ్యం కాదు.

సన్నకారు, చిన్న రైతులు మినహా మిగిలిన వారంతా పెద్ద రైతులని పాలక పక్షం భావిస్తే అది పొరపాటు కాగలదు. మన దేశంలోని 9 కోట్ల 77 లక్షల కమతాలలో

ఒక హెక్టారుకన్నా తక్కువ భూమి కలిగిన వారు 5 కోట్ల 67 లక్షలు. అంటే సుమారు 58 శాతం వున్నారు. ఒకటి నుంచి రెండు హెక్టార్లు భూమి కలిగిన దిగువ మధ్య తరగతి రైతులు ఒక కోటి 32 లక్షలు అంటే 13.5 శాతం వున్నారు. రెండు నుంచి నాలుగు హెక్టార్ల భూమి కలిగిన వారు ఒకకోటి 78 లక్షలు అంటే 18 శాతం వున్నారు. నాలుగు నుంచి పది హెక్టార్లు భూమి కలిగిన మధ్య తరగతి రైతులు 79 లక్షల 20 వేలు అంటే 8 శాతం వున్నారు. పది హెక్టార్లు పైన భూమి కలిగిన రైతులు "పెద్ద" వారుగా భావించబడేవారు 19 లక్షల మంది అంటే కేవలం 2 శాతం వున్నారు. దేశంలోని 16 కోట్ల 39 లక్షల హెక్టార్లులో సన్నకారు రైతుల క్రింద 13.2 శాతం చిన్న రైతుల క్రింద 15.6 శాతం,దిగువ మధ్య తరగతి రైతుల క్రింద 22.3 శాతం, ఎగువ మధ్య తరగతి రైతుల క్రింద 28.7 శాతం, ఇతర (పెద్ద) రైతుల క్రింద 20 శాతం భూమి సాగులో వుంది. మన దేశంలో ఇప్పటికీ 68 శాతం సాగుభూమి వర్షాధారంగానే వున్న పరిస్థితులలో పది హెక్టార్ల మెట్ట భూమిలో ఎంత పాటి ఆదాయం వస్తుందో, సగటున వారి ఆర్థిక స్థితిగతులెలా వున్నాయి అనే సరైన అవగాహన లేనట్టుగా కనిపిస్తున్నది. ధాన్యం, గోధుమల వంటి పంటలు గణనీయంగా పెరిగిన దరిమిలా చూస్తే కూడా సగటు వ్యవసాయ రంగంలో వ్యక్తి ఆదాయం స్థిరమైన విలువలో 1970-71లో 445 రూపాయలు వుండగా 1988-89 వాటికి 420 రూపాయలకు తగ్గిపోయింది. కాని ఇదే సమయములో వ్యవసాయేతర రంగంలో సగటు తలసరి ఆదాయం 972 నుంచి 1784 రూపాయలకు పెరిగింది! అంటే రైతు కూలీ తలసరి నిజమైన ఆదాయం 5 శాతం తగ్గి వ్యవసాయేతర రంగంలో సుమారు 83 శాతం పెరిగింది. 1970-71లో కొంత ధాన్యంతో కొనగలిగిన వస్తువులను 1988-89లో కొనాలంటే ఎరువుల విషయంలో 80 శాతం, క్రిమి సంహారక మందుల విషయంలో 40 శాతం, డీసెల్ 50 శాతం, వ్యవసాయ కార్మికుడు 60 శాతం మేరకు మాత్రమే లభ్యమైనాయి.

మనం వ్యవసాయ రంగానికి అవసరమైన నిధులు సమకూర్చి వ్యవసాయదారులకు సకాలంలో పరపతి సౌకర్యం, నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని పురుగు మందులు, ఎరువులు అందజేసి, సరైన ధరలు లభింపజేసి మార్కెట్ సదుపాయాలు కల్పిస్తే ప్రపంచంలోనే అత్యంత బలమైన వ్యవసాయ శక్తి సంపన్నమైన దేశంగా భారతదేశం

రూపొందుటకు తగు అవకాశాలు వున్నాయి. కాని ప్రస్తుతం ప్రభుత్వం ఎరువుల ధరను విపరీతంగా పెంచివేసినందున ఉత్పత్తి తగ్గే ప్రమాదమున్నది. డాక్టర్ జి.వి.కె.రావు అధ్యక్షతన ఎరువుల వినిమయ ధరల కమిటీ పరిశీలనలో గతంలో ఎరువుల ధరలు పెరిగితే వాటి వాడకం తగ్గిందని తేలింది. ఎరువుల ధర నిలకడగా వుండగా వాడకం బాగా పెరుగుతూ వచ్చిందని తేలింది. అంతర్జాతీయ విపణిలో కన్నా మన వస్తువులు పోటీ చేయగల పరిస్థితి వుండాలంటే ఈ చర్య అవసరమని ఆ కమిటీ అభిప్రాయపడింది. రైతులలో సన్నకారు వారికి ఒక ధర, మిగిలిన వారికి వేరొక ధరకు అమ్మడం ద్వారా సబ్సిడీని తగ్గించవచ్చునా అనే అంశాన్ని ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ద్వంద్వ ధరల విధానం ఆచరణలో సాధ్యం కాదని, అనేక అవకతవకలకు దారి తీస్తుందని కాబట్టి రైతులందరికీ ఒకే ధరకు ఎరువులు అమ్మాలని జి.వి.కె.రావు కమిటీ సూచించింది. వరుసగా మూడు సంవత్సరాలలో ఎరువుల వినియోగం 30 శాతం అధికంగా పెరిగి వుంటే ఎరువుల ధరలను 5 నుంచి 7 శాతం వరకు పెంచవచ్చని సిఫారసు చేసింది. కాని ఇప్పుడు ప్రభుత్వం ఒక్కసారిగా 30 శాతానికి ఎరువుల ధరలను పెంచి వేసింది!!

1979-80లో 577 కోట్ల రూపాయిలుగా వున్న సబ్సిడీ 1989-90 నాటికి 3650 కోట్ల రూపాయిలకు పెరిగింది. ఎరువుల తయారీకి వలయు ముడి వస్తువుల ధరలు, వగైరా పెరగడం వల్ల సబ్సిడీ భారం ఎక్కువైనది. అలాగే ఇటీవల కాలంలో ఇతర దేశాల నుంచి తక్కువ ఖర్చుతో నెలకొల్పుతామని వచ్చిన ప్రతి పాదవలను తిరస్కరించి, దాదాపు రెంట్టింపు వ్యయంతో కూడిన ఇటాలియన్ టెక్నాలజీతో కూడిన 'శ్నాం ప్రొగెట్టి' పథకాలను చేపట్టడం వల్ల వీటిలో ఉత్పత్తి అయ్యే ఎరువుల తయారీ ధరలు చాలా ఎక్కువగా వుంటున్నాయి. అందువల్ల వీటిపైన సబ్సిడీని చాలా అధికంగా భరించవలసి వస్తున్నది. అంతేకాక ఈ టెక్నాలజీలో వున్న లోపం వల్ల హెచ్చు పరిమాణంలో సహజ వాయువు వృధాగా పోతుంది. ఉదాహరణకు హజీరా, విజయపూర్, ఆవోలా ప్లాంట్లలో తయారవుతున్న యూరియా ధర టన్నుకు 3983 రూపాయిలు అవుతుండగా ప్రభుత్వం ప్రతి టన్నుకు 1750 రూపాయలు సబ్సిడీ ఇస్తున్నది. ఎరువుల సబ్సిడీలో దాదాపు 65 శాతం ఎరువుల ఉత్పత్తిదారుల అసమర్థ నిర్వహణకు, వారికి పన్నులు పోమా 12 శాతం నికర లాభం ముట్టచెప్పేదాని క్రింద,

రవాణా ఛార్జీల క్రింద జమ అవుతుండగా మిగతా మేరకు మాత్రమే రైతుకు సబ్సిడీగా భావించవలసి వుంటుంది. చాలా ఫ్యాక్టరీలు తమ పెట్టుబడి విలువను ఎక్కువ చేసి చూపి చాలా ఎక్కువగా ప్రభుత్వం మంచి సబ్సిడీని గుంజుతున్నాయి. ఆర్థిక మంత్రి వీరికి ఇస్తున్న రాయితీలు కాని, పన్నులు పోనూ 12 శాతం నికర లాభం చెందజేసే విషయం గురించి భవిష్యత్తులో 'ఇవ్వము' అని చెప్పలేదు. అంటే రాబోయే కాలంలో కూడా ఈ ఎరువుల ఉత్పత్తిదారుల లాభాలు మామూలుగానే వుంటాయి. కాని, ప్రభుత్వానికి బదులుగా రైతులు 30 శాతం ఎక్కువ ధరలకు ఎరువులను కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని కొంత మోయవలసి వుంటుంది. ప్రభుత్వ స్థాయిలో తప్పుడు నిర్ణయాల వల్ల అమాయకులైన మధ్యతరగతి రైతాంగం నష్టపోవలసి వస్తున్నది. ఈ చర్య మన దేశ ప్రయోజనాలకు కూడా భంగం కలుగచేస్తుంది.

వ్యవసాయోత్పత్తిని పెంచడంలో అతి ముఖ్యమైన అంశాలు ఎరువులు, నీరు. మన జనాభా పెరుగుతున్నది. 1994-95 నాటికి 205 మిలియన్ల టన్నుల ఆహార ధాన్యాలను మనం పండించుకోగలగాలంటే మనం ప్రస్తుతం వాడుతున్న 117 లక్షల టన్నుల నుంచి 175 లక్షల టన్నుల ఎరువులను వినియోగించ గల స్థితికి చేరాలి.

వ్యవసాయాభివృద్ధిలో మరో కీలకాంశమైన సాగునీరు సమకూర్చడంలో కూడా చాలా నిర్లక్ష్యం జరుగుతున్నది. స్వాతంత్ర్యానంతరం చేపట్టిన 246 పెద్ద ఇరిగేషను ప్రాజెక్టులలో ఇప్పటికి 65 మాత్రమే పూర్తయినాయి. అయితే నిధుల కొరత, పాలనా సంబంధమైన లోటుపాట్ల వల్ల డామ్‌లు కట్టి నిల్వచేసి, వుపయోగ పరచుకోగల నీటిలో ఇంకా 25 శాతాన్ని ఉపయోగించుకోక వృధాగా పోనిస్తున్నాము. ఇట్లా అదనంగా 60 లక్షల హెక్టార్ల భూమికి నీటి వసతి కల్పించవచ్చు. మేజరు, మీడియం ఇరిగేషను ప్రాజెక్టుల క్రింద సాగునీటి వసతి కల్పించాలంటే సగటున హెక్టారుకు 35 వేల రూపాయలు పైన అవుతుంది. మైనర్ ఇరిగేషను పథకాల క్రింద హెక్టారుకు 7,300 రూపాయిలు ఖర్చు అవుతుంది. కావున మైనరు పథకాలను, భూమి క్రింద నుంచి నీటిని పైకి తీసి వినియోగించు పథకాలను హెచ్చు స్థాయిలో చేపట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. కాని క్రమేపీ ఇరిగేషను రంగానికి కేటాయింపులు తగ్గినాయి. మొదటి ప్రణాళికలో 22 శాతం నుంచి ఏడవ ప్రణాళికలో 9.4 శాతానికి ఇరిగేషను కేటాయింపు తగ్గిపోయింది.


అదే విధంగా వ్యవసాయ రంగాన్ని కూడా చిన్న చూపు చూడడం జరిగింది. జాతీయ ఉత్పత్తిలో నూటికి 30 శాతం సమకూరుస్తున్న వ్యవసాయ రంగానికి 17 శాతం బ్యాంకు అప్పు లభిస్తుండగా జాతీయ ఆదాయంలో కేవలం 20 శాతం మాత్రమే ఇస్తున్న పారిశ్రామిక రంగానికి అందులోను మధ్య భారీ తరహా పరిశ్రమలకే 36 శాతం బ్యాంకు అప్పు లభిస్తున్న పరిస్థితి వుంది. అంతేకాక గ్రామీణ ప్రాంతాలలోని జాతీయ బ్యాంకుల ద్వారా డిపాజిట్ల రూపంలో సేకరించిన దానిలో నుంచి కొంత భాగాన్ని పట్టణ ప్రాంతాలకు, వ్యాపార పారిశ్రామిక రంగాలకు తరలించడం జరుగుతున్నది. ఈ విధంగా ప్రభుత్వ పక్షంగా పెట్టవలసినంత ఖర్చు పెట్టక రైతులు పండించిన వాటి ద్వారా వచ్చిన దానికన్నా ఎక్కువ మోతాదులో వ్యవసాయానికి, ఇతర అవసరాలకు కావలసిన వస్తువుల కొనుగోలుకు హెచ్చుగా చెల్లించవలసిన పరిస్థితుల వల్ల వ్యవసాయరంగం నిధుల లేమితో బాధపడుతున్నది. వేగంగా అభివృద్ధి చెందలేక పోతున్నది. బాధాకరమైన విషయం ఏమంటే ఇంత వరకు వ్యవసాయరంగాన్ని ఆధునీకరించి, సుసంపన్నం చేయాలంటే ఎంత పెట్టుబడి కావలసి వుంటుందనేది ప్లానింగు కమిషను కూడా ఇప్పటికీ మదింపు చేసిన దాఖలా లేదు.

ప్రభుత్వం ఇప్పటికైనా ఎరువుల ధర విషయంలో తన నిర్ణయాన్ని పునః పరిశీలించి పెంపుదలను పూర్తిగా తగ్గించడం మంచిది. ఆచరణలో సాధ్యమైనా, కాక పోయినా సన్నకారు రైతులకు, చిన్నరైతులకు ఒక ధర మిగిలినవారికి వేరే ధర అమలు చేస్తామంటే కనీసం జి.వి.కె.రావు కమిటీ సూచనలనైనా దృష్టిలో వుంచుకొని ఎరువుల ధరలను 30 శాతం కాక 5 నుంచి 7 శాతం మేరకు మాత్రమే పెంచడం ధర్మం.

– *ఆంధ్రజ్యోతి*

●

## 6 వ అధ్యాయం



# ఇరిగేషన్ రంగం

Blank Page

# 'నీటిపారుదల'కు నిర్లక్ష్యమే అవరోధం

అపార జలవనరులు అందుబాటులో వున్నా వాటిని సక్రమంగా వినియోగించుకోకపోవడంవల్లనే దేశాభివృద్ధి కుంటుబడుతోంది. నీటిపారుదల పథకాలకు సమధిక ప్రాధాన్యమిచ్చి – బీళ్లుగా మారిన భూములకు కాల్వల ద్వారా నీరందిస్తే – రతనాల పంటలు పండటమే కాదు, ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయి. వ్యవసాయాధార పరిశ్రమలు అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలూ పెంపొందుతాయి. కృష్ణా, గోదావరి బ్యారేజిల నిర్మాణం దరిమిలా ఆయా ప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధి సాధించడమే ఇందుకు ప్రజల నిదర్శనం. దీన్ని లక్ష్యపెట్టక – పారిశ్రామిక ప్రగతి కోసమంటూ ఇన్నేళ్ళుగా ప్రభుత్వాలు పాకులాడుతుండటంతో – భారతదేశం రెంటికీ చెడిన రేవడి అయింది. ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన నీటిపారుదల రంగం అవసరాల పట్ల ఇకనైనా నిర్దుష్ట దృక్పథంతో స్పందించడం, నిధుల కొరత సాకును పక్కకునెట్టి ప్రాధాన్యక్రమంలో ప్రాజెక్టులన్నింటినీ సత్వరం పూర్తి చెయ్యడం – దేశప్రయోజనాల దృష్ట్యా అత్యవసరం.

భారతదేశ ఆర్థికానికి వ్యవసాయరంగమే పట్టుగొమ్మ. కీలకమైన ఈ రంగాన్ని ఆలక్ష్యం చేసి, 'పారిశ్రామిక ప్రగతి' కోసం పాలకులు వెంపర్లాడుతుండటంతో – ఇండియా 'రెంటికీ చెడిన రేవడి' అయింది. స్వాతంత్ర్యానంతరం నాలుగు న్నర దశాబ్దాల కాలంలో నేతలు ఒకవంక వ్యవసాయంపై ప్రేమ ఒలకపోస్తూనే, ప్రణాళికా కేటాయింపుల దగ్గరకొచ్చేసరికి పరిశ్రమలనే నెత్తిన పెట్టుకొన్నారు. ఒక్క మొదటి పంచవర్ష ప్రణాళికలోనే – వ్యవసాయానికి ప్రభుత్వ సాయం తగినంతగా అందింది. తర్వాత్తర్వాత ఈ రంగానికి తొంటిచెయ్యి చూపడం పరిపాటి అయింది ఎకరా దిగుబడులను, తద్వారా మొత్తం వ్యవసాయోత్పత్తులను పెంచడంలో ఎంతగానో ఉపకరించే నీటిపారుదల రంగం ఏలికల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోయింది. ప్రపంచంలోని అనేక దేశాల్లోకన్నా – సాగుకు

లాయకీ అయిన భూవిస్తీర్ణం, నీటవనరులు దేశంలో పుష్కలంగా వున్నాయి. రాజకీయ సంకల్పం ఒక్కటీ కొరవడటంతో - రాజనాలు పండించాల్సిన నేలలు బీడు భూములై రైతుకంట నీరు తెప్పిస్తున్నాయి. 'అంగట్లో అన్నీ ఉన్నా...' వేల కోట్ల రూపాయలు వెచ్చించి విదేశాల నుంచి గోధుమలు దిగుమతి చేసుకోవాల్సి వచ్చిన నేటి దురవస్థకు కారణమేమిటో పరిశీలించడం అవసరం.

## ఊరించే అంచనాలు

భారతదేశ విస్తీర్ణం 32 కోట్ల 70 లక్షల హెక్టార్లు కాగా, అందులో 51 శాతం, అంటే 16 కోట్ల 55 లక్షల హెక్టార్లు సేద్యానికి అనువైనది. భారీ మధ్యతరహా నీటివనరుల ద్వారా అయిదు కోట్ల 85 లక్షల హెక్టార్లకు, భూగర్భజల వినియోగం ద్వారా నాలుగు కోట్ల హెక్టార్లకు, చెరువుల వంటి మైనర్ ఇరిగేషన్, ఉపరితల చిన్న నీటి పథకాల ద్వారా కోటి యాభై లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి వసతి కల్పించగల అవకాశం ఉందని అంచనా. కేంద్ర భూగర్భ జల సంస్థ తాజా అంచనాల ప్రకారం ఎనిమిది కోట్ల హెక్టార్ల భూమికి భూగర్భజల వనరులనుపయోగించి సాగునీటి సౌకర్యం అందించగల వీలుంది. ప్రాజెక్టులు నిర్మించి ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలించడం ద్వారా మరో రెండు కోట్ల యాభై లక్షల హెక్టార్ల భూమికి నీరందించే వీలుందని అంచనా అంటే మొత్తంమీద 17 కోట్ల ఎనభై లక్షల హెక్టార్ల భూమికి నీటి సౌకర్యం కల్పించవచ్చని తెలుస్తోంది. పంచవర్ష ప్రణాళికలు అమల్లోకి రాకముందు భారీ, మధ్యతరహా నీటిపారుదల పథకాల ద్వారా 97 లక్షల హెక్టార్లకు, మైనర్ ఇరిగేషన్ వనరుల ద్వారా కోటి 29 లక్షల హెక్టార్ల భూమికి నీటిపారుదల సౌలభ్యం ఉంది. అంటే మొత్తం రెండు కోట్ల 26 లక్షల హెక్టార్ల భూమికి 1951 పూర్వమే సాగునీటి వసతి ఉంది. ఆరో పంచవర్ష ప్రణాళికా కాలం చివరినాటికి రెండు కోట్ల మూడు లక్షల హెక్టార్ల భూమికి నీరందించగల సామర్థ్యాన్ని సృష్టించారు. ఇదేకాలంలో చిన్నతరహా నీటిపారుదల రంగంలో రెండు కోట్ల 46 లక్షల హెక్టార్ల 'ఇరిగేషన్ పొటెన్షియల్' కల్పించారు. జలవనరుల శాఖ పేర్కొన్న ఈ గణాంకాలకు వ్యవసాయశాఖవారి సమాచారానికి తేడా ఉంది ప్రతి ఏటా భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ సేకరించే భూవినియోగం వివరాల ప్రకారం 1951 నుంచి 1985 వరకు నికరంగా భారీ, మధ్యతరహా నీటిపారుదల పథకాల ద్వారా - సాగునీటి వసతి కల్పించిన భూవిస్తీర్ణం

75 లక్షల హెక్టార్ల నుంచి కోటి 54 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఏడో ప్రణాళిక కాలంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 43 లక్షల హెక్టార్లకు నీటి సరఫరా సామర్థ్యాన్ని, చిన్న పథకాల ద్వారా 86 లక్షల హెక్టార్లకు నీటివసతి కల్పించాలని లక్ష్యం నిర్దేశించారు. ఆచరణలోకి వచ్చేసరికి మేజర్, మీడియం పథకాల ద్వారా 30 లక్షల ఎకరాలకు, మైనర్ పథకాల ద్వారా 84 లక్షల హెక్టార్ల భూమికి 'ఇరిగేషన్ పొటెన్షియల్' కల్పించినట్లు ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి. అంటే 1990 నాటికి, భారీ, మధ్యతరహా పథకాల ద్వారా మూడు కోట్ల 30 లక్షల హెక్టార్లకు నీటిపారుదల సామర్థ్యం కల్పించారు. నీటిని నిల్వచేయడానికి డ్యామ్‌లు, రిజర్వాయర్లు నిర్మించినా - ఆ నీటిని పంటపొలాలకు అందిచడానికి అవసరమైన కాల్వల నిర్మాణం పూర్తికానందున 60 లక్షల హెక్టార్ల భూమి సాగునీటికి నోచుకోవడం లేదు. 1951 లగాయతూ 1985 వరకు మొత్తం 246 భారీ ప్రాజెక్టుల్ని, 1059 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టారు. 1985 నాటికి 65 భారీ ప్రాజెక్టులు, 626 ధ్యతరహా ప్రాజెక్టులు మాత్రమే పూర్తయ్యాయి. ఏడో ప్రణాళిక కాలంలో కొత్తగా 18 భారీ, 29 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. నిధుల కేటాయింపులు సక్రమంగా జరగకపోవడంతో ఈ పథకాలన్నీ ఏళ్లతరబడి నత్తనడక నడుస్తున్నాయి. 1955లో ప్రారంభమైన నాగార్జునసాగర్ నేటికీ పూర్తికాలేదు. కృష్ణాజిల్లాలోనే. 89 వేల ఎకరాలకు నీరందించడానికి ఉద్దేశించిన కాల్వల తవ్వకం పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. 20 కోట్ల రూపాయల వ్యయంతో ఈ పనులు పూర్తిచేయవచ్చు. సాగర్ ప్రాజెక్టుపై ఇంతవరకు 701 కోట్లు ఖర్చు చేయగా ఇంకా 77 కోట్లు అవసరమవుతాయి. అదేవిధంగా 1963లో ప్రారంభమైన పోచంపాడు ప్రాజెక్టు మొదటిదశ కూడా ఇంకా పూర్తికాలేదు. గత మార్చినాటికి ఈ ప్రాజెక్టుపై రూ. 664 కోట్ల ఖర్చు కాగా, ఇంకా 363 కోట్లు వెచ్చిస్తేనే గాని పనులు ఒక కొలిక్కి రావు. శ్రీశైలం కుడికాల్వకు ఇప్పటికి అయిక ఖర్చు రూ. 104 కోట్లు కాక ఇంకా 440 కోట్లు అవసరమవుతాయి. ఎడమకాల్వకు మరి రూ. 420 కోట్లు కావాలి. గత మార్చి ఆఖరునాటికి తెలుగుగంగపై పెట్టిన ఖర్చు రూ. 411 కోట్లు కాగా, ఇంకా రూ. 689 కోట్ల వ్యయం చేయాల్సి ఉంది. ఈ విధంగా ఇప్పటికి రాష్ట్రంలో నిర్మాణంలో వున్న భారీ నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తికావాలంటే - ప్రస్తుత అంచనాలను బట్టి ఇంకా రూ. 2975 కోట్లు అవసరమవుతాయి. అదేవిధంగా 19 మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తవడానికి

రూ. 250 కోట్లు కావాలి. అంటే మొత్తంమీద రూ. 3225 కోట్లు ఖర్చుచేస్తేగాని ఇప్పటికి నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా పథకాలు పూర్తికావన్నమాట. ఇది కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైన దురవస్థకాదు. బీహార్‌లోని గండక్, కోసీ ప్రాజెక్టులు, కర్నాటకలోని మాలప్రభ, మధ్యప్రదేశ్‌లో తవా, రాజస్థాన్‌లో ఇందిరాగాంధీ కాల్వ పథకం, పశ్చిమబెంగాల్ కంగ్సబాతీ ప్రాజెక్టులు నిధుల లేమితో అంగలారుస్తున్నాయి.

## పరిశ్రమలకే పెద్దపీట

భారత రాజ్యాంగం ప్రకారం నీటిపారుదల అంశం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనిది. ఏడో షెడ్యూలులోని 17 అంశంలో - నీటి సరఫరా, సాగునీటి వనరులు, కాల్వలు, డ్రైనేజి, సదుల కట్టలు, నీటిని నిల్వచేయడం వంటివి రాష్ట్ర ప్రభుత్వాల జాబితాలో పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా - అవసరమని భావించినప్పుడు పార్లమెంటు సూచనల మేరకు 'అంతర్ రాష్ట్ర నదీ నదాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ' చేసే అంశం మాత్రమే కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఉంది. ఈ కారణంగా - ఒక్క బాక్రానంగల్ ప్రాజెక్టు విషయంలో తప్ప, కేంద్రం రాష్ట్రాల నీటిపారుదల రంగాల పట్ల చూపదంలేదు. ప్రణాళిక కేటాయింపులో పారిశ్రామికరంగానికే పెద్దపీట వేశారు. రెండో పంచవర్ష ప్రణాళిక నుంచి ఇప్పుడు నడుస్తున్న ఎనిమిదో ప్రణాళిక వరకు ఇదే విధానం కొనసాగుతోంది. మొదటి పంచవర్ష ప్రణాళికలో ఇరిగేషన్‌కు, వరదల నిరోధానికి 22.2 శాతం ఖర్చు చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు 14.8 శాతం, గ్రామీణ చిన్న పరిశ్రమలకు 2.1 శాతం, ఇతర పరిశ్రమలు, గనులకు 2.8 శాతం ఖర్చుచేశారు. రెండో ప్రణాళికలో పరిశ్రమలు - గనులకు మొత్తం ప్రణాళిక కేటాయింపులో 20.1 శాతం కట్టబెట్టారు. నీటిపారుదల రంగానికి 9.2 శాతం వ్యవసాయ, సంబంధ విషయాలకు 11.7 శాతం కేటాయింపులు తగ్గాయి. మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు పంచవర్ష ప్రణాళికల్లో ఇరిగేషన్ రంగానికి వరుసగా 7.8, 8.6, 9.8, 10.0, 9.4 శాతం మేరకు మాత్రమే నిధులు ఖర్చు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎనిమిదో ప్రణాళిక మొత్తం పెట్టుబడి 4,34,100 కోట్లు కాగా, అందులో జరిగేషన్‌కు కేంద్రం పద్దులో 1500 కోట్ల రూపాయలు, రాష్ట్ర పద్దులో 30,945 కోట్లు - వెరశి 32,525 కోట్లు కేటాయించారు. ఇది మొత్తం ప్రణాళికా

పెట్టుబడిలో ఏడున్నర శాతమే! ఈ విధమైన సవతితల్లి ప్రేమ కారణంగానే - వ్యవసాయరంగం చతికిల పడుతోంది. భారతదేశంలో ఇప్పటికీ 75 శాతం మంది పల్లెవాసులే! 60 శాతం మంది నేల తల్లినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వీరి ఆర్థికస్థోమత మెరుగుపడనిదే దేశంలో పారిశ్రామిక ప్రగతి ప్రభుత్వం ఆశించిన రీతిగా జరగదని పాలకులు ఇప్పటికీ గ్రహించడంలేదు. కనుకనే వ్యవసాయ-నీటిపారుదల రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. 1951 నుంచి 1985 వరకు భారీ, మధ్యతరహా నీటిపారుదల మీద 15 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అదే ఏడో ప్రణాళికలో పారిశ్రామికరంగంపై రూ 8865 కోట్లు ఖర్చు చేశారు. ఒక్క విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ మీదనే దాదాపు తొమ్మిది వేల కోట్ల రూపాయలు ఖర్చు అయింది. ఇంకా మరో 1200 కోట్లు అవసరమవుతుంది. లక్షల కోట్ల రూపాయల వ్యయమైన ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కూడా అంతంత మాత్రంగానే ఉండటం గమనించగలం. ప్రభుత్వరంగ పరిశ్రమల్లో కోటి 90 లక్షలమంది, ప్రైవేటురంగంలో 79 లక్షలమంది మాత్రమే పనిచేస్తున్నారు. అంటే సంఘటిత రంగంలో లక్షల కోట్లు వెచ్చించినా - కేవలం రెండు కోట్ల 69 లక్షల మందికి మాత్రమే ఉపాధి లభించింది. కానీ మొత్తం దేశ జనాభాలో 60 శాతం ప్రజల జీవనసరళిలో గణనీయ మార్పు తీసుకురావడానికి దోహదం చేయగల నీటిపారుదల రంగానికి ఇప్పటివరకు కేవలం - మేజర్, మీడియం పథకాల కింద 25,813 కోట్లు, చిన్నతరహా నీటిపారుదల పథకాలపైన ఆరువేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. దేశం వెనుకబడి ఉండటానికి ఇదొక ప్రధాన కారణం.

## కేంద్రం సహాయ నిరాకరణ

అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నీటిపారుదల పథకాలను త్వరితంగా పూర్తిచేయడానికి తగినన్ని విధులు సమకూర్చలేకపోతున్నాయి. దీంతో నిర్దేశిత లక్ష్యాలు సకాలంలో నెవేరకపోగా, ప్రాజెక్టు వ్యయం తడిసి మోపెడవుతోంది. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో భారీ మధ్యతరహా పథకాల ద్వారా ఒక హెక్టారుకు నీరందించడానికి కాగల ఖర్చు 1200 అయితే, ఏడో పంచవర్ష ప్రణాళిక కాలానికది 35 వేల రూపాయలకు పెరిగిపోయింది. నీటిపారుదల సామర్థ్యం కల్పించడం వరకే ఈ అంచనాలు. వాస్తవంగా పొలాలకు నీరు అందించడం వరకు అయ్యే మొత్తం ఖర్చును దృష్టిలో ఉంచుకుంటే,

ఈ వ్యయం ఇంకా పెరుగుతుంది. చిన్నతరహా నీటిపారుదల ద్వారా హెక్టారు భూమికి నీరందించడానికి, ఏడో ప్రణాళికా కాలంలో 7,330 రూపాయలు వ్యయమైనట్లు తెలుస్తోంది. అంటే మైనర్ ఇరిగేషన్ పథకాల ద్వారా అదే పెట్టుబడితో కనీసం ఆరు రెట్లు అధిక విస్తీర్ణానికి స్వల్ప వ్యవధితో నీటివసతి కల్పించే సౌలభ్యం ఉంది. కానీ ప్రభుత్వానికి సంకల్పమే కలగడంలేదు. దేశంలో వినియోగించుకోవడానికి అవకాశం ఉన్న 1140 క్యూబిక్ కిలోమీటర్ల నీటిలో ఇప్పటికీ 552 క్యూబిక్ కిలోమీటర్లు అంటే 48 శాతం మాత్రమే వాడుకుంటున్నా మని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి వి.సి.శుక్లా లోక్‌సభలో వెల్లడించారు. జలవనరులు పూర్తిగా ఎప్పటికి వినియోగంలోకి వస్తాయో, బీళ్లుగా పడివున్న భూములు ఎప్పటికి సస్యశ్యామలమవుతాయో... మంత్రి వర్యులు సెలవివ్వలేదు. 'అమ్మా పెట్టదు - అడుక్క తినానివ్వదు' అన్న చందంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంటే ఈ సమస్య అంత తొందరగా పరిష్కార మవుతుందనుకోలేము. తమ రాష్ట్రంలో చేపట్టిన నీటిపారుదల పథకాలను పూర్తిచేయడానికి రెండువేల కోట్ల రూపాయలు కావాల్సి ఉంటుందని, రెండు వేల సంవత్సరంలోగా, వీటిని పూర్తిచేయడానికి వీలుగా 'ఇరిగేషన్ బాండ్ల' రూపేణా రైతుల నుంచి డబ్బు సేకరించదలిచామని పేర్కొంటూ అందుకు అనుమతి అనుగ్రహించాల్సిందిగా మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని ఆర్థికశాఖ మంత్రి మన్ మోహన్‌సింగ్ తోసిపుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఇరిగేషన్ బాండ్లు' జారీచేస్తే తానందుకు హామీ ఉండలేనని చేతులెత్తేసిన కేంద్ర ప్రభుత్వం, దేశంలోని పారిశ్రామిక సంస్థలు విదేశాల నుంచి వాణిజ్యపరమైన రుణాలు తీసుకుంటే మాత్రం 'హామీ' ఇవ్వడానికి ముందుకు వస్తోంది.

## సుజలాం... సుఫలాం...

నూతన పారిశ్రామిక విధానమని, సరళీకృత ఆర్థిక విధానమనీ - ప్రభుత్వం క్రొంగొత్త మార్పులకు స్వాగతం పలుకుతోంది. ఈ సమయంలో కూడా వ్యవసాయ రంగాన్ని పట్టివుంచుతున్న సంకెళ్లను తొలగించడానికి ఎటువంటి చర్యలూ తీసుకుంటున్నట్లులేదు. ఇప్పటి పరిస్థితుల్లో మార్పు రావాలి. ప్రభుత్వమే తదనుగుణమైన చర్యలు తక్షణం తీసుకోవాలి. వ్యవసాయోత్పత్తులను ఇతోధికంగా పెంచడం నేటి అవసరం అందుకు నీటిపారుదల రంగంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కరవు కాటకాల పాలపడి కృశించిపోయిన నేలను 'సిరులు పొంగే జీవగడ్డ'గా మలచిన

సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని స్ఫూర్తిని ప్రభుత్వాలు అందిపుచ్చుకోవాలి. రాజమండ్రి దగ్గర గోదావరికి ఆనకట్టకట్టి, కాల్వలు తవ్వి, పంట పొలాలకు నీరందించడంతో వ్యవసాయ క్షేత్రాల్లో బంగారం పండుతోంది. నేడు అందుబాటులో ఉన్న యంత్రసామాగ్రి, రవాణా సదుపాయాలూ నాడూ లేకున్నా కేవలం నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే గోదావరి ఆనకట్ట పూర్తిచేశారు. అదేవిధంగా విజయవాడ వద్ద కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణాన్ని కాటన్ మహాశయుని సలహాతో కెప్టెన్ ఓ.ఆర్.ఆర్. నిర్వహించారు. ఈ రెండు ఆనకట్టల పుణ్యమా అని భారతదేశానికే ఆంధ్ర రాష్ట్రం అన్నపూర్ణ అయింది. వ్యవసాయాభివృద్ధి శరవేగంగా జరిగింది. రైతుల ఆదాయాలు పెరగడంతోపాటు, ప్రజల జీవనవిధానంలోనూ అనూహ్యమైన మార్పులు వచ్చాయి. నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించబట్టే – ఉభయగోదావరులు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు డెల్టా ప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధి చెందాయి. కళ్లకు కదుతున్న ఈ వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం ఇకనైనా గమనించాలి. నీటిపారుదల రంగం అవసరాలను తీర్చడం కొరకు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రమూ తోడ్పాటునందించాలి. ఆ విధమైన విధానవర మార్పులు వెంటనే తీసుకొచ్చి యావద్దేశం సుజలాలతో సుఫలమయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచెయ్యాలి.

*ది. 31-01-1993.* — *ఈనాడు*

●

# అవగాహన లోపంవల్ల పెరుగుతున్న కష్టాలు

సదవగాహన, సంయమనం లేకపోవడం వల్ల ఎంతో విలువైన సాగునీరు ఈనాటికీ వృథాగా సముద్రం పాలవుతోంది. మరోవైపు లక్షల ఎకరాల పంటపొలాలు బీడు భూములవుతున్నాయి. అందివచ్చే నీటిని సమర్థంగా, పొదుపుగా వినియోగించుకుని సత్ఫలితాలు రాబట్టడంలోనూ రైతులు విఫలమవుతుండడం విచారకరం. శాస్త్రీయ పరిశోధన ఫలితాలను, ఆధునిక పద్ధతులను తెలుసుకుని ఆచరించకపోవడం వల్ల మేలుకన్నా కీడే ఎక్కువగా జరుగుతోంది. ఎంత ఎక్కువ నీరు పెడితే అంత ఎక్కువగా దిగుబడి వస్తుందని భావించే చాలామంది రైతులు నష్టపోతున్నారు. ఎక్కువనీరు పెట్టడం వలన పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమికి ఉపయోగపడే పోషకాలు కూడా కొంతమేర వృథా అవుతున్నాయి. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడి ఇంకా ఎక్కువ భూమికి అందించి అధికోత్పత్తిని సాధించవచ్చు. స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులు ఇందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. ఇందుకోసం ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. కేటాయించిన నిధులు కూడా మిగిలిపోతున్నాయి. రైతాంగం మరింత అవగాహనతో చొరవ చూపితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

## మితిమీరిన వినియోగం దిగుబడులు తగ్గుముఖం

స్వాతంత్ర్యానంతరం ఇప్పటివరకు భారీ, మధ్య, చిన్నతరహా నీటిపారుదల పనుల కోసం దాదాపు రూ. యాభైనాలుగు వేల కోట్లు వెచ్చించారు. ప్రస్తుత ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక కాలంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా సాగునీటి వసతి కల్పించేందుకు హెక్టారుకు రూ. యాభైవేలకు పైగా ఖర్చవుతుందని అంచనా. ఒక్కో ప్రాజెక్టు పూర్తి కావడానికి సుదీర్ఘకాలం పడుతోంది. ఎంతో వ్యయ ప్రయాసలతో లభించే నీటిని వినియోగించే విషయంలో మరెంతో శ్రద్ధ అవసరం. వ్యవసాయానికి ఉపయోగించే సాగునీరు వృథా కాకుండా, దుర్వినియోగం కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. భారతదేశంలో వ్యవసాయానికి వినియోగించే సాగునీటిలో దాదాపు నలభైఅయిదు

శాతం వరిపంటకే వెళుతోంది. సగటున ఒక కిలో వరిధాన్యం ఉత్పత్తి కోసం పదిహేను వేల లీటర్ల నీటిని వాడుతున్నట్టు అంచనా. ఇది ఎంతో ఎక్కువ. సరయిన వ్యవసాయ పద్ధతులను అనుసరించినట్టయితే ఆరువేల లీటర్ల నీరు సరిపోతుంది. ఇది కూడా ఎక్కువేనని మరికొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేసినప్పటి పరిస్థితులను వ్యవసాయ క్షేత్రాలలో కూడా కల్పించగలిగితే ఆరువందల లీటర్ల నీరు సరిపోతుందని వారంటున్నారు. సాగునీటి అవసరానికి మించి వాడడం వల్ల విలువైన నీరు వృథా అవడమే గాకుండా పంట దిగుబడులు కూడా తగ్గుతాయి. డ్రెయిన్లలో నీరు ఎక్కువగా నిలిచిపోయి సమీప సారవంత భూములు దెబ్బతింటాయి. పంజాబ్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కొన్నిచోట్ల హెక్టారుకు అయిదు, ఆరు టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. ఎక్కువ వర్షపాతం గల ఉత్తరప్రదేశ్ తూర్పుప్రాంతం, బీహార్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలలో పలుచోట్ల హెక్టారుకు దిగుబడి 1.8 టన్నులు మాత్రమే. నీరు నిలిచిపోయి ఉండడం, సాగునీటి నిర్వహణ సరిగా లేకపోవడం ఇంత తక్కువ దిగుబడులకు ముఖ్య కారణాలుగా భావించవచ్చు. ఊటప్రాంతాల్లో, నల్లరేగడి భూముల్లో సగానికి సగం నీరు వృథా అవుతుందని, తేలికగా ఉండే ఇసుక ఉండే భూముల్లో దాదాపు 85 శాతం నీరు వృథా అవుతుందని అంచనా. నాట్లకు ముందు భూమిని దమ్ముచేయడం వల్ల నీటి వృథాను కొంతమేరకు అరికట్టవచ్చు. వర్షపాతం సరిగా లేకపోయినా దమ్ము చేయడంవల్ల పంట నష్టాన్ని కొంత తగ్గించుకోవచ్చు. వరి నాటిన భూమిలో నీరు ఎక్కువ లోతున నిల్వ ఉంటే కలుపు పుట్టదని, రైతుకు మంచిదని కొందరు రైతులు భావిస్తారు. అది తప్పు. అపోహ మాత్రమే. నాలుగు అంగుళాల లోతుకన్నా ఎక్కువ లోతున నీరుంటే, అది వృథా కావడమే కాకుండా పోషకాలు కూడా కొంతమేర నిరుపయోగమవుతాయి. ఒకటి, రెండు అంగుళాల లోతునే నీరుండేలా చూడడం, మధ్యలో కొద్దిగా ఆరబెట్టి తిరిగి నీరు పెట్టడం వంటి చర్యల ద్వారా సగానికి సగం నీటి దుబారాను నివారించవచ్చు. కోతకు రెండు వారాల ముందునుంచి నీటిని పెట్టకుండా ఉంటే కంకులన్నీ దాదాపు సమంగా పండుతాయి. కొంత నీరు కూడా ఆదా అవుతుంది. కాలువల కింద సాగయ్యే భూముల్లో చివరి వాటికి సకాలంలో సరిపోను నీరు రాక రైతులు ఎంతో నష్టపోతుంటారు. ఎగువభాగంలోని రైతులేమో ఎక్కువ నీటిని వినియోగిస్తారు. దాని ఫలితంగా చాలానీరు వృథా అవడమే గాకుండా పల్లపు ప్రాంతాలు మునిగి అక్కడ పంట దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. కాలువల నీటిని వృథా చేయరాదన్న అవగాహన రైతుల్లో

పెంపొందాలి. బ్రిటిష్ వారికి ముందు రాజులు చెరువులు, కుంటలు తవ్వించి సాగునీటి నిర్వహణను ఆయకట్టుదారులకే వదిలేసేవారు. రైతులే సమష్టిగా నీటిపారుదలను నిర్వహించేవారు. బ్రిటిష్ పాలనలో భూమిని వర్గీకరించి శిస్తు వసూళ్ల కోసం రెవిన్యూ సిబ్బందిని నియమించారు. నీటిపారుదల శాఖను నెలకొల్పి సాగునీటి నిర్వహణ, కాలువల మరమ్మత్తు పనులను దానికి అప్పగించారు. ఫలితంగా సాగునీటి నిర్వహణలో రైతుల ప్రమేయం లేకుండాపోయింది. బ్రిటిష్ పాలనలో ప్రభుత్వ శాఖలంటే కొంత భయముండేది. కాలువల కట్టలమీది చెట్లను నరకడానికిగానీ, తూములను పెరకడం, కట్టలకు గండ్లు పెట్టడానికిగానీ భయపడేవారు. కాలక్రమంలో వచ్చిన మార్పులతో ఈనాడు ఎలాంటి నిబంధనలూ పాటించడంలేదు. ఫలితంగా కాలువల కట్టలు తరుచూ పాడవుతున్నాయి. పశువుల తొక్కిడివల్ల దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి తెగిపోతున్నాయి. కొన్నేళ్ళ కిందటివరకు రైతులు వేసవిలో పంటకాల్వలను బోదెలను విధిగా బాగుచేసుకునేవారు. అందుకయ్యే ఖర్చులో కొంతభాగాన్ని నీటిపారుదల శాఖ వార్షిక నిర్వహణ నిధి నుంచి వెచ్చించేవారు. మిగతా మొత్తాన్ని రైతులు ఎకరాకు కొంత వేసుకునేవారు. రానురాను ప్రభుత్వమే అన్ని పనులు చేయాలన్న భావం ప్రబలడంతో కాలువల నిర్వహణ దెబ్బతింది. ప్రభుత్వం మంజూరుచేసే నిధులు చాలక, వార్షిక మరమ్మత్తులు సరిగ్గా జరగక రైతులు అవస్థలు పడుతున్నారు. శ్రమదానం వల్ల రైతులు సమష్టి ప్రయోజనాలు పొందవచ్చు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడైతే సత్ఫలితాలు సాధించవచ్చు. పంటకాలువల నిర్వహణలో రైతులను భాగస్వాములను చేయాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రాబోయే కాలంలో రైతుల నుంచి వసూలుచేసే నీటితీరువా, సెస్సులు సగం మేరకు స్థానికంగా రైతులు ఏర్పాటు చేసుకునే నీటి వినియోగదారుల కమిటీలకు అందించాలని సంకల్పించింది. ఆ మొత్తంలో చిన్న కాలువలు, పంటబోదెల మరమ్మత్తులను రైతులే చేసుకోవాల్సి ఉంటుంది. మిగతా సగం నిధులను ప్రభుత్వం ప్రధాన కాలువలు, హెడ్‌రెగ్యులేటర్, డిస్ట్రిబ్యూటరీలు, భారీ కాలువలు, కట్టడాల అభివృద్ధికి, నిర్వహణకు వెచ్చిస్తుంది. దానివలన రైతుల్లో సమష్టి కార్యాచరణ దృక్పథం పెంపొందుతుంది. నిధుల దుబారా తగ్గుతుంది. నాణ్యత మెరుగవుతుంది. రైతులు పరిపూర్ణంగా భాగస్వాములు కావాలంటే వారికి తగిన స్వాతంత్ర్యం, హక్కులు ఇవ్వాలి. ప్రభుత్వ శాఖ బాధ్యతలను తమపై మోపారన్న భావం కలుగనీయరాదు. నీటితీరువా వసూలే కమిటీలకు ప్రధాన బాధ్యత కారాదు. ఏ సమయంలో ఏ పంటకు ఎంతెంత నీరందించాలో నిర్ణయించుకునే హక్కు ఆ కమిటీలకు

ఉండాలి. నిర్ణీత సమయంకన్నా ముందే నీటితీరువాను వసూలుచేసే కమిటీలకు తీరువాలో కొంత మొత్తాన్ని అందజేయాలి. మహారాష్ట్రలో ప్రస్తుతం 35 వేల హెక్టార్ల భూమికి నీటినందించే బాధ్యతను వినియోగదారుల కమిటీలే నిర్వహిస్తున్నాయి. మరో యాభైవేల హెక్టార్ల భూమిని వాటికిందికి తేనున్నారు. సాగునీటి వినియోగంలో సమర్థ నిర్వహణకు ఇలాంటి ప్రయత్నాలు అవసరం. నీటి దుబారాను అరికట్టడానికి, ఎక్కువ ప్రాంతం సాగు కావడానికి ఇవి దోహదపడతాయి. ఉపరితలంలో లభించే నీటితోపాటు భూగర్భజలాల విషయంలోనూ పొదుపు పాటించడం అవసరం. ప్రస్తుతం భారతదేశంలో సాగయ్యే భూమిలో సగానికన్నా ఎక్కువ ప్రాంతాలకు భూగర్భ జలాలే ఆధారం.

భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి పూర్తికావడంలేదు. దానితో బోర్లు, బావులపై దృష్టి మళ్లింది. ఎప్పటినుంచో భూమిలోకి ఇంకిపోయిన నీటిని తోడుకునేటప్పుడు సరయిన అవగాహన ఉండాలి. ఒక ప్రాంతంలో భూమిలోకి ఇంకుతూ ఉండే నీటి పరిమాణం కన్నా ఎక్కువ నీటిని పైకి తోడుతుంటే భూగర్భ జాలాల మట్టం బాగా లోతుకుపోతుంది. కొన్నిచోట్ల అడుగంటుతుంది. అలాంటి పరిస్థితుల్లో, అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేకించి బోర్ల కింద వరిసాగు చేయడం సముచితం కాదు. ఎక్కువ నీటిని కోరే వరిపైరు కన్నా తక్కువ నీరు అవసరమయ్యే ఇతర ఆహార లేదా వాణిజ్య పంటలు పండించడం మేలు. అధిక వ్యయ, ప్రయాసలతో లభించే భూగర్భ జలాలను మరింత సద్వినియోగం చేసుకునేలా రైతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని పథకాలను అమలుపరుస్తోంది. మొదట్లో సన్నకారు చిన్న రైతులకు సబ్సిడీలను ప్రకటించారు. తాజాగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తన బడ్జెట్‌లో చాలామందికి మరింత వెసలుబాటయ్యే చర్యలను ప్రకటించింది. షెడ్యూల్డు కులాలు, తెగల రైతులు, మహిళా రైతులు, సన్నకారు చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ సిస్టంలకు అయ్యే వ్యయంలో తొంభై శాతాన్ని సబ్సిడీగా ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇతర రైతులకు లోగడ ఉన్న హెక్టారుకు రూ. 15 వేలు లేదా 50 శాతం సబ్సిడీని ఇప్పుడు రూ. 25 వేలు లేదా 70 శాతం మేరకు పెంచింది. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించడానికి రూ. రెండొందల కోట్లు కేటాయించారు. ఈ విధానం ముఖ్యంగా పండ్లతోటలకు, వరుసలలో పెంచే కూరగాయలకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ విధానాలను బాగా వినియోగిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో నీటిని ఏమాత్రం వృథా కాకుండా ఈ విధానలపై అత్యంత శ్రద్ధ చూపిస్తున్నారు. స్ప్రింక్లర్ పరికరాలను ఉపయోగిస్తూ

మంచి దిగుబడులు సాధిస్తున్నారు. భారతదేశంలో ఈ నూతన పద్ధతులను ఉపయోగించడంలో మహారాష్ట్ర ఎక్కువ ఆసక్తి చూపిస్తోంది. 1994-95లో డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించడానికి మహారాష్ట్రకు రూ. 12 కోట్లు, కర్ణాటకకు రూ. 4.79 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 4.20 కోట్లు విడుదలయ్యాయి. నిధులు ఎక్కువగానే ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో ద్రాక్ష, మామిడి, రేగు, జామ, సీతాఫలం, తదితర పండ్లతోటలకు, వరుసలలో పండించే కూరగాయల పెంపకానికి ఈ విధానాన్ని అనుసరించవచ్చు. డ్రిప్ ఇరిగేషన్ వల్ల నీరు ఆదా అవడమే కాకుండా కలుపు తక్కువ పెరుగుతుంది. పంట దిగుబడులు ఎక్కువవుతాయి. అలాగే మినుములు, పెసలు మొదలైన కొన్నింటికి నల్లరేగడి హెవీ భూముల్లో పారే నీరు పెడితే తేమ ఎక్కువవుతంది. కాని సన్నవర్షం పడినట్లు కొద్దిమేరకే నీరు ఇస్తే పంట దిగుబడి తప్పక పెరుగుతుంది. స్ప్రింక్లర్ ఇరిగేషన్ పరికరాల వల్ల మొక్కకు అవసరమైన మేరకే నీటిని అందించి అధిక ఫలసాయాన్ని పొందవచ్చు.

## విస్తృత ప్రచారం విస్పష్ట కార్యాచరణ

ఎనిమిదో పంచవర్ష ప్రణాళికా కాలం ముగియబోతున్నా కూటాయించిన నిధులన్నీ వినియోగించుకోలేదు. చాలా నిధులు మిగిలిపోతున్నాయి. వాటిని సద్వినియోగ పరుచుకోవాలి. రైతులకు ఆధునిక పద్ధతుల ద్వారా చేకూరే ప్రయోజనాల గురించి విడమరిచి చెప్పాలి. నీటి పొదుపు ఆవశ్యకతను వివరించాలి. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి చదువురాని రైతులతోసహా కర్షకులందరికీ తెలిసేలా రేడియో, టెలివిజన్‌ల ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమం చేపట్టాలి. రైతుల, వ్యవసాయరంగ పరిస్థితులు మారేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో, దృఢసంకల్పంతో కృషిచేయాలి. నీటి పొదుపు గురించి అందరూ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఇప్పటినుంచే సాగునీటిని పొదుపుగా వాడుకోవడం అలవరచుకోవాలి. లేకుంటే మరికొన్నేళ్లలో భారత వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

*ది. 13-09-1996.* — ***ఈనాడు***

●

# ప్రణాళికలు గడుస్తున్నా ఫలితాలు స్వల్పం

ఆంధ్రప్రదేశ్‌లో భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా 125 లక్షల ఎకరాలకు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా 105 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించేందుకు అవకాశం ఉందని ఇదివరలో అంచనా వేశారు. అంటే నదులు, వాగులు, వంకల ద్వారా, వర్షంవల్ల లభించే ఉపరితల జలాలనుకాని, భూగర్భ జలాలను కాని మొత్తంగా సక్రమంగా ఉపయోగించుకోగలిగితే రాష్ట్రంలో పంటలు పండిస్తున్న 317 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సుమారు 230 లక్షల ఎకరాలకు నీటివసతిని కల్పించవచ్చు. ప్రణాళికాబద్ధ ప్రగతి మొదలవ్వకముందు భారీ, మధ్యతరహా పథకాల కింద 33 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీటి వసతి ఉంది. మొదటి ప్రణాళిక నుండి ఎనిమిదో ప్రణాళికాంతం వరకు రూ. 5175 కోట్లు భారీ, మధ్యతరహా పథకాలపై వెచ్చించారు. దానివల్ల 58.38 లక్షల ఎకరాలకు నీటిని అందించగల సామర్థ్యాన్ని కల్పించుకోగలిగినా కాల్వల త్రవ్వకాలు పూర్తికాక, కొన్ని కట్టడాలు కట్టక ఇప్పటికి 49.69 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఇరిగేషన్ పొటెన్షియల్ కల్పించుకొన్నప్పటికీ 8 లక్షల 69 వేల ఎకరాల భూమికి నీరు అందించలేకపోవడం బాధాకరం. బావులు, బోరులు, చెరువుల కింద సుమారు 57.25 లక్షల ఎకరాలకు మైనర్ ఇరిగేషన్ రంగం కింద నీరందుతోంది.

## రైతుల భాగస్వామ్యం నేటి అవసరం

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 15 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయాలంటే కనీసం మూడువేల కోట్ల రూపాయలు కావాలి. అలాగే ఏనాటినుండో నత్తనడక నడుస్తున్న 19 మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తిచేసుకొని 3.75 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాలంటే రూ. 250 కోట్లుపైగా కావాల్సి ఉంటుందని అంచనా. ముప్పైసంవత్సరాల కిందట ప్రారంభించిన పథకాలను నేటికీ పూర్తిచేసుకోలేక

పోతుండడం విచారకరం. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పథకాలపైనే ఇరిగేషన్ పద్దు కింద కేటాయించిన నిధులను ఖర్చుచేయాలి తప్ప కొత్త పథకాలను చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరుతోంది. మరోవైపు రాజకీయ లబ్దిపొందాలనే తాపత్రయంతో ప్రతి రాష్ట్రంలోనూ ఎప్పటికప్పుడు నూతన పథకాలను చేపట్టడం జరుగుతూనే ఉంది. ఫలితంగా కేటాయించిన ఇరిగేషన్ నిధులతో సిబ్బంది జీతభత్యాలు, ఇతర పరిపాలనా నిర్వహణపై వ్యయం పోను మిగులుతున్నది తక్కువ. దానిని కొద్దికొద్దిగా పలుపథకాలకు పంచుతూండడం వలన నిర్మాణాలు ఎన్ని సంవత్సరాలయినా పూర్తికావడంలేదు. అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దానితో భారీ, మధ్యతరహా పథకాలపై పెట్టిన పెట్టుబడులకు సత్వరం రాబడి లభించడంలేదు. ప్రభుత్వానికి ఆదాయం కానీ, రైతుకు ప్రతిఫలం కానీ లభించే ఆస్కారం లేకుండాపోతోంది. దీనికితోడు కాంట్రాక్టర్ల అధిక ధనార్జన ఒకటి. వారికి అధికారుల, రాజకీయ నాయకుల అండదండలు లభిస్తుండడంతో నిధులలో గణనీయ మొత్తాలు దుర్వినియోగమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఇరిగేషన్ టెండర్ల వ్యవహారాలు వివాదాస్పదమవుతున్నాయి. కోట్లకు కోట్ల రూపాయలు అక్రమంగా వ్యక్తుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇలాంటి దుర్విధానాలను అరికట్టాలి. వాస్తవికమైన అంచనాలు రూపొందించి కాంట్రాక్టరుకు కనీసంగా మార్జిను వుండేట్లు చూడాలి. అధిక రేట్ల ప్రతిపాదనలను తిరస్కరించే విధంగా విధానాలు రూపొందాలి. మెషినరీ వినియోగించవలసిన సందర్భాలలో, డిస్ట్రిబ్యూటరీలు, మేజర్ కాల్వల తవ్వకాలు కాంట్రాక్టర్లకు అప్పగించినా మైనర్ కాల్వలు, ఫీల్డు ఛానెళ్లను స్థానిక రైతు కమిటీలకు ఇస్తే తవ్వకాలు సరిగా జరిగే అవకాశం ఉంటుంది. భూమిలేని పేదకార్మికుల సంస్థలకు కూడా ఇటువంటి పనులలో అవకాశాన్ని కల్పించవచ్చు. దానితో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నిర్మాణంలో ఉన్న ఇరిగేషన్ పథకాలను ముఖ్యంగా కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలోని వాటిని 200 సంవత్సరం నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ నిధుల లేమివల్ల ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతి నామమాత్రంగానే ఉంటున్నది. సాధ్యమైనన్ని మార్గాల ద్వారా నిధులు సేకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్ర బడ్జెటులో వీలైనంత హెచ్చుగా కేటాయించి, కేంద్రం అమలు చేస్తున్న జాతీయ జల వినియోగం పథకం కింద జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ద్వారా నిధులు ఎక్కువగా రాబట్టాలనుకుంటోంది. అసంపూర్తిగా

ఉన్న ఇరిగేషన్ పథకాలను సత్వరమే పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉద్దేశించి పథకం కింద కూడా గణనీయంగా నిధులు రాబట్టించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచబ్యాంకు సహకారం పొందటానికి కూడా ముఖ్యమంత్రి తీవ్రంగా కృషిచేశారు. ఈ ప్రయత్నాలన్నిటికి తోడుగా ప్రజల సహకారం ఉంటే పథకాలను కొంత త్వరగా పూర్తిచేయగలగడమేకాక పనిలో నాణ్యత కూడా మెరుగవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 'ఇరిగేషన్ బాండ్లు' జారీచేసి ప్రజల నుండి కొంతమేరకు నిధులు సేకరించాలని ప్రభుత్వం అనుకుంటోంది. ప్రాజెక్టులవారిగా పబ్లిక్ ఇష్యూలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి తాజాగా ప్రకటించారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఆ పద్ధతిని అనుసరిస్తున్నాయి. ప్రత్యేకంగా కృష్ణా జలాలతో సంబంధం ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలు 2000 సంవత్సరం నాటికి పూర్తిచేసుకోవాలని ఆ రెండు రాష్ట్రాలు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. 2000 సంవత్సరం నాటికి ఇప్పుడు నిర్మాణంలో ఉన్న పథకాలను పూర్తిచేసుకుంటే ఇంకా ఎక్కువ నీరు కావాలని కోరి, సాధించుకోవచ్చన్న లక్ష్యంతో ఆ రాష్ట్రాలు కృషిచేస్తున్నాయి. ఆ రెండు రాష్ట్రాలలో ఇరిగేషన్ బాండ్సుకు ప్రజల నుండి ముఖ్యంగా రైతుల నుండి స్పందన బాగుంది. కర్ణాటకలో సుమారు రూ. 600 కోట్లు, మహారాష్ట్రలో రూ. 400 కోట్లుపైగా బాండ్లు రూపేణా పెట్టుబడులు చేకూరాయి. కాని ఆంధ్రప్రదేశ్‌లో ఇరిగేషన్ బాండ్లవల్ల కేవలం రూ. 60 కోట్లు మాత్రమే లభించాయి. రాష్ట్రంలో లోగడ ప్రభుత్వం విడుదల చేసిన 'ఇరిగేషన్ బాండు' ప్రజల ఆదరణ పొందలేకపోవడానికి పలు కారణాలున్నాయి. లక్ష రూపాయలపైన పెట్టుబడి పెట్టగలవారికి మాత్రమే బాండు పథకం వర్తించింది. అందువల్ల కొద్దిమంది వ్యాపారవేత్తలకు, కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు మాత్రమే బాండ్లు తీసుకునే వీలు కలిగింది. రైతులు అధికసంఖ్యలో బాండ్లు తీసుకునే అవకాశం లేకపోయింది. ఈనాటికీ వ్యవసాయం ప్రకృతి కరుణపైనే ఆధారపడి ఉండటం, మార్కెటింగ్ లోపాలవంటి పలు కారణాలవలన అధికశాతం రైతాంగం పరిస్థితి అంతతమాత్రంగానే ఉంది. అందువల్ల ఇరిగేషన్ బాండ్ల పథకాన్ని కనీస పెట్టుబడి వెయ్యి రూపాయలు ఉండేట్లు మార్చాలి. అప్పుడు చాలా ఎక్కువమంది రైతులు ఇరిగేషన్, బాండ్లు తీసుకోగలుగుతారు. బాండ్లు ఒక్కొక్క ప్రాజెక్టుపరంగా విడిగా ఉండటం ఎంతో మేలు. దానివల్ల ఏ పథకాన్ని త్వరగా పూర్తిచేయడం వలన తమకు ప్రయోజనం కలుగుతుందని రైతులు భావిస్తారో ఆ

ప్రాంతంలోని వారు ముందుకు రావడానికి అవకాశం మెరుగవుతుంది. కర్ణాటక, మహారాష్ట్రలలో ఈ విధంగా చేయడంవల్లనే వందల కోట్ల రూపాయలను రైతులు, ఆ ప్రాంత ప్రజలు బాండ్ల రూపంలో ఆయా ఇరిగేషన్ పథకాల సత్వర నిర్మాణానికి అందజేస్తున్నారు. ఇక్కడ మరొక ముఖ్యమైన అంశాన్ని అర్థంచేసుకోవాలి. ఆ రెండు రాష్ట్రాలలో ఆ విధంగా రైతులు ముందుకు రావడానికి కొన్ని సంవత్సరాలుగా కృషిజరిగింది. మహారాష్ట్రలో గత ఎనిమిది సంవత్సరాలుగా సాగునీటి వినియోగదారుల సంఘాలను ఏర్పరచి కాల్వనీటి నిర్వహణలో, కాల్వల అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నారు. ఇప్పటికి అరవైవేల ఎకరాలకుపైగా విస్తీర్ణం నీటివినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో సాగునీటి నిర్వహణ కిందకు వచ్చింది. ఇంకా డెబ్బైఅయిదు వేల ఎకరాలలో సాగునీటి నిర్వహణ బాధ్యతలను స్వీకరించడానికి నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటయ్యాయి. మరొక లక్ష ఎకరాలను అప్పజెప్పేందుకు నీటి వినియోగదారుల సంఘాలను నెలకొల్పే కృషి కొనసాగుతోంది. బలంగా ఉన్న సహకార వ్యవస్థలు, రైతుల సహకారం మహారాష్ట్రలో ప్రాజెక్టుల నిర్మాణానికి దోహదం చేస్తున్నాయి. కృష్ణాజలాల వినియోగంలో ఎంతో జాప్యం జరుగుతూవున్న నేపథ్యంలో బీజాపూర్ జిల్లాలో రైతులు తరచుగా సంభవించే క్షామంతో, కరువుకాటకాలతో బాధపడుతూ వేసారిపోయి 1987లో "చిక్కిపాదసలగై" అనే బ్యారేజీని స్వయంకృషితో నిర్మించుకొన్నారు. ఆ ప్రాంతంలో రైతుల సహకార సంఘ నాయకుడు సిద్దున్యామగౌడ ఆధ్వర్యంలో ప్రతి రైతు తలకు ఒక్క రూపాయి చొప్పున విరాళాలు ఇచ్చి శ్రమలో పాల్గొనాలని సంకల్పించి ఆ బ్యారేజి నిర్మాణానికి ఉపక్రమించారు. ఈ కార్యక్రమానికి అనూహ్యంగా స్పందన లభించింది. రైతులు, వ్యవసాయ కార్మికులేకాక విద్యార్థులు, అధ్యాపకులు, డ్రైవర్లు, మహిళలు, బ్యారేజీ నిర్మాణంలో పాలుపంచుకొన్నారు. ఇరవై లక్షల రూపాయల వ్యయంతో ఒక సంవత్సరంలో బ్యారేజీ పూర్తయింది. అదే బీజాపూర్ జిల్లాలో బిలగై తాలూకాలో హెగ్గూర్‌వద్ద ఒక బ్యారేజీ నిర్మాణం ప్రతిపాదన ఎప్పటినుండో కాగితాలపై ఉంటూవచ్చింది. బంగారప్ప ముఖ్యమంత్రిగా ఉండగా దానికి కావల్సిన రూ. 1.20 కోట్లు గ్రాంటు లభించలేదు. అప్పుడు ఆ ప్రాంత రైతులు చిక్కపాదసలగై బ్యారేజీ నిర్మాణం నుండి స్ఫూర్తి పొంది తాముగా ముందుకువెళ్లాలని నిర్ణయం తీసుకొన్నారు. బ్యారేజీ నిర్మించవలసిన ప్రదేశానికి సమీపంలో ఉన్న గ్రానైట్

రాయిని వాడి కేవలం నలభై లక్షల రూపాయల వ్యయంతో పూర్తిచేశారు. 16 గ్రామాలలోని రైతులు శ్రమదానంలో పాల్గొన్నారు. బ్యారేజీ నిర్మాణం జరుగుతున్నప్పుడు క్యూరింగుకు అవసరమైన నీటిని వలంటీర్లు రెండు కిలోమీటర్ల పొడవున పైపులైను వేసి తెచ్చారు. బెల్గాంలోని ఇండియన్ అల్యూమినియం కంపెనీ ఇసుక, ఇతర సామగ్రి చేర్చడానికి రెండు లారీలను సమకూర్చింది. జిల్లాపరిషత్, దగ్గరలో ఉన్న మఠాధిపతులు తమ సహకారాన్ని అందించారు. ఒక సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం సహకరించింది. దరిమిలా కేంద్రంలో ఉండే "కాపార్డు" సంస్థ పదిలక్షల రూపాయల సహకారాన్నందించింది. ఈ నిర్మాణం కేవలం 82 రోజుల వ్యవధిలో పూర్తియింది. 300 మీటర్ల పొడవు, 4 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు వున్న ఈ నిర్మాణం ప్రజల శక్తికి నిదర్శనం. ఈ హెగ్గూరు బ్యారేజీ వలన 5000 ఎకరాలకు ప్రయోజనం చేకూరింది. దగ్గరలోని గ్రామాలకు మంచినీటి సౌకర్యం లభించింది. భవిష్యత్తులో ఆలమట్టి డ్యాం పూర్తియితే ఈ హెగ్గూరు బ్యారేజీ మునిగిపోతుంది. కానీ ఏటా దాదాపు మూడు కోట్ల రూపాయల విలువైన పంటలను ఇప్పుడు పొందుతుండడం వలన ఆ రైతులు బాధపడే అవసరం లేదు. ఆ భూముల విలువ కూడా ఎంతో పెరిగింది. అలాగే కృష్ణానది పక్కన అనేక లిఫ్టు స్కీములు పెట్టుకొని పంటలు పండించుకొంటున్నారు. కొన్ని సందర్భాలలో నదికి పది కిలోమీటర్ల దూరంలో కూడా కొత్తగా చెరువులు ఏర్పాటుచేసుకొని లిఫ్టు ద్వారా అందులోకి నీరు ప్రవహింపజేసుకొని తమ స్వయంకృషితో పంటలు పండించుకుంటున్నారు. దక్షిణ బెల్గాం జిల్లాలో అథాని తాలూకాలో మోలి గ్రామంలో 29 మంది రైతులు 150 ఎకరాలకు ఉపయోగపడేవిధంగా ఒక ఇరిగేషన్ పథకాన్ని చేపట్టారు. కృష్ణానదికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం మోటార్లకు, పైపులైనుకు మలప్రభ గ్రామీణబ్యాంకు రుణాన్ని సమకూర్చింది. బ్యాంకు నిబంధనలు చెరువు నిర్మాణానికి అయ్యే ఖర్చును ఎడ్వాన్సు చేయడానికి అడ్డువచ్చాయి. దానితో ఆ 29 రైతుల కుటుంబాలు 8 నెలలు కష్టపడి 7.72 లక్షల గ్యాలన్ల నీరు నిల్వచేయగలిగే చెరువును నిర్మించుకొన్నాయి. రైతులే నీటి నిర్వహణ స్వయంగా చేపట్టి అభివృద్ధి చెందుతున్నారు. వీటన్నిటి పర్యవసానంగా కర్ణాటకలో రైతాంగం ఇరిగేషన్ పథకాలకు శక్తికొలది సహకారాన్నందిస్తోంది.

## సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

ఆంధ్రప్రదేశ్‌లో కూడా రైతాంగం ముందుకువచ్చి నీటిపారుదల రంగంలో తమవంతు సహకారాన్నందించడం ఎంతైనా అవసరం. ప్రత్యేకంగా మీడియం ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ పథకాలు రైతుల తోడ్పాటు ఉంటే తొందరగా పూర్తవుతాయి. ఎప్పుడైతే పథకాల నిర్మాణ వ్యయంలో రైతుల భాగస్వామ్యం ఉంటుందో ఆ పనుల నాణ్యతకూడా మెరుగవుతుంది. కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల, అధికారుల విచ్చలవిడి దోపిడీకి పగ్గం వేయ వీలుకలుగుతుంది. దాదాపు పదమూడు లక్షల ఎకరాల కృష్ణా డెల్టాకు జూన్ 1 నాటికి నీరు అంది, అధిక దిగుబడులు సాధించాలంటే పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణం ఎంతైనా అవసరం. విద్యుత్ ఉత్పత్తి నిర్మాణ వ్యయం పోనూ మిగతా ఖర్చులో కొంత రైతులు పులిచింతల ప్రాజెక్టు బాండుల రూపంలో ప్రభుత్వానికి సహకారాన్ని అందించాలి. ప్రాజెక్టును సత్వరంగా నిర్మించేందుకు పూనుకోవాలి. ఇందులో కృష్ణాడెల్టా రైతాంగం ప్రయోజనాలేకాక రాష్ట్ర ప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నాయి. ఏటా దాదాపు ముప్పైలక్షల టన్నుల ధాన్యం దేశ ప్రజానీకానికి ఈ డెల్టానుంచి లభిస్తోంది. వ్యావసాయికంగా, సామాజికంగా, పలు యితర రంగాలలో ప్రగతిని సాధించిన ఆంధ్రప్రదేశ్ రైతాంగం రాష్ట్ర పురోభివృద్ధికి తోడ్పడాలి. ముఖ్యంగా వ్యవసాయాభివృద్ధికి ఎంతో అవసరమైన ఇరిగేషన్ వసతి కోసం తమ శక్తికొలది పక్క రాష్ట్రాలలోని రైతులవలే సహకారాన్ని అందించడం తక్షణ ఆవశ్యకత అని గుర్తించాలి. ప్రాజెక్టు ప్రాతిపదిక ఇరిగేషన్ బాండ్లకు సహకారాన్ని అందించాలి. పంటకాల్వల నిర్వహణలో భాగస్వామ్యం వహించవలసిన సమయమిది.

*ది. 05-11-1996.* — *ఈనాడు*

●

# వనరులు పరిమితం నిర్లక్ష్యం ప్రమాదకరం

కాలం గడిచేకొద్దీ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వనరుల వాడకం అధికమవుతుంది. వనరులు పరిమితంగా ఉన్నప్పుడు అధిక జనాభా అవసరాలు తీరడం కష్టమవుతోంది. అందుకే వనరుల విషయంలో ఎంతో ముందుచూపు అవసరం. భవిష్యత్తరాలను దృష్టిలో పెట్టుకుని సహజవనరుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని వనరులను సద్వినియోగపరచుకోవాలి. లేనిపక్షంలో దుష్ఫలితాలు తప్పవు. నీటివాడకంలో పొదుపు పాటించకపోవడంవల్ల ఆందోళనకర పరిణామాలు సంభవించే ప్రమాదముంది. ప్రపంచంలో లభ్యమయ్యే నీటిలో 97.2 శాతం ఉప్పునీరే. మిగతా నీరే తాగడానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు ఉపయోగపడుతోంది. పనికివచ్చే నీటిలో 69 శాతం వ్యవసాయ రంగానికి, 23 శాతం పారిశ్రామిక రంగానికి, ఎనిమిది శాతం గృహావసరాలకు ఇతరత్రా వినియోగమవుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో 50 శాతం పైగా నీరు విద్యుత్ సహా వివిధ పరిశ్రమలకు ఉపయోగపడుతోంది. భారతదేశంలో 90 శాతం నీరు వ్యవసాయానికే ఖర్చవుతోంది. 2000 సంవత్సరం నాటికి (మరో మూడేళ్లలోగా) భారతదేశ జనాభా 100 కోట్లకు చేరుకుంటుందని ఒక అంచనా. ఆనాటికి 23.5 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరమవుతాయని జాతీయ వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది. అంటే ఆహారధాన్యాల ఉత్పత్తి మరో 24 శాతం మేర పెరగాల్సి ఉంటుంది. రానున్న రెండు దశాబ్దాల్లోగా వ్యవసాయానికి వాడే నీటి పరిమాణం 80 శాతానికి తగ్గవచ్చు. సాగునీటిని పొదుపుగా, సమర్థంగా సద్వినియోగపరచుకోవాల్సిన అనివార్య పరిస్థితులెదురవనున్నాయి. వృథాను అరికట్టి ఎక్కువ విస్తీర్ణానికి నీటిని వినియోగించుకోవాల్సిన అవసరముంది.

## జనాభాకు తగ్గట్టు అధికోత్పత్తులు

భారతదేశ భౌగోళిక విస్తీర్ణం 82 కోట్ల ఎకరాలు. ప్రణాళికలు ప్రారంభమయ్యేనాటికి దేశంలో అయిదుకోట్ల 50 లక్షల ఎకరాల భూమికి నీటివసతి ఉంది. మొదట్లో 28.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని భావించారు. అనంతరం 31.25 కోట్ల ఎకరాలకు నీటివసతి కల్పించవచ్చునని అంచనా వేశారు. సగటు వర్షపాతం 1250 మిల్లీమీటర్లు. 2050 సంవత్సరం నాటికి భారతదేశ జనాభా అవసరాలు తీరాలంటే 40 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరమవుతాయని అంచనా. వర్షపాతం అంతటా ఒకే విధంగా లేదు. బ్రహ్మపుత్ర పరీవాహక ప్రాంతంలో 18 వేల క్యూబిక్ మీటర్లు కాగా మహానది ప్రాంతంలో 2500 క్యూబిక్ మీటర్లు. దేశంలో ప్రస్తుతం నీటి వసతి ఉన్న ప్రాంతంలో హెక్టారుకు 2.2 టన్నులు, వర్షాధార ప్రాంతంలో హెక్టారుకు 750 కిలోల ధాన్యాలను పండిస్తున్నారు. చైనా, కొరియా, జపాన్ దేశాల్లో హెక్టారు సగటు దిగుబడి అయిదు టన్నులకు పైనే. పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మొదలయిన రాష్ట్రాల్లో సాగునీటి లభ్యతకల కొన్ని ప్రాంతాల్లో మాత్రం హెక్టారుకు అయిదు టన్నులకు పైగా పంటలు పండిస్తున్నారు. జనాభా అవసరాలనుబట్టి ప్రస్తుతం ఆహారధాన్యాల దిగుబడిని 2.2 టన్నుల నుంచి కనీసంగా 3.5 టన్నులకు పెంచాలి. 1995-96 నాటికి 22.50 కోట్ల ఎకరాలకు నీటి వసతి కల్పించగల సామర్థ్యం సమకూరినప్పటికీ 20 కోట్ల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. బోదెలు తవ్వకపోవడం, భూమిని సమతలం చేయకపోవడం, కొందరు రైతులు మెట్టపంటల నుంచి మాగాణి పంటల విధానానికి మారకపోవడం వల్ల రెండు కోట్ల 50 లక్షల ఎకరాలకు ఉపయోగపడే నీటిని సద్వినియోగ పరచుకోవడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లో భారీ, మధ్యతరహా, నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా 123.5 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించవచ్చునన్నది ప్రభుత్వ అంచనా. ప్రణాళికా విధానం ప్రారంభమయ్యేనాటికి రాష్ట్రంలో 33 లక్షల ఎకరాలకు నీరందుతోంది. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికాంతానికి సుమారు 60 లక్షల ఎకరాలకు నీరందించగల సామర్థ్యం ఉన్నా వాస్తవంగా 51 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందే పరిస్థితి. అవకాశం ఉండి కూడా చిన్న చిన్న లోటుపాట్లవల్ల తొమ్మిది లక్షల ఎకరాలకు నీరందకుండాపోతోంది. ప్రస్తుతం భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా సాగునీటి వసతి కల్పించాలంటే ఒక ఎకరాకు 30 వేల రూపాయలకు పైగా ఖర్చవుతుంది. అంతేగాకుండా డ్యాంలు నిర్మించడానికి, కాలువలు

తవ్వడానికి కొన్ని దశాబ్దాల కాలం పడుతుంది. అందువల్ల ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించడం మేలు. నీటి వినియోగదారుల సంఘాలు, రైతుల భాగస్వామ్యం వల్ల సత్వర ఫలితాలు సాధించవచ్చు. ప్రభుత్వం నుంచి సముచితరీతిలో నిధులు మంజూరు చేసుకుని బోదెలను తవ్వుకోవడం ఉత్తమం. భూమిని చదునుచేయడానికి, అభివృద్ధి పరచడానికి సహకార బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక రుణాలకు అవకాశం కలిగించాలి. ఆయా ప్రాంతాల్లో భూమి స్వభావం, వివిధ సీజన్లలో వర్షపాతం స్థాయి, భూమిలో తేమ, ఖరీఫ్, రబీలలో పండించడానికి అనుగుణమైన పైర్లు, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించగల పద్ధతుల గురించి రైతుల్లో సరయిన అవగాహన పెంపొందించాలి. రాష్ట్రంలో 317 లక్షల ఎకరాలలో పంటలు సాగవుతుండగా కేవలం 40 శాతం భూమికి మాత్రమే నీటి వసతి ఉంది. అందులో దాదాపు 44 శాతం కాల్వల ద్వారా, 22 శాతం చెరువుల ద్వారా, 23 శాతం బావుల ద్వారా, ఏడు శాతం గొట్టపు బావుల ద్వారా లభిస్తోంది. రానురాను చెరువుల కింద విస్తీర్ణం తగ్గిపోతూ బావుల కింద సాగు అధికమవుతోంది. ప్రస్తుతం బోర్ల నుంచి లభించే నీటితో 17.75 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 16 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లున్నాయి. కొన్ని జిల్లాల్లో వేలమంది రైతులు మూడేళ్లుగా కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. అనుమతి లేకుండానే కొందరు నేరుగా విద్యుత్ వినియోగిస్తున్నారు. విద్యుత్తుబోర్డు రోజుకు తొమ్మిది గంటలు మించి సరఫరా చేయలేకపోతోంది. అలాంటప్పుడు వేసవిలో బోర్లకింద, నూతుల కింద వరిపంట బదులు ఇతర ఆరుతడి పంటలు వేసుకుని రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చు. వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకుని ఆయా సీజన్లలో నీరు, తేమ, విద్యుత్తు ఏమేరకు ఉంటాయో ఖచ్చితంగా అంచనా వేసుకుని పంటలు వేయడం సముచితం. చాలాచోట్ల చెరువుల నిర్వహణ సక్రమంగా లేనందున మేటవేసి, తూటుకాడ పెరిగి ఆయకట్టుకు నీరుసరిగ్గా సరఫరా కావడంలేదు. భారీ వర్షాల కారణంగా గండ్లు పడితే సరిగ్గా పూడ్చకపోవడంవల్ల, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చెరువుల కింది ఆయకట్టు విపరీతంగా తగ్గిపోతోంది. 1955-56లో 26.7 లక్షల ఎకరాలున్న ఆయకట్టు 1995-96 నాటికి 18.7 లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. సాగునీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువుల్లోని మేటలను పంటపొలాలకు వినియోగిస్తే ఎరువుగా ఉపయోగపడుతుంది. దరిమిలా చెరువుల్లోనూ నీరు ఎక్కువగా నిలిచి ఆయకట్టు

అవసరాలు తీరేందుకు అవకాశం కలుగుతుంది. చెరువుల్లో నీరు సమృద్ధిగా నిల్వ ఉంటే ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుంటుంది. గొట్టపు బావుల, నూతుల ద్వారా తగినంత నీరు లభిస్తుంది. సాగునీటి పొదుపు విషయంలో అందరూ శ్రద్ధ చూపడం అవసరం. తక్కువమంది రైతులు మాత్రమే పొదుపు పద్ధతులు పాటిస్తున్నారు. చాలామంది రైతులు సరయిన అవగాహన లేకపోవడంవల్ల వరిపొలాల్లో అవసరమైనదానికన్నా ఎక్కువ నీరు నిలవగడుతుంటారు. ముఖ్యంగా ప్రాజెక్టుల కింద, కాల్వల కింద ఎగువ ప్రాంతాల్లో నీరు పుష్కలంగా లభిస్తుంది గనుక అయిదు అంగుళాలమేర నిల్వ ఉంచుతారు. అలాగే మాగాణి ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో కూడా ఎక్కువ నీటిని నిలపడం పరిపాటి. దరిమిలా భూమిలోకి చాలా నీరు ఇంకిపోతుంది. మొక్కలకు ఉపయోగపడాల్సిన పోషక పదార్థాల్లో కొంత భాగం నిరుపయోగమవుతుంది. వరిచేలో ఒకటి లేదా రెండు అంగుళాలకు మించి నీరు అవసరం లేదు. అది కూడా నిరంతరాయంగా ఉండవలసిన పని లేదు. నీరు పూర్తిగా తగ్గిన తర్వాత రెండు మూడు రోజుల వ్యవధిలో ఒకటి లేదా రెండు అంగుళాలను మించకుండా నీరు పెట్టే విధానం సరయినది, మేలయిన ఫలితాలనిస్తుంది. ఈ పద్ధతివల్ల ఎకరా పంట దిగుబడులు పెరగడమే కాకుండా, దాదాపు 30 శాతం మేర నీరు ఆదా అవుతుంది. డెల్టా ప్రాంతాలలో కాల్వల నీటిని పంట సీజను అంతా ప్రవహింపజేసేకన్నా వంతులవారీగా సరఫరా చేయడం సముచితం. 1986లో నిజాంసాగర్ ఆయకట్టు కింద, 1987 రబీకాలంలో కృష్ణా డెల్టాలోనూ రైతులకు ఇలాంటి అనుభవం ఎదురయింది. తక్కువ నీటితో ఎక్కువ పంటను పొందగలిగారు. అలాగే వరుసలలో వేసే పంటలకు, ప్రత్యేకంగా పత్తి, చెరకు, కూరగాయల తోటల్లో నీటిని చేనుమీద మొత్తంగా వదలడంకంటే బోదెలు ఏర్పరచి పంపించడం మేలు.

## పరిస్థితులకు తగిన ఆలోచనలు

భూమిమీద నీరు ప్రవహింపజేసే పద్ధతి ద్వారా మొత్తం నీటిలో 35 శాతం మాత్రమే పంటకు అందుతోంది. స్ప్రింక్లర్ పద్ధతిలోనైతే 50 నుంచి 60 శాతం వరకు, డ్రిప్పు పద్ధతిలోనైతే 80 నుంచి 90 శాతం వరకు నీరు సద్వినియోగమవుతుంది. భారతదేశంలో ఇప్పటికీ సజ్జ, జొన్న, మినుము, పెసర, కంది, వేరుశనగ, ఆముదాల దిగుబడులు ఇతర దేశాలకన్నా చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. వర్షాధారంతో

పంటలను పండించడమే ఇందుకు ప్రధాన కారణం. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మామూలు పద్ధతిలో నీరు కట్టడం వల్ల మోతాదు ఎక్కువై కొన్ని సందర్భాల్లో పంటకు నష్టం కూడా కలిగే ప్రమాదముంది. స్ప్రింక్లర్ పద్ధతిని అనుసరించడంవల్ల తృణధాన్యాల దిగుబడిని 20 నుంచి 35 శాతం వరకు, పప్పుధాన్యాల దిగుబడిని 50 శాతం మేరకు పెంచవచ్చు. నీరు కూడా సగానికిపైగా ఆదా అవుతుంది. మెట్ట ప్రాంతాల్లో వీలయినచోటల్లా చెక్ డ్యాంలు నిర్మించి వర్షపు నీటిని సాధ్యమైనంత ఎక్కువగా భూమిలోకి ఇంకెలా చర్యలు తీసుకోవాలి. ఇందుకు సమగ్ర వాటర్‌షెడ్ కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలి. వర్షాధార మెట్ట ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలి. వర్షాధార మెట్ట ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చేపడితే భూగర్భ జలాల లభ్యత పెరుగుతుంది. నూతులు, గొట్టపు బావుల ద్వారా వర్షాకాలం దాటిపోయిన తర్వాత మరొక స్వల్పకాల వ్యవధి ఆరుతడి పంటను పండించే అవకాశం కలుగుతుంది. అధికోత్పత్తికి అదనపు ఆదాయం పొందడానికి వీలవుతుంది. రాబోయే కాలంలో మొత్తంగా వ్యవసాయోత్పత్తులను అధికం చేయాల్సిన అవసరముంది. దేశ ప్రజల అవసరాలను తీర్చడానికేగాక, ఎగుమతులతో విదేశీ వాణిజ్య లోటును భర్తీ చేసుకోవడానికి, విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించడానికి వినూత్న చర్యలు చేపట్టడం తప్పనిసరి. మరింత ఎక్కువ విస్తీర్ణాన్ని సాగులోకి తేవాలి. లభ్యమయ్యే నీటిని పొదుపుగా వినియోగిస్తూ, నూతన పద్ధతులను అనుసరిస్తూ, స్థానిక పరిస్థితులనుబట్టి పంటలు వేసే విధంగా ఆలోచనా సరళిలో మార్పు వచ్చినప్పుడే రాష్ట్రం, దేశం వ్యావసాయికంగా పురోగమిస్తాయి. అప్పుడే వ్యవసాయదారుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.

*ది. 19-12-1997.* **- ఈనాడు**

●

# సాగునీటి సద్వినియోగంతో రాష్ట్రం సుభిక్షం

రాష్ట్రంలో ఆయకట్టు భూమి అంతటికీ సమానంగా, న్యాయోచితంగా సాగునీటిని అందజేయాలంటే రైతుల భాగస్వామ్యం ముఖ్యమని భావించిన ప్రభుత్వం 1997 ఏప్రిల్‌లో ఒక చరిత్రాత్మకమైన చట్టాన్ని తెచ్చింది. 'ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల వ్యవస్థల రైతుల యాజమాన్య చట్టం, 1997'లోని అంశాలకు అనుగుణంగా 10,292 'సాగునీటి వినియోగదారుల సంఘాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించింది. రెండో దశగా రాష్ట్రంలోని భారీ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో 174 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 1997 నవంబరులో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన కార్యనిర్వాహక సంఘాలు తమ విధులు నిర్వహిస్తున్నాయి. ఈ రైతు సంస్థలు చట్టానికి అనుగుణంగా విధులు, బాధ్యతలు నిర్వర్తించటానికి సవివర నిబంధనలు రూపొందించారు. అందులో వివిధ రైతు సంఘాల హక్కులు, బాధ్యతలు, సభ్యులైన వినియోగదారుల హక్కులు, వ్యక్తిగత బాధ్యతలు, సర్వసభ్య సమావేశ నియమాలు, ఉపసంఘాల నిర్మాణం, విధులు, పనులు చేపట్టడానికి కార్యవిధానం తదితర అంశాల గురించి వివరించారు. చట్టానికి సంబంధించిన నిబంధనలను నిర్దిష్ట రీతిలో రూపొందించి రైతు సంస్థలకు అందజేసిన అధికార యంత్రాంగాన్ని, దీనికంతటికీ ప్రేరణ శక్తిగా వెనక నిలచిన ముఖ్యమంత్రిని అభినందించాలి. ఏప్రిల్ 27న సాగునీటి వినియోగదారుల సంఘాధ్యక్షుల రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో హాజరయిన రైతు సంస్థల అధ్యక్షులు నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

## అధికారుల దురహంకారం వలస పాలన అవశేషం

అన్యాక్రాంతమయిన ప్రభుత్వ భూములు, సేద్యమవుతున్న భూముల వివరాలు రెవిన్యూ రికార్డులలో చేరకపోవడం, నీటి పారుదల శాఖాధికారులు కొందరు సరిగ్గా పనిచేయక పోవడంపై రైతు ప్రతినిధులు కొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యాలయ భవనాల కొరత, చేపల చెరువులను కౌలుకివ్వడం, తదితర విషయాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి వారికి సముచిత రీతిలో సమాధానాలిచ్చారు. సమావేశం అత్యంత ప్రశాంత వాతావరణంలో రాజకీయ విభేదాలకు అతీతంగా కొనసాగింది. కొందరు నీటిపారుదల శాఖాధికారులు తమకు అవసరమైన సహాయసహకారాలు అందించడం లేదన్న రైతుల ఆవేదన అర్థం చేసుకోదగ్గది. రైతుల విషయంలో అధికార యంత్రాంగానికి సేవానిరతి ముఖ్యం. అధికారదర్పం ప్రదర్శించడం భావ్యం కాదు. బ్రిటిష్ వలస పాలననాటి వ్యవహార సరళికి ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటులేదని అధికారులు గుర్తెరగకపోవడం గర్హనీయం. భారతదేశంపై ఆధిపత్యం సంపాదించాలంటే గ్రామాలు, పల్లెల్లోని రైతులలో తమ ప్రాబల్యాన్ని విస్తరించుకోవాలని నాటి వలస పాలకులు భావించారు. తమ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవాలంటే అదే ఉత్తమ మార్గమన్న అభిప్రాయానికి వచ్చారు. అందుకు నీటిపారుదల శాఖను ఒక ముఖ్య సాధనంగా వినియోగించుకున్నారు. ఆ శాఖ అధికారులకు ఉన్నతమైన హోదా కల్పించి, విశేషాధికారాలు కట్టబెట్టారు. రైతులు వారిచుట్టూ తిరిగితేనేగాని పనులు పూర్తికాని పరిస్థితి కల్పించారు. రైతులపట్ల సేవానిరతికంటె అధికార దర్పం ప్రదర్శించడమే ముఖ్యమని ఆనాటి బ్రిటిష్ పాలకులు భావించారు. స్వాతంత్ర్యానంతరం ఆ ధోరణిలో చాలా మార్పు వచ్చింది. రైతు కుటుంబాల నుంచి కూడా అధికారులు రావడంవల్ల సమన్వయం, సుహృద్భావం పెంపొందింది. కొందరు అధికారులు మాత్రం ఇప్పటికీ పెడపోకడలు ప్రదర్శిస్తున్నారు. ఈ వైఖరి మార్చుకోవడం ఎంతయినా అవసరం. రైతులకు తగిన సహాయ సహకారాలందించడం తమ ఉద్యోగ బాధ్యతలని మరచిపోరాదు. రైతుల ఆదరాభిమానాలు చూరగొనడం ముఖ్యం. ఇన్నాళ్ళు ఎవరిపై అధికారం చెలాయించారో ఇప్పుడు వారికిందనే పనిచేయాల్సి వస్తోందనుకోరాదు. రైతులతో కలిసి పనిచేస్తూ వారి అభివృద్ధికి, దేశాభివృద్ధికి తోడ్పడుతున్నామన్న సంతృప్తి పొందాలి. పంటపొలాలకు నీరందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతుల తిరస్కారానికి గురవుతారు. అది ఏమంత ఆరోగ్యప్రదమైన పరిణామం కాబోదు. రైతులు కూడా అధికారులపట్ల విపరీత అపోహలను విడనాడాలి. తమ తోటి రైతుబిడ్డలేనన్నట్టు ఆదరించాలి. అధికారులు, రైతులు పరస్పరం సమన్వయంతో, సుహృద్భావంతో ప్రవర్తించిననాడు రైతు సంస్థలు అత్యంత సమర్థంగా పనిచేయగలుగుతాయి. ఇప్పటివరకు ఏర్పాటయిన

మొత్తం 10,292 సాగునీటి వినియోగదారుల సంఘాలలో 8,315 చిన్నతరహా ప్రాజెక్టులకు (చెరువులు, బావులు) సంబంధించినవి. 304 మధ్యతరహా ప్రాజెక్టులకు, 1,673 భారీ ప్రాజెక్టులకు సంబంధించిన సంఘాలు ఒకే అంచెగల 8315 చిన్నతరహా ప్రాజెక్టులకు సంబంధించిన సాగునీటి వినియోగదారుల సంఘాలు, పూర్తిస్థాయిలో నీటి పంపిణీకోసం నేరుగా కార్యవర్తన ప్రణాళికలను రూపొందించుకోవచ్చు. రెండంచెల మధ్యతరహా ప్రాజెక్టులకు సంబంధించిన 304 సంఘాలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. మూడంచెల భారీ ప్రాజెక్టులకు సంబంధించిన 1673 వినియోగదారుల సంఘాలు డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ సంఘాలు 174 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకున్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీల నుంచి ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. ఇలా భారీ, మధ్యతరహా ప్రాజెక్టులలో ప్రాజెక్టు స్థాయి సంఘాలేర్పడి, పని చేయడం ప్రారంభించినప్పుడే సాగునీటి నిర్వహణలో రైతుల భాగస్వామ్యం ఫలవంతమవుతుంది. ఈ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తికావాలి. కార్యవర్తన ప్రణాళిక రూపొందాలంటే ప్రాజెక్టు స్థాయి కమిటీలు ఏర్పడాలి. జలాశయంలో ఉన్న నిల్వ పరిమాణాన్నిబట్టి కాలువలకు నీరెప్పుడు వదలాలి; కాలువల్లో పారేటప్పుడు భూమిలోకి ఇంకిపోయే నీటిని అంచనావేసి, మిగిలిన నీటిని ఏ డిస్ట్రిబ్యూటరీకి ఎప్పుడు, ఎంత వ్యవధిలో, ఎన్నితడవలకు పంపిణీ చేయాలి; వర్షపాతానికి అనుగుణంగా నీటి పంపిణీ కాలపట్టికలో చేయాల్సిన మార్పులు వగయిరా వివరాలతో కార్యవర్తన ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. ప్రాజెక్టు స్థాయి కమిటీ వివిధ డిస్ట్రిబ్యూటరీలకు నీటి పంపిణీని నిర్దేశిస్తూ కాల నిర్ణయ పట్టికలను తయారుచేస్తే డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఆ నీటిని ఏమేరకు, ఎప్పుడు ఎంత వ్యవధిలో పంపిణీ చేయాలో నిర్ణయిస్తాయి. మరల ఆ నీటిని వినియోగదారుల సంఘాలు 'వారబందీ' విధానాన్నిబట్టి ప్రతిబోదె కాలువ తూము కిందనున్న రైతులకు వారి భూకమతాల విస్తీర్ణాల నిష్పత్తిలో నీటి పంపిణీకి కాలపట్టికలను రూపొందించి అమలు పరుస్తాయి. ప్రతి రైతు పొలానికి ఏ రోజు ఎన్నిగంటలు నీరందించాలో ముందుగానే నిర్ణయించి, ఆ ప్రకారం విడుదల చేసినప్పుడు ఎగువ కాలువ భాగంలోని రైతులు తమ వాటాకు మించి నీటిని వాడుకోవడం సాధ్యపడదు. ఎవరయినా అలా ప్రయత్నిస్తే వినియోగదారుల సంఘాలలోని రైతులు సమైక్యంగా ప్రతిఘటిస్తారు. పద్ధతి ప్రకారం నీటిని వినియోగించినట్లయితే కాలువ చివరి భూములు కూడా సస్యశ్యామలమవుతాయి.

అందువల్ల కార్యవర్తన ప్రణాళికను అమలుచేయడానికి ప్రాజెక్టు కమిటీల ఏర్పాటు సత్వరం పూర్తికావాలి. అప్పుడే ఆయకట్టు భూమి అంతటికీ నమ్మకంగా, న్యాయోచితంగా నీరందే అవకాశం కలుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, తుంగ మొదలైన అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులలో ఒకే డిస్ట్రిబ్యూటరీకి ఎగువ భాగంలోని భూములను ఆరుతడి పంట దిగువ భాగంలోని భూములను మాగాణి వరి పంటకు నీరందించారు. కాని ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. కాలువ ఎగువ భాగంలోని రైతులు ఆరుతడి పంటలకు బదులు మాగాణి పంటలు పండించి ఎక్కువ నీరు వాడుకుంటున్నారు. దాంతో దిగువ భూములకు నీరు సరయిన పరిమాణంలో అందకపోవడంతో ఆ రైతులు స్థిరీకరించిన మాగాణి పంటలకు బదులు ఆరుతడి పంటలు వేయవలసి వస్తోంది. కానీ చివర కొంత ప్రాంతం బొత్తిగా నీరందక బంజరుగా వృథా అవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏవి మాగాణి భూములో ఏవి ఆరుతడి భూములో ముందుగా తేల్చుకొంటేగాని, వాటికి పంపిణీ కాల నిర్ణయ పట్టికలను తయారు చేయడం సాధ్యంకాదు. అప్పటివరకు మేలయిన కార్యవర్తన ప్రణాళికా రచన వీలుకలగదు. ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాలి.

## భూముల స్థిరీకరణలో సర్దుబాట్లు అనివార్యం

జలాశయాలేర్పడి కాలువలకు నీరు విడుదల చేసినప్పటినుంచి ఇంతవరకు అనేక ప్రాజెక్టులలో డిస్ట్రిబ్యూటరీల ఎగువ భూములలో స్థిరీకరించిన ఆరుతడి పంటలకు బదులు మాగాణి పంటలు పండించడానికి రైతులు అలవాటు పడిపోయారు. దిగువ భాగంలో రైతులు మాగాణి పంటలకు బదులు ఆరుతడి పంటలు పండిస్తున్నారు. ఇన్నాళ్ళుగా అమలులో ఉన్న ఈ పరిస్థితిని మార్చివేసి స్థిరీకరణ ప్రకారమే నీరిస్తామంటే సాధ్యమయ్యే పనికాదు. ఒక డిస్ట్రిబ్యూటరీకి తొలుత కేటాయించిన పరిమాణాన్ని మించకుండా మాగాణి పంటలను పండిస్తే కాలువ ఎగువ భూములను మాగాణి భూములుగా, దిగువ భూములను ఆరుతడి పంట భూములుగా గుర్తించటం తప్ప ప్రస్తుతం గత్యంతరం లేదు. దీని ప్రకారం కాలువ ఎగువ భాగంలోని మాగాణి భూములకు ఖరీఫ్ సీజనులోను, దిగువ భాగంలోని ఆరుతడి పంటలకు రబీ సీజనులోను సాగునీరు అందచేయవచ్చు. ఈ విధంగా కాలువ కిందనున్న మాగాణి ఆరుతడి భూములను ప్రత్యేకంగా సర్దుబాటు చేసినప్పుడు – ఖరీఫ్, రబీ సీజన్లకు వేర్వేరు

కార్యవర్తన ప్రణాళికలు రూపొందించడం సాధ్యపడుతుంది. స్థిరీకరించిన ఆయకట్టు భూమిలో అటువంటి సర్దుబాట్లు జరిగేవరకు ఏ భాగంలో మాగాణి పంటలకు నీరివ్వాలో ఏ భాగంలో ఆరుతడి పంటలకు నీరివ్వాలో నిర్ణయించే కార్యవర్తన ప్రణాళికను రూపొందించడం కష్టం. ఈ సమస్యను రైతు సంస్థలతో చర్చించి సాధ్యమైనంత త్వరలో పరిష్కారాన్ని వెతకడం అవసరం. ఆయకట్టు భూమిలో సర్దుబాట్లు తిరిగి కార్యవర్తన ప్రణాళికలు అమలయ్యేట్టయితే రైతు సంస్థల పర్యవేక్షణలో నీటిపొదుపువల్ల కాలువ చివరి భూములకు కూడా నీరంది వ్యవసాయోత్పత్తులు అధికమవుతాయి. రైతు సంస్థల ప్రతినిధుల ప్రభుత్వ సిబ్బందికి చట్టంలోని వివిధాంశాలు, నియమనిబంధనలు సరిగ్గా అవగాహన అయ్యేందుకు జిల్లా, మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించడం అవసరం. సందేహాల నివృత్తి చేస్తూ, శిక్షణ తరగతులను క్రమబద్ధంగా నిరంతరం కొనసాగించాలి. సాగునీటి నిర్వహణలో అనుభవం కలిగిన అధికారులను శిక్షకులుగా వినియోగించాలి. రైతుసంస్థల ప్రతినిధులు సుశిక్షితులై యాజమాన్య స్పృహతో వ్యవరించిననాడు ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకే కాక ఇతర దేశాలకు కూడా మార్గదర్శకమవుతుందనడం అతిశయోక్తి కాబోదు.

*ది. 22-05-1998.* — *ఈనాడు*

# గందరగోళానికి ఇకనైనా తెర!

పోతిరెడ్డిపాడు వివాదం మరోమారు రాజుకుంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 60 వేల క్యూసెక్కులకు పెంచనున్నారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. అధికార-ప్రతిపక్ష సభ్యుల మధ్యేకాదు, పాలకపార్టీలోని ప్రాంతీయ నాయకుల మధ్యసైతం ఈ విషయంలో ఘర్షణ తలెత్తింది. కరవు 'సీమ'లోనూ సిరులు పండించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు ఇది. దీని హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం 44 వేల క్యూసెక్కులకు మించదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో - అయోమయానికి తెరపడినట్టే. అసలు ఈ సమస్యపై వివాదం చెలరేగడానికి ఇదివరకటి జీవోలు కూడా కొంతవరకు కారణమే.

## శాంతియుతంగా పరిష్కారం

రాష్ట్రప్రభుత్వం కొంతకాలం క్రితం విడుదల చేసిన జి.ఒ.107, జి.ఒ.170, జి.ఒ.233లతో పాటు ఈ ఏడాది జనవరి నాలుగున విడుదల చేసిన జి.ఒ.నెం.3లు పోతిరెడ్డిపాడు విషయంలో అయోమయ పరిస్థితికి దారితీశాయి. శ్రీశైలం జలాశయంలో కనీస నీటిమట్టాన్ని 834 అడుగుల నుంచి 854 అడుగులకు పెంచుతూ ప్రభుత్వం 2004 సెప్టెంబరు 28న ఉత్తర్వు జారీచేసింది. 15 లక్షల ప్రజలకు తాగునీటిని, 7.63 లక్షల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేస్తామంటూ హామీ ఇచ్చింది. 40 వేల క్యూసెక్కుల కృష్ణానదీజలాలను పోతిరెడ్డిపాడు రెగ్యులేటరు ద్వారా విడుదల చేసేందుకు వీలుగా అదనపు తూముల నిర్మాణం, శ్రీశైలం కుడి ప్రధానకాల్వను వెడల్పుచేయడం, బనకచర్ల కాంప్లెక్సు వద్ద శ్రీశైలం కుడి బ్రాంచి కెనాల్ రెగ్యులేటర్‌కు అదనపు తూముల ఏర్పాటు తదితర చర్యలకోసం రూ. 1252 కోట్ల పనులకు ప్రభుత్వం నిరుడు (2005) సెప్టెంబరు 13న పాలనపరమైన అనుమతి ఇచ్చింది. నాగార్జునసాగర్ ఎడమ, కుడికాల్వల కింద ఆయకట్టుకు, ప్రకాశం బ్యారేజీ కింద ఉన్న ఆయకట్టు ప్రయోజనాలకు

ఈ జి.ఓ.ల వల్ల భంగం వాటిల్లవచ్చని పలువర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కొన్ని రాజకీయ పక్షాల్లోని రాయలసీమ ప్రాంత నాయకులు ఈ జి.ఓ.ల పట్ల సానుకూలతను వ్యక్తం చేయగా తెలంగాణా, కోస్తా, ఆంధ్రప్రాంత నాయకులు వాటిని తీవ్రంగా వ్యతిరేకించారు. జి.ఒ.170లో 7.63 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరాకు 'హామీ' ఇవ్వడం కొన్ని ప్రాంతాల వారికి అభ్యంతరకరంగా ఉండటంతో రాష్ట్రప్రభుత్వం ఆ పదాన్ని తొలగించి 'వీలుకల్పించేందుకు' అనే పదాన్ని చేర్చింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజార్వ్వయర్ల నుంచి నీటి విడుదల సమయంకానీ, ప్రాధాన్యతలు - విధివిధానాల ప్రస్తావనకానీ జి.ఒ. 170లో లేవనే విమర్శలు వచ్చాయి. ఎన్.టి. రామారావు ప్రభుత్వ హయాంలో 1996 జూన్ 15న జారీచేసిన జి.ఒ. 69లో పేర్కొన్న విధివిధానాలే పోతిరెడ్డిపాడు రెగ్యులేటరు నుంచి నీటివిడుదలకు కూడా వర్తిస్తాయని జి.ఒ.233లో పేర్కొనడం ద్వారా వాటికి రాష్ట్రప్రభుత్వం జవాబు ఇచ్చింది. తెలుగుగంగకు, శ్రీశైలం కుడి గట్టు కాల్వకు కృష్ణానది వరదజలాల్నే పూర్తిగా అందించవలసి ఉంటుందని జి.ఒ. 170లో పేర్కొన్నారు. కానీ, తెలుగుగంగకు 15 టి.ఎం.సి.లు, శ్రీశైలం కుడి గట్టు కాల్వకు 19 టి.ఎం.సి.ల నికర కేటాయింపు లోగడే ఉంది. కాబట్టి జి.ఒ.233లో ఈ విషయాన్ని పేర్కొంటూ ఇంతకుమించిన నీటిని కృష్ణా వరద జలాల నుంచి పొందవలసి ఉంటుందని స్పష్టం చేశారు. అయినా వివిధ ప్రాంతాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు, పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదనలను సమీక్షించేందుకు నిరుడు డిసెంబరులో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసిన ప్రభుత్వం, వ్యూహాత్మకంగా చర్చను పోతిరెడ్డిపాడుకే పరిమితం చేసింది. తరచుగా కరవు రక్కసి బారిన పడుతున్న అనంతపురంజిల్లా ప్రజలకు ఉపయోగకరమైన పెన్న అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పి.ఎ.బి.ఆర్.)కు తుంగభద్ర హైలెవెల్ కెనాల్ నుంచి 10 టి.ఎం.సి.ల నీటిని ఇచ్చి, శ్రీశైలం నుంచి 10 టి.ఎం.సి.ల నీటిని కె.సి. కెనాల్‌కు అందించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. నిజానికి అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం చేయాల్సిన పని అప్పటివరకు పలు దఫాలుగా జారీచేసిన జి.ఒ.లను క్షుణ్ణంగా పరిశీలించడం; బచావత్ ట్రిబ్యునల్ తీర్పును దృష్టిలో ఉంచుకొని అన్నిప్రాంతాల్లోని రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కృష్ణాజలాలను ఏవిధంగా ఉపయోగించుకోవాలో, వివిధ ప్రాంతాల్లోని రైతుల మధ్య అపోహలు తలెత్తకుండా, ద్వేషభావాలు పొడసూపకుండా ఉండటానికి జి.ఒ.ల్లో ఏ విధమైన మార్పులు చేయాలో ఆలోచించడం. కానీ, దురదృష్టవశాత్తు కొన్ని పక్షాలు అఖిలపక్ష సమావేశం నుంచి

వాకౌట్ చేశాయి. పి.ఎ.బి.ఆర్.కు సంబంధించిన ప్రభుత్వ ప్రతిపాదనకు మాత్రం దాదాపు అన్ని పక్షాలు అంగీకరించాయి. అత్యంత వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి సౌకర్యాన్ని విస్తరించేందుకు వివిధ పథకాలను చేపట్టి, శీఘ్రంగా పూర్తి చేయాలన్న సూచననూ అన్ని పార్టీలూ ఆమోదించాయి. దరిమిలా పెన్న అహోబిలం బ్యాలెన్సింగు రిజర్వాయరుకు లోగడ కేటాయించిన 5 టి.ఎం.సి.ల నీటిని 10 టి.ఎం.సి.లకు పెంచుతూ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నాలుగున జి.ఒ.3ని విడుదల చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు ద్వారా 40 వేల క్యూసెక్కులకు బదులు 44 వేల క్యూసెక్కుల నీటిని 30 రోజుల్లో పంపాలని నిర్ణయించినట్టు ఈ జి.ఓ.లో ప్రభుత్వం స్పష్టంచేసింది.

దీనివల్ల రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకు అవరోధం ఏర్పడవచ్చునని తెలంగాణాకు చెందిన కొందరు అధికార పార్టీవారు, ఇతర రాజకీయ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యవల్ల యావత్ తెలంగాణా ప్రయోజనాలకే విఘాతం కలుగుతుందన్నది వారి వాదన. ప్రధాన ప్రతిపక్షానికి చెందిన రాయలసీమ నాయకులు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపునకు అనుకూలంగా ఉండగా, నల్గొండకు చెందిన నాయకులు, కోస్తా ఆంధ్రకు చెందిన కొందరు నాయకులు దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అవసరమైతే ఉద్యమం చేపడతామంటున్నారు. ఈ సమస్యను శాంతియుతంగా, సహేతుకంగా, న్యాయబద్ధంగా పరిష్కరించవలసిన అవసరం ఉంది. ఈ సందర్భంగా భౌగోళిక పరిస్థితులను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. 150 ఏళ్ల చరిత్రగల కృష్ణాడెల్టా, 40 ఏళ్ల చరిత్రగల సాగర్ ఆయకట్టు రైతుల హక్కులను ప్రభుత్వం కాపాడుతుందని వారి అసరాలు తీరాకే ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తామని కొన్ని నెలల క్రితం ముఖ్యమంత్రి అన్నారు. నాగార్జున సాగర్‌కు శంకుస్థాపన జరిగి 50 ఏళ్ళు అయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ ప్రకటన ఆచరణలోకి రావాలంటే – శ్రీశైలం రిజర్వాయరు కనీస నీటిమట్టాన్ని 834 అడుగుల నుంచి 854 అడుగులకు పెంచుతూ జారీచేసిన జి.ఒ. 107ను ప్రభుత్వం ఉపసంహరించవలసి ఉంటుంది. ప్రకాశం బ్యారేజి కింద ఉన్న సుమారు 13 లక్షల ఎకరాల ఆయకట్టు భూమి నల్లరేగడి భూమి. ప్రకాశం బ్యారేజీ క్రెస్ట్ లెవెల్‌కు, సముద్ర మట్టానికి మధ్య తేడా చాలా స్వల్పం. నైరుతి రుతుపవనాల రాకతో వ్యవసాయ సీజను

ప్రారంభమవుతుంది. సాధారణంగా నవంబరు, డిసెంబరు మాసాల్లో సంభవించే తుపాన్లు, ఉప్పెనల బారినుంచి తప్పించుకోవాలంటే జూన్ ద్వితీయార్థం నుంచి నాట్లు వేసుకోవలసి ఉంటుంది. వర్షాకాలంలో ఈ భూమిలో వరి, చెరకు తప్ప వేరే పంటలను సాగుచేసే అవకాశాలు ఉండవు. నాగార్జున సాగర్ ఆయకట్టులో వరిపంట వేసే భూమిలో కూడా కుడి ఎడమగా ఇదే పరిస్థితి ఉంటుంది. కర్ణాటకలో ఆలమట్టి డ్యాం పూర్తవటం, కృష్ణానదిలో కలిసే పలు ఉపనదులపై కర్ణాటకలో, మహారాష్ట్రలో చెక్‌డ్యాంలు, అడ్డుకట్టలు కట్టడం వల్ల పై రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు పడితే తప్ప శ్రీశైలం డ్యాంలోకి నీరు వచ్చే పరిస్థితి లేదు. కృష్ణానదిపై కర్ణాటక కడుతున్న ప్రాజెక్టులను బ్రిజేష్‌కుమార్ కమిటీ ఆమోదించటం సమస్యను మరింత సంక్లిష్టం చేసే పరిణామమే. శ్రీశైలం వద్ద 854 అడుగుల కనీస నీటిమట్టం కొనసాగితేనే 841 అడుగులకుపైన చేరే నీరు పోతిరెడ్డిపాడు రెగ్యులేటరు ద్వారా దాని కింద ఉన్న ఆయకట్టుకు వెళ్తుంది. అలాంటి సందర్భాల్లో కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టు జోన్ 1లోని నాట్లు చాలా ఆలస్యమై వరిపంట తుపాన్ల బారినపడే ప్రమాదం ఉంటుంది. వరి పంట దిగుబడులు తగ్గడమేకాకుండా వరి తరవాత వేసే మినుము, పెసర, వేరుసెనగ వంటి పంటల దిగుబడులు కూడా తగ్గుతాయి. శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకన్నా తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ అవసరమైనప్పుడు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా నీటిని విడుదల చేయవచ్చునని జి.ఒ. 107లో పేర్కొన్నారు. అయినప్పటికీ సాగర్, కృష్ణా డెల్టా రైతులు ఊరట చెందడం లేదు. బాధ్యతగల ప్రజాప్రతినిధులే గతంలో బలవంతంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ షట్టర్స్‌ను ఎత్తివేసిన అనుభవం ఉందని, అలాంటి చర్యల వల్ల తమకు నష్టం చేకూరుతుందని, సకాలంలో దిగువకు నీరు రాకపోవచ్చునని వారు సందేహిస్తున్నారు. ఈ దృష్ట్యా జి.ఒ.107ను ఉపసంహరించుకోవడమే జి.ఒ.69ను కచ్చితంగా అమలు చేయడానికి సరైన మార్గం.

మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారికి ఉన్న అపోహలను తొలగించాలన్నా, ముఖ్యమంత్రి హామీ అమలు జరగాలన్నా మరొక ముఖ్యమైన పని చేయాలి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44వేల క్యూసెక్కులకు పెంచడాన్ని ఎవరు వ్యతిరేకించినా సరికాదు. దీనిపై ఎవరికీ అభ్యంతరాలు ఉండనక్కర్లేదు. కృష్ణా నదిపైన లోగడే నిర్మాణమై ఉన్న ప్రాజెక్టుల కింద ఆయకట్టుల అవసరాలు తీర్చడంతోపాటు, రాయలసీమ జిల్లాల్లో, ప్రకాశం జిల్లాలోని దర్శి, పొదిలి, మార్కాపురంలలో, తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లా తదితర ప్రాంతాల్లో సాగునీటిని, ఫ్లోరైడ్

పీడితులకు తాగునీటిని అందించాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు వెలుగోడు ప్రాజెక్టు, నెట్టెంపాడు, కల్వకుర్తి వంటి పథకాలను సత్వరంగా అభివృద్ధి చేయడం ఎంతైనా అవసరం.

## సమగ్ర జి.ఒ. తేవాలి

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ + 841 అడుగుల ఎత్తులో క్రెస్ట్ ఉంది. ఇప్పటి వరకు ఈ రెగ్యులేటర్ నుంచి 11,000 క్యూసెక్కుల నీరు ప్రవహించే సామర్థ్యం ఉంది. ఇప్పుడు కొత్త హెడ్ రెగ్యులేటర్‌ను 44,000 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. కొత్త హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పూర్తయ్యాక పాతదాన్ని మూసివేస్తామని ప్రభుత్వం అంటోంది. శ్రీశైలం దిగువ ప్రాజెక్టు ఆయకట్టుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, శ్రీశైలం కుడి ప్రధాన కాల్వకింద లక్షలాది ఎకరాలకు కృష్ణా వరద జలాలను మళ్లించాలంటే మరొక ముఖ్యమైన కట్టడాన్ని నిర్మించాలి. శ్రీశైలం డ్యాం ఎగువ భాగం నుంచి కుడివైపున పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వరకు సుమారు 3.73 మీటర్ల వెడల్పుగల శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ ఉంది. ఈ కాల్వపైన ముందు ప్రాంతంలో 841 అడుగుల స్థాయిలో 11,000 క్యూసెక్కుల నీరు ప్రవహించేటట్లు తూములు ఏర్పరచాలి. దానిపైన 870 అడుగుల ఎత్తుపైనుంచి వరద జలాల నీటి ప్రవాహాన్ని శ్రీశైలం కుడి ప్రధాన కాల్వలోకి ప్రవహించే ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తే ఎవరూ అభ్యంతరంపెట్టే అవసరం ఉండదు.

పులిచింతల ప్రాజెక్టును పూర్తిచేసి పోలవరం లేక దుమ్ముగూడెం పథకాల ద్వారా గోదావరి జలాలను కృష్ణకు అనుసంధించిన నాడు శ్రీశైలం రిజర్వాయరు కనీస నీటిమట్టాన్ని 854 అడుగులకు పెంచినా ఎవ్వరూ అభ్యంతరం పెట్టరు. ఆందోళనలకు ఆస్కారం ఉండదు. ప్రభుత్వం పంతాలకు పోకుండా ఈ అంశాలనన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మూడు ప్రాంతాల్లోని ప్రజలకు న్యాయం జరిగేలా, ట్రిబ్యునల్ తీర్పునకు అనుగుణంగా వరద జలాలను సద్వినియోగపరచి లక్షల ఎకరాల బీడుభూములను సస్యశ్యామలం చేసేలా సమగ్రమైన జి.ఒ.ను తీసుకురావాలి. సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలి.

*ది. 14-09-2006.* *- ఈనాడు*

●

# వరద నివారణకోసం బహుముఖయత్నం

సర్వసాధారణంగా జులై, ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో వరదలవల్ల దేశంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరుగుతూ ఉంటుంది. ఈ ఏడాదిలో అప్పుడే వరదల కారణంగా ఉత్తరప్రదేశ్‌లో 184 మంది, రాజస్థాన్‌లో 134 మంది మృతిచెందారు. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, పశ్చిమబెంగాల్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ గణనీయమైన జననష్టం జరిగింది. ఇకముందేమి కానుందో చెప్పలేం. గత సంవత్సరం విరుచుకుపడ్డ వరదల్లో యాభైలక్షల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయి 955 కోట్ల మేరకు నష్టం వాటల్లినట్లు అంచనా. ఇది కేవలం పంటనష్టమేకాగా, ఇతరేతర నష్టాలన్నీ కలిపి 2380 కోట్లు ఉంటుందని లెక్కలు తేల్చారు. 1986లో పలు రాష్ట్రాల్లో వరదలవల్ల రికార్డుస్థాయిలో రమారమి 3747 కోట్ల నష్టం సంభవించినట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. ఆ సంవత్సరం గోదావరి తదితర నదీనదాలకు వరదలు రాగా ఆంధ్రప్రదేశ్‌లో పంటలకు సుమారు రూ. 407 కోట్ల మేర నష్టం వాటిల్లింది. గత అయిదు సంవత్సరాలుగా క్రమం తప్పక వస్తున్న ఉపద్రవాల కారణంగా రాష్ట్రాలు ఎంతగానో నష్టపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు పగబూనినప్పుడు అత్యధికంగా నష్టపోయేది రైతులే. కానీ వీరికి అందించే తదనంతర సహాయం అత్యల్పం. అదికూడా తర్వాతి పంట వేసుకునేందుకు సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే అందిస్తుంటారు. ఫలితంగా ఆంధ్రరాష్ట్రంలోని కోస్తా జిల్లాల రైతాంగం పరిస్థితి నానాటికీ తీసికట్టుగా దిగజారిపోతోంది.

## ఏటా రెండు వేల కోట్ల నష్టం

దేశం విస్తీర్ణంలో ఎనిమిదోవంతు అంటే నాలుగు కోట్ల హెక్టార్లు వరద ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అందులో మూడు కోట్ల ఇరవై లక్షల హెక్టార్ల భూమికి వరద ప్రమాదం నుండి రక్షణ కల్పించడానికి అవకాశం ఉందని వరదల జాతీయ

కమీషన్ పేర్కొంటోంది. 1953 నుంచి 1982 వరకుగల మూడు దశాబ్దాల కాలంలో దేశానికి వరదలవల్ల సగటున 450 కోట్ల మేర నష్టం జరిగింది. 1983లో 2292 కోట్లు, 1984లో 1650 కోట్లు, 1985లో 3500 కోట్ల రూపాయల భారీ నష్టం సంభవించింది. ఇప్పటి ధరల ప్రకారం గణాంకాలు తీస్తే, దేశం సగటున ఏటా రెండువేల కోట్ల రూపాయలు నష్టపోతున్నట్లే లెక్క. ఇంత భారీయెత్తున నష్టం దేశప్రగతికి పెనుసవాళ్ళు విసురుతున్నా పాలకులు మాత్రం వరదప్రమాదాల నిరోధక చర్యలపై దృష్టి కేంద్రీకరించడం లేదనే చెప్పాలి. ఆరో ప్రణాళికాంతానికి సుమారు కోటి ఇరవై లక్షల హెక్టార్ల భూమిని కొంతమేరకు వరదల నుండి రక్షించడానికి 1763 కోట్ల ఖర్చుకాగల పథకాలను చేపట్టారు. 1954 నుండి చూస్తే సుమారు 14,511 కిలోమీటర్ల పొడవునా కట్టలు నిర్మించడం, 2,838 కిలోమీటర్ల డ్రైనేజి కాల్వలు తవ్వించడంతోపాటు 459 పట్టణాలను వరదప్రమాదం నుండి రక్షించడానికి చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే ఏడో ప్రణాళికాకాలంలో కేవలం 0.50 శాతం నిధులను మాత్రమే ఈ పనులకు కేటాయించడాన్నిబట్టి కీలక సమస్యపట్ల ప్రభుత్వం కనబరుస్తున్న శ్రద్ధాసక్తులు ఏపాటివో తేటతెల్లమవుతుంది. సమస్య పరిష్కారమార్గాలు అన్వేషించేందుకు పలు కమిటీలు నియమించినా, వాటి నివేదికలు మాత్రం నిర్లక్ష్యపు నిబిడాంధకారంలో మగ్గుతున్నాయనే చెప్పాలి. బ్రహ్మపుత్రా నదితోసహా అనేక నదులపై ఆనకట్టలు కట్టి నలభై అయిదుకోట్ల ఎకరా అడుగుల నీటిని నిల్వచేయగలిగినా, ఇంకా తొంభై కోట్ల ఎకరా అడుగుల నీరు వృథాగా సముద్రంపాలవుతూనే ఉంది. ఈ నీటివల్ల ప్రజాబాహుళ్యానికి నష్టం చేకూరకుండా ఎలా తీసుకువెళ్లాలన్నదే జటిలమైన సమస్య. 1954లో డాక్టర్ ఎ.సి. మిత్రా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నతాధికార కమిటీ భారతదేశంలో ప్రధానమైన నదులన్నింటికీ 'మాస్టర్‌ప్లాన్'లు తయారుచేసి అమలుజరపాలని సిఫారసు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫార్సులను ఆమోదించినా, ఇప్పటివరకు ఒక్క దామోదర్ నది విషయంలోనే దాన్ని అమలుజరిపారు. అస్సాం ప్రజలు తమకొక శాపంగా దాపురించిదని భావించే బ్రహ్మపుత్రా నదికి ఇంతవరకు ఈ సిఫార్సులను అమలుచెయ్యనేలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో అయితే మామూలు వర్షపాతానికితోడు హిమాలయ పర్వత శ్రేణుల్లోని మంచు జులై, ఆగస్ట్ మాసాల్లో సూర్యరశ్మి తీవ్రతకు కరిగి నదుల్లోకి చాలా నీరు వచ్చి చేరుతుంది. కనుక కాస్తంత భారీవర్షాలు పడితేచాలు ఆయా రాష్ట్రాలు వరదలపాలు కాక తప్పడంలేదు.

చీటికిమాటికి వరదల విపత్తు ముంచుకురావడానికి అడవుల నరికివేత ముఖ్యకారణం అవుతోంది. దేశంలో ఆరుకోట్ల డెబ్బయ్‌లక్షల హెక్టార్ల అటవీ భూమి ఉందని ప్రభుత్వ లెక్కలు. ఇందులో మూడుకోట్ల డెబ్బయ్‌లక్షల హెక్టార్లలో మాత్రమే తగినంత వృక్షసంపద ఉందనీ, మిగిలిన భూభాగంలో అడవులు 'నామ్‌కేవాస్తే'గా ఉన్నాయని తెలుస్తోంది. దట్టమైన అడవులు ఉంటే నేలమీద గడ్డి, ఆకుఅలములు ఉండి వర్షం పడ్డప్పుడు భూమిపై మట్టి ఎక్కువగా కొట్టుకుపోదు. చాలాభాగం వర్షపునీరు భూమిలోకి ఇంకుతుంది. కానీ అడవుల నరికివేతవల్ల వాననీరు భూమిలోకి ఇంకకుండా వేగంగా పల్లపు ప్రాంతాల్లోకి ప్రవహిస్తూ మట్టిని కోసుకుంటూపోతుంది. ఈవిధంగా దేశంలో ఏటా ఆరువందల కోట్ల టన్నుల సారవంతమైన పైపొర మన్ను కొట్టుకుపోయి నదీగర్భంలో, రిజర్వాయర్లలోనూ మేటవేస్తుంది. భూమిపై పొర మట్టి చాలా విలువైనది. ఒక్క అంగుళం మందాన పైపొర ఏర్పడడానికి సుమారు అయిదు వందల నుంచి వెయ్యి సంవత్సరాల కాలం పట్టవచ్చు. మట్టి అంటే కేవలం జడపదార్థంకాదు. అందులో సాధారణంగా కళ్ళకు కన్పించని కోట్లకొలది జీవరాశులు సూక్ష్మరూపంలో ఉంటాయి. ఈ సారవంతమైన పైపొర ఊడ్చిపెట్టుకుని పోతుండడంతో ఆరువేల కోట్ల రూపాయల విలువచేసే మూడుకోట్ల టన్నుల ఆహారధాన్యాలను నష్టపోతున్నామని వ్యవసాయ శాఖ అంచనాలు చెబుతున్నాయి. ఇంత నష్టాన్ని ఎదుర్కొంటూ దేశం ప్రగతిని సాధించడం కష్టసాధ్యమనే చెప్పాలి.

## అతివృష్టి-అనావృష్టి

విచారకరమైన విషయమేమంటే దేశంలోని కొన్ని ప్రాంతాలు అతివృష్టితో సతమతమవుతూ వరదల తాకిడితో అల్లాడిపోతుంటే, మరికొన్ని తాగడానికి గుక్కెడు నీరు సైతం కరువై తీవ్ర అనావృష్టి పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు 1985లో తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు వరద దెబ్బకు దిమ్మెరబోతే; రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు కరువు రక్కసి కాటుకు గురైనాయి. ఈ రెండురకాల విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే చర్యలేవీ ఈనాటివరకూ ప్రభుత్వం చేపట్టలేకపోయింది. వరద నిరోధక కార్యక్రమాల అమలు బాధ్యత ఇప్పటివరకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ మీదనే ఉంది. వరద ప్రమాదాలను తగ్గించడానికి ఎక్కడ ఎత్తయిన కట్టలు నిర్మించాలి, ఎక్కడ రిజర్వాయర్లు ఏర్పాటుచేయాలివంటి ఆలోచనలకే ఈ శాఖ

పరిమితమయ్యింది. అంతేగాని, అసలు వరదలు రాకుండా అరికట్టే మార్గాలను అన్వేషించి తగినచర్యలకోసం ఈ శాఖ ఇంతవరకు చొరవ చూపలేదనే చెప్పాలి. ముఖ్యంగా నదులు, వాగులు, సెలయేళ్లు పుట్టి ప్రవహించే ప్రదేశాల్లో ఎక్కువగా చెట్లు పెంచి, పచ్చికను విస్తరింపజేయడం ద్వారా ఎక్కువ భాగం వర్షపునీరు అక్కడే భూమిలోకి ఇంకిపోతుంది. ఆయా ప్రాంతాల్లోని ప్రజాబాహుళ్యాన్ని – ముఖ్యంగా రైతులను వ్యవసాయ కూలీలను ఈ తరహా కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలి. అడవుల పరిరక్షణ చట్టాన్ని సవరించి, ప్రజలకు ఉపయోగపడే మామిడి, నేరేడు, జామ, సపోట చెట్లను కూడా అటవీ ప్రాంతంలో నాటి, వాటి ఫలాలను అనుభవించే అవకాశం వారికి కల్పించాలి. ఇలా చేసినందువల్ల గొడ్డలి వేటుకు గురైన అటవీప్రాంతంలో పచ్చదనం సత్వరం వెల్లివిరుస్తుంది. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వ యంత్రాంగం వల్లనే ఫలప్రదం కావు. ప్రజల పాత్ర లేనప్పుడు నిధులు దుర్వినియోగం అయ్యే అవకాశమూ వుంది.

అలాగే నిరుపయోగంగా పడివున్న లక్షలాది ఎకరాలలో 'వాటర్‌షెడ్' పథకాలను విస్తృతంగా చేపట్టాలి. నేల తీరునుబట్టి కాంటూర్ దుక్కిదున్నడం చేపట్టాలి. కాంటూర్ గట్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి వీలయినంత ఎక్కువ పరిమాణంలో చేరునట్లు చేయడమేగాక, భూక్షయాన్ని నివారించడానికి పంటల దిగుబడి పెంచడానికి చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగాలి. అలాగే ఉప్పొంగే నదుల జీవతరంగాలు ఉప్పుసముద్రం పాలవకుండా సక్రమ మార్గాలకు మళ్ళించి వరదలకు కొంతమేర అడ్డుకట్ట వేయవచ్చు. పుష్కలంగా లభించే నీటిని జాతీయ సంపదగా గుర్తించి విద్యుదుత్పాదన వంటి రంగాలకు ఈ సంపదను పెట్టుబడిగా పెట్టి వేలాది మెగావాట్ల వెలుగుల్ని లాభాలుగా ఆర్జించవచ్చు. వర్షాకాలంలో ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరే నీటిని నిల్వ చేసుకునేవిధంగా రిజర్వాయర్లను, ఆనకట్టలను నిర్మించుకుంటే వరద ఉధృతికి కాస్తంత పగ్గం వెయ్యవచ్చు.

## సఫలీకృతులైన సోవియట్లు

ముంచెత్తే వరదల నుండి పంటభూములకు రక్షణ కల్పించడమేగాక, ఆ నీటిని తరచు దుర్భిక్షానికి గురయ్యే ప్రాంతాలకు తరలించడం ద్వారా కరువును అధిగమించగలిగే అవకాశం ఉంది. ఈ సమున్నత లక్ష్యం సిద్ధించాలంటే సోవియట్

యూనియన్ పనితీరును పరిశీలించాలి. సోవియట్‌లో సైబీరియా నదులను మళ్ళించి మధ్యఆసియా రిపబ్లిక్‌కు తీసుకెళ్లారు. సైబీరియాలోని ఓబ్, ఇరిటెక్ నదులకు 2200 కిలోమీటర్ల పొడవున కాలువ నిర్మించి కజక్ నదులైన సిర్‌దర్యా, ఆముదర్యాలతో కలిపారు. ఫలితంగా సాగునీరు సరిగ్గా లభ్యం కాని మధ్య ఆసియా ప్రాంతానికి ఇప్పుడు సమృద్ధిగా నీరు లభ్యమవుతోంది. సాగు విస్తీర్ణం మూడురెట్లు పెరిగింది. సోవియట్ ప్రజలు అపరభగీరథులుగా మారి శోకనదిగా భావించే 'యెన్ సీ'ని 'భాగ్యనది'గా మార్చడంలో కృతకృత్యులయ్యారు. భారతదేశంలో కూడా ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టే వెసులుబాటు ఉంది. గంగానదిని మధ్యప్రదేశ్‌లోని నదులతో అనుసంధించవచ్చు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి కృష్ణలను కలువవచ్చు. ప్రఖ్యాత ఇంజనీర్లు సర్ ఆర్థర్ కాటన్, కె.ఎల్. రావులు ఈ విషయమై ఎన్నో విలువైన సూచనలు చేశారు. వీటిపై సమగ్రమైన పరిశీలన జరిపి దశలవారీగా గంగా-కావేరీ అనుసంధాన పథకాన్ని అమలుచేయాలి. ఈ బృహత్‌పథకంలో రైతులను, వ్యవసాయ కూలీలను భాగస్వాములుగా చేస్తే తప్పక సత్ఫలితాలు చేతికందుతాయి. కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా కృష్ణా డెల్టాలో అవసరమైనదానికన్నా అధికంగా సాగునీటిని వినియోగిస్తున్నాం. ఈ నీరు మురుగుకాల్వలోకి వెళ్ళి, పల్లపు దిగువ ప్రాంతాల భూములను ముంపునకు గురిచేస్తుంది. వరిపంటకు రెండు అంగుళాల నీరు సరిపోతుంది. ఇంతకన్నా ఎక్కువ మందాన నీరు వుంటే చెరుపేగాని లాభం ఉండదు. తక్కువ నీరు ఉన్నప్పుడే దుబ్బు ఎక్కువ చిట్లమారి అధిక దిగుబడికి దోహదం చేస్తుంది. 1987 నాటి దాళ్వా పంట, 89 నాటి సార్వా పంట సమయాల్లో ఈ విషయం రుజువయ్యింది. కనుక రైతాంగం ముఖ్యంగా డెల్టాలో ఎగువన వున్న రైతులు సాగునీటిని పొదుపుగా వాడటం ద్వారా తాము లాభమూ పొందవచ్చు. దిగువన మురుగును, ముంపును తగ్గించనూవచ్చు. మెట్ట ప్రాంతాల్లో వాగులపై, చిన్నచిన్న నదులపై చెక్ డ్యాంలను నిర్మించడం; వీలయినన్ని చెరువులు, రిజర్వాయర్లు ఏర్పాటుచేయడం ద్వారా కూడా అదనంగా భూమికి నీటివసతి కల్పించడమేగాక దిగువ ప్రాంతాలకు వరద తీవ్రత తగ్గించవచ్చు. చెరువుల్లో మేటలను తొలగించి కట్టలు బలపర్చడం ద్వారా ఆయకట్టు భూములకు సకాలంలో సరిపడు నీటిని ఇవ్వడమేగాక వరద ప్రమాదాలు తగ్గించడానికి కూడా వీలవుతుంది. కొన్ని సందర్భాలలో వరదవల్ల వచ్చే నీటి పరిణామాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోవడంతో రిజర్వాయర్లు, డ్యాంల

గేట్లు తెరిచి చాలా నీటిని కిందికి వదులుతూ ఉంటారు. ఇందువల్ల దిగువ ప్రజానీకానికి ఎంతో నష్టం చేకూరడమేగాక కొద్దికాలం తర్వాత ఆయకట్టుకు నీరు అందించలేని దురవస్థ ఏర్పడుతుంది. తమ్మిలేరు రిజర్వాయరు వద్ద అనేక పర్యాయాలు ఇట్లాగే జరిగింది. అందువల్ల ఆధునిక పరికరాలు ఉపయోగించి రిజర్వాయరు భద్రతకు హాని లేకుండా ఎంత నీటిని ఆపవచ్చో తెలుసుకుని అలా వ్యవహరించడం ఉభయతారకంగా వుంటుంది.

## 'సహాయం'కన్నా నిరోధమే లాభదాయకం

వరద నిరోధక పథకాలకు తగిన కేటాయింపులు చేసి అమలు జరపకపోవడంతో ఇప్పుడు వరద సహాయచర్యలపై అధిక మొత్తాలను వెచ్చించాల్సి వస్తోంది. ఉదాహరణకు 1978–79లో వరదలను అరికట్టడానికి 170 కోట్లు ఖర్చుచేయగా, వరద సహాయ చర్యల నిమిత్తం మూడువందల కోట్లు వెచ్చించారు. అలాగే 1980–81 సంవత్సరంలో నిరోధానికి 165 కోట్లు, పునరావాస కార్యక్రమాలకు 230 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది.


భారత రాజ్యాంగం ప్రకారం 'వరదలు' అనే అంశం రాష్ట్రాల పరిధిలో ఉంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో వరదల నివారణ ఫెడరల్ ప్రభుత్వాల బాధ్యత. గతానుభవాలను గమనించి ఈ అంశాన్ని ఉమ్మడి జాబితాలోకి చేర్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇరిగేషన్, వ్యవసాయం, అటవీ శాఖల సమన్వయంతో కార్యక్రమాలను అమలుచేసినప్పుడే ఏటేటా సంభవిస్తున్న నష్టాలను సమర్థంగా అధిగమించడం సాధ్యమవుతుంది. వరదకాటుకు గురై సర్వస్వాన్నీ కోల్పోయే ఆపన్నులను ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వాలు చురుకుగా ముందడుగు వేయాల్సిన తరుణమిదే.

– *ఈనాడు*

●

Blank Page

# 7 వ అధ్యాయం



# విద్యుత్ సంస్కరణలు

Blank Page

# దేశీయ పరిష్కారం వదిలి విదేశీ ప్రయోగం?

ఏటికేడు తప్పని కరెంటు కోతలతో వ్యవసాయ రంగంలో పంట నష్టం, పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి నష్టం, వీటన్నింటినీ మించి ఆయా రంగాలే జీవనాధారమైన కర్షక, కార్మిక సోదరులకెంతో కష్టం-తప్పడం లేదు. ఈ వెతలపై ఇంతకాలం ప్రజలకు ఏవో కథలు చెప్పి బండి నెట్టుకొచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మధ్యనే నిర్దిష్ట కార్యాచరణకు ఉపక్రమించాయి. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో - విద్యుత్ రంగం రుగ్మతలను నయం చెయ్యడానికే విదేశీ పెట్టుబడుల ప్రిస్క్రిప్షనే సరైనదని చకచకా ఒప్పందాలు కుదుర్చుకొంటున్నాయి. 'లేడికి లేచిందే పరుగు' చందంగా ముందు వెనకలు ఆలోచించకుండా కుదుర్చుకొంటున్న 'అగ్రిమెంట్లు' నిర్దుష్టంగా ఉన్నాయని చెప్పలేము. కొన్ని రాష్ట్రాల్లో విద్యుత్ బోర్డులు, విదేశీ విద్యుత్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, విదేశీ పెట్టుబడిదారులకు గ్యారంటీలు ఇవ్వడం, కేంద్ర ప్రభుత్వం 'తగుదునమ్మా' అంటూ కౌంటర్ గ్యారంటీ ఇస్తుండటం వంటి చర్యలు విమర్శనీయమవుతున్నాయి. రాష్ట్ర విద్యుత్ బోర్డులు నష్టాల్లో కూరుకుపోయి ఉన్నందున కొత్తగా విద్యుత్ కేంద్రాల స్థాపనకు వాటి చెంత వనరులు లేవు కాబట్టి, విదేశీ పెట్టుబడులను అనుమతిస్తున్నామని, ఇక దేశీయంగా లభ్యమయ్యే వనరులను ప్రజా సంక్షేమంకోసం వెచ్చించగల వెసులుబాటుంటుందనీ పాలకులు నమ్మబలుకుతున్నారు. 'అయినవాళ్లకు ఆకుల్లో - కానివాళ్లకు కంచాల్లో' అన్నట్లు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నందున భవిష్యత్తులో దేశ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతినిపోయే ప్రమాదం పొంచి ఉంది. వెలుగుల్ని పంచాల్సిన ఈ పథకంలో దాగిన చీకటి కోణాలను, కరెంటు కష్టాల పూర్వాపరాలను పరిశీలించడం సందర్భోచితం.

## వెంటాడుతున్న 'లోటు'

సమాజాభివృద్ధికి, ఆధునిక నాగరికతకు తలసరి విద్యుత్ వినియోగాన్నే గీటురాయిగా పరిగణిస్తున్నారు. కెనడాలో విద్యుత్ తలసరి వినియోగం 12 వేల

యూనిట్లు కాగా, అమెరికాలో పదివేలు, జపాన్‌లో ఏడువేలు, కొరియాలో రెండువేల యూనిట్ల మేరకు ఉంది. అదే చైనాలో 600 యూనిట్లు, పాకిస్తాన్‌లో 340 యూనిట్లు ఉండగా, ఇండియాలో 1991-92లో తలసరి విద్యుత్ వినియోగం 268 యూనిట్లు మాత్రమే. 1985-86లో ఉన్న 178 యూనిట్లతో పోలిస్తే ఇది గణనీయ పెరుగుదలేగాని, అవసరాల రీత్యాకాదు. దేశీయంగా కొన్ని ప్రాంతాల్లో తలసరి వినియోగం మరీ తక్కువ. దేశంలోని పశ్చిమ ప్రాంతంలో విద్యుత్ వినియోగం అత్యధికంగా 319 యూనిట్లు ఉండగా, దక్షిణాదిన 286, ఉత్తరాదిన 265, తూర్పు ప్రాంతంలో 150, ఉత్తర ఈశాన్య ప్రాంతంలో అతి తక్కువగా 88 యూనిట్లు మాత్రమే వినియోగిస్తున్నారు. తలసరి వినియోగం ఏటా ఏడు శాతం చొప్పున పెరుగుతోంది. ఇటీవలే రాష్ట్ర ప్రతిపత్తి పొందిన ఢిల్లీ అత్యధికంగా తలసరి 758 యూనిట్లు వాడుతోంది. పంజాబ్ 616, గుజరాత్ 504, హర్యానా 455, మహారాష్ట్ర 434, తమిళనాడు 335 యూనిట్లు తలసరి వినియోగం ఉండగా ఆంధ్రప్రదేశ్ 191 యూనిట్లతో వెనకబడి ఉంది. దేశంలోనే అతి తక్కువగా సిక్కిం తలసరి వినిమయం 20 యూనిట్లు మాత్రమే. విద్యుదుత్పాదన రంగం ఏ తీరుగా ఉందో పరిశీలించాలి. ఇండియాలో మొట్టమొదటిసారిగా 1897లో డార్జిలింగ్‌లో విద్యుదుత్పాదనకు శ్రీకారం చుట్టారు. 1902లో కర్నాటకలోని శివసముద్రం దగ్గర జలవిద్యుత్ స్టేషన్ నిర్మించారు. 1950లో విద్యుదుత్పాదన సామర్థ్యం 1713 మెగావాట్లు ఉండగా, ఏడో ప్రణాళికాంతానికి 69,074 మెగావాట్ల ఉత్పాదక శక్తిని నెలకొల్పగలిగారు. వివిధ రాష్ట్రాల విద్యుత్ బోర్డుల యాజమాన్యం కింద 44,758 మెగావాట్లు, కేంద్ర రంగంలో 18,110 మెగావాట్లు, ప్రైవేటు రంగంలో 2973 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యాన్ని సమకూర్చారు. సగటున వార్షికంగా 9.6 శాతం చొప్పున ఉత్పాదకశక్తి అభివృద్ధి చెందుతూ వచ్చింది. దాదాపు 80 శాతం ఉత్పాదక శక్తిని స్వదేశీ యంత్ర సామగ్రితోనే నెలకొల్పగలిగారు. దేశంలో విద్యుత్ వినియోగం 1950లో 415 కోట్ల కిలోవాట్స్ నుంచి 21 వేలకోట్ల కిలోవాట్లకు - దాదాపు 50 రెట్లు పెరిగిందన్నమాట! అయినా అనేక రాష్ట్రాలు విద్యుత్ వెతలతో సతమతమవుతున్నాయి. విద్యుత్-లోటు కారణంగా వ్యవసాయ, పారిశ్రామికోత్పత్తులకు వేల కోట్ల రూపాయల నష్టం సాధారణమైపోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ఎనిమిదో ప్రణాళికా కాలంలో 30,537 మెగావాట్ల అదనపు ఉత్పాదక సామర్థ్యాన్ని సాధించాలని జాతీయాభివృద్ధి మండలి నిర్ణయించింది. 9282 మెగావాట్ల జల విద్యుత్, 20155 మెగావాట్ల థర్మల్ విద్యుత్, 1100 మెగావాట్ల

అణువిద్యుత్తు – లెక్కన ఉత్పాదక శక్తిని పెంచాలని నిర్ణయించి – ఎనిమిదో ప్రణాళికలో విద్యుత్ రంగానికి రూ. 79,589 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 24,337 కోట్లు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు రూ. 25,086 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. అదే సమయంలో – విద్యుత్ రవాణాకు రూ. 4436 కోట్లు, పంపిణీకి రూ. 17,844 కోట్లు కేటాయించారు. ఇంత చేసినా ఎనిమిదో ప్రణాళిక చివరికి – దేశవ్యాప్తంగా విద్యుత్ సాధారణ కొరత తొమ్మిదిశాతం, గరిష్ట స్థాయి కొరత 20.7 శాతం ఉండవచ్చునని 14వ పవర్‌సర్వే పేర్కొంటోంది.

## నిర్వహణ లోపాలకు నిదర్శనలెన్నో....

ఏటా తప్పని పీడగా దాపురించిన విద్యుత్ కొరతను సమగ్రంగా విశ్లేషిస్తే నేతల హ్రస్వదృష్టి, యాజమాన్య లోపాలు స్పష్టంగా కన్పిస్తాయి. 1950 నాటికి దేశంలో 560 మెగావాట్ల జల విద్యుత్, 1153 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం ఉంది. గత సంవత్సరం మార్చి చివరినాటికి 19,567 మెగావాట్ల జలవిద్యుత్, 53,045 మెగావాట్ల థర్మల్ విద్యుత్, 1785 మెగావాట్ల అణువిద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్ని నెలకొల్పారు. మొత్తం విద్యుదుత్పాదక శక్తిలో జలవిద్యుత్తు వాటా 27.8 శాతం కాగా, థర్మల్ వాటా 04.9 శాతం కాని, జల, థర్మల్ విద్యుదుత్పాదన సామర్థ్యం 40:60 నిష్పత్తిలో ఉంచటం వాంఛనీయం. 1960–80 మధ్యకాలంలో మాత్రం జల విద్యుత్ వాటా 40 శాతానికి తక్కువ కాకుండా ఉండింది. 1980 దరిమిలా జల విద్యుత్ వాటా క్రమేణా తగ్గింది. నీటిపారుదల రంగం అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన అసంబద్ధ వైఖరే ఇందుకు ప్రధాన కారణం. జల విద్యుదుత్పత్తి ఖర్చు చాలా తక్కువే. రవాణా పని ఉండదు. వెయ్యి మెగావాట్ల జల విద్యుత్ స్టేషన్ వల్ల సంవత్సరానికి 40 లక్షల టన్నుల బొగ్గు ఆదా అయినట్లే! దేశంలో 90వేల మెగావాట్ల జల విద్యుదుత్పత్తికి అవకాశం ఉన్నా – అందులో ఇప్పటికి కేవలం 18 శాతాన్నే ఉపయోగించుకోగలుగుతున్నాం. ఒక యూనిటు జల విద్యుదుత్పత్తికి ఆంధ్రప్రదేశ్‌లో 9.4 పైసలు, గుజరాత్‌లో 10.6 పైసలు, హర్యానాలో 12 పైసలు, కర్నాటకలో 19 పైసలు, పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 70 పైసల వ్యయమవుతుంది. అదే థర్మల్ విద్యుత్ విషయంలో ఒక్కో యూనిటుకు మధ్యప్రదేశ్‌లో 50 పైసలు, ఆంధ్రప్రదేశ్‌లో 58 పైసలు, బీహార్‌లో 136 పైసలు వ్యయమవుతుంది. దీన్నిబట్టి చూస్తే థర్మల్ విద్యుత్‌తో పోలిస్తే అతి తక్కువ ఖర్చుతో జల విద్యుత్‌ను సరఫరా చెయ్యవచ్చు. రాష్ట్ర

విద్యుత్ బోర్డులపైనా తక్కువ భారం పడుతుంది. నేతల్లో ఈ అవగాహనాలోపం అడుగడుగునా కళ్లకు కడుతోంది. రవాణా, పంపిణీల్లో దాదాపు 22.9 శాతం విద్యుత్ వృధాగా పోతోందని ప్రభుత్వమే అంగీకరిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ నష్టం ఆరు శాతానికి మించదు. 1989-90 నాటి ఉత్పత్తి రేటు లెక్కన గుణిస్తేనే 4300 కోట్ల యూనిట్లమీద - ఈ విధంగా దేశం రూ. 4200 కోట్లు నష్టపోయింది. రవాణా పంపిణీ నష్టాలు దేశంలో దక్షిణాన అతి తక్కువగా 19.76 శాతం ఉండగా, ఉత్తరాదిన 25.8 శాతం ఉన్నాయి. దీన్ని పది శాతానికి తగ్గించుకోగలిగితే - ఏటా దాదాపు రూ. 2,500 కోట్లు ఆదా అయినట్లే! భారీ పెట్టుబడులతో స్థాపించిన విద్యుత్కేంద్రాలు ఎక్కువగా పనిచేస్తూ ఉండాలి. ఇలా పనిచేసే అవకాశం మాహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో 82 నుంచి 85 శాతం ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో 52 శాతం, బీహార్‌లో 46 శాతం మాత్రమే! పనిచేసే అవకాశాన్ని పెంచడం ద్వారా విద్యుత్ సంస్థల నష్టాలను తగ్గించవచ్చు! అనేక విద్యుత్ బోర్డుల్లో అవసరానికి మించి ఉద్యోగులున్నారు. స్థిరీకరించిన ప్రమాణాల మేరకు ఉద్యోగుల సంఖ్యను కుదించగలిగితే రెవిన్యూ ఖాతాలో ఏటా రూ. 500 కోట్ల మేరకు ఖర్చు తగ్గుతుంది. ప్లాంట్ లోడ్ ఫాక్టర్ (పి.ఎల్.ఎఫ్) తక్కువగా ఉండటం కూడా విద్యుత్ బోర్డుల నష్టాలకు ప్రధాన కారణం. నాణ్యత తక్కువగా ఉన్న బొగ్గు, తగినంత గ్యాస్ సరఫరా కాకపోవడం, యంత్రపరికరాల లోపాలు పి.ఎల్.ఎఫ్ తక్కువగా ఉండటానికి కారణాలు. దక్షిణాదిన పి.ఎల్.ఎఫ్ అత్యధికంగా 62.6 శాతం ఉంటే, ఈశాన్య ప్రాంతం ఉత్తర భాగంలో అతి తక్కువగా 24.3 శాతం ఉంది. పి.ఎల్.ఎఫ్‌లో ఒక్కశాతం పెరుగుదల సాధిస్తే 510 మెగావాట్ల విద్యుత్తును అదనంగా పొందినట్లవుతుంది. అంటే రూ. 1500-2000 కోట్ల పెట్టుబడి కలసి వచ్చినట్లే! థర్మల్ ప్లాంట్లు మూతబడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమూ ఉంది.

## నిర్దుష్ట చర్యలు పూజ్యం

సగటున ఒక్కో యూనిట్ విద్యుత్ సరఫరాకు 1974-75లో 22.5 పైసలు వ్యయం కాగా, అది 84-85 నాటికది 65 పైసలకు, 94-95 నాటికి సుమారు 160 పైసలకు చేరుకుంది. దేశంలో విక్రయిస్తున్న విద్యుత్తులో వ్యవసాయ రంగానికి 27.5 శాతం, పారిశ్రామిక రంగానికి 97.8 శాతం, గృహావసరాలకు 16.5 శాతం, వాణిజ్యావసరాలకు 4.75 శాతం, రైల్వే విద్యుద్దీకరణకు 2.15 శాతం

వినియోగిస్తున్నారు. వ్యవసాయ, గృహావసరాలకు తక్కువ రేటుకు కరెంటు సరఫరా చేస్తుండటంతో అనేక రాష్ట్రాల విద్యుత్ బోర్డులు నష్టాల్లో నడుస్తున్నాయి. ఉదాహరణకు – వ్యవసాయరంగానికి సబ్సిడీ ధరపై విద్యుత్ సరఫరా చేయడంవల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ 93-94లో రూ. 807 కోట్లు, గృహావసరాలకు సరఫరా చేసిన దానిపై రూ. 117 కోట్ల ఆదాయం కోల్పోయింది. వాణిజ్య, పారిశ్రామిక రంగ వినియోగదార్లనుంచి అధికమొత్తాలు ఛార్జి చెయ్యడం ద్వారా నష్టాల్ని నియంత్రణలో పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రయత్నించగా – మరికొన్ని రాష్ట్రాలు విద్యుత్ సంస్థలకు సబ్సిడీలిస్తున్నాయి. 93-94లో మొత్తం రాష్ట్ర విద్యుత్ బోర్డుల నష్టం రూ. 5,400 కోట్లకు చేరింది. ఫలితంగా ఉత్పాదక శక్తిని పెంచుకోవడానికి అవసరమైన నిధులను సమీకరించుకోవడంలో విద్యుత్ బోర్డులు అవరోధాలనెదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో-వ్యవసాయ రంగానికి సరఫరా చేస్తున్న విద్యుత్ ఛార్జీలను మరీ తక్కువ స్థాయి నుంచి కాస్త సరసమైన స్థాయికి పెంచాల్సిన అవసరం ఉంది. తాను భరించగల సరసమైన ధరకు, రోజుకు పది లేదా పన్నెండు గంటలు నిరాఘాటంగా సరైన ఓల్టేజితో కరెంటు ఇస్తే రైతుకు అంతకంటే కావల్సిందేముంటుంది? దీంతోపాటు విద్యుత్ బోర్డుల నిర్వహణ సామర్థ్యం మెరుగుపరిచి, రవాణా, పంపిణీ నష్టాలను తగ్గించి, ప్లాంట్ లోడ్ ఫాక్టర్‌ను గణనీయంగా పెంచడం, థర్మల్ విద్యుత్కేంద్రాలను సమర్థంగా పనిచేయించడం, జల విద్యుదుత్పత్తి కనీసం 40 శాతం ఉండేలా తదనుగుణ చర్యలు తీసుకోవడం వంటి రాజమార్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వదిలిపెట్టాయి. ఈ చర్యలేవీ చేపట్టకుండా, కేవలం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి కరెంటు కష్టాలను అధిగమించాలను కొంటున్నారు. పర్యవసానంగా భవిష్యత్తులో విద్యుత్ రేట్లు దారుణంగా పెరిగి-ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దేశార్థికాన్ని దెబ్బతీసే దుష్పరిణామాలు సంభవిస్తాయి.

*ది. 09-01-1994.* **– ఈనాడు**

●

# విద్యుత్ రంగంలో చీకటి కోణాలు

ఆంధ్రప్రదేశ్‌లోని జేగురుపాడులో 172 మెగావాట్లు, విశాఖపట్నం వద్ద వెయ్యి మెగావాట్లు, కాకినాడ సమీపంలో 200 మెగావాట్లు, మహారాష్ట్రలోని దాభోల్‌వద్ద 1920 మెగావాట్లు, కర్నాటకలో మంగుళూరు వద్ద వెయ్యి మెగావాట్లు, ఒరిస్సాలోని ఐ.బి. వ్యాలీలో 420 మెగావాట్లు, తమిళనాడులో 210 మెగావాట్ల యూనిట్లకు కేంద్రప్రభుత్వం అనుమతించింది. విదేశీ విద్యుత్ సంస్థల షరతులన్నింటికీ ఆమోదం తెలిపింది. ఈ పవర్ ప్రాజెక్టుల స్థాపనకయ్యే పెట్టుబడిని వారే తెస్తున్నందున ఇందులో ఆదా అయ్యే వనరులను ఇతరేతర ప్రాజెక్టులకు మళ్లించి దేశాభివృద్ధికి కృషి చెయ్యగలమని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. కానీ దేశీయంగా పారిశ్రామిక రంగానికి పెట్టుబడులు సమకూర్చే ఐ.డి.బి.ఐ., ఐ.ఎఫ్.సి.ఐ., ఐ.సి.ఐ.సి తదితర సంస్థల నుంచి ఈ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో 40 శాతాన్ని అప్పుగా తీసుకోవడానికి విదేశీ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి అనుగ్రహించింది. దీనివల్ల ఈ ఆర్థిక సంస్థలు దేశీయంగా నెలకొల్పవలసిన ఇతర ప్రాజెక్టులకు నిధులు సమకూర్చలేవు. ప్రాజెక్టుకు కావలసిన పెట్టుబడిలో 20 శాతం ఈక్విటీగా ఉంటేచాలనీ, అందులో 11 శాతం మాత్రం ప్రమోటర్ల వాటాగా పెట్టి మిగతా మొత్తాన్ని ప్రజల నుంచి షేర్ల రూపేణా సేకరించడానికి ప్రభుత్వం అంగీకరించింది. నిర్మాణ దశలో ఖర్చుమీద కూడా వడ్డీకట్టి, ఉత్పత్తి ప్రారంభించేనాటికి పెట్టిన మొత్తం పెట్టుబడిపైన పన్నులు పోను 16 శాతం నికర లాభానికి రాష్ట్రవిద్యుత్ బోర్డులు, ప్రభుత్వాలు గ్యారంటీ ఇచ్చాయి. కనుకనే ప్రాజెక్టు పెట్టుబడి అంచనాలను ఇంతంతలు చేసి చూపుతున్నారు.

1960 దశకంలో అదనంగా ఒక మెగావాట్ విద్యుదుత్పాదక సామర్థ్యం సాధించాలంటే 26 నుంచి 30 లక్షల రూపాయల వ్యయమయ్యేది. ఎనిమిదో ప్రణాళికలో ఈ వ్యయం మూడుకోట్ల 32 లక్షలకు పెరుగుతుందని ప్లానింగ్ కమిషన్ వర్కింగ్

గ్రూపు అంచనా వేసింది. విదేశీ సంస్థలు మాత్రం ఒక్కో మెగావాట్ విద్యుదుత్పాదనకు నాలుగు కోట్లకుపైగా పెట్టుబడి అవసరమవుతుందన్న అంచనాలతో ముందుకు వెళు తున్నాయి. చిత్రమేమిటంటే ప్రాజెక్టుల ప్రతిపాదనల విషయంలో గ్లోబల్ టెండర్లు పిలవడం లేదు. వేలకోట్ల రూపాయల వ్యయంకాగల ఈ పథకాల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించడంలేదు. తక్కువ ధరకు ప్రాజెక్టు నెలకొల్పేందుకు వివిధ సంస్థలు పోటీపడి ముందుకు వచ్చే అవకాశమే కల్పించలేదు. విద్యుత్‌బోర్డు, రాష్ట్రప్రభుత్వం, విదేశీ–స్వదేశీ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారడానికి అవకాశాలు పుష్కలం. అంతకంటే దిగ్భ్రమగొల్పే అంశం మరొకటి ఉంది. విదేశీ సంస్థలతో కుదుర్చుకున్న 'అగ్రిమెంట్ల'ను రహస్యంగా ఉంచుతున్నారు. ఈ సంస్థలు ఉత్పత్తిచేసే విద్యుత్తును రాష్ట్రవిద్యుత్ బోర్డులు ఎంత ధరకు కొనాల్సి ఉంటుందో పేర్కొనే పవర్ పర్చేజ్ ఎగ్రిమెంట్‌ను 'సీల్డ్ కవర్'లో ఉంచుతారట. మహారాష్ట్ర శాసనసభ్యులు ఈ అంశంపై ఎంతగా ప్రశ్నించినా ప్రభుత్వం సమాధానాన్ని దాటవేసింది. విద్యుదుత్పత్తి మొదలైన తర్వాత దాన్ని వాడుకోవాల్సిన వినియోగదారులకు తాము సుమారుగా ఎంత ధర చెల్లించాల్సి ఉంటుందో తెలుసుకొనే హక్కు ఉండితీరాలి! సాధ్యమైనంత తక్కువ ధరకు విద్యుత్తును పొందడానికి ఈ దేశంలో వినియోగదారుడికి ప్రాథమికంగా హక్కుందనీ, ప్రైవేటు రంగంలో విద్యుచ్ఛక్తిని పెంపొందించే పథకం ఈ ప్రాథమిక అంశాన్ని విస్మరించరాదని ప్లానింగ్ కమిషన్ సభ్యులు జి.వి. రామకృష్ణ విద్యుత్‌శాఖ మంత్రికి రాసిన లేఖలో స్పష్టంచేశారు. ఇప్పటివరకు దేశంలో విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని నెలకొల్పడం, పెంపొందించడంలో ప్రముఖ పాత్ర వహించిన పబ్లిక్ రంగ సంస్థలను అలక్ష్యంచేసి విదేశీ పెట్టుబడిదార్లకు పెద్దపీట వేయడం సముచితం కాదనీ ఆయన పేర్కొన్నారు.

దేశీయ విద్యుత్‌రంగంలో కీలక భూమిక పోషించిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బి.హెచ్.ఇ.ఎల్.) ఏటా 4,800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు 1345 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి చేయగల యంత్రసామాగ్రిని తయారు చెయ్యగలదు. ఇందులో దాదాపు 80 వేలమంది ఇంజనీర్లు, కార్మికులు పనిచేస్తున్నారు. 'భెల్'కు 165 అనుబంధ పరిశ్రమలున్నాయి. సుమారు 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్న 1700

చిన్నపరిశ్రమలు భెల్‌కు కావలసిన కొన్ని వస్తువులను తయారు చేస్తున్నాయి. భెల్‌కు 90-91లో 2010 మెగావాట్లు, 91-92లో 373 మెగావాట్లు, 92-93లో 1330 మెగావాట్లు సామర్థ్యంగల పవర్‌ప్లాంట్ల ఆర్డరు లభించిందని గత ఏడాది ఆగష్టు నాలుగున ప్రధాని స్వయంగా పార్లమెంటులో వెల్లడించారు. ఎన్.టి.పి.సి. గానీ, విద్యుత్ బోర్డులుగానీ నిధుల కొరత కారణంగానే ఆర్డర్లు ఇవ్వలేకపోతున్నాయన్నారు. ఇప్పుడు విదేశీ సంస్థలకిచ్చే గ్యారంటీలు, కౌంటర్ గ్యారంటీలు ఇస్తే ఎన్.టి.పి.సి., రాష్ట్ర విద్యుత్ సంస్థలకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు నాలుగు, అయిదు శాతం వడ్డీకి వేలకోట్ల రూపాయల రుణాలు ఇస్తాయి. ఇలా చేయకుండా విదేశీ సంస్థలకు 16 శాతానికి పైగా నికరలాభం ఇవ్వడంలోని ఔచిత్యం ఏమిటో ఏలినవారికే తెలియాలి.

ఆందోళన కలిగించే అంశాలు మరికొన్ని ఉన్నాయి. భారతదేశంలోని ఆర్థిక సంస్థల నుంచి ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం అప్పు తీసుకొని, అవసరమైన యంత్ర సామగ్రిని బి.హెచ్.ఇ.ఎల్. నుంచి కాక విదేశాల నుంచి హెచ్చుధరలకు దిగుమతి చేసుకుంటారు. ఈ సంస్థల ప్రాజెక్టుల వ్యయం ఎంత ఎక్కువ చూపితే వారికంత లాభం. కానీ, విద్యుత్ ధరవరలు ఇంతింతలై వినియోగదార్ల గూబ గుయ్‌మంటుంది. 68.5 శాతం ప్లాంట్ లోడ్ ఫాక్టర్‌పైన ప్రతి పాయింట్‌కు ప్రాజెక్టు పెట్టుబడిపై 0.7 శాతం చొప్పున 16 శాతం లాభాన్ని అదనంగా ముట్టచెబుతారు. అంటే ఈ సంస్థలు 85-90 పి.ఎల్.ఎఫ్.తో నడిస్తే విదేశీ పెట్టుబడిదారులు తమ మూల ధనాలపై సుమారు 30 శాతం నికర లాభాలు దండుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇదే విధమైన ప్రోత్సాహకాలను దేశీయంగా సమర్థంగా పనిచేస్తూ అధిక పి.ఎల్.ఎఫ్ సాధించిన విద్యుత్ సంస్థలకు ఇవ్వడంలేదు. ఓవంక పోటీ ఉండాలంటూనే స్వదేశీ సంస్థలకు లేని గ్యారంటీలు, కౌంటర్ గ్యారంటీలు విదేశీ సంస్థలకివ్వడం ఏం సబబు?

ఇన్ని రాయితీలు, సౌకర్యాలు కల్పించినప్పటికీ, వారు కోరుతున్న విధంగా ఒప్పందాలు కుదుర్చుకొన్నందువల్ల వాటినుండి రాష్ట్రవిద్యుత్ బోర్డులకు సరఫరా అయ్యే కరెంటు యూనిట్‌కు రూ. 2.50 నుండి మూడు రూపాయలు పడుతుంది. దీనికి ట్రాన్స్‌మిషన్ నష్టాలు, పంపిణీ వ్యయం కలిపితే భవిష్యత్తులో వినియోగదారులకు యూనిట్‌కు రూ. 4 పైనే విక్రయించాల్సి ఉంటుంది. ఈ రేటుచొప్పున అమ్మకపోతే విద్యుత్ బోర్డుల నష్టాలు ఇప్పటి రూ. 5000 కోట్ల స్థాయినుంచి రూ.18 వేల కోట్లకు

పెరుగుతాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్‌లో హిందూజాతో, జేగురుపాడువద్ద జి.ఎ.కె. ఇండస్ట్రీస్, కాకినాడ దగ్గర స్పెక్ట్రమ్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రాష్ట్ర విద్యుత్‌బోర్డుకు రూ. 1793 కోట్లు, అలాగే మంగుళూరు వద్ద కో–జెనిట్రిక్స్ సంస్థతో ఒప్పందం వల్ల కర్నాటక విద్యుత్‌బోర్డుకు రూ. 1309 కోట్లు నష్టం రానున్నదని విద్యుత్ రంగంపై నేషనల్ వర్కింగ్ గ్రూప్ పార్లమెంటరీ స్థాయీ సంఘానికి సమర్పించిన మెమొరాండంలో పేర్కొన్నారు. వీటన్నింటి దృష్ట్యా వ్యవసాయోత్పత్తుల, పారిశ్రామికోత్పత్తుల ధరలూ 'షాక్' కొట్టే ప్రమాదం ఉంది. ఫలితంగా విదేశీ ఎగుమతులకూ అవరోధం ఏర్పడుతుంది. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశార్థికాన్ని కుంగదీసే ఈ విద్యుత్ పథకాలపై పునరాలోచన ఎంతైనా అవసరం.

*ది. 29-11-1994.* — *ఈనాడు*

●

# వ్యవసాయ విద్యుత్ టారిఫ్ పెంపు అనివార్యం?

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శ్వేతపత్రాన్ని ప్రకటించింది. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక క్లిష్టపరిస్థితి ఈ శ్వేతపత్రంలో ప్రస్ఫుటమవుతున్నది. పలుమార్గాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేకూరుతున్న ఆదాయం, వివిధ పద్దుల కింద జరుగుతున్న వ్యయం, ప్రభుత్వం తీసుకున్న రుణాలు, వాటిపై చెల్లిస్తున్న వడ్డీ తదితర అంశాల వివరాలు శ్వేతపత్రం ద్వారా బహిర్గతమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈనాటి ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడడానికి దోహదపడగల మార్గాలను, చర్యలను సూచించవలసినదని ముఖ్యమంత్రి వివిధ వర్గాలవారికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని ఎంతమాత్రం అలక్ష్యం చేయరాదు. ఆర్థిక దుస్థితి ప్రజా సంక్షేమానికి గొడ్డలిపెట్టు కారాదు. ఆర్థికంగా మరికొన్ని ఇతర రాష్ట్రాలు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సైతం సంతృప్తికరంగా లేదు. ఇతర రాష్ట్రాలుగానీ, కేంద్ర ప్రభుత్వంగానీ ఇంతవరకు శ్వేతపత్రాలను ప్రచురించలేదు. ప్రభుత్వాలు ఏ స్థితిలో ఉన్నాయో ప్రజలు తెలుసుకుని వారి సహాయ సహకారాలను అందించాలంటే అన్ని విషయాలను వెల్లడించక తప్పదు.

## సబ్సిడీల పెనుభారం

ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డు ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ఇటీవలి శ్వేతపత్రం తెలియపరిచింది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న థర్మల్, హైడల్ విద్యుచ్ఛక్తిని లోటెన్షన్ వినియోగదారుడికి సరఫరా చేసేందుకు సగటున యూనిటు ఒక్కంటికి 183 పైసలు ఖర్చవుతుండగా, ఒక హార్సు పవరుకు సంవత్సరానికి రూ. 50 చొప్పున వ్యవసాయ వినియోగదారునుంచి సగటున యూనిటుకు కేవలం 3 పైసలు మాత్రమే వసూలు చేస్తున్నట్లు శ్వేతపత్రం వెల్లడించింది. 1995-96లో 8500 మిలియన్ యూనిట్లను

వ్యవసాయ రంగానికి సరఫరా చేయడంతో దాదాపు రూ. 1530 కోట్ల సబ్సిడీ భారం విద్యుచ్ఛక్తి బోర్డుపై పడిందని తెలిసింది. రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డుపై పడుతున్న ఈ భారాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 1356 కోట్ల రుణాన్ని ఈక్విటీగా మార్చింది. అనగా అది పెట్టుబడిగా మారింది. వ్యవసాయం, గృహ అవసరాలకు సరఫరా చేస్తున్న విద్యుచ్ఛక్తిపై వస్తున్న నష్టాన్ని కొంతవరకు భర్తీచేయడానికి హైటెన్షన్ వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నారు. విద్యుచ్ఛక్తి బోర్డు తన సబ్సిడీ భారాన్నంతా హైటెన్షన్ వినియోగదారులపై మోపితే రాష్ట్రంలో పరిశ్రమలు దెబ్బతిని మూతపడే ప్రమాదం ఉంది. అయితే, వ్యవసాయ రంగానికి విద్యుచ్ఛక్తిని తక్కువ ధరకు సరఫరా చేయడంవల్ల మాత్రమే కాక బోర్డు నష్టాలకు ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ఇతర కారణాలమీద దృష్టిని ప్రసరింపచేయాలి. రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు నష్టాల ఊబిలోనుంచి బయటకు రావడానికి వెంటనే కొన్ని కఠిన నిర్ణయాలు చేయకతప్పదు. వివిధ రంగాలలో విద్యుచ్ఛక్తి వినియోగం పెరుగుతున్నది. విద్యుచ్ఛక్తి బోర్డులు నష్టాలతో నడుస్తున్నందున కొత్త విద్యుచ్ఛక్తి కేంద్రాలను స్థాపించే కార్యక్రమం ముందుకు సాగడంలేదు. అవసరాలకు తగినంత విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాకపోవడంవల్ల కోత అనివార్యమవుతున్నది. కోత కారణంగా పంటల ఉత్పత్తి దెబ్బతిని ఆహారధాన్యాల, ఇతర నిత్యజీవితావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తికి విఘాతం కలుగుతున్నది. రాష్ట్రం, దేశం ప్రగతి మార్గాన పయనించాలంటే విద్యుచ్ఛక్తి తగినంత సరఫరా కావాలి. దేశంలో 1996-97 నాటి విద్యుచ్ఛక్తి డిమాండు 41,600 కోట్ల యూనిట్లు కాగా, 39,900 కోట్ల యూనిట్లే ఉత్పత్తి అవుతున్నదని అంచనా. గరిష్ఠ స్థాయిలో డిమాండు 73,600 మెగావాట్లని అందుబాటులో ఉన్న విద్యుచ్ఛక్తి 60,200 మెగావాట్లని కూడ అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని, ప్రయివేటు రంగంలోని విద్యుచ్ఛక్తి కేంద్రాలలో అదనంగా 30,500 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి శక్తిని కల్పించాలన్నది లక్ష్యం కాగా 18 వేల మెగావాట్ల అదనపు ఉత్పత్తి శక్తిమాత్రమే చేకూరింది. ఈ పరిస్థితిలో కొరత ఇంకా పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 1995 మార్చి 31నాటికి థర్మల్ రంగంలో 2453 మెగావాట్ల సహజవాయు ఆధార రంగంలో 100 మెగావాట్ల, జలవిద్యుత్ రంగంలో 2656 మెగావాట్ల, వాయు ఆధార రంగంలో 5 మెగావాట్ల ఉత్పత్తి శక్తిని కల్పించారు. ఇదిగాక రాష్ట్ర వాటాగా కేంద్ర ప్రభుత్వ రంగంలోని రామగుండం సూపర్ థర్మల్‌స్టేషన్ నుంచి

580 మెగావాట్లు, నైవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ నుంచి 277 మెగావాట్లు, మాచ్‌ఖండ్ ప్రాజెక్టు నుంచి 40 మెగావాట్ల విద్యుత్ లభిస్తోంది. 6111 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి శక్తి రాష్ట్రం అవసరాలను తీర్చలేకపోతున్నందున రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు ఇతర రాష్ట్రాల బోర్డులు లేదా సంస్థల నుంచి 9456 మిలియన్ యూనిట్లు కొని సరఫరా చేస్తున్నది. అయినా, కోత, కొరత తప్పడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి అవసరాలు నానాటికీ పెరుగుతున్నాయి. కాలువ నీటిసౌకర్యం లేని ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధికి విద్యుచ్ఛక్తి ఎంతో అవసరం. 1995 మార్చినాటికి 16,05,807 పంపుసెట్లతో ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండోస్థానం (మహారాష్ట్ర తరువాత స్థానం) ఆక్రమించింది. వ్యవసాయ పంపుసెట్ల విద్యుదీకరణకు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ ద్వారా ముఖ్యపాత్ర నిర్వహించింది. రాష్ట్రంలో 1984 నుంచి వ్యవసాయ రంగంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు స్లాబురేటు అమలులోకి వచ్చింది. అంతకుముందు రైతులు యూనిటుకు 18 పైసలు చొప్పున చెల్లించేవారు. స్లాబు రేటు బాగుంటుందని రైతులు కోరారు. డాక్టర్ చెన్నారెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్లాబు రేటు విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని నియమించారు. అప్పుడు పార్లమెంటు సభ్యులుగా ఉన్న పి. రాజగోపాలనాయుడు, శాసనసభ్యులుగా ఉన్న నేను, పాల్వాయి గోవర్ధనరెడ్డి ఈ కమిటీలో సభ్యులం. మహారాష్ట్రలోవలె ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్లాబురేటు ప్రవేశపెడితే రైతులకు మేలు జరుగుతుందని మా కమిటీ సూచించింది. 1983-84 నుంచి స్లాబు రేటు రాష్ట్రంలో అమలులోకి వచ్చింది. భూగర్భ జలాలపై ఆధారపడిన రైతులకు స్లాబు రేటు చాలా లాభం కల్గించింది. రైతులు అధికసంఖ్యలో పంపుసెట్లు ఏర్పాటుచేసుకుని వ్యవసాయాభివృద్ధికి గణనీయంగా దోహదపడ్డారు. కొందరు రైతులు రెండు, మూడు పంటలను కూడా పండిస్తున్నారు. రాష్ట్రంలో పంపుసెట్ల సంఖ్య పది సంవత్సరాల్లో మూడు రెట్లు పెరిగింది. లక్షలమంది రైతులు కనెక్షన్ల కోసం బోర్డుకు అప్లికేషన్లు పంపారు. 1989-1994 సంవత్సరాల కాలంలో వ్యవసాయ విద్యుత్ టారిఫ్‌ను పలు పర్యాయాలు మార్చారు. 1994లో ఎన్.టి. రామారావు హార్స్‌పవరుకు రూ. 50 స్లాబు రేటు పెట్టారు. గత పది సంవత్సరాల కాలంలో బొగ్గు, ఫర్నేస్ ఆయిల్ ధరలు, ఉద్యోగుల జీతభత్యాలు ఎన్నోరెట్లు పెరిగి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరిగింది. వ్యవసాయ రంగానికి సరఫరా చేస్తున్న విద్యుచ్ఛక్తిపైన బోర్డుకు రాబడి శాతం తగ్గుతూ వచ్చింది. రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు మొత్తం అమ్మకం 1983-84లలో

రూ. 379 కోట్లుకాగా అందులో వ్యవసాయరంగం నుంచి వచ్చింది రూ. 14 కోట్లు. 1994-95 సంవత్సరంలో మొత్తం అమ్మకం రూ. 2145 కోట్లు కాగా అందులో వ్యవసాయరంగం నుంచి లభించింది రూ. 57 కోట్లు మాత్రమే. వ్యవసాయ రంగంలో లోటెన్షన్ వినియోగదారులకు బోర్డు అమ్మకం శాతం 1983-84లో 3.7 నుంచి 1994-95లో 2.66 వరకు తగ్గింది. విచిత్రమయిన విషయం ఏమిటంటే రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు విక్రయిస్తున్న విద్యుచ్ఛక్తిలో 47.6 శాతం వ్యవసాయ రంగానికి వెళ్ళినా బోర్డు ఆదాయంలో కేవలం 2.6 శాతం మాత్రమే వ్యవసాయ రంగం నుంచి వస్తున్నది. అంతమాత్రాన హఠాత్తుగా ఈరోజు వ్యవసాయ విద్యుత్ రేట్లను మరీ ఎక్కువ చేయడం సబబు కాదు. వ్యవసాయ విద్యుత్ రేట్లను పెంచవలసిన అవసరం ఉందనడంలో సందేహం లేదు. అయితే, రేట్ల పెరుగుదల రైతులకు భారంగా పరిణమించరాదు. వ్యవసాయాభివృద్ధికి భంగం కల్గించకూడదు. రైతులు వాస్తవాలను గ్రహిస్తే రేట్ల పెంపుదలకు అభ్యంతరం తెలుపరు. వ్యవసాయ రంగానికి సరఫరాచేసే విద్యుచ్ఛక్తి యూనిటు ఒక్కింటికి 50 పైసలు చొప్పున ఛార్జీ వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలన్నిటికీ కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఒక్క అస్సాంలో మాత్రమే 50 పైసల రేటు ఉంది. హార్స్‌పవర్‌కు 50 రూపాయల చొప్పున లెక్కవేస్తే రాష్ట్రంలో వ్యవసాయ విద్యుచ్ఛక్తికి యూనిట్‌కు సుమారు 3 పైసలు మాత్రమే పడుతోంది.

## దుస్థితి నివారణకు చర్యలు

గృహ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు తీసుకున్న కాంట్రాక్టు లోడ్‌కు, వాస్తవంగా కలిపిన లోడ్‌కు మధ్యగల వ్యత్యాసాలను క్రమబద్ధీకరించాలి. దానివల్ల బోర్డుకు అదనపు ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాలలో విద్యుచ్ఛక్తి ఎంతో వృథా అవుతున్నది. ఈ వృథా వినియోగాన్ని చాలావరకు తగ్గించాలి. విద్యుచ్ఛక్తి కనెక్షన్లన్నిటిలోను ఐ.ఎస్.ఐ. మార్కుగల నాణ్యమయిన పరికరాలను మాత్రమే ఉపయోగించి విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలి. స్లాబ్ రేట్లని కొందరు రైతులు కంప్రెషర్ జెట్ పంపులను ఉపయోగిస్తున్నారు. సబ్‌వెర్సిబుల్ పంపులయితే ముందు వాటితో పోల్చినప్పుడు నాలుగోవంతు విద్యుత్‌ను మాత్రమే తీసుకుంటాయి. దానివల్ల విద్యుచ్ఛక్తి ఆదా అవుతుంది. గాల్వనైజ్డ్ ఐరన్ పైపులకు బదులు ప్లాస్టిక్ పైపులను ఉపయోగిస్తే సక్షన్‌లో, డెలివరీలో దాదాపు 20 శాతం విద్యుచ్ఛక్తి ఆదా అవుతుందని అంచనా.

విద్యుచ్ఛక్తి వాడకం అధికంగా ఉన్న పారిశ్రామిక యూనిట్లు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు, గ్రామాలలో వేల పంపుసెట్లకు అక్రమంగా విద్యుచ్ఛక్తిని వినియోగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చౌర్యాన్ని నివారించాలి. సిబ్బంది వ్యయాన్ని తగ్గించాలి. రైతాంగంలో 80 శాతంమంది సన్నకారు, చిన్నరైతులు, మెట్టప్రాంతాల రైతుల ఆర్థిక పరిస్థితి సాధారణంగా బాగుండదు. ఈ అంశాలన్నింటిని గమనించినప్పుడు స్లాబురేటునే కొనసాగించడం, హార్స్‌పవరుకు సంవత్సరానికి స్లాబురేటును కొంత పెంచడం సహేతుకం అన్పిస్తున్నది. రైతులకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, విద్యుచ్ఛక్తి బోర్డు దుస్థితిని వివరించి రేటు పెంచితే నిరసన, ప్రతిఘటన ఉండకపోవచ్చు. దీర్ఘకాలిక ప్రయోజనాలదృష్ట్యా స్లాబురేటు హెచ్చింపు అనివార్యమవుతున్నది.

*ది. 17-06-1996.* **- *ఈనాడు***

●

# విద్యుత్ సంస్కరణల్లో రైతుకు 'షాక్ థెరపీ'

ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ సరళీకృత విధానాల ప్రభావం విద్యుదుత్పాదన రంగం మీదా ఇతోధికంగా ప్రసరించబోతోంది. విదేశీ ఆర్థిక సహకారం లేనిదే భవిష్యత్తులో విద్యుదుత్పత్తి లక్ష్యాల్ని సాధించలేమని తలపోసిందే తడవుగా కేంద్ర ప్రభుత్వం 'ప్రైవేటు విద్యుత్తు'పై దృష్టి సారించింది. కొన్ని దేశీయ సంస్థలతో కలసి సంయుక్తంగా 'విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పడానికి కొన్ని విదేశీ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. కానీ అనేక రాష్ట్ర విద్యున్మండళ్లు నష్టాలతో నడుస్తున్నందున - తాము ఉత్పత్తి చేసి సరఫరా చేసే విద్యుత్తుకు బోర్డులనుంచి సక్రమంగా చెల్లింపులు జరుగుతాయా అన్న అనుమానం వాటిని నిన్నా మొన్నటివరకూ పీడించింది. విద్యున్మండళ్ల చెల్లింపులకు తాను పూచీగా ఉంటానని కేంద్రం ప్రకటించడంతో 'ప్రైవేటు విద్యుత్తు'కు ప్రధాన అవరోధం తొలగిపోయింది. పనిలోపనిగా విద్యుత్ బోర్డుల నష్టాలను నిలువరించడానికి కేంద్రం పలు సూచనలు చేసింది. నిర్వహణ మెరుగుపర్చుకొని, విద్యుత్ పంపిణీ నష్టాలను తగ్గించుకొనడం, ప్లాంట్‌లోడ్ ఫాక్టర్ పెంచడం వంటి అనేక అంశాలను రాష్ట్ర విద్యుత్‌శాఖ, మంత్రుల సమావేశంలో చర్చించి స్థూలంగా ఓ అంగీకారానికి వచ్చారు. నష్టాలు తగ్గించడంకోసం వ్యవసాయ రంగానికిస్తున్న కరెంటుకు మీటర్ల పద్ధతిన యూనిటుకు 50 పైసల వంతున వసూలు చెయ్యాలనీ కేంద్రం సూచించింది. ఇప్పుడీ మేరకు తాఖీదులూ పంపుతోంది. ఉరుమురిమి మంగలం మీద పడటమంటే ఇదే! కర్ణుడి చావుకి ఎన్ని కారణాలున్నాయో విద్యున్మండళ్లు నష్టాలతో కునారిల్లడానికీ అన్ని ఉన్నాయి. కీలకమైన ఈ ఇతర అంశాలపై పెద్దగా దృష్టి సారించక రైతు ప్రయోజనాలను దెబ్బతీసే ఈ విధమైన సూచనలతో ముందుకు రావడం అభ్యంతరకరం. ఈ నేపథ్యంలో రైతుల వ్యవస్థ, విద్యుత్ బోర్డుల దురవస్థల సాకల్య పరిశీలన సందర్భోచితం.

## రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట

రైతులకు సరఫరా చేసే విద్యుత్తుకు యూనిట్‌కు యాభైపైసలు వసూలు చేయాలన్న నిర్ణయం అమలైతే వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో పడుతుందనేది నిర్వివాదం. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి సరఫరా చేసే విద్యుత్తుకు సగటున యూనిట్‌కు 12.58 పైసలు వసూలు చేస్తున్నారు. దీన్ని 50 పైసలు చేయాలనుకుంటున్నారంటే విద్యుత్ రేట్లు నాలుగు రెట్లు పెరుగుతాయన్నమాట. రాష్ట్రాల వారీగా చూస్తే - కర్నాటకలో ఇది 6.5 పైసలు, పంజాబ్‌లో 8.5, ఆంధ్రప్రదేశ్‌లో 14.5, మహారాష్ట్రలో 15, గుజరాత్‌లో 16, కేరళలో 22, బీహార్‌లో 41, ఉత్తరప్రదేశ్‌లో 35, పశ్చిమబెంగాల్‌లో 32 పైసలు పడుతోంది. రాష్ట్రాలు వసూలు చేసే విద్యుత్ టారిఫ్‌లను రాజకీయాంశాలు గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. రైతుల ఓట్లు పోగేసుకోవాలనుకున్నప్పుడల్లా పంపుసెట్ల విద్యుత్ రేట్లలో రాయితీలు అనుగ్రహించడం రాజకీయులకు అలవాటయింది. గుజరాత్‌లో చిమన్‌భాయి ప్రభుత్వం అమలుచేస్తున్న వ్యవసాయ విద్యుత్ ఛార్జీల విధానానికి వ్యతిరేకంగా రైతులిప్పుడక్కడ ఆందోళన సాగిస్తున్నారు. 1986లో అమర్‌సింహ్ చౌధురి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించిన చిమన్‌భాయి పటేల్ నేడు రైతుల ఆగ్రహానికి గురికావడం స్వయంకృతాపరాధమే! అప్పట్లో మీటర్లతో సంబంధం లేకుండా విద్యుత్ మోటారు హార్స్ పవర్‌ను బట్టి శ్లాబ్ రేటుతో విద్యుత్ ఛార్జీలు నిర్ణయించాలని డిమాండ్‌చేసి రైతులు సాధించుకున్నారు. 1990 ఎన్నికల ప్రణాళికలో మోటారు పవర్ స్థాయితో సంబంధం లేకుండా హార్స్‌పవర్‌కు రు. 192 చొప్పున అన్నింటికీ ఒకేరేటు వసూలు చేస్తామని చిమన్‌భాయి వాగ్దానం చేసి జయకేతనమెగరేశారు. తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. కాల్వకింద భూములకు ఎకరాకు రూ. 100 నీటితీరువా కట్టాల్సి ఉండగా, గొట్టపు బావులనుంచి విద్యుత్ మోటార్ల సాయంతో సేద్యం చేయాలంటే దాదాపు రూ. 2000 కరెంటు బిల్లులకే కట్టాల్సి వస్తోందని రైతులు బాధపడుతున్నారు. కాల్వకింద పండించినా, గొట్టపు బావికింద సేద్యం చేసినా రైతుకు లభించేది ఒకటే ధర. అందువల్ల నడ్డివిరిచే వ్యవసాయ ఖర్చులు భరించలేక అక్కడ రైతాంగం మళ్లీ ఆందోళనకు దిగింది. కాస్త అటూ ఇటుగా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. ఆంధ్రప్రదేశ్‌లో 1983-90 మధ్య మోటారుస్థాయితో సంబంధం లేకుండా

హార్స్‌పవర్ ఒక్కింటికీ సంవత్సరానికి రూ. 50 వసూలు చేశారు. పెద్ద పెద్ద ఇరిగేషన్ ప్రాజక్టుల కింద ఒక ఎకరాకు నీరందించాలంటే దాదాపు రూ. 40 వేలవుతుంది. ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరించేదే, కానీ గొట్టపు బావిని రైతు ఏర్పాటు చేసుకుంటాడు. పంటల ధరలు నిర్ణయించేటప్పుడు కాల్వనీటి తీరువానే పరిగణనలోకి తీసుకుంటున్నారుగానీ విద్యుత్ మోటార్లతో సేద్యంచేస్తే అయ్యే కరెంటు ఖర్చుల్ని లెక్కించడం లేదు. మద్దతు ధరలు గిట్టుబాటుగా ఉండటంలేదు కనుకనే ఎరువులపై సబ్సిడీ, సరసమైన ధరకు విద్యుత్తు అవసరమవుతున్నాయి. గతంలో తమిళనాట కరుణానిధి ప్రభుత్వం రెండున్నరెకరాల లోపు కమతాలకు ఉచితంగా విద్యుత్తు అందించింది. ఇప్పుడు ఒక దశలో జయలలిత సర్కారు ఆ పథకాన్ని ఎత్తివేద్దామనుకున్నా రైతుల నిరసనకు తలొగ్గి ఏకమొత్తంగా వ్యవసాయరంగానికి సరఫరా చేసే విద్యుచ్ఛక్తి ఛార్జీలను పూర్తిగా మినహాయించింది. ఇప్పుడు తమిళనాడులో రైతు వ్యవసాయ కరెంటు బిల్లు కట్టే పనేలేదు. ఇలా రాజకీయ ప్రయోజనాలదే పైచేయికాగా ఇటు రైతులు ఒడిదుడుకులనెదుర్కోవడం, అటు విద్యున్మండళ్లు నష్టాలపాలు కావడం సహజ పరిణామమైపోయింది.

## నష్టాలకు కారణాలెన్నెన్నో!

గత నాలుగు దశాబ్దాలలో విద్యుదుత్పత్తి 510 కోట్ల కిలోవాట్స్ నుంచి 25500 కోట్ల కిలోవాట్లకు పెరిగింది. అయినా అనేక రాష్ట్రాల్లో కరెంటు కొరత వల్ల వేలకోట్ల విలువైన పారిశ్రామిక, వ్యవసాయోత్పత్తి చేతికందకుండా పోతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ఈ ప్రణాళికా కాలంలో అదనంగా 30,538 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యేలా ఈ రంగాన్ని అభివృద్ధి చేయదలిచారు. ఇప్పటికే అనుమతించిన వాటిని, నిర్మాణంలో ఉన్నవాటిని పూర్తిచెయ్యడం ద్వారా 25,626 మెగావాట్లు, కొత్త పథకాల ద్వారా 4912 మెగావాట్ల మేరకు సామర్థ్యాన్ని సాధించదలిచారు. విద్యుత్‌రంగంలో వెలుగులు విరబూయించడానికి కేంద్రం ఓ వంక పథకాలు వేస్తున్నా - మరోవంక అనేక రాష్ట్ర విద్యున్మండళ్లు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. గత సంవత్సరం మార్చినాటికి బీహార్ విద్యుత్‌బోర్డు నష్టాలు రూ. 1238 కోట్లు కాగా, హర్యానా రూ. 1225 కోట్లు, రాజస్థాన్ రూ. 776 కోట్లు. ఇలా మొత్తం 13 రాష్ట్రాల విద్యుత్‌బోర్డులకు వాటిల్లిన మొత్తం నష్టం రూ. 6517 కోట్లు. దేశంలోని అన్ని విద్యున్మండళ్లు నష్టాల

ఊబిలో కూరుకుపోయి లేవన్న విషయం గమనార్హం. నష్టాలు ఎక్కువగా వస్తున్న రాష్ట్రాల్లో విద్యుదుత్పాదన ఖర్చు కూడా అధికంగా ఉంటోంది. ఉదాహరణకు థర్మల్ పవర్ ఉత్పత్తిలో ఒక్క కిలోవాట్ యూనిట్‌కు బీహార్‌లో 136 పైసలు, హర్యానాలో 113 పైసలు, రాజస్థాన్‌లో 109 పైసలు వ్యయమవుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 58, మధ్యప్రదేశ్‌లో అర్ధరూపాయి ఖర్చవుతోంది. జలవిద్యుదుత్పత్తిలో ఒక యూనిట్‌కు పశ్చిమబెంగాల్‌లో 70 పైసలు, ఉత్తరప్రదేశ్‌లో 26, బీహార్‌లో 22 పైసలు ఖర్చవుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 9.4 పైసలు వ్యయమవుతోంది. విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్వహణ మెరుగుపర్చి, ఉత్పాదక శక్తిని అధికం చెయ్యడం ద్వారా కొంతమేరకు నష్టాలు భర్తీ చేసుకోవచ్చు! విద్యుత్ రవాణా, పంపిణీల్లో నష్టాలు తక్కువేమీకాదు. దేశవ్యాప్తంగా ఈ నష్టాలు 23 శాతానికి పెరిగాయి. అభివృద్ధి చెందినదేశాల్లో ఇది 3-11 శాతానికి మించదు. విద్యుత్ చౌర్యం సరేసరి! 1989-90లో దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ పంపిణీ నష్టాలు రూ. 4,200 కోట్లు. పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చి, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచి ఈ తరహా నష్టాన్ని చాలావరకు నిలువరించవచ్చు. ఈ ప్రణాళికాకాలంలో నష్టాల్ని ఏటా ఒకశాతం మేరకు తగ్గించదలిచారు. తక్కువ ప్లాంట్‌లోడ్ ఫాక్టర్ కూడా విద్యుత్ బోర్డుల నష్టాలకు కారణం. ప్లాంట్‌లోడ్ ఫాక్టర్ కనీసం 58 శాతం ఉండాలని రాజ్యాధ్యక్ష పవర్ కమిటీ సూచించింది. ఏడో ప్రణాళికకాలంలో అతికష్టం మీద దీన్ని 50 నుంచి 54.8 శాతానికి పెంచగలిగారు. ప్లాంట్‌లోడ్ ఫాక్టర్‌లో సగటున ఒకశాతం అభివృద్ధి సాధిస్తే 500 మెగావాట్ల విద్యుత్ పొందినట్లవుతుంది. అంటే దాదాపు రూ. 1500 కోట్ల పెట్టుబడితో సాధ్యమయ్యే ఉత్పత్తిని కేవలం ఒక్కశాతం ప్లాంట్‌లోడ్ ఫాక్టర్ మెరుగుదల వల్ల సాధించవచ్చన్నమాట. విదేశాల్లోని స్థాయికి దీన్ని పెంచగలిగితే విద్యుత్‌బోర్డులకు నష్టాలంటూ పెద్దగా ఉండకపోవచ్చు. విద్యుత్ చౌర్యం కూడా ఆందోళనకర స్థాయిలో సాగుతోంది. నగరాల్లోని కొన్ని పారిశ్రామిక సంస్థలు కోట్ల రూపాయల విద్యుత్‌ను అక్రమంగా వాడుకొంటున్నాయి. విజిలెన్స్ డిపార్ట్‌మెంటును పటిష్టం చేసి దీన్ని అరికడితే విద్యుత్ బోర్డుల ఆదాయం గణనీయంగా మెరుగుపడుతుంది.

## ప్రతికూల ప్రభావాలు

విద్యుత్‌బోర్డులు రుగ్మతపాలైన మాట నిజమే! దాన్ని నయం చెయ్యడానికి ఇతరేతర ఆవశ్యకతలెన్నో ఉన్నా వాటిని పక్కనబెట్టి రైతులకు 'షాక్ థెరపీ' అమలు చెయ్యబోవడం

అర్థరహితం. విద్యుత్ బోర్డు నష్టాలను పూడ్చుడానికి వ్యవసాయ విద్యుత్ ఛార్జీలు పెంచడమొక్కటే మార్గం కాదు. విద్యుత్ రవాణా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చి నష్టాలకు కళ్లెం వేయడం, ప్లాంట్‌లోడ్ ఫాక్టర్ పెంచడం ద్వారా ఆదాయం పెంచుకోవడం, ఉత్పత్తి కేంద్రాలలో అవసరమైన మేరకు సిబ్బందిని ఉంచి, మిగిలినవారి పంపిణీ, నిర్వహణ రంగాల్లో వినియోగించి బోర్డు పనితీరు మెరుగుపర్చుకోవడం ప్రధాన లక్ష్యం కావాలి. పంపుసెట్లకు విద్యుత్ ఛార్జీలు రైతుకు అందుబాటులో ఉండేలా చూడాలి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో అయిదు హార్స్ పవర్ వరకు - హార్స్‌పవర్‌కు రూ. 75 వసూలు చేస్తున్నారు. 10 హార్స్ పవర్, ఆపైన హెచ్.పి.కి వందకుమించి వసూలు చెయ్యడం న్యాయంకాదు. రెండు లేదా మూడు సంవత్సరాలకొకసారి కొద్దికొద్దిగా పెంచుతూ పోవచ్చు! విద్యుత్ తమకు ఉచితంగా అందించాలని రైతులెవరూ ఆశించరు. న్యాయమైన ధరకు విద్యుత్ లభ్యంకావాలనీ, కనీసం కొన్ని గంటలసేపైనా నిరంతరాయంగా సరఫరా చేయాలనీ వారు కోరుకుంటారు. కనుక ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి - విద్యుత్ బోర్డులకు లాభాలు తెచ్చిపెట్టే అన్ని మార్గాల్లోను ప్రయత్నిస్తూ - అందులో భాగంగా వ్యవసాయ విద్యుత్ ఛార్జీలను కొద్దిగా పెంచితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఈ సూచనలు పెడచెవిన పెట్టి ఒక్కసారిగా యూనిట్‌కు యాభైపైసలు చేస్తే అది వ్యవసాయోత్పత్తులపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదు. రైతు ప్రయోజనాలకు సంబంధించిన ఈ అంశంపై ఆచితూచి అడుగేయడం ఎంతైనా అవసరం.

*ది. 10-01-1997.* — *ఈనాడు*

●

# సంస్కరణలు చేపట్టకుంటే మనుగడ ప్రశ్నార్థకం

ఆంధ్రప్రదేశ్‌లోని రెండులక్షల 76 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, 252 పట్టణాలలో, 27,300 గ్రామాలలో నివసిస్తున్న దాదాపు ఏడుకోట్ల మంది ప్రజలలో అత్యధిక సంఖ్యాకులకు విద్యుత్తు దైనందిన అవసరం. పరిశ్రమలకు, కార్యాలయాలకు, గృహాలకే కాకుండా వ్యవసాయ రంగానికి సైతం విద్యుత్తు అవసరం పెరిగిపోతోంది. విద్యుత్తు సకాలంలో, సక్రమంగా సరఫరా కాకపోవడం, వోల్టేజి సరిగా లేకపోవడంవల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయి. తత్ఫలితంగా రైతులు నష్టాలపాలవుతున్నారు. విద్యుత్తు కోత కారణంగా పరిశ్రమలు ఏటా కొన్నివందల కోట్ల రూపాయల నష్టాన్ని భరించక తప్పడంలేదు - పారిశ్రామిక ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటోంది. పరీక్షల సమయంలో విద్యుత్తు కోత కారణంగా విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. కొన్ని పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, సినిమా హాళ్లు మొదలైనవి భారీ వ్యయంతో జనరేటర్లను ఉపయోగిస్తున్నాయి. వివిధ రంగాలలో అభివృద్ధికి విద్యుత్తు కీలకమన్నది వాస్తవం. విద్యుత్తు సగటు తలసరి వినియోగాన్నిబట్టి అభివృద్ధిని అంచనా వేయవచ్చు. వర్తమాన అవసరాలకు, భవిష్యత్ డిమాండుకు తగినంత విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడం, వినియోగదారులకు మెరుగయిన సేవలు అందించడం, విద్యుత్తు ఉత్పత్తిలో, సరఫరా, పంపిణీలో సామర్థ్యాన్ని పెంచడంవంటి లక్ష్యాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు బోర్డును పునర్వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలుగదని, వారి ఉద్యోగాలకు భద్రత ఉంటుందని బోర్డు పలు సందర్భాలలో స్పష్టం చేసింది. అయినప్పటికీ, తమ ప్రయోజనాలకు పునర్వ్యవస్థీకరణవల్ల భంగం కలుగుతుందని, పునర్వ్యవస్థీకరణ అంటే

ప్రైవేటీకరణమని, బోర్డును ప్రైవేటు రంగానికి అమ్మివేస్తున్నారని ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఉద్యోగులు, వినియోగదారులు, ప్రజా ప్రతినిధులతో సమగ్రంగా చర్చించిన తరువాతనే పునర్వ్యవస్థీకరణపై అంతిమ నిర్ణయం తీసుకోనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

## శక్తికి మించిన భారం

కీలక అంశాలపై ప్రజలకు వాస్తవాలను తెలియపరచి నిర్ణయాలు చేయడం, ప్రజల సహకారంతో ప్రభుత్వ నిర్ణయాలను అమలు పరచడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకత అని చెప్పవచ్చు. వ్యవసాయ రంగానికి సరఫరా చేస్తున్న విద్యుత్తు రేటును కొంతమేరకు పెంచినా బోర్డుమీద రూ. 800 కోట్ల భారం పడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు బోర్డులో సంస్కరణలను తలపెట్టింది; అందులో భాగం పునర్వ్యవస్థీకరణ. ఉద్యోగులు, వినియోగదారులు ఈ సంస్కరణలను, పునర్వ్యవస్థీకరణను వాస్తవిక దృష్టితో పరిశీలించడం అవసరం. వాటిలో లోపాలు ఏమయినా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చు. ఉద్యోగులు, వినియోగదారులు వారి అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియపరచి సరైన నిర్ణయాలు జరగడానికి దోహదపడాలి. ఇతర రాష్ట్రాలలోని విద్యుత్తుబోర్డులతో పోల్చినప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తుబోర్డు ప్రగతి, పరిస్థితి సంతృప్తికరంగానే ఉన్నాయని భావించవచ్చు. 1960లో కేవలం 213 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక శక్తితో రాష్ట్ర విద్యుత్తుబోర్డు స్థాపితమయింది. ఈరోజు బోర్డు ఉత్పాదక శక్తి 5362 మోగావాట్లు. రాష్ట్రంలో సంయుక్త రంగంలో 212 మెగావాట్ల ఉత్పాదక శక్తి ప్రైవేటు రంగంలో 292 మెగావాట్ల ఉత్పాదకశక్తి సాధ్యమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ వాటాగా కేంద్రం నుంచి 897 మెగావాట్లు రాష్ట్ర బోర్డుకు లబిస్తాయి. అంటే, ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 6763 మెగావాట్ల ఉత్పాదక శక్తి వుంది. రాష్ట్రంలో సగటు తలసరి విద్యుత్తు వినియోగం 1960లో 19 యూనిట్లు కాగా ఈ రోజు 371 యూనిట్లు. నాడు 78 కోట్ల యూనిట్ల ఉత్పత్తితో బోర్డు రాబడి రూ. 5.50 కోట్లు. నేడు బోర్డు రెవిన్యూ రాబడి దాదాపు రూ. 4,360 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం బోర్డు అధీనంలోని వివిధ సంస్థలలో 2,310 కోట్ల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. 847 కోట్ల యూనిట్లను ఇతర రాష్ట్రాల నుంచి బోర్డు కొనుగోలు చేస్తోంది. విద్యుత్తు సగటు తలసరి వినియోగంలో ఆంధ్రప్రదేశ్

రాష్ట్రం పశ్చిమ బెంగాల్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకన్నా వెనుకబడి ఉంది. రాష్ట్ర విద్యుత్తుబోర్డు వ్యవస్థ గత 37 సంవత్సరాల కాలంలో గణనీయంగా విస్తరించింది. విద్యుత్తు పంపిణీ రంగంలోని యాభైవేల మందితో సహా మొత్తం 72 వేల మంది విద్యుత్తుబోర్డు ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు. ఈ విస్తరణ వ్యవస్థకే పరిమితం కాలేదు. హైటెన్షన్ లైన్ల నిడివి 14,800 కిలోమీటర్ల నుంచి 1,82,493 కిలోమీటర్లకు పెరిగింది. లోటెన్షన్ లైన్ల పొడవు 13,738 కిలోమీటర్లనుంచి 3,61,474 కిలోమీటర్లకు విస్తరించింది. బోర్డుకింద మొత్తం సబ్‌స్టేషన్ల సంఖ్య దాదాపు 1,627; రాష్ట్రంలోని వ్యవసాయ పంపుసెట్లు సంఖ్య 1960లో కేవలం 17 వేలు కాగా ఇప్పుడు 18 లక్షలు. ఇదంతా బోర్డు సాధించిన ప్రగతి. బోర్డులో లోపాలు, బలహీనతలు కూడా ఉన్నాయి. భారీ నష్టాల గురించి మొదట చెప్పాలి. నైవేలీ లిగ్నైటు కార్పొరేషన్ సరఫరా చేసిన విద్యుత్తుకు, ఇతర చోట్ల కొనుగోలు చేసిన విద్యుత్తుకు, బొగ్గుకు, ఇతర కొనుగోళ్లకు రాష్ట్రబోర్డు 1997 మార్చినాటికి రూ. రెండువేల కోట్లు చెల్లించవలసి ఉంది. ఈక్విటీ ధనం రూ. 1,321 కోట్లుగాక ఆర్.ఇ.సి.కి, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు, ఎల్.ఐ.సి.కి, ఐ.డి.బి.ఐ.కి, పీర్‌లెస్‌కు, బ్యాంకులకు బోర్డు చెల్లించవలసిన రుణాల మొత్తం రూ. 4,850 కోట్లు. విద్యుత్తుబోర్డు ఆస్తుల మొత్తం విలువ రికార్డుల ప్రకారం రూ. 6,525 కోట్లు. నిజానికి, ఈ ఆస్తుల విలువ ఇంతకన్నా ఎన్నోరెట్లు అధికంగా ఉంటుంది. రాష్ట్రప్రభుత్వం గత కొన్నేళ్లలో కొన్ని కోట్ల రూపాయలను బోర్డుకు సబ్సిడీగా ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన రుణాలను ఈక్విటీగా మార్చారు. 1995-96లో బోర్డు రెవిన్యూ లోటు రూ. 1,128 కోట్లు; విద్యుత్తురేట్లలో కొన్ని మార్పులు చేయడంతో 1996-97లో రెవిన్యూ లోటు రూ. 754 కోట్లకు తగ్గింది. రాష్ట్ర బోర్డుకు స్థిర ఆస్థుల విలువ మీద 3 శాతం మిగులుకు బదులు 17.5 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్ర బోర్డుకు ఇంత భారీగా నష్టాలు రావడానికి కారణాలు అనేకం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బోర్డు వ్యవసాయ రంగానికి, గృహాలకు తక్కువ రేట్లతో విద్యుత్తును సరఫరా చేస్తోంది. ఈ లోటును కొంతమేరకు తీర్చడానికి పారిశ్రామిక రంగానికి విద్యుత్తును అధిక రేట్లతో సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర విద్యుత్తుబోర్డు నష్టాలలో కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించవలసి ఉంటుంది. పాలనాపరమైన లోపాలు, విద్యుత్తుచౌర్యం, కాంట్రాక్టుల్లో కుంభకోణాలు మొదలైనవి కూడా బోర్డు నష్టాలకు కారణమవుతున్నాయి. ఇప్పుడు 18 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లతో దాదాపు 75 లక్షల ఎకరాలకు సాగునీరు

అందుతోంది. కనెక్షన్ కోరుతూ పెట్టుకున్న నాలుగు లక్షల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి – వాటిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అనేక సంవత్సరాల నుంచి వ్యవసాయ రంగానికి రోజుకు 9 గంటలు మాత్రమే విద్యుత్తు సరఫరా అవుతోందని బోర్డు అంటోంది. ఈ తొమ్మిది గంటలైనా సరఫరా కావడం లేదని కొన్ని ప్రాంతాల రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. పరిశ్రమలకు ఎంత ఎక్కువ విద్యుత్తును సరఫరా చేస్తే బోర్డుకు అంత ఎక్కువ లాభాలుంటాయి. కాని, లాభాల కోసమని రాష్ట్రంలోని కొన్ని లక్షలమంది రైతుల ప్రయోజనాలను విస్మరించడం న్యాయంకాదు. అందువల్ల, పరిశ్రమలకు ఇచ్చే హెచ్.టి. కరెంటులో కూడా కోత తప్పలేదు. దరఖాస్తులు పెట్టుకున్న వ్యవసాయదారులందరికీ పంపుసెట్లకు కనెక్షన్లు ఇవ్వాలన్నా, పరిశ్రమలు వాటి ఉత్పత్తి శక్తిని గరిష్ట స్థాయిలో వినియోగించడానికి తగినంత విద్యుత్తును సరఫరా చేయాలన్నా రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తిని గణనీయంగా పెంచవలసి వస్తుంది. గత రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో దాదాపు వెయ్యి మెగావాట్ల అదనపు ఉత్పత్తి శక్తి ఏర్పడింది. అయినా డిమాండుకు, సరఫరాకు మధ్య ఇంకా రెండు వేల మెగావాట్ల వ్యత్యాసం ఉంటుందని అంచనా. 2001–2002 సంవత్సరాల నాటికి అదనంగా 8 వేల మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుందని నిపుణులు అంచనా వేశారు. ఒక మెగావాటుకు రూ. 4 కోట్ల చొప్పున 8 వేల మెగావాట్ల ఉత్పత్తికి దాదాపు 32 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయవలసి వస్తుంది. ఇప్పుడున్న ట్రాన్స్‌మిషన్ (ప్రసారం), డిస్ట్రిబ్యూషన్ (పంపిణీ) లైన్ల సముదాయం బలహీనంగా ఉంది. ఈ సముదాయాన్ని సరిగా ఉంచడానికి రూ. 1,700 కోట్ల మొత్తం అవసరమవుతుంది. కొత్తగా వివిధ రంగాలలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు కేంద్రాల విద్యుచ్ఛక్తిని సమర్థంగా పంపిణీ చేయడానికి దాదాపు రూ. 18 వేల కోట్ల వ్యయంతో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే బకాయిపడ్డ రూ. 2,300 కోట్ల అప్పులను తీర్చలేకపోతున్న రాష్ట్రబోర్డుపై విస్తరణ కార్యక్రమాల నిమిత్తం రూ. 50 వేల కోట్ల నిధులను సమకూర్చలేదు. ఇందులో కొంతభాగాన్ని బోర్డు చేపట్టి కొంతభాగాన్ని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌కు అప్పగించినా మిగత భాగాన్ని ప్రైవేటు రంగానికి అప్పగించక తప్పదు. ప్రైవేటు రంగంలో విద్యుత్తు ఉత్పత్తి చేసినా, పంపిణీ రాష్ట్రబోర్డు వ్యవస్థ ద్వారా జరగాలి. తాము సరఫరా చేసే విద్యుత్తుకు బోర్డు సక్రమంగా డబ్బు చెల్లించలేదని ప్రైవేటు ఉత్పత్తిదారులు భయపడుతున్నారు. తన ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి

బోర్డు కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకున్నప్పుడే ప్రైవేటు ఉత్పత్తిదారులకు దాని పట్ల విశ్వాసం ఏర్పడుతుంది. అందువల్ల రాష్ట్ర విద్యుత్తుబోర్డులో సంస్కరణలు, పునర్వ్యవస్థీకరణ అనివార్యమవుతున్నాయి. విద్యుత్తు ఉత్పత్తిని, సరఫరాను, పంపిణీని ఆధునీకరించడానికి కూడా బోర్డు పునర్వ్యవస్థీకరణ అవసరమవుతుంది. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ ఒకే ప్రభుత్వరంగ సంస్థ యజమాన్యంలో ఉండడం వాణిజ్యపరంగా లాభదాయకం కాదని; వివిధ ఆధునిక దేశాల అనుభవం వెల్లడిస్తోంది. రాష్ట్రంలో విద్యుత్తురంగాన్ని ఆధునీకరించడానికి, అభివృద్ధి పరచడానికి విదేశాల నుంచి నిధులు తీసుకురావాలన్నా రాష్ట్ర విద్యుత్తుబోర్డు పునర్వ్యవస్థీకరణ జరగాలి.

## ఇతర దేశాల దృష్టాంతాలు

ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ రంగాలను వేరుచేసి పోటీకి, సామర్థ్యానికి అవకాశం కల్పించినప్పుడు వినియోగదారులకు కూడా మెరుగయిన సదుపాయాలు చౌకగా అందుబాటులోకి వస్తాయి. బ్రిటన్, అమెరికా తదితర దేశాలలో అనేక సంవత్సరాల నుంచి విద్యుత్తు రంగంలో సంస్కరణలు జరుగుతున్నాయి. భారతదేశంలో అనేక రాష్ట్రాలలో విద్యుత్తురంగంలో సంస్కరణలు జరిగాయి. విద్యుత్ సంస్కరణలు జరిపిన మొదటి రాష్ట్రం ఒరిస్సా; బిజూపట్నాయక్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ సంస్కరణలను అమలు చేశారు. ఒరిస్సాలో 1995 సంవత్సరపు విద్యుత్ సంస్కరణల చట్టం 1996 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఒరిస్సా రెగ్యులేటరీ, కమిషన్ ఏర్పాటయింది. సంస్కరణల ఫలితంగా ఒరిస్సాలో రాబడి 33 శాతం పెరిగింది. విద్యుత్ సంస్కరణలు జరిపిన ఇతర రాష్ట్రాలు హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక. ప్రస్తుతం రాష్ట్రబోర్డు నెలవారీ ఆదాయం రూ. 320 కోట్లు. భవిష్యత్తులో నెలకొల్పే సంస్థల నుంచి యూనిటు ఒక్కింటికి రూ. 2 చొప్పున కొనుగోలు చేసినా విద్యుత్తుబోర్డు నెలకు రూ. 700 కోట్లు చెల్లించవలసి ఉంటుంది. రాష్ట్రబోర్డు మీద భారం అధికమవుతుందని స్పష్టమవుతోంది. ఈ భారాన్ని తట్టుకుని ఆర్థికంగా పటిష్టపరచడానికి రాష్ట్రబోర్డు పునర్ వ్యవస్థీకరణ అనివార్యం. పునర్వ్యవస్థీకరణ నిమిత్తం ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు (1995 జనవరిలో) నియమించిన హితేన్ భయ్యా కమిటీ ఆ ఏడాది ఏప్రిల్‌లో నివేదిక సమర్పించింది. నివేదిక సూచనలకు అనుగుణంగా రాష్ట్ర విద్యుత్తుబోర్డు పునర్ వ్యవస్థీకరణ జరపడానికి చంద్రబాబు నాయుడు


ప్రభుత్వం ప్రతిపాదించింది. హితేన్ భయ్యా నివేదిక ప్రకారం కార్పొరేటు సంస్థగా మారే రాష్ట్ర బోర్డు ట్రాన్స్‌మిషన్ బాధ్యతను నిర్వహిస్తుంది. ఆర్థిక పటిష్టత, స్వతంత్ర్య ప్రతిపత్తిగల అయిదు లేక ఏడు సంస్థలు పంపిణీ బాధ్యతను నిర్వహిస్తాయి. ఇవి బోర్డు అనుబంధ సంస్థలుగా ఉంటాయని ఛైర్మన్ పేర్కొన్నారు. ప్రస్తుతం పంపిణీలో ఉన్న పలు లోపాలను తొలగించడానికి ఈ వికేంద్రీకరణ ఉపకరిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర బోర్డు సరఫరా చేస్తున్న విద్యుచ్ఛక్తిలో 44 శాతం భాగానికి మాత్రమే బిల్లింగ్ జరుగుతున్నదని ఈ సందర్భాన గమనించాలి. బిల్లుల వసూలు కూడా సమర్థంగా కొనసాగడంలేదు. ఇక విద్యుత్తు చౌర్యం గురించి చెప్పవలసిన అవసరం లేదు. స్వయంప్రతిపత్తి, స్వావలంబన, ఆర్థిక పటిష్ఠత, నిర్వహణ సామర్థ్యం, పోటీ ద్వారా వినియోగదారులకు మెరుగయిన సదుపాయాలు కల్పించడం, అవసరాలకు తగిన విద్యుత్తును చౌకగా సరఫరా చేయడం, ఉత్పత్తి, నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం, ఆధునీకరణ రాష్ట్ర విద్యుత్తుబోర్డు ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయి. రాష్ట్ర వ్యావసాయిక, పారిశ్రామిక అభివృద్ధికి బోర్డు పునర్వ్యవస్థీకరణ అత్యావశ్యకం అని చెప్పక తప్పదు.

*ది. 07-08-1997.* — *ఈనాడు*

●

Blank Page

8 వ అధ్యాయం



# ఆహారభద్రత, ఉపాధి కల్పన, వ్యవసాయ పరిశ్రమలు

Blank Page

# నిరుద్యోగాన్ని నిలువరించే వ్యూహం

ఏటికేడు కొత్త పిలకలు వేస్తూ ప్రణాళికాకర్తలకు కొరుకుడు పడని సమస్యల్లో నిరక్షరాస్యత, నిరుద్యోగం కీలకమైనవి. వీటిని పరిహరించడానికి అహరహమూ శ్రమిస్తున్నామని నేతలు నమ్మబలుకుతుంటారుగానీ,పరిస్థితి నానాటికీ జటిలమవుతూనే ఉంది. దేశంలో ఓ విచిత్రమైన పరిస్థితి గమనించగలం. నేటికీ దేశవ్యాప్తంగా సగటు అక్షరాస్యత 52 శాతంకాగా, మహిళల్లో 44 శాతం మాత్రమే అక్షరాస్యులు. 1951లో దేశంలో ప్రైమరీ స్కూళ్ళ సంఖ్య 2,09,671 కాగా, 1991 నాటికవి 5,58,392. అదేకాలంలో అప్పర్ ప్రైమరీ సెకండరీ స్కూళ్ళ సంఖ్య 13,596 నుండి, 1,46,636కు, ప్రీ డిగ్రీ కాలేజీల సంఖ్య 7,416 నుండి 78,619కి పెరిగింది. జనరల్ ఎడ్యుకేషన్ కాలేజీలు 370 నుండి 4862కు, వృత్తివిద్యా (ప్రొఫెషనల్) కళాశాలలు 208 నుండి 886 కి పెరిగాయి. మొదటి ప్రణాళికలో విద్యారంగం వాటా 7.8 శాతం కాగా ఏడో ప్రణాళిక నాటికి అది 3.5 శాతానికి తగ్గిపోయింది. ఏలికల మాటలకు, చేతలకు పొంతన ఎంతుందో దీంతోనే రుజువవుతుంది. ఈ శతాబ్దాంతానికల్లా నిరక్షరాస్యతను రూపుమాపుదామని, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామనీ హామీలు గుప్పిస్తూనే ఉన్నారు. కళ్ళకు కడుతున్న వాస్తవ పరిస్థితులు ఏలికలవన్నీ కాకమ్మ కబుర్లేనని చెప్పక చెబుతున్నాయి. సామాజిక అశాంతికి ఆజ్యం పోస్తూ నిరుద్యోగ సమస్య చెలరేగిపోతున్నది. 1981లో కోటి 78 లక్షలుగా ఉన్న ఉద్యోగార్థుల సంఖ్య 1985 నాటికి రెండుకోట్ల 62 లక్షలకు చేరుకుంది. దేశంలోని 854 ఉపాధి కల్పనా కార్యాలయాల్లో - 1992 ఆగస్టు నాటికి మూడు కోట్ల 71 లక్షల మంది నిరుద్యోగులు నమోదై ఉన్నారు. ఎనిమిదో ప్రణాళికా కాలంలో ఏటా అదనంగా 70 లక్షల మంది నిరుద్యోగుల జాబితాలో చేరతారని ప్రభుత్వం అంచనా. వీరిలో దాదాపు 61 శాతం మెట్రిక్యులేషన్, ఆపైనా చదువుకొన్నవారే! ఉత్సాహంతో పరవళ్ళుతొక్కే మానవ వనరులు

ఏదేశానికైనా వరమేగానీ, ఉపాధి కరువై ఉసూరుమంటున్న యువతరం మాత్రం భారతదేశానికి పెనుభారం. మరి ఏదీ పరిష్కారం?

పట్టపగ్గాల్లేకుండా పెరిగిపోతున్న జనాభా, నిరక్షరాస్యత... 'నిరుద్యోగం' ఒకదానితో ఒకటి పెనవడి సవాలు విసురుతున్నాయి. ప్రస్తుతం ఇండియా జనాభా 90 కోట్లు. ఏటా కోటీ ఎనభైలక్షల మంది దీనికి జమపడతారు. వీళ్ళందరికీ విద్య, వైద్యం, ఉపాధి తదితరాలపై తగు చర్యలు తీసుకోవలసింది ప్రభుత్వమే! నేడు సెకండరీ, హయ్యర్ సెకెండరీ పాఠశాలల్లో 2.1 కోట్ల మందిని చేర్చుకోగలవీలుంది. ఈ స్కూళల్లో చేరవలసిన పిల్లల్లో నలభైశాతం మంది మాత్రమే చదువుకోడానికి వస్తున్నారన్న విషయం గమనార్హం. ఇలా ఏటా 40 లక్షల మంది చదువుకొన్నవారు, 30 లక్షల మంది నిరక్షరాస్యులు, నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారు. అంటే 2002 సంవత్సరానికి దేశంలో 9.4 కోట్ల మంది నిరుద్యోగులుంటారన్నమాట. ప్రణాళికా ప్రారంభం నాటికన్నా ప్రతి ప్రణాళికాంతానికీ నిరుద్యోగుల సంఖ్య హెచ్చుతూనే ఉంది. 1991 నాటికి ప్రభుత్వ రంగంలో కోటి 89 లక్షల 85 వేలమంది, ప్రైవేటు రంగంలో 78 లక్షల 54 వేలమంది మొత్తంగా సమీకృత రంగంలో రెండుకోట్ల 68 లక్షల 19 వేల మంది పనిచేస్తున్నారని ప్రభుత్వాధికారుల లోగట్టా. వీరుగాక అసంఘటిత రంగంలోనూ, వ్యవసాయరంగం లోనూ 26 కోట్ల 24 లక్షల మంది ఉపాధి పొందుతున్నట్లు 38వ రౌండు నేషనల్ శాంపుల్ సర్వేలో తేలింది. నిరుద్యోగ సమస్య తీవ్రతను గుర్తించిన రాజకీయ పక్షాలు దీనినో ప్రచారాస్త్రంగా మలచుకొన్నాయి. సంవత్సరానికి కోటి ఉద్యోగాల సృష్టిద్వారా ఈ శతాబ్దాంతానికి నిరుద్యోగాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్రంలోని పాలక పక్షం వాగ్దానం చేసిన విషయం విస్మరించరాదు. అదే పార్టీ ప్రభుత్వం ప్రకటించిన నూతన ఆర్థిక విధానం ఆ లక్ష్యసాధనకు ఏ విధంగా ఉపకరిస్తుందో పరిశీలించాలి.

ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీల ద్వారా ఎంతమందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నది పరిశీలిస్తే- వాస్తవాలు వెలుగుచూస్తాయి. 1959 నాటి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీల (ఖాళీల ప్రకటన) చట్ట ప్రకారం - పది లేదా అంతకంటే ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నీ ఖాళీలు ఉన్నప్పుడు తప్పనిసరిగా ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు తెలియపర్చాలి. దేశవ్యాప్తంగా గల ఉపాధి కల్పన కార్యాలయాల నుంచి అందిన సమాచారాన్నిబట్టి 1981లో ఎనిమిది లక్షల 97 వేల

ఖాళీలు ఏర్పడగా, 1991లో నాలుగు లక్షల 59 వేల ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. అదే 1992లో నాలుగు లక్షల 19 వేల ఖాళీలు మాత్రమే ప్రకటించారు. అంటే రానురాను ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నమాట. కేంద్ర ప్రభుత్వ నూతనార్థిక విధానంవల్ల భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. గతంలో ప్రభుత్వరంగ సంస్థల్లో అవసరానికి మించి సిబ్బందిని తీసుకొన్నారు. గోల్డెన్ హాండ్‌షేక్ పేరిట వారిలో చాలామందికి ఉద్వాసన చెప్పే పని ఇప్పటికే ప్రారంభమయింది. గతంలో మాదిరిగా ప్రభుత్వరంగ సంస్థలపట్ల ప్రభుత్వమిప్పుడు ప్రత్యేక శ్రద్ధ కనబర్చకపోతుండడంతో మినుకుమినుకుమంటున్న యూనిట్లు కొన్ని మూతపడే పరిస్థితి దాపురించింది. సరళీకరణ – అంతర్జాతీయీకరణ నేడు ఫ్యాషనైపోయాయి. బహుళజాతి సంస్థలకు పాలకులు స్వాగతం పలుకుతున్నారు. ఆ సంస్థలు వందలకోట్ల పెట్టుబడిని దేశంలో గుమ్మరించినా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వెంటతీసుకొస్తున్నాయి గనుక ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఉంటాయి. ప్రణాళికా సంఘం భావిస్తున్నట్లు కోట్లాది ఉద్యోగాలు ఊడిపడవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వరంగంలో వచ్చే కొన్ని లక్షల ఉద్యోగాలలో రిజర్వేషన్ కేటగిరీలలో వారికే కొద్దిపాటి అవకాశాలు లభిస్తాయి. అంటే మొత్తంగా నేడున్న నిరుద్యోగుల్లో కేవలం ఒక్కశాతానికే ఉద్యోగావకాశాలు ఉంటాయన్నమాట.

నిరుద్యోగ సమస్య ఇలా శ్రుతిమించి రాగాన పడడానికి కారణమేమిటి? ఈ సమస్య తీవ్రతను తగ్గించడం ఎట్లా అన్నది ప్రశ్న. దేశ జనాభా, ఆర్థిక వెనుకబాటుతనం వంటి పలు అంశాలను దృష్టిలో ఉంచుకొనే – వ్యవసాయం, కుటీర పరిశ్రమలకు సమధిక ప్రాధాన్యం ఇవ్వాలని మహాత్మాగాంధీ చెప్పారు. 1945 నాటికి 80 శాతం జనాభా గ్రామాల్లోనే నివసిస్తోంది. కనీస సౌకర్యాలు కరవై గ్రామాల్లో దుర్భర దారిద్ర్యం తాండవిస్తోంది. ఇన్నికోట్ల మంది గ్రామీణుల స్థితిగతుల్లో మార్పు రావాలంటే వారి జీవనాధారమైన వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది ఆదాయాలు పెరగాలి. అప్పుడే వారికి అవసరమైన గృహోపకరణాలు, వస్తుసామాగ్రికి డిమాండ్ పెరిగి, వాటిని ఉత్పత్తిచేసే పరిశ్రమలూ అభివృద్ధి చెందుతాయనే గాంధీజీ భావన. కుటీర, చిన్న పరిశ్రమలను వృద్ధిచెయ్యడం ద్వారా ప్రతివారికీ ఉపాధి దొరుకుతుందని గాంధీ కలలు కన్నారు. స్వల్ప పెట్టుబడితో ఎక్కువ యూనిట్లు ఏర్పాటు చేయగల చిన్నతరహా

పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు మెండు. గ్రామీణ, కుటీర పరిశ్రమల్లో మూడుకోట్ల 17 లక్షల మందికి, చిన్న పరిశ్రమల రంగంలో కోటి 28 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. సంఘటిత రంగంలో పెట్టుబడి దీనికి దాదాపు 15 రెట్లు అధికమైనప్పటికీ 20 లక్షల మందికే ఉద్యోగాలు లభించిన విషయం గమనించాలి. దేశ కాల పరిస్థితులపట్ల సదవగాహనతో గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. యాంత్రీకరణను గుడ్డిగా అనుకరించరాదని గాంధీజీ ఉద్బోధించారు. జాతిపిత సలహాను పెడచెవినపెట్టిన నవభారత నిర్మాత నెహ్రూ సోవియట్ రష్యామాదిరిగా భారీపరిశ్రమల అభివృద్ధి ద్వారా దేశాన్ని ముందుకు తీసుకుపోవాలని ఆరాటపడ్డారు. పర్యవసానమే సర్వహంగులూ, వసతులు ఉండీ వ్యావసాయికంగా తగినంత అభివృద్ధి చెందలేకపోవడం, నేటికీ 30 శాతంమంది దారిద్ర్యరేఖ దిగువన ఉండడం, నిరుద్యోగ సమస్య ఆందోళనకర స్థాయికి చేరడం. నాడు విధాన పరంగా వేసిన తప్పటడుగు దీర్ఘకాలంలో దేశ ప్రయోజనాలనెంతగానో దెబ్బతీసింది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నిరుద్యోగ తీవ్రతను కనీసం కట్టడి చెయ్యడానికి ఏ విధానం అభిలషణీయమో ఆలోచించాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో ఇందునిమిత్తం చేపట్టగల చర్యలను సాకల్యంగా పరిశీలించాలి. విద్యారంగంలోనూ సంస్కరణలకి శ్రీకారం దిద్ది విద్యార్థులు బయటకొచ్చినా స్వయం ఉపాధి ఏర్పరచుకునేలా వారిని తీర్చిదిద్దాలి. మంత్రాలకు చింతకాయలు రాలవనే తెలివిడితో నిర్దిష్ట వ్యూహంతో ముందడుగేయడం నేటి అవసరం.

*దే. 04-07-1994.* — *ఈనాడు*

●

# ఉపాధిని పెంచని ఉత్పత్తి ఎవరి కోసం?

## నూతన ఆర్థిక సంస్కరణ పరమార్థం!

ఒక వంక స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుతున్నా ఉపాధి అవకాశాలు పెరగకపోవడంతో నిరుద్యోగం మాత్రం హెచ్చుతోంది. ఇది ఉపాధిరహిత అభివృద్ధి. ఈ విచిత్ర పరిస్థితి వర్ధమాన దేశాలలోనేగాక పురోగమించిన ఒ ఇ సి డి దేశాలలోనూ కన్పిస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలలో నిరుద్యోగం 1980 దశాబ్దిలో 6 శాతం మేరకు ఉండగా అది 1991 నాటికి 6.9 శాతానికి చేరింది. ఆ లెక్కన ఆ దేశాలలో నిరుద్యోగులు 3 కోట్లవుతారు. ఒ ఇ సి డి కి చెందిన యూరపు దేశాలలో నిరుద్యోగం 1970లో 3 శాతం నుంచి 1992లో 10 శాతానికి హెచ్చింది. వర్ధమాన దేశాల పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. సహారా పరిసర ఆఫ్రికన్ దేశాలన్నిటిలోను నిరుద్యోగం 10 శాతాన్ని మించి పోయింది. లాటిన్ అమెరికాలో నిరుద్యోగం 8 శాతాన్ని మించింది. ఆసియా ఖండంలో భారతదేశం. పాకిస్తాన్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఈ రెండు దేశాలలో స్థూల జాతీయోత్పత్తి వార్షిక అభివృద్ధి రేటు దాదాపు 6 శాతం కాగా నిరుద్యోగం 15 శాతంకంటే అధికం. ఫ్రాన్సు, బ్రిటీష్, జర్మనీ తదితర దేశాలలో సైతం స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. వాస్తవానికి ఈ దేశాలలో ఉపాధి అవకాశాలు తగ్గాయి. పెట్టుబడి, ఉత్పాదకత పెరిగాయిగాని కొత్తగా ఉపాధి అవకాశాలు పెరగలేదు. వర్ధమానదేశాలలో స్థూల జాతీయ ఉత్పత్తి 4 నుంచి 5 శాతం మేరకు పెరిగినప్పటికి ఉపాధి కల్పనలో పెరుగుదల 2 నుంచి 2.5 శాతానికి మించదు. భారీ పెట్టుబడితో ఆధునిక టెక్నాలజీని వినియోగించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

## అశాంతికి పునాది

నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నదని, దీనివల్ల ప్రమాదకర సామాజిక పరిణామాలు సంభవించనున్నాయని ఆర్థిక సహకారం అభివృద్ధి సంస్థ (ఒ ఇ సి డి)

నిరుడు (1993) జూన్ సమావేశంలో హెచ్చరించింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ఈ ఏడాది చివరికి మూడున్నర కోట్ల మంది నిరుద్యోగులుంటారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ ఎల్ ఒ) అంచనా. 1930 తీవ్ర ఆర్థిక మాంద్యం అనంతరం నిరుద్యోగం ఇంతగా తీవ్రం కావడం ఇదే మొదటిసారి. నిరుద్యోగం పర్యవసానంగా నిరాశానిస్పృహలు, భద్రతారాహిత్యం, సామాజిక వ్యవస్థకు దూరం కావడం, పేదరికం వంటి అనర్థాలు సంభవిస్తాయని ఐ.ఎల్.ఒ వివరించింది. 1980 నుంచి నేటికి నిరుద్యోగం జర్మనీలో 7.4 శాతం నుంచి 11.3 శాతానికి, ఫ్రాన్స్‌లో 9.5 శాతం నుంచి 12.1 శాతానికి, బ్రిటన్‌లో 9.7 శాతం నుంచి 10.4 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదల ఆందోళన కరమయినదనడానికి ఆ దేశాల్లో వ్యక్తమవుతున్న అశాంతి నిదర్శనం. రష్యాలో ఇటీవలే మార్కెట్ అనుబంధ ఆర్థిక విధానాన్ని చేపట్టారు. ప్రస్తుతం రష్యాలో నిరుద్యోగం 10 శాతం స్థాయిలో ఉంది. నష్టాల ఊబిలో ఇరుక్కున్న ప్రభుత్వ రంగ సంస్థలకు సబ్సిడీలను ఉపసంహరించే కొద్దీ రష్యాలో నిరుద్యోగం మరింత పెరగడం ఖాయం. తాత్కాలిక ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని అమెరికాలో గత రెండేళ్ళలో నిరుద్యోగం 7 శాతానికి తగ్గిందని అంచనా వేశారు. తాత్కాలిక ఉపాధిపొందిన వారికి సామాజిక భద్రత పథకాలు, ఆరోగ్య పథకాలు, పెన్షను సదుపాయాలు వర్తించవని గమనించాలి. ఆర్థిక మాంద్యాల కారణంగా అమెరికాలో 89 లక్షల మంది నిరుద్యోగులయ్యారు. 1990 దశాబ్ది ఎదుర్కొంటున్న సవాలు ఉద్యోగాలు, మరిన్ని ఉద్యోగాలేనని అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ అనడం ఉత్తినేకాదు. సామాజిక న్యాయం సాధించడానికి, జీవన ప్రమాణాలను మెరుగుపరచి, భవిష్యత్తుపట్ల విశ్వాసం పెంచడానికి నిరుద్యోగ నిర్మూలన అత్యవసరమని ఐ.ఎల్.ఒ స్పష్టం చేసింది. ఉద్యోగాలలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని యూరపు అమెరికాలలో పెరుగుతున్న ఒత్తిడి గ్లోబల్ అశాంతికి ప్రబల సంకేతం. యూరపు నిరుద్యోగులలో సగంమంది, జపాన్‌లో 20 శాతం, అమెరికాలో 7.8 శాతం మంది దీర్ఘకాలంగా ఉపాధికరవయి బాధపడుతున్నారు. భారతదేశంలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీల తాజా సమాచారం ప్రకారం 1994 మే నెల నాటికి నిరుద్యోగుల సంఖ్య 3 కోట్ల 60 లక్షలు. ప్రభుత్వ ఆర్థిక పారిశ్రామిక విధానాలు నిరుద్యోగ నిర్మూలనకు అంతగా దోహదపడడంలేదన్నది స్పష్టం. స్వర్గీయ రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1985లోనే ప్రయివేటీకరణ విధానాన్ని ప్రారంభించారు. ప్రయివేటీకరణకు, మార్కెటీ

కరణకు, అంతర్జాతీయకరణకు దోహదకరంగా ప్రస్తుత ప్రభుత్వం 1991లో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ప్రభుత్వరంగాన్ని విస్తరించే గత నాలుగు దశాబ్దాల విధానాన్ని క్రమంగా విడనాడుతున్నారు. చైనా, దక్షిణ కొరియా, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలతో పోల్చి చూస్తే మన దేశంలో విదేశీ పెట్టుబడులు చాలా తక్కువ. అందువల్ల సాంకేతిక పరిజ్ఞానం స్థాయిని తదనుబంధ సదుపాయాలను విస్తరించి, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచేందుకు విదేశీ పెట్టుబడులను ఎటువంటి అవరోధం లేకుండా దేశంలోకి అనుమతించాలని భారత ప్రభుత్వం దృఢంగా భావిస్తున్నది. ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండానే అనేక సంస్థలలో 51 శాతం పెట్టుబడి పెట్టడానికి బహుళజాతి సంస్థలకు అవకాశం ఇచ్చారు. బహుళజాతి సంస్థలు ఇక్కడి ఉన్నత సాంకేతిక సంస్థలలో నూరు శాతం యాజమాన్యం కలిగి ఉండడానికి అనుమతించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో భారత ఆర్థిక వ్యవస్థను విలీనపరచడానికి అనుసరిస్తున్న విధానమే గ్లోబలైజేషన్ ప్రయివేటీకరణ. మార్కెటీకరణ. గ్లోబలైజేషన్ విధానాలవల్ల అభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని, కంట్రోళ్లు తొలుగుతాయని, స్వదేశీ, విదేశీ పెట్టుబడులు గణనీయంగా పెరిగి భారత ఆర్థిక వ్యవస్థ అపూర్వంగా అభివృద్ధి చెందుతుందని దీనివల్ల ఉపాధి అవకాశాలు బాగా విస్తరిస్తాయని విశ్వసించారు. ఆ ఆశలు ఎంత వరకు ఫలించాయన్నది కీలక ప్రశ్న. నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగం కారణంగా నేడు దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు ప్రమాదకర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ ఎల్ సి జైన్ అభిప్రాయపడ్డారు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య 1990-91లో 110 లక్షలుకాగా, 1991-92లో 170 లక్షలు. 1993-94లో 210 లక్షలు. నిరుద్యోగస్థాయి 1990-91లో 3.1 శాతం ఉండగా, 1993-94 నాటికి 5.5 శాతానికి పెరిగింది. అదనంగా చేకూరిన ఉపాధి అవకాశాలలో అధికభాగం అవ్యవస్థిత రంగానికి చెందినవే. ఒక రకంగా ఇది తిరోగమన సూచిక. అవ్యవస్థిత రంగంలో వేతనాలు తక్కువ. ఉద్యోగభద్రత శూన్యం. ప్రభుత్వం అనధికారికంగా ప్రకటించకుండానే కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించి ఇంటికి పంపే విధానాన్ని (ఎగ్జిట్‌పాలసీ) అమలు జరుపుతున్నది. విదేశీ పెట్టుబడులు పెద్దఎత్తున వచ్చి, ప్రయివేటు రంగం విస్తరించి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఇనుమడించగలవన్న ఆశ ఎండమావి వంటిది. ఈ శతాబ్ది చివరికి స్థూలజాతీయోత్పత్తితోపాటు నిరుద్యోగమూ పెరుగుతుందనడంలో సందేహంలేదు. అన్ని

విధాల ప్రోత్సాహక చర్యలతో, రాయితీలతో సదుపాయాలు కల్పిస్తున్నప్పటికి ఉదార, సరళీకృత ఆర్థిక విధానాలు వ్యవస్థీకృత రంగంలో తగినన్ని ఉపాధి అవకాశాలను కల్పించలేకపోయాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలు కేవలం నిరుద్యోగుల పేర్ల నమోదుకే ఉపకరిస్తున్నాయి. అవి ఉపాధి కల్పిస్తున్న సందర్భాలు చాలా తక్కువ. విద్యావంతులయిన నిరుద్యోగుల సంఖ్య పెరగడం బాధాకర విషయం. మొత్తం నిరుద్యోగులలో విద్యాధిక నిరుద్యోగుల సంఖ్య 1981లో 51 శాతం కాగా, 1990లో 61 శాతం. ఈ పరిస్థితిలో ప్రభుత్వపు నూతన ఆర్థిక విధానం మీద, తదనుబంధ రాయితీలు మొదలయిన వాటి మీద సందేహాలు ఏర్పడడం సహజమే. బహుళజాతి సంస్థలు దేశంలో అడుగుపెడితే చాలు ధన్యులమన్న విచిత్ర ధోరణి ప్రమాదకరం.

## వ్యవసాయం కీలకం

పట్టణ ప్రాంతాలలోని అధిక ఆదాయవర్గాల వారికి అవసరమయిన వినిమయ, విలాస వస్తువులను ఉత్పత్తి చేసినంతమాత్రాన ప్రయోజనం లేదు. దేశ జనాభాలో నాలుగింట మూడు వంతుల మంది గ్రామీణ ప్రజలు. వారికి తగినంత ఉపాధి లభించాలి. జీవన ప్రమాణాలు పెరగాలి. అది ముఖ్యం. గ్రామీణ ప్రాంతాలలో పారిశ్రామిక ప్రగతి  జరగాలి. అప్పుడు పట్టణ ప్రాంతాలలో జనాభా ఒత్తిడి తగ్గుతుంది. మురికి పేటల నివారణ, కాలుష్య నిరోధం సుసాధ్యమవుతాయి. జనాభాలో నూటికి 66 మంది వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. మనసమీపంలో ఉన్న జపాన్, తైవాన్, కొరియా వంటి చిన్న దేశాలలో నీటిపారుదల, పరపతి, విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు తదితర సదుపాయాలు కల్పించి వ్యవసాయోత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటు కంటే ఎక్కువ ధరలు లభించేలా చేసి వ్యావసాయికంగా, పారిశ్రామికంగా అద్భుత ప్రగతి సాధించారు. దరిమిలా దేశాలలోని గ్రామీణ ప్రజల వ్యవసాయదారుల కొనుగోలు శక్తి పెరిగింది. పారిశ్రామిక వస్తువులకు డిమాండు గణనీయంగా పెరిగింది. ఉపాధి అవకాశాలూ విస్తరించాయి. అదే సరళిలో మన దేశంలోనూ వ్యవసాయ అభివృద్ధి బాగా జరగాలి. విశేషించి బీహారు, ఒరిస్సా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తూర్పు ఉత్తర ప్రదేశ్ తదితర ప్రాంతాల్లో వ్యవసాయ రంగం ఎంతో అభివృద్ధిని సాధించవలసి ఉంది. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక

విధానం వ్యవసాయరంగాన్ని అలక్ష్యం చేస్తున్నది. ఇది శోచనీయం. వ్యవసాయ అభివృద్ధికి అతిముఖ్యమయిన నీటిపారుదలకు ఏడో ప్రణాళికలో 9.4 శాతం నిధులు కేటాయించగా అవి ఎనిమిదో ప్రణాళికలో 7.9 శాతానికి తగ్గాయి. వ్యవసాయ రంగానికి కేటాయింపు ఏడో ప్రణాళికలో 5.9 శాతం. ఎనిమిదో ప్రణాళికలో 5.2 శాతం. ఇతర తూర్పు ఆసియా దేశాలతో పోల్చినప్పుడు మన దేశంలో విద్య, ఆరోగ్య రంగాలకు ప్రణాళిక కేటాయింపులు మరింత తక్కువ స్థాయిలో ఉన్నాయి. మన మొత్తం ప్రణాళికా వ్యయంలో విద్యకు లభించింది కేవలం 4.5 శాతం భాగమే. ఇంకా ఆరోగ్య పరిరక్షణకు దక్కింది 4.7 శాతం భాగం మాత్రమే. పెట్టుబడులు, ఉత్పత్తులు మాత్రమే ముఖ్యంకావు. ప్రజల సర్వతోముఖాభివృద్ధి, శ్రేయస్సు పరమలక్ష్యాలు. వాటికి తగినట్టుగా అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించాలి. చిన్న పరిశ్రమలు; చిన్నవాణిజ్య సంస్థలు హెచ్చు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని వివిధ దేశాలలో రుజువయింది. చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలలో అమెరికా తదితర దేశాల్లో మహిళలు ప్రాబల్యం వహిస్తున్నారు. అయితే, చిన్న పరిశ్రమలు, వ్యవసాయరంగం, సేవారంగాల పరపతి అవసరాలను బ్యాంకులు తదితర ఆర్థిక సహాయసంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వెల్లడయింది.

## సర్వతోముఖాభివృద్ధి

భారత్ పారిశ్రామిక ఉత్పత్తిలో 37 శాతం ఎగుమతులలో 30 శాతం చిన్న పరిశ్రమల రంగానివి. చిన్న పరిశ్రమల రంగం ఒక కోటి 24 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. చిన్న పరిశ్రమలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తాయి. అందువల్ల ఈ రంగానికి పరపతి సదుపాయం అధికంగా లభించాలి. వివిధ సేవా రంగాలలో చిన్న చిన్న వృత్తులలో స్వయం ఉపాధికి అపార అవకాశాలున్నాయి. ఇందుకోసం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఉపకరించాలి. కాశ్మీరు, అస్సాం, పంజాబు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో తీవ్రవాద కార్యకలాపాల్లోకి అధికంగా ఆకర్షితులయిన వారు నిరుద్యోగులు, పేదలు. ముఖ్యంగా నిరుద్యోగ విద్యావంతులేనని గుర్తించాలి. నిరుద్యోగ సమస్యను సంతృప్తికరంగా పరిష్కరించినప్పుడే సామాజిక ప్రశాంతి, సర్వతోముఖ అభ్యుదయం సాధ్యమవుతాయి.

*ది. 10-11-1994.* **– *ఈనాడు***

●

# ఉపాధితో ముడిపడితేనే పథకాలు సార్థకం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. రెండు రూపాయల కిలో బియ్యం పథకం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 1995-96లో రూ. 1143 కోట్లు ఖర్చు చేసిందని ఈ శ్వేతపత్రం వెల్లడించింది. భారత ఆహార సంస్థ విడుదల చేసే బియ్యం ధరల కారణంగా మన సబ్సిడీ బియ్యం పథకం వ్యయభారం రూ. 1308 కోట్లకు పెరుగుతుందని అంచనా. పథకంలో కొన్ని మార్పులు చేసి బియ్యం సబ్సిడీ భారాన్ని తగ్గించినట్లయితే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమయిన నిధులను పెంచుకోగలుగుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని ఎటువంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగించాలని మరికొందరు వాదిస్తున్నారు.

## నానాటికీ పెరుగుతున్న సబ్సిడీల భారం

సామాన్య ప్రజలకు సరసమయిన ధరలకు నిత్యజీవితావసర వస్తువులను సరఫరా చేసే ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రారంభమయింది. చౌకధరల దుకాణాలు మొట్టమొదట 1939లో బొంబాయి నగరంలో ఏర్పాటయ్యాయి. విపత్కర పరిస్థితిలో వర్తకులు అధిక లాభాలార్జనలతో వినిమయ వస్తువుల ధరలను పెంచి పేదలను ఇక్కట్ల పాలు చేసినప్పుడు ఆదుకోవడానికి ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ రూపుదాల్చింది. ఆహార ధాన్యాలను ప్రజలకు సమాన స్థాయిలో పంపిణీ చేయడానికి అటు తరువాత 1942లో రేషనింగు వ్యవస్థ వచ్చింది. ఈ వ్యవస్థ 1947 నాటికి పట్టణ ప్రాంతాలలో 5 కోట్ల 40 లక్షల మందికి సరుకులను సరఫరా చేసే స్థాయికి చేరింది. 1953 అనంతరం నిత్య జీవితావసర వస్తువుల ధరలు తగ్గసాగాయి. అందువల్ల, రేషనింగు విధానం అమలును నిలిపివేశారు. చౌకధరల దుకాణాల పథకాన్ని 1967-68 నుంచి ప్రభుత్వ పంపిణీ వ్యవస్థగా పరిగణిస్తున్నారు. 1950, 1960 దశాబ్దాలలో భారతదేశంలో ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలు ఇక్కడి అవసరాలను తీర్చలేకపోయాయి.

భారీ ఎత్తున ఆహారధాన్యాలను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోకతప్పలేదు. ప్రభుత్వం పక్షాన ఆహారధాన్యాలను కొనుగోలు చేసి పంపిణీ చేయడానికి 1965లో భారత ఆహార సంస్థను స్థాపించారు. 1970 నుంచి దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగింది. భారత ఆహార సంస్థ సేకరణ హెచ్చింది. పర్యవసానంగా ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు పటిష్ఠ అలంబనం ఏర్పడింది. దేశమంతటా వినియోగదారులకు ఆహారధాన్యాలను, ఇతర నిత్య జీవితావసర వస్తువులను ఎటువంటి ఇబ్బంది లేకుండా అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి బాధ్యత. కేంద్ర ప్రభుత్వం పక్షాన భారత ఆహార సంస్థ ఆహారధాన్యాలను సేకరించి, రవాణా చేసి గోదాములలో నిలువ చేస్తుంది. విదేశాలనుంచి దిగుమతి అయ్యే ఆహారధాన్యాలు కూడా ఈ నిలువలలో చేరుతాయి. కేంద్ర నిలువల మొత్తాన్ని సెంట్రల్ పూల్ అని అంటారు. తమకు కేటాయించిన ఆహార ధాన్యాలను రాష్ట్ర ప్రభుత్వాలు చౌకధరల దుకాణాల ద్వారా వినియోగదారులకు అందిస్తాయి. తమ పరిధిలోని పౌరసరఫరా కార్పోరేషన్లు తదితర సంస్థల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల వద్ద ఆహారధాన్యాలను కొనుగోలు చేసి ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలో వినియోగదారులకు అందించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు రైతుల వద్ద కొనుగోలు చేసి వాటిని కేంద్ర నిలువలకు బదిలీ చేయవచ్చు. పంజాబ్‌లో రాష్ట్ర సంస్థలు కొన్న ఆహారధాన్యాలను ప్రతి సంవత్సరం భారత ఆహార సంస్థ తీసుకుంటున్నది. భారత ఆహార సంస్థ చెల్లించే సేకరణ ధర, రవాణా, నిలువల నిర్వహణ వ్యయం, తరుగుదల, పెట్టుబడిపై వడ్డీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించేది. ఆర్థికధర (ఎకనమిక్ కాస్ట్) ఆహార పదార్థాలు సామాన్య ప్రజలకు కొంతవరకయినా అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఆర్థిక ధరలో కొంత భాగాన్ని సబ్సిడీగా భరించి కేంద్రప్రభుత్వం తక్కువ ధరలో ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు అందిస్తున్నది. దీనిని విడుదల ధర (ఇష్యూ ప్రయిస్) అని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆహారధాన్యాల కొనుగోలు పంపిణీ కార్యక్రమంపై భరించే నష్టాన్ని ఆహార సబ్సిడీ అని అంటున్నారు. 1966–67లో ఈ సబ్సిడీ భారం రూ. 90 కోట్లు; 1993–94లో కేంద్ర ప్రభుత్వం రూ. 2000 కోట్ల ఆహార సబ్సిడీని భారత ఆహార సంస్థకు ఇచ్చింది. ఆహార సబ్సిడీ ప్రతి సంవత్సరం పెరుగుతున్నది. ఇది కేంద్ర ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ భారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలపైన ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపైన ఆహార సబ్సిడీ భారం అదనంగా పడుతున్నది. రెండు రూపాయల కిలో సబ్సిడీ బియ్యం పథకం అమలు కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ఈ సంవత్సరం రూ. 13 వందల కోట్ల ఆర్థిక భారం పడుతున్నది. బాగా వెనుకబడినట్లు గుర్తింపు

పొందిన 1775 బ్లాకులలో ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలి. ఆ వ్యవస్థ ద్వారా భారత ఆహార సంస్థ విడుదల ధర కంటే క్వింటాలుకు 50 రూపాయలు తక్కువకు ప్రజలకు ఆహారధాన్యాల సరఫరా జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద భారం పడుతున్నప్పటికీ ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు తక్కువ ధరలకు నిత్య జీవితావసర వస్తువులను ముఖ్యంగా ఆహార పదార్థాలను సరఫరా చేయడం ప్రధాన విధి. భారత రాజ్యాంగంలోని శ్రేయోరాజ్య ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పేదలకు తోడ్పడక తప్పదు. అమెరికా వంటి ధనిక దేశాలలో నిరుపేదలను ఆదుకునే పథకాలున్నాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం లభించి 49 సంవత్సరాలు పూర్తికాబోతునన్నప్పటికీ ఈరోజు దేశ జనాభాలో దాదాపు మూడోవంతు మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉండడం శోచనీయం. కేంద్ర ప్రభుత్వం 1991 నుంచి అమలు జరుపుతున్న ఆర్థిక సంస్కరణల ఫలితంగా దేశంలో పేదల సంఖ్య పెరిగిందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. దారిద్ర్యరేఖ దిగువున ఉన్న పేదల శాతం 1989-90లో 33,67 కాగా 1992-93లో 41.1. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆర్థిక పరిస్థితిని మరింత విషమింపజేస్తున్నది. వ్యవసాయ కూలీల వినిమయ సూచిక దాదాపు 40శాతం పెరిగింది. పేద ప్రజల ఆదాయంలో అధిక భాగం ఆహార పదార్థాలకై ఖర్చవుతున్నది. రికార్డు స్థాయిలో 31 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిలువలున్నా ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ ద్వారా కొనుగోలు చేసిన ఆహారధాన్యాలు 1993-94లో 15 మిలియన్ టన్నులు, 1994-95కి 13,15 మిలియన్ టన్నుల తగ్గుదల స్పష్టంగా కన్పిస్తున్నది. 1989 నుంచి 1991 వరకు సగటున ఒక మనిషికి రోజుకు 452 గ్రాముల ఆహారధాన్యాలు లభించగా 1992-94 సంవత్సరాల్లో కేవలం 432.7 గ్రాములు మాత్రమే లభించాయి. మానవుడికి సగటున రోజుకు 2400 కేలరీల ఆహారం అవసరమవుతుంది. ప్రపంచస్థాయిలో సగటున తలవొక్కింటికి 2712 కేలరీలు లభిస్తున్నాయి. భారతదేశంలో సగటున తలవొక్కింటికి రోజుకు 2243 కేలరీలు మాత్రమే లభిస్తున్నాయి. రోజుకు సగటున తల వొక్కింటికి అమెరికాలో 3000 కేలరీలు, యూరపులో 3439 కేలరీలు లభిస్తున్నాయి. నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో నిర్వహించిన సర్వే ప్రకారం మన దేశంలో 1-5 సంవత్సరాల పిల్లలలో 2.7 శాతం మంది తీవ్ర పోషకాహార కొరతతో 44 శాతం మంది ఒక మోస్తరు పోషకాహార కొరతతో 37 శాతంమంది తక్కువ పోషకాహార కొరతతో బాధపడుతున్నారు. దేశంలో సగటున ప్రతి వేయి కాన్పులలో కనీసం నలుగురు స్త్రీలు మరణిస్తున్నారు. దేశంలో ప్రజలకు ఆరోగ్య సదుపాయాలు, మంచినీటి సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం చేస్తున్న

ఖర్చు సగటున తలవొక్కింటికి సంవత్సరానికి రూ. 70 మాత్రమే. పేదరికం మన దేశంలో ఎంత ఘోరంగా ఉందో ఈ సంఖ్యల సత్యాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో నిరుపేదలకు తక్కువ ధరలకు నిత్యజీవితావసర వస్తువులను అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనీస బాధ్యత. ఎన్.టి.రామారావు 1983లో అధికారంలోకి రాగానే రెండు రూపాయల కిలోబియ్యం పథకాన్ని అమలుజరిపారు. ఆయన నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు విస్తరింపజేసి దాదాపు 90 లక్షల కుటుంబాలకు తెల్లకార్డులు ద్వారా తలవొక్కింటికి 5 కిలోల చొప్పున గరిష్ఠంగా 25 కిలోలను (కుటుంబానికి) సరఫరా చేసింది. రెండు రూపాయల కిలోబియ్యం పథకం ప్రారంభమయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపైన దాదాపు రూ. 70 కోట్ల సబ్సిడీ భారం పడింది. భారత ఆహార సంస్థ ప్రతి సంవత్సరం సేకరణ ధరను పెంచుతున్నదని ఈ సందర్భంగా గమనించాలి. భారత ఆహార సంస్థ విడుదల చేసిన బియ్యం రేటు కూడా పెరిగింది. 1989 జనవరి 25 నాటికి ఈ విడుదల ధర క్వింటాలుకు కామన్ రకానికి రూ.244 ఫైన్ రకానికి రూ. 304. సూపర్‌ఫైన్ రకానికి రూ. 325. కాంగ్రెసు పార్టీ 1989లో అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఆరు లక్షల కార్డులను తొలిగించి కొత్తగా దాదాపు పదకొండున్నర లక్షల కార్డులను పంపిణీ చేసింది. సబ్సిడీ బియ్యం ధరను కిలోకు రూ. 3.50 వరకు పెంచి, ఒక కుటుంబానికి ఇస్తున్న బియ్యాన్ని 25 కిలోల నుంచి 20 కిలోలలకు తగ్గించింది. భారత ఆహార సంస్థ విడుదల రేటు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వంపై సబ్సిడీ బియ్యం పథకం భారం 1991 అక్టోబరునాటికి రూ. 7 వందల కోట్ల స్థాయికి హెచ్చింది. 1994 జనవరిలో భారత ఆహార సంస్థ విడుదల రేటు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వంపై సబ్సిడీ బియ్యం భారం రూ. 1000 కోట్ల స్థాయికి వెళ్లింది. 1994లో తిరిగి అధికారం చేపట్టగానే ఎన్.టి.ఆర్. సబ్సిడీ బియ్యం ధరను కిలోకు రెండు రూపాయలకు తగ్గించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజల వద్దకు పాలన కార్యక్రమంలో పదిలక్షల తెల్లకార్డులు కొత్తగా మంజూరు చేసింది. 1996-97లో సబ్సిడీ బియ్యం పథకం భారం రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 13 వందల కోట్ల వరకు ఉంటుందని అంచనా. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అప్పటి ప్రభుత్వం భారత ఆహార సంస్థ విడుదల రేటును పెంచలేదు. ఇక పెంచక తప్పదు. దానితో మన రాష్ట్ర ప్రభుత్వంపై సబ్సిడీ బియ్యం భారం మరింత పెరుగుతుంది. శ్వేతపత్రం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది జీతభత్యాల వ్యయం తీవ్రంగా ఉంది. సాగునీరు కారణంగా ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది. ఈ కారణాలన్నిటివల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా దిగజారింది.

పొరుగున కర్ణాటక ప్రభుత్వం వ్యవసాయదారులకు సరఫరా చేస్తున్న విద్యుచ్ఛక్తి హెచ్.పి.కి. రూ. 300 చొప్పున రేటు విధించింది. మహారాష్ట్రలో వ్యవసాయ రంగం విద్యుచ్ఛక్తి, నీటితీరువా రేట్లను పెంచారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ రేట్లను కొంతవరకు పెంచవచ్చు.

## శాశ్వత నివారణం కాబోదు

ఆంధ్రప్రదేశ్‌లో దారిద్ర్య రేఖ దిగువన ఉన్న నిరుపేదల సంఖ్య 30 శాతమని అంచనా. పేదరికంలో లేని లక్షల కుటుంబాలు అక్రమంగా తెల్లకార్డులు సంపాదించి రాష్ట్ర ప్రభుత్వంపైన భారం మోపుతున్నాయి. చౌకధరల దుఖాణాల వర్తకులు ఈ బోగసు కార్డులతో లాభం పొందుతున్నారు. బోగసు కార్డుల ఏరివేత జరుపక తప్పదు. భారత ఆహార సంస్థ విడుదల ధరలో సగం ధరకు ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు (నిజమయిన పేదలకు మాత్రమే) బియ్యాన్ని అందించే విధంగా సబ్సిడీ పథకంలో మార్పులు చేయాలి. భారత ఆహార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు బియ్యం కొనుగోలు, నిలువ, రవాణా, పంపిణీల వ్యయాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి. భారత ఆహార సంస్థ నిర్వహణను మెరుగుపరచి వృధావ్యయాన్ని అరికట్టాలి. ఈరోజు మన రాష్ట్రంలో వేలాది గ్రామాలలో ఉన్న సహకార బ్యాంకుల గోదాములను ఉపయోగించుకుంటే రవాణా ఛార్జీలు కొంత తగ్గుతాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు వ్యవహరించి అర్హులయిన పేదలకే తెల్ల కార్డులు అందేలా చూడాలి. సబ్సిడీ బియ్యం అందించినంత మాత్రాన పేదరికం రూపుమాసిపోదు. దారిద్ర్య నిర్మూలనకుగాను ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచాలి. ప్రభుత్వం అమలుచేస్తున్న ఉపాధి  కల్పన పథకాలను గ్రామసీమలలో కనీస వసతులు కల్పించడానికి, మౌలిక సదుపాయాలు పటిష్టం కావడానికి వినియోగించాలి. ఉపాధి అవకాశాలు పెరిగినప్పుడు ప్రజల ఆదాయం, జీవన ప్రమాణం పెరుగుతాయి. అప్పుడు వారికి తగినంత కొనుగోలు శక్తి లభిస్తుంది. ఉపాధి సౌకర్యాల విస్తరణ ద్వారా కొనుగోలు శక్తిని పెంచడం సరైన మార్గం. ఇలా జరగనంతకాలం సబ్సిడీ బియ్యం పథకం తాత్కాలిక ఉపశమనం కాగలదే తప్ప శాశ్వత నివారణ కాబోదు.

*ది. 01-07-1996.* — ***ఈనాడు***

# వ్యవసాయాధార పరిశ్రమలకు ప్రాధాన్యం

భారతదేశంలో వ్యవసాయ రంగానికి సబ్సిడీలు విపరీతంగా అందుతున్నాయనే భావం కొన్ని వర్గాలలో ఉంది. కొందరు ఆర్థికవేత్తలు వీటిని పూర్తిగా ఉపసంహరించాలని సూచిస్తున్నారు. వ్యవసాయ విద్యుత్, ఎరువులు, సాగునీటి నిర్వహణలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు పదిహేను వేల కోట్ల రూపాయల సబ్సిడీ ఇస్తున్నాయి. రైతుల గురించి ఇన్ని వేల కోట్ల రూపాయల భారం ప్రభుత్వాలు ఎందుకు మోయాలనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధంగా సబ్సిడీలు ఇవ్వడానికి కారణాలున్నాయి. తాను పండించిన పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేదు. కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం కనీస మద్దతు ధరను నిర్ణయిస్తుంది. దానికి తోడు రవాణాపై ఆంక్షల వలన అంతర్జాతీయ మార్కెట్ ధరలకంటే భారత్‌లో వరి, గోధుమ, పత్తి తదితర అనేక పంటలకు తక్కువ ధరలు లభిస్తున్నాయి. గాట్ ఒప్పందంపై పార్లమెంటులో చర్చ సందర్భంగా అప్పటి వాణిజ్య మంత్రి వెల్లడించిన వాస్తవాలు గమనార్హం. భారతదేశంలో వరి, గోధుమలు పండించిన రైతులు అంతర్జాతీయ మార్కెట్ ధరల కన్నా తక్కువ ధరలకు అమ్ముకోవడం ద్వారా ఏటా పదహారువేల కోట్ల రూపాయలు కోల్పోతున్నట్లు మంత్రి వివరించారు. ఆ ప్రకారం ఈ దేశంలో రైతులకు ప్రభుత్వం నికరంగా సబ్సిడీ ఇవ్వడంలేదు. రైతులనుంచే గుంజుతోంది. అది తెలిసే రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి కావాల్సిన విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి వ్యయంకన్నా తక్కువ ధరకు అందిస్తున్నాయి.

ఎరువులపై కేంద్రం ఏటా సుమారు రూ. 5500 కోట్ల సబ్సిడీని భరిస్తోంది. నీటిపారుదల శాఖ నిర్వహణ ఖర్చు కన్నా చాలా తక్కువ స్థాయిలో నీటి తీరువా ఉంటోంది. వీటన్నిటినీ తీసివేస్తే ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరిగి చాలా ఎక్కువ ధరలకు అమ్మవలసి ఉంటుంది. ఫలితంగా వినియోగదారులపై విపరీతమైన భారం

పడుతుంది. ఇతర దేశాలు ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యవసాయ రంగానికి లక్షల కోట్ల రూపాయల సబ్సిడీలిస్తున్నాయి. చాలా అధిక స్థాయిలో ఎగుమతులపై సబ్సిడీలను ఇస్తున్నాయి. గాట్ ఒప్పందం ప్రకారం ఆ దేశాల్లో వ్యవసాయ రంగానికి, ఎగుమతుల ప్రోత్సాహానికి ఇస్తున్న సబ్సిడీలలో 36 శాతాన్ని ఆరు సంవత్సరాల్లోగా తగ్గించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, ఐరోపా, జపాన్ దేశాల్లో భవిష్యత్తులో కూడా సబ్సిడీలు గణనీయమైన స్థాయిలో కొనసాగుతూనే ఉంటాయి. రైతులకు సరైన ధరలు లభించేలా చూస్తూ సబ్సిడీలను క్రమంగా తగ్గిస్తే నష్టం పెద్దగా ఉండకపోవచ్చు. గాట్ ఒప్పందం ప్రకారం భారత వ్యవసాయ రంగంలో ఉత్పత్తుల విలువలో 10 శాతం మేరకు సబ్సిడీలు ఇవ్వవచ్చు. ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాల్లోనే వ్యవసాయ రంగానికి అధిక స్థాయిలో సబ్సిడీలు లభిస్తున్న దశలో భారత్‌లో సబ్సిడీలను వెంటనే ఉపసంహరిస్తే వ్యవసాయ రంగం ప్రపంచ పోటీలో నిలదొక్కుకోవటం కష్టం. పాలకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని విధాన రూపకల్పన చేయాలి. రైతులలో అవగాహన పెంచవలసిన మరొక ముఖ్యమైన అంశం- వ్యవసాయధార పరిశ్రమల అభివృద్ధి. తద్వారా పల్లెసీమలలో చక్కని ప్రగతి సాధ్యమవుతుంది. ప్రపంచంలోని పశు సంపదలో నాలుగోవంతు భారతదేశంలో ఉంది. జాతీయ వ్యవసాయోత్పత్తిలో నాలుగో వంతు పశుపోషణ, పాల ఉత్పత్తుల ద్వారా  చేకూరుతుంది. వ్యవసాయ రంగంలో వినియోగించే 'శక్తి'లో మూడింట రెండువంతులు పశువులదే. మరోరకంగా చెప్పాలంటే వాటి శ్రమశక్తి విలువ రూ. 4500 కోట్ల విలువైన పెట్రోలు ఇంధనానికి సమానం. భారతదేశం పాల ఉత్పత్తిలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. కోడిగుడ్ల ఉత్పత్తిలో అయిదో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 4100 కోట్ల గుడ్లను ఉత్పత్తి చేస్తూ దేశంలో మొట్టమొదటి స్థానంలో ఉంది. లక్ష మందికి పౌల్ట్రీ రంగం ఉపాధిని కల్పిస్తోంది. ఫీడ్ ధరలు తక్కువ ఉంటే, విదేశాలకు గుడ్ల ఎగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం రవాణా సబ్సిడీలు ఇస్తే పౌల్ట్రీ పరిశ్రమ మరెంతో అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమ ప్రస్తుత స్థితికి పెరగటానికి కారకుడైన బి.వి. రావు ఆంధ్రుడు కావడం  గర్వకారణం. సుమారు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరంగల ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య సంపద, ఉప్పు కయ్యలలో, వృధాగా పడి ఉన్న చవిటి భూములలో రొయ్యల పెంపకంలో అగ్రస్థానంలో ఉంది. రొయ్యల ఎగుమతి వల్ల విలువైన విదేశీ మారకద్రవ్యం లభిస్తుంది. రాష్ట్రంలో లక్షా 14 వేల

ఎకరాల జల విస్తీర్ణంకల చెరువులు, రిజర్వాయర్లు ఉన్నాయి. ఇప్పుడు శాస్త్రీయ పద్ధతులలో చేపల పెంపకం జరుగుతోంది. సగటున హెక్టారుకు చేపల దిగుబడి 50 కిలోల నుంచి రెండు టన్నుల వరకు పెరిగింది. చేపలు, రొయ్యల పెంపకం విస్తృతంగా చేపట్టిన ప్రాంతాలలో రహదార్లు, కమ్యూనికేషన్, విద్యుచ్ఛక్తి వంటి మౌలిక సదుపాయాలు శీఘ్రంగా అభివృద్ధి చెందాయి. ఆ ప్రాంతాల్లో ప్రజల సాంఘిక, ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతోంది. ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో భారతదేశం ఏడో స్థానంలో ఉంది. ప్రపంచ సముద్ర చేపల వ్యాపారంలో వాటా మాత్రం రెండు శాతమే. రాష్ట్రం 1,65,000 టన్నుల చేపలను సముద్రం నుంచి పడుతున్నారు. భూభాగంపైన దాదాపు 2 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. 2000 సంవత్సరం నాటికి ప్రపంచంలో మత్స్య సంపద సప్లయి, డిమాండుల మధ్య 2 కోట్ల టన్నుల లోటు ఉంటుందని ప్రపంచ ఆహార సంస్థ అంచనా. భారతదేశం ఇప్పుడు పండ్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే మొట్టమొదటి స్థానంలో ఉంది. దేశంలో పండ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉంది. రాష్ట్రంలో 50 లక్షల టన్నుల పండ్లు ఉత్పతి అవుతున్నాయి. భారతదేశం కూరగాయలు పండించడంలో చైనా తర్వాత రెండో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 3.75 లక్షల ఎకరాలలో 22 లక్షల టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయి. సగటున రోజుకు మనిషికి కనీసం 280 గ్రాముల కూరగాయలు అవసరం. ఇప్పటికి దేశంలో 140 గ్రాముల కూరగాయలు మాత్రమే లభ్యమవుతున్నాయి. ఉత్పత్తులు పెరిగితే ఇతర దేశాలకు ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేయడానికి అవకాశాలున్నాయి. పండ్లు, కూరగాయలు పండించి రైతులు సంఘటితమై సహకార సంస్థలను ఏర్పాటు చేసుకొని, రైతుల నుంచి కొనుగోలు చేసి వినియోగదారులకు రిటైల్ షాపుల ద్వారా అమ్మేట్టయితే మామూలుగా మార్కెట్‌లోని ధరలకన్నా 20 శాతం తక్కువ ధరలకు సరకులు లభిస్తాయి. అదే సమయంలో పండించిన రైతుకు హెూల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారులకు అమ్మినప్పుడు లభించే ధరకన్నా 80 శాతం నుంచి వందశాతం పైగా ధర లభించే అవకాశాలుంటాయి. బెంగుళూరులోని హార్టీకల్చరల్ ప్రొడ్యూసర్ కో ఆపరేటివ్ మార్కెటింగు సొసైటీని ఇందుకు ఆదర్శంగా తీసుకోవచ్చు. న్యూఢిల్లీలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు కూడా రైతుల నుంచి పండ్లు, కూరగాయలు కొని పాలు అమ్మేదానితోపాటు పండ్లు, కూరగాయలు కూడా రిటైల్ అవుట్‌లెట్‌ల ద్వారా అమ్ముతోంది. చండీగఢ్‌లో "అప్నేమండి" (రైతు మార్కెట్)లు పనిచేస్తున్నాయి.

కొన్ని నిర్దేశిత ఖాళీ స్థలాల్లో నిర్దేశించిన రోజులలో రైతులు తమ ఉత్పత్తులను తెచ్చుకొని వినియోగదారులకు నేరుగా అమ్ముకొనే విధానం అమల్లో ఉంది. నేషనల్ హార్టీకల్చరల్ బోర్డు, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ భారీగా సహాయమందించే పథకాలున్నాయి. కోత కోసిన తర్వాత గ్రేడింగ్, ప్యాకేజింగ్, ప్లాస్టిక్ క్రేట్స్ కొనుగోలు, రవాణా సదుపాయాలు, శీతలీకరణ మున్నగు సదుపాయాలనేర్పాటు చేసుకోవడానికి ఒక కోటి రూపాయలకు మించకుండా ఆర్థిక సహాయం అందించే పథకాలూ ఉన్నాయి. రిటైల్ అవుట్‌లెట్లు, పండ్ల రసాలు అమ్మేందుకు బస్సుస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో యంత్రాలను నెలకొల్పేందుకు 25 శాతం సబ్సిడీ, 75 శాతం అప్పు యిచ్చే పథకాలు కూడా ఉన్నాయి. హార్టీ కల్చర్ రంగానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరాన్ని గుర్తించబట్టే ఏడో ప్రణాళికలో రూ. 74 కోట్లు కేటాయించగా ఎనిమిదో ప్రణాళికలో రూ. 1000 కోట్లు కేటాయించారు. పథకాలు ఎన్నో ఉన్నా చాలామంది రైతులకు అవేవీ తెలియవు. వారిని సంఘటితపరచాలి. నిజాయతీతో, అంకితభావంతో పనిచేయగల రైతులను కొందరిని, సేవాభావంతో సమర్థంగా పనిచేయగల అధికారులను కొద్దిమందిని కలిపి సంస్థలను ఏర్పాటు చేయాలి. ఇదంతా రైతులు వారంతట వారే చేసుకుంటారు అని ప్రభుత్వం అనుకుంటే సరికాదు. ప్రభుత్వం ఈ విషయంలో నియంత్రణాధికారంతో కాక తోడ్పాటునిచ్చే ధోరణితో వ్యవహరించాలి.

కర్షక విజ్ఞాన వేదికలను జిల్లాస్థాయిలో నిర్వహించడం ముగిసింది. దీని తదుపరి కార్యక్రమంగా మార్కెటింగ్ యార్డ్ పరిధిలోని ప్రతి గ్రామం నుంచి కొందరు ఆదర్శ రైతులను సమావేశపరచి ఆ మండల పరిధిలోని భౌగోళిక అంశాలను, సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని అనువైన పంటలు, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు, సస్యరక్షణ, భూసారం దెబ్బతినని విధంగా రసాయనిక, సేంద్రీయ ఎరువుల వాడకం గురించి వివరించాలి. సాగునీటిని పొదుపుగా వాడుకోవలసిన ఆవశ్యకత, స్ప్రింక్లర్, డ్రిప్ వంటి పరికరాల వినియోగం, వాటర్‌షెడ్ మేనేజిమెంట్, వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం, వనసంరక్షణ సమితుల ద్వారా అటవీ విస్తీర్ణం పెంపుదలకు కృషి చేయాలి. పంటల కోత, నూర్పిడి, కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించాలి. మార్కెటింగ్ సదుపాయాలను ఉన్నవాటిని వినియోగించుకుంటూ భవిష్యత్తులో రైతుల భాగస్వామ్యంతో కూడిన సహకార సంస్థలను ఏర్పాటు చేయడం అవసరం. ఇతర

ప్రాంతాలలో రైతులు ఏవిధంగా సంఘటితపడి, వ్యవస్థలనేర్పాటు చేసుకొని తమ ఉత్పత్తులకు సరైన ధరలను పొందగలుగుతున్నారో, ఎగుమతి అవకాశాలు, ప్రోసెసింగ్ మున్నగు అంశాలను వీడియో చిత్రాల రూపంలో తెలియపరచాలి. రైతులలో నూతన చైతన్యాన్ని తీసుకురావడం ఈనాడు దేశం ముందున్న తక్షణ కర్తవ్యం. గాట్ ఒప్పందంపై భారతదేశం సంతకం చేసిన దరిమిలా ఈ అవసరాన్ని గుర్తించి అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవలసి ఉంది. ఈ తక్షణ అవసరాన్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కర్షక విజ్ఞాన వేదికల ఏర్పాటు ద్వారా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం. పకడ్బందీ ప్రణాళికతో సమర్థంగా కార్యక్రమాలను చేపడితే సమీప భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయరంగం అద్భుత ఫలితాలు సాధించగలుగుతుంది. సాగునీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటు కూడా ఈ కృషికి ఎంతో దోహదం చేస్తుంది.

*దీ. 08-07-1997.* — ***ఈనాడు***

●

# మెతుకు దూరం...బతుకు భారం

కొంతకాలం నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఒకవైపు ఆహార ధాన్యాల ధరలు పెరుగుతుండడం, మరోవైపు ఆహార లభ్యత తగ్గి ప్రజలు నిరసనలకు దిగుతుండటంతో పలు దేశాలు ఆందోళన చెందుతున్నాయి. దక్షిణాఫ్రికాలో ఆహార ధాన్యాల కోసం గోదాములపై దాడులకు పాల్పడి సరకుల్ని దోచుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నవారిపై అక్కడి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం (ఐ.ఆర్.ఆర్.ఐ) ఉన్న ఫిలిప్పీన్స్‌లో ప్రజలు ఆహారం దొరక్క బియ్యం కోసం గోడౌన్లపై దాడులు చేస్తున్నారు. నైజీరియా, కరేబియన్ దీవుల్లోని హైతీలలో పరిస్థితులు విషమిస్తున్నాయి. బంగ్లాదేశ్, ఈజిప్టు, సిరియా, మొజాంబిక్, సెనెగల్, ఎమెన్, బొలీవియా, మెక్సికో, టర్కీ వంటి పలుదేశాల్లో కూడా ఆహారం కోసం ప్రజలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరమవుతున్నాయి. అమెరికాలోని కొన్ని సూపర్ మార్కెట్లలో బియ్యం అమ్మకాలపై పరిమితులు విధించారంటే, పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## పేద దేశాలకు నష్టదాయకం

గడచిన మూడేళ్లలో గోధుమల ధరలు 180శాతం, ఇతర ఆహార ధాన్యాల ధరలు 82శాతం పెరిగాయి. వచ్చే రెండు, మూడేళ్ల వరకు ఆహార ధాన్యాల ధరలు పెరుగుతూనే ఉంటాయని నిపుణులు అంటున్నారు. మరోవైపు – ప్రస్తుతం ప్రపంచంలో గోధుమల నిల్వలు గడచిన ఇరవై ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ స్థాయికి పడిపోయాయని, ఈ పరిస్థితే కొనసాగితే బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో దాదాపు వందకోట్లమంది ప్రజలు ఆహార కొరతను ఎదుర్కోవలసి వస్తుందని ప్రపంచ ఆహార సంస్థ (డబ్ల్యు.ఎఫ్.ఒ.) హెచ్చరించింది. మొక్కజొన్న నిల్వలూ బాగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో మార్పు రాకపోతే వర్ధమాన దేశాల్లోను, బాగా వెనుకబడి ఉన్న దేశాల్లోను

మెజారిటీ ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. ఎందుకంటే, ఈ దేశాల్లోని ప్రజలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ఆహారం కోసమే ఖర్చుచేయవలసి వస్తుంది. ఉదాహరణకు తమ ఆదాయంలో నైజీరియా ప్రజలు 70 శాతం, వియత్నాం ప్రజలు 75 శాతం, ఇండోనేసియా వాసులు 50 శాతం, భారతీయులు దాదాపు 50 శాతం ఆహారంపై వెచ్చించాల్సిన పరిస్థితి. అయితే ఆహారం కోసం అమెరికా ప్రజలు తమ రాబడిలో 12 శాతం, ఐరోపా దేశాల ప్రజలు దాదాపు 18 శాతం వెచ్చిస్తారు. కాబట్టి – ఆహార ధాన్యాల కొరత, వాటి ధరల పెరుగుదల వల్ల పేద, వర్ధమాన దేశాల్లోని ప్రజానీకానికే ఆహారభద్రత కరువవుతుంది. రానున్న కాలంలో పెట్రోలియం నిల్వలు తరిగిపోవడమే కాక వాటి ధరలూ బాగా పెరిగిపోయే పరిస్థితి ఉంది. అందువల్ల – పెట్రోల్‌కు ప్రత్యామ్నాయంగా ఇథనాల్‌ను తయారు చేయడంపై పలు దేశాలు దృష్టి సారించాయి. ఇటీవలికాలంలో అమెరికా మొక్కజొన్నను వినియోగించి పెద్దయెత్తున ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తోంది. నిరుడు తమ దేశంలో పండిన మొక్కజొన్నలో 20 శాతాన్ని అంటే, సుమారు కోటీ నలభై లక్షల టన్నులను ఇథనాల్ తయారీకి అమెరికా వినియోగించడం ఇందుకు ఓ దృష్టాంతం. చాలాకాలంగా పంచదార మొలాసిస్ నుంచి, నేరుగా చెరకు రసం నుంచి బ్రెజిల్ ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు మన దేశంలోని కొన్ని చక్కెర కర్మాగారాలు కూడా మొలాసిస్ నుంచి ఇథనాల్‌ను తయారుచేస్తున్నాయి. ఐరోపాలోని కొన్ని దేశాల్లో సోయాబీన్‌ను, మొక్కజొన్నలను, మలేసియాలో పామాయిల్‌ను వినియోగించి ఇథనాల్, లేదా బయో డీజిల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. బయో ఇంధనం తయారీ కోసం ప్రపంచవ్యాప్తంగా 2020 నాటికి 40 కోట్ల టన్నుల ఆహారధాన్యాలను వినియోగించగలరని అంచనా. ఈ ఆహార ధాన్యాల పరిమాణం ప్రపంచం మొత్తంలో పండే వరిధాన్యానికి సమానం! ఇథనాల్ తయారీ కోసం అమెరికా పెద్దయెత్తున మొక్క జొన్నలను వినియోగిస్తుండటమే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆహార ధాన్యాల కొరత ఏర్పడటానికి, వాటి ధరలు పెరగటానికి గల కారణాల్లో ప్రధానమైనది. తిండి గింజలను ఇథనాల్ తయారీ కోసం అమెరికా వాడుతుండటంపై ఇప్పటికే విమర్శలున్నాయి. ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికిగాను దాన్ని పెట్రోల్‌లో 20 శాతం కలపాలని విధానపరంగా తాను తీసుకున్న నిర్ణయాన్ని, ఇథనాల్ తయారీదారులకు ఇస్తున్న పన్ను రాయితీలను, బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకునే ఇథనాల్‌పై విధిస్తున్న సుంకాలను అమెరికా ఉపసంహరిస్తే – ఆహారధాన్యాల

ధరలు 16 శాతం తగ్గవచ్చునని అంచనా. అభివృద్ధిచెందిన దేశాలు ఈ ఏడాది చివరి వరకు బయో ఇంధన తయారీ కార్యక్రమాన్ని నిలిపివేస్తే – అంతర్జాతీయ మార్కెట్లలో మొక్కజొన్న ధరలు 20 శాతం, గోధుమల ధరలు పదిశాతం వరకు తగ్గవచ్చునని అంచనా అందువల్ల – ఆహార ధాన్యాలను వినియోగించి ఇథనాల్‌ను తయారుచేయడాన్ని ఆపాల్సిన అవసరముంది.

ఆహార భద్రత విషయంలో భారత్‌లోని పరిస్థితులు ఇతర దేశాల్లో ఉన్నంత తీవ్రంగా ప్రస్తుతం లేకపోవచ్చు. అయితే, భవిష్యత్తులో ఆ ప్రమాదం ఎదురుకాదన్న పూచీ ఏదీలేదు. మనదేశంలో త్వరితగతిన పెరుగుతున్న జనాభాకు దీటుగా ఆహారధాన్యాల ఉత్పాదకత, ఉత్పత్తుల్లో పెరుగుదల ఉండటంలేదు. ఇది ఖచ్చితంగా ప్రమాద సూచికే. 2020 నాటికి మన దేశ ప్రజల అవసరాల కోసం, పశుదాణా కోసం 37కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరమవుతాయని అంచనా. ఆనాటికి దేశంలో పంటల ఉత్పాదకత ఉత్పత్తి గణనీయంగా పెరగకపోతే – దాదాపు ఎనిమిదికోట్ల నుంచి పదికోట్ల టన్నుల వరకు ఆహారధాన్యాలను మనం దిగుమతి చేసుకోవలసి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇండియా పెద్దయెత్తున దిగుమతి చేసుకోవలసివస్తే ఆ సరకు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో అమాంతం పెరిగిపోతుంది. నిరుడు గోధుమల విషయంలో జరిగింది అదే. బియ్యం దిగుమతి చేసుకోవాలంటే దాని ధర ఆకాశాన్నంటటమేకాక, సరకు లభ్యం కావడం కూడా గగనమవుతుంది. అందువల్ల – మన దేశంలో పంటల ఉత్పాదకతను, ఉత్పత్తిని తప్పనిసరిగా పెంచవలసిన అవసరముంది. ప్రస్తుతం ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దేశాల్లోని, ముఖ్యంగా పేదదేశాల్లోని ప్రజలకు ఆహారాన్ని అందించాలంటే – థాయ్‌లాండ్, భారత్, వియత్నాంవంటి దేశాల బియ్యం ఎగుమతులపై గల నిషేధాన్ని ఎత్తివేయాలి. తద్వారా – పేదదేశాలకు కొంత ఉపశమనం కలుగుతుంది.

## సేద్యానికి దన్ను తక్షణ రక్తవ్యం

మనదేశంలో ఒకవైపు – కోట్ల మంది ప్రజలు అర్థాకలితో అలమటిస్తూ దుర్భర పరిస్థితుల్లో జీవిస్తుంటే, మరోవైపు – రూ. 55 వేలకోట్ల విలువ చేసే బియ్యం, గోధుమలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు–కూరగాయలు వంటివి వృథాగా పోతున్నాయని వ్యవసాయంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ

వృధాను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం ఏర్పడితే పేద, వర్ధమాన దేశాలే నష్టపోతాయి. ఆ దేశాల్లోని ప్రజలకు ఆహార భద్రత కొరవడుతుంది. ఆహారధాన్యాల ఉత్పత్తులు అధిక స్థాయికి చేరినందున అమెరికా, ఐరోపా దేశాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. అమెరికాలో సాగులోకి వచ్చి, ఇప్పుడు పంటలు వేయకుండా పడావుగా ఉన్న భూములు లేదా గడ్డి పెంచుతున్న భూములు దాదాపు 40 కోట్ల ఎకరాలు ఉంది. తమ దేశంలో బియ్యం, గోధుమలు, మొక్కజొన్నలు వంటి పంటల ఉత్పత్తిని ఇంకా అధికం చేయాలనుకుంటే అలా చేసుకోగల స్థితిలో అమెరికా ఉంది. అయితే, మనదేశంలో నికరంగా ఉన్న సాగుభూమి మూడు దశాబ్దాలుగా 14 కోట్ల 20 లక్షల హెక్టార్లే. ఇది పెరగడం లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రజలకు ఆహార భద్రత చేకూర్చాలంటే, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి పాలకులు గట్టి చర్యలు తీసుకోవాలి. రైతులకు సేద్యం కొంతమేరకైనా లాభసాటిగా ఉండేలా చూడటంతోపాటు వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా కూడా చూడాలి.

*ది. 29-05-2008.* — ***ఈనాడు***

●

# అరకొర 'ఆహారభద్రత' వద్దు

ఆహారభద్రత చట్టం మన దేశానికి ఎంత అవసరమో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. జాతీయ ఆహారభద్రతా చట్టం రూపుదిద్దుకుంటున్న తరుణమిది. ఇటీవల జాతీయ సలహామండలి ఈ చట్టంలో పొందుపరచవలసిన విధివిధానాలపైన కొన్ని కీలకమైన నిర్ణయాలను తీసుకుందికూడా. పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాల సంఖ్యను టెండూల్కర్ కమిటీ సిఫారసుల మేరకు 6.52 కోట్ల నుంచి 8.14 కోట్లకు పెంచడం, దేశంలోని 640 జిల్లాలలో అత్యంత వెనుకబడినవిగా గుర్తించిన 150 జిల్లాలలో సార్వత్రిక ప్రజాపంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టడం, క్రమంగా విస్తరింపచేస్తూ 2015 నాటికి దేశమంతటా అమలు చేయడం వంటి నిర్ణయాలు ఈ సమావేశంలో తీసుకున్నారు. ఈ నిర్ణయాల మేరకు దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కుటుంబాలకు సరఫరా చేయడానికి 24 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు కావాలి. ఇందుకు కేంద్రంపైన ఆహార సబ్సిడీ పేరిట రూ. 54,000 కోట్ల భారం పడుతుంది. జాతీయ సలహా మండలి నిర్ణయాలను అమలు చేయాలంటే ఆహార సబ్సిడీ దాదాపు లక్ష కోట్ల రూపాయల మేరకు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి సాధ్యాసాధ్యాలను, మంచిచెడులను బేరీజు వేసుకోవాలి. పంటల పరిస్థితి, పండిన పంటను సేకరించే భారత ఆహార సంస్థ, ఆహార ధాన్యాలను పేదలకు చేర్చడానికి ఉద్దేశించిన ప్రజాపంపిణీ వ్యవస్థ తీరుతెన్నులను ఈ సందర్భంలో సమీక్షించుకోవాలి.

## ఎఫ్‌సీఐ పాత్ర

ప్రజాపంపిణీ వ్యవస్థకు ఆహార ధాన్యాలను సరఫరాచేసే బాధ్యత భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)దే. సేకరించిన ఆహార పదార్థాలను నిల్వ చేయడంలో, రవాణాలో లోపాల వలన వందలకోట్ల రూపాయల విలువైన ఆహారధాన్యాలు పశువులకు మేతగాకూడా పనికిరాని స్థితిలో ఏటేటా గోతులు తీసి పూడ్చి పెడుతున్నదన్న విమర్శ అందరికీ తెలిసినదే. ఈ అంశం పైన సుప్రీంకోర్టు ఇటీవల ఆగ్రహాన్ని, అభ్యంతరాన్ని

వ్యక్తం చేసింది. ఎఫ్‌సీఐ సిబ్బందికి 2008లో పెంచిన జీతభత్యాల ఖర్చు రూ. 531 కోట్లు కూడా ఆహార సబ్సిడీ ఖాతాలో చేరిపోయాయి. కాబట్టి ఆహార భద్రతవంటి భారీ పథకం గురించి యోచిస్తున్నప్పుడు ఎఫ్‌సీఐ అసమర్థత, అవినీతిని ప్రక్షాళన చేయవలసిన అవసరాన్ని విస్మరించలేం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాలను సరైన రీతిలో నిల్వచేయడానికి అవసరమైన గోదాముల నిర్మాణాన్ని చేపట్టడానికి తగినన్ని ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంలో మనం ఇప్పటికీ వెనుకబడే ఉన్నాం. ఇప్పటివరకు గోదాముల నిర్మాణానికి ఎఫ్‌సీఐ ఖర్చుపెట్టింది రూ. 917 కోట్లు. అలాగే ఎఫ్‌సీఐ దేశంలో జరిగే బియ్యం ఉత్పత్తిలో 12 నుండి 15 శాతం మేరకు, గోధుమలను 15 నుండి 20 శాతం మేరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నది. 'జాతీయ ఆహార భద్రత బిల్లు' అమలు నేపథ్యంలో ఆ 150 వెనుకబడిన జిల్లాలలో దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు ఇప్పుడు ఇస్తున్న 12 కేజీల ఆహార పదార్థాలను 25 కేజీలకు పెంచాలన్నా అదనంగా 20 మిలియన్ టన్నుల ధాన్యాలు అవసరమవుతాయి. అలాగే ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు 35 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యం కల్పించడానికి రూ. 7,690 కోట్లు అవసరమవుతాయని వాణిజ్య మంత్రిత్వశాఖ అంచనా వేసింది.

## వినియోగం తీరు మారాలి

దేశంలో ఇప్పటి వరకూ దాదాపు 12 కోట్లకు పైగా దారిద్ర్య రేఖకు ఎగువ (ఏపీఎల్) కుటుంబాలకు గోధుమలు కిలో రూ. 6.10లకు, బియ్యం కిలో రూ. 8.30లకు నెలకు 12 కిలోల వంతున అందిస్తున్నారు. ఆహార సబ్సిడీలో సగంలోపు ఇందుకోసం ఖర్చవుతుంది. జస్టిస్ వాద్వా కమిటీ దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు సబ్సిడీ గోధుమ, బియ్యం అందించడం నిలిపివేయడం ద్వారా ఆహార సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవచ్చని సూచించింది. సుప్రీంకోర్టు ఏపీఎల్ కుటుంబాలకు సబ్సిడీపై ఆహార ధాన్యాలను అందించడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించిందికూడా. కోట్లాదిమంది పేదలు ఆకలితో ఉంటే వందల, వేల కోట్ల రూపాయల విలువైన ఆహారధాన్యాలను పాడుచేయడమేమిటని ఎఫ్‌సీఐకి భారత అత్యున్నత న్యాయస్థానం చివాట్లుపెట్టిన తరువాత, ఇప్పుడు ఆ 150 జిల్లాల్లో ఏపీఎల్ కుటుంబాలకు కూడా దారిద్ర్య రేఖకు దిగువ (బీపీఎల్) కుటుంబాలకు వలెనే నెలకు 35 కిలోల గోధుమలు

లేక బియ్యాన్ని రూ. 3.00లకే అందజేయాలని నిర్ణయించడం ప్రశ్నార్థకమే అవుతుంది. ఆ 150 జిల్లాలు బాగా వెనుకబడి ఉన్నాయి. అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ, షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల వారు అక్కడ అధికంగా ఉంటారు. పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను నిర్ధారించేందుకు ప్రాతిపదికగా తీసుకునే అంశాల విషయంలో కొన్ని సడలింపులు చేసి బీపీఎల్ కుటుంబాలన్నింటినీ నమోదుచేసి వారికి 35 కిలోల బియ్యం, లేదా గోధుమలతోపాటు 20 కిలోల జొన్నలు లేక రాగులువంటి తృణధాన్యాలను కూడా అందించేందుకు ఏర్పాట్లు జరగవలసిన అవసరం ఉంది. వెనుకబడిన జిల్లాలలో మొత్తంగా ప్రభుత్వ యంత్రాంగంలో పేరుకుపోయిన అవినీతి, అసమర్థతల వల్లనే మావోయిస్టుల ప్రాబల్యం పెరిగిందన్న నగ్నసత్యాన్ని గమనంలోకి తీసుకోవాలి. మావోయిస్టులను ఎదుర్కొనడానికి వినియోగిస్తున్న వేలాదికోట్ల రూపాయలను ఉపయోగించి గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, కనీస వైద్యసౌకర్యాలు, పాఠశాలలు, కమ్యూనికేషన్ సౌకర్యాలను కల్పించనంతవరకు ఆ పేద ప్రజలకు ఉద్దేశించిన సబ్సిడీ ఆహారధాన్యాల్లో అధికభాగం దుర్వినియోగం అయ్యే అవకాశమే ఎక్కువ. ఇతర ప్రాంతాలలో సబ్సిడీ ఆహారధాన్యాలు వినియోగం తీరును కూడా చూడాలి. మన రాష్ట్రంతో సహా అనేక జిల్లాలలో చౌక దుకాణాల ద్వారా పంపిణీ అవుతున్న బియ్యంలో వేలకు వేల టన్నులు రైస్‌మిల్లులకు చేరి, పాలిష్ వేసి లెవీ కోటాగా మళ్లీ ఎఫ్‌సీఐ గోదాములకు చేరుతున్నది. గోధుమలలో కూడా సింహభాగం ఫ్లోర్ మిల్లులకు చేరుతున్నాయనేది కూడా జగమెరిగిన సత్యం. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సామాన్య ప్రజానీకానికి ఒక రూపాయి లబ్ది చేకూర్చడానికి ప్రభుత్వం రూ. 3.65లకు ఖర్చుపెట్టవలసి వస్తోందని ఆర్థికమంత్రి చిదంబరం లోగడ ప్రకటించారు. కానీ గోదాముల దగ్గర జరుగుతున్నదేమిటి? దేశంలో దాదాపు రూ. 2,47,500 కోట్ల విలువైన గోధుమలు పక్కా గోదాముల బయట టార్పాలిన్ల కింద ప్రకృతి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉన్నాయి.

## సబ్సిడీభారానికీ, గిట్టుబాటుకు లంకె వద్దు

ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు విడుదల చేసే బియ్యం, గోధుమల ధరలను 2002 నుండి ఇప్పటివరకూ పెంచలేదు. ఏటా కనీస మద్దతు ధరలు కొద్దికొద్దిగా పెరుగుతూండడంవలన ఆహార సబ్సిడీకూడా పెరుగుతుంది. 2008-09లో రూ. 43,668 కోట్ల నుండి 2009-10లో రూ. 72,000 కోట్లకు ఆహార సబ్సిడీ పెరిగింది.

ఇంత భారాన్ని మోయాల్సి వస్తున్నదని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తూ ఉంటుంది. కానీ వాస్తవంగా ఈ భారం రైతుల మీద పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో బియ్యం, గోధుమలకు ఉన్న ధరలకన్నా తక్కువ స్థాయిలో కనీస మద్దతు ధరలను నిర్ణయించడంవల్ల, ఆ ధరకే రైతులు అమ్ముకోవడంవల్ల ఏటేటా ఈరెండు పంటలు సాగుచేసే రైతాంగం వేలకోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఉత్పత్తి వ్యయానికి యాభైశాతం కలిపి రైతుకు మద్దతు ధర ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసి మూడు సంవత్సరాలు గడచిపోతున్నా ఆహారసబ్సిడీ భారం బాగా అధికమవుతుందనే భావనతో కేంద్రం వరిధాన్యానికి ధరను ప్రకటించడంలేదు. రెండు సంవత్సరాల క్రితమే వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం వరికి కామన్ రకానికి క్వింటాలుకు వెయ్యిరూపాయలు, గ్రేడ్–ఏ రకానికి క్వింటాలుకు రూ. 1,050 లను చెల్లించాలని సిఫారసు చేసింది. ఈ రెండు సంవత్సరాల్లో ప్రభుత్వం గణనీయంగా పెంచిన ఎరువులు, డీజిల్ ధరలకు తోడు ట్రాక్టర్ల బాడుగలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం వలన తగ్గిన కూలీల లభ్యత–పనిగంటలు, పెరిగిన కూలి రేట్లతో సతమతమవుతూ ఉంటే, ఈ సంవత్సరం ఖరీఫ్ వరికి బోనస్‌తో కలిపి నిరుడు ఇచ్చిన ధరనే ఇప్పుడు ప్రకటించడం అసంబద్ధం. ప్రభుత్వంలోని పెద్దలు, అధికారుల ఆలోచనా సరళిలో మార్పు రావలసిన అవసరం కూడా ఉంది. ద్రవ్యోల్బణం పెరుగుతుందనీ, ఆహార సబ్సిడీ పెరుగుతుందన్న కారణం చేతనో అష్టకష్టాలతో, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలనెదుర్కొంటూ రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించకుంటే వ్యవసాయ రంగం సంక్షోభం నుండి బైటపడదు.

## ఆహారభద్రతతో ఆరోగ్యం

ఆహారభద్రత అంటే కేవలం కొన్ని కిలోల బియ్యం, గోధుమలు సమకూర్చడమే కాదు. మనిషి సంపూర్ణారోగ్యానికి ప్రొటీన్లు కావాలి. వాటిని సమకూర్చే పప్పుధాన్యాలు, కొవ్వు పదార్థాలను కూడా అందిస్తేనే అది సాధ్యం. తగినంత ఆదాయ వనరులున్న కుటుంబాలు తమ అభిరుచులకనుగుణంగా వివిధ పద్ధతుల్లో పోషకాహారాన్ని సమకూర్చుకుంటాయి. కానీ నిరుపేదలకు పోషకాహారం అందివ్వడంలో ప్రభుత్వమే చొరవ తీసుకోవాలి. పల్లెల్లో, పట్టణాల్లో ప్రత్యేకంగా మురికివాడలలో నిరుపేదలందరికీ ఇప్పుడు లోపరహితంగా ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయగలిగితే అక్షరాస్యతా శాతం, పిల్లల ఆరోగ్యస్థాయి, మేధాశక్తి పెరగటానికి వీలు కలుగుతుంది. లాభాపేక్షతోకాక సేవే పరమార్థంగా పనిచేస్తున్న

రామకృష్ణ మిషన్, ఇస్కాన్ వంటి సంస్థల తోడ్పాటుతో మధ్యాహ్న భోజన పథకంలో బడిపిల్లలతోపాటు వికలాంగులు, అనాథలు, వృద్ధులు గర్భిణీ స్త్రీలు వంటి వారికి కూడా అవకాశం కల్పించడం మంచిది.


## పోలవరం వంటి పథకాలు అవసరమే!

తమిళనాడు, కేరళవంటి రాష్ట్రాల్లో ప్రజాపంపిణీ వ్యవస్థలు మెరుగ్గా ఉన్నాయి. పీడీఎస్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించకుంటే వేల కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలవుతుంది. ఏటా రూ. 15,000 కోట్ల రూపాయల విలువైన ఆహార ధాన్యాలు వృధాగా పోతున్నాయని ప్రభుత్వమే అంగీకరించింది. ఆహార భద్రతను సాధించాలంటే, ఉత్పాదకత పెరగాలి. అంటే, సాగునీటి సౌకర్యం విస్తరించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటి వరకు తగినంత సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాలకు ఆ సౌకర్యం కల్పించాలంటే పోలవరం ప్రాజెక్టు అత్యంత అవసరం. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కొరతవలన జాతీయ ప్రాజెక్టు హెూదా ఇవ్వడానికి ఇంకో మూడేళ్లు పట్టవచ్చన్న వార్తలు రైతులను కుంగదీస్తున్నాయి. కాబట్టి రాష్ట్రవనరులకు తోడు కేంద్ర ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున నిధులను సమకూర్చాలి. అప్పుడే మన రాష్ట్రంతో సహా పలు రాష్ట్రాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులు ముఖ్యంగా మధ్య, చిన్న తరహా ప్రాజెక్టులు పూర్తవుతాయి. సబ్సిడీ ఆహార ధాన్యాలలో కేవలం 42 శాతం మాత్రమే నిర్దేశిత పేద ప్రజలకు చేరుతున్నాయని ప్లానింగ్ కమిషన్ తన నివేదికలో పేర్కొన్నప్పటికీ, సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను 2015 నాటికి దేశమంతటా అమలు చేయాలని తీసుకున్న నిర్ణయంలో తొందరపాటు కనిపిస్తుంది. చట్టానికి పునాదిగా వుండే బిల్లు స్థాయిలోనే ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని లోపాలను నిర్మూలించే ప్రయత్నం చేస్తూనే, నిర్మాణాత్మకంగా నిబంధనలను రూపొందించడం అవసరం. లేదంటే దేశ భవిష్యత్తులో కీలకంగా ఉండే ఇలాంటి పథకాలు మొక్కుబడి వ్యవహారంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

– సాక్షి

●

## 9వ అధ్యాయం



# ఇతర అంశాలు, జన్మభూమి, ఎన్నికల సంస్కరణలు

Blank Page

# ప్రగతికి ప్రతిబంధకం పెరుగుతున్న జనాభా

సామాజిక, ఆర్థిక రంగాలలో శీ ఘ్రగతిన పురోగ మించేందుకై జాతీయ స్థాయిలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టిన దేశాలలో మొదటిది మన భారత దేశం. జాతీయ ఆర్థిక వ్యవస్థ అవసరాల కనుగుణంగా జనాభాను సమకూర్చడానికి జననాల రేటును క్రమ బద్ధీకరించే లక్ష్యాలతో 1951లో కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కుటుంబ సంక్షేమ కార్యక్రమం అమలులో వున్నప్పటికీ 1951 లో 36 కోట్లుగా వున్న మన జనాభా 1991 సంవత్సరం నాటికి 84 కోట్లుకు పెరిగింది.

మొదటి పంచవర్ష ప్రణాళికలో కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి రూ. 65 లక్షలు కేటాయించగా చాలా కొద్ది మొత్తం మాత్రమే ఖర్చు చేయబడింది. ఆ కాలంలో ప్రజలకు కుటుంబ నియంత్రణ విషయంపై ప్రభుత్వ ఆస్పత్రులలో, గ్రామీణ వైద్యశాలలలో సలహాలివ్వడం, కార్యక్రమాల మలుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం జరుగుతూ వుండేది. రెండవ ప్రణాళికా కాలంలో కుటుంబ సంక్షేమ సేవా కేంద్రాల సంఖ్య 157 నుంచి 4, 165 కు పెరిగింది. ఈ కాలంలో సుమారుగా 2.5 లక్షల మంది ప్రజలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగాయి. సుమారు రూ. 2 కోట్లు వెచ్చించ బడ్డాయి. అప్పటికింకా ప్రభుత్వ ఆసుపత్రులలో కండోముల సరఫరా లేదు. ఇక మూడవ ప్రణాళికా కాలంలో సుమారు రూ. 25 కోట్ల వ్యయంతో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయబడ్డాయి. ప్రాంతీయ కుటుంబ నియంత్రణ కేంద్రాలు స్థాపించబడ్డాయి. ముందుకు వచ్చిన వారికి సలహా యివ్వడమే కాక సామాజిక విస్తరణ ద్వారా ఇతోధిక ప్రచారాన్ని సేవలను గ్రామీణ మరియు

పట్టణ ప్రాంతాలలోని ప్రజలకు అందుబాటులో వుంచే విధంగా వ్యూహం మార్పు చేయబడింది. 1965లో లూపు వినియోగం ప్రవేశ పెట్టబడింది. 1966-69 కాలంలో మాతా - శిశు ఆరోగ్య పథకాలు కుటుంబ నియంత్రణతో జత చేయబడ్డాయి. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకొన్ని వారికి, లూపు ధరించడానికి ముందుకు వచ్చిన వారికి ఖర్చుల నిమిత్తం కొద్ది మొత్తం యిచ్చే విధానం మొదలైంది. నిరోధ్‌లను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ పబ్లిక్ రంగంలో స్థాపించబడింది. 1960లో చిన్న కుటుంబ సూత్రీకరణ కమిటీని నియమించింది. ఈ కమిటీ చిన్న కుటుంబం సూత్రాన్ని పాటించేందుకు ముందుకు వచ్చేవారికి యివ్వటం ప్రోత్సాహాలు కార్యక్రమానికి సహకరించనివారిపట్ల తీసుకోదగిన చర్యల గురించి సూచించింది. నాల్గవ ప్రణాళికా కాలంలో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతనిచ్చి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ కుటుంబ నియంత్రణ కేంద్రాల ద్వారా ప్రజా ఆరోగ్యం, తల్లి-బిడ్డ వైద్య సేవా విభాగాలు కలిపి అమలు చేశారు. ఇందుకై రూ. 284 కోట్లు వెచ్చించినా జననాల రేటును తగ్గించడం మాత్రం సాధ్యపడలేదు. ఏటా దాదాపు 120 లక్షల మంది జనాభా కొత్తగా జమ అవుతూ వచ్చారు. అయితే గర్భ నిరోధక సాధనాలను ఉపయోగిస్తూ వున్న దంపతుల శాతం రెండవ ప్రణాళికలో 0.2 శాతం నుంచి మూడవ ప్రణాళికకు 3 శాతానికి, నాల్గవ ప్రణాళికాంతానికి 14 శాతానికి పెరిగింది. కుటుంబ నియంత్రణను ఆమోదించిన వారికే కాక, వారిని ప్రోత్సాహపరిచిన వారికి, వైద్య సేవలకును కూడా కొంత మొత్తాన్ని యిచ్చారు.

## ఎమర్జెన్సీలో...

1976లో ఆనాటి కాంగ్రెసు ప్రభుత్వం అప్పటికి దాదాపుగా 25 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని ప్రజల స్వచ్ఛంద సహకారంతో అమలు చేస్తున్నప్పటికీ సరైన సత్ఫలితాలు రానందున, నిర్బంధంగా శస్త్రచికిత్సలు చేయడం ద్వారా జనాభా పెరుగుదలను అరికట్టాలనే నిర్ణయానికి వచ్చింది. ఆనాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 'దేశం పురోగమించడానికి కలిగి వుండే హక్కు ముందు కొన్ని వ్యక్తిగతమైన హక్కులు అడ్డుకాకూడ'దని ప్రకటించారు. జాతీయ జనాభా విధానాన్ని 1976 ఏప్రిల్‌లో ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబ నియంత్రణతోపాటు, వివాహ అర్హత వయస్సును పెంచడం, మహిళా విద్యావ్యాప్తి గురించి కూడా ఈ విధానం పేర్కొంది. ఒకరు లేక ఇద్దరు బిడ్డల

తర్వాత అయితే రూ. 150, ముగ్గురు బిడ్డల తర్వాత అయితే రూ. 100, నలుగురు లేక యింకా ఎక్కువమంది తర్వాత అయితే రూ. 70 చొప్పున ప్రోత్సాహకాలనిచ్చారు. పేదలకు పక్కా గృహాలు, నివేశన స్థలాలు, ఋణం మంజూరు విషయాలలో కుటుంబ నియంత్రణ పాటించిన వారికి ప్రాధాన్యతనివ్వడం జరిగింది. ఈ చర్యల ఫలితంగా అయిదవ ప్రణాళికా కాలంలో వెయ్యికి 35గా వున్న జననాల రేటును ఆరవ ప్రణాళికాంతానికి 25కు తగ్గించడం సాధ్యపడుతుందని ఆనాటి ఆరోగ్య శాఖామంత్రి చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వంలో ఉన్నత స్థాయి ప్రముఖుల మెప్పు కొరకు పలు రాష్ట్రాలలో ఈ కార్యక్రమాన్ని హద్దులు మీరిన నిర్భంద విధానాలలో అమలు చేయడం వలన ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత చోటు చేసుకుంది. తదుపరి అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ ప్రభుత్వం నిర్బంధ విధానానికి స్వస్తి చెప్పి స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చేటట్టు ప్రోత్సహించాలనే విధానాన్ని చేపట్టింది. కుటుంబ నియంత్రణను కుటుంబ సంక్షేమ కార్యక్రమంగా మార్పు చేశారు. ఆ కాలంలో ఈ కార్యక్రమం కుంటుపడినందున 40 లక్షల మందికి ఆపరేషన్లు చేయాలనే లక్ష్యం వుంటే 8 లక్షల మందికి మాత్రమే జరిగాయి. ఆరవ ప్రణాళికలో ఈ కార్యక్రమానికి కొంత ప్రాధాన్యత నివ్వడం వల్ల ప్రణాళికాంతానికి 24 మిలియన్ ఆపరేషన్ల లక్ష్యానికి గాను 17 మిలియన్ ఆపరేషన్లు జరిగాయి. ఈ ప్రణాళికా కాలంలో ఈ కార్యక్రమానికి రూ. 1000 కోట్లు ఖర్చు చేయబడింది. ఇతర కుటుంబ నియంత్రణ పరికరాల వాడకంలో కూడా లక్ష్యాలకు - సాధించిన ప్రగతికి చాలా వ్యత్యాసం వుంది. అంతకు ముందు ఆరు ప్రణాళికలలో సాధించిన పురోగతిని దృష్టిలో వుంచుకొని ఏడవ ప్రణాళికలో 1990 నాటికి దంపతుల రక్షణ రేటును 42 శాతానికి పెంచాలని, జననాల రేటును వెయ్యికి 29కి, మరణాల రేటును వెయ్యికి 10 కి తగ్గించాలని లక్ష్యాలుగా నిర్ణయించారు. అయితే 1989 నాటికి జననాల రేటు గ్రామీణ ప్రాంతాలలో 3 2.2కు, పట్టణ ప్రాంతాలలో 25.2 కు చేరింది. అనగా సగటున 30.6 వుంది. మరణాల రేటు గ్రామీణ ప్రాంతాలలో 11.1 కి, పట్టణాలో 7.2 కి తగ్గింది. అంటే సగటున 10.3 అవుతుంది. కాగా గ్రామాలలో వెయ్యికి 98 మంది పట్టణాలలో వెయ్యికి 58 మంది చిన్న బిడ్డలు చనిపోతున్నారు. ఫలితంగా యిప్పటికీ నికర జనాభా పెరుగుదల వెయ్యికి 20.3 అనగా 2.03 శాతంగా వుంది. అంటే ఏటా ఒక కోటి ఎనభై లక్షల మంది జనాభా జమ అవుతున్నారు. ప్రపంచ బ్యాంకి తాజా నివేదిక ప్రకారం భారత దేశం జనాభా

పెరుగుదల 2150 సంవత్సరం నాటికి గాని పూర్తిగా ఆగదని, అప్పటి జనాభా 174 కోట్లు వుంటుందని అంచనా. ఇప్పటికీ విపరీతంగా పెరిగి పోయిన జనాభాతో దేశం పలు రంగాలలో సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భవిష్యత్తులో పరిస్థితులు భయానకంగా గోచరిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వమే కాక రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు కూడా జనాభా పెరుగుదలను అరికట్టే కార్యక్రమాలను ప్రాధాన్యత నిచ్చి అమలు చేయాలి. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం నూటికి నూరు శాతం కేంద్రం నిధులతో నిర్వహించబడతూ వుంది. కేవలం ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సేవా సంస్థలను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. పలు చోట్ల లయన్స్ - రోటరీ వంటి సంస్థలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్ళేందుకు కొంత కృషి సల్పుతూనే వున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ ఆలోచనా సరళిలో మార్పు రావలసి వుంది. పరిమిత కుటుంబం వలన చేకూరే ప్రయోజనాల గురించి, జనాభా పెరుగుదలను అరికట్ట లేక పోతే దేశం భవిష్యత్తులలో ఎదుర్కొనమన్న అనర్థాల గురించి ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలి. సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిలలో బోధనాంశాలలో కుటుంబ నియంత్రణ అవశ్యకతను చేర్చాలి. ప్రభుత్వం అందించే సహాయ పథకాలలో ప్రథమ ప్రాధాన్యతను కల్పించడం ద్వారా నిరక్షరాస్యులైనా నిరుపేదల దృష్టిని ఈ కార్యక్రమం వైపుకు ఆకర్షించాలి. వివాహ అర్హత వయస్సును కూడా పెంచడం అవసరం. అన్ని మతాలకు చెందిన పెద్దలతో ప్రభుత్వం చర్చించి, ఇండోనేషియా వంటి దేశాల అనుభవాన్ని వివరించి వారి తోడ్పాటు పొందడం అవసరం. జనాభా పెరుగుదలను అరికట్టడం కేవలం ప్రభుత్వం బాధ్యత అని అనుకోక, ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమ సఫలతకై కృషి సల్పినప్పుడే మనం చైనాలో వలె జనాభా పెరుగుదలను తగ్గించగలుగుతాము.

*దీ. 05-05-1992.* **- ఆంధ్రజ్యోతి**

# సదాశయం నీడన దురుద్దేశాలు

రాజకీయాల నుంచి మతాన్ని వేరు చేయడం కోసమని ప్రతిపాదించిన సవరణ బిల్లులపై చర్చను కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో వాయిదా వేసింది. తరువాత మేకపోతు గాంభీర్యం, ప్రకటనలు ఎలా ఉన్నా, ఈ చర్య పాలకపక్షం ఓటమి మనస్తత్వానికి తాజా నిదర్శనం. వీటిని ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన సంఘటనలు నరసింహారావు ప్రభుత్వం అసలు ఉద్దేశాలపై అనుమానం కలిగిస్తాయి. ప్రతిపక్షాలు సూచించిన తరువాతే – పవన్‌కుమార్ బన్సాల్ అధ్యక్షతన సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు ఈ బిల్లులను అప్పగించారు. ఆగస్టు 10 నుంచి 20 లోగా కమిటీ ఎనిమిది మార్లు సమావేశమై బిల్లులకు 'తుది' రూపం కల్పించింది. సభ్యులెవరికయినా భిన్నాభిప్రాయాలుంటే ఈ రోజు సాయంత్రంలోగా తెలపాలన్నారు. భారత పార్లమెంటరీ చరిత్రలో ఇంత శరవేగంగా ప్రవేశపెట్టిన బిల్లు మరొకటి ఉండదు. కమిటీ తుది నివేదిక మీద సభ్యులు భిన్నాభిప్రాయాలు తెలుపడానికి కనీసం మూడు రోజులు వ్యవధి ఇస్తారు. ఈ బిల్లుల విషయంలో భిన్నంగా వ్యవహరించారు. తీవ్రపరిణామాలకు దారితీసే అంశాలను ఈ బిల్లులను కమిటీ సమగ్రంగా చర్చించి రాజ్యాంగ నిపుణుల అభిప్రాయాలను, ఎన్నికల కమిషన్ అభిప్రాయాలను తెలుసుకుంటే బాగుండేది. బిల్లుల గురించి వివరించి, వాటిపట్ల ఒక అవగాహన కల్పించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవలసింది. ప్రభుత్వం తొందరపాటుతో వ్యవహరించింది. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఈ వర్షాకాల సమావేశంలోనే బిల్లులకు పార్లమెంటు ఆమోద ముద్ర సంపాదించాలని ప్రయత్నించి చివరికి చతికిలపడ్డారు.

## న్యాయ నిర్ణయంలో జాప్యం నివారణ

రెండు బిల్లుల మీద లోక్‌సభలో ఆగస్టు 24న చర్చ ప్రారంభించాలనుకుంటున్నారు. అదే రోజు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వెంకట్రామయ్య మాజీ చీఫ్

ఎలెక్షన్ కమీషనర్లు ఎస్.ఎల్. షక్‌ధర్, ఆర్.కె. త్రివేది తదితర ప్రముఖులు చేసిన విజ్ఞప్తి గమనార్హం. ఎన్నికల ప్రయోజనాల నిమిత్తం కుల, మత, భాషాభేదాలు రెచ్చగొట్టడం గర్హనీయమేగాని, ఈ బిల్లులోని చికిత్స అసలు రోగం కంటే ప్రమాదకరమని వారు వ్యాఖ్యానించారు. పార్లమెంటు సభ్యులు వారి అంతరాత్మ ప్రబోధానికి అనుగుణంగా అన్ని అంశాలు పరిశీలించాలని కోరారు. ఎన్నికల్లో విజయం కోసం భిన్నవర్గాల మధ్య మత విద్వేషాలను రగుల్కొల్పే విచిత్ర ప్రవృత్తి ఈ మధ్య అధికమయింది. దీన్ని అరికట్టవలసిందే. దానికి తగిన అవకాశాలన్నీ ఇప్పటికే చట్టాల్లో ఉన్నాయి. ఎన్నికలలో అభ్యర్థులకు అనర్హత తెచ్చిపెట్టే అవినీతికార్యాలను '1951 ప్రజాప్రాతినిధ్య చట్టం' 123వ విభాగంలో వివరించారు. అభ్యర్థి ఆయన ఏజెంటు లేక వారి అనుమతితో ఇంకెవరయినా మతం, కులం, భాష ప్రాతిపదికపై వోటు వేయమనిగాని, వద్దనిగాని కోరితే 123 విభాగంలోని 3వ ఉపవిభాగం ప్రకారం అది అవినీతి అవుతుంది. ఎన్నికల పిటిషన్ విచారణలో ఇది రుజువయితే అభ్యర్థి ఎన్నిక రద్దవుతుంది. మతం, కులం, భాష పేరిట భిన్నవర్గాల మధ్య విద్వేషాన్ని కల్పించి ఎన్నికలలో ఒక అభ్యర్థి విజయ అవకాశాలను మెరుగుపరచినా లేక మరో అభ్యర్థి ఎన్నికల అవకాశాలకు భంగం కల్గించినా అది ఉపవిభాగం 3ఎ కింద నేరమయి, అనర్హతకు దారితీస్తుంది. ఈ నేరానికి ప్రజాప్రాతినిధ్య చట్టం 3వ అధ్యాయం, 125 విభాగం ప్రకారం 3 సంవత్సరాలు మించకుండా జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు. ఈ విభాగం కిందే ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఓ తెలుగుదేశం శాసనసభ్యుడు, మహారాష్ట్రలో ఇద్దరు శివసేన శాసనసభ్యులు వారి సభ్యత్వాలను కోల్పోయారు. ఎనభయవ రాజ్యాంగ సవరణకు మూలకం అయిన ఉద్దేశాన్ని '1951 ప్రజాప్రాతినిధ్య చట్టం' నెరవేర్చగలుగుతుంది. శోచనీయ విషయం ఏమిటంటే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని ఈ అంశాల గురించి చాలా మందికి తెలియదు. తెలిసినా, కేసు ఎప్పటికి అవుతుందిలే అని పిటిషన్లు వేయడానికి సాహసించరు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 86వ విభాగం, 7వ ఉపవిభాగం కింద ఎన్నికల పిటిషన్‌లో వీలయినంత వరకు ఆరుమాసాల వ్యవధిలోనే తీర్పు ఇవ్వాలని నిర్దేశించినప్పటికి చాలా సందర్భాలలో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతున్నది. జాప్యాన్ని నివారించి ఎన్నికల కేసులను త్వరగా పరిష్కరించాలి. కుల, మతాల దుర్వినియోగానికి సంబంధించిన ఎన్నికల కేసులలో మూడు, నాలుగు మాసాల వ్యవధిలోనే తీర్పు ఇవ్వడానికి వీలుగా సవరణ అత్యవసరం. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం అంశాల గురించి పత్రికలు, రేడియో, దూరదర్శన్ ద్వారా ప్రజలలో విస్తృత ప్రచారం చేయడమూ

అవసరమే. స్వప్రయోజనం కోసం మత విద్వేషం రెచ్చగొట్టే అభ్యర్థిని ఎన్నికల తేదీకి ముందే అనర్హుడుగా ప్రకటించడానికి ఎనభయవ సవరణ రాజ్యాంగంలో 102 అధికరణం తరువాత 102(ఎ) అధికరణాన్ని 191 అధికరణం పిదప 191(ఎ) అధికరణాన్ని చేర్చదలచారు. పార్లమెంటు ఉభయసభల సభ్యత్వానికి ఏ కారణాలవల్ల అనర్హత కలుగుతుందో 102వ అధికరణం వివరిస్తున్నది. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సభ్యత్వానికి ఏ కారణాలచేత అనర్హత సంక్రమిస్తుందో 191వ అధికరణం నిర్దేశిస్తుంది.

ఎనభయవ రాజ్యాంగసవరణ బిల్లులోని 4, 5 క్లాజులతో 102వ, 191వ అధికరణాలలో చేసే సవరణలవల్ల లభించే అధికారాన్ని ఉపయోగించుకుని పరిశీలనాధికారి అభ్యర్థిని ఎన్నిక తేదీకి ముందే అనర్హుడుగా ప్రకటించగలుగుతాడు. ఇటువంటి నిరంకుశ అధికారం కారణంగా ఎన్నికల కార్యక్రమంలో గందరగోళం ఏర్పడుతుంది. నామినేషన్ పత్రాల పరిశీలన తేదీకి, పోలింగు రోజుకు మధ్యన 21 రోజులుంటాయి. అభ్యర్థి తన ఎన్నికల ప్రచారంలో మతాన్ని దుర్వినియోగపరిచాడా లేదా అని తేల్చడానికి ఈ 21 రోజుల వ్యవధి సరిపోదు. ఈ వ్యవధిలో బ్యాలెట్ పత్రంనుంచి ఆ అభ్యర్థి పేరును, చిహ్నాన్ని తొలగించడం సాధ్యంకాదు. దీనితో వోటర్లలో అయోమయ పరిస్థితి ఏర్పడుతుంది. ఎన్నికల ముందు అనర్హుడుగా తిరస్కృతుడయిన అభ్యర్థి ఆ తరువాత కోర్టుకు వెళ్లి నెగ్గితే గెలిచిన అభ్యర్థి సంగతేమిటి? ఏదయినా చట్టంలోని అధికారాలను దుర్వినియోగపరచడానికి ఉన్న అవకాశాన్ని దుర్వినియోగపరిస్తే సంభవించే దుష్పరిణామాలను ముందే గమనించాలి. ఈ విధంగా గమనించినపుడు ఎనభయవ సవరణలోని 4,5 క్లాజులు ఎంతమాత్రం సమర్థనీయంగాని, ఆచరణసాధ్యంగాని కావనేది స్పష్టం. ఇవి రాజ్యాంగంలోని 324,326,329 అధికరణాలకు భంగం కల్గిస్తాయి. ఎన్నికల కార్యక్రమం అభాసుపాలవుతుంది. క్రమంగా ఇవి ఏకపక్ష పాలనకు దోహదపడతాయి. మతంపేరిట మతసామరస్యానికి భంగం కల్గించే వారిపై ఇండియన్ పీనల్ కోడ్‌లోని 153-ఎ విభాగం కింద చర్య తీసుకోవచ్చు. కుల, మతాల పేరిట విద్వేషాన్ని పెంచి, విభిన్నవర్గాల సామరస్యానికి భంగం కల్గించేవారికి 153-ఎ(1) కింద మూడేళ్లపాటు జైలుశిక్ష విధించవచ్చు. జరిమానా వేయవచ్చు. పూజాస్థలాల ద్వారా మతసామరస్యానికి భంగం కల్గించే వారికి 153-ఎ(2) కింద అయిదేళ్ల కారాగారవాస శిక్ష విధించవచ్చు. ఈ చట్టాలను గట్టిగా అమలు జరిపి దోషులను దండించకపోవడంవల్లనే అక్రమాలు మితిమీరుతున్నాయి. మత సంస్థల

దుర్వినియోగాన్ని నిరోధించే 1988 చట్టంలోని 7వ విభాగం రాజకీయాలలో తలదూర్చే మత సంస్థలపైన చర్య తీసుకోవడానికి ఉపకరిస్తుంది. మతాన్ని, కులాన్ని ఎన్నికలు తదితర ప్రయోజనాల కోసం దుర్వినియోగపరచి విభిన్న వర్గాల మధ్య విద్వేషం రెచ్చగొట్టినట్లు రుజువయితే ఈ వ్యక్తి పార్లమెంటుకు లేక శాసనసభకు పోటీచేయడానికి అనర్హుడని 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం స్పష్టంగా నిర్దేశించింది.

## ఏ చర్యలయినా ఏకాభిప్రాయంతోనే

భిన్నమతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టే సంస్థలు, సంఘాలను నిషేధించడానికి పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభలకు అధికారం కల్పించడం ఎనభయవ సవరణలోని 3వ క్లాజుద్వారా కొత్తగా చేరే 28వ అధికరణం ఉద్దేశం. ఇది పలువిధాల అనర్థదాయకం. అలాంటి సంస్థలు, సంఘాల నియంత్రణకు ఇప్పుడున్న చట్టాలు చాలు. 1967 సంవత్సరపు ప్రార్థనాస్థలాల చట్టం, 1991 సంవత్సరం చట్టం కింద కూడా కఠిన చర్యలు తీసుకోవచ్చు. చిత్తశుద్ధి ఉంటే మతోన్మాదాన్ని అరికట్టనూవచ్చు. పాలకుల స్వార్థ ప్రయోజనాలవల్లనే ఈ చట్టాలు వ్యర్థమవుతున్నాయి. మతతత్వాన్ని రూపుమాపడానికి అన్నిటికన్న శక్తిమంతమయిన ఆయుధం ప్రజల చైతన్యం. ప్రజలు ఇప్పుడున్న చట్టాల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి. వాటి అమలుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలి. మత విశ్వాసం వ్యక్తిగతమయినది. పరమత సహనానికి, సర్వమత సమానత్వానికి పేరొందిన ప్రాచీన దేశమిది. భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశం విశిష్టత. బౌద్ధమతం ఇక్కడ నుంచి చైనా, జపాన్ తదితర దేశాలకు విస్తరించింది. ఈ దేశం ఇతర మతాలను సొంతం చేసుకుంది. మతం మనిషిలో ధార్మిక చింతన కలిగించి మానవతను పెంపొందిస్తుంది. సత్ప్రవర్తనకు సహాయపడుతుంది. గాంధీమహాత్ముడు మత విశ్వాసాలను ఆరాధించాడు. మతమౌఢ్యాన్ని వ్యతిరేకించాడు. మతసామరస్యం కోసం ప్రాణాలర్పించాడు. గాంధీమార్గంలో మతసామరస్యం సాధ్యం. మతవాదాన్ని నిరోధించడానికి ప్రభుత్వం ఏమైనా చేయదలుచుకుంటే అన్ని పక్షాల వారితో రాజ్యాంగ నిపుణులతో చర్చించి ఏకాభిప్రాయం సాధించాలి.

*ది. 04-09-1993.* — *ఈనాడు*

●

# వివేకానందుని మాట నేడు దేశానికి బాట

చికాగో నగరంలో వంద సంవత్సరాల కిందట ప్రపంచ సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానందుడు కావించిన ఆధ్యాత్మిక ప్రసంగం అమెరికన్ ప్రజల హృదయాలను అసాధారణ రీతిలో ఉత్తేజపరచింది. ప్రపంచ ప్రజలకు సహనాన్ని ప్రబోధిస్తున్న హిందూ మతానికి చెందిన వాడినయినందుకు తాను గర్వపడుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఇతర దేశాలు నెట్టివేసిన మతాలకు భారతదేశంలో ఆశ్రయం లభించిందని ఆయన ఉద్ఘాటించారు. యూదు జాతీయుల పవిత్ర దేవాలయాలను రోమనులు ధ్వంసం చేసి విద్వేషాన్ని వెలిగక్కిన వేళ అదే సంవత్సరంలో దక్షిణభారతదేశంలోని కేరళలో వారికి ఉదారంగా ఆశ్రయం లభించిందని ఆయన వివరించారు. జొరాష్ట్రియన్‌లు ఇతరుల నుంచి వేధింపు, విచక్షణ చర్యలకు గురి అయినప్పుడు ఆ పార్సీ ప్రజలకు నిలువనీడ ఇచ్చింది భారతదేశమని జ్ఞాపకం చేశారు. 'విభిన్న ప్రదేశాల నుంచి ప్రవహించే నదులన్నీ చివరకు సముద్రంలో సంగమం చెందుతున్నట్లు, ఓ తండ్రీ! వేరు వేరు మార్గాలలో విభిన్న విశ్వాసాలతో ఆరాధిస్తున్నట్లు కన్పించినా అవన్నీ నీ వద్దకే చేరుతాయి' అన్న ఉదాత్త భావగర్భిత శ్లోకం సారాంశాన్ని ఆయన విశదపరిచారు. 'ఎవరు ఏ మార్గాన్ని అనుసరించినా నా వద్దకు వచ్చే వారికి నేను అందుబాటులో ఉంటాను...మానవులు వేరు వేరు మార్గాల ద్వారా నా వద్దకే చేరుతారు' అన్న భగవద్గీతా సూక్తిని ఆ విధంగా ప్రస్తావించారు. నాడు జరుగుతున్న ప్రపంచ సర్వమత సమ్మేళనం సమున్నత ఆశయమూ అదేనని వక్కాణించారు. హద్దులు మీరి మత దురహంకారం, జాతి దురభిమానం కారణంగా రగుల్కొన్న కలహాలలో అసంఖ్యాక ప్రజలు ఆహుతి కానట్లయితే, కొన్ని దేశాలు ఘోరంగా దెబ్బతిని నాగరికతకు ప్రమాదం వాటిల్లకుండా ఉన్నట్లయితే మానవాళి మరింత అభ్యుదయం సాధించగలిగేదని వివేకానందుడు విపులీకరించారు. ఆ రోజు చికాగో చరిత్రాత్మక సమ్మేళనంలో మారుమోగిన ఆ ఘంటానాదం ప్రపంచంలో దురహంకారానికి, కత్తులూ, కలాలతో ఇతరులను బాధించే దౌష్ట్యానికి, ఒకే గమ్యపు

వివిధ మార్గాల అనుయాయుల మధ్య వైషమ్యాలకు మృత్యుకాహళి కాగలదని ప్రగాఢ ఆశాభావం ప్రస్ఫుటం చేశారు. ఇతర మతాలను సహనంతో గౌరవించే ఉత్కృష్ట సంస్కృతి భారతదేశంలో అత్యంత ప్రాచీనకాలం నుంచి పరిఢవిల్లింది. భిన్నత్వంలో ఏకత్వం భారత సంస్కృతి విశిష్టత. ప్రపంచ సర్వమత సమ్మేళనంలో వివేకానందుడు నాడు గళమెత్తి హిందూమత ప్రాశస్త్యాన్ని వివరించారు. పాశ్యాత్య ప్రపంచంలో హిందూమతానికి సమున్నత స్థానాన్ని సంపాదించారు. నేడు అదే హిందూమతం పేరిట దేశంలోని పలు ప్రాంతాలలో హింసాకాండ, అరాచకత్వం చెలరేగడం, వేలాది అమాయకులు బలికావడం, వందల కోట్ల రూపాయల విలువయిన ఆస్తులు విధ్వంసమవడం, పాశ్చాత్య దేశాలలో మనపట్ల విమర్శలు చెలరేగడం శోచనీయ పరిణామాలు.

## వందేళ్ల పండుగ జరుపుకునే విధానమిదా?

చికాగో సర్వమత సమ్మేళనం తరువాత సరిగ్గా వంద సంవత్సరాలకు బొంబాయి మహానగరంలో మత విద్వేషం పడగవిప్పి బుసలుకొట్టింది. కొన్ని రోజులపాటు బొంబాయిలో కొనసాగిన మతకల్లోలాన్ని చూసి సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకుంది. బొంబాయి తదితర స్థలాలలో సంభవించిన దారుణ సంఘటనల ప్రభావం విదేశాలకూ ప్రసరించింది. మతాతీత లౌకిక దేశంగా మనకున్న ప్రతిష్ఠ దెబ్బతిన్నది. వందల సంవత్సరాల కిందట హిందూదేవాలయాలపై జరిగిన దాడులు, హిందువుల పట్ల గతంలో ఇతరులు వ్యవహరించిన తీరు హిందువుల హృదయాలను గాయపరిచిందనీ, ఆ నిరసనే ఇటీవల డిసెంబర్ 6న అయోధ్యలో బాబ్రీమసీదు విధ్వంసంలో బహిర్గతమయిందని ఒక గౌరవ సభ్యుడు పార్లమెంటులో, మరి కొందరు నాయకులు పార్లమెంటు వెలుపల పేర్కొన్నారు. మన దేశ జనాభాలోని 82 శాతం ఉన్న హిందువులందరి పక్షాన మాట్లాడే హక్కు వీరికి ఎవరిచ్చారు? వీరి వివరణ నిజంగా హిందువుల అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తున్నదా? హిందువులలో అధిక సంఖ్యాకులకు అయోధ్య సంఘటనలు ఆవేదన, ఆందోళన కల్గించాయనేది వాస్తవం. శ్రీరాముడి పట్ల హిందువులందరికీ భక్తి గౌరవాలున్నాయి. అయోధ్యలో అందమయిన రామమందిరాన్ని ఏ స్థలంలో నిర్మించాలో ప్రశాంతంగా, సామరస్య పూర్వకంగా చర్చించి నిర్ణయించాలని అనేకులు అభిలషించారు. సుదీర్ఘమయిన చరిత్రలో అక్కడక్కడ కొన్ని తప్పిదాలు సంభవించాయి. పాలకులు విజ్ఞత కోల్పోయి అక్రమాలు జరిపిన సంఘటనలు

అనేకం ఉన్నాయి. విదేశీ దురాక్రమణదారులు, మతోన్మాదులు హిందువుల ప్రాచీన దేవాలయాలను ధ్వంసం చేసి, అపార ఆస్తులను, ఆభరణాలను అమానుషంగా దోచుకున్నారు. పరమత అసహనం మనలో లేదనికాదు. వీరశైవం ఉచ్ఛదశలో ఉన్నప్పుడు వెర్రిగా ప్రవర్తించి బౌద్ధారామాలను కూలగొట్టారు. వాటి స్థానంలో శివాలయాలను నిర్మించారు. అనేక శతాబ్దాల కిందట సంభవించిన సంఘటనలకు నేటి తరాలు బాధ్యత వహించాలనడం న్యాయమా? ఈరోజు ప్రతీకారం తీర్చుకోవాలనుకోవడం సమంజసమా? గత చరిత్రలో, మన సమాజంలో కొన్ని వర్గాలకు తీరని అన్యాయాలు జరిగాయి. హిందూ సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించి, కొందరిని పంచములుగా, అంటరానివారుగా వెలివేసి, తరతరాలుగా వారిని నికృష్ట స్థితికి గురిచేసిన కొన్ని అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా ఈరోజు ప్రతీకారం తీర్చుకోవడానికి అంగీకరిస్తారా? గౌతమబుద్ధుడు, గాంధీ మహాత్ముడు తదితర మహనీయులు మనకిచ్చిన సందేశం ఇదేనా? కుల, మత విచక్షణలేని సర్వమానవ సౌభ్రాతృత్వ సమాజాన్ని నిర్మించుకుందామా లేక అనాగరిక, విద్వేష పూరిత అంధకార యుగంలోకి వెనుకకు వెళదామా? ఇది చాలా ముఖ్యమయిన ప్రశ్న. హిందూమత సంరక్షకులుగా చలామణి అవుతున్న కొందరు రాముడి పేరిట సమాజాన్ని మతాల ప్రాతిపదికపై విభజించాలనుకుంటున్నారు. హిందువులు అత్యధిక సంఖ్యాకులయినా, వారి ప్రయోజనాలకే భంగం కలుగుతున్నదని, కొన్ని పక్షాలు రాజకీయ స్వార్థంతో ముస్లింలను భుజాన ఎక్కించుకుంటున్నారని నిరంతర ప్రచారం జరుగుతున్నది. కాశ్మీరులో వందకుపైగా దేవాలయాలు ధ్వంసమయినాయని వదంతులు వ్యాపించాయి. ఎన్నో సంవత్సరాల నుంచి నమాజు జరగని పురాతన కట్టడం బాబ్రీమసీదును నేలకూల్చినందుకు కంటతడిబెడుతున్న రాజకీయ పార్టీలు పాకిస్తాన్‌లో, బంగ్లాదేశ్‌లో ఆలయాలను ధ్వంసం చేస్తుంటే ఒక్కమాట మాట్లాడలేదని అంటున్నారు. కాశ్మీరులో వందకు మించిన ఆలయాలు ధ్వంసమయినాయనడం అబద్ధం. కేవలం రెండు, మూడు ఆలయాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సామాన్య కాశ్మీరీ ప్రజలు ఈ ఆలయాలను ధ్వంసం చేయలేదు. తప్పుదారిపట్టిన తీవ్రవాదులు కొందరు పాకిస్తాన్ నుంచి డబ్బు, ఆయుధాలు తీసుకుని అల్లకల్లోలం సృష్టిస్తూ భారతదేశం నుంచి కాశ్మీరును విడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ తీవ్రవాదులు విదేశీ శక్తుల ఏజెంట్లు. దేవాలయాలను ధ్వంసం చేసేది, హిందువులు ముస్లింలు అన్న విచక్షణ లేకుండా అమాయకులను హతమార్చి బీభత్సం సృష్టించేది ఈ తీవ్రవాదులే. ఇటువంటి

తీవ్రవాదులు చేసే అక్రమాలనే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పట్ల విశ్వాసం ఉన్న పౌరులు లేక రాజకీయ పక్షాలు చేయడం సముచితమా?

## అర్థరహిత భయాన్ని సృష్టించే ప్రచారం

ముస్లింలు నలుగురు స్త్రీలను వివాహం చేసుకోవచ్చని, వారు కుటుంబ నియంత్రణను వ్యతిరేకిస్తారని, అందువల్ల భవిష్యత్తులో ముస్లింల సంఖ్య హిందువుల సంఖ్యను మించపోతుందని మరో ప్రచారం. ఒక ముస్లిం నలుగురు స్త్రీలను వివాహం చేసుకోవడానికి ఇస్లాం ధర్మశాస్త్రం అనుమతిస్తున్నమాట నిజమేగాని, అలా ఎందరు నలుగురు స్త్రీలను వివాహం చేసుకుంటున్నారన్న ఆలోచన ఉండాలి. హిందువు చట్ట ప్రకారం ఒక స్త్రీనే వివాహం చేసుకోవాలి. అయినా, ఇద్దరు ముగ్గురు భార్యలున్న హిందువులు బాగానే ఉన్నారు. విద్యావంతులు, వివేకవంతులు అయిన ముస్లింలు అనేకులు కుటుంబ నియంత్రణను పాటిస్తున్నారు. కుటుంబ నియంత్రణను ఇస్లాం వ్యతిరేకించడం లేదు. ఇండోనేషియా జనాభాలో 90 శాతం ముస్లింలు. ఆ దేశం అధ్యక్షుడు ముస్లిం. ఆయన భార్య జనాభా పెరుగుదల నిరోధక కమిషన్ అధ్యక్షురాలు. కుటుంబ నియంత్రణ పాటించాలని ఇండోనేషియాలో ఇస్లాం మతగురువులు స్వయంగా ప్రబోధిస్తున్నారు. మనదేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రభుత్వ ఆధ్వర్యాన అమలు జరుగుతున్నది. అయినప్పటికీ జనాభా పెరుగుదలను అరికట్టలేకపోతున్నాం. దేశ జనాభా స్వాతంత్ర్య సిద్ధిసమయాన 30 కోట్లుకాగా ఈరోజు దాదాపు 85 కోట్లు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఇలా అందరి జనాభా పెరుగుతున్నది. మనదేశ జనాభాలో ముస్లింల సంఖ్య 1951 లెక్కల ప్రకారం 9.91 శాతం, 1981 లెక్కల ప్రకారం 11.36 శాతం, అంటే సంవత్సరానికి సగటున 0.05 శాతం చొప్పున గత ముప్పయి సంవత్సరాల్లో ముస్లింల సంఖ్య 1.45 శాతం హెచ్చింది. ఇక దేశ జనాభాలో హిందువుల సంఖ్య 1951లో 84.98 శాతం, 1981లో 82.63 శాతం. అంటే హిందువుల సంఖ్య ముప్పయి సంవత్సరాల్లో 2.35 శాతం తగ్గింది. ఈ లెక్కన మరికొన్ని వందల సంవత్సరాల తరువాత కూడా హిందువుల కంటే ముస్లింలు చాలా తక్కువ సంఖ్యలోనే ఉంటారు. స్త్రీలు విద్యావంతులు, చైతన్యవంతులయితే కుటుంబ నియంత్రణను పాటిస్తారని పరిశీలనలలో వెల్లడయింది. కేరళలో అన్ని మతాల వారిలో విద్యావంతుల సంఖ్య అధికంగా ఉంది. కేరళ స్త్రీలలో (ఏ మతానికి చెందిన వారయినా) 87 శాతం విద్యావంతులు. అందుచేత ఆ రాష్ట్రం కుటుంబ నియంత్రణ కార్యక్రమం

అమలులో అగ్రగణ్యంగా ఉంటున్నది. జనాభా పెరుగుదల నిరోధంలో కేరళ అన్ని రాష్ట్రాల్లో ప్రథమస్థానం ఆక్రమిస్తున్నది. అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో కేరళలో జననాల రేటు వెయ్యికి 14 వరకు తగ్గింది. ప్రజలందరికి కనీస విద్యా, వైద్య సదుపాయాలు కల్గించి, చైనాలో వలె సమాజంలోని అన్ని వర్గాలను ప్రభుత్వ, ప్రయివేటు రంగాలను భాగస్వాములుగా చేసినప్పుడే మన దేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమం విజయవంతమయి జనాభా ఆశించిన రీతిగా తగ్గుతుంది. ముస్లింలకు పెద్దపీట వేస్తున్నారన్నది మరో ఆరోపణ. ఇప్పటికీ ముస్లింలు ఐ.ఎ.ఎస్. ఉద్యోగులలో 2 శాతం కన్న తక్కువ. దేశ ప్రజల సగటు తలసరి ఆదాయం కంటే ముస్లింల సగటు తలసరి ఆదాయం 5 శాతం తక్కువ. ముస్లిం సామాన్య ప్రజల జీవన పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. ముస్లింలలో అత్యధికులు నిరుపేదలు. గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చిన ముస్లింలు మాత్రం మెరుగయిన స్థితిలో ఉన్నారు.

## రాజకీయాలు అశాశ్వతం ఈ దేశం శాశ్వతం

షాహబానో మనోవర్తి వివాదంలో సుప్రీంకోర్టు తీర్పును ఎంతమంది ముస్లింలు చదివారన్నది ప్రశ్న. చాలా మందికి ఈ తీర్పు గురించి తెలియదు. ముస్లింలందరికి నాయకులుగా చలామణి అవుతున్న షాహి ఇమామ్ బుఖారీ వంటి కొందరు ఆ తీర్పును వ్యతిరేకించారు. ఇతర రాజకీయ పక్షాలతో పాటు (ముస్లిం లీగ్ మినహా) నాటి కేంద్ర పాలక పక్షం కాంగ్రెసు (ఐ) కూడా ఈ తీర్పును సమర్థించింది. ఆ తరువాత ముస్లిం ఛాందస నాయకుల ఒత్తిడికి లొంగి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును నిరర్థకం చేయడానికి చట్టాన్ని రూపొందించింది. ఆనాడు రాజీవ్‌గాంధీ దృఢంగా నిలిచి సుప్రీంకోర్టు తీర్పును బలపరిస్తే ఈరోజు దుష్ప్రచారానికి అవకాశం ఉండకపోయేది. రాజకీయ ప్రయోజనాల నిమిత్తం ప్రజలలో విభేదాలు సృష్టించడం సమంజసం కాదు. క్షేమకరం కాదు. వ్యక్తులు, రాజకీయపక్షాలు, అధికారం, పదవులు శాశ్వతం కావు. ఈ దేశం శాశ్వతం. ఇది వివేకానందుని చికాగో ప్రసంగ శతవార్షిక సంవత్సరం. ఈ సందర్భాన ఆ మహనీయుడికి నివాళి పట్టాలంటే చిత్తశుద్ధితో ఆయన బోధనలను అమలు జరపాలి. మత సహనంతో జాతీయ సమైక్యతా పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి.

*ది. 06-03-1994.* — *ఈనాడు*

●

# సమగ్రత కొరవడితే లొసుగులు సశేషమే!

## ఎన్నికల సంస్కరణలు

మొన్నటి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల చివరిరోజున రాజ్యాంగం 82వ సవరణ బిల్లును, 1951 ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణల ద్వారా ఎన్నికల సంస్కరణలకు ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రయత్నించి ప్రభుత్వం విఫలమయింది. సాధారణంగా బిల్లును ప్రవేశపెట్టే ముందు స్పీకరుకు వారంరోజుల క్రితమే తెలియపర్చి సభలో బిల్లు ప్రవేశపెట్టడానికి కనీసం 48 గంటల ముందు సభ్యులందరికీ ఆ బిల్లు కాపీలను అందజేయవలసి వుంటుంది. వాస్తవానికి సభ్యులకు కాపీలు అందించకుండానే 82వ రాజ్యాంగ సవరణ బిల్లును పదోతేదీనే ప్రవేశపెట్టాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. స్పీకర్ ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పక్షాల ఫ్లోర్ లీడర్ల సమావేశంలో పార్లమెంటరీ శాఖమంత్రి ఈ ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు కూడా! కొన్ని ప్రత్యేక సందర్భాలలో బిల్లు కాపీలను సభ్యులకు అందించకుండానే స్పీకరు అనుమతితో సభలో బిల్లు ప్రవేశపెట్టవచ్చన్న వాదనను బిజెపి, తెలుగుదేశం, డిఎంకె పార్టీలు వ్యతిరేకించాయి. ప్రత్యేక సందర్భంగా దీన్ని పరిగణించడానికి స్పీకర్ అనుమతించకపోవడంతో 11న బిల్లు కాపీలను సభ్యులకు పంచారు. 13న నిర్వర్తించవలసిన సభా కార్యక్రమాల జాబితాలో ఈ బిల్లులను ప్రవేశపెట్టే అంశం కూడా చేర్చివుంటే ప్రతిపక్షాలకు అభ్యంతరం చెప్పే అవకాశం ఉండేదికాదు. ఈ రెండు బిల్లుల విషయంలో ప్రభుత్వం దాగుడుమూతలాడుతూ మరోమార్గంలో తన అభీష్టాన్ని నెగ్గించుకోవాలనుకొంటున్నదనే అనుమానాలు ముప్పిరిగొన్నాయి. దీనికి బాధ్యత వహించాల్సింది కేంద్రప్రభుత్వమే.

## కలహాల కాపురం - ఇంకానా?

బిల్లుల సంగతి చూస్తే - తాటిచెట్టు ఎందుకెక్కావంటే దూడమేత కన్నట్లుంది. ప్రభుత్వం ప్రవేశ పెట్టదల్చిన 82వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రధాన లక్ష్యం - ఎన్నికల ప్రధానాధికారితో పాటు ఇతర ఎలక్షన్ కమిషనర్లకూ సమాన ప్రతిపత్తీ అధికారాలు కల్పించి, తాను నామినేట్ చేసిన కమిషనర్ల ద్వారా శేషన్‌కు ముక్కుతాడు వేయడమేనన్నది విస్పష్టం. ప్రజాస్వామ్య వ్యవస్థలో, పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీ మెజారిటీ సీట్లు సాధిస్తుందో అదే ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుంది. అత్యంత ప్రాముఖ్యం గల ఈ ఎన్నికల ప్రక్రియను సమర్థంగా, నిష్పక్షపాతంగా నిర్వహింప చేయడానికే రాజ్యాంగం 15వ విభాగం ఆర్టికల్ 324 కింద ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తూ ఎన్నికల నిర్వహణ బాధ్యత ఈ కమిషన్‌దేనని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌లో ఒకరికంటే ఎక్కువమంది సభ్యులుండవచ్చునని రాజ్యాంగంలోనే ఉంది. ఎన్నికల ప్రధానాధికారిని తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించడానికి అనుసరించే విధానాన్ని పాటించాలి. అదే ఇతర ఎన్నికల కమిషనర్లను సిఇసి సిఫార్సు మీద తొలగించవచ్చు. దీన్నిబట్టే ఎలక్షన్ కమిషనర్ల కంటే సిఇసికే అధిక ప్రాముఖ్యాన్ని రాజ్యాంగం ఉద్దేశించిందని తెలుస్తోంది. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా ఉండిన దినేష్‌గోస్వామి అధ్యక్షతన ఏర్పాటైన ఎన్నికల సంస్కరణల కమిటీ ఎలక్షన్ కమిషన్ త్రిసభ్య సంఘంగా ఉండవచ్చునని సూచించింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, సమర్థంగా పనిచేయడానికి, దీనిపై పాలకపక్షం ప్రాబల్యం తగ్గించడానికిగాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ స్పీకర్, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఒకవేళ ఆయన లేకపోతే అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడు వీరితో సంప్రదించి సిఇసిని నియమించాలనీ గోస్వామి కమిటీ పేర్కొంది. ఇతర ఎన్నికల కమిషనర్ల విషయంలో పైన పేర్కొన్న ముగ్గురు పెద్దలతోపాటు, సిఇసిని కూడా సంప్రదించే వారిని నియమించాలని కమిటీ సిఫార్సు. ఈ నియామక విధానానికి చట్టబద్ధత కల్పించాలనీ కమిటీ ఉద్దేశించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర కమిషనర్ల జీతభత్యాలు తదితరాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇతర న్యాయమూర్తులకు అనుసరిస్తున్న పద్ధతినే పాటించవచ్చునీ సూచించింది. సిఇసి అధికారాలను కత్తిరించాలని గోస్వామి కమిటీ కానీ, తార్కుండే కమిటీ గానీ సిఫార్సు చేయలేదు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న బిల్లు ప్రకారం ముగ్గురూ సమానులే! ఇతర కమిషనర్ల నియామకంలో

ప్రభుత్వం సిఇసి శేషన్‌ను సంప్రదించనేలేదు. పర్యవసానంగా ఎలక్షన్ కమిషన్ ఎలా కలహాల కాపురమయిందీ కళ్ళకు కడుతూనే ఉంది. సిఇసి ఇతర కమిషనర్ల నియామక విధానానికి గోస్వామి కమిటీ సిఫార్సు మేరకు చట్టబద్ధత కల్పించకపోవడంలో ఏలినవారి ఆంతర్యం బోధపడుతూనే ఉంది. తన తాబేదార్లను ఎలక్షన్ కమిషనర్లుగా నియమించి రాజకీయ ప్రయోజనాలు రాబట్టుకోవాలన్నది కాంగ్రెస్ పెద్దల తాపత్రయం.

## గుర్తింపు కార్డులకు మొండిచెయ్యి

ఎనభైరెండో రాజ్యాంగ సవరణ బిల్లులోని మరో అంశం ప్రకారం ప్రతిరాష్ట్రం కేంద్రపాలిత ప్రాంతంలోనూ 1971 జనాభా లెక్కలకనుగుణంగా నాడు షెడ్యూల్డు కులాలు, తెగలకు లోక్‌సభ, శాసనసభలకు రిజర్వ్ చేసిన నియోజకవర్గాల సంఖ్యలో ఇప్పుడు మార్పు ఉండదు. కానీ 1991 జనాభా లెక్కల ప్రకారం ఈ వర్గాల జనసంఖ్య ఆధిక్యాన్ని బట్టి నియోజకవర్గాలు మారవచ్చు. ఉదాహరణకు 1971 జనాభాలెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎస్‌సిలకు ఆరు, ఎస్‌టిలకు రెండు లోక్‌సభ స్థానాలు రిజర్వ్ చేశారు. నియోజక వర్గాల సంఖ్య పెరగదు కానీ, రిజర్వ్‌డ్ నియోజక వర్గాల్లో మార్పు ఉండవచ్చు. 'కోట్ల' వార్లు కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నియోజక వర్గాల పునర్విభజన (డి లిమిటేషన్)కు రిజర్వ్‌డ్ స్థానాల రొటేషన్‌కు ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దీనిపై నియమించిన సెలక్ట్ కమిటీ ఈ రొటేషన్ ప్రతిపాదనలకు అంగీకరించలేదు. త్వరలో పలు రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరుగనున్న దరిమిలా నియోజక వర్గాల పునర్విభజన ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. కనుక ఈ ప్రతిపాదనకు బహుశా అన్ని పక్షాలూ ఆమోదం తెలపవచ్చు. ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ బిల్లులో రాజ్యసభకు ప్రతినిధులను ఎన్నుకునే విషయమై ఓ అభ్యంతరకర అంశాన్ని ప్రతిపాదిస్తున్నారు. రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాజ్యసభ సభ్యుల సాధారణ నివాస నిబంధనను మార్చడానికి కేంద్రం ప్రతిపాదిస్తోంది. దొడ్డిదారిన రాజ్యసభ ప్రవేశాలకు రంగం సిద్ధం చేస్తూ దేశంలో ఏ పార్లమెంటరీ నియోజక వర్గంలోనైనా ఓటరై ఉంటే చాలునని ప్రస్తుత బిల్లులో ప్రతిపాదిస్తున్నారు. కీలకమైన ఓటరు గుర్తింపు కార్డుల విషయంలోనూ కేంద్రం ప్రతిపాదన అభ్యంతరకరంగా ఉంది. గోస్వామి కమిటీ కూడా నిర్ణీత వ్యవధిలో తప్పనిసరిగా బహుళార్థ సాధక ఓటరు గుర్తింపు కార్డునిచ్చే పద్ధతి ప్రవేశపెట్టాలని

సిఫార్సు చేసింది. సిఇసి శేషన్ గుర్తింపు కార్డులు లేనిదే ఎన్నికలు నిర్వహించబోమని కుండబద్దలు కొట్టడంతో ఈ అంశం వివాదాస్పదమయింది. గుర్తింపు కార్డులకు కాగల భారీ ఖర్చు రీత్యా ఇప్పటికిప్పుడు ఆచరణ సాధ్యంకాదని రాజకీయ పార్టీలంటున్నాయి. వాస్తవాన్ని గమనిస్తే గుర్తింపు కార్డుకయ్యే వ్యయం 10-20 రూపాయిల మధ్య ఉంటుందని ఆ మేరకు సరఫరా చేస్తామని ఇసిఎల్ వంటి సంస్థలు సంసిద్ధత వ్యక్తం చెయ్యడం, మహారాష్ట్ర, రాజస్థాన్, ప్రభుత్వాలు ఆ మేరకు చర్యలు తీసుకోవడం ఇటీవలి పరిణామం. వ్యయం తాలుకు ప్రధాన అవరోధం తొలగిపోతున్న చిహ్నాలు కన్పిస్తున్నా శేషన్ ఉత్తర్వులు నీరుగార్చే ప్రతిపాదనను బిల్లులో చేర్చారు.

గుర్తింపు కార్డుల విషయంలో కేంద్రప్రభుత్వం ఆమోదాన్ని పొందిన తర్వాత మాత్రమే ఎన్నికల కమిషన్ నోటిఫై చేయాలని, ఇప్పటికే కేంద్రం ఆమోదంలేకుండా ఎన్నికల కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లదని అది అమలు కావడానికి వీల్లేదని బిల్లులో పేర్కొన్నారు. గోస్వామి కమిటీ సిఫార్సులను కొన్నింటిని ప్రజా ప్రాతినిధ్యం చట్టం సవరణ బిల్లులో పొందుపరిచారు. ఎన్నికల ప్రచార కాలవ్యవధికి 20 నుంచి 14 రోజులకు తగ్గించడంతో పాటు ఎన్నికల వ్యయాన్ని కొంతమేర తగ్గించడానికి ఉపయోగపడే అంశాన్ని ప్రతిపాదించారు. ఎన్నికల్లో గరిష్టవ్యయ పరిమితిని వాస్తవానికి దగ్గరగా, ధరల పెరుగుదలకు అనుగుణంగా సవరించాల్సి వున్నా దీని గురించి బిల్లులో ఏమీ లేదు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీల అభ్యర్థులకు ప్రభుత్వం ఓటర్ల జాబితాలు, డీజిలు, పెట్రోలు కూపన్లు, మైక్రోఫోన్లకు అద్దె, ఓటరు గుర్తింపు పత్రాలను సరఫరా చేయడం సముచితమని గోస్వామి కమిటీ చేసిన ఆయా వస్తుసామాగ్రిని అంతకుమించి వినియోగించరాదన్న నిబంధననూ చేర్చవచ్చు. ఒక అభ్యర్థి ఒకే నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీ చేయాలనే దానికి, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీ అభ్యర్థి ఫలితం ప్రకటించక ముందు చనిపోతే, ఎన్నిక వాయిదా వేసి ఆ పార్టీ మరో అభ్యర్థి పేరు సూచించడానికి అవకాశం ఇవ్వాలన్న ప్రతిపాదనకు బహుశా ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఇప్పటి బిల్లులో 'చట్ట విరుద్ధ చర్యలు' అనే దాని కింద నమూనా ప్రవర్తనా నియమావళిని ఓ కొత్త అధికరణంగా చేర్చారు. ఇండిపెండెట్ అభ్యర్థుల తాకిడిని అడ్డుకోవడానికి ధరావతు మొత్తాన్ని బాగా పెంచాలని ప్రతిపాదించారు. పోలైన ఓట్లలో ఆరోవంతు వస్తేనే ధరావతు దక్కేది.

దీనిని నాలుగో వంతుకు పెంచదలిచారు. మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేసే పార్టీల గుర్తింపు రద్దునూ ప్రతిపాదించారు. పార్టీ పేరులో మతం పేరు ఉండరాదనీ పేర్కొన్నారు. ఇవన్నీ ఆహ్వానించదగ్గ సంస్కరణలే! ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని విశ్వసించిన పక్షంలో ఓట్ల లెక్కింపును నిలిపివేయాల్సిందిగా రిటర్నింగ్ ఆఫీసర్‌కు నిర్దేశించడానికి, ఫలితాలు ప్రకటించకుండా ఆపడానికి కమిషన్ నియమించిన పరిశీలకులకు చట్టబద్ధ అధికారాలు సంక్రమింప చేయదలిచారు. బూతులను ఆక్రమించబోయినా, ఓటర్లను భయపెట్టినా, దొంగ ఓట్లు వెయ్యబోయినా, పోలింగ్ రోజున మత్తుపానీయాల విక్రయం, సరఫరా చేసినా, ఓటర్లను బూతులకు తరలించడానికి వాహనాలు వినియోగించినా గతంలో కంటే కఠినంగా జైలుశిక్ష, భారీగా అపరాధ రుసుము విధించే విధంగా సవరణ బిల్లులో ప్రతిపాదించారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తికి పట్టం

ఈ విధమైన సమగ్ర సంస్కరణలను బిల్లు రూపంలో తీసుకురావాలని 1992లోనే శేషన్ కేంద్రానికి సూచించారు. దానిపై ఉలుకూ పలుకూ లేని ప్రభుత్వం నేడు శేషన్ అధికారాలకు అంటకత్తెర వేసే ఉద్దేశంతో 82వ రాజ్యాంగ సవరణతో పాటు ఎన్నికల సంస్కరణలకూ తెరతీసింది. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలను స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికల కమిషన్ నిర్వహించాలనీ, కమిషన్ నిర్భయంగా, స్వతంత్రంగా వ్యవహరించగలగాలనీ ప్రభుత్వం నిజంగా భావిస్తే సి.ఇ.సి. ఇతర కమిషనర్ల నియామక విధానంపై గోస్వామి కమిటీ సిఫార్సులనూ బిల్లులో చేర్చాలి. ఈరోజు శేషన్ మీది అక్కసుతో సి.ఇ.సి. అధికారాలను కత్తిరించి ఆ వ్యవస్థను బలహీనపర్చడం సరికాదు. కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి పట్టంగట్టడం నేటి అవసరం.

*ది. 26-05-1994.* — *ఈనాడు*

●

# గోస్వామి సిఫార్సులతోనే సిసలైన సంస్కరణ!

ఎన్నికల సంస్కరణలంటూ తెగ ఆర్భాటం చేసిన కేంద్ర ప్రభుత్వం చివరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఓ సిఫార్సుగా మార్చింది. మొన్న జూన్ 14న - భారత పార్లమెంటు చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా ఓ 'దుస్సంఘటన' జరిగింది. అది పార్లమెంటరీ సత్ సంప్రదాయాలనే పరిహాసాస్పదం చేసింది. సాక్షాత్తూ కేంద్ర న్యాయశాఖ మంత్రే సభను తప్పుదారి పట్టించి ప్రత్యేక సమావేశాల ప్రయోజనాన్నే నీరు గార్చారు. దొంగకు తేలు కుట్టిన చందంగా - ఎన్నికల సంస్కరణలపై కేంద్ర ప్రభుత్వానికి గల ఆసక్తి ఏపాటిదో తేలిపోయింది. 71వ రాజ్యాంగ సవరణ బిల్లును ఉప సంహరించుకోవడానికి న్యాయశాఖమంత్రి హెచ్.ఆర్. భరద్వాజ్ ఆనాడు ప్రతిపాదించారు. ఓటర్ల సంఖ్య బాగా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల పునర్విభజనకు ఉద్దేశించిన బిల్లు అది. ఈ బిల్లుకు అన్ని పార్టీల మద్దతు ఉంది. పార్లమెంటరీ సెలక్ట్ కమిటీ సైతం నియోజకవర్గాల పునర్విభజన అవసరమేనని సిఫార్సు చేసింది. ఈ బిల్లు ఉపసంహరణ సమంజసం కాదని సభ్యులు వాదించగా - దీనిలోని అంశాలు తాను ప్రవేశపెట్టబోయే 83వ రాజ్యాంగ సవరణ బిల్లులోనూ ఉన్నందున సభ్యులు ఆందోళన చెందనవసరంలేదని మంత్రి సెలవిచ్చారు. 83వ రాజ్యాంగ సవరణ బిల్లులోని ఇతర అంశాలపై పార్టీల నడుమ భిన్నాభిప్రాయాలున్నందున దానికి సభ ఆమోదం లభిస్తుందన్న భరోసా లేదు గనుక 71వ సవరణ బిల్లును విడిగా ప్రవేశపెట్టాలని సభ్యులు కోరినా భరద్వాజ్ అంగీకరించలేదు. నాటి సభా కార్యక్రమం ప్రకారం ఆయన 83వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంది. దీనిపై అన్ని రాజకీయ పక్షాల నడుమా ఏకాభిప్రాయం లేనందున బిల్లు ఆమోదానికి తగు మద్దతు లభించడం అనుమానాస్పదంగా ఉన్న దరిమిలా దీన్నసలు ప్రవేశపెట్టడమే లేదని భరద్వాజ్ ప్రకటించారు. ఎన్నికల ప్రధానాధికారి శేషన్ కోరలు పీకేందుకు లక్ష్యించిన 83వ

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన మద్దతు సాధించలేమన్న నిర్ధారణకు రాగానే ప్రభుత్వం ఎన్నికల సంస్కరణలకు ఉద్దేశించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం సవరణ బిల్లుపై కూడా వెనక్కి తగ్గింది దీన్ని బట్టే తెలుస్తోంది – ఏలినవారి చిత్తశుద్ధి ఏపాటిదో!

## అంతర్యం ఒకటి, ఆహార్యం వేరొకటి

కేంద్ర ప్రభుత్వం కీలకమైన ఈ రెండు బిల్లులపై ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరిపింది. అందరూ ఎన్నికల సంస్కరణలను కోరుతూనే ఉన్నప్పుడూ ఏకాభిప్రాయానికెందుకు రాలేకపోయారన్నది ప్రశ్న. స్వీయ ప్రయోజనాలను పక్కన బెట్టాలని, నానాటికీ పెరుగుతున్న ధన, కండబలాల ప్రాబల్యానికి కళ్లెమేసి, బూత్‌ల ఆక్రమణను నిరోధించి తద్వారా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరిగి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలపడాలన్న ఉద్దేశం రాజకీయ పక్షాలకు నిజంగా ఉంటే బాగానే ఉండేది. కానీ జరిగింది వేరు! పార్టీల అంతర్యం ఒకటి, ఆహార్యం వేరొకటి. దానికితోడు కొన్ని పార్టీలు శేషన్‌ను దృష్టిలో ఉంచుకొని తమ వైఖరి దూపొందించుకొన్నాయి. కనుకనే ప్రజాస్వామ్య పరిరక్షణకు దోహదం చేయగల ఈ బిల్లులపై ఏకాభిప్రాయం ఎండమావి అయింది. ఎన్నికల కమీషన్ బహుళ సభ్య సంఘంగా ఉండాలనీ, సి.ఇ.సి, ఇతర ఎలక్షన్ కమీషనర్ల (ఇ.సి.)కు సమాన అధికారం ఉంటుందనీ, మెజారిటీ అభిప్రాయానికి అనుగుణంగా కమీషన్ నడవాలనీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు సి.ఇ.సి., ఇ.సి.లను నియమించాలనీ 83వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపాదిస్తోంది. వీటికి తోడు నియోజకవర్గాల పునర్విభజన అంశమూ ఉంది. గతంలో ఎన్నికల సంస్కరణలపై చర్చించిన తార్కుండే కమిటీ, నేషనల్ ఫ్రంట్ హయాంనాటి దినేష్‌గోస్వామి కమిటీ ఎన్నికల కమీషన్ బహుళ సభ్య సంఘంగా ఉంటే మంచిదని సిఫార్సు చేశాయి. దీనికి స్థూలంగా అన్ని పార్టీలు సరేనంటున్నా రెండు ముఖ్యాంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ (ఐ) ప్రధాన ప్రతిపక్షం, గోస్వామి కమిటీలో కాంగ్రెస్ (ఐ) సహా దాదాపు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ ఉన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిని, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని సంప్రదించి ఎలక్షన్ కమీషన్ సభ్యులను నియమించాలని గోస్వామి కమిటీ సిఫార్సు ఇ.సి.లను నియమించేటప్పుడు పై ఇద్దరు ప్రముఖులుగాక సి.ఇ.సి.ని సైతం సంప్రదించాలని కమిటీ పేర్కొంది. ప్రస్తుతం బి.జె.పి. ప్రధాన ప్రతిపక్షంగా

ఉంది కాబట్టి కాంగ్రెస్‌కు, మరికొన్ని పార్టీలకు ఈ విధానం ఆమోదయోగ్యంగా లేదు. ఎనిమిదో లోక్‌సభలో తెలుగుదేశం, తొమ్మిదో లోక్‌సభలో కాంగ్రెస్ (ఐ), పదో లోక్‌సభలో బి.జె.పి, ప్రధాన ప్రతిపక్షాలు. భవిష్యత్తులో ఏ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఉంటుందో ఎవరు చెప్పగలరు? ప్రధాన ప్రతిపక్ష పార్టీకి సైతం ఆమోదయోగ్యుడైన వ్యక్తిని కీలక విధులు నిర్వర్తించే ఇ.సి. పదవిలో నియమిస్తే - ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లుతుందన్నది గోస్వామి కమిటీ సిఫార్సులోని ఆంతర్యం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు, ఇద్దరు న్యాయమూర్తులను కూడా సంప్రదించడానికి అంగీకరించిన కాంగ్రెస్ (ఐ), ప్రధాన ప్రతిపక్షాన్ని విశ్వాసంలోకి తీసుకోవడానికి వెనుకాడింది. ఎలక్షన్ కమీషన్ పని విధానం, కమీషనర్ల అధికారాలపైనా పార్టీల మధ్య భేదాభిప్రాయాలు పొడసూపాయి. సాధారణ పరిస్థితుల్లో విధి నిర్వహణ తీరు వేరు; ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాకవేరు. కీలకమైన నిర్ణయాలను కొద్ది గంటల వ్యవధిలో ఒక్కోసారి అప్పటికప్పుడే తీసుకోవలసి ఉంటుంది. అలాంటి సమయాల్లో ముగ్గురు సమావేశమై నిర్ణయాలు చేయడం అసాధ్యం. కనుక ఆయా సందర్భాల్లో తగు ఉత్తర్వులిచ్చే అధికారం సి.ఇ.సి.కి లేకపోతే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయి.

## దురదృష్టకర పోకడలు

కొన్ని పార్టీలు ఎలక్షన్ కమీషన్‌ను, సుప్రీంకోర్టునూ సరిపోల్చి కొత్త వాదన లేవనెత్తుతున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మిగిలిన న్యాయమూర్తుల్లో ప్రథముడు మాత్రమే, అతని అభిప్రాయం ప్రకారం తీర్పు ఉండదు. బెంచిలో మెజారిటీ అభిప్రాయమే తీర్పు అని కొన్ని పక్షాల వాదన. సుప్రీంకోర్టు పని విధానానికి, ఎలక్షన్ కమీషన్ పని పోకడలకు అసలు పొంతనే లేదు. కోర్టుకు జ్యుడిషియల్ అధికారమే కానీ ఎగ్జిక్యూటివ్ అధికారం లేదు. ఎలక్షన్ కమీషన్ క్వాజీ జ్యుడిషియల్ అంశాలపై నిర్ణయాలు చేయడమేగాక, ఎగ్జిక్యూటివ్ అధికారాలనూ కలిగి ఉంది. కనుకనే రాజ్యాంగ నిర్ణేతలు 324 అధికరణంలో సి.ఇ.సి.తో పాటు ఇ.సి.లకూ అవకాశం కల్పిస్తూనే సి.ఇ.సి.కే అధిక ప్రాధాన్యం ఇచ్చిన విషయం గమనార్హం. పాలకపక్షం ఇందుకు అంగీకరించకపోబట్టే - సి.పి.ఐ. తెలుగుదేశం, డి.ఎం.కె.లు బిల్లుకు మద్దతు తెలుపలేదు. ప్రజాస్వామ్యంలో విభేదాలు, భిన్నాభిప్రాయాలు సహజమే! తగిన మద్దతు ఉన్నా, లేకపోయినా - సభలో బిల్లుల్ని ప్రవేశపెట్టి చర్చించి, అవసరమైతే సెలక్ట్ కమిటీకి,

లేదా స్టాండింగ్ కమిటీకి పంపి, మళ్లీ శీతాకాలం సమావేశాల్లో ఓటింగ్‌కు పెట్టి ఉండాల్సింది. బిల్లుపై ఇప్పుడు ఓటింగ్ జరిగి ప్రభుత్వం ఓడిపోతే – సుప్రీంకోర్టులో శేషన్ దాఖలు చేసిన పిటీషన్‌లో ఎదురుదెబ్బ తగులుతుందేమోనని ప్రభుత్వం భయపడింది. రాజ్యాంగాన్ని సవరించకుండానే – చీఫ్ ఎలక్షన్ కమీషనర్, ఇతర ఇ.సి.ల జీతభత్యాలు, పెన్షన్ సర్వీసు నిబంధనల బిల్లు పేరిట ప్రభుత్వం ఓ చట్టాన్ని తెచ్చి ఆమోదింపచేసిన సంగతి తెలిసిందే! దీని ప్రకారం కమీషన్ ఏకగ్రీవ నిర్ణయం చేయాలి, కాదంటే మెజారిటీ అభిమతమే శిరోధార్యం. దీనికి వ్యతిరేకంగానే శేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శేషన్ నిర్ణయాలే ఎలక్షన్ కమీషన్ ఉత్తర్వులుగా చెలామణి కావాలని సుప్రీంకోర్టు తాత్కాలిక ఉత్తర్వులో పేర్కొంది. తుది తీర్పు ఇంకా రాలేదు. ఇప్పుడు 83వ రాజ్యాంగ సవరణ బిల్లు ఓడిపోతే సుప్రీకోర్టు శేషన్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తుందేమోనన్న భయంతో బిల్లును ఉపసంహరించడం దురదృష్టకరం. ఎన్నికల సంస్కరణ బిల్లులను చర్చించడానికి ప్రత్యేకంగా సమావేశమైన పార్లమెంటు ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ బిల్లును చర్చించకుండానే వాయిదా పడటం అంతకంటే విషాదకరం. దీన్నిబట్టే – శేషన్ అధికారాలను తగ్గించడమే తప్ప కలుషితమైన ఎన్నికల రంగాన్ని ప్రక్షాళన చేయాలన్న తలంపు పాలక పక్షానికెంతమాత్రం లేదని తేలిపోయింది. చిత్రమైన విషయం మరొకటుంది. సాధారణంగా ముందు ఒక బిల్లు తయారు చేసి దరిమిలా దాని బదులు మరొకటి తీసుకురాదల్చినప్పుడు – రెండోది మొదటి బిల్లుకంటే మెరుగ్గా ఉండాలి. ప్రజాప్రాతినిధ్యం చట్టం రెండో సవరణ బిల్లు ఇందుకు విరుద్ధంగా ఉంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ అభ్యర్థులకు మైకుల అద్దె, కొంతమేరకు డీజిలు, పెట్రోలు, ఓటర్ల గుర్తింపు స్లిప్పులు ప్రభుత్వమే ఇవ్వాలని గోస్వామి కమిటీ సూచించింది. పార్లీమెంటుకుగానీ అసెంబ్లీకి గానీ ఎవరూ ఒక్క స్థానానికి మించి పోటీ చేయరాదనీ పేర్కొంది. ఈ రెండింటినీ ముందు తెచ్చిన సవరణ బిల్లులో పెట్టి రెండో సవరణ బిల్లులో – గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ప్రభుత్వ సహాయమున్న అంశాన్ని ఎత్తివేసి, ఎవరైనా 'రెండు స్థానాల'కు మించి పోటీ చేయరాదని పేర్కొన్నారు. ప్రధాని తప్ప ముఖ్యమంత్రులుగానీ మరెవరైనాగానీ, – అద్దె చెల్లించినప్పటికీ – ప్రభుత్వ వాహనాలు, విమానాలను వాడరాదన్న నిబంధన నమూనా ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)లో ఉంది. ఇప్పటివరకు 'మోడల్ కోడ్'కు చట్టబద్ధత లేదు. గోస్వామి కమిటీ దీని చట్టబద్ధతకు సిఫార్సు చేసింది. మొదటి

సవరణబిల్లులోని రెండో ప్రకరణంలో 'ఎన్నికల తప్పిదములు' అనే అంశం కింద ఈ మోడల్ కోడ్‌ను చేర్చి, రెండో సవరణ బిల్లులో ప్రభుత్వ వాహనాలు, విమానాల వాడకం తప్పన్న అంశాన్ని ఎత్తివేసింది. వీటన్నిటిని బట్టి పౌరులు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోగలిగే పరిస్థితులకు దోహదం చేసే ఎన్నికల సంస్కరణలను ప్రభుత్వం తీసుకురావాలనుకోవడం లేదని తేటతెల్లమవుతోంది.

## సమగ్ర సవరణలు అవశ్యం

కేవలం శేషన్ మీది అక్కసుతో ఎన్నికల ప్రధానాధికారి అధికారాలకు కత్తెర వెయ్యాలని ప్రయత్నించడం తగనిపని. వ్యక్తులు శాశ్వతంకాదు వ్యవస్థ ముఖ్యం. ప్రజాస్వామ్య సౌధానికి పునాదిలాంటి ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరిగేట్లు చూడవలసిన కర్తవ్యం కేంద్ర ప్రభుత్వానిది. ఈ కర్తవ్య నిర్వహణలో స్వార్థ చింతన అనర్థదాయకం. పి.వి. ప్రభుత్వం ఇకనైనా మొండిపట్టు విడనాడాలి. గోస్వామి కమిటీ సిఫార్సు మేరకు ఎలక్షన్ కమిషన్‌లో సభ్యులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుల సలహాతో నియమించి, సి.ఇ.సి. ప్రాముఖ్యాన్ని కొనసాగనివ్వాలి. గోస్వామి కమిటీ సిఫార్సులకనుగుణంగానే-ప్రజా ప్రాతినిధ్యం చట్టానికి సమగ్ర సవరణలను ప్రతిపాదించి వచ్చే వర్షాకాల సమావేశాల్లోనైనా బిల్లులు ప్రవేశపెట్టడం అభిలషణీయం. భారతదేశంలో ప్రజాస్వామ్యం పది కాలాలపాటు మనగలగాలంటే సమగ్ర ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత కాదనలేనిది.

*ది. 23-06-1994.* — ***ఈనాడు***

●

# ఉట్టి కెగరలేకున్నా స్వర్గానికి నిచ్చెనలు

**భా**రతదేశానికి స్వాతంత్ర్యం లభించి 47 సంవత్సరాలయినప్పటికీ - పలు రంగాలలో అలుముకున్న దయనీయస్థితి నిరాశా నిస్పృహలు కల్గిస్తున్నది. దేశ ప్రజలలో ముప్పయి తొమ్మిది శాతం దారిద్ర్య రేఖ దిగువన దుర్భర పేదరికం అనుభవిస్తున్నట్టు వివిధ నివేదికలు వివరిస్తున్నాయి. మానవ అభివృద్ధి సూచిక కొలమానం ప్రకారం భారతదేశం ప్రపంచంలో 135వ స్థానంలో ఉంది. ఇప్పటికీ రెండు లక్షలకు పైగా గ్రామాలకు వర్షాకాలంలో సరైన రహదారి సౌకర్యం లేదు. ఈ గ్రామాల ప్రజలు బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోయి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. ఇటువంటి గ్రామాలన్నింటికి ఎప్పటికి రహదారి సదుపాయం ఏర్పడుతుందో, దానికి ఎంత వ్యయమవుతుందో ఎవరూ అంచనా వేయడంలేదు. ప్రణాళికా కర్తలు, పరిపాలకుల దృష్టి పేద గ్రామాల మీద ప్రసరించడంలేదు. ఈ క్లిష్ట పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న విధానాలు, మంత్రులు చేస్తున్న ప్రసంగాలు, వారి వాగ్దానాలు, వాగ్దాన భంగాలు విచిత్రంగా కన్పిస్తున్నాయి. పాలకులు సామాన్య ప్రజల అవసరాలను గమనించడంలేదు. ప్రజల సంక్షేమం పట్ల శ్రద్ధ వహించడం లేదు. ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ పదాలను మంత్రులు మంత్రాల్లాగా జపిస్తున్నారు. దేశీయ సమస్యలన్నిటికి ఇవే పరిష్కారమార్గాలన్నట్లు మాట్లాడుతున్నారు.

### కూడూ, గూడూ లేదుగానీ...

ఈనాటికీ పదివేల గ్రామాలలో తాగునీటి సమస్య దుర్భరంగా ఉంది. మంచినీటిలో ఫ్లోరైడు శాతం అధికంగా ఉండటంతో ప్రజలను, పశువులను అనారోగ్యం బాధిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో మంచినీటి వసతి లేని గ్రామం ఏదీ లేదని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. సరైన పారిశుధ్య సౌకర్యాలు గ్రామీణ ప్రజలలో నూటికి ముగ్గురికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వమే అంగీకరిస్తున్నది. పల్లె ప్రాంతాలలో

కోట్లాది స్త్రీలు మలమూత్రశాలల సదుపాయం లేక ఇబ్బందిపడుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి 1993-94లో కేవలం రూ. 30 కోట్లను కేటాయించగా అందులో ఆంధ్రప్రదేశ్‌కు లభించింది. రూ. కోటి 57 లక్షలు మాత్రమే. ఈ లెక్కన గ్రామీణ మహిళలందరికి మరుగుదొడ్ల సదుపాయం లభించడానికి మరో వంద సంవత్సరాలు పట్టవచ్చు. ఒకవంక దేశ ప్రజలు అత్యధిక సంఖ్యాకులు కనీస సదుపాయాలు కరువై ఇబ్బంది పడుతుంటే మంత్రులు భారీ ప్రతిపాదనలతో ముందుకొస్తున్నారు. కేంద్ర రవాణా శాఖా మంత్రి జగదీశ్ టైట్లర్ ఈమధ్య మలేసియా వెళ్లి అక్కడినుంచి ఒక ప్రతిపాదన తీసుకొచ్చారు. ఢిల్లీ, కలకత్తా, హైదరాబాద్, మద్రాసు, బెంగుళూరు బొంబాయి నగరాలను కలిపే ఒక ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణ ప్రతిపాదనది. దాదాపు అరవై వేల కోట్ల రూపాయల వ్యయం కాగల ఈ ప్రతిపాదనను ఓ మలేసియా కంపెనీ సమర్పించిందని, అది ప్రభుత్వ పరిశీలనలో ఉందని టైట్లర్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారులను అభివృద్ధి పరచుకోకుండా ఆరు మహానగరాలను కలపడానికి రూ. 60 వేల కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడం ఎంత వరకు సమంజసం అన్నది ప్రశ్న. మహానగరాల సౌకర్యాలను గురించి ఆరాటపడుతున్న అమాత్యులకు కనీసం మెటల్ రోడ్లయినా లేని గ్రామాలు కన్పించడంలేదా? సరైన రోడ్లు, రవాణా సదుపాయాలు లేక గ్రామాల ప్రజలు ఎన్నో ఇక్కట్లను ఎదుర్కొంటున్న విషయాన్నే విస్మరిస్తున్నారు. ప్రధానమంత్రి నరసింహారావు ఇటీవల అమెరికా పర్యటనకు బయలుదేరే ముందు కేంద్ర ప్రభుత్వం కొత్త టెలికామ్ విధానాన్ని ప్రకటించింది. 1997 నాటికి కోరిన ప్రతి వ్యక్తికి తక్షణమే టెలిఫోన్, ప్రతి గ్రామానికి టెలిఫోన్ కనెక్షన్ ఇవ్వడం ఈ విధానంలోని ప్రధాన లక్ష్యాలు ఈ లక్ష్యాలు. బాగానే ఉన్నాయి. కాని, టెలిఫోన్ల కంటే ముఖ్యం కూడు, గూడు, తాగడానికి మంచినీరు, మరుగుదొడ్డి సదుపాయం, రోడ్లు, రవాణా సౌకర్యాలు, ఉపాధి మొదలయినవి. ఈ రోజు దేశంలోని 5,76,490 గ్రామాలలో లక్షా 40 వేల గ్రామాలలో మాత్రమే టెలిఫోన్ సౌకర్యం ఉంది. 28.45 లక్షల మంది టెలిఫోన్ కోసం దరఖాస్తు చేసి నిరీక్షిస్తున్నారు. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికా కాలంలో కోటి టెలిఫోన్ కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యమని నూతన టెలికామ్ విధానం ప్రకటించింది. నిజానికి, ఎనిమిదో ప్రణాళికలో మొదట పేర్కొన్న లక్ష్యం 75 లక్షల కనెక్షన్లే. ఒక్కొక్క లైనుకు సగటున రూ. 47 వేలు ఖర్చుకాగల ఈ 25 లక్షల కనుక్షన్లకు రూ. 11,750 కోట్ల మొత్తం అవసరమవుతుంది 4 లక్షల గ్రామాలకు

కనెక్షన్లు ఇవ్వడానికి రూ. 4 వేల కోట్లు అవసరమవుతాయి. అంటే, మొత్తం రూ. 15,750 కోట్ల డబ్బు అవసరమవుతుంది. ఇదిగాక, ఎనిమిదవ ప్రణాళిక లక్ష్యాలను సాధించడానికి రూ. 7500 కోట్ల లోటు ఉంటుందని అంచనా. అందువల్ల మొత్తం మీద రూ. 23 వేల కోట్ల వనరుల కోసం విదేశీ సంస్థలను ఆహ్వానించకతప్పదని ప్రభుత్వం భావిస్తున్నది. భారతదేశంలో సగటు తలసరి ఆదాయం, సగటును ఒక్కో కుటుంబం టెలిఫోన్ నిమిత్తం చేస్తున్న ఖర్చు ఇతర దేశాలతో పోల్చినప్పుడు చాల తక్కువ. ఇక్కడి గ్రామాలలో చాలా కుటుంబాలకు టెలిఫోన్ వ్యయాన్ని భరించేస్థోమత లేదు. వాస్తవానికి నేడు కోటి కనెక్షన్లు అవసరంలేదు. ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం 75 లక్షల కనెక్షన్లు ఇవ్వగలిగితే ఘనకార్యం సాధంచినట్లే. 25 లక్షల అదనపు కనెక్షన్ల మాట మరచిపోతే వ్యయం రూ. 23 వేల కోట్ల నుంచి రూ. 11250 కోట్లకు తగ్గుతుంది. ఈ మధ్య టెలికమ్యూనికేషన్ శాఖ లీజ్ ఫైనాన్సింగు కోసం టెండర్లు పిలవగా రూ. 7 వేల కోట్లు లభించే అవకాశం ఏర్పడింది. ఏమయినా, మన కమ్యూనికేషన్ శాఖా మంత్రికి విదేశీ బహుళ జాతుల సంస్థల పట్ల మక్కువ హెచ్చుతున్న నిదర్శనాలు కన్పిస్తున్నాయి. సి-డాట్ టెక్నాలజీతో రూపొందిన పదివేల లైన్ల ఎక్స్ఛేంజి బెంగుళూరులో రెండు సంవత్సరాల నుంచి చక్కగా పనిచేస్తున్నది. బెంగుళూరులోని ఇతర ఎక్స్ఛేంజీల కంటే ఎక్కువ ఆదాయం ఇందులో లభిస్తున్నదయినప్పటికి దీనిని కాదని విదేశీ కంపెనీలకు ఆర్డర్లు ఇవ్వడం సమంజసం కాదు. విదేశీయుల పెట్టుబడి ఎంత శాతం ఉండాలన్న విషయంలో భారత ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. నూతన టెలికామ్ విధానం పర్యవసానంగా అనేక స్వదేశీ సంస్థలు మూతపడే ప్రమాదం కన్పిస్తున్నది.

థర్మల్ విద్యుత్ రంగంలో కూడా ఇదే ప్రమాదం ఎదురవుతున్నది. ఈ సందర్భాన భారత హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) గురించి చెప్పాలి. దాదాపు 80 వేల మంది కార్మికులు ఇంజనీర్లు పనిచేస్తున్న ఈ సంస్థ ఇప్పటికే 42, 665 మెగావాట్ల ఉత్పాదక శక్తిని నెలకొల్పింది. ఇది సంవత్సరానికి 4810 మెగావాట్ల థర్మల్ కేంద్రాలను నిర్మించగలుగుతుంది. సుమారు 50 వేల మంది కార్మికులున్న 1700 చిన్న తరహా యూనిట్లు, 165 అనుబంధ సంస్థలు భెల్‌కు కావలసిన పరికరాలను కొన్నింటిని సరఫరా చేస్తుంటాయి. విదేశాలకు 8,210 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి శక్తిని భెల్ ఎగుమతి చేసింది. అయినప్పటికి, ఇటీవల నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాన్ని

ప్రకటించిన పిదప ఈ సంస్థకు ఆర్డర్లు సరిగ్గా ఇవ్వకుండా ద్వైపాక్షిక ఒప్పందాల పేరిట విదేశీ కంపెనీలకు విద్యుచ్ఛక్తి సంబంధ ఆర్డర్లు ఇస్తున్నారు. విదేశీ కంపెనీలకంటే తక్కువ మొత్తానికి విద్యుత్ కేంద్రాలను స్థాపించడానికి 'భెల్' సిద్ధంగా ఉంది. అయినప్పటికీ థర్మల్ పవర్ ఆర్డర్లు ఈ సంస్థకు లభించలేదు. 60 మెగావాట్ల హైడ్రో పవర్ ఆర్డరు మాత్రమే లభించింది. విద్యుత్ ఉత్పాదక రంగంలో 'భెల్' అభివృద్ధి పరిచిన టెక్నాలజీ ప్రశంసనీయమయినది. విజయవాడలోని థర్మల్ విద్యుత్ కేంద్రం 96 శాతం పవర్ లోడ్ ఫాక్టర్ (పి.ఎల్.ఎఫ్)ను అనేక సంవత్సరాలనుంచి సాధిస్తున్నది. ప్రభుత్వ సహాయం సంపూర్ణంగా లభిస్తే ఇది ఆసియా ఖండంలోనే శక్తిమంతమైన ఎమ్.ఎన్.సి.గా రూపొందగలుగుతుంది. కాని, ప్రభుత్వ కటాక్షం విదేశీ ఎమ్.ఎన్.సి.ల మీద ప్రసరిస్తున్నది. మహారాష్ట్రలో 1920 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని ఎన్‌రాన్ అనే అమెరికన్ కంపెనీ నెలకొల్పడానికి అనుమతి లభించిది. ఎన్‌రాన్ కంపెనీ స్థాపించే థర్మల్ కేంద్రం వల్ల దేశంలోని వినియోగదారుల మీద భారం అధికమవుతుంది. దేశీయ పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం పెరుగుతుంది. ఈ విదేశీ కంపెనీవల్ల లాభపడేది అవినీతి పరులయిన రాజకీయ నాయకులు, అధికారులు మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో జేగురుపాడు గ్యాస్ విద్యుత్ కేంద్రం స్థాపనను రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డుకు మొదట అనుమతి లభించినప్పటికి తరువాత ఆ అవకాశాన్ని ప్రైవేటు రంగంలోని జి.వి.కె. కంపెనీకి కల్పించారు. రెండు సంవత్సరాలయినా ఈ కంపెనీ పని ప్రారంభించలేదు. కృష్ణపట్నంలో 500 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నెలకొల్పడానికి, అక్కడే మరొక 500 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నెలకొల్పడానికి, అక్కడే మరొక 500 మెగావాట్ల థర్మల్ కేంద్రం నెలకొల్పడానికి అమెరికాలోని బ్రూక్లిన్ కంపెనీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన అనుమతి వివాదాగ్రస్తమయింది. ఇటువంటి ప్రయత్నాలు కొద్దిమంది వ్యక్తులు అమాంతం కుబేరులు కావడానికి మాత్రమే ఉపకరిస్తాయి. ఇవి దేశానికి, ప్రజలకు ఎంత మాత్రం మేలు చేయలేని పథకాలు.

## సమస్యలు 'బహుళ'మయ్యే ప్రమాదం

భారతదేశంలో జల విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి ఉన్న వనరులలో ఇప్పటివరకు 18 శాతం మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. నీటిపారుదల రంగంపట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీనత కారణంగా ఇటువంటి దుస్థితి ఏర్పడింది. దేశం స్వాతంత్ర్యం

పొందిన రోజుల్లో మొత్తం విద్యుచ్ఛక్తిలో జల విద్యుచ్ఛక్తి భాగం 37 శాతం కాగా ఇప్పుడది 26 శాతానికి తగ్గింది. జల విద్యుదుత్పత్తి, నీటిపారుదల పథకాలు అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. జల విద్యుచ్ఛక్తి కేంద్రాల నిర్మాణానికి ఎక్కువ కాలం పట్టినా తక్కువ ఖర్చుతో విద్యుచ్ఛక్తి లభిస్తుంది. గరిష్ఠస్థాయి అవసరాలను తీర్చడానికి జల విద్యుచ్ఛక్తి అధికంగా ఉపకరిస్తుంది. ఈ అంశాలన్నింటిని విస్మరించి, ప్రజల అభ్యుదయాన్ని, శ్రేయస్సును ఉపేక్షించి పాలకులు పచ్చి స్వార్థంతో విదేశీ సంస్థల ఒత్తిడికి లొంగి జాతీయ ప్రయోజనాలకు భంగం కల్గిస్తున్నారు. దేశ జనాభాలో నూటికి డెబ్బయి మంది జీవనానికి ఆధారంగా ఉన్న వ్యవసాయ రంగానికి ఎనిమిదవ ప్రణాళికలో కేటాయించింది కేవలం రూ. 22467 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులు పెరగడానికి అవసరమయిన నీటిపారుదల రంగానికి రూ. 32565 కోట్లు, విద్యుచ్ఛక్తి రంగానికి 115561 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పట్టణాలలో కొద్ది మందికి మాత్రమే ఉపయోగపడుతున్న టెలికమ్యూనికేషన్ రంగానికి రూ. 60 వేల కోట్లు కేటాయించడం విచిత్రం. ఒక మాటలో చెప్పాలంటే, భారత ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు విదేశీ రుణ భారం తీవ్రంకావడానికి, దేశంలో నిరుద్యోగం పేదరికం మరింత వికృత రూపం ధరించడానికి కారణమవుతాయి.

*ది. 09-08-1994.* — *ఈనాడు*

●

# గట్టి విధానమా వట్టి నినాదమా...?

భారత దేశం పల్లెలలో, పట్టణాలలో ఎటు చూసినా మురికి పేటలు, పూరి గుడిసెలు కోకొల్లలు. కోట్లాది ప్రజలు కనీస జీవనసదుపాయాలు లేక బతుకులీడుస్తున్నారు. దేశంలో ఇళ్ల కొరతకు కారణాలు అనేకం. పేదరికం, అదుపులేని జనాభా పెరుగుదల, గృహ నిర్మాణాలకు స్థలాలు లభించకుండా ఆర్థిక, చట్టపర అవరోధాలు, భరించలేని నిర్మాణ వ్యయం వంటివి అందులో కొన్ని పట్టణ ప్రాంతాలలో ఇళ్ల సంఖ్య 1961లో 1.41 కోట్లు, 1971లో 1.85 కోట్లు, 1981లో 2.80 కోట్లు. వివిధ కారణాలతో పల్లెప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రాంతాలకు వలస పోతున్నారు. దీనితో 1991 నాటికి పట్టణ ప్రాంతాలలో ఇళ్ళ సంఖ్య దాదాపు 4.26 కోట్ల స్థాయికి వచ్చిందని జాతీయ గృహ నిర్మాణ సంస్థ అంచనా వేసింది. అయినప్పటికి, 1991 నాటికి పట్టణ ప్రాంతాలలో 1.04 కోట్ల ఇళ్ల కొరత ఏర్పడిందని ఈ సంస్థ వెల్లడించింది. ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక కాలంలో అదనంగా 95 లక్షల గృహాలు అవసరమవుతాయని అంచనా. ఇక పల్లె ప్రాంతాలలో ఇళ్ల సంఖ్య 1961లో 6.52 కోట్లు, 1971లో 7.45 కోట్లు, 1981లో 8.87 కోట్లు, 1991లో 10.62 కోట్లు. కాని, ఈ పెరుగుదలను చూసి సంతోషించలేం. నిజానికి 1991 నాటికి పల్లె ప్రాంతాలలో 2.06 కోట్ల ఇళ్ల కొరత ఏర్పడిందని లెక్కలు వేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఎనిమిదవ ప్రణాళిక కాలంలో అదనంగా 1 కోటి 22 లక్షల ఇళ్ళు అవసరమవుతాయని అంచనా. గృహవసతి కొరత తీవ్రతను పరిశీలించడానికి నియమితమయిన ఒక ఉప బృందం 2001 నాటికి 6కోట్ల 44 లక్షల నూతనగృహాలు అవసరమవుతాయని అభిప్రాయపడింది.

## కేటాయింపులు స్వల్పం

గూడు, నీడలేని ప్రతి కుటుంబానికి 2000 సంవత్సరం నాటికి గృహ వసతితో పాటు, ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని 1988 డిసెంబరు 20న ఐక్యరాజ్య

సమితి సర్వప్రతినిధి సభ తీర్మానించింది. భారత ప్రభుత్వం 1988 మే నెలలో పార్లమెంటులో ప్రవేశపెట్టిన జాతీయ గృహ వసతి విధానం ఆ తరువాత ముందుకు వెళ్లలేదు. కొన్ని చేర్పులు, మార్పులతో ఈ విధానాన్ని తిరిగి 1992 మే నెలలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దీనిపై ఇప్పుడు పార్లమెంటులో చర్చ జరుగుతున్నది. దీన్ని పార్లమెంటు ఆమోదించినంత మాత్రాన గృహవసతి కొరత తీరబోదు. ఈ మేరకు జాతీయ గృహవసతి విధానానికి ఒక రూపం ఇవ్వడానికి నాలుగేళ్లు పట్టింది. ప్రభుత్వ చిత్తశుద్ధి శ్రద్ధాసక్తులకు ఈ జాప్యమే నిదర్శనం. గృహ నిర్మాణ రంగానికి తగినన్ని ఆర్థికవనరులు సమకూర్చడం అన్నిటికన్నా ముఖ్యం. 1990-95 కాలంలో ఇటుక, కలప, ఇనుము, సిమెంటు, తదితర సామగ్రి తగినంత లభ్యమయితే రూ. 77,590 కోట్ల ఖర్చుతో 2 కోట్ల 18 లక్షల ఇళ్లు నిర్మించడం సాధ్యమవుతుందని ఉపబృందం 1989-90 ధరల ప్రాతిపదికపై అంచనావేసింది. 1991-92 ధరల ప్రకారం ఈ వ్యయం రూ. 97,530 కోట్లకు పెరుగుతుంది. గృహ నిర్మాణ రంగానికి భారీ నిధులు అవసరమని స్పష్టమవుతున్నది. గృహ నిర్మాణ రంగానికి మొదటి పంచవర్ష ప్రణాళికలో 34 శాతం కేటాయించగా, అది ఏడవ ప్రణాళికలో 9.6 శాతానికి తగ్గింది. ఎనిమిదో ప్రణాళిక మొత్తం పెట్టుబడులలో 12 శాతం గృహ నిర్మాణ రంగానికి ఖర్చు చేయాలన్నది లక్ష్యం. కాని, ఈ లక్ష్యం నెరవేరుతుందని నమ్మకం లేదు. ఎనిమిదవ ప్రణాళికలో గృహ నిర్మాణ రంగానికి రూ. 6,377 కోట్లు కేటాయించారు. ఇందులో రూ. 3,582 కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయవలసి ఉంటుంది. స్థూల జాతీయోత్పత్తిలో గృహ నిర్మాణంపై పెట్టుబడి 1960లో 5 శాతం కాగా అది 1980 నాటికి 3 శాతానికి తగ్గింది. గృహ నిర్మాణ రంగంలో 'స్థూల స్థిర పెట్టుబడి కల్పన' (జి.పి.సి.ఎఫ్) 1980 దశాబ్దిలో 3.6 శాతం చొప్పున పెరిగింది. జాతీయ ఉత్పత్తిలో జి.పి.సి.ఎఫ్. శాతం (స్థిర ధరల ప్రాతిపదికపై) 1980-81లో 3.2 నుంచి 1990-91 నాటికి 2.6కు తగ్గింది. స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి.)లో గృహ నిర్మాణ రంగం ఆదాయం అదే కాలంలో 5.9 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గిందని అంచనా. అభివృద్ధి చెందిన దేశాలలో స్థూల జాతీయోత్పత్తిలో 5 శాతాన్ని గృహ నిర్మాణ రంగంపై ఖర్చు చేస్తుండగా ఇండియాలో ఇది నామమాత్రం. గృహ నిర్మాణ రంగానికి అవసరమయిన నిధులలో కేవలం 16 శాతం మాత్రమే ప్రభుత్వ బడ్జెటు ద్వారా, జీవిత బీమా కార్పొరేషన్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, హడ్కో, జాతీయ బ్యాంకులు వంటి సంస్థల ద్వారా

లభిస్తున్నాయి. మిగిలిన 84 శాతం నిధులను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు సమకూర్చడం జరుగుతున్నది. అమెరికా తదితర దేశాలలో ఇల్లు కొనుక్కోడానికి లేక నిర్మించడానికి పరపతి సదుపాయాలు పుష్కలం. ఇండియాలో అతి స్వల్పంగా ఉన్న ఈ పరపతి సౌకర్యం అధికంగా పట్టణ ప్రాంతాలకు, కొద్దిగా పల్లె ప్రాంతాలకు అందుబాటులో ఉంటున్నది జీవిత బీమా సంస్థ. తన పాలసీదారులకు గృహ వసతి నిమిత్తం ఇచ్చే రుణాల పథకం నగరాలు, పట్టణాలలోనే అమలవుతున్నది. జి.ఐ.సి. పథకం కూడా పట్టణాలకే అందుబాటులో ఉంది. పల్లె ప్రాంతాల్లో భూమి తాకట్టు పెట్టినా బ్యాంకులు గృహ నిర్మాణానికి అప్పులివ్వవు. ముఖ్యంగా తక్కువ ఆదాయ, బలహీనవర్గాల గృహ వసతి అవసరాలు తీర్చడానికి 1970లో హడ్కో సంస్థ స్థాపితమయింది. హడ్కో ఆర్థిక సహాయంలో 55 శాతం ఆర్థిక బలహీనవర్గాలకు, తక్కువ ఆదాయ వర్గాలకు, మిగిలిన 45 శాతం హెచ్చు ఆదాయవర్గాలకు, మధ్య ఆదాయ వర్గాలకు అద్దె ఇళ్ళ నిర్మాణాలకు, వాణిజ్య సముదాయాలకు లభిస్తుంది. హడ్కో కొంత మేరకు రాష్ట్ర హౌసింగు బోర్డులకు గూడా నిధులను సమకూర్చుతుంది. దేశంలో గృహ వసతి కొరతను చిత్తశుద్ధితో తీర్చాలనుకుంటే ప్రభుత్వం, హడ్కో రాష్ట్ర హౌసింగు బోర్డులు, జీవిత బీమా కార్పొరేషన్, తదితర సంస్థలు, జాతీయ బ్యాంకులు పట్టణాలలోనే గాక పల్లె ప్రాంతాలలో సైతం గృహ నిర్మాణానికి అవసరమయిన రుణ సదుపాయాలను గణనీయంగా కల్పించాల్సి ఉంటుంది.

## అవరోధాలు అధికం

దేశంలో గృహ వసతి సమస్య తీవ్ర రూపం ధరించడానికి నిధుల కొరత మొదటి కారణం. పట్టణాలకన్న, పల్లె ప్రాంతాలలో గృహ స్థలాల ధర తక్కువే. పట్టణ ప్రాంతాలలో పరపతికి మించిన ఖాళీ భూములను పట్టణ భూముల గరిష్ఠ పరిమితి చట్టం కింద సేకరించి గృహ నిర్మాణాలకు కేటాయించాలన్న లక్ష్యం కాగితాలకే పరిమితమయింది. ఈ చట్టం కింద లక్షల హెక్టార్ల భూమి మిగులుగా తేలినా ప్రభుత్వం సేకరించింది కేవలం 33,970 హెక్టార్లు మాత్రమే. విచిత్రం ఏమిటంటే ఈ చట్టంలోని 20 (బి) విభాగం కింద 54,229 హెక్టార్ల భూమికి మినహాయింపు లభించింది. మిగులు భూమిని వదులుకోవడం వల్ల కొన్ని కుటుంబాలకు ఇబ్బంది ఏర్పడితే అటువంటి సందర్భాలలో వారికి చట్టం నుంచి మినహాయింపు ఇవ్వడానికి అందులోని విభాగం

20 (బి) అవకాశం ఇచ్చింది. దీన్ని దుర్వినియోగ పరచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పట్టణ భూముల గరిష్ట పరిమితి చట్టం లక్ష్యాలు నెరవేరకపోగా, తదాశయాలకు భిన్నంగా పట్టణాలలో భూముల ధరలు అవినీతి విపరీతంగా పెరిగాయని పట్టణ విస్తరణ (అర్బనైజేషన్) జాతీయ కమీషన్ అభిప్రాయపడింది. అక్రమ లాభార్జనకు పట్టణ భూములను పెద్దయెత్తున గుప్పిటిలో పెట్టుకునే ధోరణిని అరికట్టాలని గృహ నిర్మాణానికి వీలయినంత ఎక్కువ భూమి అందుబాటులోకి తెచ్చేందుకు ఖాళీ స్థలాలపై కొద్ది సంవత్సరాల వ్యవధి తరువాత పన్ను విధించాలని, పట్టణ భూముల గరిష్ఠ పరిమితి చట్టానికి వెంటనే తగు సవరణలు చేయాలని కమీషన్ సిఫార్సు చేసింది. ప్రభుత్వం ఈ అంశానికి జాతీయ గృహ వసతి విధానంలో చోటు కల్పించింది. అద్దె నియంత్రణ చట్టాన్ని కూడా సవరించాలని, అప్పుడే అద్దె ఇళ్ళ నిర్మాణం జోరుగా సాగుతుందని కమీషన్ వివరించింది. అద్దె నియంత్రణ చట్టాన్ని సవరిస్తామని ప్రభుత్వం జాతీయ గృహ వసతి విధానంలో హామీ ఇచ్చింది. ఇంతవరకు పట్టణ భూముల గరిష్ఠ పరిమితి చట్టంలో గాని, అద్దె నియంత్రణ చట్టంలో గాని సవరణలు చేయలేదు. జాతీయ గృహ వసతి విధానాన్ని ప్రకటించి 27 మాసాలయినా ప్రభుత్వం సవరణలకు సంకల్పించడం లేదు. గృహ నిర్మాణానికి అవసరమయిన సిమెంటు, ఇటుక, కలప, ఇనుము, కంకర, శానిటరీ–ఎలక్ట్రికల్ సామగ్రి ధరలు రోజురోజుకు పెరిగిపోవడం ఇళ్ల కొరతకు ముఖ్య కారణం. సాధారణంగా నాణ్యమయిన ఇటుకల కోసం మట్టిని ఉపయోగిస్తుంటారు. దీనితో ప్రతి సంవత్సరం విశాలమయిన భూములు సారాన్ని, సాగును అర్హతను కోల్పోతున్నాయి. మరొక వంక థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద బూడిదను వదిలించుకోవడం పెద్ద సమస్య అవుతున్నది. ఇతర దేశాలలో అనాది నుంచి బూడిదతో ఇటుకలను తయారు చేస్తున్నారు. ఈ పద్ధతి మన దేశంలో ఆలస్యంగా మొదలయింది. బూడిదతో ఇటుకలు తయారు చేసే పద్ధతిని ప్రోత్సహించడానికి కొన్ని రాయితీలు ఇవ్వడం సముచితం. బూడిద ఇటుకలతో పట్టణాలలో పేవ్‌మెంట్స్ నిర్మించవచ్చు. ఇళ్ల నిర్మాణానికి, ఇతర అవసరాలకు టేకును ఉపయోగించడం వల్ల కలప ధర విపరీతంగా పెరిగింది. అంతేకాదు – కలప కోసం చెట్లను నరకడంతో అడవుల విస్తీర్ణం తగ్గి పర్యావరణ సమతూకం దెబ్బతింటున్నది. కాబట్టి వృక్ష సంపదను పెంచి అడవులను విస్తరింపజేయాలి. కలపకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ వ్యర్థ పదార్థాల వినియోగానికి ప్రోత్సాహం, రాయితీలు ఇవ్వాలి. వీలయినంత తక్కువ వ్యయంతో

ఇళ్లను నిర్మించే పద్ధతులను పథకాలను వ్యాప్తిలోకి తీసుకురావాలి. చాల తక్కువ ఖర్చుతో చక్కని పక్కా గృహాలను కట్టే ఒక పథకాన్ని కొన్నేళ్ల క్రితం ప్రముఖ పారిశ్రామికవేత్త జి.డి. నాయుడు సూచించారు. ఈ సూచనను ప్రభుత్వం స్వీకరించలేదు.

## లక్ష్యాలకు తగిన చర్యలు

గృహ వసతి సమస్యను సంతృప్తికరంగా సత్వరంగా పరిష్కరించాలంటే గృహ నిర్మాణ రంగంలో ప్రయివేటు సంస్థలను అధికంగా ఉపయోగించుకోగలగాలి. గతంలో గృహ నిర్మాణ కార్యక్రమాన్ని పరిశ్రమగా గుర్తించనందువల్ల, చట్టపరంగా, ప్రభుత్వ విధానాలలో ప్రయివేటు బిల్డర్లకు తగు స్థానం ఇవ్వకపోవడం వల్ల ప్రైవేటు రంగంలో గృహ నిర్మాణం పెద్దగా అభివృద్ధి చెందలేదు. ఇప్పటికయినా గృహ నిర్మాణానికి, స్థిరాస్తుల వర్తకానికి పరిశ్రమ స్థాయి కల్పించి ఈ రంగం శీఘ్ర పురోగమనానికి చర్యలు తీసుకోవాలి. ఉపాధి కల్పనలో గృహ నిర్మాణ రంగం గణనీయ పాత్ర నిర్వహించగలుగుతుంది. అది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించగలుగుతుందనడంలో సందేహం లేదు. గృహ నిర్మాణ రంగంలో పెట్టుబడి పది శాతం పెరిగితే ఉపాధి కల్పన పది శాతం హెచ్చుతుందని ఎనిమిదో ప్రణాళిక పేర్కొంది. పేద ప్రజల కనీస అవసరాలను తీర్చే కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ గృహ నిర్మాణ పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాలకింద పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి కొంత సబ్సిడీతోపాటు రుణాన్ని అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇందిరా ఆవాస్ యోజన కింద షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన పేదలకు గృహ నిర్మానానికి అవసరమయిన నిధులను ఉచితంగా సమకూర్చుతున్నది. ఇది సరైన పద్ధతి కాదు. హరిజన, గిరిజన వర్గాలకు కొంత ఎక్కువ సబ్సిడీ, వెనుకబడ్డ తరగతులకు, ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు కొంత తక్కువ సబ్సిడీ ఇవ్వడం మేలు; మిగిలిన మొత్తాన్ని రుణంగా ఇవ్వాలి. ఇతర వర్గాలకు సబ్సిడీ లేకపోయినా, హామీ మీద రుణ సదుపాయం కల్పించే విధానం చాల అవసరం. ఈ శతాబ్ది చివరికి ప్రతి వొక్కరికి నీడ కల్పించాలనే దృఢ సంకల్పం. చిత్తశుద్ధి ఉంటే పాలకులు జాతీయ గృహ వసతి విధానాన్ని ప్రకటించడంతో సంతృప్తి చెందక ఆశయ సాఫల్యానికి తగిన చర్యలన్నీ తీసుకోవాలి.

*ది. 27-08-1994.* — *ఈనాడు*

●

# ప్రశ్నించే తత్వానికి, శ్రమించే సంస్కృతికి మార్గం

నూతన సంవత్సరం ప్రారంభ దినం నుంచి ఎనిమిది రోజులపాటు రాష్ట్రంలో నిర్వహించిన 'జన్మభూమి' కార్యక్రమం ఎన్నో వినూత్న మార్పులకు కారణభూతమవుతుందని ఆశించవచ్చు ఈ పథకాన్ని సమర్థంగా, పకడ్బందీగా, చిత్తశుద్ధితో కొనసాగిస్తే ఆదర్శప్రాయమవుతుంది. ఇలాంటి కార్యక్రమాలు ఖచ్చితంగా ప్రజల ఆలోచనా సరళిలో, ప్రభుత్వాల పరిపాలనా పద్ధతిలో, ప్రణాళికల రూపకల్పనలో గణనీయమైన మార్పులు తీసుకురాగలుగుతాయి. ప్రపంచ జనాభాలో రెండోస్థానాన్ని ఆక్రమించిన భారతదేశం అభివృద్ధిపరంగా ఎంతో వెనకబడిపోయింది. ప్రజల భాగస్వామ్యం, సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యంకాదు. రకరకాల చిన్నా పెద్దా పనులకు పూర్తిగా ప్రభుత్వం మీదనే ఆధారపడుతుండడం విపరీత పరిణామాలకు దారితీస్తోంది. ప్రజలు కొంతమేర శ్రమను పంచుకోడానికి సిద్ధమై, ఆర్థికంగా కూడా కొంత సహకరించగలిగితే నిజానికి ఎన్నో పనులను సులభంగా, సత్వరంగా పూర్తిచేసుకోవచ్చు. ఇలాంటి దృష్టితోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ప్రజల వద్దకు పాలన, శ్రమదానం కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ ఏడాది వాటితోపాటు ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను సర్వే చేసేందుకు సూక్ష్మస్థాయి ప్రణాళికను సైతం అమలుచేయతలపెట్టింది. వీటన్నిటినీ కలిపి 'జన్మభూమి' పథకంగా ప్రకటించి తొలి విడతగా ఎనిమిది రోజులపాటు నిర్వహించింది. జన్మభూమి కార్యక్రమం ఆశావహ ఫలితాలను సాధిస్తుందని చెప్పవచ్చు. ఇది క్రమబద్ధంగా సుదీర్ఘ ప్రక్రియగా కొనసాగాలి. తమ సమస్యల పరిష్కారానికి ఎవరి మీదనో ఆధారపడకుండా తామే చొరవ చూపాలని, తమ భాగస్వామ్యంతోనే సత్ఫలితాలు సాధ్యమనే అవగాహన జన్మభూమి కార్యక్రమం వల్ల ప్రజల్లో పెంపొందించి వేలమంది విద్యార్థులు గ్రామాలకు తరలివెళ్లి గ్రామీణులతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. పరిశుభ్రత, ప్రాథమిక సదుపాయాల కల్పన, మరమ్మతులు వంటి ఎన్నో సమస్యలు సులభంగా పరిష్కారమయ్యాయి. స్కూళ్ళకు,

ఇతర ప్రభుత్వ భవనాలకు సున్నం వేయడం, వీధుల్లో చెత్తాచెదారాన్ని శుభ్రపరచడం, రహదారులకు మరమ్మతులు చేయడం, ప్రజలకు కావలసిన ఇతర సదుపాయాలను గుర్తించడం ఈ దఫా జన్మభూమి కార్యక్రమంలో పూర్తయిన కొన్ని పనులు. మలివిడత 'జన్మభూమి' కార్యక్రమాన్ని మే నెలలో కొనసాగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలు, అధికారులు, దాతలు, ప్రవాస భారతీయులు సంకల్పశుద్ధితో పాలుపంచుకుంటే ఆంధ్రప్రదేశ్ ఆదర్శవంతంగా మారి తీరుతుందని ఆశించవచ్చు. ఈ కృషిలో అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరం.

## ప్రజలు ప్రేక్షకులు కాకుండా...

బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం విముక్తమై యాభయ్యేళ్లవుతున్నా ఈనాటికీ బ్రిటిష్ తరహా పాలన విధానమే కొనసాగుతోంది. ప్రతి చిన్న పనికి ప్రజలు లోగడ తహసిల్దారు కార్యాలయానికి వెళ్లవలసివచ్చేది. ఇప్పుడు మండల రెవిన్యూ అధికారి కార్యాలయానికి వెళ్లవలసివస్తోంది. ఎన్నో పర్యాయాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగితేకాని, అది కూడా కొంత డబ్బు ఖర్చుపెడితేగానీ పని కాదు. ఎన్ని అర్జీలు పెట్టుకున్నా అతీగతీ తెలియదు. పలుకుబడిగలవాళ్లకు, ధనవంతులకు తప్ప సామాన్య ప్రజలకు సాధారణంగా పాలనా యంత్రాంగం నుంచి తగిన స్పందన, ఆదరణ లభించవు. చాలామంది అధికారులు తామే సర్వం సహా అనే భావనలో ఉంటున్నారు. ప్రజలు విసుగెత్తిపోయి నిర్లిప్తతకు లోనవుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజల వద్దకు పాలన' అనే వినూత్న తరహా కార్యక్రమాన్ని చేపట్టింది. పాలనా యంత్రాంగాన్ని ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం చేయకుండా, ప్రజాస్వామ్యంలో నిజమైన ప్రభువులైన ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వీలైనంత త్వరగా వాటిని పరిష్కరింపజేయాలన్నది కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమం వల్ల ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. గ్రామీణ ప్రజలు, నిరుపేదలు తాము అల్పులమన్న భావనను వీడి ధైర్యంగా తమ ఇబ్బందుల గురించి వెల్లడిస్తున్నారు. ప్రజలు అధికసంఖ్యలో ఉండి తమ సమస్యలను జంకూగొంకూ లేకుండా నిర్మొహమాటంగా చెప్పగలగడం ధైర్యాన్ని పెంపొందిస్తుంది. తమ సమస్యలను ఒకసారి 'ప్రజల వద్దకు పాలన'లో అధికారుల దృష్టికి తీసుకువస్తే మరుసటి పర్యాయం అధికారులు వాటి గురించి ప్రజలకు సమాధానం చెప్పాల్సివస్తుంది. ఇది జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుంది.

బాధ్యతారాహిత్యాన్ని అరికడుతుంది. ప్రజలు చెప్పిన సమస్యలను తాము ఏమేరకు పరిష్కరించగలిగిందీ, మిగిలిన వాటిని ఎందుకు చేయలేకపోయిందీ అధికారులు వివరించాలి. ఆ పనులలో ప్రజల భాగస్వామ్యం ఏ మేరకు ఏవిధంగా అవసరమో అధికారులు సవివరంగా చెప్పాల్సి ఉంటుంది. గ్రామ ప్రజలందరి సమక్షంలో సభ జరుగుతుంది కాబట్టి అక్రమాలకు అవకాశం ఉండదు ఇలాంటి కార్యక్రమాలు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందిస్తాయి. గత ఏడాది మూడు పర్యాయాలు ప్రజల వద్దకు పాలన కార్యక్రమం నిర్వహించగా ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రభుత్వ ఖర్చుతో నిమిత్తం లేని లక్షా అరవై నాలుగు వేల సమస్యలను గుర్తించారు. వాటిలో దాదాపు లక్షా ముప్పైవేల సమస్యలు పరిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా సాగుచేస్తున్న బంజరుభూములకు పట్టాలు లభించాయి. ప్రభుత్వ పోరంబోకు స్థలాలలో గుడిసెలు వేసుకున్న వేలమంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు వచ్చాయి. భూసేరణ, పంపకం కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామీణ లింకు రహదార్లు, చిన్న కల్వర్టుల నిర్మాణాలు, తాగునీటి సదుపాయం, విద్యుత్తు సరఫరా, పారిశుధ్యం, విద్యా వైద్య సౌకర్యాల కల్పన గురించి ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజెప్పారు. డబ్బు ఖర్చుతో కూడిన పనులను మదింపువేసి, దాదాపు 30 వేల పనులను చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం తగువిధంగా నిధులు మంజూరుచేసినట్లయితే ఇంకా వేలకొలది పనులను పూర్తిచేయడానికి అవకాశం ఉంటుంది. ప్రజల విరాళాలకు, శ్రమదానానికితోడు, శాసనసభ్యుల, పార్లమెంటు సభ్యుల నియోజకవర్గ అభివృద్ధి నిధులనుంచి కొంత, స్థానిక సంస్థల నుంచి కొంత సహకారం లభిస్తే పల్లెసీమలు ఎంతో ప్రగతి సాధిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, రహదారులు, సైడ్ డ్రెయిన్లు, స్కూలు భవనాల మరమ్మతులు చేపట్టి సుందర ప్రాంతాలుగా మలచవచ్చు ఇలాంటి కార్యక్రమాలు ఉద్యమంగా కొనసాగితేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయి. స్వాతంత్ర్యోద్యమ కాలం, ఆ తర్వాతి దృష్టాంతాలను ఇందుకు ఆదర్శంగా తీసుకోవచ్చు. పరాయిపాలన పోయి స్వపరిపాలన వస్తే ఎంతో అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలందరూ సుఖశాంతులతో విలసిల్లుతారని ఆశించారు. పాలకులు మారారు. కాని పాలనా పద్ధతులు మాత్రం మారలేదు. పాలకులకు ప్రజలకు మధ్య అగాధం పెరుగుతూ వస్తోంది. పాలనా యంత్రాంగం ప్రజలకు సేవలందించడంకన్నా ఆటంకాలు కలిగించడానికే ఉందన్న అభిప్రాయం బలపడింది. రాజకీయ నాయకులపట్ల, పాలనా

యంత్రాంగంపట్ల ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది. చులకనభావం, నిరాసక్తత పెంపొందింది. నాయకులు, అధికారులు ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తుంటే తాము ఎందుకు త్యాగాలు చేయాలన్న ప్రశ్న తలెత్తింది. దానితో తాము నిత్యం ఎదుర్కొనే సమస్యలను కూడా ప్రభుత్వమే పరిష్కరించాలన్న భావన చాలామందిలో బలపడింది. ప్రతి పని ప్రభుత్వమే చేయడం అసాధ్యమని, కొన్ని పనులను తాము కూడా చేసుకోకతప్పదనే ఆలోచనను 'శ్రమదానం' కార్యక్రమం కలిగిస్తుంది. అన్నీ కాకపోయినా కొన్ని పనులను చేసుకోవడానికి శ్రమదానం కార్యక్రమం దోహదపడింది. పంటకాల్వల్లో, చెరువుల్లో తూడు తొలగించడం, పంటచేలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామీణ లింకు రహదార్ల నిర్మాణం, పాఠశాల భవనాలకు రంగులు వేయడం, చిన్నచిన్న మరమ్మతులు చేపట్టడం వంటి అనేక పనులను పూర్తి చేసుకోవచ్చనే విశ్వాసాన్ని శ్రమదాన కార్యక్రమం కలిగించింది. కష్టపడి శ్రమించడంలోగల ఆనందం, గౌరవం గురించి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందనవచ్చు. భావిభారత పౌరులైన విద్యార్థినీ విద్యార్థులు శ్రమదాన కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ పునర్నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించగలరని రుజువు చేశారు. సరయిన మార్గదర్శకత్వముంటే యువతరం ఎంతయినా కృషిచేయగలదన్నది కూడా ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమయింది. ప్రజలు ఈ కార్యక్రమాల వల్ల ఒనగూరే ఫలితాల గురించి విశ్లేషిస్తున్నారు. తమ భాగస్వామ్యం, శ్రమదానం వల్ల నిధుల దుర్వినియోగాన్ని, దళారుల దోపిడీని, అవినీతిని, జాప్యాన్ని నివారించవచ్చునని గ్రహిస్తున్నారు. తాము పన్నుల రూపేణా ప్రభుత్వానికి సమకూరుస్తున్న ధనం దుర్వినియోగం కాకుండా ఉండాలంటే, కాంట్రాక్టర్లు–అధికార్లు–ప్రజాప్రతినిధులు ఆ ప్రజాధనాన్ని స్వాహా చేయకుండా ఉండాలంటే, తమ అభివృద్ధికే ఆ ధనం ఉపయోగపడాలంటే తమ క్రియాశీలత అవసరమని భావిస్తున్నారు. కిందటి సంవత్సరం నూరుశాతం ప్రజల విరాళాలతో నలభై వేల పనులను శ్రమదానంతో పూర్తిచేసినట్టు అంచనా. యాభై శాతం ప్రజల సహకారం, యాభైశాతం ప్రభుత్వ సహాయంతో సుమారు నాలుగువేల పనులు పూర్తయినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రజలు చొరవ చూపితే ఎలాంటి తీవ్ర సమస్యలనైనా పరిష్కరించవచ్చునడంలో సందేహం లేదు. సూరత్ నగరం ఇందుకో దృష్టాంతం. భయంకరమైన ప్లేగు, కలరా వ్యాధులతో సతమతమైన సూరత్ నగరం ఇప్పుడు సమర్థుడైన కమీషనర్ చొరవ, ప్రజల సహకారం వల్ల పరిశుభ్రంగా, సుందర

నగరంగా రూపుమారింది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి యాభయ్యేళ్లు అవుతోంది. ఇప్పటికి ఎనిమిది పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అమలుచేశారు. వాగ్దానాలు, అభివృద్ధి ప్రణాళికలన్నీ నాలుకలకు, కాగితాలకే పరిమితం కాగా వాస్తవ పరిస్థితి వెక్కిరిస్తోంది. ఇప్పటికే దాదాపు రెండు లక్షల గ్రామాలకు వేసవిలో తప్ప వెళ్లేందుకు సరయిన రహదారి లేదు. తొంభైవేల గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం లేదు. గ్రామీణ భారతం ఎంతటి దుర్భరంగా ఉందో ప్రణాళిక సంఘమే విడమరిచి చెప్పింది. ఈనాటికీ గ్రామాల్లో నూటికి ఇరవై మంది స్త్రీలకు కూడా సరయిన మరుగుదొడ్ల వసతి లేదు. మూడోవంతు జనాభాకు సరయిన తాగునీరు లభించడంలేదు. తినడానికి తిండి లేక ఆకలిచావులు సంభవిస్తున్న దశలో పోషకాహార విలువలెక్కడ? ప్రప్రంచంలో క్షయ వ్యాధితో బాధపడుతున్నవారిలో నాలుగోవంతుమంది భారతీయులేనని, ఈ టి.బి. వల్ల ఏటా అయిదు లక్షల మందికిపైగా చనిపోతున్నారని అంచనా. ఏటా క్యాన్సర్ వ్యాధితో పది లక్షలమంది, హృదయ సంబంధ వ్యాధులవల్ల 25 లక్షలమంది చనిపోతున్నారు. ప్రపంచంలోని కుష్టు రోగుల్లో సగంపైగా భారతదేశంలోనే ఉన్నారు. ఇప్పటికీ దేశంలో సగం జనాభా నిరక్షరాస్యులే. ప్రపంచం మొత్తంలోని నిరక్షరాస్యుల్లో సగం భారతీయులే కావడం అవమానకరం. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 56 శాతం మంది మాత్రమే అక్షరాస్యులు. మహిళల్లో అక్షరాస్యత శాతం 33 శాతం మాత్రమే. ఇదివరకు జాతీయాదాయాన్ని అభివృద్ధికి సూచికగా పరిగణిస్తుండేవారు. ఇటీవలికాలంలో ప్రజల ఆర్థిక స్థాయికితోడు విద్యా, వైద్య సౌకర్యాల స్థితి, గృహ వసతి, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు చేకూరుతున్న స్థాయిని కూడా పరిగణనలోకి తీసుకొని మానవ అభివృద్ధి సూచికను లెక్కగడుతున్నారు. తలసరి ఆదాయం లెక్కల రీత్యా 173 దేశాల్లో భారతదేశం 141వ స్థానంలో, మానవ అభివృద్ధి సూచిక ప్రకారం 135వ స్థానంలో ఉంది. ప్రణాళికల్లో వివిధ రంగాలకు ప్రాధాన్యాలివ్వడంలో పొరపాట్లు, అట్టడుగు స్థాయిలో ప్రజల అవసరాలు, ఆకాంక్షలను గుర్తించి కేటాయింపులు చేయకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా భావించవచ్చు.

## సమైక్యంగా కదలితే సాధ్యమే ఏదైనా...

'జన్మభూమి' కార్యక్రమంలో భాగమైన సూక్ష్మస్థాయి ప్రణాళిక వినూత్నమైనది. ప్రభుత్వం పెద్దగా ఖర్చుపెట్టకుండానే విలువైన సమాచారాన్ని సేకరించగలిగింది.

ప్రజలకు ప్రాధాన్యక్రమంలో వెంటనే చేపట్టవలసిన పనులేమిటో, రానున్న అయిదేళ్ల కాలంలో చేయవలసిన కార్యక్రమాలేమిటో తెలుసుకొని రికార్డు చేశారు. ఇప్పుడు ఈ సమాచారాన్ని గ్రామాలు, పట్టణాలవారీగా కంప్యూటర్‌లో భద్రపరచవచ్చు. స్థానిక ప్రజల నుంచి ఆర్థికంగా, వస్తుపరంగా, శ్రమదానం రూపేణా లభించే సహాయ సహకారాలతో ప్రభుత్వం ఆయా పనులను పూర్తిచేయాలి. అవసరమైనమేర ప్రభుత్వం సహాయాన్ని అందజేయాలి. పనుల నిర్వహణ సక్రమంగా పూర్తయ్యేలా చూసేందుకు ప్రజాకమిటీలు నెలకొల్పాలి. అప్పుడు అక్రమాలకు ఆస్కారం ఉండదు. రాబోయేకాలంలో చేపట్టాల్సిన పనుల గురించి సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని, కార్యాచరణకు ఉపక్రమించాలి. ఎక్కువ డబ్బు ఖర్చు కాగల స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీహాళ్లు, హాస్టళ్ల నిర్మాణానికిగాను దాతల నుంచి విరాళాలు సేకరించవచ్చు. అలాంటి పనుల అంచనాల వివరాలను 'ఇంటర్‌నెట్' ద్వారా ప్రచారం చేస్తే ప్రవాస భారతీయుల నుంచి ప్రత్యేకించి ప్రవాసాంధ్రుల నుంచి ఆర్థిక సహాయం లభించే అవకాశముంటుంది. విరాళాల సేకరణ, వ్యయం, పనుల నిర్వహణకు సంబంధించి అవసరమైన మేరకు నిబంధనలు సడలించాలి. ప్రవాసులు వారికి నమ్మకమున్న వ్యక్తులు లేదా సంస్థల ద్వారా పనులను నిర్వహించుకోవాలనుకుంటే అందుకు అభ్యంతరాలుండకూడదు. తాము అందజేస్తున్న సహాయంతో ప్రతి రూపాయి సద్వినియోగం అవుతుందన్న విశ్వాసం కలిగితే వారు మరింత చొరవ చూపే అవకాశముంది. జనవరి ఒకటో తేదీనుంచి జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వ్యవసాయ పనుల ఒత్తిడివల్ల రైతులు, ఇతర కార్మికులు, కూలీలు ఎక్కువగా పాల్గొనలేకపోయారు. తిరిగి మే నెలలో నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో మరింత ఎక్కువమంది పాల్గొనేలా ప్రభుత్వం విస్తృత ప్రచారం చేపట్టాలి. అన్ని రాజకీయ పక్షాల కార్యకర్తలు శ్రమదానంలో పాల్గొనేలా చూడాలి. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ప్రతిఒక్కరు జన్మభూమి కోసం చిత్తశుద్ధితో పనిచేసిన పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొరియా, జపాన్ వలె ప్రగతిపథంలో శరవేగంతో ముందుకు దూసుకెళుతుందని ఆశించవచ్చు.

*ది. 19-01-1997.* **- ఈనాడు**

●

# అర్థరహిత డిమాండ్లతో అస్థిరత్వం

అన్నా డి.ఎం.కె. అధినేత్రి జయలలిత అనుసరిస్తున్న వైఖరితో వాజ్‌పేయి సర్కారు మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. వాజ్‌పేయి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పూర్తికాలం మనగలుగుతుందా? జయలలిత మధ్యలోనే పుట్టి ముంచుతారా? తమిళనాడులో కరుణానిధి నాయకత్వంలోని డి.ఎం.కె. ప్రభుత్వాన్ని రద్దు చేయాలని జయలలిత పదేపదే కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. తమిళనాడులో శాంతిభద్రతలను కరుణానిధి ప్రభుత్వం పరిరక్షించలేకపోతోందని, తీవ్రవాదుల దుశ్చర్యలు మితిమీరి పోతున్నాయని ఆమె ఆరోపిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే డి.ఎం.కె. ప్రభుత్వాన్ని డిస్మిస్ చేస్తామని బి.జె.పి. నేతలు ఎన్నికల బహిరంగ సభల్లో హామీ ఇచ్చారు గనుక ఇప్పుడు రాజ్యాంగంలోని 356 అధికరణం కింద కరుణానిధి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని జయలలిత పట్టుబడుతున్నారు. వాస్తవానికి తమిళనాడులో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని ఆ రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారుల బృందం అభిప్రాయపడుతోంది.

ప్రస్తుత పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వ మనుగడకు జయలలిత మద్దతు ఎంతైనా అవసరం. అన్నా డి.ఎం.కె. మద్దతును ఉపసంహరిస్తే వాజ్‌పేయి సర్కారు పడిపోవచ్చు. కేవలం అధికారాన్ని నిలబెట్టుకోవడానికి 356 అధికరణం కింద డి.ఎం.కె. ప్రభుత్వాన్ని రద్దుచేస్తే బి.జె.పి.కి. తాను ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి ఉండే పార్టీగా చెప్పుకునే అవకాశం ఉండదు. ప్రజాస్వామ్య విలువలను ప్రేమించే వర్గాలలో బి.జె.పి. పట్ల ఉన్న సదభిప్రాయం సడలుతుంది. తన ప్రభుత్వాన్ని డిస్మిస్ చేస్తే కరుణానిధి మద్రాస్ హైకోర్టులో సవాల్ చేయవచ్చు. కొంతకాలం కిందట ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని గవర్నర్ తొలగించినపుడు బి.జె.పి. అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేసింది. గవర్నర్ చర్య సమర్థనీయం కాదని, కల్యాణ్‌సింగ్ సర్కారు భవితవ్యం శాసనసభలోనే తేలాలని హైకోర్టు తీర్పు చెప్పింది. తమిళనాడులో డి.ఎం.కె. సర్కారును డిస్మిస్ చేస్తే,

బీహార్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్న సమతా పార్టీ డిమాండ్ ఊపందుకుంటుంది. ఈ సమస్యను అనేక కోణాలనుంచి క్షుణ్ణంగా పరిశీలించే ఎట్టి పరిస్థితుల్లోనూ 356 అధికరణాన్ని దుర్వినియోగపరచి అప్రజాస్వామికంగా రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయబోమని బి.జె.పి. అధినాయకత్వం ప్రకటించింది. ప్రధానమంత్రి వాజ్‌పేయి కూడా ఈ విషయాన్ని పదేపదే ఉద్ఘాటిస్తున్నారు. వాజ్‌పేయిని ప్రజలు పెద్ద మనిషిగా, మృదుస్వభావిగా అభిమానిస్తారు. ఆ మృదుత్వం వెనుక దృఢత్వాన్ని కూడా ఆయన అప్పుడప్పుడూ ప్రదర్శిస్తుంటారు. ఈ అంశంపై ఆయన రాజీ పడకపోవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో జయలలిత ఏమి చేస్తారనేది ఉత్కంఠ కలిగించే విషయం. తమిళనాడులో డి.ఎం.కె. ప్రభుత్వాన్ని రద్దు చేయనందుకు జయలలిత వాజ్‌పేయి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడం అంటూ జరిగితే అదొక చారిత్రక తప్పిదం అవుతుంది. ఆవేశంతో, అనుచిత పట్టుదలతో తన డిమాండ్‌ను నెరవేర్చలేదన్న పంతంతో ఆమె వాజ్‌పేయి ప్రభుత్వాన్ని పడగొట్టగలరేమోగానీ, కరుణానిధి ప్రభుత్వం రద్దు కావాలన్న ఆమె కోరిక మాత్రం తీరదు. ఒకవేళ వాజ్‌పేయి ప్రభుత్వం పతనమైతే, ఆ తరువాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయదలచిన పార్టీ లేదా పార్టీల కూటమి తగినంత మెజారిటీ సాధించలేకపోవచ్చు. వామపక్ష పార్టీలు కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి అంగీకరించవు. అంతిమంగా జయలలితకు లాభించేదేమీ ఉండదు. 356 అధికరణాన్ని దుర్వినియోగపరచకూడదని ఎం.డి.ఎం.కె. నాయకుడు గోపాలస్వామి ఇంతకుముందే అభిప్రాయపడ్డారు. పార్లమెంటు ఎన్నికలకు ముందే బి.జె.పి., సమతా, అన్నా డి.ఎం.కె. తృణమూల్ కాంగ్రెస్, ఎం.డి.ఎం.కె., పి.ఎం.కె., టి.ఆర్.సి., జనతా, అకాలీదళ్, లోక్‌శక్తి పార్టీలు కలసి ఒక ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. తమిళనాడులో కూడా అధిక శాతం ప్రజలు వాజ్‌పేయి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పడాలనే ఆకాంక్షతో సంబంధిత కూటమికి ఓటు వేశారు. కూటమి మెజారిటీ స్థానాలు దక్కించుకోగలిగింది. ఒకవేళ కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దుచేసి, శాసనసభకు ఎన్నికలు నిర్వహిస్తే జయలలిత పార్టీకి మెజారిటీ వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదు. పార్లమెంటు ఎన్నికల అనంతరం మెజారిటీ స్థానాలు దక్కించుకున్న పెద్ద పార్టీ నాయకునిగా, ఎన్నికల ముందే ఏర్పడిన పెద్ద కూటమి నాయకునిగా వాజ్‌పేయి ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి తెలుగుదేశం, నేషనల్ కాన్ఫరెన్స్, ఎ.జి.పి. వంటి ప్రాంతీయ పార్టీలు అంశాలవారీగా మద్దతునిస్తామని ప్రకటించి దేశం మరోసారి మధ్యంతర ఎన్నికలను ఎదుర్కొనే పరిస్థితిని తప్పించాయి. కొంతమంది రాజకీయ నాయకులు కేవలం అధికార దాహంతో కనీస ప్రజాస్వామ్య విలువల్ని విస్మరించడంవల్ల దేశం భారీగా మూల్యం చెల్లించాల్సి వస్తోంది. కొద్దికాలం

కిందట జైన్ కమిషన్ మధ్యంతర నివేదికను సాకుగా చూపి గుజ్రాల్ ప్రభుత్వంలోని డి.ఎం.కె. మంత్రులను తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌ను గుజ్రాల్ తిరస్కరించినందుకు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది. రాజీవ్ హత్యలో కుట్ర కోణంపై విచారణ జరిపిన జస్టిస్ జైన్ తుది నివేదిక వచ్చేవరకు, కనీసం ప్రత్యేక కోర్టు తీర్పు వెలువడేవరకు ఆగాలన్నా వినకుండా కాంగ్రెస్ మద్దతు ఉపసంహరిచింది. వేల కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన మధ్యంతర ఎన్నికలను ప్రజల నెత్తిన రుద్దింది. లోక్‌సభ ఎన్నికల్లో జస్టిస్ జైన్ కమిషన్ నివేదిక విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించకపోవడం గమనార్హం. దేశంలో దాదాపు నాలుగోవంతు లోక్‌సభ స్థానాలు గల ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఇతర పార్టీల పొత్తు లేనిదే కొద్దిపాటి స్థానాలనుకూడా దక్కించుకోలేని దురవస్థలో ఉన్న కాంగ్రెస్ పన్నెండో లోక్‌సభ ఎన్నికలకు రంగాన్ని సిద్ధంచేసింది. గతంలోకన్నా కొద్దిగా మాత్రమే బలాన్ని పెంచుకో గలిగింది. అదీ సొంత బలంతోకాక ఇతర పార్టీల పొత్తుతో మాత్రమే. ప్రస్తుతం అన్నా డి.ఎం.కె. అదే బాటలో పయనిస్తోంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి యాభై ఏళ్లు గడచినా అనేకమంది రాజకీయ నాయకులు పరిమితితో, సరైన అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. దేశ క్షేమం గురించి, ప్రజల సామాజిక ఆర్థిక పురోభివృద్ధి గురించి చాలామంది రాజకీయ నాయకులు, పార్టీలు ఆలోచించడం లేదు. వారి చూపు ఎంతసేపూ అధికారం, అందలాలపైనే. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం నడచుకోవాలనే ఆలోచనే కొరవడింది. అవసరమైతే కొంతకాలం ప్రతిపక్ష స్థానంలో కూర్చుని బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ ప్రజల అభిమానం పెట్టుబడిగా అధికారంలోకి రావాలన్న తపన మృగ్యమైపోయింది. దొడ్డిదారినయినా అధికారాన్ని చేజిక్కించుకోవాలన్న ధోరణితో వ్యవహరించడంవల్లనే ప్రజాస్వామ్యానికి తీరని నష్టం వాటిల్లుతోంది. ప్రజా శ్రేయానికి, దేశ సమగ్రాభివృద్ధికి కాక స్వప్రయోజనాలను సాధించుకోవడానికి రాజకీయ నాయకులు ప్రయత్నిస్తే ప్రజలు తగు గుణపాఠం నేర్పుతారన్నది చారిత్రక సత్యం. 21వ శతాబ్దానికి అతి చేరువలో ఉన్న తరుణంలోనైనా నేతలు విజ్ఞతతో వ్యవహరించి, ప్రజాస్వామ్య ప్రక్రియ సరైన పంథాలో పయనించేందుకు దోహదపడాలి.

*ది. 13-07-1998.* — *ఈనాడు*

●

విశ్లేషణ

# ఇందిర చూపిన తోవ నేటికీ సహేతుకం

యాభై మూడు సంవత్సరాలు కలసి ప్రయాణం చేసిన తర్వాత ఇప్పుడు 9 కోట్ల జాతి ముక్కలు, చెక్కలు కావాల్సిన అగత్యం ఏమిటి? అని నిష్పక్షపాతంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. లోగడ 1969-71 కాలంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బలంగా సాగింది. దాదాపు 365 మంది ఉద్యమ సందర్భంగా అసువులు బాశారు. 1971 మధ్యంతర ఎన్నికలకు ముందే బ్యాంకులను జాతీయీకరణ చేసి రాజభరణాలను రద్దుచేసిన ఇందిరాగాంధీ 'గరీబీ హఠావో' నినాదంతో దేశమంతటా ఘన విజయాన్ని సాధించగలిగినా తెలంగాణలో మాత్రం తెలంగాణ ప్రజాసమితి 10 పార్లమెంటు స్థానాలను గెల్చుకుంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రావడానికి కారణం మన రాష్ట్ర హైకోర్టు ముల్కీ నిబంధనలు చెల్లవని తీర్పు ఇవ్వడం. దానివలన విద్యార్థుల్లో రగిలిన ఆవేశం ఉద్యమానికి నారు పోయగా తెలంగాణ ఉద్యోగులు దానికి నీరుపోసి పెంచారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను, విద్యార్థుల ఆకాంక్షలను గాలికి వదిలివేసి చెన్నారెడ్డి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ముల్కీరూల్స్‌పైన హైకోర్టు ఇచ్చిన తీర్పుపైన సుప్రీంకోర్టుకు అప్పీలు చేయగా అత్యున్నత న్యాయస్థానం ముల్కీరూల్స్ చెల్లుతాయని తీర్పు చెప్పడంతో 'జై ఆంధ్ర' ఉద్యమానికి బీజం పడింది. మన రాజధానిలో రెండవ శ్రేణి పౌరులుగా ఆంధ్రులు బతకాల్సివస్తుందన్న బాధతో సీమాంధ్రలో యాభై రోజులకు పైగా 'జై ఆంధ్ర' ఉద్యమం కొనసాగింది. రెండు ఉద్యమాల సందర్భంలోనూ నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ వేర్పాటు డిమాండ్లకు తలొగ్గలేదు. "సమైక్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నేను బలపరుస్తాను. మన దేశంలోని రాష్ట్రాల పునాదులకు స్థూలంగా సహేతుకత ఉంది. స్వల్పకాలిక భావోద్వేగాలతో ఈ పునాదులను విచ్ఛిన్నం చేయడం సరికాదు" అని ఇందిరాగాంధీ పార్లమెంట్‌లో స్పష్టంగా ప్రకటించారు.

ఉభయ ప్రాంతాల నాయకులతో చర్చించి ముల్కీ రూల్స్‌ను, తెలంగాణ రీజినల్ కమిటీని ఇందిర రద్దు చేశారు. ఆరు సూత్రాల పథకాన్ని ప్రకటించి, దానికి చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్రపతి ఉత్తర్వును ప్రకటింప చేశారు. మొత్తం రాష్ట్రాన్ని జోన్లుగా విభజించి విద్యాసంస్థలలోనూ, ఉద్యోగ అవకాశాలలోనూ స్థానికులకు ప్రాధాన్యతనిచ్చారు. హైదరాబాద్ సిటీ పోలీసు వ్యవస్థను మాత్రం రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి మినహాయించారు. పీవీ స్థానంలో జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రులయ్యారు. ఇకముందు ప్రత్యేక తెలంగాణ ప్రసక్తే లేదని చెన్నారెడ్డి స్పష్టంగా ప్రకటించారు.

ఇది గతం. 2001లో తిరిగి కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ నినాదం తలకెత్తుకునేదాకా ఆ ప్రాంత ప్రజలు వేర్పాటు ఉద్యమాల జోలికి వెళ్లలేదు. ఈ నేపథ్యంలో అసలు విభజన అవసరమా? ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ద్వారా మాత్రమే ఆ ప్రాంత అభివృద్ధి సాధ్యపడుతుందనే వాదనలో నిజమెంత? లోతుగా పరిశీలిస్తే 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు, హైదరాబాద్ నగరం మినహా తెలంగాణ ప్రాంతంలోని జిల్లాలన్నింటిలో వైద్య సౌకర్యాలు, రహదారులు, నిజాంసాగర్ మినహా ఇరిగేషన్ వనరులు పెద్దగా లేవు. యాభై మూడు సంవత్సరాలు కలసి ప్రయాణం చేసి, దేశ విదేశాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకమైన గుర్తింపును సాధించిన తర్వాత ఇప్పుడు తొమ్మిది కోట్ల తెలుగు ప్రజలు ఎందుకు ఎవరికోసం విడిపోవాలి? దేశానికి అన్నపూర్ణగా ఖ్యాతి గడించిన మన రాష్ట్రం ఎందుకు విడిపోవాలి? ఆనాడు హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు తన ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసి విశాలాంధ్ర ఏర్పాటుకు దోహదం చేశారు. కానీ స్వార్థ, సంకుచిత, స్వల్పకాలిక ప్రయోజనాలకోసం తెలుగుజాతిని చీల్చడానికి కొందరు రాజకీయ నాయకులకు అవకాశం ఇవ్వాలా అని ప్రజలు ప్రశ్నించాల్సి ఉంది. తెలంగాణ ప్రాంతం ఇప్పటికీ అభివృద్ధి చెందలేదని, ఆంధ్ర పాలకులు తమను అణగదొక్కారని, తెలంగాణ నీటిని ఆంధ్రులు దొంగిలించుకుపోతున్నారని పదేపదే తెలంగాణవాదులు మాట్లాడటంలో వాస్తవం లేదు.

మర్రి చెన్నారెడ్డి, పీవీ నరసింహారావు, జలగం వెంగళరావు, టి. అంజయ్య ముఖ్యమంత్రులుగా రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. కేవీ రంగారెడ్డి, జె. చొక్కారావు ప్రభృతులు ఉపముఖ్యమంత్రులుగా వ్యవహరించారు. అనేక కీలక శాఖలను తెలంగాణ

ప్రాంతాలకు చెందిన మంత్రులు నిర్వహించారు. విలీనానికి ముందు తెలంగాణాలో చాలా కొద్ది సంఖ్యలో మాత్రమే పట్టణాలకుగాని, గ్రామాలకుగాని, విద్యుత్ సౌకర్యం ఉంది. రహదారులు చాలా అధ్వానస్థితిలో ఉండేవి. నిజాం షుగర్ ఫ్యాక్టరీ బోధన్‌లో, ఆజంజాహి టెక్స్‌టైల్స్ వరంగల్‌లో, కొద్ది పరిశ్రమలు హైదరాబాద్‌లో ఉన్నాయి తప్ప పెద్దగా పారిశ్రామిక ప్రగతి లేదు. ఆంధ్రప్రాంతంలో అప్పటికే పెద్ద సంఖ్యలో పాఠశాలలు, కాలేజీలు ఉండి అక్షరాస్యత శాతం తెలంగాణకన్నా చాలా ఎక్కువగా ఉంది. ఉదాహరణకు 1962లో అక్షరాస్యత కృష్ణాజిల్లాలో 35.69, కర్నూలు జిల్లాలో 24.3 శాతం ఉండగా నల్గొండ జిల్లాలో 6.39, ఆదిలాబాద్, కరీంనగర్‌జిల్లాల్లో 13.3 శాతం ఉంది. ఇప్పుడు ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రమే రాష్ట్ర సగటు అక్షరాస్యత స్థాయికన్నా తక్కువగా ఉంది.

తెలంగాణ జిల్లాలను కోస్తాంధ్ర వారు దోపిడీ చేస్తున్నారని పదేపదే ఆరోపించడం దురదృష్టకరం. తెలంగాణకు చెందిన పొన్నాల లక్ష్మయ్య, కడియం శ్రీహరి, మండవ వెంకటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, శీలం సిద్ధారెడ్డి ప్రభృతులే ఎక్కువ కాలం ఇరిగేషన్‌శాఖా మంత్రులుగా ఉండగా ఇది సాధ్యమా? తరచుగా కరువు రక్కసి కోరలలో చిక్కుకుంటూ ఉండే రాయలసీమలో సాగునీటి సౌకర్యాన్ని పెంచాలని తెలుగుగంగ పథకాన్ని ప్రారంభించారు ఎన్టీఆర్. రాయలసీమకు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలకు త్రాగునీటిని, సాగునీటిని అందించేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషిచేశారు. ఎలిమినేటి మాధవరెడ్డి కాల్వ పథకం ద్వారా ఫ్లోరిసిస్‌తో బాధపడుతున్న నల్గొండ జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చంద్రబాబునాయుడు కృషిచేశారు.

అవకాశం ఉన్నంతమేరకు సాగునీటి వసతిని రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరింప చేయాలన్న లక్ష్యంతో వైఎస్ జలయజ్ఞం కార్యక్రమం చేపట్టారు. ఎల్లంపల్లి, దేవాదుల, రాజీవ్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి, అలీసాగర్, శ్రీరాంసాగర్ వరద నీటి కాలవ, శ్రీరాంసాగర్ స్టేజ్-2. ప్రాణహిత - చేవెళ్ల మున్నగు పథకాల ద్వారా కొత్తగా 48 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు కృషి జరుగుతోంది. తెలంగాణలోని సాగుభూమి మూడువందల మీటర్లకు పైగా ఎత్తులో ఉండటం వలన లిఫ్టుస్కీములే మార్గం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ ఇప్పటికే పెండింగ్‌లో

ఉన్న సంగతిని విస్మరించరాదు. కృష్ణా డెల్టాకు రావల్సిన నదీజలాలు పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు వెళ్తాయి. కావున పోలవరం నుండి కృష్ణాడెల్టాకు సకాలంలో నీరు రాకపోతే ఖరీఫ్ వరి పంట దిగుబడులు తగ్గటమేకాక అపరాల ఉత్పత్తి బాగా దెబ్బతినే ప్రమాదం ఉంది. పోలవరం వద్ద ఉపయోగించుకోకపోతే ఆ గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతాయని టీఆర్ఎస్ నాయకులు గమనించాలి. అంతేకాదు కృష్ణా డెల్టా ఆధునీకరణ జరగకుండానే కృష్ణా డెల్టాకు కేటాయించిన దాంట్లో నుండి 20 టీఎంసీల నీటిని బీమా ప్రాజెక్టుకు ఉపయోగించుకునేందుకు డెల్టా రైతాంగం అంగీకరించిన వైనాన్ని తెలంగాణవాదులు గుర్తుంచుకోవాలి.

ఇప్పటికీ 1955-56లతో పోలిస్తే మన రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించింది. అనేకమైన అంశాలలో దాదాపు అన్ని జిల్లాలు గణనీయమైన ప్రగతిని సాధించాయి. కొద్ది సంవత్సరాల క్రితం జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలను ఏర్పాటు చేసినా ప్రజల జీవితాలలో ఏ మాత్రం మార్పు రాకపోగా తీవ్రవాద కార్యకలాపాలతో శాంతిభద్రతలు కొరవడి పరిస్థితి ఏర్పడింది. అందువలన ఈనాడు ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడంవలన ఆ తెలంగాణ ప్రాంతం అభివృద్ధి కుంటుపడటమేకాక రాజధానుల ఏర్పాటు, వాటికి అవసరమైన ఆర్థిక వనరులను ఎవరు, ఎలా సమకూర్చాలి? నదీజలాల పంపిణీ నిర్వహణ, బొగ్గు, సహజ వాయువు ఎనర్జీ మున్నగువాటి వినియోగం, గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రతిపత్తి మున్నగు అంశాలపైన చర్చించవలసి ఉంటుంది. అలాగే అన్ని ప్రాంతాలలోనూ, అన్ని వర్గాలవారితో, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించవలసి ఉంటుంది.

ముఖ్యంగా విద్యార్థులు, యువత ఈనాడు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ కాలంలో అత్యధికంగా ఉద్యోగ అవకాశాలు ప్రైవేట్ రంగం నుంచే వస్తున్నాయని, వాటికి కులం, మతం ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉద్యోగస్తులను తీసుకొంటున్న వాస్తవాన్ని గమనించి, విద్యా సంవత్సరం కోల్పోకుండా విద్యను కొనసాగించడం అవసరం. అనేక దశాబ్దాల పాటు మాడపాటి హనుమంతరావు, వందేమాతరం రామచంద్రరావు, నరేంద్రజీ, అయ్యదేవర కాళేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య మొదలగు మహానుభావులు తెలుగుజాతిని ఒక్క గొడుగు కిందకు తెచ్చి యాభైమూడు సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత ఇప్పుడు విడిపోవడం ఊహించలేని విషయం. ఇప్పటికే రెండు

మాసాల నుండి మన రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభం వలన రాష్ట్ర ఆదాయానికి పెద్ద ఎత్తున నష్టం చేకూరుతున్నది. విద్యారంగం, రవాణారంగం, టూరిజం, సినిమా, పారిశ్రామిక రంగాలు దెబ్బతింటున్నాయి. కావున ఉభయ ప్రాంతాలలోని ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, యువత సంయమనంతో వ్యవహరించి వాస్తవాలను సాకల్యంగా అర్థం చేసుకుని, రాష్ట్ర సమైక్యతకు దోహదం చేయవలసిన అవసరం ఎంతో ఉంది.

- సాక్షి

●



## వడ్డే శోభనాద్రీశ్వర రావు

తాను ప్రగాఢంగా విశ్వసించే విలువలను వ్యాప్తి చేయడానికి, తానెంచుకొన్న లక్ష్యాలను సాధించడానికి, సామాన్య గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నతంగా మెరుగు పరచడానికి రాజకీయాలను ఒక సాధనంగా ఎంచుకున్న ఆదర్శ ప్రాయుడు. రాజకీయాలను, అధికారాన్ని, పదవులను మార్గాలుగా ఎంచుకొని, రైతులు అట్టడుగు వర్గాల అభ్యున్నతిని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని లక్ష్యాలుగా ఎంచుకొని, కృషిసల్పి ప్రజల ప్రేమాభిమానాలు పుష్కలంగా పొందిన నేత.

ఆధునిక ఆలోచనాధోరణికి అంకితమై, వ్యవసాయం పట్ల తనకున్న తాత్విక దృక్పథాన్ని తన రచనలు, చర్చల ద్వారా అనువ్యాప్తం చేసి ప్రజలలో నూతన భావాలు రగిలించి, చైతన్యాన్ని నింపిన మేధావి. రెండుసార్లు లోక్‌సభ సభ్యునిగా, రెండుసార్లు అసెంబ్లీ సభ్యునిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా అత్యున్నత ప్రమాణాలు పాటించిన ప్రజా ప్రతినిధిగా అందరి అభినందనలు అందుకొని, స్వచ్ఛందంగా క్రియాశీల రాజకీయాల నుండి నిష్క్రమించి, రానున్న కాలంలో సమాజం ఉన్నతంగా రూపొంది తన స్వప్నాలు ఆవిష్కృతమవుతాయని ఆశతో ఎదురు చూస్తున్న రైతు నాయకుడు.